
సూక్తులు

# తెలుగు సామెతలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014



# తెలుగు సామెతలు



ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ
హైదరాబాదు

# సామెతలు

సామెతలు జనవ్యవహారములో వినవచ్చు మణిపూసలవంటి వాక్యములు. వ్యక్తిజీవితములోను, సంఘజీవితములోను అనుభవము చేత గోచరములగు సత్యములు వీనియందు మూర్తీభవించియుండును. అన్నమునకు వ్యంజనములవలె సామెతలను ప్రసంగానుప్రసక్తముగా జనులు వాడుకొందురు. వానివలన చెప్పదలచిన విషయము అసందిగ్ధముగను, అవిస్తరముగను చెప్పుట జరుగును. చమత్కారముకూడ సిద్ధించును. విషయము మనస్సులో హత్తుకొనిపోవును. సామెతలే కాక నానుడులు, సుద్దులు, జనశ్రుతులు, శాస్త్రములు, మాటలు అను పదములుకూడ వ్యవహారములో ఉన్నవి. అవియన్నియు ఏకార్థకములు కావు. వీనిలో ఒక్కొక్కదానికి ఒక్కొక్క ప్రత్యేకలక్షణమున్నది. ఒక్కొక్క అర్థవిశేష మున్నది. కాని జనవ్యవహారములో ఇవియన్నియు సామెతలుగా పరిగణింపబడుచున్నవి.

అనుభవమునుండి పుట్టునది భావము. భావము అభినయమువలన అంతకంటె స్పష్టముగ వాక్కువలన వ్యక్తము కాగలదు. వాక్కులో చమత్కార ముండవలె నన్న దానిస్వరూపములోను, అర్థములోను చమత్కార ముండవలెను. ఇవి ఏకవాక్యములో కలిసివచ్చినచో మరింత సొగసు కూడివచ్చును. ఆవాక్కు వ్యంజనావిశేషయుక్తముగ నున్నచో ఇంకను మనోహరముగ నుండును.

స్వరూపము, అర్థము, వ్యంజన అనునవే కాక వానినుండి పుట్టు అలంకారములకుకూడ ఉనికిపట్టయిన సామెతలలో అన్నిటని తలదన్ను అందము కలదని వేరుగా చెప్ప నక్కర లేదు. అలంకారము లన్నిటికి సామ్యము లేదా ఉపమానము మూల మందురు. అందుచేతనే ఆలంకారికులు ఉపమాలంకారమునకు అగ్రతాంబూల మిచ్చిరి.

సామ్య మను అర్థములోనే సామెత అనుపదము వ్యవహరింప బడుచున్నట్లు కొందఱిపెద్దల అభిప్రాయము. నాకు తెలిసినంతవఱకు సామెత అనుపదము 15 వ శతాబ్దిలోని వరాహపురాణములో తొలిసారిగా ప్రయోగింపబడినది. ఎక్కడైనను తత్పూర్వకావ్యములలోగాని, శాసనములలోగాని ఉండిన ఉండవచ్చును. ఇంకను పరిశోధింపవలెను. ఇది జిజ్ఞాసువులకు వదలుచున్నాను.

సామ్యశబ్దమునకే సామ్యత అను అసాధురూప మేర్పడియుండవచ్చుననియు, అదియే సామెతగా తెలుగులో మారి ప్రచారములో నున్నదనియు కీ. శే. డాక్టర్ కళాప్రపూర్ణ చిలుకూరి నారాయణరావు గారివాదము. సామెత అనురూపము వ్యవహారములో వినబడుటచేతను కన్నడములో సామితె అనుపద ముండుటచేతను ఈవాదములో కొంత సత్య ముండవచ్చునేమో! (పత్రికలలో ఎక్కువ ప్రచారములోనున్న ఐక్యతవంటిదే సామ్యతకూడ.) అయినను ఈశబ్దవ్యుత్పత్తి ఇంకను విచార్యమే.

సామెతకు సరియైన నిర్వచనము కల్పించుట సులభము కాదు. కష్టపడి కూర్చిన కూర్చవచ్చునేమో! కాని శ్రమకు తగిన ఫల ముండునని చెప్పలేము. అతివ్యాప్తి అవ్యాప్తి దోషములు పట్టని, అన్ని లక్షణములు కలిసివచ్చు నిర్వచనము సిద్ధపఱచినను అది స్థూలారుంధతీ న్యాయముగ నుండును. సామెతలవలన స్ఫురించు సొగసులన్నియు చూపగలిగిన సమగ్రకత్వమును సంపాదించలేదు. అనిర్వచనీయమైన గుణ మేదియో సామెతలో ఉండి 'ఇది సామెత' అని దానిని పట్టియిచ్చును. ప్రాజ్ఞులైనవారికి ఈరహస్యము తెలియనిది కాదు. ఆనోట ఈనోట నలిగి ఎక్కువ వాడుకలోనున్న జనోక్తిని సామెతగా పరిగణించుట ఇప్పటికి యుక్తిసహముగా కనిపించుచున్నది. లోకోక్తి నానుడి అనుపదములుకూడ ఇంచుమించు సామెత యను నర్థమందే వ్యవహా

రింపబడుచున్నవి. లోకోక్తి అను సంస్కృతపదమునకు నానుడి అనునది తెలుగుమాట. 'నాడునుడి' 'నానుడి'గా మారును. లోకోక్తి, సామెత ఏకార్థకములు కా వనియు, వానిలో కొంత భేద మున్న దనియు తరువాత వివరింపబడును. సామెతలో సమత ఉండును. వాక్యనిర్మాణము రెండు దళములుగా ఏర్పడి ప్రాసగాని, యతిగాని, రెండును కలిసికాని యుండును. స్థూలముగ లోకోక్తికి, సామెతకు గల భేదము నిరూపించి నను వానివిలక్షణత శాస్త్రబుద్ధికికాని విభిన్నములుగ తోచని పరిస్థితులుకూడ లేకపోలేదు. ఈకారణములవలన సామెత అనగా జనవ్యవహారత్వుణ్ణమైన ఉక్తి అని ఇప్పటికి వ్యుత్పత్తి సడవచ్చును. అనగా నలుగురి నోట నలిగిన మాట అని అర్థము. ఇతరలక్షణములు తరువాత పరిశీలింపబడగలవు.

సామెతల పుట్టు పూర్వోత్తరములనుగూర్చి తేల్చుటకూడ సులభమగు పని కాదు. ఏసామెత ఏసందర్భమున ఎవరు రూపొందించిరో చెప్పుట సాహససాధ్యమైనచో కావచ్చునుగాని సత్యసమ్మతమగుట కష్టము. సామెతలు అనేకవిధములుగ పుట్టవచ్చును. కొన్ని సూక్తులుగా, కొన్ని దృష్టాంతములుగా, కొన్ని సాదృశ్యములుగా కొన్ని నిదర్శనములుగా, కొన్ని అర్థాంతరన్యాసములుగా, కొన్ని ఏ గాథనో, ఏజానపదగేయమునో, ఏసన్నివేశమునో పురస్కరించుకొని పుట్టిన జనశ్రుతులుగా వాడుకలో నలిగియుండును. సామెతలు లౌకికము * లైనవి. అనగా ప్రసిద్ధములై లోకయాత్రాహేతువులైనవి.

అన్నిసూక్తులు, సుభాషితములు నిత్యవ్యవహారములో తఱచుగా వాడుటచే సామెతలుగా చెల్లిపోవుచున్నవి. 'ఆత్రగానికి బుద్ధి

---

* లోకే విదితాః (ఝడితి ప్రసిద్ధాః) లౌకికాః – పతంజలి
యే లోకయాత్రాహేతవః భాషాశబ్దాః తై రేవ లౌకికత్వం ప్రసిద్ధమ్–
కాశికాకారుడు

మట్టు ', ' నిజము నిలుకడమీదగాని తెలియదు', 'అంత్యనిష్ఠురముకన్న ఆదినిష్ఠురము మేలు ', ' ఆడి తప్పరాదు, పలికి బొంకరాదు ' వంటి సూక్తులలో అలంకారరమ్యతగాని, వ్యంగ్యవైభవముగాని కనుపించదు. వాక్యము కేవలము వాచ్యముగను, ప్రభుసమ్మితముగను ఉండును. అనుభవసిద్ధములైన సత్యములను సూటిగా, అలంకారరహితముగ నివేదించును. వాడుకలో పదేపదే వినబడుటచేతను, తాము చెప్పు మాటలకును, చేయు పనులకును బలము చేకూర్చుటకు వ్యవహారములో జనులు వానిని ప్రయోగించుటచేతను ఇవికూడ సామెతలవలెనే భాసించును. కాని నిజమునకు కావు. ఇవి ఏకాలమునందు, ఏసందర్భమున పుట్టి వాడుకలోనికి వచ్చినవో నిర్ణయించలేము. ఇవి పురాతనసత్యములైనను ఎప్పటికప్పుడు క్రొత్తగా భాసించును. ప్రతితరములోను ప్రతి మనుష్యునికి అనుభవగోచరములగు నిజములు కొన్ని గ్రంథస్థములై నిలిచిపోయి ఎక్కువ వాడుకలో నుండును. కొన్ని వ్యవహారమునకు దూరమై మఱుగుపడిపోవును.

పూర్వకావ్యములలోని కెక్కిన అభియుక్తోక్తులలో ఏవి ఎక్కువ ప్రచారములో ఉండినవో, ఏవి కల్పితములో ఇప్పుడు నిర్ణయించుట కష్టము. అందులో కొన్ని వ్యవహారమునుండి తొలగిపోవుటచేత, ఏవి నిజమైనవి, ఏవి కావు అని పోల్చుట మఱింత కష్ట మగుచున్నది. వేమన్నపద్యములలో సామెతలవంటి సూక్తు లెక్కువగా ఉన్నట్లు తోచుచున్నది. వానిలో జనవ్యవహారమునుండి గ్రహించిన వెన్ని, ఆయన స్వయముగా కల్పించిన వెన్ని – అనుట మనకు తెలియని విషయము. సామెతలు వేమన్నను సృష్టించినవో, వేమన్న సామెతలను సృష్టించెనో చెప్పుట కష్టము. ఇంకను ప్రాచీనులయిన పాల్కురికి సోమనాథుడు, నాచన సోముడు, అన్నమాచార్యులువంటి కవులలో కూడ వ్యవహారసిద్ధములైన సామెత లేవియో, కాని వేవియో చెప్పుట కష్టము. తాళ్ళపాక తిరువేంగళనాథుని పరమయోగివిలాసములో

"ఇలలోనఁ బసిబిడ్డ తెలుఁగమిఁ బిలిచి
యల చందమామ పెన్నడిగిన ట్లయ్యె" ఆ. 3 – 4935 – 6

అను పంక్తులలో సామెతవాసన కొంత కానవచ్చుచున్నది. కాని దాని స్వరూపము గణములలో పడి చెడిపోయిన ట్లున్నది. కవి కల్పించినదే అయినచో పిలిచి యను పదము ప్రయోగింపబడియుండదు. ఏదియో సామెత ఛందస్సులో పొదిగినప్పుడు ఇట్టిరూపాంతరము పొందియుండును అన్నియెడల నుపయోగించుటకుగాని, అంత శాస్త్రసమ్మతము లని అనుటకుగాని వీలు కాకున్నను, సామెతల స్వరూపమును ఆనవాలు పట్టుటకు కొన్ని మార్గము లున్నవి. వ్యాకరణమునకు లొంగని ప్రయోగములు సమర్థులైన కవులు చేసియుండినచో అందులో కొంత వ్యవహారరూఢమైన లోకోక్తిప్రభావ ముండుటకు వీ లున్నది. లోకవ్యవహారమును యథాశ్రుతముగా కవులు ప్రయోగించి యుందురు. 'నుయిదాటవానికి' వంటి రామకృష్ణునిప్రయోగము లట్టివి.

నైతికదృష్టి ప్రధానముగకలవి సుభాషితములు. నీతివాక్యములు కూడ అట్టివే. అవి వినువారికి హితోపదేశము చేయును. ధర్మమును సూచించును. వాక్యనిర్మాణములో మార్దవముకూడ లోపింపవచ్చును. 'భూతదయ కలిగియుండవలెను' వంటివి కేవలము నీతివాక్యములైనను ఒక్కొక్కసన్నివేశములో అర్థవిశేషమును కలిగించును. 'సత్యమే జయము' (సత్య మేవ జయతే) వంటి అభియుక్తోక్తి సంస్కృతమునుండి వచ్చినది. 'ఆరోగ్యమే మహాభాగ్యము' 'ఆడి తప్పరాదు' వంటి సూక్తులకు సకృత్తుగా సామెతగౌరవము సంక్రమించును.

ఇట్టి సుభాషితములు, నీతివాక్యములు, సూక్తులు ప్రయోగములో కొంత వ్యంగ్యమర్యాద సంపాదించి వాక్యగతమైన శబ్దముల కంటె విలక్షణమైన అర్థమును సూచన చేసినప్పుడును, అన్యాపదేశముగ వాడినప్పుడును, సన్నివేశబలమువలన వానికి సామెతగౌరవము

సం(క్రమించును. (ప్రతిసామెతలోను ఇట్టి అర్థవిశేషము సూచింపబడు చుండును. కాని, సుభాషితములలోను, సూక్తులలోను సామెతలలో తోచు వాక్యగతచమత్కారము, అలంకారము లోపించియుండును.

సాధారణమైన జనవాక్యములు కొన్ని (ప్రజలమనస్సులలో హత్తుకొనిపోవును. 'అనుమానం పెనుభూతం', 'అదృష్టవంతుణ్ణి చెడిచే వాడు లేడు, (భ్రష్టాకారిని బాగుపరిచేవాడు లేడు', 'అడుసు తొక్క నేల, కాలు కడుగనేల', 'అతియూస పొడియూస దుఃఖానికి కారణం' 'ఇద్దరు పోట్లాడితే మూడవవానికి లాభం' వంటి వాక్యములు ఎందరికో ఎన్నివిధములుగనో జీవితములో ఉపకరించియుండును. చుక్కానిగా పనిచేసియుండును.

అన్నియు కాకపోయినను కొన్నిసూక్తులను పరిశీలన చేసినచో అవి ఏకాలమున,ఏసందర్భమున (ప్రచారమునకు వచ్చినవో యూహించి చెప్పుటకు వీలుండును. ఆ సూచన లావాక్యమునందే ఉండును. 'అద్దెకు వచ్చిన గుఱ్ఱాలు అగడ్తలు దాటునా' అను జనోక్తి పూర్వము కోటలు, అగడ్తలు వ్యాప్తిలో ఉన్నకాలమునకు చెందినది. అద్దె గుఱ్ఱములతో ముట్టడి చేసి విఫలమైన సందర్భములలో పుట్టియుండ వచ్చును. 'కాసుకు గతి లేదు, కోటికి కొడి వేశాడు' అనుజనోక్తి పూర్వకాలములో మనదేశమునందుండిన ఒక ఆచారమును సూచించు చున్నది. కోటీశ్వరులు తమ సంపన్నత్వసూచకముగ ఒక్కొక్కకోటికి ఒకజెండాచొప్పున తమ ఇండ్లపై నిలుపువారట! పై వాక్యములో 'కొడి' అనగా జెండా అని అర్థము. తమిళములో ఇప్పటికిని 'కొడి' అనుపదము జెండా అను అర్థములో వాడుదురు. అట్టి ఆచారములతో పాటు ఆజనోక్తికూడ (క్రమముగా వ్యవహారమునుండి దూరమై పోయినది.

కేవలము సామెతలుగా వ్యవహరింపబడువానిలో పరార్థ ప్రవృత్తియే కాని స్వార్థమందు ప్రవృత్తి ఉండదు. అనగా సామెతల అర్థము, వానిలోని మాటలకు సంబంధించినది కాక ఇతర మేదియో ఉండును. ఈ అభిప్రాయమునే కీ. శే. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు తమ కథలు – గాథలు అను గ్రంథములో రెండవసంపుటములో సామెతలనుగూర్చి వ్రాయుచు వివరించియున్నారు.

మిక్కిలి చమత్కారముగను, ఎక్కువ హృద్యముగను ఉండు సామెతలుకూడ నిత్యజీవితములో ఏవియో చిన్న సామాన్యసందర్భముల నాధారముగ చేసికొని పుట్టినవే. పరిచితమైన సామాన్యజీవిత విషయములను క్రొత్తగను, అన్యాపదేశముగను, వ్యంగ్యముగను, పలికినచో మనము ఆకర్షింపబడుదుము. ఆసామెతల లక్ష్యము మనలో గాఢముగా ముద్రితమైపోయి మనస్సున నాటుకొనిపోవును. సామెతలో నుడికారముకూడ తోడైనచో దానిశోభ మఱింత ఇనుమడించును. పైని వివరించినట్లు వాక్యార్థముకంటె, విలక్షణము, చమత్కారవంతము అయిన అర్థమును మఱింత సొగసుగా అందించును. 'కూడు ఉడికినవెనుక పొయ్యి మండును' అనునది ప్రతిఇల్లాలు తన వంటయింటి అనుభవములో గ్రహించుసత్యము. కాని సామెతగా దానిసొగసు వేరు. ఇక్కడ 'కూడు' అనగా 'కూడు' కాదు, 'పొయ్యి' అనగా పొయ్యి కాదు, 'ఉడుకు' 'మండు' అనుక్రియలు కూడా ఆయాఅర్థములలో కాక సందర్భానుసారముగ అనేకార్థములను స్ఫురింపజేయును. ఈసామెతకు అర్థ మింతే అని నిష్కర్షగా చెప్పుట సాధ్యము కాదు. ప్రయోగమునుబట్టి అర్థస్ఫూర్తిలో భేద ముండును. స్థూలమైన అర్థనిర్ణయముమాత్రము సాధ్యము కాగలదు.

'తెగితే లింగడు రాయి' అనుసామెత చాల చిన్నది. ఎనిమిది అక్షరములే. కాని దానివలన కలుగు స్ఫూర్తిమాత్రము పెద్దది.

'నాకు కోపము వచ్చిన గౌరవాగౌరవములు చూడను.' అను స్ఫూర్తి కలుగునని చెళ్ళపిళ్ళవారి వ్యాఖ్యానము. ఇంకను కొన్ని అర్థములు సందర్భమునుబట్టి స్ఫురించును. అక్షరార్థము చెప్పవలసివచ్చిన మెడలో ఉన్నంతసేపే ఆరాతిముక్కకు పరమేశ్వరుడను పూజ్యతగాని అది చోటు వదలి క్రింద పడినచో దానిగౌరవ ముండదు అనిమాత్రమే. ఇంకను 'స్థానభ్రంశే న శోభంతే' అనుసర్థములోను వ్యాఖ్యానము చేయవచ్చును. అంతేకాని సామెత కుండు యావత్తాత్పర్యము పిండి చూపలేము.

సామెతల వయస్సు నిర్ణయించుటకు సమగ్రమైన సామెతల జాబితా ఒకటి తయారు కావలెను. సామెతలను జాబితాగా ప్రచురించు ప్రయత్నములు ఇంతకుపూర్వమే జరిగినవి. వావిళ్ళవారు, ఆంధ్ర భాషాపరిషత్పత్రిక, నందిరాజు చలపతిరాజుగారు, గృహలక్ష్మి మొదలైన సంస్థలు, ఇంకను కొందఱు వ్యక్తులు తయారు చేసిన జాబితాలు కలవు. సామెత లయినవి, కానివి అందులో చేర్చబడినవి. వెనుక ప్రచురించిన జాబితాలను ఆధారముగా చేసికొని మరల క్రొత్తజాబితాలు తయారు చేయుటచేతను, పరంపరగా వచ్చు జనశ్రుతితోను, సంప్రదాయముతోను పోల్చి స్వరూపసవరణ చేయకపోవుటచేతను, సంపాదించిన సామెతలన్నియు స్వస్వరూపములో ఉన్నవని దేశములో నాలుగుమూలలలో నున్న వ్యవహారస్వరూపమును గుర్తించి నమ్మదగిన, నిజమైన సామెతస్వరూపములను నిర్ణయించవలసిన కృషి ఇంకను జరుగవలసియున్నది. సామెతల స్వరూపనిర్ణయమే కాక సంప్రదాయార్థనిర్ణయము, వివిధపాఠాంతరముల నిర్ణయమును జరుగవలసియున్నది. ఒకనిఘంటురూపమైన ఆకారము వచ్చినప్పుడే సామెతల కృషి కొంత ప్రయోజనకారి యగునని చెప్పక తప్పదు.

సామెతలవయస్సు నిర్ణయించుటకు కొన్ని మార్గము లున్నవి. కావ్యములోని కెక్కినవాని కాలనిర్ణయము కొంత తేలిక కావచ్చును.

వాక్యగతమైన ఆంతరంగిక హేతువులచేతను, ఇతరభాషలలోని సామె తలతోనున్న పోలికలచేతను గ్రంథస్థము కాక కేవలము వ్యవహార ములో నుండిపోయిన సామెతలచరిత్ర, కాలముకూడ కొంత ఊహిం చుటకవకాశము లున్నవి.

జానపదగేయములవలెనే సామెతలనుకూడ వ్యవహారములో నున్నవానినే సంకలనము చేసి, ఉపయోగించుకొనవలెనుగాని, వాని సృష్టించుయుగము దాటిపోయినదనియు, ఒకవేళ సృష్టించి నను, అవి పేలవముగా, అందములేని అనుకరణములుగా నుండు ననియు కొందఱివాదము. ఈ వాదము యుక్తిసహము కాదు. ప్రతితరములోను క్రొత్తసామెతలను ప్రచారములోనికి తెచ్చు సన్ని వేశము లేర్పడుచుండును. ఆంధ్రరాష్ట్ర మవతరించినప్పుడు కర్నూలు పట్టణములో గృహావసతిలోపముచేత ప్రభుత్వము గుడారములు వేల సంఖ్యమీద వేయించినది. పెద్ద, చిన్న అను భేదము లేక అందరును వానిలో కొంతకాలము కాపురము చేయవలసివచ్చినది. ద్వారములు చాల పొట్టివి. ఉద్యోగులకు, వారికుటుంబములకు ఇరకటముగను, ఇబ్బందిగను ఉండెడిది. ఆపరిస్థితులలో ' గుడారములో గూనిబతుకు ' అనుమాట ప్రచారములోనికి వచ్చినది. దానికి హేతువులైన గుడా రము లెత్తివేసినను ఆప్రాంతములో ఈజనోక్తి నిలిచిపోయినది. ' కోర్టు ఎక్కినవాడు, గాడిద ఎక్కినవాడు ఒకటే ' అను లోకోక్తి ఇటీవలిదని చెప్ప నవసరము లేదు. దీనికి సమానమైనది వెనుకటికి ఒక జనశ్రుతి ఉండెడిది. ' ఆవిలాటలో పడినోడు, అగడ్తలో పడినోడు ఒకటే ' ఇక్కడ ఆవిలాట అనగా పోట్లాట అని అర్థము. ఇది రేనాటి ప్రాంతపు వ్యవహారము. ఇట్లే ' అర్జీలకు పనులు, ఆశీర్వచనాలకు బిడ్డలు అయ్యేది లేదు ' అను సామెత ఆధునికమైనది. అయినను అపేక్షణీయ మైన సామెతలక్షణము లున్నవి. చమత్కారముగను, సాలంకార

ముగ నుండు నాటి సామెతలకు సాటిగా రంజన కలిగించుచున్నది. క్రొత్తసామెతలు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడును వచ్చినవి, వచ్చుచున్నవి, రాగలవు. కాకపోయినచో ఒకతరమువారికి సామెత లనిన మిక్కిలి రక్తియే కాక వానిని కూర్చు శక్తికూడ ఎక్కువగ నుండవచ్చును.

సామెతలు సాధారణముగా జనసామాన్యమునుండి పుట్టుకొని వచ్చును. వారిఅనుభవములు, అభిరుచులు వానిలో ప్రతిబింబించుచుండును. ఎక్కడనో కొన్ని పండితవర్గములో పుట్టి పెరిగినవి జనసామాన్యములోనికి రావచ్చును. 'యత్ర ధూమః తత్ర వహ్నిః' వంటిది 'నిప్పు లేనిదే పొగ రాదు' (తమిళము – ఎంగె పుగై ఉండో అంగె నెరుప్పుం ఉండు) అను సామెతగా మారి జనసామాన్యములో నిలిచియుండవచ్చును. 'గతజలసేతుబంధనమ్' అను లోకోక్తి 'పోయిన నీళ్ళకు కట్ట పెట్టినట్లు' అను సామెతగా మారియుండును. నాచన సోముడు (ఉ. హ. వ. 5 – 157) ఈప్రయోగమును చేసెను. ఇది అతనికంటె పూర్వము ప్రచారములో ఉన్నదో లేదో చెప్పలేము. లేని పక్షమున నాచన సోముని కల్పన యగును. 'నూతికప్పలవిధాన' అను లోకోక్తికూడ సంస్కృతమునకు తిక్కనగారి ఆంధ్రానువాదమై యుండును. 'గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్' అనునది నన్నయ్యగారి కల్పన. ఇట్టివి కొన్ని పండితులు, కవులు కల్పించినవి తప్ప జనవ్యవహారములో నున్న సామెత లన్నియు మూల మేదైనను సామాన్యప్రజలు కల్పించినవే. సామాన్యకుటుంబజీవితములోని చిన్న చిన్న సన్నివేశములనుండి పుట్టి సామెతలు రూపురేఖ లేర్పఱచుకొనును. 'అన్నీ ఉన్న విస్తరి అణిగే వుంటుంది, ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది' 'గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించిందట' 'ఇంటింటికి ఒకమంటిపొయ్యి, మాయింటికి మరొకటి', 'కుడువబోతూ కూరల

రుచి అడగడ మెందుకు?', 'ఎంగిలాకుతే వంచమంతా కంతలే' 'ఇంటికి ఈలకత్తి, పొరుగుకు బంగారుకత్తి', 'దీప ముండగా ఇల్లు చక్క బెట్టుకోవలెను' వంటివి సామాన్యకుటుంబజీవితమునుండి పుట్టినవే.

మనదేశము ప్రధానముగ వ్యవసాయముతో బ్రతికిన దేశము. పల్లెపట్టు లెక్కువగా ఉన్న దేశము. కర్షకజీవితమునకు చెందిన లోకోక్తులు, సామెతలు, పాడిపంటలే పల్లెటూళ్ళ బ్రతుకు తెరువు. పంటలు, పశువులు, పొలములు మొదలైనవి రైతుల జీవితములో భాగములై సామెతలకు కావలసిన పంటభూము లగుచున్నవి. 'కోటివిద్యలు కొండ్రకు లోకువ', 'చేను చేసి చెడలేదు, చెడ్డ చేసి బ్రతుకలేదు', 'రైతు దున్నితే రాజులకు అన్నం', 'ఆవుచంటిలో (పొదుగులో) అరనైఆరు పింఛవంట లున్నాయి.' 'చెఱువు ఓడు, ఊరు పాడు' వంటి సామెతలు పాడిపంట లనిన తమసంప్రాణములుగా చూచుకొను ప్రజలు సహజముగా కల్పించిన వని వేరుగా చెప్పనక్కరలేదు.

కొన్నిసామెతలలో సామాన్యజనులు ఆయావృత్తులపట్ల వానికి సంబంధించిన వ్యక్తులపట్ల తమఅభిప్రాయమును ప్రకటించుచు వచ్చినారు. ప్రజల నమ్మకమును పోగొట్టుకొన్నవారిలో ముఖ్యముగా కరణము, కంసాలి వ్రేలు మడచి లెక్కపెట్టదగినవారు. 'కాటికిపోయినా కరణాన్ని నమ్మవద్దు', 'కన్నతల్లిబంగారమైనా కంసాలి వదలడు' 'కంసాలి ఎల్లి, చాకలిమల్లి', 'దేవుడు వరమిచ్చినా పూజారి వర మీయడు', 'బాపనసేద్యం బడుగుల నష్టం', 'కాపుల చదువులు కాసుల చేటు', 'ఆదాయంలేనిదే సెట్టి వరద బడి పోడు', 'రెడ్డి వచ్చె, మొదలాడు', 'మంగలి పాత, చాకలి కొత్త', 'పూటకూళ్ళమ్మకు పుణ్యంతో పని లేదు', 'నేసేవాణ్ణి నమ్మి పొలిమేరదాటడం ఒప్పుకోవద్దు' వంటివి ఆయావృత్తులపట్ల ప్రజాభిప్రాయములను తెలుపు జనవాక్యములు.

'పందిని పొడిచినవాడే బంటు', నెమలికంటినీరు వేటకానికి ముద్దా', మాటలు నేర్చిన కుక్కను వేటకు పంపితే వుసుకో అంటే వుసుకో అందట', 'గురికాడు నక్కను కొడతాడా ?', 'విల్లంబులు కలవారికి చల్లకడవలవారు తోడా ?', 'నక్కను చూచినవాడు వేట కాడు', 'తాటాకుచప్పుళ్ళకు కుందేళ్ళు బెదురునా ?' ఏయువా ఉండ అమ్మేమి చేయు ?' వంటి వేటకు సంబంధించిన సామెతలుకూడ కొన్ని ప్రచారములో ఉన్నవి. ఇంగ్లీషులో వేటకు సంబంధించిన సామెతలు ఎక్కువగా ఉన్నవి. ఆజాతి మృగయాశీల మైనది. మనది కాదు. మనలో ఏరాజులకో అది చెల్లుచుండెను. సామాన్యునకైనచో వ్యసన మగును. తెలుగుజాతి భూమి నున్నుకొని బ్రతికిన జాతి. వ్యవసాయమే బ్రతుకుతెరువుగా నున్న జాతి. కనుకనే పాశ్చాత్యులలోవలె తెలుగువారిలో వేటకు సంబంధించిన సామెత లెక్కువగా లేవు.

జాలరులుకూడ కొన్ని సామెతలు కల్పించినారు. 'పట్టుకొన్నవాడు మట్టగిడస అంటే పైనున్నవాడు జెల్లకొంక అన్నాడట', 'దరిద్రుడేరేవు కెళ్ళినా ముళ్ళపరిగే దొరికిందట' 'అణిగింది లేపెరా బుడ్డపక్కి', 'వలకంటె ముందు రాళ్ళు విసరినట్లు', 'ఎఱ్ఱను వేసి చేపను పట్టినట్లు' వంటివి.

నావికులకు ఓడప్రయాణమునకు సంబంధించిన సామెత లెక్కువ లేవు. ఆంధ్రదేశమునకు పొడుగైన కోస్తా ఉండియు పూర్వము నౌకానిర్మాణములోను, సముద్రవ్యాపారములోను ఆంధ్రులు ముందడుగు వేసినవారను కీర్తి యుండియు ఆవృత్తికి జెందిన లోకోక్తులు మన భాషలో ఎక్కువగా లేకపోవుటకు కారణ మూహింపలేము. అవి నౌకాజీవితమునకుమాత్రమే పరిమితమై యుండుటచేత దేశములోనికి వ్యాపించియుండకపోవచ్చును. అయినను 'ముత్యపుచిప్ప లన్నీ ఒక రేవున నత్తగుల్లలన్నీ ఒక రేవున', 'పడవ ఒడ్డు చేరితే పడవవానిమీద

ఒకసొడ్డు, డబ్బివ్వనివాడు పడవ ముం దెక్కును, ఒడ్డు చేరేదాకా ఓడ మల్లయ్య, ఒడ్డు చేరాక బోడిమల్లయ్య, ఓడ సంటిన కాకివలె, కళాసు పని (బతుకు) గాలివానతో సరి వంటి సామెతలు ప్రచారములో లేక పో లేదు.

వాణిజ్యమునకు చెందిన సామెతలు కొన్ని ఉంటేసను ఎక్కువగా లేవనియే చెప్పవలెను. వర్తకులు సామెతల నెక్కువగా సృష్టించలే దేమో! (అప్పు) అడిగితే చిరాకు, అడక్కపోతే పరాకు, అసలుకంటె వడ్డీ ముద్దు వంటివి వడ్డీవ్యాపారమునకు చెందినవి. అసిమిలో దొకటి, అమ్మే దొకటి, కొస్నంగడిలోనే మారుబేరమా, కొన్నది నంశాయులు కొసరింది గుమ్మడికాయలు, కొసగా రాసిది కొసరగా వచ్చునా, వాణిజ్యసంబంధముగల సామెతలని చెప్పవచ్చును.

క్రొత్త సామెతలు తరచుగా పాతసామెతల సమూనాను మాతృకలుగ చేసికొని పుట్టుచుండును. కొన్ని సామెతలు ఒకానొక చట్రములో పొదిగిన ట్లుండును. ఆ చట్రములో క్రొత్త భావములు చొప్పించుటకు వీ లుండును. గుణం తక్కువ గో డెక్కువ, జీవ తక్కువ జీత మెక్కువ వంటివి వాక్యనిర్మాణ వైఖరిలో ఒకజాతికి చెందినవి. పరస్పరతారతమ్యములను చూపుటకు ... ... ఎక్కువ ... ... తక్కువ అను చట్రములో ఈసామెతలు పొదగబడియుండును. ఇట్లే ...... లేదు ...... లేదు అని మొగియు వాక్యదశలుగల చట్రములలో కొన్ని సామెతలు గలవు. కన్నువంటి ప్రకాశం లేదు మన్నువంటి ఆధారం లేదు, చూడ చుట్టము లేదు మొక్క దైవము లేదు, ముఖంలో సుఖం లేదు మోకాళ్ళలో బిగువు లేదు, చేను చేసి చెడ లేదు చెడ్డ చేసి బ్రతుకలేదు, నొసట కళ్ళు లేవు నోట్లో పళ్ళు లేవు వంటివి కొన్ని ఉదాహరింపవచ్చును. ఇందులో మొదటి సామెతలో ఒకవస్తువును తీసికొని దానివంటిది లేదని చెప్పబడినది. రెండవ సామె

తలో చూచుటకు, మ్రొక్కుటకు అను ప్రయోజనములు పేర్కొన బడినవి. మూడవసామెతలో ఒకానొక వస్తువులో లేని ఒకానొక గుణము సూచింపబడినది. నాలుగవసామెతలో కార్యకారణసంబంధ ముగ్గడింపబడినది. చివరిసామెతలో లేదను ఏకవచనము బహువచన ముగా మారినది. ఇట్లే మరికొన్ని పోతివాక్యములు సామెతలలో చూడవచ్చును. చాటువులలోని కొన్నిమాటలు అట్టిసామెత లన్నిటి యం దుండును. వానిలో మా ర్పుండదు. మిగిలిన భాగములు మాత్రమే మారుచుండును. ఇట్టిసామెతలలో ఏది ముందు, ఏది వెనుక, ఏది మాతృక, ఏది ప్రతిక అని చెప్పుట తేలిక కాదు. ఒక జాతికి చెందిన అట్టిసామెతల నన్నిటిని జాగ్రత్తగా విమర్శించి పరిశీలిం చినగాని అట్టిది సాధ్యము కాదు. కొన్నిచోట్ల సామెతల వయస్సు ఇట్టినిర్ణయమునకు కొంత తోడ్పడవచ్చును.

అనుశ్రుతముగా వచ్చు సామెతలు ఆనోట ఆనోట పడి కొంత మార్పు చెందుట సహజమే. ఆదేశాగమములు వచ్చి సామెతస్వ రూపము కొంత మారిపోవును. ఒకమాటకు బదులు మఱియొకమాట వచ్చుట, ఒకభావమునకు మారుగా మఱియొక భావమును చేర్చుట, సామాన్యవిశేషవాక్యములు తారుమారగుట, వాక్యములను మఱి కొన్ని వివరణశబ్దములు చేర్చి పెంచుట, క్రియలను మార్చుట, ప్రాంతీ యశబ్దములను వాడుట మొదలైన కారణములచేత సామెతరూపము మారుచుండును. ఒక్కొక్కసారి సామెతలో ఉత్తరార్థమో, పూర్వా ర్థమో మారిపోయి దానిస్థానములో మఱియొక వాక్యభాగము రావ చ్చును. నిత్యవ్యవహారములో లేని ప్రాచీనశబ్దములను తొలగించి ఇప్పటి వ్యవహారములోనున్న మాటలను చేర్చుటయు జరుగుచుండును.

‘ అగడ్తలో పడ్డ పిల్లి కదే వైకుంఠం ’ అను సామెత తెలుగులో ఉన్నది. అగడ్తలో పడుటకు పిల్లియే కావలెనా ? పిల్లి యనుటలో

విశేష మేమి? అగడ్తలో పిల్లి పడినచో పైకి రాలే దను భావ మైనచో అగడ్తయే దానికి వైకుంఠ మగుటలో ఆశ్చర్యము లేదు. పిల్లి యనగా పొంచిన శత్రు వని యర్థము చెప్పిన చెప్పవచ్చునేమో! తమిళములో ఈ సామెత 'అగళిల విళుంద ముదలైక్కు అదువే వైకుంఠం' అని ఉన్నది. తమిళములోని ముదలై (మొసలి) తెలుగులో పిల్లిగా మారినది. ఇట్లే 'ఏనుగు పడుకున్నా గుఱ్ఱమెత్తు' అని తెలుగులోనున్న సామెత తమిళములో 'ఆనై పడుత్తాల్ ఆళ్ మట్టం' అని వినవచ్చుచున్నది. 'ఆళ్' అనగా మనుష్యుడు. ఇది సైనికశిబిరములలో బయలుదేరిన సామెత కావచ్చును. ప్రాచీనులు కాల్బలమును ప్రధానముగ భావించినప్పుడు 'ఆళ్' అనుపద ముపయోగించిరి. యతి ఉండుటచేత తమిళసామెత ప్రాచీనమని భావింపవచ్చును. తరువాత ఆంధ్రులలో అశ్వదళమునకు ప్రాధాన్యము హెచ్చినపుడు 'ఆళ్' స్థానములో గుఱ్ఱము వచ్చియుండవచ్చును. ఇట్లు భావములలో మార్పు వచ్చుచుండును. 'కట్టిన ఇంటికి కణుకులు మెండు' అను సామెత వ్యవహారములో రెండుమూడువిధములుగ వినబడుచున్నది. 'కట్టిన ఇంటికి కణుకులు చెప్పేవారు పదిమంది' 'కట్టిన ఇంటికి కణుకులు చెప్పేవారు నెయ్యిమంది' వీనిలో ఒకదానిలో మెండని, మరియొకదానిలో పదిమందియని యున్నది. అదియు చాల లేదుకాబోలు తృప్తి లేక పదిమందిని నెయ్యిమందిగా ఎవడో మార్చి యుండును. అట్లే 'దొంగలు దోచిన ఆరునెలలకు కుక్కలు మొరిగినవట' అనుసామెతలో 'దోచిన' కు బదులుగా 'దూరిన' 'పడ్డ' 'పోయిన' వంటి మాటలుపాఠాంతరములుగా ఉన్నవి. తబిసీళ్ళలో చిన్న చిన్న మార్పులు చూడవచ్చును. ఒకక్రియకు మారుగా మరియొకక్రియ ఉపయోగింపబడినది. మరియొకరూపములో 'ఆరు నెలలు' తొమ్మిది నెలలుగా పెంచబడినది. 'పుణ్యానికి పెట్టే అమ్మా నీ మొగునితో పాటు పెట్టవమ్మా' అనుసామెతలో 'పుణ్యానికి పెట్టే అమ్మా'

అనుటకు మారుగా 'పుగసాటుకు పెట్టేఅమ్మా' అనునది రాయల సీమలో అనంతపురంజిల్లాలో వ్యవహారములో నున్నది. ఒకమాటకు మారుగా మరియొక ప్రాంతీయపద మిందు ఉపయోగింపబడినది. 'ఎక్కడైనా వదినా అనుగాని వంగతోటలో వదినా అనకు' అను సామెతలో 'వదిన' కు మారుగా 'మామ' యు కొన్నిచోట్ల ప్రత్యక్షముగను, తోటమాలి ఆడుది యైనచో 'వదిన' మగ వాడైనచో 'మామ' అని యూహింపవలెను. 'పుచ్చకాయల దొంగా అంటే బుజాలు తడుముకుని చూచాడట!' అనుసామెతయే ప్రాచీనమైనదిగా కనుపించుచున్నది. కాని పుచ్చకాయ శబ్దము సర్వత్ర వ్యాప్తిలో లేకపోవుటచేతను, కొన్నిచోట్ల అశ్లీలార్థముకూడ స్ఫురించుటచేతను, పుచ్చకాయలు గుమ్మడికాయలుగా మారియుండును. కొన్నిసామెతలలో మరికొన్ని జబిసీళ్ళు చేర్చి పెంచుటయు కలదు. 'గంగకు చాంగకు తప్పు లేదు' అను సామెత గంగకు, చాంగకు, పంగకు తప్పు లేదు అని పెరిగినది. 'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి' అను సామెతలో ఒకదళము పెరిగి 'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి, కంటే కొడుకును కనాలి' అని మఱి కొంత పొడుగైనది.

ఒకమాటకు మారుగా మరియొకమాట వచ్చుటయేకాక, ఒకదళమునకు మారుగా మరియొకదళముకూడ కొన్నిసామెతలలో వచ్చుచుండును. 'కందకు లేని దూల కత్తిపీట కేల'? అనునది యతినిబట్టి మూలరూపమని అంగీకరించిన, అందులోని రెండవదళమునకు మారుగా 'బచ్చలి కేల?' 'చేమ కేల' అనునవి తరువాత చేరి యుండవచ్చును. 'గూటిలో దీపం కుక్షిలో అన్నం' అనునది ప్రాచీనమో 'గూటిలో దీపం, నోటిలో కవళం' అనునది ప్రాచీనమో చెప్ప లేము. మొదటిది చదువుకొన్నవారి వ్యవహారమై యుండవచ్చును.

రెండవది సామాన్యుల వ్యవహారము 'నోటిలో కవళం' అనుదళములో 'కవళం' నకు 'బువ్వ' 'బుక్క' 'మెతుకు' అను పాఠాంతరములు కలవు. 'గతిలేనమ్మకు గంజే పానకము'; 'గతిలేనమ్మకు మతిలేని మగడు' అను సామెతలలో రెండవదళములో ఒకదానిలో యతియు; మరియొకదానిలో ప్రాసయు వచ్చినవి. వాక్యశిల్పములో భేద ముండుటయే కాక అర్థములోను భేద మున్నది.

కొన్ని సామెతలలో ఆయాప్రాంతీయ నామములు ఆయాప్రాంతములలో వ్యవహారములో నుండును. 'రొద్దానికి ఎద్దును పెనుగొండకు పిల్లను ఇవ్వకూడదు' అనునది అనంతపురం జిల్లాలోని సామెత. రొద్దము గ్రామములో ఎత్తుపల్లముతో మెరకసేద్యము చేయవలెను. పెనుగొండనూతులు పాతాళ గంగలు. కనుక ఆయూళ్ళకు ఎద్దు నిచ్చినను పిల్ల నిచ్చినను శ్రమ ఎక్కువ అని తాత్పర్యము. ఈసామెతయే కృష్ణాజిల్లాలో 'ఎల్లటూరిలో ఎద్దును పరుచూరిలో పడుచును ఇవ్వకూడదు' అని వ్యవహారములో నున్నది. ఇందులో ప్రాంతమునుబట్టి పేళ్ళు మారినవి.

'మువ్వుం జూచి నక్క యొడలు కాల్చికొన్నట్లు' అను సామెత నాచన సోముని ఉత్తరహరివంశములో ఉన్నది. ఇదియే ప్రాచీనరూపమేమో! మువ్వు అనగా పులి. క్రమముగా మువ్వు అను పదము వ్యవహారమునకు దూరమై దానికి మారుగా పులియను పదము సామెతలో చేరియుండును. వ్యవహారమునుండి తొలగిపోయిన ప్రాచీన శబ్దములను ఏదో ఒకప్రాంతమునందు వ్యవహారరూఢములై వేరుచోట్ల అర్థముకాని శబ్దములను సామెతలనుండి తొలగించి ప్రజలు వ్యవహారములో నున్న మాటలను చేర్చుచుందురు.

ప్రాత సామెతలను మాతృకలుగా చేసికొని క్రొత్త సామెతలను కల్పించుటయేకాక సంప్రదాయమునుండియు; కథలనుండియు; గాథల

నుండియు కొన్ని సామెతలు నిర్మింపబడుటయు కలదు. గాథలకును; సామెతలకునుగల సన్నిహితసంబంధ మనేకభాషలలో చూడవచ్చును. కన్నడములో గాదె అనిన, సామెత అని అర్థము. గాదె గాథాశబ్ద భవము. గ్రీకుభాషలో గాథ; సామెత అను రెండు శబ్దములకు aivos అను సమానార్థక శబ్ద మున్నది. అట్లే హీబ్రూభాషలోని machal ప్రాచీనాంగ్లములోని gied అను మాటలును ఉభయార్థకములు. కొన్ని దేశములోని సామెతలు మనకర్థము కాకపోవుటకు కారణము దానివెనుకనున్న గాథ తెలియకపోవుటయే. ప్రాయికముగా సామెతలను కల్పించుటకు కొన్నిగాథ లనుకూలించును. పంచతంత్రకథలు; కథాసరిత్సాగరము; ఈసఫ్‌కథలు సామెతలకు మంచి పంటభూములు. 'అందని ద్రాక్షపళ్ళు పుల్లన'; 'రెంటికీచెడ్డ రేవడు'; పిల్లి మెడలో గంట కట్టేదెవరు'; 'మంచి చేసిన ముంగిసకిమరణం వచ్చినట్లు'; 'కోడి కుంపటి లేనిది తెల్లవారదా?'; 'నక్కజిత్తులన్నీ నావద్దఉండగా తప్పించుకపోయెనే తాబేటిబుర్ర' 'పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చినది'; 'తనకు మాలినధర్మం మొదలు చెడ్డ బేరమూ'; 'దొంగదాడికన్న లింగదాడిఎక్కువ'; వంటివి ఆయాగాథల నాధారము చేసికొని పుట్టిన సామెతలే. భారతరామాయణాదులు కూడ చక్కని సామెతలకు కారణము లైనవి. 'ఆవుల మళ్ళించినవాడే అర్జునుడు'; కన్నడము అంతూ ఇంతు కుంతీ మక్కళిగె రాజ్య విల్ల'; 'కర్ణుడిమీదే కథంతా నిలిచింది;' (కర్ణనాదలనె భారత సంహిత నిల్చుచాడ్నునన్ పాం. మా.) 'రామునివంటి రాజుంటే హనుమంతునివంటి బంటూ ఉంటాను'; (తమిళము-రామనైపోల రాజా ఇరుందాల్ హనుమనైపోల సేవకను ఇరుప్పాన్) హనుమంతునిముందు కుప్పిగంతులా వంటి మరికొన్ని చూపవచ్చును.

కొన్ని సామెతలలో ప్రత్యేకములైనగాథలు లేకున్నను ఏదోఒక చారిత్రకసన్ని వేశముదానికి మూలమైయుండును. పిడుక్కూ; బియ్యానికీ

ఒకటే మంత్రమా' అనునది తెలియని పురోహితు డెవడో పిడుగు పడినపుడును, తలంబ్రాలు పోసినపుడును ఒక్కటే మంత్రమును చదువగా ఆక్షేపించుటకై పుట్టియుండవచ్చును. 'సింగినాదం జీలకఱ్ఱ' అను సామెత కనుక ఏదియో ఒక సంప్రదాయ మున్నదని కొంద రందురు. పూర్వ కాలమున జీలకఱ్ఱ వర్తకులు ఊరూరా అమ్ముటకు వచ్చినపుడు తమ రాక నెఱింగించుటకై శృంగనాదము చేసెడివారట! ఆ సంకేతము నెఱిగి గ్రామస్థులు ఆ సరకును కొనెడివారట! ఇట్లు చెప్పినచో ఈ సామెతకు, లోకములో దానికున్న అర్థచ్ఛాయకు సంబంధము కుదురుట లేదు. కనుక ఇది వివాహములలో తలపై జీలకఱ్ఱ బెల్లము నుంచి మంగళవాద్యములు చేయు సంప్రదాయమునకు చెందియుండవచ్చునని మఱికొంద రందురు. ప్రతిదానికి జీలకఱ్ఱయు, శృంగనాదమును కావలెనా అని సాక్షేపముగ పలుకు ధోరణి సింగినాదం జీలకఱ్ఱ అను సామెతలో నున్నదని వీరి తాత్పర్యము. సామాన్యకుటుంబ జీవితసన్నివేశములనుండి పుట్టిన కొన్ని సామెతల కేదియో ఒకమూల కేతు వున్నను అట్టివి ఏకుటుంబములోనైనను, ఎవరికైనను ఏర్పడవచ్చునేమో అనిపించును. 'అరుంధతీ కనపడదు అథ్వాన్నమూ కనపడదు అన్నైనరపాల అప్పుమాత్రం కనపడుతోంది', 'అదే పదకమైతే అమ్ముకబతకనా', 'పోతూ పోతూ బొల్లెనుకు కుడితిఅన్నట్లు'. 'విస్సన్న చెప్పింది వేదం'నంటివి అట్టివి. ఇందులో చివరిసామెతలోఉన్న విస్సన్న ఇంద్రగంటి విస్సన్నశాస్త్రి లనియు, బులుసు అచ్చయ్యగారి శిష్యులనియు, గొప్ప వేదపండితు లనియు, ఆయన చెప్పిన వేదార్థమునకు తిరుగు లేదనియు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు కథలు – గాథలలో వ్రాసిరి. ఇట్లే ప్రతిసామెతకు మూలకారణమును నిరూపించుట కష్టము.

లౌకికసన్నివేశములే కాక చారిత్రకగాథలుకూడ కొన్ని సామెతలకు కారణము లగుచుండును

పాటికి సరప్ప చెరువుకట్ట ఎక్కినాడట' అనుసామెతలో సరప్ప ఎవరో చెప్పలేము. తటాకనిర్మాణాదులయందు పని చేయు చిన్నఉద్యోగి యేమో! అక్కన్నమాదన్నలు తటాకనిర్మాణపరిశీలనను ముగించుకొని పల్లకీలో పోగా సరప్ప చెరువుకట్ట ఎక్కుటను చూచి అతనిని పరిహాసించుటకై యిట్టిసామెత పుట్టియుండవచ్చును. లేదా మఱి యొకకారణము కావచ్చును. మర్యాదరామన్న మాట తప్పినా నా వేటు తప్పదు, తాతాచార్యుల ముద్ర భుజము తప్పినా వీపు తప్పదు, ఆపస్తంబులా ఆశ్వలాయనులా అంటే ఆపస్తంబులమూ కాము ఆశ్వలాయనులమూ కాము, అప్పారావుగారి హర్కారాలము అన్నారట, ఏమి అప్పాజీఅంటే కాలంకొద్దీ రాయాజీ అన్నాడటువంటిసామెతలు చరిత్రమూలకము లని చెప్పవచ్చును.

కథలను, గాథలను పురస్కరించుకొని సామెతలు పుట్టినట్లే సామెతల నాధారముగా జేసికొని కథలు, గాథలు పుట్టుటయు కలదు. ఇటీవల సినిమాకథలు ఏదియో ఒకసామెతను ఆధారముగా చేసికొని వెలసినవే.

జానపదగేయములనుండికూడ సామెతలు వ్యవహారములోనికి వచ్చుచుండును. 'అత్తలేని కోడ లుత్తమురాలు', 'కోడలు లేనత్త గుణవంతురాలు' అను సామెత జానపదగేయమునుండి వచ్చినదే. 'దాసుని తప్పు దండముతో సరి' అను సామెత రామదాసుచరిత్రమునుండి వచ్చియుండును. లోకములోనున్న సామెతలకు చక్కని యతులు, ప్రాసలు కూర్చి జానపదగేయములలో పొదిగినప్పుడు వానికి మఱింత ప్రచారము వచ్చుచుండును. 'నొసట వ్రాసిన వ్రాత నులిమితే చెడదు' (గంగావివాహము) 'ఏలేటి పురుషునికి ఏడుగురు భార్యలు' (కొమిరెల్లి మల్లన్నకథ) 'ఆఉరుముకు ఈచినుకులా', 'రచ్చకెక్కిసభలో రాయబార మేల', (ధర్మాంగదచరిత్రము) 'గోగుపెడుసు గొల్లబిరుసు',

సుఖ మెఱుగని బ్రతుకు సున్న మేలని నిషేము, గొల్లమీద పుల్లరి గోగుమీద బచ్చలి, ఉలవ లెత్త మంట ఊళ్ళడిగినట్లు, పేరేమొ లొటపెటాల్ పెదవులు మృదువు, బూరెలగంపలకాడ పొట్లసందాలు, వంటివి కాటమరాజుకథలో కనిపించే కొత్త సామెతలు. కవికల్పించిన వైనను కావచ్చును లేదా అప్పటి వ్యవహారములోనివి కావచ్చును. 'దిక్కులేనినా మారికి నక్క పోతరాజు' (దేశింగిరాజుకథ) 'కొండలుపడ్డ కొన్నాళ్ళకు కోసలు పడును'; 'పాసిన కూట్లో కలి పోస్తే పదునుకు వస్తుందా', వంటివి బొబ్బిలిపదములోని సామెతలు వ్యవహారస్థితములై వానికి ప్రాణప్రతిష్ఠ చేసినవి. గంగావివాహములోని 'కసుర్కాత్రి పడ్డా కడుపు నిండాలి' అని సామెత 'కులం చెడ్డా సుఖము దక్కవలె' అను సామెతను పోలినది.

ఏ సామెతనైనను ఎప్పుడో ఒకసారి; ఎవరో ఒకరు కల్పించి యుందురు. ఏవో కొన్ని కారణములచేత అది ప్రజలమనస్సు నాకర్షించి యుండును. ఆనోటఆనోట దొరలి ప్రచారమునకు వచ్చియుండును. పదిమంది నడచినది బాట యైనట్లే పదిమంది పలికినది 'మాట' యగుచున్నది. ప్రారంభమున కర్త ఎవరనునది తెలిసియున్నను, కాల క్రమమున అది విస్మరింపబడును. కొన్ని సామెతలను పరిశీలించినచో ఎవరు కల్పించిరో చెప్పుట సాధ్యము కావచ్చును. 'గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్' అనునది నన్నయ్యగారి భిక్షయని నిస్సందేహ ముగ చెప్పవచ్చును. ఇంత కచ్చితముగ ఇతరలోకోక్తులవిషయమున చెప్పలేము. నన్నయ్య తన కావ్యములో వాడిన మొదటి సామెత నాలుపయి నడుచునట్లు. ఇది భావములో కాకపోయినను భాషలో క్రమక్రమముగా మార్పు చెందినది. ఇది నన్నయ్య స్వయముగ కల్పించిన దనుటకు సాహసించలేము. నలసారము సంసారము, వృద్ధుల బుద్ధులు సంచలింపవే అను నభియుక్తోక్తులు నన్నయ్య కృతములు

అవి ఇంచుమించు లోకోక్తులుగా మారిపోయినవి. 'కులవిద్యకు సాటి లేదు' అను లోకోక్తి గువ్వలచెన్న శతకములో నున్నను అది ఆకవికృతమని చెప్పుటకు వీలు లేదు. అంతకుపూర్వమే ప్రచారములో నుండిన నుండవచ్చును. లేదా మాళవికాగ్నిమిత్రములోని 'కామం ఖలు సర్వస్యాపి కులవిద్యా బహుమతా', అను గణదాసుభావమునకు ఆంధ్రీకరణము కావచ్చును. తిక్కన తన కావ్యములలో లోకోక్తులను. సామెతలను ఎక్కువగా వాడెను. 'ఏయువా డుండ అ న్నేమి సేయు' ననునది తిక్కనకాలములో ప్రచారములో నుండి యుండవలెను. ఈనాడాసామెతకు తెలుగుదేశమున ఎక్కువ ప్రాచుర్యమున్నట్లు తోచుట లేదు. ఈసామెత తమిళములో నేటికిని ఉన్నది. ఏగిరవన్ ఏయిత్తాల్ అంబు ఎన్న సెయ్యుమ్? తిండిపోత నీకు భండన మ్మేటికి అను తిక్కనవాక్యము క్రమముగా 'తిండిపోతుకు భండన మెందుకు' అన్న లోకోక్తిగా మారియుండును. 'దాసికొడుకైనగానీ కాసులు కలవాడే రాజు' అను బద్దెన కల్పించినది. ఇవియేకాక ఆయన మఱికొన్ని చక్కని లోకోక్తులు కల్పించెను. తెలుగు సాహిత్యములో వేమన సామెతల పుట్టయని ఇదివఱకే చెప్పియుంటిమి. ఆయన కల్పించిన సామెత లివి యని వేర్పరచి చెప్పుట చాల కష్టమైనపని. కాని, 'కామి గాక మోక్షగామి కాడు, తిరుమలకును పోవ తురకదాసరి కాడు, తొత్తు తొత్తెకాని దొరసాని కాబోదు, కులముకన్న మిగుల గుణము ప్రధానమ్ము, నోసలు భక్తుడైన నోరు తోడేలయా, తలలు బోడులైన తలపులు బోడులా?, పుట్టమీద కొట్ట భుజగంబు చచ్చునా? కని గ్రుడ్డి విని చెవుడు వంటి చక్కని లోకోక్తులు వేమనస్వకపోలకల్పితములని చెప్పుట సాహసము కాదేమో! ధూర్జటి, శ్రీనాథుడు, పెద్దన, నంది మల్లయ్య, ఘంట సింగనవంటి కవులు సామెతలను, లోకోక్తులను విశేషముగ వాడిరి. దక్షిణాంధ్రయుగమునందు సాహిత్యములో సామె

తల ప్రభావము, ప్రయోగము ఎక్కువయ్యెను. ప్రబంధయుగములోని పాండిత్యమును ప్రకటించు దృష్టి దక్షిణాంధ్రయుగమునాటికి సన్నగిల్లుటయే దీనికి కారణము.

సామెతల ఉత్పత్తివికాసములను గూర్చి చెప్పునప్పుడు ఇతర భాషలనుండి అనువదింపబడిన సామెతలను విస్మరింపకూడదు. ఇట్టి సామెతల స్వరూపమును సులభముగ పోల్చుకొనవచ్చును. మూలములో నుండు స్వారస్యము, సమత, యతిప్రాసల నియమములు, ఛందో నియమములు ఉన్నవి ఉన్నట్లుగా అనువాదములో వచ్చుట కష్టము. మూలములోని సొగసు అనువాదములో లోపించినను, భావములోని బలమువలన వ్యవహారప్రాచుర్యము పొంది, వ్యాప్తిలో నుండుటచే సామెతలే యగుచున్నవి. రెండుభాషలు మాటలాడు ప్రాంతములలో ఒకభాషనుండి మరియొకభాషలోనికి సామెతలు, లోకోక్తులు అనువదింపబడుటకు వీలున్నది. కావున సహజముగ ప్రజలలో పుట్టి ప్రచారములోనికి వచ్చినసామెతలు ఒకవర్గమునకు, ఇతరభాషలనుండి వచ్చి ప్రచారములో నున్నవి మఱియొకవర్గమునకు చెందినట్లు భావింపవచ్చును. కొన్నిఅనువాదములు ఏనాడో జరిగి, వ్యవహారగతమై ప్రయోగవిస్తృతి పొంది, భాషలో లీనమై పోవుటచే ఇప్పుడవి ఏవర్గమునకు చెందునో చెప్పుటకూడ వీలు కాని పరిస్థితిలో నున్నవి.

ఇరుగుపొరుగు ప్రాంతముల భాషలనుండియేకాక, మన విద్యావిధానములో ప్రాధాన్యము వహించి సాంస్కృతికసంబంధములున్న భాషలనుండికూడ సామెతలనువదింపబడి వ్యవహారములోనికి వచ్చుచుండును. సంస్కృతమునుండి పూర్వమెన్నియో సామెతలు తెలుగులోనికి కనువదింపబడినవి. ఈనాడు అవి ప్రజల కనువాదములనికూడ తెలియవు. 'జీవన్ భద్రాణి పశ్యతి' ఇది రామాయణములోని వాల్మీకి మాట. అదియే 'బ్రతికియుండిన శుభములు బడయవచ్చు'అని గ్రాంధిక

ముగా ఛందోబద్ధమై తెలుగులోనికి వచ్చింది. వ్యవహారములో జాన పదముద్రతో 'బ్రతికుంటే బలుసాకు తినవచ్చు'గా మారినది. 'ఉదర నిమిత్తం బహుకృతవేషః', అనునది 'కూటికోసం కోటివిద్యలు' గా తెలుగులో మారినదని చెప్పలేము. తెలుగులోకోక్తిలో ఉన్న బిగువు సంస్కృతములో లేదు. 'ఉద్యోగః పురుష లక్షణమ్' అనునది ప్రత్యయ ముల మార్పుతో 'ఉద్యోగం పురుష లక్షణం' అని తెలుగైనది. 'వినాశకాలే విపరీతబుద్ధిః' అనునది వేమన్న రచనలలో 'చేటు కాలానికి చెడుబుద్ధి'గా మారి మూలములోని గౌరవమును తెచ్చుకొన్నది. 'దశ మాతా హరీతకీ' అను వైద్యుల లోకోక్తి తెలుగులో 'కరక్కాయ కన్నతల్లి'గా మారినది. సామెతలు అనువదింపబడినప్పుడు భావమునే ప్రధానముగా గొని దశమాతా అనుటకు కన్నతల్లి అని అనువదిం చుటలో ప్రజలభాషామర్యాద పాటించు ఔచిత్యము విశద మగు చున్నది. 'న దుఃఖం పంచభి స్సహ' అను లోకోక్తి తెలుగులోనికి వచ్చినప్పుడు కొంత పరివర్తన పొందుటయే కాక పెరిగినది. 'పది మందిలో చావు పెండ్లితో సమానము' ఇది కేవల మనువాద మనుటకు వీలు లేదేమో! 'భుజంగ పద జానీతే' భుజంగ చరణం అనునది తెలు గులో 'పాముకాళ్ళు పాముకే ఎరుక' అను సామెతగా మారినది. ఇట్లే సంస్కృతమునుండి వందలకొలది సామెతలు, లోకోక్తులు వచ్చి తెలుగు వ్యవహారములో జీర్ణించిపోయినవి.

తమిళ కన్నడభాషలలో నున్న సామెతలుకొన్ని తెలుగులోనికి వచ్చిన వనుటలో సందేహము లేదు, కాని వానిని నిరూపించి చెప్పుట సులభము కాదు. ఈభాషలలో నున్న సాజాత్యమువలనఎన్నిరో సామెతలు సమానార్థకములుగా నుండుటలో వింత లేదు. ఆచార వ్యవహారములు సమానములుగా నున్నపుడు అనుభవములు, ఆలోచ నలు సమానములుగా నుండును. సామెతలలో పోలిక లుండుటలో

వింత లేదు. ఈక్రింది తమిళము - తెలుగుభాషల సామెతలను పరిశీలింపుడు.

తమిళము - అగళిలె విళుందపిళ్ళైక్కు అదువే వైకుంఠం.
తెలుగు - అగడ్తలో పడ్డ పిల్లికి అదే వైకుంఠం.

(త) అక్కరైక్కు ఇక్కరై పచ్చై.
(తె) ఆవలిగట్టువారికి ఈవలిగట్టు పచ్చన.

(త) అడినాక్కిల్ నంజుం నునినాక్కిలె అమృతముమా ?
(తె) అంగిటిలో విషం, మున్నాలిక తియ్యదనమా ?

(త) అరసనై నంబి పురుషనై కైవిట్టపోల్
(తె) అరసుని నమ్మి పురుషుని పోగొట్టుకొన్నట్లు.

(త) అరైకుడం తదుంబుం, నిరైకుడం తదుంబాదు.
(తె) నిండుకుండ తొణకదు.

(త) అళిగుక్కు అణింద ఆభరణం ఆపత్తుక్కు ఉదవుం.
(తె) అందానికి పెట్టిన సొమ్ము ఆపదకు అక్కరవస్తుంది.

(త) అర్పనుక్కు బలిషువందాల్ అర్ధరాత్రియిల్ కుడైపిడిప్పాన్.
(తె) అల్పునికి ఐశ్వర్యం వస్తే అర్ధరాత్రిలో గొడుగు పట్ట మంటాడు.

(త) అన్నం ఇట్టవర్ వీట్టిల్ కన్నం ఇడలామా ?
(తె) అన్నం పెట్టినవారింటికి కన్నం పెట్టవచ్చునా ?

(త) ఆశై అవళ్ మేలె, ఆదరువు పాయ్ మేలె.
(తె) ఆశ ఆలిమీద, ఆధారం చాపమీద.

(త) ఆశై వెక్కం అరియాదు.
(తె) ఆశ సిగ్గెరుగదు.

(త) ఆడమాట్టాద తేవిడియాళ్ కూడంకోణల్ ఎన్నాళామ్ !
(తె) ఆడలేని భోగముది అంగణం వంకర అన్నదట !

(త) ఆదాయమిల్లాద శెట్టి ఆర్ క్రోడె పోవానా ?
(తె) ఆదాయంలేనిదే సెట్టి వరద బడి పోడు.
(త) ఆత్తిరకారనుక్కు బుద్ధి మట్టం.
(తె) ఆత్రగానికి బుద్ధి మట్టు.
(త) ఆట్రిలే పోట్టాలుం అళందు పోడు.
(తె) ఏటిలో వేసినా ఎంచి వేయవలెను.
(త) ఆనై పడుత్తాల్ ఆళ్ మట్టం.
(తె) ఏనుగు పడుకున్నా గుఱ్ఱమెత్తు.
(త) ఇడం కుడుత్తాల్ మఠం పిడుంగువాన్.
(తె) ఇసుంటా రమ్మంటే ఇల్లంతా చేకొన్నట్లు.
(త) రామనై పోల రాజు ఇరుందాల్ హనుమనై పోల సేవనుం ఇరుప్పాన్
(తె) రామునివంటి రాజుంటే హనుమంతునివంటి బంటు అప్పుడే ఉంటాడు.
(త) ఇరుందాల్ నవాబుసాయిబు, ఇల్లానిట్టాల్ పక్కిరుసాయిబు.
(తె) ఉంటే నవాబుసాహేబు, లేకుంటే ఫకీరుసాహేబు.
(త) ఇళైత్తవన్ పెండాటి ఎల్లోరుక్కుం మైదుని.
(తె) పేదవాడిపెళ్ళాం వాడకంతా వదిన.
(త) ఉగిర్ శుట్రిన్ మేలె అమ్మి మిళిందదుపోల్.
(తె) గోరుచుట్టుపై రోకటిపోటువలె.
(త) ఉడుంబు పోనాల్ పోగిరదు, కై వందాల్ పోదుం.
(తె) ఉడుము పోయిన పోయింది, చెయ్యి వస్తే చాలు.
(త) ఉక్కారుందల్లవో పడుక్కవేండుమ్.
(తె) కూర్చుని పడుకోవాలి.
(త) ఉణుక్కు మిందువాన్, వేలైక్కు పిందువాన్.
(తె) తిండికి తిమ్మరాజు, పనికి పోతరాజు.

(త) ఊరుక్కొరు తెవిడియాళ్ ఆరుక్కిన్ను ఆడువాళ్ ?

(తె) ఊరికంతా ఒకబోగముది ఎవరివద్ద ఆడును ?

(త) ఊర్రినిరుందాల్ పఱై చేరి ఇరుక్కుం.

(తె) ఊరని ఉంటే మాలగేరి (పల్లి) ఉండును.

(త) ఎట్టినాల్ కుడిమియై పిడి, ఎట్టావిట్టాల్ కాలై పిడి.

(తె) అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు.

(త) ఎందప్పుట్రిలె ఎంద పాంబు ఇరుక్కిరదో !

(తె) ఏపుట్టలో ఏపా మున్నదో !

(త) ఏగిరవన్ ఏయిత్తాల్ అంబు ఎన్న సెయ్యుం ?

(తె) ఏసేవాడు ఏస్తే అ మ్మేమి చేస్తుంది ?

(త) ఎరుదునోయ్ కాకైక్కు తెరియుమా ?

(తె) ఎద్దుపుండు కాకికి ముద్దా ?

(త) ఎల్లోరుం పల్లిక్కు ఏరినాల్ తూక్కుగిరదు యూన్ ?

(తె) అందరూ అందల మెక్కితే మోసే దెవరు ?

(త) ఎళియారై వలియాన్ అడిత్తాల్ వలియారై దైవం అడిక్కుం.

(తె) అలువుడిని బలువుడు కొడితే బలువుణ్ణి భగవంతుడు కొడతాడు.

(త) ఏరశొన్నాల్ ఎరుదుక్కు కోపం ఇరుంగశొన్నాల్ నొండిక్కు కోపం.

(తె) ఎక్క మంటే ఎద్దుకు కోపం, దిగ మంటే కుంటికి కోపం.

(త) అయ్యర్ వరగిరవరెఇల్ అమావాస్యై నిఱుక్కుమా ?

(తె) అయ్యవారు వచ్చేదాకా అమావాస్య నిలుచునా ?

(త) ఒళిక్క పోయుం తలైయారివీట్టిలా ?

(తె) దాగ బోయి తలారిఇంటిలోనా ?

(త) కట్టినవనుక్కు ఒరువీడానాల్ కట్టాదవనుక్కు బలవీడు.

(తె) కట్టినవాడికి ఒకఇల్లు, అద్దెకున్నవాడి కన్ని ఇళ్ళే.

(త) కడన్ ఇల్లాద కంజి కాల్ వైర్ పోదుం.
(తె) అప్పులేని గంజి దొప్పెడే చాలు.
(త) కట్ట వీట్టుక్కు ఎట్టు వక్కణై.
(తె) కట్టిన ఇంటికి కణకులు మెండు.
(త) కణ్ కెట్టపిరగా సూర్యనమస్కారం పణ్ణుగిరదు.
(తె) కళ్ళు పోయినతరువాత సూర్యనమస్కారాలు.
(త) కరుంబు రుచిఎన్రు వేరోడు పిడుంగలామా ?
(తె) చెఱుకు తీపని వేరుతో లాగవచ్చునా ?
(త) కల్ కినట్రిక్కు ఏట్ర ఇరుంబుతోండి.
(తె) రాతినూతికి ఇనుపబొక్కెన.
(త) కాక్కైక్కుం తన్ కుంజు పొన్ కుంజు.
(తె) కాకిపిల్ల కాకికి ముద్దు.
(త) కాడు వావా ఎంగిరదు, వీడు పోపో ఎంగిరదు.
(తె) కాడు రమ్మంటున్నది, ఊరు పొమ్మంటున్నది.
(త) కాయ్ భారత్తై కొండి తాంగాదా ?
(తె) తీగకు కాయ బరువా ?
(త) కాయ్ందమరం కల్లడి పడుం.
(తె) కాచిన చెట్టుకు రాళ్ళదెబ్బలు.
(త) కాలై శుట్రిన పాంబు కడియామల్ విడాదు.
(తె) కాలికి చుట్టుకొన్న పాము కరవకమానదు.
(త) కావడిభారం శుమక్కిరవనుక్కు తెరియుం.
(తె) మోసేవాడికి తెలుసు కావడిబరువు.
(త) కాళై పోనవళియె కయిరు పోగుం.
(తె) ఎద్దులవెంబడి తాళ్ళు.
(త) కాట్రుళ్ళపోదే తూట్రికొళ్.
(తె) గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టు.

(త) కిన్రుతవళైక్కు నాట్టువళప్పం ఏన్ ?

(తె) ఉడుము కేలరా ఊరిలో పెత్తనము ?

(త) కుచవనుక్కు ఆరుమాదం, దడికారనుక్కు అరై నాళి.

(తె) కుమ్మరి కొకపడు, గుదియ కొక పెట్టు.

(త) కుండు శెట్టిలే కుదిరై ఒట్టిగిరదుపోల్.

(తె) కుండలలో గుఱ్ఱాలు తోలినట్లు.

(త) కుదిరై కురుడానాలుం కొళ్ళు తింగిరత్తిల్ కురయుమా ?

(తె) గుఱ్ఱం గుడ్డిదైనా దాణాకు కొదువ లేదు.

(త) కురుట్టుకణ్ణుక్కు కురిణిమై ఇట్టు ఎన్న ?

(తె) గుడ్డికంటికి కాటు కెందుకు ?

(త) కురివియిన్ మేలె బ్రహ్మాస్త్రమా ?

(తె) పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా ?

(త) కైక్కు ఎట్టినదు వాయిక్కు ఎట్టవిల్లై.

(తె) చేతి కందినది వాతి కందదు.

(త) కొట్టినాల్ తేళ్, కొట్టావిట్టాల్ పిళ్ళైపూచి.

(తె) కుట్టిన తేలు, కుట్టకున్న కుమ్మరిపురుగు.

(త) కోటివిద్దైయుం కూళుక్కు.

(తె) కోటివిద్యలు కూటికొరకే.

(త) గోత్తిర మరిందు పిణ్ణైకొడు, పాత్తిర మరిందు పిచ్చైయిడు.

(తె) గోత్ర మెరిగి పిల్లను, పాత్ర మెరిగి దానము.

(త) కోళీ కరుప్పానాల్ ముట్టైయుం కరుప్పా ?

(తె) కోడి నలుపైతే గుడ్డు నలుపా ?

(త) సిరియపాంబానాలుం పెరియదడి కొండడి.

(తె) చిన్నపామునైనా పెద్దకఱ్ఱతో కొట్టవలెను.

(త) సిరు తీ, పెరు నిరుప్పు.

(తె) చిన్నమంట పెద్దనిప్పు.

(త) శుట్టమణ్ణు పచ్చైమణ్ణు ఒట్టుమా?

(తె) కాలినమన్ను కాలనిమన్ను అతుకదు.

(త) స్వామి వరం కుడుత్తాలు పూజారి వరం కుడుక్కమాట్టాన్.

(తె) దేవుడు వర మిచ్చినా పూజారి వర మీయడు.

(త) సెడియిలె వణంగాదదు మరత్తిలె వణంగుమా?

(తె) చెట్టై వంగనిది మానై వంగునా?

(త) శత్తాల్ తెరియుం శెట్టియార్ వాళ్వు.

(తె) చచ్చినాక తెలుస్తుంది సెట్టిబండారం.

(త) శెవిడన్ కాదిలే శం గూదినదుపోల్.

(తె) చెవిటివానిముందు సెం కూదినట్లు.

(త) శొల్లికుడుత్తశొల్లుం, కట్టికుడుత్తశోఱుం ఎదువరెయిల్ నిరుక్కుమ్?

(తె) చెప్పిన బుద్ధి, కట్టిన సద్ది.

(త) తా నొన్ఱు నెనియిత్తాల్ దైవ మొన్ఱు నెనెయిక్కుమ్.

(తె) తా నొకటి తలచిన దైవ మొకటి తలచును.

(త) తాను పిడిత్త మొయిలుక్కు మూన్ఱె కాల్.

(తె) తా బట్టిన కుందేటికి మూడే కాళ్ళు.

(త) దిక్కఱ్ఱవనుక్కు దైవమే తుణై.

(తె) దిక్కులేనివానికి దేవుడే దిక్కు.

(త) తిరుడనై పిడుక్క తిరుడనే వేండుమ్.

(తె) దొంగను దొంగే పట్టాలి.

(త) తుళ్ళుగిరమాడు పోది శుమక్కుమా ?

(తె) త్రుళ్ళేఎద్దు గంత మోయునా ?

(త) తేలుక్కు మణియం కుడుత్తాల్ నిమిషత్తుక్కు నిమిషం కొట్టుం.

(తె) తేలుకు పెత్తన మిస్తే తెల్లవార్లు కుట్టును.

(త) నాక్కుగిరనాయిక్కు శెక్కు ఎన్న్రి శివలింగ మెన్రుం తెరియుమా ?

(తె) నాకేకుక్కకు లింగ మేమి ? పాణపట్ట మేమి ?

(త) నాడరింద పార్పానుక్కు పూణాల్ వేండుమా ?

(తె) జగ మెరిగిన బ్రాహ్మణునికి జందె మేల ?

(త) నీళనీళ తెరియుం నెయ్యుం పొయ్యుం.

(తె) నిజము నిలుకడమీాద తెలియును.

(త) నొండికుదురైక్కు శరిక్కినదు శాక్కు.

(తె) కుంటిగుఱ్ఱానికి జారిందే సాకు.

(త) పగలిల్ పక్కం పారుత్తు పేశు, ఇరవిల్ అదుదానుం పేశాదె.

(తె) పగలు పక్క చూచి మాట్లాడు, రాత్రి అదీ వద్దు.

(త) పట్టకాలిలే పడుం కెట్టకుడియే కెడుం.

(తె) తగిలినకాలికే తగులును, నొగిలిన ఇల్లే నొగులును.

పైవానిలో కొన్ని తమిళమునుండి వచ్చియుండుటకు వీలున్నది. అట్లే కొన్ని తెలుగుసామెతలు తమిళములోనికి అనువదింపబడియుండవచ్చును. ఇది ప్రత్యేకముగా పరిశోధింపదగిన విషయము. ఇట్లే ఆంధ్రకర్ణాటకభాషలలో సామెతలనుకూడ పోల్చి చూడవచ్చును. తెలుగులోనున్న సామెతలు, నానుడు లెన్నియో కన్నడమునందును గలవు. ఈ భాషలుకూడ దానప్రతిగ్రహములు చేసియుండును. కన్నడములోను తెలుగులోను సమానముగనున్న కొన్ని సామెతలను చూడుడు.

(క) అంగైయ్‌తోరిసి అవలక్షణ అన్నిసికొండహాగె.
(తె) అరచేయి చూపి అవలక్షణ మనిపించుకొన్నట్లు.

(క) అంకెఇల్లద కపి లంకెఎల్ల సుట్టితు.
(తె) అంకెలేని కోతి లంకనంతయు కాల్చెను.

(క) అట్టమేలె ఒలెఉరియితు కెట్టనేలె బుద్ధి బంతు.
(తె) కూడు ఉడికినాక పొయ్యి మండును.

(క) అడ్డగోడెయమేలె దీపదహాగె.
(తె) అడ్డగోడమీద దీపమువలె.

(క) అత్తఒడెద పాత్రెగె బెలె ఇల్ల.
(తె) అత్తకొట్టిన పాత్రకు వెల లేదు.

(క) అత్తెగె ఒందుకాల, సొసెగె ఒందుకాల.
(తె) అత్త కొకకాలం, కోడలి కొకకాలం.

(క) అల్పగె ఐశ్వర్య బందరె అర్ధరాత్రియల్లి కొడె హిడిసికొండ.
(తె) అల్పునికి ఐశ్వర్యం వస్తే అర్ధరాత్రిలో గొడుగు పట్టమంటాడు.

(క) అళువవన ఎడక్కూ, హూలియువవన బలక్కూ కుంద్రబారదు.
(తె) ఏడ్చేవాని ఎడమవేపు, కుట్టేవాని కుడివేపు కూర్చోరాదు.

(క) ఆటవు ముగీతు తంతియు హారితు.
(తె) ఆటా ముగిసింది, తంతీ తెగింది.

(క) ఆత్రగారిగె బుద్ధి మట్టు.
(తె) ఆత్రగానికి బుద్ధి మట్టు.

(క) ఆనెమేలె హోగువవన సున్న కేళిదహాగె.
(తె) ఏనుగుమీద పోవువానిని సున్న మడిగినట్లు.

(క) ఆఱు హెత్తవళిగె మూఱు హెత్తవళు ముళుకు కలిసిదవళంతె.
(తె) ఆఱు కన్నమ్మకు మూడు కన్నమ్మ ముక్క నేర్పిందట!

(క) అంబలి కుడియువవనిగె మీసే తిక్కువ నొబ్బ.
(తె) అంబలి తాగేవాడికి మీసా లెత్తేవా డొకడు.

(క) అభ్యాసవిల్లద పారవ అగ్నికార్య మాడిదరె గడ్డమీసె హొత్తితు.
(తె) అభ్యాసంలేని బ్రాహ్మణుడు అవుపోసనం చేస్తే గడ్డం మీసం తెగ కాలినవట!

(క) ఒమ్మెనమ్మనెయక్కియ కొట్టు అమ్మా! నిమ్మనెయ ప్రసాద.
(తె) పిండీ బెల్లం ఇచ్చి పిన్నమ్మా! నీప్రసాద మన్నట్లు.

(క) ఒరళు హోగి మద్దళెసంగడ హేళిదహాగె.
(తె) రోలు వెళ్ళి మద్దెలతో మొర పెట్టుకున్నట్లు.

(క) కణ్ణినష్టు ప్రకాశ విల్ల, మణ్ణినష్టు ఆధార విల్ల.
(తె) కన్నువంటి ప్రకాశం లేదు, మన్నువంటి ఆధారం లేదు.

(క) కడా తింబోవనిగె హప్పళ ఈడే.
(తె) తలుపులు తినేవాడికి అప్పడములు లోటలోటు.

(క) కబ్బు సీయంత బుడపరియంతర అగియబారదు.
(తె) చెరకు తీపని వేళ్ళతో లాగవచ్చునా?

(క) కండరె సుంక, కండదిద్దరె బింక.
(తె) చూస్తే సుంకం, చూడకుంటే బింకం.

(క) మగ బదుకబేకు, సొసె ముండె ఆగబేకు.
(తె) కొడుకు చల్ల గుండాలి, కోడలు ముండమోయాలి.

(క) కుమ్మళికాయకళ్ళ అందరె హెగలు ముట్టినోడిదహాగె.
(తె) గుమ్మడికాయలదొంగ అంటే బుజాలు తడుముకున్నట్లు.

(క) కురుడరొళగె మెళ్ళనె శ్రేష్ఠ.
(తె) గ్రుడ్డిలో మెల్ల మేలు.

(క) కురుడకణ్ణు ముచ్చిదరు ఒందే, తెరెదరు ఒందే.
(తె) గుడ్డికన్ను మూసినా ఒకటే, తెరచినా ఒకటే.
(క) బడవనకోప అవుడిగె మారి.
(తె) పేదవానికోపం పెదవికి చేటు.
(క) తాను హోదరె మజ్జిగె ఇల్ల, మొసరిగె చీటు.
(తె) తాను వెడితే మజ్జిగ లేదు, పెరుగుకు చీటు.

దక్షిణదేశభాషలలో నున్న సామెతలను ప్రత్యేకముగా పరిశీలించి వానిపౌర్వాపర్యమును పరిశోధన చేసి నిర్ణయింపవలయును.

ఇంగ్లీషుభాషాప్రభావమున కొన్ని సామెతలు తెలుగులోనికి వచ్చినవి. "అందని ద్రాక్షపండ్లు పుల్లన" అనునది "Grapes are sour" అను సామెతకు తెలుగురూపము. నక్క—ద్రాక్షసంక్షకథ మనది కాదు. "దానం చేసిన ఆవుదవడపళ్ళెంచకు" అనునది "Don't look a gift horse in its mouth" అను ఆంగ్లసామెతకు దగ్గఱగానున్నది. "దేవళానికి చేరువ, దైవానికి దూరము" అను లోకోక్తి 'The nearer the church the farther from God' అనుదానికి అనువాదమని భావింపవచ్చును. ఆచారవ్యవహారములు భిన్నములైనను తెలుగులోనున్న సామెతలవంటి వెన్నియో, ఇంగ్లీషులోనే కాక ఇతర భాషలలోకూడ కలవు.

— : : —

# 2

ఇంతవఱకు సామెతల ఉత్పత్తివికాసములనుగూర్చి కొంత చర్చించితిమి. సామెతలశైలినిగూర్చి, వానియందలి విషయములను గూర్చి కొంత పరిశీలింపవచ్చును. ఆయా విషయములనుబట్టి సామెతల నాయావర్గములక్రింద విభజించుటచే కొంత ప్రయోజనము లేకపోలేదు. భాషాభిమానులకట్టి విభజన ఎంతయో ఉపయోగపడును. ఆచారములు, సంప్రదాయములు, వ్యవసాయము, సంసార జీవితము, వృత్తులు, హాస్యము – మొదలగు శీర్షికలక్రింద సామెతలను వర్గీకరించి పరిశీలించినచో ఆయావిషయములపట్ల తరతరములుగనున్న ప్రజాభిప్రాయము విదితమగును.

ప్రజల ఆచారములు, సంప్రదాయములు, విశ్వాసములు వెల్లడి చేయు సామెతలు, తెలుగులో చాల కలవు. 'అక్కైతే వైద్యకట్నం, ఇక్కైతే వైతరణీగోదానం' – రోగి చావుబ్రతుకులలో నున్నప్పుడు వైద్యున కావును దానముచేసి రోగి బ్రతికినచో వైద్యకట్నముగను, చనిపోయినచో వైతరణీగోదానముగను పరిగణింపవచ్చునని సామెత తాత్పర్యము. వైతరణీగోదానము అపరక్రియలలో చేయుదురు. గోదానము చేసినచో జీవుడు వైతరణి నదిని సులభముగ దాటునట. ఇది హిందూమతములోని విశ్వాసము. దానిని పురస్కరించుకొని చేయునది గోదానము. ఇది ఒక సంప్రదాయము. 'అన్నీ ఉన్నవి అంచుకు తోగరు లేదు' అను సామెతకు 'అన్నీ ఉన్నవి, ఐదువతనము లేదు' అని అర్థము. ఇచ్చట ఐదువతనము లేదనుటకు బదులుగా 'అంచుకు తోగరు లేదు' అని యున్నది. అంచుకు తోగరు లేదనుటలో విధవలు తోగరంచు లేని వట్టి తెల్లచీరలు కట్టు ఆచారము సూచింపబడుచున్నది. 'అటితి దుఃఖం ఆరు నెలలు, కడుపుదుఃఖం

కలకాలం ' అను లోకోక్తికి భర్త చనిపోయినచో దుఃఖము కొంత కాలమే ఉండును, కన్నసంతానము పోయినచో కలకాలముండునని తాత్పర్యము. ఇక్కడ అతిశీతి దుఃఖమనగా మెడలో కట్టిన మంగళ సూత్రము లేక నల్లపూసలు పోవుటవలని దుఃఖము. అనగా భర్తృ వియోగమని పిండితార్థము. మంగళసూత్రధారణమున్న జాతియందే ఇట్టి సామెత పుట్టును. ఇది ఆజాతి ఆచారమును సూచించును. ' అర్జున భర్జున పడెర పిడుగు ' అను సామెతలో పిడుగుపాటుకు అర్జునుని పేళ్ళుగల శ్లోకమును పఠించు ఆచారము వ్యక్తమగుచున్నది. ఇట్టి సామెతలు మరియొక దేశమున మరియొక జాతిలో ఉండుటకు వీలు లేదు. ' వట్టింటికి పోచిళ్ళు చల్లినట్లు ' అను ఒక సామెత ఉన్నది. పోచిళ్ళు అనగా శకునము చూచుటకై యిరుగుపొరుగు ఇండ్లమీద అక్షతలు నీళ్లు చల్లుట. పోచిళ్లు చల్లి ఆయిండ్లవారాడుకొను శుభా శుభవాక్యములను పొంచియుండి విని, శుభాశుభశకునములు నిర్ణయింతురు. ఈ ఆచార ముండినట్లు రుక్మాంగదచరిత్రలో నిదర్శనమున్నది. ఇట్టి ఆచారములను, సంప్రదాయములను సామెతలలో చూడవచ్చును. ' కాశికి పోవడం ఒకటి, కావడి తేవడం ఒకటి ' అను సామెతలో పూర్వకాలమునందు కాశికి పోయినవారు కాశికావడి తెచ్చు ఆచారము పేర్కొనబడినది. ' గుండ్రాయి దాచిన కూతురు పెండ్లి ఆగునా ' అను సామెతలో పెండ్లిండ్లలో సన్నెకల్లు ఉపయోగించు ఆచారము దాని కున్న ప్రాధాన్యము సూచింపబడినది. ఇట్టి సంప్రదాయములను, ఆచారములను తెలుపు సామెతలెన్నియో ఉన్నవి.

ప్రజల విశ్వాసములుకూడ కొన్ని సామెతలలో ప్రతిబింబించు చుండును. కొన్ని సామెతలలోని విశ్వాసములు తర్కసహములు కావు. వానిలో ఎంత నిజమున్నదో దేవునకెఱుక. ' ఎండావాన ఏకమైతే నక్కలపెళ్ళి ' వంటి సామెతల తాత్పర్యము కొంతదురవగాహముగా

ఉన్నది. ఇట్టివే ఇంగ్లీషులో "when it rains and the sun shines there is a fair in Hell", "when it rains and the sun shines, witches are baking pan cakes" వంటి సామెతలు కలవు. భిన్న దేశములు, భిన్న జాతులైనను, కొన్ని విషయములలో సమానమనోధర్మముండుననుట కివి తార్కాణములు. 'నల్ల బ్రాహ్మణ్ణి నమ్మరాదు' అను లోకోక్తిలో ఆ జాతిలో సాధారణముగా కాన వచ్చు శరీరచ్ఛాయ లేనప్పుడు ఆ వ్యక్తి బ్రాహ్మణుడని నమ్ముటకు వీలులేదను భావమున్నది. వ్యవహారములో దాని కనేకార్థచ్ఛాయ లుండవచ్చును. ఇట్టివే ఇంగ్లీషులో నున్నవి. "Beware of a red Italian, a white Frenchman and a black German". పూర్వము తెలుగుదేశమునందు శైవులు వైష్ణవులు పరస్పరవైరముతో కుమ్ములాడు దినములలో ప్రజలు ఈ ఉభయవర్గముల మధ్యపడి నలిగి పోవుచుండిరి. ఏయూర ఏవర్గమునకు ప్రాబల్యమున్నదో బాటసారు లకు తెలిసెడిది కాదు. ఏగాలికా చాప ఎత్తి సామాన్యులు బ్రతుకు జీవుడా అని బయటపడుచుండిరి. ఇట్టి సామాజిక పరిస్థితిని ఈ క్రింది సామెత తెలియజేయుచున్నది. 'జంగాలా ? దాసర్లా ?-ముందూరును బట్టి' - బాటసారికి వేసిన ప్రశ్నకు సమాధానముగా అతడు తాను జంగమో, దాసరియో అగుట రాబోవు ఊరిపై ఆధారపడి యుండు నని చెప్పుటలో, నాటి జనులు శైవవైష్ణవ మతసంఘర్షణాలో ఎట్లు నలిగి పోవుచుండిరో వ్యక్తమగుచున్నది.

'కతికితే అతకదు' అనునది ఎక్కువ ప్రచారములోనున్న లోకోక్తి. ఇది మన సంఘములోనున్న ఒక విశ్వాసమును చాటు చున్నది. వివాహప్రయత్నములు సాగునప్పుడు వియ్యంకులు ఒకరి ఇంట ఒకరు భోజనము చేయరు. చేసినచో ఆ సంబంధము అతకదని వారి విశ్వాసము. కతికినచో, అనగా భోజనము చేసినచో సంబంధము

అతకదు అను విశ్వాసమును పై లోకోక్తి వెల్లడించుచున్నది. 'గొడ్డు వచ్చినవేళ బిడ్డ వచ్చినవేళ, కోడలు నలుపైతే కులమంతా నలుపు, కక్కినపిల్ల దక్కుతుంది, నలుగురి తరువాత పుడితే నట్టిల్లు బంగారమవుతుంది, ముగ్గురి తరువాత పుడితే ముయ్యమూకుడుండదు, పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు' వంటి సామెతలుకూడ తెలుగువారి విశ్వాసములను చాటుచున్నవి. 'నవ్వే ఆడదాన్ని, ఏడ్చేమగవాణ్ణి నమ్మరాదు' అను లోకోక్తిలో 'నవ్వేఆడది' విలాసవతియై యుండుననియు, శీలవతి కాకపోవచ్చుననియు, కావున అట్టిస్త్రీ నమ్మదగినది కాదనియు, సంసారమునకు అయోగ్య అను సూచనయు నున్నవి. ఏడ్చుటచే మగవాడు పౌరుషహీనుడనియు నమ్మదగినవాడు కాదని యర్థము. స్త్రీలపట్ల, ఇంచుమించు, ఇట్టి అభిప్రాయమును వెల్లడించు సామెత ఇంగ్లీషులోను కలదు. "A whistling girl and a crowning hen will come to no good end".

కొన్ని సామెతలలో మనకు తెలియని పూర్వగాథల ప్రసక్తి ఉండును. అట్టివి క్రమక్రమముగా ప్రచారము నుండి తొలగిపోవును. సామెతలు పాతగిల్లి వ్యవహారబాహ్యములగుటకు కారణము లనేకము లుండవచ్చును. జనులదృష్టి మారిపోవుటచే సామెతలలో నిక్షేపించిన నీతియో, ధర్మమో మారి, మునుపటి విలువ లోపించి పోవచ్చును. సామెతలో ఉపయోగించిన సంకేత మేదియో తరువాత విస్మరింపబడవచ్చును. సామెతలోని ప్రధానమైన పదమేదియో క్రమముగా వ్యవహారము నుండి దూరమై పోవచ్చును. ఇట్టి లోకోక్తులను ప్రత్యేకముగా పరిశీలింపవలెను. 'అభ్యాసము కూసు విద్య' అను సామెత తెలుగులో ఎక్కువ ప్రచారములో నున్నది. కాని అందులో 'కూసు' శబ్దార్థము తెలుగువారికి తెలియదు. 'కూసు' అనగా శిశువు. కన్నడములో ఈ పదమున్నది. తెలుగులో 'గారాలకూసు'

'గారాల కూచి'గా మారినది. ఏ అభ్యాసమైనను శైశవములో చేయవలెనని పై సామెత అర్థము. కాని ఈ అర్థములో ఈ సామెతను వాడుట లేదు. 'ఆగభోగములు అక్కకుడిస్తే అంబటి పరకలు బావ కుడుచును' అను సామెతలో ఆగభోగములనగా Sinful pleasures అని కిట్టెలుగారి వ్యాఖ్య. ఆగస్ శబ్దము కన్నడములో ఆగ అగును. ఆగభోగములనగా పాపభోగములు. ఇది కన్నడభాషాప్రభావమున తెలుగులోనికి వచ్చియుండును. అందులో అర్థముకాని శబ్దములుండుటచే ఎక్కువ ప్రచారమునకు రాకపోవచ్చును.

పూర్వాచారములు, పూర్వమర్యాదలవలెనే సామెతలలో కొన్ని ప్రాచీనశబ్దములు నిక్షిప్తములై యుండుటవలన అట్టి శబ్దముల అర్థములను నిర్ణయించుటకు సామెతలు కొంత ఉపకరించు ననుటలో సందేహము లేదు. 'తల్లిదే వలపక్షము, ధరణిదే వలపక్షము' అను సామెతలో వలపక్షమనగా పక్షపాతమని అర్థము చెప్పుచున్నారు. కాని వలపక్షమనగా బలపక్షమేమో. 'పంక్తిలో బలపక్షము పనికిరాదు' అను లోకోక్తిలో బలపక్షమను మాట ఉన్నది. బలవంతుల పక్షమనిదాని అర్థము. అనగా పక్షపాతమను నర్థము తీయుటకు వీలు లేకపోలేదు. తల్లినది వలపక్షము, ధరణిది వలపక్షము అనుటలో తల్లి ధరణివంటిదైనా, దానివలెనే బలపక్షపాతము కలిగియుండునని ఈ సామెత అర్థమేమో!

గృహస్థజీవితమునకు సంబంధించిన సామెతలు తెలుగులో చాల కలవు. కుటుంబజీవితములో నుండు అత్త-కోడండ్ర సంబంధమును సూచించు సామెతలకు కొదువలేదు. అట్లే వ్యవసాయమునకు సంబంధించిన సామెతలుకూడ చాల కలవు. వ్యవసాయసామెతలను ఇంగ్లీషు అర్థములతోపాటు మదరాసు ప్రభుత్వ వ్యవసాయశాఖవారు

1933 లో బులిటన్ నం॥ 31 లో విపులముగ ప్రకటించినారు. జిజ్ఞాసువులు దానిని పరిశీలింపవచ్చును. వర్షపాతము, వాతావరణము, పొలములు మెట్టపంటలు, సేద్యము, వరిపంట, పశుసంపద తోటలు — మొదలగువానిని గూర్చి తెలుగు కర్షకుల అనుభవమంతయు ఈ లోకోక్తులలో ముద్ద కట్టియుండును.

ఒక్కమాటలో చెప్పవలయునన్నచో సామెతలు స్పృశింపని మానవజీవితానుభవము లేదు.

యస్. రాఘవాచారి.

# అ

అంకెఅయితే గొంగడు తెమ్మన్నానుగాని మంచెగుంజలపాలు కమ్మన్నానా !

అంకెకురాని ఆలిని (పెండ్లాన్ని) ఆర్గురు పిల్లల (బిడ్డల) తల్లి అయినా విడువవలెను.

అంకెకురాని ఆలు, కీలెడలిన కాలు !

అంకెలేని కోతి లంకంతా చెఱచెను (చెఱచిందట).

అంగటిలో (ట్లో) అన్నీ ఉన్నవి; అల్లుని నోటిలో (నోట్లో) శని ఉన్నది.

అంగటిలో (ట్లో) అష్ట భాగ్యం; అమ్మ నోటిలో (నోట్లో ) శని (శనేశ్వరం).

అంగటిలో (ట్లో) అష్టభాగ్యం; అల్లుని నోటిలో (నోట్లో) శని (శనేశ్వరం).

అంగటిలో (ట్లో) అరువు; తలమీద బరువు !

అంగటిలో (ట్లో) ఎక్కువైతే ముంగిటిలోకి (ట్లోకి) వస్తుంది.

అంగటిలో (ట్లో) బెల్లం - ఆలయంలో లింగానికి నైవేద్యం !

అంగటిలో (ట్లో) బెల్లం - గుళ్లో లింగానికి నైవేద్యం !

అంగడి అమ్మి గొంగడి కప్పుకొన్నట్లు.

అంగడి బిచ్చం, తంగడి కట్టెలు.

అంగడిమీద చేతులు, అత్తమీద కన్ను !

అంగడిలో చుంగుడు దొరకదా?

అంగడి వీధిలో అబ్బా అంటే, ఎవరికి పుట్టినావురా కొడుకా అన్నట్టు.

అంగడి వీధిలో ఆలిని పడుకోబెట్టి వచ్చేవారు పోయేవారు దాటిపోయినారు అన్నట్టు.

అంగణముపట్టి గొడ్డు, వంగడముపట్టి బిడ్డ.

అంగవస్త్రంగుడ్డ, అందులోకీ చాలదు.

అంగాన ఆట సాగితే మద్దెలకానికి బయట పెట్టిందట !

అంగిట (అంగిటిలో) బెల్లం; ఆత్మలో విషం.

అంగిట (అంగిటిలో) విషం; మున్నాలిక తియ్యదనం.

అంచు డాబేకాని, పంచెడాబు లేదు.

అంటక ముట్టక దేవరకు పెడుతున్నాను – ఆశ పడకండి బిడ్డల్లారా ! అవతలకి పొండి అన్నదట !

అంటినస్నానం ఆముదము రాచుకొన్నా అంటదు.

అంటా ముట్టరాని అగ్రహారంవలె.

అంటుకోన (కోను) ఆముదము లేకుంటే (లేదు) మీసాలకు సంపెంగ నూనె.

అంటూబొడ్డూ, ఆవుతలా ఎద్దుకూ, జాముబొడ్డూ కనుకట్టూ ఆవుకు !

అంటూసొంటూ (అంటుముట్టు) ఆసాదివానిది; రట్టూ రవ్వా గంగానమ్మది !

అంటూ సొంటూ లేని కోడలిదాని మేనమామకొడుకు చిక్కితే చెట్టుకిందికి పోయి పక్కలు ఎగురవేశాడట !

అంటే ఆరడి అవుతుంది; అనకుంటే అలుసవుతుంది.

అండబ్రతుకూ ముండబ్రతుకూ అదవే !

అండలున్నవాళ్లు (అండలుంటే) కొండలు దాటవచ్చును (ప్రాకవచ్చును).

అండ లేని ఊళ్లో ఉండదోషము, ఆశ లేనిపుట్టింట అడుగదోషము.

అంతంతవాణ్ణి చూస్తే ఆవుపెయ్యే కుమ్మ వస్తుంది !

అంత ఉరిమీ (ఉరిమినా) ఇంతేనా కురిసేది !

అంతఃపురము బ్రతుక్కు ఆకాశమే కావాలి.

అంతకు ఇంతయింది; ఇంత కింతవుతుందో ! ఇంత కింతే.

అంతెకుట్టూ వస్తుందిగాని అక్షంతకుట్టు రాదు; తీపుకుట్టు వస్తుంది గాని దిబ్బకుట్టు రాదు.

అంతనాడు లేదు, ఇంతనాడు లేదు, సంతనాడు పెట్టింది ముంతంత కొప్పు.

అంతమాత్రమా కొడుకా చెప్పులుకుట్టక తడవేవు! అన్నట్లు.

అంతమాత్ర ముంటే దొంతులతో కాపురము చేయనా?

అంతము లేని చోటు లేదు, ఆది లేని ఆరంభము లేదు.

అంతర్వేది తీర్థములో మావెనక మేనత్తను చూచావా?

అంతర్వేదికి అవతల అసలే ఊళ్లు లేవు!

అంత్యనిష్ఠురముకన్న ఆదినిష్ఠురం మేలు.

అంతా అయినతరువాత ముద్రపిండికాదా?

అంతా అయినతరువాత రంతు.

అంతా అయినవాళ్లే, మంచినీళ్లు పుట్టవు.

అంతా ఆస్థము అమ్మితే అత్తను కాపక కోడలు ముత్తెము అమ్మింది.

అంతా బాగుంటే! అయితే కోడిపెట్ట ఏమయినట్టు?

అంతా నట్టడి, నట్టు తెరలే!

అంతూ ఇంతూ కుంటికొడుకులకు రాజ్యం లేదు.

అందంచందం లేని మగడు మంచంనిండా ఉన్నాడు (ఉన్నట్లు).

అందం చిందినట్లు, నాగరికత నష్టమైనట్లు.

అందములో పుట్టిన గంధపుచెక్క, ఆముదములో పుట్టిన ముష్టి.

అంద ముంటే ఆయెనా అదృష్ట ముండవలె.

అందతుకుల మగవానికి (మొగానికి) చీకుల మొలతాడు.

అందని కాయలకు ఆశపడరాదు.

అందని గోచి, చీకుల మొలతాడు.

అందని ద్రాక్షపండ్లు (పళ్లు) పుల్లన.

అందని పూలు దేవుని కర్పణ !

అందని మాని (మ్రాని) పండ్లకు ఆశపడ్డట్లు.

అందనిమాని (మ్రాని) పండ్లకు అఱ్ఱులు సాచినట్లు.

అందరమ్మా అంటే పొందరమ్మా అన్నట్లు.

అందఱికన్న తాటిచెట్టు పెద్ద.

అందఱికాళ్లకు మొక్కినా అత్తగారింటికి పోకతప్పదు !

అందఱికీ అన్నం పెట్టేవాడు రైతే.

అందఱికీ అన్ని రోగాలు; అడ్డెడు తప్పేలాకు ఏరోగమూ లేదు.

అందఱికీ అమావాస్యగాని నాకుకూడానా ?

అందఱికీ నేలోకువ, నాకు సంబి కొండాయ (కొండయ్య) లోకువ.

అందఱికీ మంచివాడు అనంతయ్య.

అందఱికి శకునం చెప్పేబల్లి తాను పోయి కుడితిలో (కుడితితొట్టిలో) పడ్డట్లు.

అందఱిపుణ్యాన ఆలాయె; కొందఱిపుణ్యాన కొడుకాయె.

అందఱూ అందల మెక్కితే మోసేవా రెవరు ? (మోసే దెవరు ?)

అందఱూ అహింసావాదులే అయితే కోడిపెట్ట యాక (ఏక) పోయి నట్లు ?

అందఱూ ఆబ్రలో పిత్తనాతే.

అందఱూ నవ్వేనట్లు నేనూ నవ్వితే, నాపైబడెనమ్మా నాలుగుసుసా-నీల దండుగ !

అందఱూ శ్రీవైష్ణవులే, బుట్టెడు రొయ్య లెగిరిపోతున్నాయి.

అందఱూ మంచాల దగ్గరకు వెళ్లేవఱకు నేను కంచాల దగ్గరకైన వెళ్లమా !

అందఱూ మాటలు చెప్పేవారేకాని ఆపూటకు బత్తె మిచ్చేవాడు లేడు.

అందానికి గోవిందగంతులు!

అందఱూ ఒకఎత్తు; అగస్త్యుడు ఒకఎత్తు (అతని కమండల మొక ఎత్తు).

అందానికి పెట్టిన సొమ్ము ఆపదకు అడ్డం వస్తుంది.

అందానికి రెండు బొందులు (బంధాలు); ఆటకు రెండు తాళాలు (తప్పెటలు).

అందాల పురుషుడికి రాగిమీసాలు.

అందితే అందివచ్చినట్లు, అందిరాకపోతే అందిరానట్లు.

అందితే జుట్టు (సిగ), అందకపోతే కాళ్లు.

అందిన (తే) తియ్యన - అందకున్న పుల్లన.

అందిన సిగ - అందకున్న కాళ్లు.

అందులో పస లేకున్నా అంగట్లో మంచం వేయుమన్నట్లు.

అందులో పస లేకున్నా 'ఆటు'రా పూజారీ! అన్నదట!

అందులో పస లేదు, గంజిలో వార్చుమన్నట్లు.

అంధునకు అద్దం చూపినట్లు.

అంధునికాలు పంగునకు ఆధారమైనట్లు.

అంధునికి కోజయె వెన్నెల.

అంధులలో ఏకాక్షి గొప్ప.

అంపబోయిన అల్లీసాహేబు, పిలువబోయిన పీరుసాహేబు ఫిరగు లేదు.

అంబటిపను వచ్చింది అత్తగారూ! అంబటి కొంబుజ్జు నా పేరులో (నే) ఉన్నది కోడలా! అన్నదట!

అంబటి (కీ) ఆశ! మీసాలకు (నూం) ఆశ!

అంబటికి ఉప్పు అబ్బదంటే, సింపినంటమీదపోయిందట నసను!

అంబడిపూడి అప్పయ్యదీ బట్టతల, నా మొగుడిది (మగడిదీ) బట్టతల. అప్పయ్యది ఐశ్వర్యపు బట్టతలఅయితే నా మొగుడిది పేను కొరికిన బట్టతల.

అంబలా అంటే ముఖాలే చెబుతాయి అన్నట్లు.

అంబలి తాగేవానికి మీసా లెగబెట్టేవా డొకడు !

అంబలి తాగితే ఆరప్పూ, అన్నం తింటే మూడప్పూ.

అంభంలో కుంభం, ఆదివారంలో సోమవారం.

అఆలు రావు, అగ్రతాంబూలం కావాలి !

అకటావికటపు రాజుకు అవివేకి ప్రధాని, చాదస్తపు పరివారము.

అక్క ఆరాటమేకాని బావ బతకడు.

అక్క కుంటే అరిశికి లేదు; చెల్లెలి కుంటే చేతికి లేదు.

అక్కచెల్లెళ్ళకు అన్నం పెట్టి లెక్క వ్రాసినట్లు (వ్రాసేకులం).

అక్కన్న అద్దంకి పోనూపోయాడు; రానూ వచ్చాడు.

అక్కన్న మాదన్నగార్లు అందలం ఎక్కితే సాతానికి సగం చెరువుకట్ట ఎక్కినాడట !

అక్క పగ, బావ మంచి.

అక్క బిడ్డఅని తిట్టరాదు; గర్భిణి మనిషిఅని కొట్టరాదు.

అక్క మనది అయితే బావ మనవాడా ?

అక్కమ్మ గుమ్మాలు ఎక్కాలేను, దిగాలేను.

అక్కమ్మ శ్రాద్ధానికి అధిశ్రవణము.

అక్కర ఉన్నంతవరకు ఆదినారాయణ — అక్కర తీరితే బోడి నారాయణ.

అక్కరకు వచ్చినవాడే అయినవాడు.

అక్కరకు ఒదవని అర్థ మెందుకు ?

అక్కర తీరితే అల్లు డశుద్ధంతో సమానం.

అక్కర తీరితే అల్లుడు తొత్తుకొడుకు.

అక్కర తీరినాక (తీరినవెనుక) అక్క మొగుడు (మగడు) కుక్క..

అక్కలు లేచేవరకు నక్కలు కూస్తాయి.

అకాలపువాన, ఆరికలకూడు.

అక్కాజిపల్లి అంతాతిరిగినా అరదుడ్డే గోవిందా!

అక్కున లేదు చెక్కున లేదు ప్రీతిగా కాలికి (రెండు) పిల్లాండ్లు.

అగడ్తలో పడ్డ పిల్లికి అదే వైకుంఠము.

అగసాలిపొందు, వెలమలచెలిమి (నమ్మరాదు).

అగ్రహారం పోతేపోయింది కాని ఆట్ట అంతా తెలిసింది.

అగ్రహారంలో తంబళి జోస్యం (శుకా. 5. 88.)

అగ్గికి చల్లదనం వచ్చినట్లు.

అగ్గికి చెద అంటునా?

అగ్గికి పోయినమ్మ ఆరు నెలలు గర్భమైవచ్చినట్లు (అనంతపురం).

అగ్గి చూపితే వెన్న అడస్కుండా కరుగుతుంది. (పరమ. వి. 2. 1231 – 32).

అగ్గిమీద గుగ్గిలం చల్లినట్లు.

అగ్గిలో మిడత పడ్డట్లు.

అగ్నికి వాయువు తోడైనట్లు.

అగ్ని దేవుడు చలికాలంలో చంటివాడు ఎండకాలంలో ఎదిగినవాడు.

అగ్నిలో ఆజ్యము పోసినట్లు.

అగ్నిలో ఒకకాలు, గంధంలో ఒకకాలు ఉంచి తగవు తీర్చినట్లు.

అగ్నిహోత్రంలో ఆజ్యం పోసినట్లు.

అగ్నిహోత్రానికి పోయిన సోమిదేవమ్మ ఆరు నెలల గర్భంతో వచ్చింది.

అగ్గువ అయితే అంగడికి వస్తుంది.

అగ్గువ కొననీయదు; తీవరం తిననీయదు.

అగ్గువ అయితే అందరూ కొంటారు.

అఘోరతపసి విపరీతచోరుడు.

అచ్ఛికుమణిధారి అయితే పుల్ల పట్టడంలోనే తెలుస్తుంది.

అచ్చమ్మ పెళ్ళిలో బుచ్చెమ్మ శోభనం.

అచ్చపు చేతిముందర పచ్చివెన్న (కూడా) మెచ్చా?

అచ్చిగాడి పెళ్ళిలో బుచ్చిగాడి కోపోచ.

అచ్చిగాడు చావనీ అంటే బుచ్చిగాడే చచ్చెనట!

అచ్చిపెళ్ళి బుచ్చిచావుకు వచ్చింది.

అచ్చివచ్చిన భూమి అడుగే (అడుగడే) చాలు.

అచ్చివస్తే హనుమంతుడిమోర లేకపోతే కోతిమోర!

అచ్చుబోసిన ఆబోతువలె.

అజీర్ణ ముంటే ఆముదం పుచ్చుకోవలసిందే!

అజీర్ణానికి ఆకలి మెండు.

అటైతే కందిపప్పు, ఇటైతే పెసరపప్పు.

అటైతే వైద్యకట్నం; ఇటైతే వైతరణీగోదానం.

అటు అత్తింటికి కోడలూ కాదు, ఇటు పుట్టింటికి బిడ్డా కాదు.

అటుకుల రుచి ఎద్దేమి ఎరుగును?

అటుకులు బొక్కే నోరు, ఆడిపోసుకునే నోరు.

అటునుంచి నరుక్కు రమ్మన్నారు.

అట్టు ఒకరికీ, ముక్క ఒకరికా?

అట్టు తినంగానే కుట్టు పుట్టుతుందా?

అట్టు పెట్టినమ్మకు అట్టున్నర.

అట్టూ పెట్టూ ఆసాదివానిది, రట్టూ అవ్వా గంగానమ్మది.

అట్టుపుట్టు ఆనవాళ్ళు.

అట్టూ ముక్కా ఆసాదివానిది, రట్టూ అవ్వా గంగానమ్మది.

అట్లు వండినమ్మకు అగ్గు రమర్చవలెను.

అట్లువండే అత్తకు అరవై ఆరు ఎత్తులు పెట్టినట్లు (అందిచ్చినట్లు).

అట్లువండే ఆవిడకు (ఆబిడకు) అగ్గు రమర్చవలెను.

అట్టె చూస్తే అయ్యవారు కోతిలా కనబడతాడు (శ్రీకాకుళం).

అట్టే పొడుగుంటే తుఫానుకు వెరవవలసివస్తుంది.

అడకువ గలవాడే అన్నింట ఘనుడు.

అడక్కుండా చెప్పు లిచ్చాడు అడిగితే గుఱ్ఱ మిస్తాడు అనుకొన్నట్లు.

అడకొత్తు (కత్తి) లోని పోకవలె.

అడ (డు) గందే అమ్మయినా పెట్టదు.

అడగని జోలి చెప్పే అవుసలి రామక్క.

అడవి ఉసిరి (క) కాయకు, సముద్రపు (కడలి) ఉప్పు కలిసినట్లు.

అడవికి పోయిన ఆవులను బందెలో పెట్టినట్లు.

అడవికోనల నెమళ్ళు ఆడినట్లు.

అడవిమెక్కలకు కొత్వాలు నూరాయా? (ఆజ్ఞా?)

అడవిగాచిన వెన్నెల, ముదిమిని చేసిన పెండ్లి (వ్యర్థము).

అడవిపంది చేను మేసిపోతే ఊరపంది చెవులు కోసినట్లు.

అడవిప్రాణి, వానాసీకు.

అడవిలో అబ్బా! అంటే ఏడ పుట్టావురా కొడుకా అన్నట్లు.

అడవిలో ఆంబోతైతే తినాలి, అత్తింట్లో అల్లుడైతే తినాలి.

అడవిలో పొద్దు కుంకినట్లు.

అడ్డం ఉండేకంటె గడ్డి కుడిచేది మేలు.

అడ్డం పడితే గడ్డము లోతే - బోర్ల పడితే పుక్కిటిలోతే.

అడ్డగోడంత రొట్టె, గడ్డివామంత తొక్కు.

అడ్డగోడపై అమరజ్యోతి.

అడ్డగోడమీద దీపం పెట్టినట్లు.

అడ్డగోడమీద పిల్లివాటం.

అడ్డజామీనులకు పోతే తెడ్డుదెబ్బలు వస్తాయి.

అడ్డాలనాడు బిడ్డలుగాని, గడ్డాలనాడు బిడ్డలా?

అడిగితే చిరాకు, అడుగకపోతే పరాకు.

అడిగినట్టు ఇస్తే కడిగినట్టుపోతుంది.

అడిగినది రొట్టె, ఇచ్చినది రాయి.

అడిగి పెట్టించుకోరా బుడిగిదాసరీ అన్నట్లు.

అడిగేవాడికి చెప్పేవాడు లోకువ.

అడియాస, పడిభత్యం.

అడియాస పొడియాస దుఃఖానికి కారణం.

అడిసెకింద పందికొక్కులాగ!

అడుకులు తింటే ఆయెనా? కడుపులో కుట్టెత్తినప్పుడుకదా?

అడు(డ)క్కుంటే జోలె కడుక్కుపోయింది.

అడుక్కుని తిన్నా జోలె (బోలె) అలాదా ఉండవలె.

అడుక్కొని తినేదానికి తిరిసికొని తినేవాడే గతి.

అడుక్కొని తినేవాడి (ని) ఆలి అయ్యేకంటె భాగ్యవంతుడి బానిస అయ్యేది మేలు.

అడుక్కొని తినేవాళ్ళకు అరవై ఊళ్ళు.

అడుక్కొని తినేవానికి (డి) పెరుగు అన్నము కొదు (ద) వా?

అడుక్కోటానికి ఓగడప కాకపోతే ఇంకోగడప.

అడుగగా అవి లేక నాబళ్ళంతా వాచిన దన్నాడట!

అడుగడుగునకు నిక్షేపం.

అడుగనేరను ఊడ్చి పెట్టుమన్నట్లు.

అడుగబోయిన ఆలీసాబ్ అక్కణ్ణే, పిలువబోయిన పీరూసాబ్ అక్కణ్ణే.

అడుగ వెళ్ళిన అల్లీసాహేబు, పిలువ వెళ్ళిన పీరుసాహేబు జాడ లేదు.

అడుగు ఆమడగా నడిచినట్లు.

అడుగు తప్పితే పిడుగు తప్పుతుంది.

అడుగు తొడిగి ఆమడ మోయమన్నారు.

అడుగు దాటితే అక్కఱ దాటుతుంది.

అడుగున ఎరువు కొద్దీ పైన బంగారం.

అడుగు పెట్టగానే పిడుగు పడ్డట్లు.

అడుగులోనే అరక విరిగినట్లు (విరిగిందట).

అడుగులోనే హంసపాదు.

అడుసు త్రొక్క నేల? కాలు కడుగ నేల?

అడుసున పాతిన కంబం అటు ఒరుగునో! ఇటు ఒరుగునో!

అడుసులో తొక్కిన తాటిపండువలె.

అడుసులో నాటిన స్తంభం అటు ఒరుగునో ఇటు ఒరుగునో!

అడ్డెడు తినే నాసవతి ఎలా తింటుందో! గిద్దెడు తినే నాసవతి ఎలా తింటుందో! తవ్వెడునడ్డెడు తినేనటుకు నాదవడ లీడ్చుకపోయినవి

అడ్డెడు తినేవానికి ఆలెందుకు? ఇద్దుము మోసేవానికి ఎద్దెందుకు?

అడ్డెడుతవ్వెడు బియ్య మిచ్చి అమ్మా నీ (ఎంగిలి) ప్రసాద మన్నట్లు.

అడ్డెడు వండిన బుడ్డెడాయె.

అడ్డెడు వడ్ల ఆశకు బోతే తూమెడు వడ్లు దూడ మేసె.

అడ్డేటుమీద గుడ్డేటు.

అణగింది లేపిరా బుడ్డపక్క.

అణగి మణగి ఆకులలో పిందెవలె ఉండాలంటే గుమ్మడిపాదులలో కూర్చుందట!

అతడు ఉంటే, మంగలి వాణ్ణయినా పిలుచునుకదా! అన్నట్లు.

అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న.

అత్తఅప్పు తీరె అల్లునిభ్రమ తీరె.

అత్త ఎత్తుకొని తింటూంటే అల్లుడికి మనుగుడుపా?

అత్త ఏలినకోడలు చిత్తపట్టిన (వరి) చేను (బాగా పండును).

అత్త ఒప్పినా కుండ ఒప్పదు.

అత్తకంటె ఆడపాప లేదు; అతగానికంటె జీతగాడు లేడు.

అత్తకాలం కొన్నాళ్ళు, కోడలికాలం కొన్నాళ్ళు.

అత్తకు అల్లుడాశ, బానిసకి పప్పాశ.

అత్తకు ఒకరోగం, నాకు ఒకరోగం, అడ్డెడుగొప్పెలాకు ఏరోగమూ లేదు.

అత్తకు నాకు ఆసంబేరం, అత్త నొప్పకపో ముత్యాలమ్మా! అత్త నొప్పకపోతే ఆరుగాళ్ళ జీవాన్ని అర్పిస్తాను.

అత్తకు మొగుడల్లుడు ( మగడు అల్లుడు ).

అత్తకు లేక అటికలు నాకుతూఉంటే అల్లుడు వచ్చి దీపావళిపండుగ అన్నాడట.

అత్త కూడు వండమన్నదికాని కుండ పగు(గ)ల గొట్టమన లేదు.

అత్త కొట్టినకుండ అడుగోటికుండ కోడలు కొట్టినకుండ కొత్తకుండ.

అత్త కోడలిని మెచ్చుకుంటుందా?

అత్తగా(వా)రింటిసుఖం మోచేతిదెబ్బవంటిది.

అత్త చచ్చిన ఆరునెలలకు కోడలు నట్రాయి పట్టుకొని నిగిడనిగిడి ఏడ్చినట్లు.

అత్త చచ్చిన ఆరుమాసాలకు కోడలికంట నీరు వచ్చిందట!

అత్త చచ్చిన ఆరుమాసాలకు కోడలికంట్లో నీరు చిలికిందట!

అత్త చస్తే కోడ లేడ్చినట్లు.

అత్త చేసిన పనికి ఆరళ్లు లేవు.

అత్తతో చెప్పి అషు అనిపించలేడు లంకించడానికి బ్రహ్మాకొడుకు.

అత్తతో పోట్లాడి తేరు చూడకుండా పోయినట్లు.

అత్తను అంటినవాడు (ఉంచుకొన్నవాడు) ఆయుష్మంతుడు.

అత్తను అమ్ముకొమ్మంటాడు, కోడలిని కొలుచుకొమ్మంటాడు.

అత్తను కొట్టి అట కెక్కింది; మొగుణ్ణి కొట్టి మొగసా లెక్కింది.

అత్తను కొట్టితే కోడలు ఏడ్చినట్లు.

అత్తపని రిత్తపని దిన మొకకండె, నాపని రాచపని నెల కొకకండె.

అత్త పెట్టే ఆరళ్ళు కనపడుతవికాని కోడలు చేసే కొంటె పనులు కనపడవు.

అత్త పేను పెట్టి (చెప్పి) కూతురిని కుంపట్లో వేసిందట!

అత్తపోరు లేదు మామపోరు లేదు, పడుకోనబోయినచోట ఎనుబోతు లేదు.

అత్తపోరు లేదు, మామపోరు లేదు, ఇంటిలో గుడ్డివాని పోరు.

అత్త మంచీ, వేము తీపీ లేదు (ఉండదు).

అత్త మెత్త, ఏరాలు కత్తి.

అత్తమీద కన్నులు, అంగడిమీద చేతులు.

అత్తమీద కోపం దుత్త (పిత్త) మీద చూపినట్లు.

అత్తమీద కోపం పిత్తుతో సరి.

అత్తమీది కోపాన కూతురుముడ్డి కుంపట్లో పెట్టిందట!

అత్త ముండకన్న ఉత్త ముండ మంచి (మేలు).

అత్త ఊరకు పోతూ కోడలికి బుద్ధి చెప్పినట్లు.

అత్త లేనమ్మ ఉత్తమురాలు, మామ లేనమ్మ మరీ భాగ్యశాలి.

అత్త లేనికోడ లుత్తమురాలు, కోడలు లేనత్త గుణవంతురాలు.

అత్తవల్ల దొంగతనము, మగనివల్ల రంకు నేర్చుకున్నట్లు.

అత్తవారింటి అల్లుడైనా కావాలి, ఆబోతైనా కావాలి.

అత్తవారింటి అల్లుణ్ణి చూడాలి, ఆముదాలచేలో ఆబోతును చూడాలి.

అత్తవారింట ఐశ్వర్యంకన్న, పుట్టింట గంజి మేలు.

అత్తవారింటిలో అన్నీ ఉన్నవి అల్లునినోట్లో శని ఉన్నది.

అత్తవారిల్లంటే కత్తులబోను.

అత్తసొమ్ము అల్లుడు ధారవోసినట్లు.

అత్తా ఒకఇంటి (ఒకరింటి) కోడలే, మామా ఒకఇంటి (ఒకరింటి) అల్లుడే.

అత్తాకోడలు అల్లీబిల్లీ; ఇరుగుపొరుగు ఇల్లామల్లీ.

అత్తాకోడళ్ళ మాట ఆనోటా ఆనోటా!

అత్తా! నా రాట్నం మాపకుండా చూడు, కదుటిలోదిండు పడకుండా చూడు.

అత్తా! నీకోక (కొంగు, గుడ్డ) తొలిగిందన్నా తప్పే! లేదన్నా తప్పే!

అత్యాశ ముండకు మొగుడు దక్కడు.

అతికించిన కోరమీసం అట్టే నిలుచునా?

అతి చేస్తే గతి చెడుతుంది.

అతిరహస్యం చెవులో పోటు.

అతిరహస్యం పొగాకు తిరిపెము.

అతిరహస్యం బట్టబయలు.

అతివినయము, ధూర్తలక్షణము.

అతివృష్టి, అనావృష్టి.

అతివృష్టి అయినా, అనావృష్టి అయినా ఆకలిబాధ తప్పదు.

అతిసుకుమారం, కటికిదరిద్రం!

అతుకు కనిపించ దల్లుడా అంటే కుంపటి కనుపించదు మామా అన్నాడట!

అతుకులబొంత, గతుకులబాట.

అత్తిపండు పగులగొట్టితే అన్నీ పురుగులే.

అత్తి పూచినట్లు.

అదంత్రునికి (అతంత్రునికి) ఆశ పెట్టరాదు; బలవంతునికి చోటు ఇవ్వరాదు.

అదను ఎఱిగి సేద్యం, పదను ఎఱిగి పైరు.

అదను కాని పదను అయితే నేమి? గియితే నేమి?

అదనుకాని (తప్పిన) పైరు, ముదిమిలోని (వాని) బిడ్డ.

అదను చూచి (అదనుస) పొదలో చల్లినా పండును.

అదను, పదను చెఱచునది వేపనాగలి.

అదరిపాటు ఏదైనా గంతబసువు తప్పదు.

అద్దద్ద అనేవానికి అర్ధరూపాయి; మొద్దుకొట్టేవానికి పెద్దదుడ్డు.

అద్దము ఉన్నది, మొగము ఉన్నది (అడుగనేల).

అద్దముమీద పెసరగింజ పడ్డట్టు.

అద్దములో నీడకు ఆశపడినట్లు.

అద్దములోని ముడుపు అందిరాదు.

అద్దములో బింబము పట్టేసట్టు.

అది అడుసు, ఇది తొడుసు, పదరా పందిట్లోకి (ఇంట్లోకి).

అది కుమ్ము, ఇది దుమ్ము, పదరా పందిట్లోకి.

అదిగో అంటే ఆరునెలలు.

అదిగో పసుపు, ఇదిగో ముసుగు.

అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టు.

అదిగో పులి అంటే తోక తొంబై ఆమడ అన్నట్లు.

అది మంచిసరుకైతే అంగడివీథి కెందు కెక్కుతుంది?

అది లేదురా భాయి! అరలో మంచము వేయి.

అదుపుకు (లోకి) రానిఆలిని, అందిరాని చెప్పును విడువవలెను.

అదుపులేని గుఱ్ఱాలు అడవు లట్టుకుని తిరిగినవట!

అద్దుకోనే లేకుంటే తుంచుకో నెక్కడిది?

అదృష్టము అందల మెక్కిస్తానంటే, బుద్ధి బురదలోకి లాక్కెళ్ళిందట!

అదృష్టము (ం) ఐశ్వర్యము, ఒకరిసొమ్మా!

అదృష్టము ఉంటే చేయిజారిపోయేదికూడా చేతికి వస్తుంది.

అదృష్టము (౧) కలిసివస్తే, అదే పెండ్లామవుతుంది.

అదృష్టము కలిసివస్తే అదే ఆలు (పెండ్లాము) అవుతుంది.

అదృష్టము (౧) చాలని ఆడుబిడ్డను అక్కఱలేని అల్లునికిచ్చి అమావాస్య ఆదివారంనాటి ఆరుద్రా నక్షత్రాన అతివైభవంగా వివాహం జరిపినట్లు.

అదృష్టము (౦) చెప్పిరాదు, దురదృష్టము (౧) చెప్పిపోదు.

అదృష్టము (౦) పండితే ఆళ్లు నూర్లవుతాయి.

అదృష్టవంతుణ్ణి చెఱిచేవాడు లేడు - దురదృష్టవంతుణ్ణి బ్రతికించే వాడు లేడు (బాగుపఱచేవాడు లేడు).

అదృష్టవంతుణ్ణి (౧) చెఱిచేవాడు లేడు, భ్రష్టాకారిని బాగుపఱిచే (చేసే) వాడు లేడు.

అదృష్టానికి ఏడ్వనా? అడప మొగుడికి ఏడ్వనా?

అద్దెకు వచ్చిన గుఱ్ఱాలు అగడ్తలు దాటుతవా?

అద్దెపేరంటము సిద్దెమురికి.

అదే ఊరయితే కోళ్ళుకూడవా?

అదే పదకమయితే అమ్మక బదకనా? (మనం బ్రతుకమా?)

అదేమిటి రెడ్డీ వంగి వంగి నడుస్తావంటే ఎప్పటికాలు అట్టిట్టే అన్నాడట!

అదై వస్తే అడ్డగ, వాడైపోతే రూక.

అద్వైతులు వచ్చారు (వస్తున్నారు) చెంబుతప్పేలా జాగ్రత్తచేయండి (లోపల వేసుకోండి).

అధముని ఆలయ్యేకంటె (ఆలగుటకంటె) బలవంతుని బానిస అయ్యేది మేలు.

అధ్వాన్నము శత్రుమధ్యము.

అధికమాసం కరవులో వచ్చినట్లు.

అధికారం ఆరుపాళ్లయితే బొచ్చు మూడుపాళ్లు.

అధికారికి చెవు లుంటవి (లుంటాయి) గాని క ళ్లుండవు.

అధికాశ, లోకదారిద్ర్యము.

అనంతమ్మ కట్టట్లు, జగ్గమ్మకు దగ్గు.

అనంతయ్యమాత్ర వైకుంఠయాత్ర.

అనగా అనగా రాగం; తినగా తినగా రోగం.

అనప్పిండి విస్సన్నగారిదీ బట్టతలే, మావారిదీ బట్టతలే.

అనవసరంగా మాట్లాడితే ఆయుర్దాయం తగ్గుతుంది (క్షీణిస్తుంది).

అన్నదమ్ములపొత్తు చిన్నప్పుడు, అక్కచెల్లెండ్ల పొత్తు పెద్దప్పుడు.

అన్నదమ్ములలో ఆఖరువాడికంటే అడవిలో మానై పుట్టడం మంచిది.

అన్నదమ్ముల శత్రుత్వం, అక్కచెల్లెంద్ర మిత్రత్వం.

అన్నదానము అన్నిటికన్నా మిన్న.

అన్నదీక్షయేకాని, అక్షరదీక్ష లేదు.

అన్న దేవర సన్నగిస్తే అన్నీ అణగుతవి.

అన్న దేవర (డు) సన్నగిస్తే (గించితే) గోలుకొండకు జాతరే.

అన్న ద్వేషం, బ్రహ్మద్వేషం పనికిరావు.

అన్నప్రాశననాడే ఆవకాయడిప్పా !

అన్నమదమువల్ల అన్నిమదములు.

అన్నము (ం) అడిగినవానికి సున్నము (ం) పెట్టినట్లు.

అన్నము (ం) అరగడియలో అరుగుతుంది (జీర్ణ మవుతుంది.) ఆదరణ శాశ్వతంగా ఉంటుంది.

అన్నము (ం) ఉడికిందో లేదో అంతా పట్టిచూడనక్కరలేదు.

అన్నము (ం) ఉడికినాక (ఉడికినవెనుక) పొయ్యి మండును.

అన్నము (ం) ఎక్కువైతే ఆచార మెక్కువ; ఆచార మెక్కువైతే గ్రహచారం తక్కువ.

అన్నముకు పదను తప్పినా భూమికి అదను తప్పినా పనికిరావు.

అన్నము (ం) చొరవేగాని, అక్షరము (ం) చొరవ లేదు.

అన్నము (ం) తిన్నవాడు తిన్నులు (దెబ్బలు) తిన్నవాడు మరిచిపోడు.

అన్నము (ం) తిని అంటుగుళ్లైనా వేయాలి.

అన్నము (ం) పెట్టితే (పెడితే) అరిగిపోతుంది; చీర ఇస్తే చిరిగిపోతుంది.
కళ్లు కాల్చి (వాత) పెట్టితే (పెడితే) కలకాలము ఉంటుంది.

అన్నము (ం) పెట్టినవారింటికి కన్నము (ం) పెట్టినట్లు పెట్టినమ్మనా?

అన్నము (ం) లేకపోతే పరిఅన్నము, బట్ట లేకపోతే పట్టుబట్ట.

అన్నము (ం) లేకుంటే జొన్నసాగు చెయ్యి.

అన్ని రసములకన్న ఆదరణరసము మేలు.

అన్నవస్త్రాలకు (నికి) పోతే ఉన్నవస్త్రం ఊడిపోయింది.

అన్న వస్తే ముష్టికి పోతాను అన్నట్లు.

అన్నానికి అరమర లేదుగాని గంజికి గతి లేదు.

అన్నానికి ఆధారము లేదుగాని అందరికీ బంతిభోజనము.

అన్యాయపు ఊరిలో ఆలూమొగుడికి (ఆలుమగనికి) అంకు.

అన్యాయపు సంపాదన అసడ్డాలంగా పోతుంది.

అని అనిపించుకోవలెనా అత్తగారూ! అన్నట్లు.

అనిత్యాని శరీరాణి అందరి సొమ్ములు మనకే రాని.

అనిష్టానికి అంగారకుడు పాత్రుడు.

అనిష్టానికి ఎవరంటే అప్పిగాడే పాత్రుడు.

అన్ని కార్తెలు తప్పినా హస్త తప్పదు.

అన్ని పైర్లకు ఆషాఢం.

అన్ని బొండాల నీళ్లు నీవే తాగరా అయ్యోల్లా!

అన్ని రుచులు సరేగాని అందులో ఉప్పు లేదు.

అన్నిరోగాలకు వాతలు వేసే వైద్యుణ్ణి అవతల ఉంచు.

అన్నీ అమర్చినతరువాత అత్తగారు వేలు పెట్టినట్లు.
అన్నీ అయినతరువాత అగ్నివైద్యం.
అన్నీ ఉన్న అరటాకు అణగే (అణిగి) ఉంటుంది. ఏమీ లేనిది ఎగిరి పడుతుంది.
అన్నీ ఉన్న విస్తరి అణగి మణగి ఉంటుంది ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది.
అన్నీ ఉన్నవి (ఉన్నాయి) గాని, అంచుకు మాత్రం తొగరు లేదు.
అన్నీ ఉన్నవి (ఉన్నాయి) గాని అంచుకుమాత్రం తొగరొక్కటే తక్కువ.
అన్నీ ఉన్నవి (ఉన్నాయి) గాని అయినవ (ఐమువ) తనం లేదు.
అన్నీ ఉన్నవి ( ఉన్నాయి ) గాని అయినాతీది లేదు (అగలుది లేదు).
అన్నీ తీరిస్తే అత్తే వేలు పెట్టాలా ఏమి ?
అన్నీ తెలిసినమ్మ అమావాస్యనాడు చస్తే ఏమీ తెలియనమ్మ ఏకాదశినాడు చచ్చింది.
అన్నీ తెలిసినవాడూ లేడు, ఏమీ తెలియనివాడూ లేడు.
అన్నీ తెలిసినవారికి అమావాస్య మరణం, ఏమీ తెలియని వారికి ఏకాదశి మరణం.
అన్నీ పండించిన రైతుకు (కాపువానికి) అన్నమే (అన్నం) కఱవు.
అనుభవం అన్నిటికంటె ఎక్కువ.
అనుభవమే శాస్త్రం, మాటలే మంత్రాలు.
అనుమానం ప్రాణసంకటం (పాతరోగం) (పెద్దరోగం).
అనుమానం పెనుభూతం.
అనుమానం ముందు పుట్టి ఆడ(దు)ది (ఆయన) తరువాత పుట్టింది (పుట్టాడు).
అనుములు తింటూ మినుములు పెట్టినట్లు.

అనుమూ లేదు, మినుమూ లేదు.

అనువు కానిచోట అధికుల మనరాదు.

అనువు కానిచోట పుండు, అల్లుడు వైద్యుడు చెప్పకుంటే మానం పోతుంది చెప్పకుంటే ప్రాణం పోతుంది.

అనూరాధ కార్తెలో అనాధకఱ్ఱయినా ఈనును.

అనూరాధ కురిస్తే మనోరోగాలు పోవును (పోతవి).

అనూరాధలో అడిగినంత పంట.

అన్నం పున్నం తినడానికి ఆలితమ్ముడు, అబ్బోద్దినం పెట్టడానికి మగని తమ్ముడు.

అపనింద అవతల పోతే (వీధికి పోతే) నిండునింద వచ్చి నెత్తిన పడ్డది.

అప్ప అత్తగారింటికి (వారింటికి) వెళ్ళితే అప్ప ఊరికలు, నా ఊరికలు నావే అన్నదట!

అప్ప ఆరాటమే కాని బావ బతకడు.

అప్ప (ప్పా) చెల్లెలు బ్రతుకు కోరితే తోడికోడలు చావు కోరును.

అప్పటి కోపము అన్యాయ మెఱుగదు.

అప్పటి మాటలకు దుప్పటి ఇచ్చినానుగాని కలకాలం కప్పుకోను ఇచ్చినానా?

అప్పన్న గుళ్ళోన కప్ప లడ్డాయి రారోయి తమ్ముడా! తోలుకొద్దాము.

అప్పని (డి) కాలమునుంచే లేదు ఉప్పేసిన (ఉప్పువేసిన) గంజి.

అప్పను చూడబోతే తెప్పలు పోయినవి (నాయి).

అప్పవంక బావ చుట్టము, ఆళ్ళవంక తిరగలి చుట్టము.

అప్పసిరి చూచుకొని మాచి మణములు తొక్కిందట!

అపాయం ఉపాయంగా (ంతో) (చేత) తప్పించుకోవలె.

అప్పా! పప్పు వండవే, చెడేవాడు బావ ఉన్నాడుకదా?

అప్పిగాడు పోతే ఆపంచా నాకే; పాపిగాడు పోతే పైపంచా నాకే.

అప్పు అదనుకు రాదు.

అప్పు ఆకటికి రాదు (వచ్చునా) ?

అప్పు ఆరు మాడలకన్న (వందలకంటె) రొఖ్ఖం(క్కం) మూడువందలు (రెండువందలు) మేలు.

అప్పు ఇచ్చి చూడు, ఆడపిల్లను ఇచ్చి చూడు.

అప్పు ఇచ్చినవాడు బాగు కోరును, తీసుకున్నవాడు చెడు కోరును.

అప్పు ఇస్తే ఏనుగునైనా కొంటాను (కొంటారు).

అప్పు చేశానుగాని తప్పు చేశానా?

అప్పు చేసి (అప్పుతీసినవాడు) చెడును; చెట్టెక్కి చేయి విడిచినవాడు చెడును.

అప్పు చేసి ఆవును కొనవచ్చునుగాని గేదెను కొనరాదా?

అప్పు చేసినా నిప్పంటి (నిప్పువంటి) సారా తాగాలి.

అప్పు చేసి పప్పుకూడు.

అప్పు చేసి పప్పుభప్పళం.

అప్పు తీసుకున్నప్పుడే చెప్పుచేతలలో ఉండాలి.

అప్పుడు చావకుండా, ఆరు నెలలు బ్రతుకకుండా.

అప్పు తీర్చి అంగట్లో కాపురం చేయాలి.

అప్పు ముప్పు.

అప్పులున్నవాడివెంట (వారితోను) చెప్పులున్న వానివెంట (వారితోను) పోరాదు.

అప్పు లేకపోతే ఉప్పుగంజే మేలు.

అప్పు లేదు, ఆస్తి లేదు.

అప్పులేని గంజి దొప్పెడే చాలు.

అప్పులేని మనిషి, పిప్పిలేని పగడం ఉండునా ?

అప్పు లేనివాడు అధికబలుడు (సంపన్నుడు).

అప్పులవాడు చస్తేనేమి ? పత్రాలు మునిగితే నేమి ?

అప్పులవాడు చెడె; పత్రాలు మాసె.

అప్పుల వాని నమ్ముకొని అంగడి పోరాదు; మిండని నమ్ముకొని జాతర పోరాదు.

అప్పులో అప్పు చెప్పాల; (చెప్పవలె) అప్పు, పేటప్పు ముప్పందు మే కదా!

అప్పు సప్పుచేసి ముచ్చెలుకొంటే అప్పు తీరకమునుపే బొచ్చెలు బొచ్చెలైనాయి!

అబద్ధం అంటే అతుకుల మాట.

అబద్ధమాడినా అతికినట్లుండాలి.

అబద్ధ మాడినా గోడ పెట్టిన ట్లుండవలె.

అబద్ధ మాడినా నమ్మేట ట్లుండవలె.

అబద్ధం చెప్పితే అన్నం పుట్టదు, నిజం చెప్పితే నీళ్ళు పుట్టవు.

అబద్ధపు పెళ్ళికి ముష్టి వాయిద్యం (వాద్యం).

అబద్ధానికి అంతు లేదు, అమ్మగారికి చింత లేదు.

అబద్ధాల అంకయ్యకు (అనంతయ్యకు) అరవై నాలుగు ఆణెప్రమాణాలు.

అబద్ధాలకు అర్థం లేదు.

అబద్ధాలగాడి పెళ్ళి అయ్యేవఱకు నిజమా?

అబద్ధాల నోటికి అరవీసెడు సున్నం కావాలి.

అబద్ధాల పంచాంగానికి అరవై గడియల త్యాజ్యం.

అబద్ధా లాడితే ఆడపిల్లలు పుడుతారు.

అబద్ధాల కాయుధం కన్నీరు.

అబ్బ చస్తే ఆపొత్తు పంచ నాది.

అబ్బలేని బిడ్డ, గట్టులేని చేను.

అబ్బలేని బిడ్డ, మబ్బులేని ఎండ.

అబ్బాయి పోతురాజు, అమ్మాయి గంగానమ్మ.

అబ్బిగాడు చస్తే ఆసంచ నాది.

అబ్బితే సిగ (జుట్టు) అబ్బకపోతే కాళ్ళు.

అబ్బురాన అబ్బాయి పుడితే ఆముదముతో ముడ్డి కడిగించట!

అబ్బురాన అబ్బికి మీసాలు వస్తే అవి ఈచేతా, ఆచేతా సాగదీసేసరికి ఊడిపోయినవట! పట్టిమూతికి ఒకచేయి చాలునని రెండవ దానితో తల గోకుకొన్నాడట!

అబ్బురాన బిడ్డ పుట్టెను, గడ్డపార తేరా చెవులు కుట్టుదాము.

అబ్బురాన బిడ్డ పుడితే గడ్డపారతో ముక్కు కుట్టినట్లు.

అభాగ్యానికి ఆకలెక్కువ; నిర్భాగ్యునకు నిద్ర ఎక్కువ.

అభ్యాసము కూసువిద్య.

అభ్యాసము లేని రెడ్డి అందలం ఎక్కితే అటూఇటూ అయిందట!

అభిమానానికి మంగలి కత్తులు మింగినట్లు.

అభిషేకం చేసిన అగ్నిహోత్రం వలె.

అమరము నెమరుకు వస్తే కావ్యము లేల కాల్చనా?

అమరితే ఆడది, అమరకుంటే గాడిది.

అమరినమ్మ అట్లు పోస్తుంది. అమరనమ్మ పోళెలు (బూరెలు) పోస్తుంది.

అమర్చినదానిలో (దాంట్లో) అత్త వేలు పెట్టిందట!

అమ్మ కూటికి, అయ్య కాటికి.

అమ్మ కడుపున పుట్టినవాళ్ళందరూ నిక్షేపరాయుళ్ళే.

అమ్మ గృహప్రవేశం, అయ్య అగ్నిప్రవేశం.

అమ్మకళ కుమ్మలో తేలుతుంది.

అమ్మ చస్తే చచ్చిందికాని జ్వరం బాగా వదిలింది.

అమ్మకు పుట్టిన ఆనుగునూ గుగ్గిళ్ళ దొంగలే.

అమ్మచెడ్డ చేటుకి ముసుగొకటా ?

అమ్మ తాను పెట్టను, అడుగుకొని తిననివ్వదు.

అమ్మ తా పెట్టా పెట్టను, అడుక్కొని తినానివ్వదు.

అమ్మదగ్గఱ కింద (నేల) పడుకున్నా (తొంగున్నా) ఒకటే, అయ్యదగ్గఱ నేల (కింద) పడుకున్నా (తొంగున్నా) ఒకటే.

అమ్మ దాసర్లకు, అయ్య జంగాలకు.

అమ్మన్న అమ్మకు మొగుడు, తిమ్మన్న (విస్సన్న) తల్లికి మొగుడు.

అమ్మను తిట్టకురా నీయమ్మ ! నాకొడుకా !

అమ్మను తిట్టకురా నీయమ్మ ! నాయాలా !

అమ్మను తిడతావేమిరా లంజకొడుకా !

అమ్మ నేర్చినమ్మ వంత ఓర్వదు.

అమ్మపాలు త్రాగి రొమ్ము గ్రుద్దినట్లు.

అమ్మ పుట్టిల్లు మేనమామ కెఱుక (మేనమామతోనా) ?

అమ్మ పెట్టేవి నాలుగూ పెడితే అప్పుడే చేయడా !

అమ్మపెట్టేవి నాలుగు పెడితేగాని ఆరికలచేట బయటపెట్టదు.

అమ్మపోత్తునా ఆలిపొత్తునా ?

అమ్మబోతే అడవి, కొనబోతే కొరవి.

అమ్మ మంచిదేకాని తెడ్డు మంచిది కాదు.

అమ్మ రాకాసి; ఆలి భూకాసి (?)

అమ్మ లింగాలకు, అయ్య జంగాలకు.

అమావాస్యకు అట్లు, పున్నానికి బూరెలు. (వేయు) (బూరెలా!) (పోలెలు).

అమావాస్యతరువాత పూర్ణిమ రాదా ?

అమావాస్యనాడు అట్లుపెట్టలేదు; పూర్ణిమనాడు బూరె పెట్టలేదు.

అమావాస్యనాడు పొద్దుకు వంగలు కాచునా ?

అమ్మా! అమ్మా! నొప్పు లెత్తుకున్నప్పుడు నన్ను లేపవే! అంటే అలాగే పడుకో బిడ్డా! ఊటగా నొప్పు లెత్తుకుంటే ఊరెల్లా నీవే లేపుతావు అందిట!

అమ్మా! నీఅల్లుడు వచ్చాడంటే, నన్నేమి చేస్తాడమ్మా! నన్ను తీసికెళ్తాడు అన్నట్లు.

అమ్మా! బాబుపిచ్చిగాని నాకు చదువు వస్తుందా?

అమ్మా బువ్వ, అయ్యా బువ్వ.

అమ్మాయి పుట్టింది అంటే ఆయువు సగం కుంగింది (అన్నట).

అమ్మాయిపెళ్ళిలో అబ్బాయి కోపోచ (పోగు).

అమ్మాయి రాకపోయినా ఆవులింతలు రాకపోవునా?

అమ్మి చిన్న, కమ్మి పెద్ద.

అముడు అంటే తెముడు; అత్త అంటే మామ.

అమునువచ్చిన గొఱ్ఱె అగడ్తలో అల్లాడినట్లు.

అయ్య ఆకారనేగాని పోలు నిరాకారము.

అయ్య ఊరోళ్ళపాలు, అమ్మ మాలోళ్ళపాలు.

అయ్య కదుపువలె, అమ్మ కుదుపువలె.

అయ్యకు చెప్పమంటావా? పొయ్యెక్కమంటావా?

అయ్యకు రెండు గుణాలు (గుణములు) తక్కువ; తనకు తోచదు; ఒకరు చెబితే వినడు.

అయ్యకు రెండో పెండ్లి అని సంతోషమేకాని అమ్మకు సవతిపోరు అని ఎఱుగడు.

అయ్యకు వణుకుప్రాయం, అమ్మకు కులుకుప్రాయం.

అయ్యకు విద్య లేదు, అమ్మకు గర్వము లేదు.

అయ్యకు విద్యా లేదు, గర్వమూ లేదు.

అయ్యగారి చేను ఎండితే కమతగాడి మల్ల ఎండునా?

అయ్యగారు ఏం చేస్తున్నారంటే తప్పులు చేసి దిద్దుకుంటున్నారు.
అయ్య తిరుపతి, అమ్మ పరపతి.
అయ్య దాసర్లకు, అమ్మ జంగాలకు.
అయ్య (గారు) (వారు) దేశసంచారం; అమ్మ (గారు) (వారు) గ్రామ సంచారం.
అయ్యనా డెబ్బగనే ఉద్యోల, అమ్మనా డెబ్బగనే ఉద్యోల.
అయ్యనీటు అడుగతీరదు. అమ్మ దమ్మాయపాలెంలో పంచుకొని త్రాగుతున్నది.
అయ్యలకూ మియ్యలకూ అప్పు పెట్టరాదు.
అయ్యలో ప్రాణం కొయ్యలోకి వచ్చినట్లు.
అయ్య వాత పెట్టను జట్టి బ్రతకనా ?
అయ్య వారయ్యవా రంతంత, అయ్యవారి పెండ్లాం ముంతంత; ముంత తీసుకొనిపోయి మూలలో పెడితే నక్క ఎత్తుకొనిపోయె నారాయణా !
అయ్యవారయ్యవా రటకంత, అయ్యవారిపెండ్లాం పుటికంత.
అయ్యవార్లంగారి గుఱ్ఱం ఎనుబోతపే ! (ఎను బోతే అపే)
అయ్యవారిగుఱ్ఱాని కన్నీ అవలక్షణాలే !
అయ్యవారి జందెం (జంధ్యాలు) అయ్యవారికే ముప్పు.
అయ్యవారిని చేయబోతే కోతిపిల్ల అయినట్లు.
అయ్యవారు తప్పులు చేసి దిద్దుకుంటూఉంటే అమ్మగారికి పారబోయనూ ఎత్తనూ, ఎత్తనూ పారబోయనూ.
అయ్యవారు రాకపోతే అమావాస్య ఆగ్టే ఉంటుందా (నిలుస్తుందా) ?
అయ్యవా రేమి జేస్తున్నా రంటే అబద్ధాలు వ్రాసి దిద్దుకుంటున్నారు.
అయ్య సవాసేరు – లింగ మరవీశెడు.
అయ్య సేరు, లింగం సవాసేరు.

అయ్యసామొల్ల ఇంటనే (ఇంట్లోనే).
అయ్యా రాబోసేతు, వస్తాబో సింగామా!
అయిందిరా పెండ్లి అంటే అణిగింది (దమ్మా) రా గంధి.
అయితంపూడిఉద్యోగం అయితే గియితే అయిదువరాలే!
అయితంపూడిఉద్యోగం అయితే గియితే, ఆరావులపాడి చేస్తే గీస్తే
పెరుగు, పాలు మావారికి పోస్తావా? మావారికి పోస్తావా?
అయితే అతడిత లాయె, కాకపోతే దాసురా లాయె.
అయితే అమావాస్య, కాకుంటే పున్నము.
అయితే అవతలి ఒడ్డు, కాకపోతే ఇవతలి ఒడ్డు.
అయితే ఆడుబిడ్డ, లేకుంటే మగబిడ్డ, అదీ ఇదీ తప్పితే అంతా అబద్ధం.
అయితే ఆతుకూరు, లేకపోతే గణాతుకూరు.
అయితే ఆదివారం, కాకుంటే సోమవారం.
అయితే ఆముదాలు, కాకపోతే కంది.
అయితే ఆరిక, కాకుంటే కంది.
అయితే గియితే అయితంపూడిఉద్యోగం.
అయితే సవాబు, కాకుంటే ఫకీరు (కవాబ్).
అయిదునాళ్ళు పైచాలే తోలినట్లు.
అయిదవతనం లేని అందం అడుక్కుతిననా?
అయిదుశిఖ లున్నా ఇబ్బంది లేదుకాని, మూడుకొప్పులు చేరాయంటే
ముదనష్టమే.
అయిదుసాళ్లు గొఱ్ఱెలమందలు కట్టడం, తైనెలలో దున్నడం ఒకటే.
అయిదేళ్ళ ఆడపిల్లఅయినా మూడేళ్ళ మొగపిల్లవాడికి లోకువే.
అయినకాడికి జమాబంది.
అయినచోట అప్పు పెట్టరాదు.
అయిన దాకులలోను, కానిది కంచాలలోను.

అయిన (అయిపోయిన) పెళ్ళికి మేళము (బాజా) ఎందుకు ?
అయినవాడిని ఆశ్రయించేకంటే కానివాడికాళ్లు పట్టడం మేలు.
అయినవాడు కాలు దువ్వితే కానివాడు మీదికి వస్తాడు.
అయినవారందఱు ఆదోవను పోగా జంగాన్ని పట్టుకొని జాను
ఏడ్చినట్లు.
అయినవారికి (వాళ్లకు) ఆకులలోను, కానివారికి(వాళ్లకు)కంచాలలోను.
అయినాతిది లేదుగాను అందఱాడే!
అయినాతిది లేకుంటే (లేదుగాని) అహంకార మెక్కువ.
అయిపోయిన పెండ్లికి 'భూషణగుళ్ల మేళం!' (రాకట్ల మేళమేల)
అయిపరబొజ్జా! తోపతోప!
ఆయుష్యం గట్టిగా ఉంటే, అడవిలోఉన్నా అయోధ్యలోఉన్నా ఒకటే.
అయ్యేపూజ అవుతూఉండనీ, ఊదేశంఖం ఊదేద్దాం.
అయ్యేదాక అరిసెలపాకం - అయినతరువాత బూరెలపాకం.
అయ్యేది లేదు, పొయ్యేది లేదు, వీరభద్రప్పా నాఎనిమిదణాలు నా
కిచ్చి, నీఅర్ధరూపాయి (రెండు పావలాలు) నీవు తీసుకో.
అయ్యేపని అరక్షత్తు, కానిపనికి కుమ్మక్కు.
అయ్యేకాలానికి ఔతుంది, పోయేకాలానికి పోతుంది.
అయ్యేవఱకు ఉండి ఆరేవఱకు ఉండనట్లు.
అయ్యో! అంటే ఆరునెలలుపాపం (వెనుక) వస్తుంది (న్నది).
అయ్యో! పాప మంటే ఆరునెలలకర్మ వెనుక వస్తుంది.
అయ్యో వదినా! అంతకుముందు వచ్చిన అన్నబంతిని తిందువు.
ఇంతకుముందు వచ్చిన ఏరాలిబంతిన తిందువు. ఇప్పు డెలాగు?
ఎలుక పొయ్యి ఎత్తుకపోయిందే!
అలక అరిగితే (గిన) గరిసె విరుగును (విరుగుతుంది).
అరకాసుపనికి ముప్పాతిక బాడుగ.

అరగడియ భోగం, ఆరునెలల రోగం.

అరగని కూడు, జరగని మాట.

అరకాలిలో కన్ను విచ్చినట్లు.

అరచే కుక్క కఱవదు (కఱవనేరదు).

అరచే కుక్కకు కడి అడ్డము.

అరచే కుక్క వేటకు పనికిరాదు.

అరచేత వెన్న పెట్టుకొని నేతికి ఏడ్చినట్లు.

అరచేతికి పండ్లు వచ్చినట్లు.

అరచేతి పుండుకు అద్ద మెందుకు?

అరచేతి రేగుబంటికి అద్దము కావలెనా?

అరచేతిలో ఉప్పు పెట్టితే (పెడితే) ఆరునెలలు తలచుకోవలెను.

అరచేతిలో ఉసిరికకాయవలె.

అరచేతిలో తేనె పోసి మోచేతివఱకు నాకించినట్లు.

అరచేతిలో బెల్లం పెట్టి మోచేతివఱకు నాకించినట్లు.

అరచేతిలో వైకుంఠం చూపినట్లు.

అరటాకుమీద ముల్లు పడ్డా, ముల్లు (ముంటి) మీద అరటాకు పడ్డా అరటాకుకే ముప్పు.

అరచేయి చూపి అవలక్షణ మనిపించుకున్నట్లు.

అరటికాయ ఆరునెలలరోగం.

అరచేవి నేకఅరపులు, దూసేవి కోరిందపొదలు.

అరటికాయలు కోసి అరటిపండ్లలోనే కట్టినట్లు.

అరటికి ఆరు గొప్పులు, నూరు తడుపులు.

అరటిచెట్లు రెండుసార్లు కాయవు.

అరటిపండ్లన్నీ దొరక లేదని నాలుక కోసుకొన్నట్లు.

అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు.

అరటికట్లు జ్ఞాతిగుట్లు వదలవు.

అరటిపండ్లు తినే బికారీ! తోళ్ళెక్కడ పెట్టావో.

అరణాంకంటె మరణమే మగవానికి శరణం.

అరమనిషిసత్తువ ఆగ్గరి ఆక్రోశము.

అరపుల గొడ్డు పితుకునా?

అరవైఆరు పిండివంటలు ఆవుచంటిలో ('నే) ఉన్నవి ( న్నాయి ).

అరవైఆరు కూరగాయలు, అంచుకు మిరియపుపొడి.

అరవం అధ్వాన్నం, తెనుగు తేట, కన్నడం కస్తూరి.

అరవ అత్తగారు, ప్రథమశాఖ మామగారు.

అరవైఊళ్ళకు అమలుదారు ఆలికి దాసుడు.

అరవైఏండ్ల అడ్డగోడ పట్టుకొని నడిస్తే అమ్మా, అబ్బకు ఆశ్చర్య
మైందట !

అరవైఏండ్లకయినా అవుజున్ను తినాలి.

అరవైఏండ్లకు అగ్గిగండం అన్నట్లు.

అరవైఏండ్లు నిండినవాణ్ణి ఆలోచన అడక్కు, ఇరవైఏండ్లు నిండనివానికి
పెత్తన మీయకు.

అరవైఏం డ్లైతే అస్లు మస్లు.

అరవైఏం డ్లైతే అస్తాబిస్తం (అస్తవ్యస్తం).

అరవైఏండ్లైనతరువాత అమ్మా అన్నట్లు.

అరవైఏళ్ళ అన్నంభట్లు అద్దం చూచి బిద్దంబిద్దం అంటే అదీ పాళ్ళమ్మకు
ఆశ్చర్యం వేసింది.

అరవైఏళ్ళయినవి చదువుకోక మట్టి కొట్టుకుంటూనా ?

అరవైఏళ్ళయినవి చదువుకోకుండా మొత్తుకుంచానా ?

అరవైఏళ్ళు వచ్చిన తరువాత అన్నంభట్లు అటక ఎక్కాడట !

అరవైవరహాలు ఇచ్చినా అత్తవంటి బానిస దొరకదు.

ఆరసుణ్ణి నమ్ముకొని పురుషుణ్ణి పోగొట్టుకొన్నట్లు.

అరసుని అంకె లేదు, దేవుని కాటము లేదు.

అర్థంకాని మాట అల్లిబిల్లి మాట.

అర్థం, ప్రాణం ఆచార్యాధీనం, తాళము దేహము, నా అధీనం.

అర్థం లేని చదువు వ్యర్థం.

అర్థం లేనివాడు వ్యర్థుడు.

అర్థబలముకంటె అంగబల మెక్కువ.

అర్థబలమైనా ఉండాలి, అంగబలమైనా ఉండాలి.

అర్ధరాత్రికాడ (వేళ) అంకమ్మ సివాలు.

అర్ధరాత్రి వేళ మద్దెల దరువు.

అర్ధశేరు బియ్యము తింటావురా అంటే మూడు మెతుకులు విడిచి పెడ తానన్నాడట !

అర్ధశేరుమీద పెద్దచేరెడు; మళ్ళీగిన్నె, మళ్ళీగిన్నె.

అర్ధరూపాయి పెండ్లి, అరమణుగో బిరుసుబాణాలు !

అర్ధరూపాయి మెట్టెలు, ఆరుపగడాల పుస్తె.

అర్ధాంగి అలుక, బోనులో ఎలుక.

అరికాలిముల్లు, సరిలేని గొల్లు.

అరిగినకంచు, మురిగినచారు.

అరిటి దుఃఖం ఆరునెలలు, కడుపుదుఃఖం కలకాలం.

అరిష్టానికి అంగారకుడు, పాపాలకు భైరవుడు.

అరిసె ఆరునెలలరోగం బయట వేస్తుంది.

అరిసె గారె వెయ్యగలడు.

అర్జీలకు పనులు, ఆశీర్వచనాలకు పిల్లలు (బిడ్డలు) అయ్యేది లేదు.

అరుంధతీ కనపడదు, అర్ధాన్నము కనపడదు, అన్నవస్త్రాలు అన్నా మాత్రం కనబడుతున్నది.

అరుంధతీ గిరుంధతీ కనపడటంలేదుకాని, ఆరువందలఅప్పుమాత్రం కనపడుతున్నది.

అరువులంటే ఆరుఏనుగులు కట్టివేయుమన్నట్లు.

అరువు ఎరుగని జోగికి మందులసంచి ఎందుకు?

అర్జున భర్జున పడెరా పిడుగు.

అట్టున్నమనిషీ, బొట్టున్న చెట్టూ ఒకటే.

అర్లుగొడ్డు పితుకునా?

అరే గడ్డితినే కోమటీ! అంటే ఏమోయి బెల్లం తినే సాయబూ అన్నాడట! అట్లా అంటి వేమిటి కోమటీ అంటే అతని కది వాడుక, నా కిది వాడుక అన్నాడట!

అలకపాన్పుమీద అల్లు డలిగితే అత్త కంగారుపడ్డట్లు.

అలలు నిలిచే దెప్పుడు? స్నానం చేసే దెప్పుడు?

అలవాటులేని ఔపోసనము చేస్తే మూతిమీసాలు తెగకాలినవి.

అలవిమీరితే అమృతమైనా విషమే.

అలవికాని ఆలిని కట్టుకొని మురిగి (మూల్గి) చచ్చేరా ముండాకొడుకు.

అలకాపురం కొల్లగొట్టినా అదృష్టహీనున కేమీ దక్కదు.

అలసిసొలసి అక్కఇంటికి పోతే అక్క కొండ బోయి బావపక్కలో పండపెట్టెనట!

అలసిసొలసి అక్కదగ్గరకు పోతే అక్క ఎత్తుకపోయి బావపక్కన వేసిందట!

అల్పవిద్వాంసుడు ఆక్షేపణకు పెద్ద.

అల్లముతిన్న కాకివలె!

అల్లము బెల్లమువలె చల్లగా ఉంది.

అల్లరిలేని కాపురం చిల్లిగవ్వకుకూడా గాదు.

అల్లి అడిగినది, ఇల్లి ఇచ్చినది, మల్లి మాయం చేసినది.

అలిగి అత్తగారింటికి (వారింటికి), చెడి చెల్లెలింటికి పోరాదు.
అలికినఇంట ఒలికినా అందమే.
అలికి ముగ్గువేయకున్న అరిష్టం.
అలిగి తంతే పోయి పరుపుమీద పడ్డట్టు.
అలిగి నలుగురిలో కూర్చుంటే అలక తీర్చేఅయ్య ఎవరు?
అలిగి అల్లుడు చెడ్డాడట! కుడువక కూతురు చెడ్డదట!
అల్లికాయల సందటిని పెళ్ళి మరచిపోయినట్లు.
అలువాలకు దో వెక్కడ (త్రో వెక్కడ) అంటే, ఉలవలకు దున్నుతున్నాను అన్నాడట!
అలువుడిని బలువుడు కొడితే (కొట్టితే) బలువుడిని బ్రహ్మదేవుడు కొట్టును.
అల్పుడికి అధికారమిస్తే (ఐశ్వర్యమువస్తే) అర్ధరాత్రి గొడుగు పట్టమన్నాడట (తెమ్మన్నాడట)!
అల్లుడా! ఎప్పుడు వచ్చావంటే రాత్రి వండిన గారెలు చెప్పనా అన్నాడట!
అల్లుడని పుల్ల విటిచివేస్తే అది ఎగురుతుంది (ను).
అల్లుడు అంటే వంకరతాడే లేచి నుంచుంటుంది.
అల్లుడు అలిగితే కూతురుని తీసుకపోతాడు.
అల్లుడు చుట్టము గాదు, ఆముదపుచెట్టు నీడ కాదు.
అల్లుడికి నెయ్యి లేదు, అల్లునివెంట వచ్చినవానికి నూనె లేదు.
అల్లుడికి పెట్టినపెట్టు కొడుక్కు పెట్టి కోలుపోయిందట!
అల్లునికి బెల్లు, ఇల్లాలికి గుల్లు.
అల్లుడికి వండిన వంట కొడుక్కు పెట్టి కొట్టుకొన్నదట (కోలుపోయిందట)!
అల్లుడే అపనింద్యం.

అల్లునికి ఆరేళ్ళు, ఆరేండ్ల బిడ్డకు పన్నెండేండ్లు.

అల్లునికి అత్తాశ, బాపనికి పప్పాశ.

అల్లుని గుడ్డి తెల్లారినాక తెలుస్తుంది.

అల్లునితో భోజనము, కొడుకుతో చదువు.

అల్లునిపాయసము అతిథికి ఉపయోగపడినట్లు.

అల్లుని మంచితనము లేదు.

అల్లునివెంట గిల్లుడు.

అల్లులలో మల్లు పెద్ద.

అవతలవీధిలో అల్లరి ఏమిటి అంటే, అరవల ఏకాంతం అన్నట్లు.

అవలక్షణవంతుడికి (అవలక్షణాపుటల్లుడికి) అక్షత లిస్తే (లివ్వగా) అవతల కెళ్ళి నోట్లో (నోట) వేసుకొన్నాడట !

అవవలసింది అయింది ఆడెమ్మా! అంటే కోక సర్దుకోవే గుబ్బాలమ్మా అన్నదట !

అవసరగాడికి ఆకులో పెడితే నాకు బోకి (నేల) లో పెట్టుమన్నట్లు.

అవ్వ అరకాసు, తలగొరుగు మూడుకాసులు.

అవ్వకు మనుమడు ఆవులింత నేర్పినట్లు.

అవ్వ చుట్టము, గూద పగ.

అవ్వను బట్టి వసంతా లాడినట్లు.

అవ్వ నూరిన (తీసిన) గంధం తాతబుడ్డకు సరి.

అవ్వపేరే ముసలమ్మ.

అవ్వ వడికిన నూలు తాతమొల్త్రాటికి సరి.

అవ్వా కావాలి, బువ్వా కావాలి.

అవ్వా గుజ్జిము ఒకటి అయినట్లు.

అవివేకితో స్నేహంకన్నా వివేకితో విరోధం మేలు.

అశ్రద్ధపితాళ్ళకు ఆకతాయి తోరణాలు.

అశ్రద్ధపితాళ్ళకు ఏతాంతర్పణం.

అశ్వత్థప్రదక్షిణం చేసి కడుపు పట్టిచూచుకొన్నట్లు.

అశ్వత్థప్రదక్షిణం చేసి బొడ్డులో వేలు పెట్టుకొన్నట్లు.

అశ్వమేధయాగమైనా చేయవచ్చు (గాని) ఆడపిల్లపెళ్ళి చేయలేము.

అశ్విని కురిస్తే అంతా నష్టం.

అశ్విని కురిస్తే అడుగు తడవదు.

అశ్విని కురిస్తే ఒక అడవిలోకి చాలదు.

అశ్విని కురిస్తే ఆరుకార్తెలు విడుపు.

అశుద్ధముమీద రాయి వేస్తే ముఖమంతా చిందుతుంది.

అశోకునిరాజ్యంలో పశువైతే నేమి?

అక్షైనా గోదానం, ఇక్షైనా గోదానం.

అష్టభాగ్యాలు అక్క కుడిస్తే అంబటితో రకాలు కావకు.

అష్టభాగ్యమున్నా అత్తగారిల్లే, పురిటికూర తిన్నా పుట్టినిల్లే.

అష్టమినవములు కష్టపుదినములు (రోజులు).

అసలిది లేకపోతే అహంకార మెక్కువ.

అసలుకంటె వడ్డీ ముద్దు.

అసలుకు గతి లేదు కొసరు.

అసలుకు మోసము, వడ్డీకి కాసులు.

అసలుదేవుడు మూలను బడితే హనుమంతరాయుడికి తెప్పతిరునాళ్ళట!

అసలు పిస లాయె, గొంగడి లాభ మాయె.

అసలు లేదు శ్రీరామా! అంటే మొలతాడులేని గోచి అన్నట్లు.

అసలు మూడుపాళ్ళు, వడ్డీ ఆరుపాళ్ళు.

అసలు సోమిదేవమ్మ, అందులో వేవిళ్ళు.

అసలులేనిదానికన్న పెసరపుడక నయం.

అసలే కోతి, అందులో కల్లు తాగింది, పైన తేలు కుట్టింది.
అసలే అయోమయం, అందుకుతోడు అంధకారం.
అసిమిలో దాకటి, అమ్మె ధాకటి.
అస్తి లేదు, గస్తి లేదు, చచ్చినట్లు తొంగోసి!
అసూయ అనే అంధకారంలో అంతా నలుపే!
అసూయ ముందు, ఆడది వెనుక.
అహంకారానికి ఉదాసీనమే మందు.

— : : —

# ఆ

'ఆ' అంటే అలసిపోతుంది, 'ఊ' అంటే ఊపిరి పోతుంది.

'ఆఁ' అంటే అపరాధము, 'ఊఁ' అంటే అపరాధము, 'నారాయణా' అంటే బూతుమాట!

'ఆఁ' అంటే ఆనుమానాలు.

ఆఇంట తిని ఆఇంటివాసాలు లెక్కపెట్టినట్లు.

ఆఇంటికి దడి లేదు, ఈఇంటికి గడి (గడియ) లేదు.

ఆఇంటికి తలుపు లేదు, ఈఇంటికి ద్వారబంధము లేదు.

ఆఇంట్లో తారాడే గాలివితంతువు మీభార్యా? మీఅన్న భార్యా?

ఆఊరికి ఈఊరు ఎంత దూరమో ఈఊరికి ఆఊరు అంతేదూరము.

ఆఊరిదొర ఈఊరికి తలారి.

ఆఎద్దు మంచి దయితే ఆఊళ్ళోనే అమ్ముడుబోతుంది.

ఆకంపా ఈకంపా ఒకతోడుగు.

ఆకలిఅయిన కోమటి పాతలెక్కలు చూచినట్లు.

ఆకలిఅయినవాడు ధర చెడకొడతాడు (చెడగొట్టును).

ఆకలి ఆకాశమంత, (గొంతు) నోరు, సూదిబెజ్జమంత!

ఆకలి ఎక్కువ, పీక సన్నము.

ఆకలి ఎత్తుతు (ను) న్నది అత్తగారూ! అంటే రోకలి మింగితే పోతుంది అన్నదట!

ఆకలి కాకుండా నీకు ఔషధ మిస్తాను, నీఇంట్లో చద్ది నాకు ముందు పెట్టు అన్నట్లు.

ఆకలికాని భోజనము, ఆలిమీద (ద) లంజరికము.

ఆకలిగొన్న కరణము పాతకవిలె తీసినా (శా) డట!

ఆకలిగొన్నవాడు (గొన్నమ్మ) ఎంగిలికి ఏవగించడు (రోయడు).

ఆకలిగొన్నవానికి అనుష్టుప్శ్లోకాలతో కడుపు నిండునా?

ఆకలి రుచి ఎఱుగదు, నిద్ర సుఖ మెఱుగదు.
ఆకలి రుచి ఎఱుగదు, వలపు సి గ్గెఱుగదు.
ఆకలి లేదంటే ఆముదము పుచ్చుకోవలసిందే!
ఆకాయ ఆవకాయ, ఊకాయ ఊరగాయ (అన్నదట).
ఆకారం ఉంటే (శ్రీ)కారం ఉండదు.
ఆకారం పుష్టి, నైవేద్యం నష్టి.
ఆకాశమంత ఆకలి, సూదిబెజ్జమంత నోరు!
ఆకాశముకంటె ఎత్తు లేదు, భూమికంటె వెడల్పు లేదు.
ఆకాశము గద్ద తన్నుకపోయినది అన్నట్లు.
ఆకాశము చూసేందుకు (చూచుటకు) నూకునుగ్గిళ్ళా!
ఆకాశములో గొజ్జెత్రొక్కుడు పడితే అతిసమీపంలో వర్షం.
ఆకాశానపట్టే గ్రహణం అంతా చూచేదే!
ఆకాశానికి నక్షత్రాలు ఎవడు (ను) తగిలించాడు? (చాను)?
ఆకాశానికి నిచ్చెన వేసినట్లు!
ఆకాశానికి నేలకూ ముడి వేసినట్లు.
ఆకాశానికి మెట్లు కట్టినట్లు.
ఆకాశానికి వెంట్రుకకు ముడి వేసినట్లు.
ఆకాస్తా ఉంటే ఆలిసే కట్టుకోనా?
ఆకు ఇస్తే అన్నము (ం) పెట్టినంత పుణ్యము (ం).
ఆకుచుట్టని ఆడదాన్ని నమ్మరాదు.
ఆకు నీదే, పొగాకు నీదే, పటేలా! ఇంగలం కొట్టుకో!
ఆకు పోయి నూత బడితే, వెతుకబోయి ఏడుగురు పడ్డారట!
ఆకుల ఎఱువుకు ఆకాశమంత రాశి.
ఆకులు ఎత్తరా అంటే భోజనం చేసినవా రెందరు అన్నట్టు.
ఆకులు నాకేవారింటికి మూతులు నాకేవాళ్ళు వచ్చినట్లు.

ఆకుసత్తున ఉంటే అడుగు పండుతుంది.

ఆకొన్న సింహానికి ఏనుగు దొరికినట్లు.

ఆగడపలు వేసినవి అత్తా అంటే అట్లకి(కు) బియ్యం నానబొయ్యి కోడలా! అన్నదట!

ఆగడపలు వేసినవి అత్తగారు **అంటే**, కొలబుఱ్ఱ నాచేతిలోనే ఉన్నది కోడలా! అన్నదట!

ఆగడపలు వేసినవి అత్తా అంటే, చేరెడు వెనక్కు కోడలా **అన్నదట**!

ఆగడపలు వేస్తే అవస్యం కుదుస్తుంది.

ఆగడప వేసింది అత్తమ్మనంతే కోడలమ్మా!

ఆగభోగాలు అక్క కుడిస్తే, అంబటిపరకలు బావ కుడిచినాడు.

ఆగభోగాలు అంకమ్మవి, పాలికేకలు పోతురాజువి.

ఆగభోగాలు అంకమ్మసివాలు.

ఆగానికి భోగమే సాక్షి.

ఆగుటకా పోయె అనంతప్పా!

ఆగొడ్డు మంచి దయితే ఆఊళ్ళోనే అమ్ముడుపోతుంది (పోయేది).

ఆగ్రహాన ఆన పెట్టుకొన్నట్లు.

ఆచారపు అచ్చమ్మలు, చేదస్తపు చెల్లమ్మలు.

ఆచారము (ం) అదరిపడ్డది, ధూపాత్రి త్రుళ్ళిపడ్డది, కొత్తకుండ తేరా నెత్తొళ్ళు వండుకుందాం.

ఆచారము (ం) ఆచారము (ం) అన్నంభట్లు (బొట్లు) అంటే పెద్ద చెఱువు కుక్క ముట్టుకొన్నది అన్నట్లు.

ఆచారము (ం) ఆరు బారలు, గోచి మూడు బారలు.

ఆచారము చెప్పిన పెద్దమనిషి ఆకుంటికే!

ఆచారము (ం) ముందర, అనాచారము వెనుక!

ఆచారానికి అంతం లేదు, అనాచారానికి ఆది లేదు.

ఆచార్యునికి ద్రోహం చేసినా, ఆత్మకు ద్రోహం చేయరాదు.

ఆచార్యుని తలచి నిప్పులో చెయ్యి పెట్టితే కాలదా ?

ఆటలోపలి అరటిపండు, గోడపై రుద్రాక్షపిల్లి.

ఆటా తీరె, పాటా తీరె, కోటలో రామరాజ్యం !

ఆడంగులలో పెదబావగారు !

ఆడ ఇంత, ఈడ ఇంత ఉంటే, నాకు మించినవాళ్లు లేరు.

ఆడకాడక సమర్తాడితే చాకలోడు కోక నడిగెనంట !

ఆడ గానక పాతగజ్జెలు.

ఆడ (డు) కోడి అరిస్తే అడుగంటడనే ఇల్లు.

ఆడ (డు) చెత్త, మగ బంగారం.

ఆడ (డు) దానికి అలు సీయరాదు.

ఆడ (డు) దానికి మగవాడున్నా, అప్పులవాడికి సాహుకారున్నా మొగుళ్లు.

ఆడ (డు) దానిచేతి అర్థము, మగవాడిచేతి బిడ్డ బ్రతుకదు.

ఆడ (డు) దాని నోటిలో నువ్వుగింజ నానదు.

ఆడ (డు) దాని బ్రతుకు అరటాకువంటిది.

ఆడ (డు) దాని బుద్ధి అపరబుద్ధి.

ఆడ (డు) దానిమాట ఆపదలకు మూలం.

ఆడ (డు) దానిమాట నీళ్ళమూట.

ఆడ (డు) దాన్ని చూచినా, అర్థాన్ని చూచినా బ్రహ్మకైనా పుట్టు తిమ్మతెగులు.

ఆడ (డు) దాన్ని నోరు పెట్టుకొని బ్రతుకుమన్నారు (డు).

ఆడ (డు) ది చూచిన చేపలగుంటకు, మగవాడు చూచిన కొండల కళ్యానికి పోరాదు.

ఆడ (డు) ది తిరిగి చెడును, మగవాడు తిరగక చెడును.

ఆడ ( డు ) నీతి తప్పినతరువాత అంతేమిటి? ఇంతేమిటి?

ఆడ (డు) దానికి పురిటిపురిటికీ, (పెట్టి) గండం, మగవాడికి రోజు రోజుకీ గండం.

ఆడ (డు) ది బొంకిన గోడ కట్టినట్లు, మొగవాడు (మగవాడు) బొంకిన దడి కట్టినట్లు.

ఆడ (డు) ది మెచ్చిందే అందం.

ఆడ (డు) ది లేనిది అడవి, మగవాడు లేనిది మఠము.

ఆడ (డు) దై పుట్టేకంటె (ఆడజన్మ ఎత్తేకంటె) అడవిలో మానై పుట్టేది మేలు.

ఆడ (డు) దే అమృతం, ఆడ (డు) దే హాలాహలం.

ఆడ (డు) పడుచు ఉసూరు మంటే ఆయుతరాలు పోదు (అరిష్టం).

ఆడ (డు) పడుచుకొరతా, అడ్డగోడకొరతా తీరదు.

ఆడ, పాడ సంచున మద్దెలా?

ఆడ (డు) పిల్ల ఆశ మూలవాసం గుంజుకుపోయేవఱకు తెల్లవారదు.

ఆడ(డు) పిల్లలు కన్నవాడు ఐనుబినుములు తెగకోసుకోవలెను.

ఆడ (డు) పిల్ల పెళ్ళి, అడుగు దొరకని బావి అంతం చూసేవే!

ఆడ (డు) పిల్ల పుట్టినప్పుడే ఆదనువు పుడుతుంది.

ఆడ (డు) పెత్తనం, తంబళిదొరతనం.

ఆడ (డు) పెత్తనం, పంబలదనువు.

ఆడ (డు) పెత్తనం, బోడిదొరతనం.

ఆడ (డు) పెత్తనం మంగలిదొరతనం.

ఆడ (డు) పెత్తనం, మంగలిబాజా.

ఆడ (డు) పెత్తనం, మాలబాగోతం.

ఆడ (డు) బిడ్డ అర్థమొగుడు.

ఆడ (డు) బిడ్డమ్మా! అంత్రపిశాచమ్మా! వండే ఇంటిలోనికి తీసికెళ్ళి మండే కొఱకంచు పెట్టు.

12/34

ఆడబోతే చూడబుద్ధి, చూడబోతే ఆడబుద్ధి.

ఆడ బోయిన తీర్థ మెదు రైనట్లు (ఎదురుగా వచ్చింది).

ఆడరాక (నేరక) అంగణం (ముంగిలి) వంకర అన్నట్లు.

ఆడలేక (నేరక) (ఆడలేనమ్మ) మద్దెల ఓ డన్నట్లు.

ఆడలేక (నేరక) మద్దెలవానిపై గోడు పోసుకొన్నట్లు.

ఆడ (దు) వారికి ఆవకాయ, మగవారికి బోడిటెంకలు.

ఆడ (దు) శోకం మగరాగం ఒకటే.

ఆడా, పాడా, మద్దెల గొట్టా, మంగలిబజాములో అడుక్కు తినా.

ఆడి తప్పరాదు, పలికి బొంకరాదు.

ఆడినది ఆట, పాడినది పాట.

ఆడినోడు (ఆడినవాడు) అబద్ధ మాడితే, కూడినోడు (కూడినవాడు!) కుడువవలసినదే.

ఆడినెలలో ఆకులు రాలినట్లు.

ఆడే కాలు, పాడే నోరు ఊరకుండవు.

ఆడేది అడ్డనామాలు తీసుకుంటే, పాడేది పంగనామాలు తీసుకొన్నదట.

ఆణిముత్యము మసిబొగ్గు అయినట్లు.

ఆతండ్రికి కొడుకు కాడా ?

ఆత్మకు ద్రోహం చేస్తే అప్పుడే అడుగుతుంది.

ఆత్మసంతోషానికి రోకటిబండ తంబురా.

ఆత్మస్తుతి, పరనింద, అర్థాపేక్ష లేని మహానుభావుడికి నాకు దెబ్బ, శుద్ధశుంఠకు వాడికీ డబ్బా !

ఆత్రగానికి బుద్ధి (తెలివి) మట్టు.

ఆత్రగానికి ఆకులో పెడితే నాకు బోకిలో పెట్ట మన్నట్లు.

ఆ తానులోదే ఈముక్క (పేలిక).

ఆత్మా! రావే నూతను పడుదాము, అంటే ఆదివార పండగపూటా పడదాము అన్నదట!

ఆత్రానికి ఆడపిల్ల పుట్టిందట !

ఆత్రానికి భోగోణిలోకూడా చేయి పట్టదు.

ఆతుష్టికీ, ఈసష్టికీ సరి.

ఆదర్శాలు శిఖర మెక్కి కూర్చుంటే, అవసరాలు అగాధంలోనికి ఈడుస్తాయి.

ఆదాయంకొద్దీ ఖర్చు.

ఆదాయం లేనిదే (లేకనే) సెట్టి వరద బోడు.

ఆదివారం (నాడు) అందలం, సోమవారం (నాడు) జోలె.

ఆదివారం అందల మెక్కనూ లేదు, సోమవారం జోలె ఎత్తనూ (కట్టనూ) లేదు.

ఆనందమహారాజును ఎఱిగినవాడికి అగ్రహారం ఉండబోదు.

ఆనవాలు లేనిది అద్దం మానుషంటే బహుముఖ మయింది.

ఆనామికి ఆడివాలుదానికి, ఆగడ మున్న సాగదు.

ఆపదుగులోదే ఈపేక.

ఆపద మ్రొక్కులు, సంపద మఱపులు.

ఆపదకు పాపం లేదు.

ఆపదలో అడ్డుపడేవాడే చుట్టము.

ఆపదలో ఆదుకోవాలి, ఆస్తిలో భాగం పంచుకోవాలి.

ఆపప్పు ఈవేళ ఉడుకదు.

ఆపస్తంబులా ఆశ్వలాయనులా అంటే, ఆపస్తంబులమూ కాము, ఆశ్వలాయనులమూ కాము, అప్పారావుగారి హర్కారాలము అన్నారట !

ఆపాటిమగడవా చెవులు (లో) తడవేవు ?

ఆపాటిమొగానికి అర్ధసేరు పసవు, రోజూ ఒకసారి దిగదుడుపు.

ఆపులేని పెండ్లానికి ఓపలేని మొగుడు.

ఆబోతుతో దుక్కిటెద్దు పోలునా ?

ఆమంట ఈమంట బ్రాహ్మణార్థం కడుపుమంట.

ఆమందలో దాగదా ఆగొఱ్ఱె ?

ఆమడ నడచినా ఆరికకూడు తప్పలే (దు).

ఆమడలు దూరమైతే అంతఃకరణాలు దూరమా ?

ఆమాటకూ, ఈమాటకూ పెద్దకోడలు, ఆచేతిపెట్టుకూ, ఈచేతిపెట్టుకూ అడ్డగోడ.

ఆమాటా (నారాయణ) అనిపింతామా మామగారూ ?

ఆముఖానికేనా (కేల) అర్ధసేరుపసపు ?

ఆముదపుచేటుకాని బిడ్డ బ్రతకదు.

ఆముదపువిత్తులు ఆణిముత్యాలగునా ?

ఆముదము కొలిచే తవ్వ ఎప్పుడూ జిడ్డే.

ఆముదముతో ముడ్డి కడుగుకొన్నట్లు.

ఆముదములో (అద్దిన) ముంచిన ఏకువలె.

ఆముదాల బేరం కామెర్లరోగం నమ్మరాదు.

ఆమెఅట్టుకు తూట్లున్నవి, ఈమెఅట్టుకు తూట్లు లేవా ?

ఆమెపేరు కుంతలమ్మ, చూడబోతే బట్టతల.

ఆయమ పెట్టినది అరచేతిగుంతెడు, గోకి నోటలో వేసుకోరా గోవిందుగా !

ఆయాసం ఒకరిది, అనుభవం ఒకరిది.

ఆయెనమ్మా! పెండ్లి, అవిసెనమ్మా కన్ను.

ఆయం తప్పితే గాయమంత సుఖం లేదు.

ఆయన ఉంటే మంగలినైనా పిలుచుకొచ్చేవాడుకదా ?

ఆయన ఉంటే విస్తరిఅయినా కుట్టును.

ఆయన ముందర పోవలెను అన్నట్లు.

ఆయస లేనికూర అరటికాయకూర.

ఆయము తెలిసి వ్యయము (చేయుము).

ఆయుష్యం ఆరుపాళ్ళు, యాతన ఏడుపాళ్ళు.

ఆయువు గట్టిదయితే అన్నీ పోతవి.

ఆర్యమైనది అంబటివేళ లేచినా, గాడెమూలినది కోళ్ళు కూయగా లేచినా ఒకటే.

ఆయి వుంటే గాయమంత సుఖం లేదు.

ఆరగించగా లేనిది అడిగిన వచ్చునా ?

ఆరంజ్యోతీ లేదు, ఆటా లేదు, అరనైరూపాయల అప్పు కనబడుతోంది.

ఆరంభశూరులు, ఆచరణశూన్యులు.

ఆరణ్యకోపనిషత్తులమీద హైకోర్టుజడ్జి ఉపన్యసించినట్లు.

ఆరవకాన్పు ఆడపిల్ల అత్తవారింటికి లక్ష్మి.

ఆరాటపు కదుకు ఏరాటూస పెట్టినా బరబరే ( ఒకటే ).

ఆరాటపు పెండ్లికొడుకు పేరంటాలిని ఎత్తుకుపోయాడట !

ఆరాటపు పెండ్లికొడుకు పేరంటాళ్ళ వెంట పడ్డాడట !

ఆర్భాటానికి (నకు) ఆరు కుంపట్లు, ఒకదుంపదాలి.

ఆర్భాటపు అత్తగారికి ఆరుగురు మొగుళ్ళు.

ఆరికకు చిత్త గండం, ఆడ (ను) దానికి పిల్ల గండం.

ఆరిక కోసినచేతితోనే కంది కోసినట్లు (కోయుట మంచిది).

ఆరిక కోస్తే ఇల్లంతా గింజలు, దంచితే దొడ్డిఅంతా పొట్టు.

ఆరిక చల్లిన రెడ్డికి ఆలుమగలకు ఒకటే చీర.

ఆరితేరె, అల్లము శొంఠి ఆయె.

ఆరిపోయే దీపానికి కాంతి ఎక్కువ (కళాకాంతు లెక్కువ).

ఆరుకార్తెలకు పోతు ఆరుద్రకార్తె.

ఆరుఆవులమ్మ మూడావులమ్మఇంటికి నేతికి వెళ్ళిందట !

ఆరుఈతల నక్కకు మూడుఈతల నక్క ముక్క నేర్పిందట !
ఆరువేళ్ళ అబ్బాయి అమ్మా! అంటే వాడిఅమ్మకు ఆశ్చర్యం వేసిందట!
ఆరు కొత్తెనలు, నూరునీళ్ళు (అరటికి).
ఆరుగురుబిడ్డల తల్లికి ముగ్గురుబిడ్డలతల్లి ముక్క నేర్పిందట !
ఆరునెలలకు చచ్చేవాడికి అల్పబుద్ధి పుడుతుంది.
ఆరునెలలకే అల్లునినోటికి వస్తుంది (మునగ).
ఆరునెలలు వాయించిన మద్దెల ఓటిదా, గట్టిదా అన్నట్లు.
ఆరునెలలు పుట్టింట ఉంటే ఆడపాపకంటె అన్యాయం.
ఆరునెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు.
ఆరునెలలు సాము చేసి మూలనున్న ముసలమ్మను పొడిచినట్లు.
ఆరుగురు బంట్లు, మూడు ఫౌజులు.
ఆరురాజ్యాలు జయించవచ్చునుగాని అల్లు (డి) ని జయించలేము.
ఆరురోజులు అరవచాకిరీ చేస్తే ఆదివారంనాడు ఆటవిడుపు.
ఆర్ద్రకార్తె విత్తనానికి, అన్నము పెట్టిన ఇంటికి సేగి లేదు.
ఆర్ద్ర కురిస్తే ఆరుకార్తెలు కురియును.
ఆర్ద్ర కురిస్తే అందరికీ సయమే.
ఆర్ద్ర కురిస్తే దారిద్ర్యము లేదు.
ఆర్ద్రతో అదను సరి.
ఆర్ద్ర చిందిస్తే అరవైరోజులు వరుపు.
ఆర్ద్ర మొదటిపాదాన ఎత్తితే ఆరంభములు చెడును.
ఆర్ద్రలో అడ్డెడు చల్లిన పునాసకు పుట్టెడు పంట అవుతుంది.
ఆర్ద్రలో వేసిన ఆరిక, ఆకులో పెట్టిన అన్నము ఒకటే (తోసరి).
ఆర్ద్రవాన అదనువాన.
ఆర్ద్రవానకు ఆమ్లములు పండును.
ఆరు నెలలకు చస్తాడనగా అసలుగుణం మారుతుంది.

ఆరెకత్తిలేని ఆయాళ్ళ మాదిగతనం.
ఆరెపుల్లకు పూరిపుల్ల తోడు.
ఆరెలమానుకింద బూరెల (గారెల) మాను విరగబడ్డట్లు.
ఆరేండ్లపిల్లవాడు అద్దలో గిద్ద వేస్తే అదీ అపురూపమే!
ఆర్చేవా తీర్చేవా అక్కర వస్తే ములిగేవా?
ఆర్చేవా తీర్చేవా, అడుగు పడితే (లేవ) తీసేవా?
ఆరోగ్యమే మహాభాగ్యము.
ఆలగోడు బాలగోడు!
ఆలపాటికవిత్వం, అందులో పైత్యం.
ఆలయానికి దగ్గర, దైవానికి దూరము.
ఆలస్యమైనా అంటుబొడ్డుదాన్నే కొనాలి (కొనవలె).
ఆలా? పిల్లా? అనకమైనా లంజా? లంజ కోతమ్ముడా? బావా బావ మరిదా?

ఆలి ఏడ్చిన ఇల్లు ఎద్దు ఏడ్చిన సేద్యం ముందుకు రావు.
ఆలికి అదుపు, ఇంటికి పదుపు (అవసరం).
ఆలికి అన్నం పెట్టడము (పెట్టుట) ఊరికి ఉపకారమా?
ఆలికి గంజి పోయనివాడు ఆచారము చెప్పె; తల్లికి గంజిపోయనివాడు తగవు చెప్పె.

ఆలి చచ్చినవాడు, గోడ దూకినవాడు.
ఆలితో పోట్లాడి ఆత్మహత్య చేసుకొన్నట్లు.
ఆలిని విడిచిన హరిదాసు, సంసారము విడిచిన సన్యాసి.
ఆలిని ఒల్లనివానికి ఊలకూరలో ఉప్పు చాలదు (ఎక్కువ).
ఆలిని అదుపులో పెట్టలేనివాడు అందరినీ అదుపులో పెట్టునా!
ఆలిపంచాయితీ రామాయణం, పాలిపంచాయితీ భారతం.
ఆలిమాట విన్నవాడు, అడివిలో పడ్డవాడు (ఒకటే).

ఆలిలేనివానికి హనుమంతరాయనిగుడి, బిడె మిడిచిన (బిడెమువిడిచిన) దానికి వీరప్పగుడి (శరణం).

ఆలివంకవారు ఆత్మబంధువులు, తల్లివంకవారు తగినవారు, తండ్రివంకవారు దాయాదులు.

ఆలు ఆత్మకూరిలో, మొగుడు బోయపల్లెలో, కుండాచట్టీ కుణుతూరులో, తలబ్రాలు తాడిపత్రిలో.

ఆలు ఆలెకాన్లను పోతే, మొగుడు జమీందార్లను పోయెను.

ఆలు ఒల్లక అరవై ఏళ్ళు, మొగుడు ఒల్లక ముప్పై ఏళ్ళు, బాల ప్రాయం పదేళ్ళు.

ఆలు కాదు అది (నొసటి) వ్రాలు.

ఆలుకుదురు, చేనుకుదురు (ఆనందం).

ఆలు గయ్యాళీ, పక్కకు బోటి లేదు.

ఆలు చచ్చినవాడికి ఆలు బంగారం.

ఆలు చచ్చినవానికి మనువు (ము) పోరాదు, వండుకోని తిన్నవానికి వండిపెట్టరాదు.

ఆలుబిడ్డలు లేనివానికి ఆంజనేయుల గుడి.

ఆలు మంచిది కాకున్న ఆర్గురిబిడ్డల తల్లినైనా విడవాలి.

ఆలుమగల కలహం అన్నం తినేదాకా.

ఆలుమగల కలహం ఆరికకూడువంటి (వండినంతసేపు).

ఆలుమగలసందు పోట్లాట అద్దము (ం) మీద పెసరగింజ వేసినంతసేపు.

ఆలుమగ లొక్కటయ్యేవఱకే అందఱితో అవసరము.

ఆలు లేత, నారు ముదర.

ఆలు లేదు, చూలు లేదు, కొడుకుపేరు సోమలింగం.

ఆలులేనిబడాయి నీళ్లు తోడమన్నట్లు.

ఆలులేనివానికి ఆత్మకూరు.

ఆలులేనివాని సాద.

ఆలు సొత్తు, అత్త తొత్తు.

ఆళ్లు కొత్తవైతే తిరగళ్లు కొత్తవా ?

ఆవగింజంత బూడిద పూస్తే గుమ్మడికాయంత వెఱ్ఱి పుట్టును.

ఆవగింజ అట్టే దాచి, గుమ్మడికాయ కుప్పమీద వేసినట్లు.

ఆవగింజ అట్టే దాచి, గుమ్మడికాయ గుల్ల కాసుగా ఎంచినట్లు.

ఆవగింజకు సందు ఉంటే అరవైగారెలు అప్పుడే తిననా ?

ఆవతిన్నమ్మకు ఏవ పారిందట !

ఆవదిన్న పసరములాగు.

ఆవలిగట్టు ఆవుకు ఈవలిగట్టు పచ్చన.

ఆవాలు ముద్ద చేసినట్లు.

ఆవాలు తిన్నమ్మకు యావ, ఉలవలు తిన్నమ్మకు ఉలుకు.

ఆవాహనా లేదు, విసర్జనా లేదు.

ఆవిలాటలో పడినవాడు, అగడ్తలో పడినవాడు ఒకటే.

ఆవు అడ్డుగ, బందె ముప్పావలా.

ఆవు ఉండగా గాడిదపాలు పితికినట్లు.

ఆవు ఎక్కడ తిరిగితేనేమి ఇంటికి వచ్చి కడి వేస్తే చాలు.

ఆవు చేలో మేస్తే, దూడ గట్టున మేస్తుందా (మేయునా) ?

ఆవు ( లు ) తొలిచూలు, గేదె ( బఱ్ఱె ) లు మలిచూలు.

ఆవుదూడను బఱ్ఱెకు, బఱ్ఱెదూడను ఆవుకు మరగవేసినట్లు.

ఆవు సలుపైతే పాలు సలుపా ?

ఆవును అమ్మినవాడు కన్నెతాడు ఇవ్వడా ?

ఆవును కొంటే గింటే పాలు మీవాళ్ళకా ? మావాళ్ళకా ?

ఆవును కొని తలుగుకు లోగినట్లు.

ఆవును చంపి చెప్పుల దానం చేసినట్లు ( ఇచ్చినట్లు ).

ఆవుపాడి ఎన్నాళ్ళు? ఐశ్వర్య మెన్నాళ్ళు? బఱ్ఱెపాడి ఎన్నాళ్ళు? భాగ్య మెన్నాళ్ళు?

ఆవుపాదుగులోనే అరవైఆరు పిండివంటలున్నాయి (ఉన్నవి).

ఆవు మరగిన దూడ మరగదు, దూడ మరగిన ఆవు మరగదు.

ఆవురంగు పాలనుబట్టి తెలియునా? (తెలుస్తుందా)?

ఆవు రాలేదంటే ఎద్దును కట్టి పితుక మన్నట్లు.

ఆవుల (క) సాధుత్వము, బ్రాహ్మణుల పేదరికము లేదు.

ఆవులించిన నోటికి అన్నమిడినట్లు.

ఆవులింతకు అన్న గలడుగాని తుమ్ముకు తమ్ముడు లేడు.

ఆవులిస్తే పేగులు లెక్కపెట్టినట్లు.

ఆవులు ఆవులూ కుమ్ములాడితే (పోట్లాడితే) లేగలకాళ్ళు విరుగును (గుంటవి).

ఆవులు చస్తూ దూడలకు మేత పెట్టిపోయినవా?

ఆవులు తలచినచోట పూరి మొలచినట్లు.

ఆవులు మళ్ళించినవాడే అర్జునుడు.

ఆవు లేనింట అన్నమే తినరాదు.

ఆవూ, దూడా ఉండగా గుంజ అరచినట్లు.

ఆవూ, దూడా ఉండగా మధ్య గుంజ అర్చిందట!

ఆవూరివారి అంబలి తాగి ఈవూరివారి దూడలు కాచినట్లు.

ఆవేళటికి అడ్డదిడ్డంగా తిరిగితే సంకురాత్రికి చంక నాకిపోతారు.

ఆవేలుకు ఆవేలు ఎడం.

ఆశ అధికము, క్రియ శూన్యము.

ఆశ అరవైనాళ్ళు, మోహము ముప్పైనాళ్ళు.

ఆశ ఆలిమీద, ఆధారము చాపమీద.

ఆశ ఎక్కువ, పీక సన్నము.

ఆశకు అంతు లేదు, గోచికి దరిద్రము లేదు.

ఆశకు అంతు లేదు, నిద్రకు సుఖం లేదు.

ఆశకు అంతు లేదు, నిరాశకు చింత లేదు.

ఆశకు, దరిద్రానికి లంకె.

ఆశకు పెడితే పీసర దిగినట్లు. (?)

ఆశకు పోతే గోచి ఊడిందట!

ఆశకు పోతే గోచి (సి) లో రాయి పడినట్లు.

ఆశకు మించినదూరం, వడ్డీకి మించిన వేగం లేవు.

ఆశకు మునిమి లేదు, అర్థికి సౌఖ్యము లేదు.

ఆశ కోసినవాడు అందరికంటె భాగ్యవంతుడు.

ఆశ (గలవాన్ని) దోష మెఱుగదు, పూటకూళ్ళమ్మ (పెద్దమ్మ) పుణ్య మెఱుగదు.

ఆశను గెలిస్తే అంతా కరతలామలకమే.

ఆశపడి ఆరు ఉపోష్యాలుంగా (లంకణాలు) చేస్తే ఆరోజున ఆరిక మెతుకు లేనా (ఆరికకూడేనా)?

ఆశపడి ఆరులంఖణాలు చేస్తే ఆరోజు (వేళ) జొన్న మెతుకేనా?

ఆశపడి ఆరులంఖణాలు చేస్తే ఆరోజూ తమిదంబలేనా?

ఆశపడి పాసినన్నం తింటే పాడుపడి పదిలంఖణాలు చేసినట్లు.

ఆశపడి బుల్లి తిన్నా రోగము అల్లాగే ఉన్నది.

ఆశపాతకపు (ఆశపోతు) బాపడు (బ్రాహ్మడు) గోచిపాతలో తూమెడు (ముప్పందుం) మూట గట్టుకున్నాడట!

ఆశ బోధిస్తున్నది, అవమానం బాధిస్తున్నది.

ఆశ లేనివానికి ఆకలి లేదు.

ఆశ లేనివానికి ఆరళ్ళు లేవు.

ఆశ లేనివానికి దేశ మెందుకు?

ఆశ సిగ్గెఱుగదు, నిద్ర సుఖ మెఱుగదు.

ఆశీర్వచనాలకు పిల్లలు పుట్టరు.

ఆశ్లేష ఊడ్పు ఆకుగురి ఊడ్పు.

ఆశ్లేషకార్తె అసిరితే అసిరినట్లు, మసలితే మసలినట్లు.

ఆశ్లేష కురిస్తే ఆరోగ్యం కలుగును.

ఆశ్లేష కురిస్తే ముసలిఎద్దు అంకె వేయును.

ఆశ్లేష ముసలికార్తె, ఆగిఆగి తుంపర కురియును.

ఆశ్లేషలో అడుగు కొకచినుకైనా (కు పడినా) అడిగినన్ని వడ్లు.

ఆశ్లేషలో అడ్డెడు చల్లుట మేలు.

ఆశ్లేషలో ఊడ్చినట్లయితే అడిగినంత పంట (అడిగినన్ని ధాన్యం).

ఆశ్లేషలో పూచిన అంతులేని పంట.

ఆశ్లేషవర్షం అంగటికి లాభం.

ఆశ్లేషవాన అరికాళ్ళ తేమ.

ఆషాఢమాసం అరిసె లొండను పొద్దుండదు.

ఆషాఢానికి ఆకుపోతలు.

ఆషాఢానికి పీషాణాలు(?) బద్ద లగును.

ఆసత్తకు బోసత్తా, బోసత్తకు బోడిమగడు.

ఆసనంలో పుండు, అల్లుని వైద్యం (అల్లుడు వైద్యుడు).

ఆసనాలు వేస్తే పాసనాలు పుట్టినట్లు.

ఆసలు విడిస్తే అటమట లేదు.

ఆస్థగలిగిన అన్నంభట్టు ఆలిప్రక్క పడుకొని అరుణం చదివెనట!

ఆసులో కండెవలె (దారంవలె).

ఆసోది (సాది?) మాటలకు అర్థమూ లేదు, గుడ్డికంటికి చూపూ లేదు.

—::—

# ఇ

ఇంగువ కట్టిన గుడ్డ, బెల్లం వండిన పొయ్యి.

ఇంట ఆచారత్వం, బయట బటాచోరత్వం.

ఇంట కుడిచి ఇంటివాసాలు లెక్కించినట్లు.

ఇంట గెలిచి రచ్చ గెలువుము.

ఇంట లింగాకారం, బయట చక్రాకారం, ఇక్కడికి వచ్చావా జడలు తాల్చి?

ఇంట లేనిది గోచిలో పెడతావురా కొడుకా?

ఇంటింటా ఒకఇటుకపొయ్యి, మాఇంట ఉంది మట్టిపొయ్యి.

ఇంటింటికి ఒకమట్టిపొయ్యి, మాఇంటికి మరొకటి.

ఇంటి ఎద్దుకు బాడుగ (అద్దె) ఏమిటి?

ఇంటికంటె (కన్నా) గుడి పదిలము.

ఇంటికళ ఇల్లాలే చెప్పు (బు) తుంది.

ఇంటికి అవ్వ, కొలతకు తవ్వ అవసరము.

ఇంటికి ఇల్లాలు కాదు, దొంతికి కుండ కాదు.

ఇంటికి ఇత్తడిచిలుక, బయటికి బంగారుచిలుక.

ఇంటికి ఈగ ఎగ్గు తెస్తుంది.

ఇంటికి ఈలకత్తి, పొరుగుకు బంగారుకత్తి.

ఇంటికి ఏబ్రాసి, పొరుగుకు శ్రీమహాలక్ష్మి (శివాలక్ష్మి).

ఇంటికి ఒకగుప్పెడుబియ్యం, ఇల్లాలికి పదిపుట్లు.

ఇంటికి ఒకపుష్పమైతే, ఈశ్వరుని కొకమాల.

ఇంటికి ఒకవెంట్రుకయితే, ఇలాయి కొకకంబళి.

ఇంటికి చుట్టం వస్తే పొట్టగంజివాడికి దుఃఖం.

ఇంటికి జ్యేష్ఠాదేవి, పొరుగుకు శ్రీమహాలక్ష్మి.

ఇంటికి ముసలి కీడు, ఏటికి మొసలి కీడు.

ఇంటికి వెన్నుపోటు, మనిషికి పైపోటు.

ఇంటికుక్క ఇంటికుక్కను ముట్టనీదు.

ఇంటికూడు తిని అంకుమొగుళ్ళ వెంట పడినట్లు.

ఇంటికొద్ది కాపురం, మంటికొద్ది పేలం.

ఇంటికోడలు తిన్నా, కోళ్ళు తిన్నా వృథాగా పోదు.

ఇంటిగుట్టు లంకకు చేటు.

ఇంటిచిలుకను బోయ కిచ్చినట్లు.

ఇంటిదీప మని ముద్దు పెట్టుకుంటే మీసాలన్నీ తెగకాలినవట!

ఇంటిదేవర పీగి (ఈగి) చస్తే పొలందేవర గంపజాతర అడిగిందట!

ఇంటిదొంగను ఈశ్వరుడయినా పట్టలేడు.

ఇంటినిండా కోళ్ళున్నవికాని కూరేసేటందుకు కోడి లేదు.

ఇంటినుండి వెళ్ళగొట్టగా దొంతులు సవరించినట్లు.

ఇంటిపిల్లికి పొరుగింటిపిల్లి తోడు.

ఇంటిపెద్దకొడుకై పుట్టేకన్నా, అడవిలో తుమ్మమొద్దై పుట్టేది మేలు.

ఇంటిపేరు కస్తూరివారు, ఇల్లు గబ్బిలాల కంపు (వాసన).

ఇంటిమీద రాయి వేసి వీపు ఒగ్గినట్లు.

ఇంటిముందు చింత, ఇంటి వెనుక వేప (ఉండవలె).

ఇంటిమొగుడు కుంటెనకాడైతే ఇంటికి ఏడుగురు మొగుళ్ళు.

ఇంటిమొగుడు కుంటెనకాడైతే అంకుకు రామేశ్వరం పోవాలా?

ఇంటిమొగుడు మంటిగబ్బు, పొరుగింటిమొగుడు పూలవాసన.

ఇంటిలక్ష్మి సంగి (సంగతి) వాకిలి చెప్పును.

ఇంటిలో (ఇంట్లో) ఇత్తడిబొమ్మ, బయట బంగారుబొమ్మ.

ఇంటిలో (ఇంట్లో) ఇల్లాలిపోరు, బయట బాకీలపోరు.

ఇంటిలో (ఇంట్లో) ఇల్లాలు లేదంటే పెళ్ళామా అని పిలిచాడట!

ఇంటిలో (ఇంట్లో) ఈగ పులి, బయట పెద్దపులి!

ఇంటిలో (ఇంట్లో) ఈగలమోత, బయట పల్లకీల (సవారీల) మోత.

ఇంటిలో (ఇంట్లో) తిని ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు.

ఇంటిలో (ఇంట్లో) దేవుణ్ణి వదలి యీధిలో (వీధిలో) దేవుణ్ణి మొక్కినట్లు.

ఇంటిలో (ఇంట్లో) నుంచి తోసివేస్తారంటే చూరు పట్టుక (వాసాలు పట్టుక) వ్రేలాడినట్లు.

ఇంటిలో (ఇంట్లో) పస్తు, వీధిలో దస్తు.

ఇంటిలో (ఇంట్లో) పాడుపసువు, మంచంలో పాలుకూడానా ?

ఇంటిలో (ఇంట్లో) పుష్టి, వంటిలో పుష్టి.

ఇంటిలో (ఇంట్లో) పెళ్ళయితే ఊరిలో కుక్కలకు హడావుడి.

ఇంటిలో (ఇంట్లో) మొగుడు కొడితే, వీధిలో మాదాకవళంవాడు కొడతాడు.

ఇంటిలో (ఇంట్లో) వి (ఇ) త్తులు లేవు, ఇన్నటికి మాటలు లేవు.

ఇంటివాడివలె చేసేవాడు లేడు, బయటివాడివలె తినేవాడు లేడు.

ఇంటివాడు 'ఇల్లో' అంటే పొరుగువాడు 'పొల్లో' మన్నాడట !

ఇంటివాడు ఊకన కొడితే, పొరుగువాడు పోకన కొడతాడు.

ఇంటివాడు గొడ్డుగేదె అంటే పరాయి (పొరుగు) వాడు పాడిగేదె అంటాడు.

ఇంటివాడు లేచేది కుంటివాడిమీదికే.

ఇంటివాణ్ణి లేపి దొంగచేతికి కట్టి ఇచ్చినట్లు.

ఇంటివానికి చులకనైతే, బయటివానికి చులకన, బానిసవానికీ చులకన.

ఇంటివారికి ఇనుపచీల, బయటివారికి బంగారుచీల.

ఇంటివాడు ఒసే అంటే ఈధి (వీధి) వాడు తసే అంటాడు.

ఇంటివాడు వేలు చూపితే బయటివాడు కాలు చూపుతాడు.

ఇంటివెనుక ఇంగువచెట్టు ఎంత దాచినా గుప్పుడు కాదు.

ఇంటివెనుక చెప్పుతూంటే, వీపువెనుక విన్నట్లు.

ఇంటి సొమ్ము ఇప్ప (విప్ప) పిండి, పొరుగింటి సొమ్ము పొడిబెల్లం.

ఇండ్లలో కందురీగలు తెట్టెలు పెడితే ఇల్లాండ్రు గర్భవతులౌతారట !

ఇంతకు అంత అయిందికదా ! అంత కెంతో ? అంత కంతే.

ఇంత చక్కని పెళ్ళికి బాగా సట్టరా సన్నాయి.

ఇంత చక్కని మగవాడికి సమర్తాడుదునా ?

ఇంత బ్రతుకు బ్రతికి ఇంటివెనుకాల (క) పడి చచ్చెనన్నట్లు.

ఇంతమందిదొరలు చావకపోతే నేనుమాత్రం చస్తానా ? నాకూ అక్కఱ లేదు (అన్నాడట) !

ఇంతమీను వచ్చి అంతమీనును మింగె నన్నట్లు.

ఇంతేమి ? అంతేమి ? ఇల్లంతా నాదే అన్నట్లు.

ఇంతేనా బుద్ధులు కుట్టువాడా అంటే, కడమవి కావిళ్ళతో వస్తున్నాయి అన్నాడట !

ఇందమ్మా తియ్యకూర అంటే ఇందమ్మా పుల్లకూర అన్నట్లు.

ఇంద్రద్యుమ్నుడికి మహాకూర్మం దొరికినట్లు.

ఇక్కడ తన్నిన అక్కడ కుశలం, అక్కడ తన్నిన ఇక్కడ కుశలం.

ఇక్కడా అక్కడా ఉంటే ఈడేరిపోతావు, నాఇంటికి రావే నవసి పోదువుగాని.

ఇక్కా! ఇక్కా! ఎక్క డుంటావురా అంటే అమ్మా ! ఇక్క డుంటా, అక్క డుంటా నన్నాడట !

ఇగురం ఇల్లలికితే, నెత్తి పొయ్యలుకుతుంది.

ఇగిరిపోయిన చెంపలకు ఇప్ప (విప్ప) నూనె పెడితే సానిదాని ముఖం నవనవలాడిందట !

ఇగురం తప్పినపనికి ఊరట లేదు.

ఇగురం తప్పినదాని ఇంటివెనుక చూడు, ఓగెం తప్పినదాని వంటఇల్లు చూడు.

ఇగురం ఇల్లు అలికితే పిట్టలు ముగ్గు కొట్టినాయట !

ఇగులుపండ్లవా డింటికి చేటు, పంగలబత్తె పందిరిచేటు.

ఇచ్చకాలకు ఉచ్చ తాగితే రొచ్చు (గచ్చు) కంపు కొట్టిందట ! (వేసిందట !).

ఇచ్చకాలవారు, బుచ్చకాలవారు పొట్టలకొఱకు పొక్కులు గోకుతారు.

ఇచ్చింది ఇచ్చి పుచ్చినదానిని కొన్నట్టు (పోయినట్టు).

ఇచ్చింది ఇస్తే కరణాన్ని కాదు అన్నాడట !

ఇచ్చిత్రం పచ్చిపులుసు.

ఇచ్చితినమ్మా వాయసం అంటే పుచ్చుకుంటినమ్మా వాయసం అన్నట్లు.

ఇచ్చిననాడు ఇంట పీనుగ వెళ్ళినట్లు, పుచ్చుకున్ననాడు పుత్రకామేష్టి.

ఇచ్చినమ్మ ఈగ, పుచ్చుకొన్నమ్మ పులి.

ఇచ్చినవాడు కుక్క, చేసుకున్నవాడు చుక్క (కన్యను).

ఇచ్చినవాడు తలమీద, ఇవ్వనివాడు నేలమీద.

ఇచ్చినవాడు దాత, ఇవ్వనివాడు రోత.

ఇచ్చినవాడే నచ్చిన (నొచ్చిన) వాడు, చచ్చినవాడే అచ్చినవాడు.

ఇచ్చి నిష్ఠూరంకంటే ఇవ్వక నిష్ఠూరం మేలు (నయము).

ఇచ్చి పుచ్చుకుంటూఉంటే వ్యవహారం, వచ్చిపోతూఉంటే బాంధవ్యం.

ఇచ్చి పుచ్చుకొని మొగుడిపిపెల్లా తడివినట్లు.

ఇచ్చి పుచ్చుకోనివాడు గిచ్చిగిచ్చి చంపె.

ఇచ్చుడువాడు కాడు, పుచ్చుడువాడూ కాడు, పుంటూపుంటికి వంటికి వచ్చుడుగాడు.

ఇచ్చే గొడ్డునే పితికేది.

ఇచ్చేటప్పుడు కాముని పండుగ, పుచ్చుకునేటప్పుడు దీపావళిపండుగ (అప్పు).

ఇచ్చే డబ్బు ఇచ్చి చచ్చేదానివెంట పడ్డట్టు.
ఇచ్చేవాణ్ణి చూస్తే చచ్చేవాడైనా లేస్తాడు.
ఇచ్చేది భిక్షము, వచ్చేది మోక్షము.
ఇచ్చేవానికి పత్రము వద్దు, చచ్చేవానికి మందు వద్దు.
ఇటుకులాడికి రవిక పెట్టితే కంపకు పెట్టి చింపుకున్నదట!
ఇటు వేస్తే (ఇట్లేస్తే) హనుమంతుడు, అటు వేస్తే(అట్లేస్తే) వీరభద్రుడు.
ఇడిసిన (విడిచిన) ముండ వీధికి (యీాధికి) పెద్ద.
ఇదుపులకచ్చకు విడెము పెడితే గుడిసెలో గుడ్డివాడు కుట్టుకు పెట్టినాడు.
ఇత్తడి పుత్తడి కాదు, తొత్తు దొరసాని కాదు.
ఇత్తడి ఇమ్మడి, పుత్తడి ముమ్మడి.
ఇత్తు (విత్తు) కొట్టి, ఇరస అంబలి కాచి, ఇంటికి నలుగురిని పిలిచి
ఇందు (విందు) చేసినట్లు.
ఇత్తు వేసి పొత్తు కలిసినట్లు.
ఇత్యాపులు కూయంగ, కోసంగు డేయంగ అప్పేకదంతుండు ఆడినమ్మా!
ఇత్యర్థుల ఇగురు, ఇతిభావల పులుసు.
ఇత్యర్థుల పులుసు, ఇతిభావల కూర.
ఇద్దరు కూడితే ఇంగలం లేనిదే మంట మండుతుంది.
ఇద్దటికి సివము వస్తే ఇ ల్లేమి కావలెను (కాను) అంటే తడ కేసి గుసి
పెట్టినాను. దాని కేమి పరవా అందట!
ఇద్దటి వ్యవసాయం, ఇరువురికీ నష్టం.
ఇది గుణము, ఇది మైదానము.
ఇద్దరు దెబ్బలాడితే పొట్లాడితే మూడవవాడికి లాభం.
ఇద్దరు పెండ్లాలమగడు ఇటుకున పడి చచ్చెనట!
ఇది ఇట్లా, మొగు డట్లా, సేద్యగాడికి సంగ టెట్లా?
ఇదిగో పాము అంటే అదిగో పడగ.

ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్లు.

ఇద్దు మలికితే ముత్యము పండినది.

ఇన్ని కంతులు కోశానుగాని నాకంతిఅంత నొప్పి మరేదీ లేదు.

ఇన్నిన్ని తిన్నమ్మ ఇల్లు నాశనం చేసెనట!

ఇనుపగుగ్గిళ్ళు కాని మినుపగుగ్గిళ్ళు కావు.

ఇనుపబొక్కెనకు రాతినుయ్యి.

ఇనుము కరిగేచోట ఈగలకు పని ఏమి? (ఉన్నది.)

ఇనుముకు తగిలిన పీడ ఇంగలానికి తగిలింది.

ఇనుము, తీట, పేను పట్టిన చేయి ఊరకుండదు.

ఇనుమునుగూర్చి (తోకూడ) అగ్నికి సమ్మెటపెట్లు.

ఇనుము విరిగితే అతుకవచ్చును, మనము విరిగితే అతుక లేము.

ఇప్ప (విప్ప) పూలకు వాసన వెతుకవలెనా?

ఇప్పుడు వచ్చినవాని కేమో ఇరస, అప్పుడు వచ్చినవానికి అడ్డెడు.

ఇరవై ఏండ్లవారికి పెత్తన మీరాదు, అరవై ఏండ్లవారి నాలోచనకు పెట్టరాదు.

ఇరాటసర్వం ఇంటాయన కొచ్చు, బాగోతం మాబావ కొచ్చు, అండ్ల దోనుడుగు, ఈండ్ల దోనుడుగు నా కిం తొచ్చు.

ఇట్టికొమ్ము అంటే బట్టికొమ్ము అన్నట్లు.

ఇట్టిని చూచి బట్టి వాత పెట్టుకొన్నదట!

ఇలుకు యిరిది (?) ఎక్కువ.

ఇలుకులో సరుకు దించినట్లు.

ఇలుకులో సరుకుమంత్రం.

ఇరుగింటమ్మా! పొరుగింటమ్మా! మాఇంటాయనగోడు చూడండి అన్నట్లు.

ఇరుగు ఇంగలం, పొరుగు మంగలం.

ఇనుగు కాదు, పొరుగు కాదు, పెనుగుపోసిన గురిగె కాదు.

ఇనుగు గుడ్డి, పొరుగు గుడ్డి, ఇంటిలో ఇల్లాలు గుడ్డి.

ఇనుగును చూచి పొరుగు వాత పెట్టుకొన్నట్లు.

ఇనుగుపొరుగు, తల్లిదండ్రి.

ఇనుగూరి వ్యవసాయం, ఇద్దరుభార్యల సంసారం ఒకటే.

ఇనుపోటీల ఇల్లు చెడును, వాతనొప్పుల ఒళ్ళు (వళ్ళు) చెడును.

ఇనుసున కందెన పెట్టక పరమేశ్వరు బండియైన పారదు.

ఇనుసు లేనిదే బండి కదలునా?

ఇల నమ్మి చెడినవాడు కలికానికి కానరాడు.

ఇల్లటపు టల్లుడు ఇంటికి చేటు, కొమ్ములబఱ్ఱె కొట్టానికి చేటు.

ఇల్ల నారాయణమ్మా! అంటే వెళ్ళ గోవిందా అన్నట్లు.

ఇల్లరికముకన్న మాలరికం మేలు.

ఇల్లాముల్లికి ఇందునా రెండు, అందునా రెండు.

ఇల్లాలా! ఇల్లాలా! మగ లెందరే అంటే తోలాటకాయతో తొంభై మంది అన్నదట!

ఇల్లాలిచక్కదనం ఇంటిముంగటే తెలుస్తుంది.

ఇల్లాలిగుడ్డ మల్లెని చీకె, లంజగుడ్డ బండను చీకె.

ఇల్లాలు గుడ్డిదయితే ఇంటికుండలకు చేటు.

ఇల్లాలులేని ఇల్లు భూతాలకు నిలయము.

ఇల్లు అలుకంగానే పండుగయిందా? (పండుగ కాదు.) ✓

ఇల్లు ఇందువారం, పొయ్యి బుధవారం.

ఇల్లు ఇచ్చినవానికి, మజ్జిగ పోసినవానికి మంచి లేదు.

ఇల్లు ఇరకటం, ఆలి మరకటం.

ఇల్లు ఉండగా ఇడుపున పెట్టుక తినవలెనా?

ఇల్లు ఈగలపెంట, దొడ్డి దోమలపెంట.

ఇల్లు ఈడుమాను, పందిరి పట్టెమంచం.

ఇల్లు ఎక్కి కొరవి తిప్పినట్లు.

ఇల్లు ఎక్కి కోక విప్పినట్లు.

ఇల్లు ఎక్కి గంతులేస్తూ, చూసేవానిమీద తుపాకి పేలుస్తా నందట!

ఇల్లు ఏడ్చే అమావాస్య, ఇరుగుపొరుగు ఏడ్చే తద్దినం, ఊరు ఏడ్చే పెండ్లి లేదు.

ఇల్లు కట్టగనే ఎలుకలరావిడి (రాయిడి).

ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు.

ఇల్లు కాలబెట్టి జల్లెడతో నీళ్లు పోసినట్లు.

ఇల్లు కాలి ఒక డేడ్పు, ఒళ్లు కాలి ఒక డేడ్పు.

ఇల్లు కాలినది జంగమయ్యా! అంటే నా జోలె, కప్పెర నావద్దనే ఉన్నవి అన్నాడట!

ఇల్లు కాలినా, ఇల్లాలు చచ్చినా గోల (గొల్లు) మానదు.

ఇల్లు కాలిపోతూంది ఈర్రాజు (వీర్రాజు) అంటే నా దేమి పోయింది (నా కేమి కావాలి) నరసరాజు అన్నాడట!

ఇల్లు కాలుతుంటే బావి తవ్వించినట్లు.

ఇల్లు కాలుతుండగా వాసాలు దూసుకొన్నట్లు.

ఇల్లు చక్కన, ఇల్లాలు చక్కన.

ఇల్లు చూచి, ఇల్లాలును చూడు మన్నారు.

ఇల్లు చూచి పిల్లి సమర్తాడిందట!

ఇల్లు చొరబడి ఇంటివాసాలు లెక్కబెట్టినాడట!

ఇల్లు తిరిగి రమ్మంటే ఇలారం తిరిగివచ్చినట్లు.

ఇల్లు దాటితే ఈడుమాను దాటుతుంది.

ఇల్లు దాటిన ఆడుది లోకానికి లోకువ.

ఇల్లు దూరినవా డెవ డంటే అలిచచ్చినవాడు.

ఇల్లు పీకి (విప్పి) పందిరి (కొట్టము) వేసినట్లు.

ఇల్లు బయలుదేరినతరువాత ఇల్లా లవుతుందా ?

ఇల్లు మింగే అత్తగారికి యుగం మింగే కోడలు.

ఇల్లులేవమ్మ హీనము చూడదు, మగడులేనమ్మ మానము చూడదు.

ఇల్లు విడిచిన పిల్లి కరుస్తుంది.

ఇల్లు వెడలి (విడిచి) పోరా నంబి అంటే నామాన్య మెక్కడ
అన్నాడట !

ఇల్లు వెళ్ళగొట్టగా ఇడుపుల శృంగారం, మొగుడు వెళ్ళగొట్టగా
మొత్తల శృంగారం.

ఇల్లెల్లా కాడితే తట్టెడు పెంకులు రాలవు.

ఇల్లే తీర్థం, వాకిలే వారణాసి, కడుపే కైలాసం.

ఇల్లేరు ఇంకితే నేమి ? కొల్లేరు పొంగితే నేమి ? (కాలితే నేమి?).

ఇలోనారాయణమ్మా ! ఇ ల్లెక్క డంటే, గోవిందరాజుల గోడలో
ఉన్నది అన్నట్లు.

ఇవటికూతలముండ ఇండ్లను అతకను పోయిందట !

ఇవతల చెఱ, అవతల సొర (చోఱ), నడుమ రాజ్యం.

ఇవ్వని మొండికి, విడువని చండి.

ఇవ్వాళ గుఱ్ఱాని ఎక్కడ మెందుకు ? రేపు గాడిద నెక్కడ మెందుకు ?

ఇష్టముతో ఇచ్చిందే ఈవి.

ఇష్టములేని పెళ్ళాన్ని ఒసే అన్నా తప్పే ! అమ్మా అన్నా తప్పే !

ఇష్టములేని మగడు ఈలకూరలో ఉప్పు చాల దన్నాడట !

ఇష్టమైన వస్తువు ఇంగువతో సమానము.

ఇష్టారాజ్యం, భరతుని పట్నం.

ఇసుంటా రమ్మంటే ఇల్లంతా చేకొన్నట్టు.

ఇసుకతక్కెడ, పేడతక్కెడ.

ఇసుకతో తాడు పేనినట్లు.

ఇస్తే చెడేది లేదు, చస్తే వచ్చేది లేదు.

ఇస్తే పెండ్లి, ఇవ్వకపోతే పెటాకులు.

ఇస్తే వరం, పెడితే శాపం.

ఇస్తే హిరణ్యదానం, ఇవ్వకపోతే కన్యాదానం.

ఇహము మన్ను, పరము పైడి.

ఇహానిది ఇహాన్నే అనుభవిస్తారు.

— : : —

# ఈ

ఈఅంబటికేనా ఇర్వైనాలుగు (నామాలు)!

ఈఇంటి ఆచారమా? మాగ్రహచారమా?

ఈఊరిరెడ్డి పొరుగూరి పసుల పోలిగాడు.

ఈఊరిరెడ్డి పొరుగూరి పాలికాపు.

ఈఊరికి ఆఊ రెంతో, ఆఊరికి ఈఊ రంతే.

ఈఊళ్ళో పెద్ద లెవ రంటే తాళ్ళు, దాత లెవ రంటే చాకళ్ళు.

ఈఎద్దు ఆఎద్దు జోడు, ఈచేను ఆచేను బీడు.

ఈఎల్ల ఎరుకలమ్మ ఏరూరికి (వేరూరికి) చుట్టమా?

ఈకంటికి ఈతెప్ప (లు) దూరమా?

ఈకష్టాలకన్నా మాఅత్త పెట్టే కష్టాలే బా గున్నాయి.

ఈకీలు మళ్ళితేనే ఆకీలు మళ్ళుతుంది.

ఈకొజ్జకూటికా ఈఘోషశాంతి? (ఘోరశాంతి?).

ఈగడ్డానికి ఈపప్పా?

ఈగుడి నేను కట్టించలేదు, ఆగుడి ఎవరు కట్టించారో ఎఱుగను అన్నాడట!

ఈచేత చేస్తారు, ఆచేత అనుభవిస్తారు.

ఈజొన్నకూటికా ఈస్తోత్రపాఠం!

ఈనాడు ఇంటిలో, రేపు మంటిలో.

ఈనెలలో వడ్డీ లేదు, పై (వచ్చే) (ఆ) నెలలో అసలూ లేదు.

ఈపిల్లి ఆపాలు తాగునా?

ఈపులుసుతో ఈముద్ద దిగనీ (తిననీ) (దిగితేను).

ఈపొడుము పీల్చనీవే, నీపాడె బిగిస్తా.

ఈమాత్రరాచకార్యానికి ఇంత కావాలా?

ఈముద్దుమొగానికా ఆగరుడసేవ?

ఈలోకములో ధర్మ ముంటే పరలోకం బంధు వవుతుంది.
ఈవేలుకు ఈ (ఆ) వేలు ఎడం.
ఈవేళ ఇంట్లో, రేపు మంట్లో.
ఈవేళ (దినం) చస్తే రేపటికి రెండు.
ఈసంబడానికేనా (సంబరానికేనా) ఇంత వగిరింపు (ఆర్భాటం).
ఈ అన్నది ఈఇంట లేదు, తే అన్నది తరతరాన వస్తున్నది.
ఈకలు తీసిన కోడి, ఈసలు తీసిన మాల.
ఈకలు తోకలు దులిపి నూకలలో కలిపినట్లు.
ఈకలు లేవుగాని, ఇంజమూరి (వింజమూరి) పుంజు.
ఈగకు ఇలి లేదు. పాముకు బలి లేదు.
ఈగలు ఈగలే! జోగులు జోగులే!
ఈగ వాలిన దుడ్డు పట్టుకొనినట్లు.
ఈడిగవాని ఇంట్లో పాడి (పాలు) తాగినా కల్లే అంటారు.
ఈడ్చి పారేస్తుంటే చూరు పట్టుక వేళ్ళాడినట్లు.
ఈడ్చీడ్చి తన్నినా ఈడిగఇల్లే నేలు అన్నట్లు.
ఈడుగానిది ఇంటికి రాదు, జోడుగానిది దొడ్డికి పోదు.
ఈడు చూచి పిల్ల నియ్యి, పిడి చూచి కొడవ లియ్యి.
ఈడు వస్తే గాడిదపిల్లకూడా బాగుంటుంది!
ఈడ్పుకాళ్ళవానికి ఇద్దఱు భార్యలు, ఒకతె ఈడవ, ఒకతె ఏడువ.
ఈడ్పుకాళ్ళు, ఈడ్పుచేతులు, ఇతడేనమ్మా! ఇల్లటపుటల్లుడు!
ఈడ్పుకాళ్ళు, ఏడ్పు మొహం.
ఈతకట్టెల నిప్పు ఇంటికి రాదు, ఈడిగవాని పెండ్లాము చేతికి రాదు.
ఈతకు మించిన (మిక్కిలి) లోతు లేదు, గోచికి మించిన (మిక్కిలి) దారిద్ర్యము లేదు.
ఈతగింజ ఇచ్చి తాటిగింజ లాగినట్లు.

ఈతచెట్టు ఇల్లు కాదు, తాటిచెట్టు తల్లి కాదు!

ఈతచెట్టుకింద పాలు తాగినట్లు (తాగినా కల్లే అంటారు).

ఈతనీళ్ళు పడితే పాతజోళ్ళు వెళ్ళుతవి, ఇప్పనీళ్ళు పడితే ఎప్పటి జోళ్ళయినా వెళ్ళుతవి.

ఈత నేర్చినవానికే జలగండం.

ఈతవిత్తు వేసి తాటివిత్తు లాగినట్లు.

ఈద బోతే తాగ నీళ్ళు లేవు.

ఈదా డంటే గో (కో) దా డన్నట్లు.

ఈదులకు పోయినవాడు, ఇల్లు కాలినవాడు, తాళ్ళకు పోయినవాడు తండ్రి చచ్చినా రాడు.

ఈధి (వీధి) లో చెప్పుతో కొట్టి, ఇంట్లో కాళ్ళు పట్టుకున్నట్లు.

ఈన గాచి నక్కలపాలు చేసినట్లు.

ఈన గాచి పిదప కుక్కలు కిచ్చినట్లు.

ఈనా డింటిలో, రేపు మంటిలో.

ఈనినపిల్లికి ఇల్లూ వాకిలీ తెలినయంత ఆకలి.

ఈనిన పులికి ఆక లెక్కువ.

ఈపిలేనితావున బొక్కలు వెతకినట్లు.

ఈయని మొండికి విడువని చండి.

ఈరు తీస్తే (తీసిన) పేను రాదా ?

ఈల ఒకచోట, చాకిరేవు ఒకచోట.

ఈవలిగట్టు ఆవుకు ఆవలిగట్టు పచ్చన.

— : : —

# ఉ

ఉంగరం చెడిపి బొంగరం, బొంగరం చెడిపి ఉంగరం చేయు.

ఉంగరాల చేతితో మొట్టితే నొప్పి ఉండదు.

ఉంగరాల చేతితో మొట్టేవాడు చెబితే వింటారు.

ఉంచుకున్నవాడు మగడు కాడు, పెంచుకున్నవాడు కొడుకు కాడు.

ఉంటే ఉగాది, లేకుంటే శివరాత్రి (ఏకాదశి).

ఉంటే ఊరు (కాదు), పోతే పాడు (కాదు).

ఉంటే పీరుసాహేబు, లేకుంటే ఫకీరు సాహేబు.

ఉంటే లిక్కి, పోతే కొడవలి.

ఉండ ఇల్లు లేదు, పండ మంచము లేదు.

ఉండ నిస్తే పండుతుంది, ఊడదీస్తే ఎండుతుంది.

ఉండమన లేక ఊదర, పొమ్మనలేక పొగ.

ఉండ లేకపోతే ఉరి పెట్టుకొమ్మన్నట్లు.

ఉండలేకపోతే బొండను వేయు మన్నట్లు.

ఉండ్రాళ్లమీద భక్తా? విఘ్నేశ్వరుడి (ని) మీద భక్తా!

ఉండ్రాళ్లు పిండివంటా కాదు, ఊక (ఊదర) ధాన్యమూ కాదు.

ఉండ్రాళ్లూ ఒకపిండివంటేనా? మేనత్తకొడుకూ ఒక మొగుడేనా!

ఉండిఉండి ఉప్పరవానిని పోతే చచ్చేదాకా చాపలమోత!

ఉండిఉండి ఉప్పరవానిని పోతే తట్టతట్టకు తలపోతలే!

ఉండి చూడు ఊరు అందము, నానాటికీ చూడు నాఅందము.

ఉండూరు (ఉన్నఊరు) అచ్చిరాదు.

ఉండే ఒక బిడ్డా బసివిరాలైనట్లు.

ఉండేకర్మ చాలక ఉపాకర్మ ఇంకొకటి (ఒకటి).

ఉండేదానికి స్థల మిస్తే పండుకోను మంచం అడిగినట్లు.

ఉండేవి గట్టి పోయింది పొట్టు.

ఉండేవాడు ఉలవ, వెళ్లేవాడు నువ్వులు (చల్లును).

ఉండే పెళ్లి ఉండగా ఉపాధ్యాయులభార్యకు ఉప్పుడు (తడి) బియ్యం!

ఉగాదికి తగాదాలు.

ఉగ్గుతో నేర్చినగుణం నుగ్గులతోగాని పోదు.

ఉచ్చపోసి గొరిగించారు అంటే ఎన్ని ముంతలు అన్నట్టు!

ఉచ్చులలో చేపలు పట్టినట్లు.

ఉచితానికి ఊళ్ళు, లెక్కకు కాసులు.

✓ ఉట్టి ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కునా?

ఉట్టికి ఎగురలేనివాడు స్వర్గానికి ఎగురుతా నన్నట్లు.

ఉట్టికి, చట్టికి చెడ్డట్లు.

ఉట్టికి నాలుగు చేరులు తెగినట్లు.

ఉట్టిపై పెట్టుమన్న జుట్టుపై పెట్టు.

ఉట్టిమీద కూడు, ఊరిమీద నిద్ర.

ఉట్టిమీద వెన్న పెట్టుకొని (ఉండగా) ఊరంతా (ఊరెల్లా) నేతికి దేవులాడినట్లు.

ఉట్టిలో పెట్టిన గుమ్మడికాయవలె.

ఉడకేసుకొని తిని, తడకేసుకొని పడుకొను (నట్లు).

ఉడికిన మెతుకులు తిని ఊళ్ళో ఉండేవాణ్ణి, నాకు ఎవరితో ఏమి పని ఉన్నది?

ఉడిగి ఉత్తరం చేసును.

ఉడుకని అన్నము, వడుకని బట్ట.

ఉడుకవే ఉడుకవే ఓడల్లిగడ్డ! నీ వెంత ఉడికినా నీకంపు పోదు.

ఉడుకవే కూడా! (కూరా!) ఉగాదిదాకా అంటే నా కేమి పని లేదు ఏరువాకదాకా అన్నట్లు.

ఉడుకు జుట్టితే నోరు కాలును.

ఉడుకుడుకు బూరె, ఉమ్మిలో గారె.

ఉడుత (ల) ఊపులకు మానులు వంగునా ? (వేపలు కదలునా?)

ఉడుతకు ఉడుతభక్తి.

ఉడుత కేలరా ఊరిలో పెత్తనం ?

ఉడుత నోము నోచింది.

ఉడుముకు రెండు నాలుకలు.

ఉడుము కేలరా ఊరిలో వార్త ?

ఉడుమును చంకలో పెట్టుకొని ఊళ్ళో ప్రవేశించినట్లు.

ఉడుము పోయినా పోయె, చేయి వస్తే చాలు.

ఉడుములలో తల పాములలో తోక.

ఉత్త గొడ్డుకు అరపులు మెండు.

ఉత్త చెవికన్న తాటాకుచెవి మేలు.

ఉత్త చేతుల మూర వేసి వేసినట్లు.

ఉత్త ముండకన్న అత్త ముండ మేలు (నయం).

ఉత్తమనైన ఇల్లాలు ఊరేగి వెళ్ళితే ఉత్తరేణి కాలి ఊళ్ళన్నీ కాలి పోయినవట !

ఉత్తర ఉరిమి తప్పినా, రాజు పాడితప్పినా చెదలు పురుగు (న) కు రెక్కలు వచ్చినా కష్టం.

ఉత్తర ఉరిమినా, పాము అరిమినా, కురవక, కరవక మానదు.

ఉత్తర చూచి ఎత్తర గంప, విశాఖ చూచి విడువర కొంప.

ఉత్తర పదను, ఉలవకు అదను.

ఉత్తమాటలు, సత్తురూపాయలు.

ఉత్తరలో ఊడ్చేకంటే, గట్టుమీద కూర్చొని ఏడ్చేది మేలు.

ఉత్తరలో చల్లితే ఊలు తెగులును.

ఉత్తరలో చల్లినపైరు, కత్తెరలో సరికిన కొయ్య.

ఉత్తరాయణం వచ్చింది ఉరి పెట్టుకో అన్నట్లు.

ఉతికేవానికేగాని చాకలి ఉతకడు.

ఉద్దరఅయితే ఊళ్ళు కొంటాను, నగదుఅయితే నశ్యం కొనను.

ఉద్దగిరి గాలి తగిలితే గుంటల్లో నీ ళ్ళుండవు.

ఉద్దన అయితే నా కిద్దను.

ఉద్దర సొమ్ము దుడ్డుకు పంచేను.

ఉద్దర సొమ్ము నిద్దుర చేటు.

ఉద్ధతుల మధ్య పేదల కుండ తరమె ?

ఉద్ధరిగాడునీళ్ళు ఉంగరపు వ్రేలుదర్భ.

ఉద్యోగం గట్టిపడుతుంది ఉన్నపుస్తె తేవే ?

ఉద్యోగం పురుషలక్షణం, అది పోతే అవలక్షణం.

ఉద్యోగం పురుషలక్షణా, గొడ్డలి తేరా నిట్రాడు తెగనరుకుదాము.

ఉద్యోగికి ఊరు లేదు, ముష్టివానికి ఇల్లు లేదు.

ఉన్న అమ్మ (ఉన్నమ్మ) గాదె తీసేసరికి, లేని అమ్మ ప్రాణం లేచి పోయింది.

ఉన్న ఊరా, మన్నప్రజా ?

ఉన్నఊరిలో ముష్టి అయినా పుట్టదు.

ఉన్న ఊరివాడికి కాటిభయం (పొన్నూరు) పొరుగూరివాడికి నీటిభయం.

ఉన్న ఊరు, కన్నతల్లి (ఒకరూపు) ఒకటి.

ఉన్నకర్మకు తోడు ఉపాకర్మ ఒకటి.

ఉన్నది అంతా ఉండగా ఉపాధ్యాయులవారి భార్య సమర్తాడింది.

ఉన్నది ఉండగా ఉయ్యాలమీద మేనమామ వచ్చి పడ్డట్లు.

ఉన్నది ఉలవకట్టె, పోయినది పాలికట్టె.

ఉన్నది ఊరు, మానింది మందు.

ఉన్నది ఒకకూతురు, ఊరంతా అల్లుండ్లు.

ఉన్నది ఒకబిడ్డ, ఊరెల్లా మొగుళ్లు.
ఉన్నది పోదు, లేనిది రాదు.
ఉన్నది పోయె, ఉంచుకున్నదీ పోయె.
ఉన్నది మనిషికి పుష్టి, తిన్నది పసరానికి పుష్టి.
ఉన్నవాడు ఉగాదిపండుగ, లేనివాడు కాముని పండుగ.
ఉన్నమాట అంటే ఉండరాదు (ఉన్నఊరు అచ్చిరాదు).
ఉన్నమాట అంటే ఉలు కెక్కువ.
ఉన్నమాట అంటే ఉలు కేసుకొని వస్తుంది.
ఉన్నమాట అంటే ఊరికే చేటు.
ఉన్నలోభికంటె లేని త్యాగి మేలు.
ఉన్నవాడు ఉన్నవాడికే పెట్టు, లేనివాడు ఉన్నవాడికే పెట్టు.
ఉన్నవాడు ఊరికి పెద్ద, చచ్చిన (పోయిన) వాడు కాటికి పెద్ద.
ఉన్న శాంతం ఊడ్చుకపోయిందిగాని కోపమే లేదు.
ఉపకారపు మొగుడు ఉండే మను విచ్చాడట! (మను నిచ్చినాడట !)
ఉపకారము అంటే ఊళ్ళోనుంచి లేచిపోయినట్లు.
ఉపకారానికి పోతే అపకారం వెంట వచ్చినట్లు.
ఉపనయనమునాటి మాట ఉండక మానదు.
ఉపాధ్యాయులవారూ ఉక్త్రం, ఉక్త్రం.
ఉపాధ్యాయులవారు ఏమి చేస్తున్నా రంటే తప్పులు, అబద్ధాలు వ్రాసి దిద్దుకుంటున్నారు అన్నట్టు.
ఉపాయ మున్నవాడు ఊరిమీద పడి (బ్రతుకుతాడు).
ఉపాయము (౦) లేనివాణ్ణి (ఎఱుగనివాణ్ణి) ఊళ్ళోనుంచి వెళ్ళగొట్టు మన్నారు.
ఉపాయము చెప్పవయ్యా! అంటే ఉరిత్రాడు తెచ్చుకొమ్మన్నాడట!
ఉపాయము లేనివాడు ఉపవాసంతో చచ్చాడు.

ఉపాయవంతుడు ఊరికి ఉరవడి.

ఉప్పు ఊరగాయ కాదు.

ఉప్పుతిన్న కోడె ఊరిపోయింది, పప్పు తిన్న కోడె పారిపోయింది.

ఉప్పు తిన్న ప్రాణ మూరుకోదు.

ఉప్పు తిన్నవాడు నీళ్ళు త్రాగును (త్రాగుతాడు).

ఉప్పుతో తొమ్మిది, పప్పుతో పది.

ఉప్పుతో ముప్పైఆరుంటే ఉత్తముండయినా వండుతుంది.

ఉప్పు, పులుసు (కారము) తినే శరీరానికి ఊపిరి ఉన్నంతవఱకు ఉంటుంది (కామము).

ఉప్పుముల్లె నీటిలో ముంచినట్లు.

ఉప్పు, మెరపకాయ ఊరకే రాగా ఆలిని గొట్ట తీటనా ?

ఉప్పు లేకనే ముప్పందుం.

ఉప్పు లేదు, కారము లేదు, అమ్మతోడు కమ్మ గుంది.

ఉప్పులేని పప్పు, ఊరగాయలేని సద్ది.

ఉప్పువాడూ చెడె (ఏడ్చాడు), పప్పువాడూ చెడె (ఏడ్చాడు), తమల పాకులవాడు తమూము చెడె (ఏడ్చాడు).

ఉప్పువాడు ఏడిశాడు, పప్పువాడు ఏడిశాడు, బొండాపుకాయలవాడు పొర్లిపొర్లి ఏడిశాడు.

ఉప్పూ, నిప్పూ అన్నట్లు.

ఉప్పూ, నూనె ఊరక రాగా ఆలిని కొట్ట నావశమా !

ఉబుసుపోకకు పిండిబొమ్మను చేసి పీటమీద పెడితే ఆడ (డు) బిడ్డ తనాన అదిరిఅదిరి పడుతుంది.

ఉబ్బుముఖమువాడు ఊరు వెడదా మంటే తెప్పలేనివాడు రేపు వెడదా మన్నాడు.

ఉభయపవిత్రాలు తిని ఉద్ధరిణెడు నీళ్ళు తాగి ఊహూ అంటావా ఉత్తమాశ్వమా !

ఉభయభ్రష్టత్వం, ఉపరి (ఉప్పరి) సన్యాసిత్వం.
ఉమ్మడిగా తిని ఒంటరిగా బలవాలి.
ఉమ్మడిగొఱ్ఱె పుచ్చి చచ్చినది.
ఉమ్మడిబేరం, ఉప్పరిసన్యాసం.
ఉయ్యాలలో బిడ్డను పెట్టి (పిల్లనుంచి) ఊరంతా వెదకినట్లు.
ఉరికి ఉరికి పసులు కాస్తే ఎన్నాళ్ళు కాస్తావు ?
ఉరిమి ఉరిమి మంగలిమీద పడ్డట్లు.
ఉరిసిన పుండుపై ఉప్పు చల్లినట్లు.
ఉరుకు ఉరుకు మనే సవతేగాని (తోడు) ఉరికే నాసవతి (ఒక్కతీ) లేదు.
ఉరుము ఉరిమి మంగలిమీద పడ్డట్లు.
ఉర్సులకు పోతే కర్సులకు కావాలి.
ఉఱుములు, మెఱుపులు, ఉత్తండాలు, బాపనపిత్తిరీలు, బడబడలు.
ఉఱుములు, మెఱుపులు చూస్తే ఉల్లాసమా ?
ఉలవకు కానిపొలం ఊషరక్షేత్రం.
ఉలవచేను పెట్టిన మగ డూరకుండక పత్తిచేను పెట్టి ప్రాణంమీదికి తెచ్చినాడు.
ఉలవలు తింటావా బసవన్నా అంటే ఊ అన్నట్లు.
ఉలవలు తిన్నమ్మకు ఉలుకు, సజ్జలు తిన్నమ్మకు సలుకు.
ఉలవలు మూలజ్యేష్ఠలలో విత్తినట్లు.
ఉలవ లెత్త మంటే పూర్వా లెత్తినట్లు.
ఉలిపికట్టెకు ఊళ్ళోవార్తలు మెండు.
ఉలిపీ! ఉలిపీ! ఎక్కడికి కెడుతున్నా వంటే ఉలవలచేలో పరి గేర బోతున్నాను అన్నట్లు.
ఉల్లి ఉంటే మల్లి వంటలక్క !

ఉల్లిగడ్డంత (విత్తంత) కోడలు వస్తే వలుకుల్లోఉన్న అత్త ఉలికి ఉలికి పడ్డదట!

✓ ఉల్లి చేసిన మేలు తల్లిఅయినా చేయదు.

ఉల్లి తిన్న కోమటివలె.

ఉల్లిని నమ్మి తల్లిని నమ్మి చెడ్డవాడు లేడు.

ఉల్లి పండినా, మల్లె పూసినా మంచినేలలోనే.

ఉల్లి పదితల్లులపెట్టు.

ఉల్లి పాయంత తెలగా ఊరంతటికి చేటు.

ఉల్లిపాయంత బలిజ ఉంటే ఊరంత చెరుస్తాడు.

ఉల్లిపాయ పెట్టని కోమటి, ఊరంతా ధారపోసినట్లు.

ఉల్లిపూవు (పువ్వు) ఉల్లిపూవే, మల్లెపూవు (పువ్వు) మల్లెపూవే.

ఉల్లి మల్లి అవుతుందా ? ఉంచుకున్నది పెళ్ళా మవుతుందా ?

ఉల్లీ కాదు, వసా కాదు.

✓ ఉల్లి మల్లి కాదు, కాకి కోకిల కాదు.

ఉల్లి ముట్టనిదే వాసన రాదు.

ఉలుకున్నమ్మకు అలు కెక్కువ, గూద ఉన్నమ్మకు బాధ ఎక్కువ.

ఉవిదలకు బుద్ధి పెడతల నుండుగాదె!

ఉస్తికాయ ఊర నెంత ? నంజపెట్ట నెంత ?

✓ ఉసురు ఉంటే ఉప్పు అమ్ముకొని బ్రతుకవచ్చును.

✓ ఉసురు ఉంటే ఉప్పుకల్లు తినవచ్చు.

ఉసురు తప్పదు, ఉండేలుదెబ్బ తప్పదు.

—: :—

224325

Indira Gandhi Memorial Library ★ University of Hyd-46 ★

## ఊ

ఊఁ అంటే అపరాధము, ఆఁ అంటే అవరాధము.

ఊఁ అంటే ఉపచారం, ఆఁ అంటే అపచారం.

ఊక ఊకే, నూక నూకే.

ఊగిఊగి ఉయ్యేల ఒక్క చోటికే వస్తుంది.

ఊచుగల మగవాడు ఊరికి పోతే పెసరుచె అడ్డ మాయెనట !

ఊట ఎక్కిన మడిలో నాను (సస్యము) కుళ్ళిపోవును అన్నట్లు.

ఊటగ తింటే బూకలవాడు, కొంచెం తింటే ఏతులవాడు.

ఊటనేల దుక్కికి వస్తుందా ?

ఊట వేసిన మడి, వాతవేసిన పశువు.

ఊడుపులు ఉద్ధరైనట్లు.

ఊద (ఊదర) కూడు ఎన్నాళ్లు ? ఉద్యోగ మెన్నాళ్ళు ?

ఊదు కాలదు, పీను లేవదు.

ఊపిరి ఉంటే ఉప్పు అమ్ముకొని బ్రతుకవచ్చు.

ఊపిరి ఉంటే ఉప్పుకల్లయినా తినవచ్చు.

ఊపిరి పట్టితే బొజ్జ నిండునా ?

ఊబనా మొగుడు, ఉన్నా ఒకటే ఊడినా ఒకటే.

ఊబనా మొగుడు, ఒళ్ళో (ఒడిలో) ఉన్నా ఒకటే, దళ్ళో (దడిలో) ఉన్నా ఒకటే.

ఊరు అంతా ఉత్తరం చూస్తే దాసరి (దాక) పుల్లయ్య దక్షిణం చూచెనట !

ఊరు అంతా ఉల్లి, నీ వెందుకే తల్లి !

ఊరు అంతా ఉల్లి పూస్తే మాలపల్లి (గేరి) మల్లె పూసె (యు).

ఊరు అంతా ఊరిముఖము, దాసరి తాళ్ళముఖము.

ఊరు అంతా ఒకదారైతే చేనంతా ఒకమేర.

ఊరు అంతా ఒక త్రోవ, (దారి) ఉలిపికట్టెది ఒక త్రోవ (దారి).
ఊరు అంతా ఒక దోవ, ఊడదోక దొంకదోవ.
ఊరు అంతా చుట్టాలు, ఉట్టి కట్టుకో చోటు లేదు (కట్ట తావు లేదు).
ఊరు అంతా తిరిగి ఇంటి ముందుకు వచ్చి పెళ్లాం బిడ్డలను తలచుకొని
కాళ్ళు విరుగబడినాడట !
ఊరు అంతా తిరిగినా షే రేమో మొత్తే.
ఊరు అంతా నాన్నకు లోకువ, అమ్మకు నాన్న లోకువ.
ఊరు అంతా నాయనకు వణికితే, అమ్మకు నాయన వణుకును.
ఊరు పుట్టినప్పటినుండి ఉగాదు లెన్ని కాలేదు !
ఊరు పుట్టినప్పుడే ఉగాది పుట్టినది.
ఊరు అంతా వడ్లెండబెట్టుకొంటే నక్క తోక ఎండబెట్టుకొన్నదట !
ఊరక మామా అనక నాపెళ్ళాంతండ్రీ అన్నట్లు.
ఊరక రారు మహాత్ములు !
ఊరకుంటే ఉత్తనాబట్ట, గీకుకుంటే (గిల్లుకుంటే) పలచనాబట్ట !
ఊరకుండడంకంటే ఊగులాడటం మేలు.
ఊరకుండలేక, ఉప్పరిని తగులుకుంటే, తెట్టుకోక తన్నులు తాగి
లిస్తున్నాడట !
ఊరకున్న ఒళ్ళు ఉమెత్తాకుతో రుద్దినట్లు.
ఊరకున్న దేవునకు ఉపారాధన లెట్లు వచ్చును ?
ఊరకున్న ప్రాణానికి ఉచ్చుత్రాళ్ళు (ఉరిత్రాళ్ళు) తెచ్చుకొన్నట్లు.
ఊరకున్న ప్రాణానికి, ఉరి పోసు (పెట్టు) కొన్నట్లు.
ఊరకున్నవాడికి ఊహలు లావు (ఎక్కువ).
ఊరకున్నవాడె ఉత్తమయోగిరా !
ఊరకున్నవారికి ఉల్లిమిరియం పెట్టినట్లు.
ఊరకున్నవారికి ఊరెల్ల నోపదు.
ఊరపిచ్చుకకు తాటికాయంత గూడు !

ఊరపిచ్చుకమీద తాటికాయ ఉంచినట్లు.
ఊరపిచ్చుకమీద వాడి చంద్రాయుధమా ?
ఊరపిచ్చుకమీద వాడి వజ్రాయుధమా ?
ఊరపందికి పన్నీరు గంధమా ?

ఊరించి ఊరించి ఉగాదినాడు బూరె ఇచ్చెనట !
ఊరికళ గోడలే తెలుపును.
ఊరికి అమాసే లేదు అన్నట్లు.
ఊరికి ఉపకారంగా ఆలికి చీర (కోక) కొనిపెడతాను, ఇంటింటికి డబ్బివ్వండి అన్నట్లు.
ఊరికి ఉపకారమా ఆలికి చీర కొనిపెట్టుట.
ఊరికి ఉపకారి ఆలిక చీర కొని ఇచ్చినట్లు (పెట్టినట్లు).
ఊరికి ఒక భోగమువయితే భోగముది ఎవరివద్ద ఆడును (ఆడగలదు ?)
ఊరికి పోయేవానికి లేకపోయినా బహిర్భూమికి పోయేవానికి భత్యం కట్టుమన్నట్లు.
ఊరికి వచ్చినమ్మ నీకుకు రాదా ?
ఊరికే ఉంటే ఊరా ? పేరా ?
ఊరికే ఉండక ఉల్లంకలు పెట్టి చెప్పుదెబ్బలు సేవకులకు ఇప్పించారట !
ఊరికే పెట్టేఅమ్మా ! నీ మొగుడితో పాలు పెట్టు మన్నట్లు.
ఊరికే వస్తే మావాడు ఇంకొకడు ఉన్నాడు అన్నట్లు.
ఊరిజబ్బు చాకలి ఎరుగును, ఉద్యోగిజబ్బు బంట్రోతు ఎరుగును.
ఊరిన పుండుమీద ఉప్పుకారం చల్లినట్లు.
ఊరిదగ్గఱచేనుకు అంతటా దొంగలే.
ఊరినిండా అప్పులు, తలనిండా బొప్పులు.
ఊరినిండా అప్పులు, నోరినిండా పండ్లు (పళ్ళు).
ఊరిపిడుగు (శని) వచ్చి నీరిసెట్టిని కొట్టినదట !

ఊరిముందరికి వచ్చి నాపెళ్ళాం పిల్లా ఎట్లున్నా రని అడిగినాడట !

ఊరిముందరి చేను, ఊరిలో ఊ (ళ్లో) వియ్యం (కొరగావు).

ఊరిముందు ఉరుకులాట, మగనిముందు గంతులాట.

ఊరిలో కుంటి (ఊరకుంటి) అడవిలో లేడి.

ఊరివరకు వచ్చి ఊరిముందు పరుగెత్తినట్లు.

ఊరివారి పసుపు, ఊరివారి కుంకుమ ఊరేగు దేవరా!

ఊరివారి బిడ్డను నగరివారు కొడితే నగరివారి బిడ్డను నారాయణుడు కొట్టును.

ఊరివారిబిడ్డను రాజుగారు కొడితే రాజుగారిబిడ్డను దేవుడు కొట్టును.

ఊరివారి వడ్లపుణ్యాన్ని, మాఅత్తముడ్డిపుణ్యాన్ని నాకు నేడు భోజనం దొరికింది.

ఊరు ఉంటే మాదిగగేరి ఉండదా ?

ఊరు ఉన్నచోట మాలపల్లి ఉండదా ?

ఊరు ఉన్నది, చిప్ప ఉన్నది.

ఊరు ఉసిరికకాయంత, తగవు తాటికాయంత.

ఊరు ఉస్తికాయంత, సిద్ధాంతం తాటికాయంత.

ఊరు కాలిన మంటకు కూ డుడుకునా ?

ఊరు కొమ్మంటే ఉరి పెట్టుకొన్నదట !

ఊరు తిరిగి రమ్మంటే రోలు తిరిగి వచ్చినట్లు.

ఊరు దూరము, కాడి దగ్గర.

ఊరు నాకు కొత్త, ఊరికి నే కొత్త.

ఊరు పండితే ఊకైనా దొరుకుతుంది.

ఊరు పొమ్మంటున్నది, కాడు రమ్మంటున్నది.

ఊ (రు) రిమీద ఊరు పడ్డా, కరణంమీద కాసు పడదు.

ఊరు (8) ముండరి చేనైనా, ఉలవకట్టయినా, ఇంటిమనిషైనా, బద్ద పలుకైనా, బట్టకలిమివాడైనా మగోళ్ళాం(డ దున్నతాను అంటుందట ఎద్దు.

ఊరు లేక పొలిమేర ఉండునా?

ఊరు విడిచినా ఉలవఅలుగు విడువరాదు.

ఊరు విడిచి పొరుగూరికి పోయినా పూర్విస కర్మం పోదు.

ఊరే చేరవద్దు రాతా! అంటే గుత్తాన్ని ఎక్కడ కట్టేది అన్నాడు.

ఊళ వేసిన మడిలో నీ రుండదు.

ఊళ్లు చేసిన బాకీ కూళ్లు చేస్తే తీరుతుందా?

ఊళ్ళేలనివారు రాజ్యాలేలుతారా?

ఊళ్ళేలే కొడుకుకన్నా ఉపాదాన మెత్తే పెనిమిటి మేలు.

ఊళ్ళో అధికారమైనా ఉండవలె, ఊరంచు పొలమైనా ఉండవలె.

ఊళ్ళో ఇల్లు లేదు, అడవిలో చేను (పొలము) లేదు.

ఊళ్ళోకి రాజుగారు వస్తున్నారంటే పెండ్లామువంక అనుమానంగా చూచినట్లు.

ఊళ్ళో పెళ్ళయితే కుక్కలకు హడావుడి.

ఊళ్ళో బిచ్చం, గుళ్ళో నిద్ర.

ఊళ్ళోవాళ్ళకు పని చేసి ఒళ్ళంతా పుళ్ళు చేసుకొన్నట్లు.

ఊసరనేల పైరు, ఉదకము లేని చెరువు.

ఊసరక్షేత్రం, దూసరితీగ.

ఊసరక్షేత్రంలో అలికితే ఉల్లికోపులు పంట.

— : : —

## ఋ

ఋణము, రణము ఒకటి.

ఋణశేషం, వ్రణశేషం, (శత్రుశేషం) అగ్నిశేషం ఉంచరాదు.

ఋషిమూలము, నదీమూలము, స్త్రీమూలము విచారించరాదు.

— : : —

## ఎ

ఎంగిలికి ఆపోశన మెత్తినట్లు.

ఎంగిలికి ఎగ్గులేదు! తాగుబోతుకు సిగ్గులేదు.

ఎంగిలిచేత కాకిని తోలినవాడు భిక్షపెట్టునా?

ఎంచకురా పంచుకుంటావు.

ఎంచబోతే మంచమంతా క్రంతలే (కంతలే).

ఎంచిన ఎకు వేదిరా అంటే యజమాని పాదనే.

ఎంచి వేస్తే, ఆరి తరుగునా?

ఎండ కాచిననాడు ఏకులు వడికి, వాన కురిసిననాడు పత్తి పట్టుకున్నట్లు.

ఎండాకాలంలో ఏకులు వడికి వానాకాలంలో వడ్లు దంచినట్లు.

ఎండచే నీడ మెఱయును.

ఎండబడితే ఉండబడుతుంది; ఉండబడితే పండబడుతుంది; పండబడితే తిండిపడుతుంది; తిండిబడితే పండబడుతుంది.

ఎండమావులను పట్టినట్లు.

ఎండమావులలో దాహం తీర్చుకోబోయినట్లు.

ఎండమావులలో నీళ్లుంటాయా ?
ఎండా, చింతా తీర్చుకొని ఎడమధ్యాహ్నం వచ్చిందట !
ఎండా, గాలి, వాన వస్తే నక్కలపెళ్ళి.
ఎండి ఏదుము సండేకంటే మురిగి ముత్తును పండేది మేలు.
ఎండిన ఊళ్ళగోడు ఎవరికి కావాలి, పండిన ఊళ్ళకు ప్రభువు లందఱు.
ఎండినచెట్లు ఎన్నటికీ చిగుర్చవు.
ఎండినమోడుకు ఎఱ్ఱనిపూలు తగిలించినట్లు.
ఎండుమామిడి టెంకలు ఒడిలో పెట్టుకొని ఎవరితాడు తెంపవచ్చావోయి వీరన్నా ! అన్నదట !
ఎండు పండు లేకుండా ఉంటుందా ?
ఎండ్రికి కెంత పెట్టినా మురము రే.
ఎండునేలమీద ఎండ్రకాయ కనపడితే వాన తప్పదు.
ఎంత కఱవుఅయినా పులి పూరి మేయునా ?
ఎంత కఱవైనా విత్తనాలు దాచాలి.
ఎంతచెట్టు కంత గాలి.
ఎంత దయో సరకడికి చేంతాడు వెదుకుతున్నాడు.
ఎంత చేసినా ఎడమచేతి కడియం కుదవే !
ఎంత తిరిగిన మిరియాలు జొన్నలతో సరిపోనా ?
ఎంత నేర్చినా కాంతదాసులే !
ఎంత పండినా కూటికే, ఎంత ఉండినా కాటికే.
ఎంత పాలిచ్చినా ఏరు కుక్కకు కతుకునీళ్ళే !
ఎంత ప్రాప్తో అంత ఫలము.
ఎంత (పెద్ద) చెట్టు ఎక్కినా ముడ్డి నేలనే (కిందికే) చూస్తుంది.
ఎంత (పెద్ద) చెట్టున కంత (పెద్ద) పాటు.
ఎంత పొద్దుండగా లేచినా తుమ్మగుంటవద్దనే తెల్లారుతుంది.

ఎంత పొద్దుకాడ ఎల్లబారినా రాళ్ళేంకకాడనే తెల్లవారింది.
ఎంతపొద్దుకాడ లేచినా చింతగుంటపాలెం దగ్గఱ తెల్లవారుతుంది.
ఎంత పోట్లాడుకున్నా కల్లుదుకాణంకాడ ఒకటే.
ఎంత బలిసినా గొఱ్ఱెకు బెత్తెడు తోక.
ఎంత మంచికత్తిఅయినా తనపిడిని (కి) గంటు చేయదు (పెట్టలేదు).
ఎంత మంచిగొల్లకైనా నిమ్మకాయంత నెత్తి లేకపోదు.
ఎంతమంచి గొల్లోనికైన యాప (ఇప్ప) కాయంత ఎఱ్ఱుంటుంది.
ఎంత మంచిపందిఅయినా అమేధ్యం తినకమానదు.
ఎంతయ్యా! ఇవ్వాళ లాభం అంటే, ఎతిగినవాడు, ఎత్తినవాడు రాలే దన్నాట్ట!
ఎంతరాత్రికాడ లేచినా నల్లరాళ్ళకాడే తెల్లారుతుంది.
ఎంతలావు మొగవాడైనా ఆడదానికి లోకువే.
ఎంత లోభముంటే అంత ఖర్చు.
ఎంతవానికైనను వేపుడు వంగలకైనా ఎరవు కావాలి.
ఎంతవారలయినా కాంతదాసులే.
ఎంత స్వామిప్రసాదమైనా ఇంత చేదా?
ఎందుకు ఏడుస్తావురా పిల్లవాడా అంటే ఎల్లుండి మావాళ్లు (మాఅమ్మ) కొడతారు (కొడుతుంది) అన్నాడట!
ఎందుకు పుట్టావు పకా అంటే ఎదుటి వాళ్ళను ఏ (ఎ) క్కిరించటానికి అందట!
ఎందుకురా గడ్డి తింటున్నావంటే, పదేళ్ళ మట్టి తింటున్నాను అన్నాడట!
ఎందుకైనా ముఖరాశి బాగుండా లన్నారు.
ఎందులో పుట్టినపురుగు అందులో చస్తుంది.
ఎందులో పెట్టినా ఎడాకే.

ఎక్కడయినా బావ అనుగాని వంగతోటలో బావా! అనకు.
ఎక్కడ ఉన్నావే కంబళీ అంటే వేసినచోటే ఉన్నాను వెంగళీ అన్నట్లు.
ఎక్కడ ఉన్నావే గొంగళీ అంటే వేసినచోటే కంబళీ అన్నట్లు.
ఎక్కడ కట్టితే నేమి మనమందలో ఈనితే సరి.
ఎక్కడకు పోయినా పల్నాటికని తప్పదు.
ఎక్కడకు పోయినా కర్మం ఎదురుగుండానే వస్తుంది.
ఎక్కడ కొట్టినా కుక్కకాలు కుంటు.
ఎక్కడి పొద్దు గూకినా ఇక్కడికే రావాలి.
ఎక్కడ మేసినా పేడ మనపెరట్లో వెయ్యాలి.
ఎక్కడ మేసినా మనఇంట్లో పాలిస్తే సరి.
ఎక్కడా లేకపోతే (మొగుడు దొరక్కపోతే) అక్క మొగుడే దిక్కు(గతి)
ఎక్కడికి పోతావు విధవమ్మా! అంటే ఎంట (వెంట) వస్తాను పదవమ్మా అన్నదట!
ఎక్కడికి వెళ్ళినా తెడ్డు పగానే.
ఎక్కడి దక్కడే ఉంచి ఎల్లమ్మ ఇల్లలికినట్లు.
ఎక్కడిదిరా ఈపెత్తనం అంటే మూలనుంటే నెత్తిన వేసుకున్నా అన్నాడట!
ఎక్కడినీసు పల్లానికే చేరుతుంది.
ఎక్కడో కొడితే ఎక్కడో రాలినట్లు.
ఎక్క (కు) మంటే ఎద్దుకు కోపం, దిగమంటే కుంటికి కోపం.
ఎక్కితే గుఱ్ఱపురౌతు, దిగితే కాలిబంటు.
ఎక్కితే రైలు, దిగితే జైలు.
ఎక్కిన కొమ్మ కొట్టుకొనినట్లు.
ఎక్కినవానికి ఏనుగు లొట్టు.
ఎక్కి పోయి పట్టి చూచి, దిగివచ్చి రాళ్ళు రువ్వినట్లు.

ఎక్కిరించబోయి (వెక్కిరించబోయి) వెలకి (త్త) లా పడ్డట్లు.
ఎక్కువగా తిన్న పొట్ట, ఏకులుపెట్టిన బుట్ట చినుగవు!
ఎక్కువ తెలివి ఏడ్పులకారణం, తక్కువ తెలివి తన్నులకారణం.
ఎక్కువయినసొమ్ము బ్రాహ్మల కిత్తునా? బట్లకి త్తునా?
ఎక్కువ వెలపెట్టి గుడ్డనూ, తక్కువ వెలపెట్టి గొడ్డునూ కొనరాదు.
ఎగతాళి అంటే ఏడువవస్తాడు, కోడింగము (?) అంటే కొట్టవస్తాడు
ఇంట్లోకి వెడతాడు, ఇగిలిస్తాడు, ఇంక నామాట వింటాడా?
ఎగ దీస్తే బ్రహ్మహత్య, దిగ దీస్తే గోహత్య.
ఎగపురి, దిగపురి.
ఎగరబోయి బోర్లపడి, ఊరు అచ్చివచ్చింది కాదు అన్నాడట!
ఎగిరిన దూది గాలిలో ఎంతసేపో ఉండదు.
ఎగిరెగిరి దంచినా అంతే కూలి, ఎగరక దంచినా అంతే కూలి.
ఎగిరే ఎద్దే గంత మోసేది.
ఎగువా దాసంగం, దిగువా దాసంగం.
ఎచ్చిడి ఎగబలికిన కల్లుగుగ్గిళ్ళు కలబలికినవి.
ఎచ్చులకు (హెచ్చులకు) ఉచ్చ తాగితే నోరంతా గబ్బుగబ్బు.
ఎచ్చులకు ఏటపోతును కోస్తే ఒళ్ళంతా బొచ్చాయింది.
ఎచ్చులకు (ఎమ్మెలకు) ఏలేశ్వరం పోతే పక్కతోలు కుక్క తెత్తుకు
పోయినవి.
ఎచ్చులకు వేటపాలెం పోతే తన్ని తలగుడ్డా తీసుకున్నారట!
ఎట్లా కుదుబోణికైనా యాప (వేప) కాయంత వెఱ్ఱుంటుంది.
ఎడదిడ్డ మంటే పెడదిడ్డ మన్నట్లు.
ఎడపిల్ల ఏరాలితో సమానం.
ఎడమచేత్తో చేసింది కుడిచేత్తో అనుభవించవలెను.
ఎడ్డకత్తెర, నాలుకలో బెల్లం.

ఎడ్డెమంటే తెడ్డెమన్నట్లు.

ఎతలకు ఏకుపడితే నెత్తికుంపటి అయిందట !

ఎత్వం పోయేవాడా! ఏమట్లలో ఓనుడుగు వేసి పోరా అన్నట్లు.

ఎత్తివచ్చిన కాపురానికి ఏకా లూనినా ఒకటే.

ఎత్తుకుతిన్నవాణ్ణి పొత్తిళ్లలో పెట్టుకుంటే అంతా తీసి బొంతలో పెట్టుకున్నాడట !

ఎత్తుకున్న చంక నుండదు, దించిన దిగువ నుండదు.

ఎత్తుకున్న బిడ్డ (వాడు) మొత్తుకున్నా దిగదు (దిగడు).

ఎత్తుకొనితిన్న బోలె (జోలె) ఎదురుగా వస్తే చంకనున్న బోలె (జోలె) సలాం చేసిందట !

ఎత్తుపడిన గొడ్డు పులికి జడుస్తుందా ?

ఎత్తుభారం, మొత్తుకోళ్లా.

ఎత్తెత్తి అడుగు వేస్తే పల్లాకుమీద పడిందట!

ఎత్తేవాడుంటే ఏకులబుట్టా బరువే.

ఎద (చెద) గొడ్డుకు రెము వుండదు.

ఎద (దు) ట అన్నది మాట, ఎదాన పెట్టింది వాత.

ఎద (దు) ట ఉన్నవాడు పెండ్లికొడుకు.

ఎద (దు) టి పొయ్యి మండితే తనపొయ్యిలో నీళ్ళు పోసుకొన్నట్లు.

ఎద (దు) టి ఇంట్లో పెండ్లి అవుతూంటే మాఇంట్లో పెండ్లి అవుతుందనుకొన్నట్లు.

ఎదుగుకుండా అద్దముంటే ఎ (వ) క్కిరించుకొని నవ్వుతుంది.

ఎదిగినదానిని చెం తేసుకున్నట్లు.

ఎదురు తిరిగిన కుక్కను ఏదీ కరవలేదు.

ఎదురుపడ్డమ్మ ఎండిపోయిందట!

ఎదురు పెట్టి కుదురు కొట్టించుకున్నట్లు.

ఎదురు పెట్టి చదరంగ మాడినట్లు.

ఎదుఱొమ్ములో ముల్లుకఱ్ఱ పొడిచినట్లు.

ఎద్దుఅంత కుప్పయితే ఏడుపుట్లు చోళ్ళు.

ఎద్దుఅడుగులో ఏడుగింజలు పడితే పైరుపంట పలుచన.

ఎద్దుఅడుగులో ఏడు చావిడము లుంటే పట్టుకో బోతే పది పాఱి పోయిన

ఎద్దుఅడుగులో ఏడు సొరచేపలు.

ఎద్దు ఈనింది అంటే గాటను (కొట్టాన) కట్టు మన్నట్లు.

ఎద్దు ఈనింది అంటే గొందిన కట్టు మన్నట్లు.

ఎద్దు ఉన్నవానికి బుద్ధుండదు, బుద్ధున్నవానికి ఎద్దుండదు.

ఎద్దున్నవాడి వ్యవసాయం చూడు, మందిఉన్నవాడి మాఘబలం చూడు.

ఎద్దు ఎండకు లాగా, ఎనుబోతు నీడకు లాగా.

ఎద్దు ఎండకు లాగ, దున్న (దూడ ) నీడకు లాగ.

ఎద్దు (నె) ఎక్కిన తీరు కాదు, సద్ది తిన్న నోరు కాదు.

ఎద్దు ఏడ్చిన యు (వ్య) వసాయం, ఆలి ఏడ్చిన సంసారం ముందుకు రాదు.

ఎద్దు ఏ మెఱుగురా అటుకుల రుచి, గాడి దే మెఱుగురా గంధపు పొడివాసన.

ఎద్దుకు, ఎనుబోతుకు లంకె వేసినట్లు.

ఎద్దుకు ఏమి తెలుసు అటుకుల రుచి.

ఎద్దుకు కొబ్బరికాయ ఇస్తే ఏం చేస్తుంది ?

ఎద్దు కొవ్వి ఆబోతుపై జంకె వేసినట్లు.

ఎద్దు కెగవేయ, బత్తెకు సగవేయ.

ఎద్దు ఓగ లేదు (?) పై బాగ లేదు.

ఎద్దుకొద్దీ సేద్యం, సద్దికొద్దీ పయనం.
ఎద్దుగా ఏడాది బ్రతికేకంటే ఆబోతుగా ఆరు నెలలు చాలు.
ఎద్దు చచ్చినా వాత బాగా పడింది.
ఎద్దు చేను మేసిపోతే గాడిదకు చెవులు కోసినట్లు.
ఎద్దు తంతుందని గాడిదకాళ్ళు పట్టుకున్నట్లు.
ఎద్దు తంతుందని గుఱ్ఱము చాలున దాగినట్లు.
ఎద్దుతో వ్యవసాయం, ఆలితో సంసారం.
ఎద్దు మంచ మెక్కినట్లు.
ఎద్దు దున్నగా పిణుజు వగర్చినట్లు.
ఎద్దును అడిగా గంత కట్టడం ?
ఎద్దు ఎక్కినవాడే లింగడు, గడ్డ నెక్కినవాడే సంగడు.
ఎద్దు కొద్దిలో కొనరాదు, బట్టను భారీలో కొనరాదు.
ఎద్దును కొని తలుగుకు లోగినట్లు.
ఎద్దును చూస్తే ముద్దు వస్తుంది, ఈడ్పు చూస్తే ఏడ్పు వస్తుంది.
ఎద్దుపుండు కాకికి ముద్దా ? (నొప్పా ?) (రుచి).
ఎద్దుబలము, ఏదీ బలము.
ఎద్దు బీదయితే చేను బీద.
ఎద్దు మంచిదయితే ఏ (వే) రూరికి పోతుందా ?
ఎద్దు మోసినంత, గోనె పట్టినంత.
ఎద్దులవెంబడే తాళ్ళు,
ఎద్దులా కష్టపడినా ఎంగిలిగంజే గతి.
ఎద్దులు చెయ్యను, గుఱ్ఱాలు మెయ్యను.
ఎద్దులూ, బండీ ఏకమైతే కొండమీదికి కొనిపోతాయి.
ఎద్దులేని సేద్యం, సద్దిలేని పయనం.
ఎద్దువలె ఉండీ తేలుమంత్రం తెలియదా ?

ఎద్దువలె కుక్కను పెంచి రెడ్డి తానే మొరిగినట్లు.
ఎద్దువలె తిని, మొద్దువలె నిద్రపోయినట్లు.
ఎద్దూ తూలాలని ఉంది, గంతా పడాలని ఉంది.
ఎద్దైనా ఏడాదికి నేర్చును, మొద్దు ముప్ఫైఏళ్ళకైనా నేర్వడు.
ఎద్దో అంటె గిద్దెడు పాలు అన్నట్లు.
ఎన్నడూ ఎఱుగని రెడ్డి గుఱ్ఱ మెక్కితే ఎ (క) సకముం దయిందట !
ఎన్నడూ ఎఱుగనివానిని ఎద్దులబేరానికి తోలితే ఎత్తెద్దుకు ఎనభై
నల్లెద్దుకు నలభై అన్నాడట !
ఎన్నడూ నామగడు ఎల్లి! ఎల్లి! అనలేదుగాని ఇల్లు కాలిననాడు ఎల్లి!
ఎల్లి! అన్నాడు.
ఎన్నడూ దొరకనమ్మకు ఏగాని దొరికితే ఏడుముళ్ళు పెట్టిందట !
ఎన్నిపుటాలేసినా ఇత్తడి ఇత్తడే, పుత్తడి పుత్తడే.
ఎన్ని బూతులైనా పిడికెడు కొఱ్ఱలు కావు.
ఎన్నిసూదులైతే ఒకగడ్డపార కాను ? (అవుతుంది).
ఎనుబోతుమీద వాన కురిసినట్లు.
ఎనుము ఈనింది రెడ్డీ! అంటే నీ కేమి కద్దే బొడ్డీ! అన్నాడట !
ఎనుము తన్నునని గుఱ్ఱము వెనుకకు పోయినట్లు.
ఎన్నో కంతులు కోశానుగాని నాకంతెంత నొప్పి లేదు.
ఎన్నో వ్రణాలు కోసినానుగాని నావ్రణమంత తీపు లేదు.
ఎప్పటిఅమ్మకు నిప్పటే గతి (నిప్పట్టే గతి).
ఎప్పటి మేలు అప్పటికే.
ఎముక కొఱికే కుక్క ఇనుము కొఱుకునా ?
ఎముకలేని నాలుక ఎట్లా త్రిప్పినా తిరుగుతుంది.
ఎముకలేని నాలుక ఎటైనా దొర్లుతుంది.
ఎఱను చూపి (వేసి) చేపను పట్టినట్లు.

ఎడ్లకోమటినీ, నల్లబ్రాహ్మణ్ణీ నమ్మరాదు.

ఎడ్డెని ఆకాశమునకు బిళ్లుకు వానలు.

ఎడ్డెనేల (భూమి) పంట ఒకనాటి వంట.

ఎత్తినఎత్తిని చేసినపాపం పిట్టపిట్ట పోగొట్టుకోవలె.

ఎత్తిగీ తుత్తిగీ ఎలుకతుమ్ముల్లో దూరినట్లు.

ఎలుక తోలిన ఏనుగుపడిపోయేకు వాన.

ఎలుక పిరికెడు సాయం.

ఎలుగు (కుక్కల్లో) ఎన్నెలు వస్తే ఏకులు నీ ముగ్గుకు వనుకరాదా?

ఎరువు ఉంగరాల ఎక్కువాడ జన్యగాడు.

ఎరువా, ఎం (కం) బలి వ (నే) స్తే ఎవరింటిదే పైరు.

ఎరువు పెట్టిన పొలము, (చేను) ఏలుబడిఅయిన కోడలు.

ఎరు (వు) వస్త్రం కాదు, ఎరువు పెళ్లిక కాదు.

ఎరు (వు) పుస్తకం ... ఎవరిదో ఎట్లుంటే అట్లు.

ఎరు (వు) పుల సొమ్ములు ఎరు (వు) పులవా ... చేసుకొనుట
ముఖాన వేసినట్లు ... ఉంటుంది.

ఎరు (వు) పుల సొమ్ములు బరువుల చేటు, తిరుగ్గా పెట్టా తీపులచేటు,
అంకునో ... పోతే అప్పుల చేటు.

ఎరువులేని పైరు, ఎరువులేని పైరు (...).

ఎరువులేని పొలము, పెంపులేని ఏరు.

ఎరువులేని సేద్యం, ఎరువు (కరువు) దేవా (దు) వాక్యం.

ఎరువు వేస్తే ఎట్లోనైనా పండిస్తాడు.

ఎరువు సరసము కాదు, వాదు ... కాదు.

ఎలమల్లుకి ఎద్దు నివ్వరాదు, పాముల్లుకి పడుచు నివ్వరాదు.

ఎల్ల పాములూ ... తలెత్తితే ఏలికపామూ తల ఎత్తిందట!

ఎల్లమ్మపెళ్ళిలో పుల్లమ్మశోభనం.

ఎల్లయ్యకెస్తు లేవు, మల్లయ్యకు బండి లేదు, తెల్లవార్లు బాదుగనే.

ఎల్లవారున్నూ బ్రతుకు తెల్లవారితే తెలుస్తుంది.

ఎల్లిని మల్లి చేయు, మల్లిని ఎల్లి చేయు.

ఎల్లిపదానికి ఏగాని, తొర్బ్బిపదానికి రెండేగా.

ఎల్లిమీద పుల్లి, పుల్లిమీద మల్లి.

ఎల్లి సెట్టిలెక్క ఏకలెక్క.

ఎలుక ఎంత ఏడ్చినా పిల్లి తినకట్టు వదలదు.

ఎలుక ఎంతకాలం తపసిదిక్కు (తప్పించుకొనగలదు).

ఎలుక పట్లో పోతే నేమి? పులి బోనులో పోతే నేమి?

ఎలుకకు పిల్లి సాక్షి.

ఎలుకచావుకు పిల్లి మూర్ఛ పోవునా?

ఎలుకతోలు ఎంత తోమినా నలుపే.

ఎలుకమీద కోపముతో ఇంటికి చిచ్చు పెట్టినట్లు.

ఎలుకమీది కోపాన ఇల్లేర్చినట్లు.

ఎలుగుగొడ్డుకు ఇ నేమి? అ వేమి?

ఎలుగుబంటికి వెంట్రుకము తీసినట్లు (వెంట్రుకపుడక).

ఎలుగుబంటి కొట్టకుండా దీవించిన ఫలము.

ఎవడి (ని) ఆయుధము వానికే ముప్పును విడుచును.

ఎవడిజంజెం వాడికి ముప్పు (ఉరి).

ఎవడిప్పు వాడికి తెలియదు.

ఎవడినోటికంపు వాడికి తెలీదు (తెలియదు).

ఎవడిముగ్గానికి వాడే సేనాధిపతి.

ఎవడు తవ్విన (త్రవ్వుకున్న) గోతిలో వాడే పడును.

ఎవరిఅబ్బశ్రాద్ధమురా వెక్కి వెక్కి ఏడుస్తావు?

ఎవరిఅబ్బసొమ్మురా వెక్కి వెక్కి ఏడ్చేవు?

ఎవరిఇంటిదోసె చూచినా తూటే.
ఎవరిపడుపు వాళ్ళకే ఎరుక తెగులుతుంది.
ఎవరికండ కోస్తే వారికే నొప్పి.
ఎవరికంపు వారి కింపు.
ఎవరికి పుట్టిన బిడ్డవురా ఎక్కి ఎక్కి (వెక్కి వెక్కి) ఏడ్చేవు?
ఎవరికి పెట్టావే దంపుడు అంబలి అంటే మింట్లో బుద్ధిహీనునికి అన్నది.
ఎవరికి వారే యమునాతీరే.
ఎవరికొంప తీయడానికి ఈజంగం వేషం వేశావు?
ఎవరిజాన (జీన) తో వారే మునిగిన జాణే (కుణే).
ఎవరిజాన (జీన) తో వారు ఇసుజానలు బెత్తెడే.
ఎవరినీళ్ళల్లో వారు మునుగవలెను.
ఎవరిపాపాన వాళ్ళు పోతారు.
ఎవరిప్రాణం వాళ్ళకు తీపి (తీపు).
ఎవరిపిచ్చి వారికి ఆనందము.
ఎవరిపెళ్ళాం పేరు వారికెరుకు?
ఎవరిపైగుడ్డ వారికి బరువే
ఎవరిబిడ్డ వాళ్ళకు తీపు (తీపి).
ఎవరిముడ్డికిందికి నీళ్ళు వస్తే వాళ్ళే లేస్తారు (వాళ్ళకే తెలుస్తుంది).
ఎవరివల్ల చెడ్డావోయి పేరన్నా! అంటే నావల్ల చెడ్డానోయి
పేరన్నా! (కొండలరాజా) అన్నాడట!
ఎవరిపట్టి వారి ఆనందం.
ఎవరు ఇచ్చింది ఈనాముగ్రాం అంటే నేనే ఇచ్చుకున్నాను అన్నాడట!
ఎవరు ఏమి చేసినా ఇంటికి ఆలవుతుందా? దొంతికి కడవ వవుతుందా.

— : : —

# ఏ

ఏఆకు రాలినా ఈతాకు రాలదు.

ఏఇంటికి వచ్చావే కోడలా! అంటే ఆఇంటికే వచ్చాలే అన్నదట!

ఏఊరి కేది దారి (తెరువు)?

ఏఊరు పోతావూ! అంటే నువ్వారే పోగావూ! అన్నదట!

ఏఊరు మీది? అంటే పసుపు మోకాలులోతు అన్నదట!

ఏఎండకు ఆగొడుగు.

ఏకయి వచ్చి మేకయి బిగిసినట్లు.

ఏకజ్జను నిప్పంటే ఆకజ్జే కాలును. (అదే కాలుతుంది).

ఏకాదశా బ్రాహ్మడా! అంటే కాలే కొరవితో నన్ను దోస్తావు అన్నాడట!

ఏకాదశా, ద్వాదశా బ్రాహ్మడా! అంటే ఆడవాళ్లు కాపురాలు చేస్తారా? అన్నాడట!

ఏకాదశిఇంటికి శివరాత్రి పోయినట్లు.

ఏకాదశినాడు తల అంటుకుంటావేమి? అంటే అది నిత్యవ్రతము నేనే ఆరంభించాను అన్నాడట! మర్నాడు తల ఎందుకు అంటుకో లేదంటే నిన్నటితో వ్రతసమాప్తి అన్నాడట!

ఏకాదశినాడు పిలిచి తినకపోతే రాకాసుల్లై పుడతారు.

ఏకాదశిమరణ మని ఉరికొయ్యలలో పడతానా?

ఏకానికి బెల్లం? ఏకానికి ఉప్పు? (అని అడిగినట్లు).

ఏకాలు జారినా పిజ్జికే (పిల్లికే) మోసం.

ఏకుదారము, ఏగానిపుస్తె.

ఏకులవంటి మెతుకులు చేసుకొని ఎనుముపెరుగు పోసుకొని యమ రాలినిగనుక తింటున్నానుగాని దగ్గరికి రాకండి పిల్లల్లారా! ద (జ) డుసుకు నేను అన్నట్లు.

ఏకులు పెడితే (ఉంచిన) బుట్టలు చినుగునా ?
ఏకులు వడకా లేను, ఎత్తు (ఎత్తి) పెట్టా లేను.
ఏకులు వడికినట్లూ కాదు, మొగుడిదగ్గర తొంగున్నట్లూ కాదు.
ఏకు లేని ఆరాటము, మొగుడు లేని పోరాటము.
ఏగ్రహము పట్టినా ఆగ్రహము పట్టరాదు.
ఏగానిపుస్తె, ఏకుదారము.
ఏగానిముండకు డబ్బున్నర క్షవరం.
ఏగాలి కాగూగు.
ఏగాలి కాచాప (ఎత్తినట్లు).
ఏగాలి వీస్తే ఆగాలికి కొట్టుకపోయినట్లు.
ఏగిలి చేస్తే ఏలినవాన్కైనా పండుతుంది.
ఏగిలి దున్నితే ఎట్టి (ఇట్టి) మూలకైనా పండును.
ఏగుంటలో నీరు ఆగుంటలోనే ఇంకుతుంది.
ఏగుజ్జానికి తోక ఉంటే ఆగుజ్జునే ఊపుకొంటుంది.
ఏగూటిచిలుక ఆగూటిపలుకు.
ఏచంక నాకినా ఏమీ లేదుగాని ఏనుచంక నాకితే ఏగాని ఉంది.
ఏచెట్టూ లేనిచోట ఎంపలి (రెంపలి) చెట్టు మహావృక్షము.
ఏటా ఏకరహాడ ఎందుకు కాదు ?
ఏటా ఏటా చేను ఏమి పండించును ?
ఏటిఅవతల ఇచ్చేకన్న ఏట్లో పడేస్తే నయం.
ఏటిఅవతల ఊళ్ళే లేవు అన్నట్లు.
ఏటిఆవలి ముత్యములు తాటికాయలంతేసి అన్నట్లు.
ఏటిఈతకు లంక మేతకు సరి.
ఏటిబిడ్డచేను ఏరు వస్తే నిలుచునా ?
ఏటిబిడ్డున చేను, చీటికిమాటికి (మాటిమాటికి) భయం.

ఏటికి ఎదు రీదినట్లు.

ఏటికి ఎప్పుడు పోయినావు? ఇసుక ఎప్పుడు తెచ్చినావు? అంటే ఆడవారు తలిస్తే అదెంతసేపు అన్నదట! మగవారు తలిస్తే ఇదెంతసేపు అని నాలుగు బాదినాడట!

ఏటికి లాగితే కోటికీ, కోటికి లాగితే ఏటికీ అన్నట్లు.

ఏటిదరి మ్రానుకు ఎప్పుడూ పతనమే.

ఏటిమంటికి బీటిమన్ను తోడయినట్లు.

ఏటిమీంది దేవరకు కూటిమీందే చింత.

ఏటిసంత లెక్కలు తీస్తారు? (ఏటిసంత తీర్పు ఎవ్వరికెరుకను?)

ఏటివద్ద నక్క కాగానే పాటికేవు ఎరుగునా?

ఏటివరద, నోటివరద.

ఏటికావలనక్కకు పాటికేమి తెలుసు?

ఏటుకు ఏటు, మాటకు మాట.

ఏట్లో ఉదక మున్నది సూర్యదేవా!

ఏట్లో కలిపిన చింతపండువలె.

ఏట్లో పడ్డవానికి ఎన్నో ఎన్నికలు.

ఏట్లో పారేసిన ఎవరు తాగితే ఏమి?

ఏట్లో వంకాయలు కాస్తవా? అంటే కాస్తవి అన్నట్లు.

ఏట్లో వేసినా ఎంచి వేయవలెను.

ఏడవగలిగితే (ఏడ్చినకొద్దీ) ఏ. (వ్య) సంసారం.

ఏడవగా ఏడవగా ఎఱ్ఱవాడే గెలిచాడు.

ఏడ్చి ఏ (వె) ంకటస్వామి అనిపించుకొన్నట్లు.

ఏడ్చి తద్దినం పెట్టించుకొన్నట్లు.

ఏడ్చి ముఖాం కడుగుకొన్నట్లు.

ఏడు ఊత లీసిననక్కకు మూడుఊతలీసిన నక్క తినక నేర్పిందట!

ఏడు ఎండలవిత్తనాలు ఎంతవఱపుకైనా ఆగుతాయి.

ఏడు కన్నమున్నతను మూడుకన్నమున్న ముక్కు సెర్పించెనట !

ఏడు కరవులు వస్తున్నాయిరా అంటే, తొలకరి వ్యాసోన్ వస్తే ఆకు
నొవ్వు లేమి వేస్తాయి అన్నాడట !

ఏడు కుసులు చూచి ఎద్దును కొనమన్నారు.

ఏడుగురిని మారిస్తే పెద్దగౌడసాని !

ఏడు నెలలకు ఎనిమిది నడకలు అన్నట్లు.

ఏడుపు ఏడింటి కర్థం.

ఏడుపులో ఏడుపు ఎడమచేయి నాగా పెట్టు అన్నట్లు.

ఏడ్పులో ఏడ్పు ఎడమచేయి బయట పెట్టినట్లు.

ఏడు వనువుల కెల్లినా (వెళ్ళినా) ఏకులరాట్నం తప్పలా (తేను).

ఏడు మాటలు మాట్లాడినా ఏడు అడుగులు వేసినా గుణం తెలుస్తుంది.

ఏడు మాసికల చీర, ఎదురుబొంగాల రవిక, జరుగుతూ జరుగుతూ
నేను సారె కట్టుకవచ్చినాను.

ఏడు మెతుకులు తింటే ఏనుగంత త్రాణ.

ఏడు సాళ్లు పాసిన చేలో ఒంటిసాలంకితో ఏడుగుర్ని తినొచ్చు.

ఏడుస్తావు ఎలుకా ! అంటే నా బాధ నీకే తెలుసు అన్నదట !

ఏడుస్తున్నా వెందుకు గ్రామస్థుడా ? అంటే ఒకనాడు నా మొహం నవ్వి
ఏడిపించా అన్నాడట !

ఏడుస్తూ ఏరువాక సాగితే కాడిమేడి (మోకు) దొంగలు దోచుక
పోయారట !

ఏడుస్తూ వ్యవసాయం చేస్తే కాడిమేడి కాలిపోయిందట !

ఏడుస్తూన్నవాణ్ణి దానిమ్మకాయలు కావాలా ? అంటే దానికాయలే
కావాలి అన్నాడట !

ఏడూళ్ళు తిరిగినా ఎత్తికట్టిదాన్ని కొనుమన్నారు.

ఏడ్చేదాని ఎడమచేతికిందా, కుట్టేవాని కుడిచేతికిందా కూర్చోరాదు.
ఏడ్చేదాని మొగుడు వస్తే ఏకు వడికేదాని మొగుడు వస్తాడు.
ఏడ్చేదాని మొగుడు వస్తే నా మొగుడూ వస్తాడు.
ఏడ్చేదాని బిడ్డకు అరిసెలందు చూపినట్లు.
ఏడ్చేదాని బిడ్డను తానే కనవలెను అన్నట్లు.
ఏతానులో పీలిక ఆతానుకు చెందినట్లు.
ఏతాముపాటకు ఎదురుపాట లేదు.
ఏతి అంటే ప్రీతి అన్నట్లు.
ఏదారి అంటే గోదారి అన్నట్లు.
ఏది పట్టినా దయ్యము పట్టినట్లు.
ఏదీ కానివేళ గేదె ఈనినట్లు,
ఏదుకు పెడతల బుద్ధి.
ఏ దేవుడు వర మిచ్చినా పెనిమిటి లేందే పిల్లలు పుట్టరు.
ఏనాడు లేదు ఎట్టిగడ్డచారు.
ఏనుగంత తండ్రి ఉండేకంటే ఏకంత తల్లి ఉండేది మేలు.
ఏనుగు ఇచ్చిన దాతకు అంకుశ మీయగా ఎంత ?
ఏనుగు ఎత్తుపడితే ఏనుగే లేవాలికాని ఎవరు లేపుతారు.
ఏనుగు ఒళ్ళు ఏనుగుకు బరువు, చీమఒళ్ళు చీమకు బరువు.
ఏనుగుకు ఒకసీమ, గుఱ్ఱా కోప్రాయు, బత్తె కొరకానిసు.
ఏనుగుకు కాలు విరగడం, దోమకు రెక్క విరగడము సమము.
ఏనుగుకు (కి) వెలగకాయలు (వెలక్కాయలు) లొటలొట.
ఏనుగు (న) కు సిళ్ళు చూపినట్లు.
ఏనుగుదాహానికి మూరునీళ్ళా ?
ఏనుగు నడచినా, గుఱ్ఱము పరుగెత్తినా ఒకటే.
ఏనుగును ఎక్కినవాడు కుక్కకూతకు జడియడు, దిష్టికంత దూసునా ?
ఏనుగును ఏకులబుట్టలో ఉంచి పో మ్మన్నట్లు.

ఏనుగును చూచి కుక్కలు మొరిగినట్లు.

ఏనుగును తెచ్చి, ఏకులబుట్టలో ఉంచి అది లేవనెత్తిన పెట్టి, తన్ను ఎత్తుకో అన్నట్లు.

ఏనుగునయినా ఎ (ఏ) ంటితో కట్టవచ్చు.

ఏనుగు పడుకొన్నా గుఱ్ఱమంత ఎత్తు.

ఏనుగు పిత్తినట్లు.

ఏనుగుపుస తోమినట్లు.

ఏనుగు పోతూంటే కుక్కలు మొరి (అ) గినట్లు.

ఏనుగు పోయేదారి ఎఱుగడుకాని దోమలు పోయేదారిలో తొంగు న్నాడు.

ఏనుగు బ్రతికినా వెయ్యే, చచ్చినా వెయ్యే.

ఏనుగు రొంపిలో కూరుకుపోతే కాకిఅయినా పొడుస్తుంది.

ఏనుగు మునిస్తే నెత్తిన మన్ను పోసుకుంటుంది.

ఏనుగు మింగిన ఎలగ (వెలగ) పండువలె.

ఏనుగుమీద ఎండ కాచినట్లు (ఈగ) (దోమ) (వాలినట్లు).

ఏనుగుమీద దోమ వాలితే ఎంత బరువు ?

ఏనుగుమీద పొయ్యేవానిని సున్న మడిగినట్లు.

ఏనుగుమీద వర్షమువలె.

ఏనుగుమోత, ఏనుగుమేత.

ఏనుగుల పోరుకు (పోట్లాటకు) ఏట్రింతరాచుబారము.

ఏనుగులు ఎగిరిపోతూంటే దోమ లోలెక్కా ?

ఏనుగులు ఏట గ్రుంకితే పాటిరేవు అడుగవచ్చింది నక్క.

ఏనుగులు తినేవాడికి పీనుగులు పిండివంట.

ఏనుగులు మ్రింగిన ఎల్లమ్మకు పీనుగులు పిప్పళ్లు.

ఏపట్లా చావకపోతే బాపట్లకు పంపండి.

ఏపాటు తప్పినా సాపాటు తప్పదు.

ఏపుట్టలో ఏపామో! ఏగుళ్లో ఏమహాత్మ్యమో!

ఏపూజ తప్పినా పొట్టపూజ తప్పదు.

ఏబట్టకు ఆ బట్టనే మాసిక వేయాలి.

ఏబ్రాసికి పని ఎక్కువ, దేబిరాముడికి తిండి ఎక్కువ.

ఏబ్రాసికి పని ఎక్కువ, లోభికి ఖర్చెక్కువ.

ఏబ్రాసిపెళ్ళి కెదురుపోతుంటే, ఏకులరాట్నం ఎదురయ్యిందట!

ఏమండీ కరణంగారూ! గోడల్లో సద్దాను అంటే కాదు మహాకత్తు చేస్తున్నాను అన్నాడు.

ఏమండీ సాహెబుగారూ! చిక్కాను అంటే మాకు ఇంకా సిక్కుతాం, ఇంకా సిక్కుతాం, సస్తాం ఛే, నీకి ఎందుకు? అన్నాడట!

ఏమందలో కట్టినా మనమందలో ఈనితే సరి.

ఏమయ్యా! మానాన్న బాగున్నారా? అంటే, అయ్యా! బాగానే ఉన్నారు; పిత్తసంపన్నం తింటున్నారు; దాపుకుబట్టలు కడుతున్నారు అన్నాడట!

ఏమి అప్పాజీ! అంటే తాలింకోర్టి రాజాజీ! అన్నట్టు.

ఏమి చేస్తున్నావురా? అంటే వంకబోసి (బొంకబోసి) ఎత్తుకుంటున్నాను అన్నట్టు.

ఏమి చేసుకు బ్రతుకు మనవన్నా! అంటే నోరు చేసుకు బ్రతుకు బిడ్డా! అన్నట్టు.

ఏమిట్రా మేనమామనుడ్డీలో కట్టె పెడతావు? అంటే బాబాయి అనుకున్నాను అన్నాడట!

ఏమిటికి కేమీ లేదు, మూడిటికి కొసరు!

ఏమి పెట్టి అలిస్తివమ్మా! తేలికి నీ క్కిస్తివి అన్నట్టు.

ఏమి పెట్టుక తిన్నావంటే ఆక పెట్టుక తిన్నానందట!

ఏమి పోలిసెట్టీ! అంటే ఎప్పటి మొత్తుకోళ్ళే అన్నాడట!

ఏమిరా కోటా, అంటే ఎప్పటిదే ఆట అన్నాడట!

ఏమిరా పిల్లవాడా! ఏడుస్తున్నా వంటే ఎగ్గొట్టే సూత్రానికి అన్నట్లు.

ఏమిరా ముసలాడా! వణుకుతావు? అంటే ఎగగొట్టుటకు ఎత్తు అన్నాడట!

ఏమీ ఎఱుగని పిల్ల మామను మరిగిందట!

ఏమీ ఎఱుగనివానికి ఏగాని దొరికితే, ఎందులో పెట్టుదు కందుల బుట్టా! (పైకాలు బుట్టా!) అన్నాడట!

ఏమీ తోచకపోతే ఏ (స) క్కిరించాడట!

ఏమీ తోచనమ్మ తోడికోడలి పుట్టింటికి వెళ్ళిందట!

ఏమీ లేనమ్మకు ఏడ్పులశృంగారం, కలిగినమ్మకుకడుపుల శృంగారం.

ఏమీ లేని ఆకులు ఎగసిపడితే, అన్నీఉన్న ఆకులు అణగిఉంటాయి!

ఏమీ లేనివానికి ఏతులు లావు, స్వాములవానికి జపాలు లావు.

ఏమే గురుగాకా అంటే ఎవరి కేమి ఫలమే బద్దాకా? అనెనట!

ఏమోయి సెట్టీ! అంటే ఎప్పటామే అన్నాట్ట!

ఏమోయి సెట్టీ! పట్లో కొట్టుకుపోతావు? అంటే నిక్షేమోయి అమ్మడానికి అన్నాడట!

ఏరాజ్యానికి ఏరాజో అన్నట్లు?

ఏరాలి కేడు, నాకు మూడా?

ఏరాయి అయితేనేమి పండ్లూడగొట్టుకోవడానికి?

ఏరిపారి ఇ (వి) త్తనాలు కట్టాలి.

ఏరికోరి వ్యవసాయం చేస్తే, కాడిమేడి వొంగ తొర్రపోయినట్లు.

ఏరుకొని తినే పక్షికి ముక్కున ముల్లు విరిగినట్లు.

ఏరుదాటి తెప్ప తగులబెట్టినట్లు.

ఏఱు అయినా మూడునేరములు కాస్తుంది.

ఏఱు ఎంత పారినా కుక్కకు కుతుకునీళ్ళే.

ఏఱు ఎన్నివంకలు పోయినా సముద్రములోనే పడవలెను.

ఏరు ఏడామడ నుండగానే చీర విప్పి చంక పెట్టుకొన్నట్టు.

ఏఱు దాటేవఱకు ఎంగన్న, ఏఱు దాటినాక సింగన్న.

ఏఱు దాటేవఱకు ఏటిమల్లన్న, ఏఱుదాటినవెనుక కాటిమల్లన్న.

ఏకుకతినేవాడివెంబడి గీకుకుతినేవాడు పడ్డాడట!

ఏఱు పోయిందే పోక, ఏలిక చెప్పిందే తీర్పు.

ఏఱు ముందా? ఏకాదశి ముందా?

ఏఱు ముందా? ఏఱువాక పున్నమ ముందా?

ఏఱు ముందా? ఏఱువాక ముందా?

ఏఱు మూరెడు తీస్తే కోలను బారెడు తీస్తుంది.

ఏఱు వచ్చినా ఎద్దడినీరే, మగుడు వచ్చినా ముండమోపుడే.

ఏరూరి (వేరూరి) యువసాయం (వ్యవసాయం) ఉన్నూరి వైద్యం.

ఏ రేవుకు వెళ్ళినా ముళ్ళపరిగే దొరికింది.

ఏరోటిదగ్గఱ ఆపాట పాడాలి.

ఏరోటి (దగ్గఱ) పదం ఆరోటిదగ్గఱే!

ఏలడానికి (ఏలుకోడానికి) ఊళ్ళు లేకపోవచ్చునుగాని ఎత్తుక (ఎత్తుకొని) తినడానికి ఊళ్ళు లేవా? (ఉండకపోవు).

ఏలినవానికి రేయింబగలు ఒకటే.

ఏలే వానికి ఎద్దు పోతేనేమి? కాచేవానికి కన్ను పోతేనేమి!

ఏలేవానికి ఏడుగురు భార్యలు.

ఏవాడ చిలుక ఆపలుకు పలుకుతుంది.

ఏవేషం వచ్చినా దివిటీవానికే చేటు (ముప్పు).

## ఐ

ఐశ్వర్యదేవత హృదయంలోనే ఉంది.

ఐశ్వర్య మున్నాళ్ళు, ఆవుపాడి ఎన్నాళ్ళు?

## ఒ

ఒంటరివానిపాటు ఇంటికి రాదు.

ఒంటి ఎద్దు దాసుడా! వలపల ఉంటావా, దాపల ఉంటావా?

ఒంటి ఎద్దు సేద్యం, (ఒకు) వరగాలినొప్పి.

ఒంటి కంటె జంట మేలు.

ఒంటికి ఓర్వలేనమ్మ, రెంటికి ఓర్చునా?

ఒంటికి పుట్టేనది, ఇంటికి పుట్టేనది, దండుగ.

ఒంటికి లేని (వ్యాధి) పాటు ఒరిగబెట్టుకున్నట్టు (కొని తెచ్చుకున్నట్టు).

ఒంటిబిడ్డ అని సరిమెతుకులు పడితే, మిద్దెక్కి మిండగాండ్ల పిలిచిందట!

ఒకఅబద్ధం కప్పడానికి వెయ్యి అబద్ధాలు కావలెను.

ఒకఊరికరణము ఒకఊరి (మాల) వెట్టి.

ఒకఊరిరాజు (కాపు) ఒకఊరి మాల.

ఒకఊరికి వెయ్యి దోవలు.

ఒకఊరిరెడ్డి ఒకఊరి పసులపోలిగాడు.

ఒకఒరలో రెండుకత్తు లిముడునా!

ఒకకంటిలో సున్నం, ఒకకంటిలో (వెన్న) బెల్లం.

ఒకకన్ను కన్నూ కాదు, ఒకకొడుకు కొడుకూ కాదు.

ఒకకొడుకు కొడుకు కాదు, ఒకచెట్టు తోపు కాదు.

ఒకకల గంటే తెల్లవారుతుందా ?

ఒకగుహలో రెండు సింహా లుంటాయా ?

ఒకచంట పాలు, ఒకచంట నెత్తురు (మేకయొకటి).

ఒకచెంప కొడితే పాలు, ఒకచెంప కొడితే తేనె (నీళ్ళు).

ఒకచెయ్యి తట్టితే చప్పుడవునా ?

ఒకచేత పసుపు, ఒకచేత ముసుగు.

ఒకటి చేయబోతే ఒకటి అయినట్లు.

ఒకటి (తరక) తప్పు, ఒకటి తాలు.

ఒకటే దెబ్బ, రెండే ముక్కలు (తునకలు).

ఒక టొకటిగా నూరా ? ఒకమాటు నూరా ?

ఒకడిపాటు, పదిమంది సాపాటు.

ఒకదొడ్లో గొడ్లు పొడుచుకోవా ?

ఒకనాటి అదను, ఏడాది బతుకు.

ఒకనాటి (నిద్ర) భోగం, ఆరు నెలల రోగం.

ఒకనాటి పెళ్ళికి ముఖమంతా కాటుక.

ఒకనాటిభాగవతంతో మూతిమీసాలు పోయినవి.

ఒకనాటివేషానికి మీసాలు గొరిగించుకొన్నట్లు.

ఒకనాడు ధారణ, ఒకనాడు పారణ.

ఒకనాడు విందు, ఒకనాడు మందు.

ఒకనిఆలి, ఒకనికన్నతల్లి.

ఒకపాముచేత రెండుసార్లు కఱపించుకుంటామా ?

ఒకరికలిమికి ఏడిస్తే ఒకకన్ను పోయింది, ఒకరిలేమికి (లేదని) ఏడిస్తే (రెండుకళ్ళు పోయినవి) రెండోకన్ను పోయింది.

ఒకరికి ఇగురుకూర ఇష్టం, ఒకరికి పులుసుకూర ఇష్టం.

ఒకరితో ఊరు పావనం, ఒకరితో గోత్రం పావనం.

ఒకరిని కోస్తే పాలు, ఒకరిని కోస్తే నెత్తురా?

ఒకరిద్దరిని చంపితేగాని వైద్యుడు కాడు.

ఒకరిదైతే ఓపినంత, తనదైతే తగినంత.

ఒకరు ఏటికి తీస్తే ఒకరు కాటికి తీసినట్లు.

ఒకరేం పెట్టి, మనమేం తిని, పండుకుంటేదాక ఉండవే మనసా!

ఒకలింగడు చచ్చినా చచ్చినట్లే.

ఒక్క చెట్టుకాయలే ఒక్కలా ఉండవు.

ఒక్క దండంబా చెప్పనా? ఓరుగంటి సంగనా!

ఒక్కడే కొడుకని వరికూడు పెడితే మిద్దెక్కి మిండగాడయినాడట!

ఒక్కడే కొడుకని ముద్దుగా చూస్తే మిద్దెక్కి మిండతెను చూచినాడట!

ఒక్కతే కూతురని వరిఅన్నం పెడితే మిద్దె ఎక్కి మిండల చూచిందట!

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు.

ఒక్క పుస్తె తెగితే వేయిపుస్తెలాడతావి.

ఒక్క ప్రొద్దుమాట కుక్క ఎరుగునా?

ఒక్క దున్న దేవులాట, ఇద్ద దున్న తన్నులాట.

ఒకేజోడు అంపటికీ సరిపోవునా! (సోపు).

ఒక్కొక్క చినుకే సముద్రమవుతుంది,

ఒక్కొక్క రాయి తీస్తూంటే కొండయినా తరుగుతుంది.

ఒగసే (వగచే) వారేకాని ఓదార్చేవా రుండరు.

ఒజ్జలపుచ్చకాయవలె.

ఒజ్జతో కంకులతో కాలం గడుపుతూంటే శిష్యులకు ఊరబియ్యం.

ఒట్టు పోయి గట్టెక్కె, తాను పోయి చెట్టెక్కె.

ఒడ్డెక్కి చేయి చూపినట్లు.

ఒడ్డెపీకుడూ, ముడ్డెపీకుడూ (ఒకటే).

ఒత్తి పలకవే వైదికపు పిల్లా! అంటే ప్ర్యాప్ అన్నదట!

ఒత్తు పొత్తును చెఱచును.

ఒత్తు వాములు కోయును, పలుచన (పాతర) (పైరు) కోయును.

ఒరగబెట్టి తాగేది చెఱిచెరా కంచరవాడు.

ఒరపు (వరపు) కోరుస్తుందికాని, తడుపు కోర్వదు.

ఒల్లని మగనికి తలంబ్రాలు పోసినట్లు.

ఒల్లనివానికి పెరుగులో రాయి.

ఒల్లీఒల్లని చుట్టం వచ్చాడు ఉడుకే ఉలవపప్పా ఉగాదిదాకా !

ఒళ్ళంతా తడిసిన వెనుక ఓపలేనివారికైన చలి లేదు.

ఒళ్ళారితే లేడి (వల).

ఒళ్ళు ఎఱుగని సివము, మనసెఱుగని కల్ల (కల) ఉన్నదా ?

ఒళ్ళుబలిసిన గంగానమ్మ పేడకుడుము అడిగిందట !

ఒళ్ళు వంగనమ్మ, కాలి (వ) మెట్టెలకు కందిపోయిందట !

ఒళ్ళు వంగనివాడు దొంగలతో కలిసినాడట !

ఒళ్ళువంగనివారికి ఊరు అచ్చిరాదు.

ఒళ్ళువాచినచోట్ల వస్తు ఏమిస్తారు ? అంటే, అవి లేకనే నా ఒళ్ళంతా వాచింది అన్నాడట !

ఒళ్ళో గింజలు ఉన్నా, వద్ద (ఒద్ద) భార్య ఉన్నా ఊరుకో బుద్ధి కాదు.

ఒళ్ళో పెడుదునా ? దళ్ళో పెడుదునా ? అన్నట్లు.

— : : —

# ఓ

ఓకన్ను కాయకన్ను, ఓకన్ను మరేమీ లేదు.

ఓకారము రానివాడు వడ్డీలు (వడ్లు) గుణించినట్లు.

ఓగుకడుపున వజ్రం పుట్టినట్లు.

ఓటికుండలో నీరు పోసినట్లు.

ఓటికుండలో నీళ్ళు నిలుచునా ?

ఓటికుండలో ఒరడు పలికితే వచ్చిందే వాన.

ఓడ ఎక్కేదాకా ఓడమల్లయ్య, ఓడ దిగితే (దిగాక) బోడిమల్లయ్య.

ఓడగట్టిన దూలమువలె.

ఓడ దిగేదాక ఓడమల్లయ్య, ఓడ దిగినతరువాత బోడి (గూని) మల్లయ్య.

ఓడలు బండ్ల వచ్చు, బండ్లు ఓడల వచ్చు.

ఓడ విడిచి వదరు పట్టినట్లు.

ఓడుఓడు అంటే కంపమంతా ఓ డన్నట్లు.

ఓడున పోసిన ఉదకమువలె.

ఓనమాలు చదివేరుకాని ఆనవాలు చూపించలేరు.

ఓనమాలే బుక్కులు, ఒకటిరెండే లెక్కలు.

ఓపని వాడు కోరనిదీ, ఒంటరివాడు ఆడనిదీ లేదు.

ఓపనివాని (రి) కి వద్దన్నవారే తల్లిదండ్రులు.

ఓపలేని అత్తకు వంగలేని కోడలు.

ఓబీ! ఓబీ! నీవు వడ్లు దంచు, నేను పక్క లెగరేస్తాను అన్నట్లు.

ఓర్చలేనమ్మ ఒడిని నిప్పులు కట్టుకుంటే ఒడీ దడీ కాలిందట !

ఓర్చలేనిరెడ్డి ఉండీ చెఱచెను, చచ్చీ చెఱచెను.

ఓర్చితే (ఓరిస్తే) ఓరుగల్లే పట్టణమవుతుంది.

ఓర్చితే కోడిగుడ్డు చట్టెడు.

ఓర్చిన పసరానికి తేటనీరు.

ఓర్చినమ్మకు తేటనీరు.

ఓరీ రజకచక్రవర్తీ! అంటే అంతపెద్దపేరు మాకెందుకు దొరా! మీకే ఉండనీ అన్నాడట!

ఓలి ఇచ్చిన మొగుడికంటె కూలి ఇచ్చిన మొగు డెక్కువ.

ఓలి (కొంచెమని) తక్కువని గుడ్డిదానిని పెండ్లాడితే దొంతి కుండలన్నీ దొర్లించినట్లు.

ఓలి తక్కువని గుడ్డిదానిని పెళ్ళాడితే నెలకు ముప్ఫై కుండలు నీళ్ళాడు తాయి (దొంతికుండలకు ముప్పు).

ఓ లో సగం చెప్పు నాయనా అన్నట్లు.

— : : —

# ఔ

ఔనన టానికి, కాదనటానికి అత్త కధికారం కాని కోడలి కే ముంది?

ఔషధం కానిది అవనిలో లేదు.

ఔషధానికి, అపథ్యానికి చెల్లు (సరి), రోగం పైపెచ్చు.

— : : —

# క

కంకణాలచెయ్యి ఆడితే, కడియాలచెయ్యి ఆడును (తుంది).

కంకి ఎట్లానయితే, క న్నెట్లా సవుతుంది.

కంచం అమ్మి మట్టెలు (మెట్టెలు) కొన్నట్లు.

కంచం ఇచ్చి మెట్టె పెట్టించుకొన్నా కానలేదు మొగుడు.

కంచం, చెంబు బయట పారేసి, రాయి రప్ప లోన వేసుకొన్నట్లు.

కంచం పోత్తేగాని మంచంపొత్తు లేదు.

కంచరి కటుకు, దంచితే లోటుకు.

కంచరి పిల్లులు తాటాకుచప్పుళ్ళకు బెదరవు.

కంచానికి ఒక్కడు, మంచానికి ఇద్దరు.

కంచిఅంత కాపురం గడ్డ లైనట్లు (గడ్డలు చేసినట్లు).

కంచిగరుడసేవవలె.

కంచుమెట్టె, మంటిగాజు ఉంటే కావలసిం దే ముంది!

కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?

కంచె నుంచిది కాకపోతే, అంతా దాటుతారు.

కంచెలు మునసుజాడ్యము నాపును.

కంచె లేనిచేను కన్నతల్లి లేని బిడ్డ (ఒకటి).

కంచె వేసినదే కమతము.

కంచె చేను మేస్తే కా పేమి చేయును?

కంటికి ఇంపైతే, కడుపుకు ఇంపు.

కంటికి సాగిలే పుల్లను కనిపెట్టి తిరుగమన్నారు (తీయమన్నారు).

కంటికి (కండ్లకు) దూరమైతే కాలికి (చెవికి) దూరమా?

కంటికి రెప్ప, కాలికి చెప్పు!

కంటికి ఱెప్పవలె.

కంటిఱెప్పలు పోయాక, కాటుకపూలు ఉంటే ఏ మాయె.

కంటివంటి ప్రకాశం లేదు, మంటివంటి ఆధారం లేదు.
కంటే కొడుకును కనాలి, తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి.
కండలు కొండ లవుతాయి.
కండ్లు ఆర్పినమ్మ ఇండ్లార్పును.
కండ్లు ఉంటేనా కాటుక!
కండ్లు పెద్దవి, కడుపు చిన్నది.
కండ్లు పోగొట్టిన దేవుడు ఇండ్లు చూపక మానడు.
కండ్లు పోయినతరువాత సూర్యనమస్కారాలు.
కండ్లు పోయిన (కళ్ళోయిన) దేవుడు (దేముడు) మతి ఇచ్చినట్లు.
కండెవంటి బిడ్డ అమ్మా! అంటే కండె తెచ్చిపెట్టమని ఏడ్చాడట!
కండే కొండవుతుంది.
కంతి బలుపు కాదు, చింత తీరిక కాదు.
కందకు లేదు, చేమకు లేదు, తోటకూరకు దురద ఎందుకు?
కందకు లేని దురద కత్తిపీటకా (పీట కెందుకు)?
కందకు లేని దూల కత్తిపీట కేల?
కందకు లేని దూల (దురద) చేమ కేల (చేమ కెందుకు)?
కందకు లేని దూల బచ్చలి కేల (కేమి)?
కందం చెప్పినవాడు కవి, పందిని పొడిచినవాడు బంటు.
కందిగింజను, కాపువానిని మంగలంలో వేపితేగాని రుచి లేదు.
కందిగింజను, కాపువానిని వేచ కెవ్వాల రవి కాదు.
కందిచేలో పోగొట్టుకొని పప్పులో వెదకినట్లు.
కంది పండితే కఱవు తీరును.
కందెన వేయని బండికి కావలసినంత సంగీతం.
కంపతోడుగు ఈడ్చినట్లు.
కంపునోటివాడు కూడబెడితే మంచినోటివాడు మాయం చేసినట్లు (చేశాడు).

కంపు పెట్టుకొని (కం పెట్టుకొని) గంపెడు తిన్నట్టు. (తిన్నాడట !)
కంపెనీవ్యవసాయం ఖర్చులకే సరి.
కంబళిలో తింటూ వెంట్రుకలు లెక్కపెట్టినట్లు.
కంబారికి పశువులు పోయినా, మారటితల్లికి బిడ్డలు పోయినా బాధ లేదు.
కంభంచెరువులో దున్నపోతు భయపడినట్లు.
కంసాలిఇంటి కెడితే బంగార మంటదు, కుమ్మరాడింటి కెడితే మట్టి అంటుకుంటుంది.
కంసాలి ఎల్లి, చాకలి మల్లి.
కంసాలికూడు కాకులు ముట్టవు.
కంసాలిగోటు, కరణం తేటు.
కంసాలిపెళ్ళికి ఇల్లంతా పొయ్యిలే.
కంసాలి బట్టె నమ్ముతున్నాడు, లక్క లేకుండా చూడరా అన్నాడట!
కంసాలిమాయ కంసాలికిగాని తెలియదు.
కంసాలి లేకుండా చూచి కథ చెప్పు మన్నారు.
కంసాలివద్ద ఉండవలె, కుంపటిలో ఉండవలె.
కంసాలివారు కాలానికి పెళ్ళికొడుకులు, కరువుకు తొలిపీనుగులు.
కక్కసకుక్కవద్దకు, కన్నకుక్కవద్దకు కానివాణ్ణయినా పంపవద్దు.
కక్కసకూటికి ఆశించరాదు (ఆశించినట్లు).
కక్కుర్తి మొగుడు కడుపునొప్పిబాధ ఎఱుగడు.
కచ్చకాయంత బెల్లానికైనా గానుగ కట్టాలి.
కచ్చల్లో కందులు వేయించినట్లు.
కచ్చితానికి కాసులు, ఉచితానికి ఊళ్ళు.
కచ్చిబిచ్చిరి కాపులు మెచ్చిరి.
కటకట ఉన్న ఇంట కలిమి ఉండదు.

కటకటా అనే ఇంట కట్ట బట్టా, తిన తిండీ ఉండవు.
కట్టకింద కట్టి లాడితే మాలదానిపిట్టి లాడుతాయి.
కట్టకు ఒకకంకి లేతదయితే (పచ్చిదయితే) పుట్టికి ఏదుం తరుగుతాయి (ను).
కట్టినఇంటికి పణుకులు (?) చెప్పేవారు (పది) వెయ్యిమంది.
కట్టినఇంటికి క (ప) ణుకులు మెండు.
కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి.
కట్టినవాని కొకఇల్లయితే అద్దె కున్నవాని కన్ని ఇండ్లే.
కట్టినవాని కొకఇల్లయితే కట్టనివానికి వేయి ఇండ్లు.
కట్టినవారు ఒకరైతే కాపురం చేసేవా రొకరు.
కట్టివేసిన బత్తెను కావలి కాచినట్లు.
కట్టుకొన్న ఆపె, పెట్టుకొన్న ఆపె ఉండగా ఎదురుపడ్డ ఆపె ఎండిపోయిందట !
కట్టుకొన్నమ్మ, చుట్టుకొన్నమ్మ ఉండగా ఎదురుగొన్నమ్మ ఎండిపోయిందట!
కట్టుకొన్న పెండ్లామే చెయ్యవలె, కన్నతల్లే చెయ్యవలె.
కట్టుకొన్న మగడు, పెట్టెనున్న నగలు.
కట్టుకోలు ఏకాదశికి కట్టె, కంప కొట్టుకొస్తుంది.
కట్టె దేవునిదగ్గఱ, కన్ను లంజదగ్గఱ.
కట్టె పుచ్చిన చెడును, మనిషి కందిన చెడును.
కట్టెలు తేరా తిమ్మా! అంటే కడుపు నొస్తదే అమ్మా! అన్నట్టు.
కట్టెవంక పొయ్యి తీర్చును.
కట్టేయ స్వాహా, కంపాయ స్వాహా, నీకూ నాకూ చెరిసగాయ స్వాహా
కట్టే లేదు, కంపా లేదు, కాచీ పోయీ నీళ్ళు లేవు, పదవోయి అల్లుడా! బావిగట్టుకు అన్నట్లు.

కట్టేవి కావాయాలు (కావివస్త్రాలు) (కాషాయగుడ్డలు,) దూరేవి దొమ్మరిగుడిసెలు.
కఠినమైనా కన్నతల్లి, వట్టిదైనా వరికూడు.
కడగాఉన్న గొడ్డలి కాలిమీద వేసుకున్నట్లు.
కడగా పోయే శనేశ్వరుడా మాయింటిదాకా వచ్చి మరీ పొమ్మన్నట్లు.
కడచి బ్రతికినామని గంతులు వేయరాదు.
కడచినదానికి వగచిన లాభ మేమి ?
కడజాతికాని, కాసులు కలవాడే రాజు.
కడపటిమడివాని కటారిపోటుకంటె, ఎదుటిమడివాని ఏకుపోటు మేలు.
కడలిలో ఉప్పు, అడవినుసరికకాయయు కూడినట్లు.
కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువ.
కడవ నెళ్ళి కడముంతలో దూరింది.
కడ నెడుపాలకు మజ్జిగబొట్టు (చల్లచుక్క).
కడ నెడు పాలలో బడిన కల్లొక బొట్టు పవిత్రమా ?
కడవేరు మిగిలినా గరిక చిగుర్చక మానదు.
కడి అంటే నోరు తెరచి, కళ్ళె మంటే నోరు మూసినట్లు.
కడి గండం కాచును, వత్తి మిత్తి కాచును.
కడిగిన మొగ ముంటే ఎందుకైనా మంచిది.
కడిగిననోరు, అడిగినపిల్ల !
కడియాల వారు వచ్చారు అంటే కడియాలు కావాలా అన్నాడట !
కడుపా కళ్ళేపల్లి చెరువా ?
కడుపా కోల్లేరుమడుగా !
కడుపా ? ఖండవల్లిమడుగా ?
కడుపా ? చెరువా ?
కడుపా ? పీపా ?

కడుపు కాలి ఏడుస్తూవుంటే మనువర్తి ఏమిస్తావు అన్నదట!

కడుపుకు తింటే కాలుచేతులకే మంచిది.

కడుపు కూటికి కేడిస్తే, కొప్పు పూల కేడ్చిందట!

కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది.

కడుపు చించుకున్నా గారడీవిద్యే!

కడుపు తెచ్చినవాడే కాయం, పిప్పళ్ళు తెస్తాడు.

కడుపుతోనున్నమ్మ కనక మానదు (మానునా?) వండినమ్మ తినక మానదు.

కడుపున పుట్టిన బిడ్డకన్న కంటనుకన్న బిడ్డ ఎక్కువ.

కడుపున పుట్టిన బిడ్డ, కొంగున గట్టిన రూక.

కడుపునిండా గారెలు తింటే ఒంటినిండా జ్వరము.

కడుపు నిండితే కడవలు మోయ, లేగ పోతే పగుల వేయ.

కడుపు నిండినవాడికి (వానికి) గారెలు చేదు (కనరు).

కడుపులో ఎట్లా ఉంటే కాపుర మట్లా ఉంటుంది.

కడుపులో కత్తెర, నోట చక్కెర.

కడుపులోని మంట కానరాని మంట.

కడుపులో బిడ్డ కడుపులో ఉండగా కొడుకుపేరు సోమలింగం.

కడుపులో లేనిది కౌగలించుకుంటే వస్తుందా?

కడుపులో లేని ప్రేమ కావాలంటే వస్తుందా?

కడుపు వస్తే కనే (ని) తీరవలెను.

కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం.

కతలమారి మొగుడు కమ్మలు చేయిస్తే అప్పులకూటి మొగుడు అమ్ముక తిన్నాడు.

కతికితే అతకదు.

కత్తి చేయలేని పని కలం చేస్తుంది.

కత్తి తలగడ కాదు, కల నిజం కాదు.
కత్తి తీసి కంపలో వేసి ఏకు తీసి పొడుచుకుంటాను అన్నాడట !
కత్తిపీటకు పళ్ళు పులుస్తాయా ?
కత్తిపీట పెట్టి కాళ్ళు కోసుకుంటాను అన్నట్లు.
కత్తిపోటు తప్పినా కలంపోటు తప్పదు.
కత్తిమీద సాము కానివాడికైనా తగదు.
కత్తిమీద సాము, కొత్తిమీద కూడు.
కత్తి మెత్తనా, అత్త మంచీ లేదు.
కత్తి వచ్చి గుమ్మడిపై బడినా, గుమ్మడి కత్తిపై బడినా గుమ్మడికే ముప్పు.
కత్తివాడా ? కలంవాడా ?
కత్తి విడిచి సాము చేయ మన్నారు.
కత్తు కలిస్తే పొత్తు కలుస్తుంది.
కత్తెరపోటుకు కదలపాకుతుంది.
కత్తెరలో వాన కనకంపంట.
కత్తేస్తావా ? బద్దేస్తావా ? అన్నట్లు.
కదిపితే కందిరీగల పుట్ట (తెట్టె).
కదిలిస్తే గచ్చపొద.
కదుటిలో లేదు, దిండులో లేదు.
కదురు, కవ్వము ఆడినఇంట (ఆడితే) కఱవే లేదు.
కథ అడ్డంగా తిరిగింది.
కథ కంచికి, మన మింటికి.
కథకు కాళ్ళు లేవు, ముంతకు చెవులు లేవు.
కథల కామరాజుకు వీపున మోకాలు.

కథలెల్ల వ్యథ లాయె, కాపురాలు రెండాయె, నిన్నటి కుందేలు ఈ నాటి కూరాయె.

కథానాయకుడు కాలం చేస్తే యత్నాల నాయకుడు ఎదురు చూచాడట !

కనకం వదిలితే కర్మం వదులుతుంది.

కననిది బిడ్డ కాదు, కట్టనిది చీర కాదు.

కన్నంలో తేలు కుట్టినట్లు.

కన్నకడుపు చల్లనిదైతే వచ్చిన గండం వైదొలగుతుంది.

కన్నకడుపు మంచిదైతే పెంచినవారికి పేరు వస్తుంది.

కన్నగాడు కత్తి మరువడు.

కన్నదానికి యతి లేదు, దున్నపోతుకు మతి లేదు.

కన్నతల్లిఋణం, చాకలిఋణం తీర్చలేము.

కన్నతల్లి కడుపు చూస్తే, కట్టుకొన్నది భుజం చూచును.

కన్నతల్లికైనా కనుమసు గుండాలి.

కన్నతల్లితిట్టు గమిడి దాటదు.

కన్నతల్లిని కాళ్ళు పట్టి ఈడ్చి పినతల్లికి పిండప్రదాన మన్నట్లు.

కన్నతల్లిప్రేమ ఘనమైన ప్రేమన్న, కడమప్రేమలన్నీ కష్టాలపాలు.

కన్నతల్లిబంగారమైనా కంసాలి వదలడు.

కన్నమరులుకంటె చా (సా) కిన మరులు ఘనము.

కన్నమోహముకంటె పెంచినమోహము పెద్ద.

కన్నమ్మ కడవలు పట్టక ఏడుస్తుంటే, పిన్నమ్మకు పెట్టరా పిండప్రదానం అన్నట్లు.

కన్నమ్మకు కడుపు కాలితే, పిన్నమ్మకు పిఱ్ఱయినా కాలదు.

కన్నమ్మకే కన వాపిరి, తిన్నమ్మకే తిన వాపిరి.

కన్నమ్మకే వాపు, తిన్నమకే తీపు.

కన్నా నేగాని కడుపులో పెట్టుకుంటామా ?

కన్నులో చల్లితే ఊదుకొని తినడానికి ఉండవు.

కన్నులో చల్లితే కనుగుంటలకైనా చాలవు.

కని కని కొత్తెవ్వ డింటికంబము చేసెన్.

కని గ్రుడ్డి, విని చెవుడు.

కని పెంచిననాడు కాలు జాచినట్లు.

కనీ పెంచిననాడు కొడుకులుగాని కోడళ్ళు వచ్చాక కొడుకులా !

కన్నీరు కిందికి కారుతుంది, పన్నీరు పైకి చిమ్ముతుంది.

కనుకొండ మొయిలు నేస్తే కాసుకు పడి బియ్యం.

కనుక్కొని రారా అంటే కాల్చి వచ్చినట్లు.

కనుబొమలకు ఎదుగుబొదుగు లేదు.

కనుమలమీద మొయిలు నేస్తే కళ్ళముందర వాన.

కనుముకు కాకర, భోగికి పొట్ల.

కనుమునాడు కాకిఅయినా ప్రయాణం చేయదు.

కనుమునాడు కాకికూడా మునుగుతుంది.

కనుమునాడు మినుములు తినాలి.

కనుమునాడు స్నానం చేస్తే కాకిరూపు పోతుంది.

కన్ను ఉండ కంటిపాపను గొన్నట్లు.

కన్ను ఎఱ్ఱబడ్డా (ఎఱ్ఱనైనా) మిన్ను ఎఱ్ఱబడ్డా (ఎఱ్ఱనైనా) కారక మానదు.

కన్ను ఎఱుగకున్నా కడుపు ఎఱుగుతుంది.

కన్ను కైకంబారు, కాపురం డోకిపట్టు.

కన్ను గుడ్డిదైతే కడుపు గుడ్డిదా ?

కన్ను గుడ్డిదైనా నిద్ర కేం లోటు ?

కన్ను చూచి కాటుక, పిఱ్ఱ చూచి పీట.

కన్ను చెదరకుండా కాటుక పెట్టాలి.

కన్ను తగిలేపుల్ల నుకనిపెట్టవద్దా ? (కనిపెట్టవలెను).

కన్ను పొడిచిన వేలిని కత్తిరించేవా రున్నారా ?

కన్నుపోయేటంత కాటుక పెట్టుకుంటారా ?

కన్ను మనదే, కాలు మనదే.

కన్ను మనదే, వేలు మనదే.

కన్ను మూస్తే కల.

కన్నులు కంచాలమీద, నోరు రామః రామహా (రామ రామ).

కన్ను లేనిచో కలియుగమే లేదు.

కనే కోడలుంటే కాదనే అత్తగా రున్నారా ?

కన్నేల పోయెనోయి కనకలింగమా ! అంటే, చేసుకున్న కర్మమోయి శంభులింగమా ! అన్నాడట !

కన్నొక్కటి లేదు కాని కాముడు కాదే.

కన్నొక్కటి లేదుకాని కవాటంవంటి బిడ్డ.

కన్నో మన్నో అన్నారు.

కప్పకాటు లేదు, బాపనపోటు లేదు.

కప్పలు ఎఱుగునా కడలిలోతు ?

కప్పలు కూస్తే వర్షము పడినట్లే.

కప్పిపెట్టేస్తేకంపు కొట్టకుండా ఉంటుందా ?

కఫంలో పడ్డ ఈగవలె.

కమ్మకు వరుస లేదు, కప్పకు తోక లేదు.

కమ్మగుట్టు గడప దాటదు.

కమ్మగుట్టు గమిడి దాటదు.

కమ్మని రోగాలు, తియ్యని మందులు.

కమ్మనీచు కడిగినా పోదు, కాకిచిప్ప పెట్టి గోకినా పోదు.

కమ్మనీ, తుమ్మనీ నమ్మరాదు.
కమ్మరవీధిలో సూదు లమ్మినట్లు.
కమ్మా కుడువు, కడియమూ కుడువు.
కమ్ముల దుప్పటికి, కొమ్ములబట్టె.
కయ్యానికైనా, వియ్యానికైనా నెయ్యానికైనా సాటి ఉండాలి.
కరక్కాయ కన్నతల్లి.
కఱచేకుక్కకు కఱ్ఱ అడ్డము.
కఱచేది చెఱకు, పట్టేది అనుము.
కరడికాటు పడినవాడు, కంబళి చూచిన భయపడును.
కరణం, కంసాలి కపటము మఱువరు.
కరణం చచ్చీ సాధించును, బ్రతికీ సాధించును.
కరణంతో కంటు పడితే, కాడి కదలదు.
కరణంతో కంటు కాటికి పోయినా తప్పదు.
కరణంతో పోరు, కాటికి పోయినా తప్పదు.
కరణంవాడు లేకుండా కథ చెప్పమన్నారు.
కరణానికి కాపుకే జత, ఉలికి గూటానికే జత.
కరణానికి తిట్టుదోషం లేదు, చాకలికి ముట్టుదోషం లేదు.
కరణాన్ని కాటికి పోయినా నమ్మరాదు.
కరణాన్ని, కంసాలిని, కాటికి పోయినా నమ్మరాదు.
కరణాలు కాపులు (భూమందులు) ఏకమయితే కాకులుకూడ ఎగురవు.
కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం.
కఱ (రు) వు కాలంలో (వ) ఒల్లనిమొగుడు పంటకాలంలో పంపమని వచ్చాడట !
కఱ (రు) వు కాస్తయినా గాభరా లావు.
కఱ (రు) వుకు ఎక్కువ నెల.

కఱ (రు) వుకు గ్రహణాలు లావు.
కఱ (రు) వుకు తోడు ఆవపంట కలిగినట్లు.
కఱ (రు) వుకు దాసరులైతే పదా లెక్కడ వస్తాయి ?
కఱ (రు) వుకు మామిళ్ళు, కాలానికి నేరేళ్ళు.
కఱ (రు) వుకు సద్ది కట్టినట్లు.
కఱ (రు) వునాటి కష్టా లుండవు, కష్టాలనాటి మాట లుంటాయి.
కఱ (రు) వు మానుప పంట, మిడుతలు మానుప మంట.
కఱ (రు) వులో అధికమాసం.
కఱ (రు) వులో బిడ్డను అమ్ముకొన్నట్లు.
కర్మ కంతం లేదు, కాలానికి నిశ్చయం లేదు.
కర్మచండాలునికంటె జాతిచండాలుడు మేలు.
కర్మములుగల మొగుణ్ణి కంబట్లో కట్టి బుజంమీద వేసుకుంటే జారి వీధిలో పడ్డట్టు.
కఱ్ఱకు పెట్టినా, గొఱ్ఱెకు పెట్టినా చెడదు.
కఱ్ఱలేనివాణ్ణి (వానిని) గొఱ్ఱె కఱచును (కఱుస్తుంది).
కఱ్ఱవంక పొయ్యే తీర్చును.
కఱ్ఱ విఱుగకుండా, పాము చావకుండా (కొట్టు).
కర్కాటకం బిందిస్తే కాటకం బందు.
కర్కాటకం బిందిస్తే పర్పాటకం పండును.
కర్కాటకం వర్షిస్తే కాడిమోకు తడవదు.
కరిగట్టులో కాలు పెట్టదు, అంబటిలో వేలు పెట్టదు.
కరిమ్రింగిన వెలగపండువలె.
కఱ్ఱికుక్క కపిలగోవు అవుతుందా ?
కఱ్ఱిది కస్తూరి, ఎఱ్ఱది ఎఱ్ఱమన్ను !
కర్ణుడు లేని భారతం, శొంఠిలేని కషాయం (ఒక టే).

కర్ణునితో ఉందమ్మా! భారతయుద్ధం అన్నట్లు.

కర్ణునాదులనె భారతసంహిత నిల్చిచాడ్పునన్.

కళ్లు అరిగితేగాని గరిసె విఱుగదు.

కళ్లు గొట్టిన గంపెడు సూదులు.

కళ్లు మన్నయితే కాపు బ్రతుకు.

కళ్లు మొసతో దున్నాలి, నాగేటిమొదలుతో చదును చేయాలి.

కలకాలం బ్రతికినా, కాటికి పోక తప్పదు.

కలకాలం బ్రతికే బ్రతుకులు, కుడికాలు పెట్టవే కూతురా అన్నట్లు.

కలకాలపు దొంగ ఒకనాడు దొరుకును.

కలబంద ఎండు, కోడలిక్రొత్తా లేదు.

కలలో కాంత, నీటిలో నీడ సమానం.

కలలో జరిగింది (వస్తే) ఇలలో జరుగదు (లేదు).

కలలోని కౌగిలికి కడుపు లొస్తాయా?

కలలోని కౌగిళ్ళకు కడుపు లొస్తే కాంతునికౌగిళ్ళ కేమి రావాలి?

కలలో పాలు తాగడానికి, కంచుదయితే నేం, కనకముదయితేనేమి?

కలలో భోగం కలతో టే సరి.

కలవారి (ంటి) ఆడపడుచుకు కాకరకాయ కానరాదు.

కల (లి) సి వచ్చేకాలానికి, నడచివచ్చేపిల్లలు (పుడతారు).

కలహామున్న (ఇంటిలో) కొంపలో కట్ట బట్ట లుండవు.

కల్పవృక్షంకింద గచ్చపొద ఉన్నట్లు.

కల్పవృక్షందగ్గఱకు వెళ్ళి కాయ లడిగినట్లు.

కల్పవృక్ష మెంచి కలివిచె ట్లెంచుట.

కల్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదు.

కల్యాణానికి ఒకరు వస్తే, కన్నం వేసేదానికి ఒకరు వస్తారు.

కల్లందగ్గఱ కరణీకం, కంచందగ్గఱ రెడ్డీకం.

కల్లకపటం లేనివారికి కష్టాలు తప్పవు.
కల్లపసిడికి కాంతి మెండు.
కల్లపెడికి కఱకులు మెండు.
కల్ల! మున్న చోటికే కంకె పోవును.
కలిగింది తినేసి, కట్టుకున్నది విప్పేసి వెళ్ళమన్నట్లు.
కలిగిఉన్నవాడు రాజ్యాన్ని సున్నానికి తీసుకుంటా నన్నట్లు.
కలిగితే కాళ్ళు ముయ్య, లేకపోతే మోకాళ్ళు ముయ్య.
కలిగినది చెబితే కంటిలో పుల్ల పెట్టినట్లు.
కలిగినమ్మఅంకు కాసాయిబొంకు.
కలిగినమాత్రం తిని, కరణంగారి కమతం చేయుమన్నట్లు.
కలిగినయ్య కలిగినయ్యకే పెట్టును, లేనయ్య కలిగినయ్యకే పెట్టును.
కలిగినయ్య గాదె తీసేసరికి, లేనయ్య ప్రాణం లేచిపోతుంది.
కలిగినయ్య గాదె తీసేసరికి, లేనయ్య లేకుండా పోయాడు.
కలిగినవాని కందఱూ చుట్టాలే!
కలిగినవారింటి కడగొట్టుకోడ లయ్యేకంటే, పేదవారింటి పెద్దకోడ లయ్యేది మేలు.
కలిగినవారి (కలిగినోళ్ళ) కోడలు కులుకక (కుల్కక) మానదు.
కలిగెరా కయ్యం, దింపరా గంప.
కలిపి కొట్టరా కావేటిరంగా!
కలి పోసి పెట్టినా ఉట్టిపంకే చూపు.
కలిమి కులాల మిండడు.
కలిమి ఉన్నంతసేపు బలగము, కండ ఉన్నంతసేపు మిండడు.
కలిమిగలవానిదే కులము.
కలిమి లేకుంటే కులం గవ్వ చేయదు.
కలిమిలేములు కావడికుండలు.

కలియుగం రెండురోజులు పోవాలి.
కలివిపళ్ళు పండితే కాలం తీరుతుంది.
కలుపుతీతకు తొల్లిక కావాలా?
కలుపు తీయని పైరు కట్టు చేయదు (వెలువడదు).
కలుపు తీయని మడి దేవుడు లేని గుడి (ఒకటి).
కలుపు తీయనివాడు కోత కోయడు.
కలుపు తీయనివానికి కసవే మిగులును.
కలుపు తీయునాడు కళ్ళకు రానీ, కోత కోయునాడు గోటికి రానీ, అంతలో మాఅమ్మ అంప మరిరానీ! (ఆడపడుచుకోరిక).
కలుపుతీసిన చేను కన్నులపండువు.
కలుపు తీస్తే బలుపుపంట (పంటబలుపు).
కల్లుకుండకాడిదే కయ్యం, జుట్టు ఊడిపోయేది దయ్యం.
కల్లుచట్టిలో పొడగువ్వ పడితే వానరాకట (వస్తుంది).
కల్తీవిత్తనం, నెల్తిగాడెలు.
కళపెళయ్యగారు కస్తూరి అడుగుతున్నారు నాన్నా! అంటే మూల గురిగెలో ముత్యాల సరా లున్నవి తీసుకెళ్ళమ్మా! అన్నాడట!
కళ్ళం, పళ్ళెం పెద్ద దుండాలి.
కళ్ళం వెళ్ళినతరువాత కందిగుగ్గిళ్ళు.
కళాసు బ్రతుకు గాలివానతో సరి.
కళ్ళు కానని పెళ్ళికూతురు కమతగానినెంట పోయిందట!
కళ్ళు రెండున్నా కనుపించే వస్తు వొకటే.
కళ్ళు కావా లంటాయి, కడుపు ఒద్దంటుంది.
కళ్ళు వచ్చినప్పుడే చళ్ళు వస్తే మదపుటేనుగును మంచానికి కట్టేద్దును, నీదాకా రానిద్దునా? అన్నట్లు.
కవ్వము, కదురు తిరిగిన ఇంట కలిమి వుండదు (లేదు).

కవికి, కంసాలికి సీసం తేలిక.

కవితకు మెప్పు, కాంతకు కొప్పు.

కవిలె చెట్లు కాస్తే కాపువరి పండుతుంది.

కవిలిచెట్లు పండితే కఱ (రు) వు తప్పదు.

కవిలిచెట్లు పండితే కాలం పాడు.

కష్టం కూలీది, ఫలితం ఖామందుది.

కష్టపడి ఇల్లు కట్టి కల్లు తాగి తగులబెట్టినట్లు.

కష్టపడి సుఖపడ మన్నారు.

కష్టసంపాదనము, ఇష్టభోజనము.

కష్టసుఖాలు కావడికుండలు.

కష్టాలు కలకాలం కాపుర ముండవు.

కసవు లేనిదే పసువు లేదు, పసువు లేనిదే పెంట లేదు, పెంట లేనిదే పంట లేదు.

కసవులో పనసకాయ తరిగినట్లు.

కసవే బసవన్న.

కసికింత దొరతనం వచ్చింది, కిసికింత పప్పు వేయు మన్నాడట!

కసిపోనమ్మ మసి పూసుకొన్నదట!

కస్తూరి నల్లగా ఉన్నా రాస్తే పరిమళం జాస్తి.

కాంచీపురం ఉపచారంలాగ.

కాంతాకనకాలే కయ్యాలకు మూలం.

కాకరకాయకు కంతలు (గంట్లు) ఎన్ని? అంటే ములగకాయకు ముళ్లెన్ని? అన్నట్లు.

కాకి కట్టు మన్న కడుపాయె వదినా! కలవబావికి పోతే కరిగిపోయె వదినా!

కాకి కట్టుమంటే గుండ్లు [illegible] [illegible].

కాకి కట్టుమంటే మొగుణ్ణి అప్పా అనెనట !

కాకి కట్టుమను, పిట్ట బుట్టుమను.

కాకి కావుమంటే కాంతుని కావలించు (కౌగిలించు) కొన్నట్లు.

కాకికి కంకెడు లేదు, పిట్టకు పిడికెడు లేదు.

కాకి కూయగా లేచి, కాటుకమాదిరి అన్నం, కాకరకాయ మిరియం చేసి, పసువు లొచ్చే వేళకు, పసుగత్తి పసుగత్తి వడ్డించిందట !

కాకి గండాగుండిగాని కోకిల పిరికి.

కాకిగూటిలో కోకిలవలె.

కాకి గూడు పడితే కడపటివస్త్రం.

కాకిని తెచ్చి పంజరంలో ఉంచితే, చిలుకపలుకు పలుకునా ?

కాకిపిల్ల కాకికి ముద్దు.

కాకి పుట్టీ నలుపే, పెరిగీ నలుపే.

కాకిముక్కుకు దొండపండా ?

కాకుంటే కాళ్ళు, కన్నీళ్ళు.

కాకులకు కాని వెమ్ములు కాస్తే నేమి? పూస్తే నేమి !

కాకులకు కాని ముషిణి పండితే నేమి? ఎండితే నేమి ?

కాకులను కొట్టి, గద్దలకు వేసినట్లు.

కాకులమధ్య కోకిల !

కాకులలో తెలుపు, అల్లుళ్ళలో మంచి.

కాకులు దోక ళ్ళెత్తుకపోయినవి.

కాకై కలకాల ముండేకంటే హంసై ఆరునెలలున్నా (ఉంటే) చాలు.

కాగల కార్యం గంధర్వులే తీరుస్తారు.

కాగెడు జొన్నలు బొక్కినా కాజు మొండికాలే.

కాచినచెట్టుకు కఱకురాళ్ళదెబ్బలు (తప్పవు).

కాచినచెట్టుకే కఱ్ఱదెబ్బలు.

కాటికి కాళ్ళు చాచి, కూటికి చేతులు చాచినట్లు.

కాటికి పోయినా కరణంకాటు తప్పదు.

కాటికి పోయినా కరణంతో కంటు పెట్టుకోరాదు.

కాటికి పోయినా కరణాన్ని నమ్మరాదు.

కాటికి పోయినా కాసు తప్పదు.

కాటిదగ్గఱిమాటలు కూటిదగ్గఱ ఉండవు.

కాటిలో పండినవి కాకులు తిన్నవి.

కాడు కాలుతూ ఉంటే, కన్నె ఎదుగుతూ ఉంటుంది.

కాదు అన్నవాడే కరణం.

కాదు అంటే అరవవాడిచెవి.

కాదు అంటే కళ తక్కువ, అవును అంటే ఆయుస్సెక్కువ.

కాదు కాదు అంటే నాది నాది అన్నాడట!

కానకుండా కట్టె డిచ్చేనుగాని, వినకుండా వీరణాలు వాయించగలవా?

కానకుండా మాట్లాడే మాట, కడగని గుద్ద ఒకటి.

కాననిముఖానికి గంధము అక్షతలు.

కాననివారి పాయసం గంపలాది.

కానవచ్చే కొండలను గట్టెక్కి చూడటం ఎందుకూ?

కానిఎడల కందిఅయినా కాయదు.

కానికాలానికి కర్రే పామై కఱచును.

కానికాలానికి పైబట్టలు పక్షు లెత్తుకొనిపోతాయి.

కానికి టెంకాయి ఇస్తారని కాశికి వెళ్ళినట్లు.

కానికూడు తిన్నా కడుపు నిండవలెను.

కానిచోట కందయినా కాయదు.

కానిచోట నేనూ అనరాదు.

కానిదానికి కలతలు మెండు.

కానిదానికి కష్టం మెండు, చెల్లనికాసుకు గీతలు మెండు.

కానిమందం, కోటిదుఃఖం.

కానివాడు లేనివానితో జత.

కానివానికొంప కాచి చెఱచవలెను.

కానివేళకు కందులే గుగ్గిళ్ళయినట్లు.

కానుగ (గానుగ) నీడ, కన్నతల్లినీడ (చల్లన).

కానుగాకు, కస్తూరాకు ఏనుగు త్రొక్కిన పలపల.

కానున్నది కాకమానదు, రానున్నది రాకమానదు.

కాపుకక్కసం, కంసాలికువాడం.

కాపు, కరణం ఏకమైతే కమ్మి దొరకదు.

కాపు కరణం నాపట్లయితే ఎట్లా కొడతావు కొట్టర మొగుడా!
(అన్నదట !).

కాపుకు నెనరు లేదు, కందికి చముకు లేదు.

కాపుచేసిన పాపం కళ్ళంతో తీర్చుకోవాలి.

కాపుజాడ, గొత్తెజాడ.

కాపుతోనే కఱవూ వచ్చింది.

కాపు బీదయితే కళ్ళం బీద.

కాపురం (ము) ఎట్లా చేశావే కమ్మతిమ్మక్కా! అంటే నువ్వు చెప్పినట్లే చేస్తినే బొచ్చుతిమ్మక్కా అందట!

కాపురం గుట్టు, రోగం రట్టు.

కాపురం చేసే కళ, కాలు తొక్కేటప్పుడు కనబడుతుంది.

కాపురానికి కడగండ్లు, మగనికి రేజీకట్లు.

కాపులకష్టం, భూపులసంపద.

కాపులచదువులు కానులనష్టం, బాపలసేద్యం భత్యంనష్టం.

కాపులజాతకాలు కరణాల తెలుక.

కాపులవానికీ, కందిగింజకూ సత్యం లేదు.

కాపులు వచ్చిన ఏడే కఱవూ వచ్చింది.

కామధేనువూ, కల్పవృక్షమూ.

కామమ్మ మొగుడంటే, కామోసనుకున్నాను. కాకుంటే కావడి కుండలు పడేయ్యండి.

కామమ్మ మొగుడు కామో చంటే కామో చన్నాను, కాకపోతే నాకత్తా, బుత్తా ఇట్టా పారెయ్య మన్నాడట!

కామరాజు గేదెలు, భీమరాజు పాములు.

కామానికి కండ్లు లేవు, గుడిసేటికి గుణం లేదు.

కామాలరోగికి కనపడే దంతా పచ్చనే.

కామి గాక మోక్షగామి గాడు.

కాయకత్తి నీచేతిలోనే ఉన్నదికదా!

కాయలో పత్తి కాయలో ఉండగా, కామన్న కాడుముళ్ళు, నాకు మూడుముళ్ళు.

కారణం లేక కార్యం పుట్టదు.

కారణం లేని కార్యం, పూరణం లేని బూరి, వీరణం లేని పెండ్లి ఉండవు.

కార్యం అయ్యేదాకా గాడిదకాళ్ళయినా పట్టాలి.

కార్యం గొప్పా? వీర్యం గొప్పా?

కార్యంనాడు తల వంచుకొని, కలకాలం తలెత్తి తిరుగవచ్చు.

కారాని కాలానికి కప్ప దయ్య మయ్యేను.

కారాని కాలానికి రారాని పాట్లు!

కార్తీకం కలకాశా, వైశాఖం పులకాశ.

కార్తీకం తెల్లవేసి కాపాడవలెను.

కార్తీకం పోతే వాన లేదు, కర్ణుడు పోతే సేన లేదు.

కార్తీకపు పున్నానికి కలకపంటలు.

కార్తీకమాసానికి కాకులు తొక్కుతాయి.

కార్తీక మాసంలో కడపటివానలు.

కార్తీకమాసంలో వర్షం, కర్ణునితో యుద్ధం.

కార్తీకమాస కడవలు కడుగ ప్రొద్దుండదు.

కార్తీకమాసానికి కదురంత ఉండునా, మాఘమాసానికి నామహిమ చూపిస్తాను.

కారుచిచ్చుకు గాడ్పు తోడయినట్లు.

కారుజొన్న మేసే కోడెకు కైలాసం కావాలా?

కారువరికి గొఱ్ఱెలమంద, పీసాణాలకు గొట్టెఎరువు.

కార్తె ముందు ఉరిమినా, కార్యం ముందు పదరినా చెడుతుంది.

కాలం, కర్మం కలిసివస్తే కమలసంభవునికైనా కష్టాలు తప్పవు.

కాలం కానప్పుడు ఆలే తేలై కరుస్తుంది.

కాలం తప్పిననాడు, పైమీది బట్టే పామై కరుస్తుంది.

కాలం తీరిందంటే పమిటచెఱగు (చెంగు) పామై కరుస్తుంది.

కాలం (వర్షం) తో కరవు లేదు, మగనితో దరిద్రం లేదు.

కాలంనాటి కందిగింజ, పెద్దలనాటి పెసరగింజ.

కాలం పోతుంది, మాట నిలుస్తుంది.

కాలం మంచిది కాకపోతే గాడిదకాళ్ళు పట్టుకోవాలి.

కాలం మారి కంచు పెంకయినట్లు.

కాలం మూడిన వ్యక్తికి కాశికి పోయినా సేగి తప్పదు.

కాలంలో విత్తనాలు కలలోనైనా చల్లాలి.

కాలం వచ్చినప్పుడు కాశికి పోయినా తప్పదు.

కాలం వస్తే గాడిదకాళ్ళు తిన్నన.

కాలమందు చేస్తే దేవతలకు ప్రీతి, అకాలమందు చేస్తే అసురులకు ప్రీతి

ఇద్దరివాళ్ళా మన్ను కొడతాను అన్నట్లు.

కాలమా! యాలమా! కడకు చూడ వెళ్ళమా?
కాలక్షేపము లేకపోతే కంచిమేకను కొనుక్కో అన్నారు.
కాల తంతే పెరిగేది పుచ్చకాయ, కుళ్ళేది గుమ్మడికాయ.
కాలానికి కడగండ్లూ, దేశానికి తిప్పలు.
కాలికి గుండు, జుట్టుకు బెండు.
కాలికి చుట్టుకొన్న పాము కఱవక మానునా?
కాలికి తప్పితే (వేస్తే) మెడకు, మెడకు తప్పితే కాలికి.
కాలికి దూరమైతే కంటికి దూరమా?
కాలికి రాని చెప్పు కంచెలో వేయాలి.
కాలికి రాని చెప్పు కడగా ఉంచు.
కాలికి వేస్తే వేలికి, వేలికి వేస్తే కాలికి.
కాలికోసం చెప్పులు ఒళ్ళో పెట్టుకోవాలి.
కాలితో కదుపుకోవడం, చేతితో జుట్టుకోవడం.
కాలితో నడిస్తే కాశికి పోవచ్చునుగాని, తలతో నడిస్తే తలవాకిలి దాటవచ్చునా?
కాలిది తీసి నెత్తికి (తలకు) రాచుకొన్నట్లు.
కాలిన గుడిసెకు (కొట్టానికి) పీకిందే వాసం.
కాలినమన్నా, కాలనిమన్నా అంటవు.
కాలిమెట్లు తలకెక్కినట్లు.
కాలు కడుగ ముంత లేదు, కల్లుకు కళాయిగిన్నె.
కాలు కాలిన పిల్లివలె.
కాలు చెయ్యి ఉన్నంతకాలం కాలం గడుస్తుంది.
కాలు జారితే గంగానమ్మదే మహిమ.
కాలు జారితేగాని గంగానమ్మ కొట్టదు.
కాలు జారితే తీసుకోగలంగాని, నోరు జారితే తీసుకోగలమా!

కాలు జారితే నేల పడి, నేల అచ్చివచ్చినది కాదు అన్నట్లు.

కాలు జారిన కుక్కకు నీళ్ళంటే భయం.

కాలు పట్టుకొని లాగితే చూరు పట్టుకొని వేళ్ళాడినట్లు.

కాలు త్రొక్కినవేళ, కంకణం కట్టినవేళ (మంచిది కావాలి).

కాలు వంగినగాని గంగానమ్మయినా పట్టదు.

కాలు త్రొక్కని మొగ పేనుగంత, కనిపెంచనిబిడ్డ బారెడంత !

కాలు విరిగిన ఎద్దు గట్టెక్కితే కొమ్ము విరిగిన ఎద్దెక్కడ ?

కాలే కడుపుకు మండే గంజి (బూడిద).

కాళ్ళకు చుట్టుకొన్నది, కంఠానికి చుట్టుకోక మానునా ?

కాలువ దాటనివాడు కడలి దాటునా ?

కాళ్ళదగ్గరకు వచ్చినబేరం, కాశికి వెళ్ళినా దొరకదు.

కాళ్ళ పడ్డ పాము కఱవక మానదు (తీరదు).

కాళ్ళు పట్టుక గుంజితే చూరు పట్టుక వేళ్ళాడినట్లు.

కాళ్ళు మ్రొక్కేవాడికి పోయి కంఠాన్ని పట్టుకొన్నవాడికి వచ్చినట్లు.

కాళిదాసుకవిత్వం కొంతా, నాపైత్యం కొంతా.

కావడి ఎన్నివంకలు పోతేనేమి ? ఇల్లుచేరితే సరి.

కావ్యాలు కంఠతః ఉంటే అమరం యెందుకురా అనుకృతిననా ?

కాశికి పోగానే కత్తికుక్క కపిల (గంగి) గోవగునా !

కాశికి పోయి కొంగరెట్ట తెచ్చినట్లు.

కాశికి పోయి గాడిదగుడ్డు తెచ్చినట్లు.

కాశికిపోయినవాడు కాటికిపోయినవాడు ఒకటే.

కాశికి పోయినా కర్మం తప్పదు.

కాశికి వెళ్ళినా (పోయినా) కావడిబరువు తప్పదు.

కాశికి పోవడం ఒకటి, కావడి తేవడం ఒకటి.

కాశిలో కన్ను మూసినా రానిపుణ్యం, కాళహస్తిలో కాలు పెడితే వస్తుంది.

కాశీలో కాసు కొకలంజ.

కాశీ వెళ్ళి కొంగఈక తెచ్చినట్లు.

కాశ్మీరపు గాడిదవలె.

కాస్త ఓ డంటే అంచంతా ఓ డన్నట్లు.

కాస్తకాస్త పెత్తనం వస్తోంది, వేయవే బారెడు మాకు అన్నట్లు.

కాసుకుండకు రువ్వాలక్క.

కాసుకు గతి లేదు, కోటికి కొడి వేసినాడు.

కాసుకు గతి లేదు, (దోవ లేదు) నూటికి ఫరవా లేదు.

కాసుకు మూతి నాకను బోతే మూడుమార్లు పోయిన (మూడు నూర్లు పోసిన) ముంగర పోయిందట!

కాసుగొడ్డుకు రూకబందె.

కాసీ పూసే చింతా, గన్నారపు సంతా, నీళ్ళకడవకాడ ముంతా, నిద్ర కేమి పుచ్చుకుంటావే?

క్రింద ఒకబొంత, మీద ఒకబొంత నా కేమి చింత!

క్రింద పడ్డా పైచెయ్యి నాదే అన్నట్లు.

క్రింద పడ్డా పీటికి మన్ను కాలేదు.

క్రింద పడినా మీసాలకు మన్ను కాలేదు.

క్రింద పెట్టిన పంట లుండవు, మీద పెట్టిన వాన లుండవు.

కిట్టులో కిట్టు కలిస్తే కం పేడకు పోతుంది!

కీటు విడిచి గోడ పెట్టలేను.

కీ డెంచి మే లెంచవలెను.

కీ లెఱిగి వాత, పీ లెఱిగి మాట.

కీ లూడిన జంత్రమువలె.

కుంచంలో కదుళ్ళు పోసినట్లు.

కుంచమంత కూతురుంటే, మంచంమీదే కూడు (తల్లికి).

కుంచాలమ్మ కూడవేస్తే మంచాలమ్మ మాయం చేసిందట!

కుంచె డుంటే కుడికొప్పు, అడ్డె డుంటే ఎడకొప్పు.

కుంచెడుగింజలకు కూలికి పోతే, తూమెడుగింజలు దూడలు తిన్నట్టు.

కుంచె డున్నమ్మకు కూర్కు పట్టదు.

కుంచెడుబియ్యం, గుమ్మడికాయ.

కుంజరయూధంబు దోమకుత్తుక చొచ్చినట్లు.

కుంటిఎద్దు రానిదే దూల మెత్తరు.

కుంటికులాసం, ఇంటికి మోసం.

కుంటిగాడిదకు జారిందే సాకు.

కుంటిగుఱ్ఱానికి దాణా దండుగ.

కుంటిగుఱ్ఱాలు, తోలుకత్తులు.

కుంటిచేతులవాడు నువ్వులు తిన బెదరించినట్లు.

కుంటిభిక్షగాడు గుఱ్ఱాన్ని ఎక్కి వస్తాడు.

కుంటివానికి కుయుక్తు లెక్కువ.

కుంటివానితిప్పలు కుంటివానికి, గూనివానితిప్పలు గూనివానికి.

కుంటివాని పాదుపత్తెము ఇంటిముందటే.

కుంటిసాకులు, కొంటెమాటలు.

కుండ ఎప్పుడు వేటో, కుదుకు అప్పుడే వేటు.

కుండ పగులగొట్టినట్లు.

కుండలు దాచినా కండలు దాచలేము.

కుండలదుమ్ము రోకళ్ళలో దులుపు.

కుండలో కూ డుంటే ముండకు నిద్ర రాదు.

కుండలు, చేటలు లేవని వండుకతినటం మానుకుంటామా?

కుండలో కూడు కూడుగానే ఉండాలి, కూనలు బానలులా ఉండాలి.

కుండలో కూడు కూడుగానే (కూడులా) ఉండాలి బిడ్డలు దూడలులా ఉండాలి.

కుండల్లో గుత్తాలు తోలినట్లు.
కుండలో మెతుకులన్నీ పట్టి చూడవలెనా ?
కుండ వెళ్ళి బిందెకు తగిలినా, బిందె వచ్చి కుండకు తగిలినా కుండకే మోసం.
కుందేలు లేచినప్పుడు కుక్క బయటికి (దొడ్డికి) పోయిందట !
కుంపట్లో తామర మొలచినట్లు (తామరదుంప) మొలచునా ?
కుంభకర్ణుని నోటికి అరకాసు మజ్జిగా ?
కుక్క ఆశ గుంట్రాతితో తీరును.
కుక్క కాటుకు చెప్పుదెబ్బ సరి.
కుక్కకు (ఒక) ఎముకముక్క.
కుక్కకు ఏమి తెలుసు మొక్కజొన్న రుచి ?
కుక్కకు కూడు వేస్తే కూటికుండకు ముప్పు.
కుక్కకు నెయ్యి ఇముడునా ?
కుక్కకు పని లేదు, కూర్చొన పొద్దు (పురుసత్తు) (తీరుబడి) లేదు.
కుక్కకు పెత్తనమిస్తే కుండలు కెలకదా ?
కుక్కకు బొక్క దొరికినట్లు.
కుక్కకు వచ్చే వన్నీ గొగ్గిపండ్లే.
కుక్కకు వేషం వేసినా మొరగక మానదు.
కుక్కకు సేరు మాంసి దొరికినట్లు.
కుక్క (లు) కూసుకుంటే (మొరిగితే) జంగంపరపతి పోవునా (పోతుందా) ?
కుక్క గుజ్జి మవుతుందా ?
కుక్క గోవు కాదు, కుందేలు పులి కాదు.
కుక్క గౌరీకళ్యాణం పాడునా ?
కుక్కచంటిలో పాలు కుడిచేమా ?

కుక్క తీసిన గొయ్యా ? నక్క తీసిన గొయ్యా ?
కుక్క తెచ్చే వన్నీ (తీసేవన్నీ) గొడ్డెలే (గొడ్డెలు).
కుక్కతోక గొట్ట మున్నంతసేపే.
కుక్కతోక పట్టి గోదావరి ఈదినట్లు.
కుక్కతోక వంకర.
కుక్కదానం పట్టిఅయినా కుటుంబాన్ని పోషించాలి.
కుక్కను (తెచ్చి) అందలంలో కూర్చోబెడితే కుచ్చులన్నీ తెగగొరుకు (తెగగొరికిందట !)
కుక్కను అమ్మిన డబ్బు మొఱుగునా ?
కుక్కను ఎక్కితే సుఖమూ లేదు, కూలబడితే దుఃఖమూ లేదు.
కుక్కను కొట్ట (ను) బచ్చెనకొయ్య కావలెనా ?
కుక్కను కొట్టితే ఇల్లంతా పాకుతుంది.
కుక్కను చంపిన పాపం గుడి కట్టినా పోదు.
కుక్కను పెంచితే గండాయె, కుంటికుండకు (చేటాయె నొండాయె).
కుక్కను ముద్దుపెట్టుకుంటే మూతెల్లా తెగ నాకుతుంది.
కుక్కతోక చక్క నవుతుందా ?
కుక్కనోటికి కొబ్బరికాయ అబ్బునా ?
కుక్కనోట్లో కజ్జి పెట్టినట్లు.
కుక్కనోట్లో కజ్జి పెడితే బొళ్ళు మంటుంది.
కుక్కపోతుకు కుచ్చులజీనా ?
కుక్కబతుకు, నక్కచావు.
కుక్క బలిస్తే గోనెలు మోస్తుందా ?
కుక్క ముట్టిన కుండ అక్కఱకు వస్తుందా ?
కుక్కలకు కులంపంచాయతీ.
కుక్కలు పేకులు వడికితే, గుఱ్ఱాలు చీరలు కడతాయి.
కుక్కలు, కాకులు కూడి విస్తళ్లు చించుకొన్నవట !

కుక్కలు, కుక్కలూ పోట్లాడుకొని, కూట్లో దుమ్ము పోసుకున్నాయట!

కుక్కలు కూర్చుంటే కుందేళ్ళు దూకలేవు.

కుక్కలు చెప్పులు వెదకును, నక్కలు బొక్కలు వెదకును.

కుక్క వస్తే రాయి దొరకదు, రాయి దొరికితే కుక్క రాదు.

కుక్క వేషం వేస్తే మొరగకుండా వల్లకాదు (తప్పదు).

కుక్కశ్చ, నల్లకుక్కశ్చ, దాటడం, మఱిదాటడం, రెడ్డిశ్చ, రెడ్డిసానిశ్చ, నాశనం బుడనాశనం.

కుక్క శ్రాద్ధానికి పీతిపిండాలు.

కుక్క సంతకు (అంగడికి) పోయి (నట్లు) తునకాల దెబ్బలు తిన్నట్లు.

కుచ్చుల క్రింది త్రాచువలె.

కుచ్చి (గుచ్చి) కుదుటిలో పెడితే విచ్చుకొని వీధిలోకి వచ్చినట్లు.

కుట్టనిరవిక చేతు లున్నా సరే, ఏలని మొగుడు ఊరిలో ఉన్నా సరే.

కుట్టికుట్టి గుంజగానికి దుప్పటి నేయించినట్లు.

కుట్టితే తేలు, కుట్టకుంటే కుమ్మరిపురుగు.

కుట్టినపడు కుట్టింట, మరోపడు మట్టింట, మూడోపడు మొదలెంట.

కుట్టినచెవికి బుగడలు లేవు, మధ్యాహ్నంసద్దికి ఉప్పు లేదు.

కుట్టినమ్మ కుది (దు) ట్లో (గూట్లో) ఉంటే, కూసినమ్మ గయ్యాళి.

కుట్టిన తేలు గుణవంతురాలు, కూసినమ్మ కుక్కముండ.

కుట్టిన తేలు గోడ ఎక్కె, కూసు (యు) లంజ రచ్చ కెక్కె.

కుట్లు మొయ్య తిని కుప్పకావలి పొమ్మంటే, అగులుబుగులు కాల మత్తా! అరలో పందుకుంటా నన్నాడట!

కుట్టేవాడికి కుడిచేతికిందా, ఏడ్చేవాడికి ఎడమచేతికిందా కూర్చోరాదు.

కుట్టేవారు కుడితే చెవులు నొప్పెట్టవు.

కుడికన్ను కుదెయ్యడం, ఎడమకన్ను ఎగరెయ్యడం.

కుడికాలు పెడితే కులక్షయం, ఎడమకాలు పెడితే వంశక్షయం.

కుడిచి కూర్చోలేక కుమ్మరావము తెచ్చుకొన్నట్లు.
కుడిచెయ్యి చేసే దానం, ఎడమచెయ్యి ఎఱుగరాదు.
కుడిచేతికున్న మన్నన ఎడమచేతి కేది ?
కుడిచేత్తో (తితో) ఇచ్చి, ఎడమచేత్తో (తితో) తీసుకున్నట్లు.
కుడితికుండలో (తొట్టిలో) పడ్డ ఎలుకవలె.
కుడుపుకు గుడగుడ లేల ?
కుడుపు మంచిదైనా కడుపు మంచిది కాదు.
కుడుము పెడితే పండుగ.
కుడుములుతిన్ననాడే కుట్టు [illegible]ళ్ళను.
కుడుము మింగేవానికి అప్పడాలు లెక్కా ?
కుడుములు వండని ఆడుదీ, కూనిరాగం తీయని మగవాడూ ఉండరు.
కుడుమువలె వాచింది అంటే అమ్మా! కుడుములు వండ మన్నట్లు.
కుడువ బెట్ట కంచ మారడి గొనినట్లు.
కుడువబోతూ కూరాకు (కూరల) రుచి (చవి) అడిగినట్లు.
కుడువబోవు కూటికి రుచి అడుగ నేల ?
కుడువ మంటే పొడున వచ్చినట్లు.
కుదిరినది వైద్యం, మానినది మందు.
కుదిరెకు గుజ్జు మంటే, పూనెకు పుజ్జు మన్నాడట !
కుదురుపడ్డ కాపురము కూలగొట్టకపోతే నేను నీకు అంకుమొగుడినే
కా దన్నాడట !
కునికిపాట్లు పడేవానికి, కూలబడ తన్నేవాడే తండ్రి.
కునికే నక్కమీద తాటిపండు పడ్డట్లు.
కుప్పకు ముందు, కుస్తీకి వెనుక.
కుప్ప తగులబెట్టి పేలాలు వేయించుకున్నట్లు.
కుప్ప పీకే దొంగ పరిగ ఏరుకొనేవానిని బెదరించినట్లు.

కుప్పపై పండుకొని, ఉప్పరిగ కల కన్నట్లు.

కుప్పలో ధాన్య మున్న దన్నట్లు.

కుప్పలో మాణిక్యంవలె.

కుప్పవిత్తులు చప్పనాకు.

కుమ్మక్కు నాది, ఫజీతు నీది.

కుమ్మరపురుగుకు మన్ను ఒంటు పట్టదు.

కుమ్మరావంలో ఇత్తడి (రాగి) ముంతదొరుకునా? (ముంత లేరంగగలమె!)

కుమ్మరావంలో గచ్చకాయ వేసినట్లు.

కుమ్మరావమునకు నిప్పు ముట్టించినట్లు.

కుమ్మరికి ఒకయేడు, గుదియకు ఒకపెట్టు.

కుమ్మరికి కుండ కఱవు, కమ్మరికి తెడ్డు కఱవు.

కుమ్మరికి కుండ కఱవు, సాలెకు బట్ట కఱవు.

కుమ్మరికి కుండలు కఱవు, మాదిగకు చెప్పులు కఱవు.

కుమ్మరితిమ్మక్క త్యాగ మెంతా ? అంటే కొసరితే దీపెంత ?

కుమ్మరివారింటి పెండ్లికూతురు ఆవకట్టకు రాక ఎక్కడికి పోతుంది ?

కుమ్మరివీథిలో కుండ లమ్మినట్లు.

కుమ్మ చెప్పుకొనేందుకు గూనమ్మ పోతే, ఏనూళ్ళకుమ్మ ఎదురుగా వచ్చిందట !

కుమ్మెరక్క పూలు గుచ్చితే కునిమెళ్ళ కామాక్షమ్మ కులికివస్తుంది.

కుఱ్ఱకాకి కేమి తెలుసు ఉండేలుదెబ్బ ?

కుఱ్ఱలసేద్యం కూటికైనా రాదు.

కుఱ్ఱవాడి గుణగణాలు తెలుసునుగాని చెవులకమ్మల సంగతిమాత్రం తెలీదు అన్నట్లు.

కురూపిపాత్రకంటె సురూపితిట్టు మేలు.

కురూపీ ! ఏమి చేస్తున్నా వంటే సురూపాలు లెక్కపెడుతున్నాను అన్నట్లు.

కులమింటి కోతైనా మేలు.

కుల మెఱిగి చుట్టము, స్థల మెఱిగి వాసము.

కులముకన్నా గుణము ప్రధానము.

కులము గలిగిన నెందైన స్థలము కలుగు.

కులము చెడ్డా సుఖం దక్కవలె.

కులము చెఱిచేవారేగాని కూడు పెట్టేవారు లేరు.

కులము తక్కువవాడు కూటికి ముందు.

కులము కాదు, స్థలము కాదు, కుమ్మరివారిపిల్ల కోతి దయ్యమై పట్టింది.

కులము తక్కువవానికి గోలు ఎక్కువ.

కులము తప్పినవాడు బంతికి ముందు, కూరగాయలవాడు సంతకు ముందు.

కులము పోతే కులము వస్తుందిగాని స్థలము పోతే స్థలము రాదు.

కులమోడు (కులమువాడు) కొడితే ఎక్కదుగాని, కొమ్మోడు (కొమ్ము వాడు) కొడితే ఎక్కుతుంది.

కులవిద్యకు సాటి లేదు.

కులహీనమైనా వంశహీనం కారాదు.

కులానికి ఇంత అంటే తలా గోరంత అన్నట్లు.

కులానికి కులం తెగులు (చేటు), నీటికి పాచి (నాచు) తెగులు (చేటు).

కులానికి సొడ్డు అంటే, చిన్నప్పుడే వేలుపడ్డాను అన్నట్లు.

కులికేదాన్ని ఒలికిలో పెడితే ఒలికంతా చెడ కులికిందట!

కుళ్ళికుళ్ళి కాయ నష్టి, కాలి కాలి కట్టె నష్టి.

కుళ్ళుబోతువాడు గుడిసె కడితే కాలినదాకా ఒకటే పోరు.

కుళ్ళుముండకి అల్లంపచ్చడి అన్నట్లు.

కుళ్ళైవానిముందు గునిసినట్లు.

కుళ్ళైవాళ్ళెనుకే కులక మన్నారు.

కసి వెళ్ళి గొడ్డలి దూరి కులానికే చేటు తెచ్చినట్లు.

కూకున్న కూతురు కూలిపోయింది, చేసినకోడలు చేవ దేరింది.

కూచమ్మ కూడబెడితే మాచమ్మ మాయం చేసిందట!

కూచిపూడిదొంగతనానికి కట్ల, చెప్పులు కావలెనా?

కూచిపూడిలో కుక్క మొరిగినా సంగీతమే.

కూచుంటే కుక్కకు పండ్లు పులుస్తవి.

కూచుంటే లెగ లేడు, కూరదాక దింప లేడు.

కూచుంటే లేవ లేడు కూరికట్ట లమ్మ లేడు, కొట్టొస్తడమ్మా! నాకు నవ్వొస్తది.

కూటి కియ్యని విటకానిపోటు మెండు.

కూటికి గతి లేదుగాని కుంకెనలకు ముత్యాలు.

కూటికి గింజలు లేక కొరముట్లు లేక సేద్యం చేసేది చెడ్డరోత.

కూటికి జరిగితే కోటికి జరిగినట్లు.

కూటికి తక్కువైనా (వైతే) కులానికి తక్కువా?

కూటికి పేదయితే కులానికి పేదా?

కూటికి లేకపోతే సన్నబియ్యం, గుడ్డకు లేకపోతే సన్నగుడ్డ.

కూటికి లేకున్నా కాటుకచుక్క మానను.

కూటికుండ కుక్క ముట్టినట్లు.

కూటి కున్న కోటి కున్నట్లే.

కూటికోసం కోటి విద్యలు.

కూటిమీదా ఆశ, మీసంమీదా ఆశ.

కూటిలోనిరాయి తీయ లేనివాడు ఏటిలోనిరాయి తీయగలడా?

కూడబెట్టినవాడు కుడువ నేర్చునా?

కూడలికాపురం కుతకుతలు, వేరడికాపురం వెతవెతలు.

కూడా తిని కుల మెంచినట్లు.

కూడింది పోయె (పాయ) పెండ్లాడింది పోయె (పాయ).

కూడినకొద్దీ కుండ లమ్ముకొని తిన్నట్లు.

కూడుఅయితే కద్దుగాని కులస్థులకు వెరచి వచ్చినాను.

కూడు ఉంటే కులగోత్రా లెందుకు ?

కూడు ఉడుకలేదని కుం డట్టుక కొట్టాడట !

కూడు ఉడికినవెనుక పొయ్యి మండును, కులం చెడ్డవెనుక బుద్ధివచ్చును.

కూడు ఎక్కువైతే కువ్వాడ మెక్కువ.

కూడు ఒల్లనమ్మకు కఅ వేమి చేస్తుంది ?

కూడు పెట్టదు, గుడ్డ ఇవ్వదు, నామీద ప్రాణమే అన్నట్లు.

కూడులేనమ్మకు గుడ్డలేనివాడు జతపడ్డట్లు.

కూడు వండని ఆడది, మంచం అల్లని మగవాడూ ఉండరు.

కూడు వేరైతే కులం వేరు (గుణం వేరు).

కూడూ, గుడ్డా అడక్కపోతే బిడ్డను సాకినట్టు సాకుతా నన్నాడట !

కూడే కూడే కాపురం తీయకపోతే నీఅంకు మొగుణ్ణే కా దన్నాట్ట !

కూతలార్భాటమేగాని కుప్పలో గింజ లేదు.

కూతురికి దొరికేదంతా కుళ్ళాయిమిండగాళ్ళే.

కూతురికి మంగళవారం, శుక్రవారం, కోడలుకు దివ్వెలు దివ్వెలు.

కూతురిని కన్నమ్మ కుడుములు తిన్నది.

కూతురు అని కుంచె డిస్తే కన్నతల్లి అని కంచెడు పెట్టిందట !

కూతురు అని కుంచె డిస్తే తల్లి అని తట్టెడు పెట్టిందట !

కూతురు కనలేకపోతే అల్లుడిమీద పడి ఏడ్చినట్లు.

కూతురిపురుడు కుండలలో, కోడలిపురుడు కొండలలో.

కూతురిముట్లు కుండల్లో, కోడలిముట్లు కొండల్లో.

కూతుళ్ళు కన్నమ్మకు కుర్చీపీటలు, కొడుకులు కన్నమ్మకు గో[illegible] [illegible]

కూతుళ్ళు కన్నమ్మ కళలేనులలో, కొడుకులు కన్నమ్మ లబ్బీసులలో.

కూన అని పెంచితే గండయి కరవ వచ్చిందట!

కూనపులికి లేడి దీటా?

కూనలమ్మసంగీతం వింటే పుణ్యం లేదు, వినకుంటే పాపం లేదు.

కూనా, మొగుడూ కూటికి కేడిస్తే అన్వ అంటు మొగుడి కేడ్చిందట!

కూరకు తాలింపు, చీరకు (గుడ్డకు) జాడింపు.

కూరలేని తిండి కుక్కతిండి.

కూరాకు (కుండ) (కూరాడు) మొద లుంటే కూసుముండైనా చేస్తుంది కాపురం.

కూర్మం (శ్రీకూర్మం) వెళ్ళి కునుకువైష్ణవుని కాళ్ళు పట్టుకొన్నట్లు.

కూర్చుంటే కుంటి, లేస్తే లేడి.

కూర్చుంటే కుక్కయినా కఱవదు.

కూర్చుంటే మరామేకు, నుంచుంటే మరామేకు.

కూర్చుండి (కూర్చొని) కుండ లమ్మినట్లు.

కూర్చుండి కూడు వండలేను, వంగుండి తీర్థం వస్తాను అన్నట్లు (అన్నదట!)

కూర్చుండి (కూర్చొని) చేసిన పాపం గుడి కట్టినా పోదు.

కూర్చుండి (కూర్చొని) తింటూఉంటే కొండయినా కరిగి (సమిసి) పోతుంది.

కూర్చుండి (కూర్చొని) తింటే గుళ్ళూ, గోపురాలూ ఆటవు (ఆగవు).

కూర్చుండి (కూర్చొని) తింటే గుళ్ళూ, మళ్ళూ ఆటవు.

కూర్చుండి (కూర్చొని) పడుకోవలెను.

కూర్చుండి (కూర్చొని) లేవలేడుగాని ఎగసి తాటికాయలు తెంతా నన్నాడట!

కూర్చుండి (కూర్చొని) లేవలేడుగాని వంగుండి తీర్థం వస్తా నన్నట్లు.

కూర్చుండి లేవలేనమ్మ వంగుని శివరాత్రికి వస్తానన్నదట!

కూర్చున్న కొమ్మ నరుక్కున్నట్లు.

కూర్చున్నవానికి కుప్పలు, తిరిగినవానికి తిప్పలు.

కూలి ఇచ్చి కుదురు కొట్టించుకొన్నట్లు.

కూలికి వచ్చి పాలికి మాట్లాడినట్లు.

కూలికి విషం తాగుతారా?

కూలి కుండకు రాదు, అంకు పన్నుకు రాదు.

కూలి కూటికి రాదు, లేకి చేతికి రాదు.

కూలి చేస్తే కుండ కాలె, లేకుంటే ఎండ కాలె.

కూలి చేస్తే గడవనిది కూర్చుంటే గడుస్తుందా?

కూలిబంటు కొక మాలబంటు, మాలబంటు కొక మద్దెలకాడు.

కూలినాలి చేసి కుదురువలె ఉండక మొగుణ్ణి కట్టుక సగ నైపోతినే అందట!

కూలీలకు గొల్లమధ్యాహ్నము అయిన పన్నట్లు.

కూసి కుక్క దుప్పు తెచ్చుకొన్నట్లు.

కూసికూసి గుంటనక్క గూడెల్లి (గూడ నెడలి) చచ్చిందట!

కూసుముండనోరు కుట్లేసినా నిలువదు.

కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెరచిందట!

కృత్తికలో కుతికెపిసుకుడు.

కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు.

కృష్ణాస్నానానికి కొండుభొట్లాజ్ఞ!

కెంపు నే నెఱుగనా? కుంపటివలె నుండు, కొమ్ము లుండు రెండు కోతికివలె.

కేకలూ, కూకలేగాని నూర్పిడిలో గింజ లేదు.

కేశవా! నారాయణా! అవ్వా! బువ్వ పెట్టు.

కొంగ కొక చెఱువు లేదు, కోమటి కో ఊరు లేదు.

కొంగజపము చేపలకొఱకే.

కొంగరెట్ట నాకూడు తీసిన దన్నట్లు.

కొంగు తగిలినా కొంత మేలే (ఆశ తీరును) (పుణ్యమే).

కొంగు తడిస్తే చలిగాని, కోకంతా తడిస్తే ఏం చలి?

కొంటిమి, తింటిమి, కోలాట మెందుకు?

కొంటే వస్తుందిగాని కొసరితే వస్తుందా?

కొండంత దూదికి కొండంత నిప్పెందుకు?

కొండంత దేవుడికి కొండంత పత్రి పెట్టగలమా!

కొండంత మదపుటేనుగు తొండము లేకుండినట్లు.

కొండంత రాగం తీసి పిచ్చుకుంట్లపాట పాడినట్లు.

కొండంతరెడ్డి కొంగు పట్టుకుంటే, ఊఁ అనేదానికి లేదు, ఆఁ అనే దానికి లేదు.

కొండంత రెడ్డే (మొగుడే) పోగా పిడికెడుబొచ్చుకు ఏడ్పెందుకు?

కొండ అద్దమందు కొంచెమై ఉండదా?

కొండ ఎక్కి పిండి కొట్టినట్లు.

కొండ ఎక్కి (కువెళ్ళి) వానిమొలను కొడవలి చెక్కినట్లు.

కొండ కట్టెలు, కోనేటినీళ్ళు మోసినట్లు.

కొండ కింద మెరక, తూముకింద పల్లము మంచిది.

కొండకు ఒక వెంట్రుక ముడివేస్తే, వస్తే కొండే వస్తుంది, పోతే వెంట్రుకే పోతుంది.

కొండతో తగరు పోట్లాడినట్లు.

కొండనాలుకకు కబు రందలేదు.

కొండనాలుకకు మందు వేస్తే ఉన్ననాలుక ఊడిపోయిందట!

కొండను [illegible] [illegible] [illegible]గినట్లు.

కొండను తలక్రింద పెట్టుకొని రాళ్ళకు వెదకినట్లు.

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు.

కొండ పగులగొట్టి ఉలవ చల్లు.

కొండముంగలి గొరిగినట్లు.

కొండమీది కోతిని కొని తెచ్చినట్లు.

కొండమీద గుబగుబ లేమంటే కోమట్లకహాస్యా అన్నట్లు.

కొండమీదనుంచి పడ్డవానికి గాయూ తెన్న ?

కొండమీదనుంచి బండ దొర్లించినట్లు.

కొండమీద భక్ష్యాలకు పోతే కొండకింద పాయసం పోయినట్లు.

కొండముచ్చుకు కోతి విందవును.

కొండలు మింగేవాడికి గోపురా లడ్డమా ? గుడి మింగేవానికి లింగ మడ్డమా ?

కొండవలె వచ్చి మంచువలె తేలినట్లు.

కొండవాడు వంకాయ కాల్చుక తిన్నట్లు.

కొండీ ! కొండీ ! కొడవలిటు తేవే అంటే చస్తి నీకాళ్ళు మొక్కుత దీప మిటు తే అందిట !

కొండవీటిదండుముండా ! కుండ లిటు తేవే.

కొండను నమ్మినవానికి కొదువ లేదు.

కొంప అంటుకపోతూ ఉంటే అన్నంగిన్నె నిప్పువద్దఅ పెట్టిందట !

కొంప దీస్తివా రామన్నా ! అంటే అందుకు సందేహమా ? అన్నట్లు.

కొంప తీకకురా సుప్రతా !

కొక్కిరాయి ! కొక్కిరాయి ! ఎందుకు పుట్టావే ? అంటే ! చక్కని వాళ్ళని వెక్కిరించటానికి అన్నదట !

కొక్కిరాయులలో కొంగ ఘనము.

కొక్కొరోకో అంటే తెల్లవారినట్లే.

కొట్టకముందే ఏడుస్తా వేమంటే ముందు కొట్టబోతావని ఏడుస్తా నన్నట్లు.

కొటారు కొల్లకోతుంది అంటే పాలివాడు లేకుండ చూడరా! అన్నాడట!

కొటిపిదిన్నెలో గుడిసె వేసినట్లు.

కొట్టినా వంగని కొడుకు, తిప్పినా తిరగని మీసం (లాభం లేదు).

కొడితే కొట్టాడు, కొత్తకో కెట్టాడు.

కొడుకు బాగుండవలె, కోడలు ముండా మొయ్యవలె.

కొడుకుబిడ్డకు, కూతురుబిడ్డకు తాత ఒకడే.

కొడుకు ముద్దు, కోడలు వద్దు.

కొత్తగా సిరి వచ్చె, అర్ధరాత్రి గొడుగు పట్టమన్నాడట!

కొత్త అచ్చు, కొత్త రాగులు, ఏటి రవ్వ చుట్టాలు, తిరుమలరాచెర్లమ్మా, తినేవరకూ పొయ్యేట్లేదు. సంకలో పిల్లుంది, సంకురాత్రి వఱకు పండెల్లేదు, ఊరిలో పనిలే దమ్మా! ఉంటాను ఉగాది దాకా! ఎండవే వడ్లా! ఏడునాళ్ళు, పండవే పడకా పదినాళ్ళు.

కొత్తఅప్పుకు పోతే పాతఅప్పు పైన పడ్డదట!

కొత్తఆవకాయి, కొత్తపెళ్ళాం (రుచి).

కొత్తఎద్దుపెండ ఇంటిల్లిపాది తీసినట్లు.

కొత్త ఒకవింత, పాత ఒకరోత.

కొత్తకుండలో జోరీగ లాడినట్లు.

కొత్తకృషికి పాతతరినేల.

కొత్తకొత్తగా వచ్చి కత్త ఎగరేసినట్లు (ఎగరేసిందట!)

కొత్తగదరా కొమ్మా, అంటే మరగనీరా, ఇరగ (విరుగ) తందాం! అన్నట్లు.

కొత్తగిత్తల నాగలి, కొత్తసాగు ఏగిలి.

కొత్తగుడ్డకు రంగు పట్టినట్లు పాతగుడ్డకు పట్టదు.
కొత్త చింతకాయతొక్కు, కొత్త చుట్టరికము రుచి.
కొత్తది గొత్తెలమడుగు, పాతది బత్తెలమడుగు.
కొత్త దొరకవింత, కోడికలబొంత.
కొత్తనీరు వచ్చి పాతనీరు కొట్టుకపోయినట్లు.
కొత్తనీళ్ళకు చేప ఎదురెక్కినట్లు.
కొత్తబిచ్చగాడు పొద్దెరుగడు.
కొత్త మురిపెము కొమ్మన్నా ! తెల్లగ కొట్టరా మడేలా !
కొత్త వైద్యునికంటె పాతరోగి మేలు.
కొత్త సీసాలో పాతసారా.
కొద్దికొద్దిగా తీస్తే కొండయినా సమసిపోతుంది.
కొద్దివానలకే తాక్కలుపుసుగులు.
కొనగా తీరనిది (తేనిది) కొసరగా తీరునా ?
కొనజాలకు కోతి పుడితే, కులమువాళ్ళంతా కుంటికుక్క అని పేరు
పెట్టిరి.
కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి.
కొన లేదు మొదలు లేదు, కొడుకుపేరు సోమలింగం.
కొన్న అంగడిలోనే మారు బేరమా ?
కొన్నదగ్గఱ కొసరుగాని, కోరినదగ్గఱ కొసరా ?
కొన్నది వంకాయ, కొసరింది గుమ్మడికాయ.
కొన్నవాడికన్న తిన్నవాడే మేలు.
కొన్నవాడే తిన్నవాడు.
కొన్నాక తినక మానడు.
కొన్నాళ్ళు చీకటి, కొన్నాళ్ళు వెలుతురు (వెన్నెల).
కొనీ తింటూఉంటే కోమటిదేస్తం, ఇచ్చితీసుకుంటూఉంటే ఈడిగనేస్తం.

కొల్లేటిపంట కూటికే చాలదు.

కొనేది కొయ్యగూర, తినేది చెంచెలకూర.

కొనేవాడికి కోటిక ళ్ళయితే, అమ్మేవాడికి అవిటి దొక టే చాలు.

కొనైనా (కొనిఅయినా) కొసరు నూనే రాయాలి.

కొప్పుకు సగుర మందము, చెప్పుకు తగుర మందము.

కొప్పున్నామె ఎటు తిప్పినా అందమే.

కొబ్బరిచెట్లకు కుడితి మృత్యువు (మిత్తి).

కొబ్బరిచెట్టు ఎందుకు ఎక్కావురా అంటే దూడగడ్డికి అన్నట్లు.

కొమ్ముమీద కూలుస్తుంది.

కొమ్ములకు లేని వాడి చెవులకు వచ్చినట్లు.

కొమ్ములు చూచి బేర మాడినట్లు.

కొయ్యరా ! కొయ్యరా ! పోలిగా ! అంటే టంగుటూరి మిరియాలు తాటికాయలంతేసి అన్నాడట !

కొఱకనుబోతే పడికట్లు ఉరికి మీంద పడ్డట్లు.

కొఱవితో కొప్పు (తల) గోకుకొన్నట్లు.

కొఱవి పెట్టేవాడు కొడుకు, కూడు పెట్టేది కూతురు.

కొఱ్ఱకు నక్క కొఱ్ఱ.

కొఱ్ఱగింజతో కోడలిని చూస్తే కొండంత జ్వరం వచ్చిందట.

కొఱ్ఱలు కఱవు పెంచును.

కొఱ్ఱలూ ఒకపంటేనా ?

కొఱ్ఱునపడేవాడు ఒకడు, కూన్పులు లెక్కపెట్టేవా డొకడు.

కొల్లకు పోయి పైచీర కోల్పోయినట్లు.

కొలిచేవాడు గుడ్డి, కొలిపించుకొనేవాడు గుడ్డి.

కొలువుకన్న గోపాలమే నయం.

కొల్లు మునిగినకొన్నాళ్ళకు కోనా మునిగింది.

కొల్లేటిబ్రహ్మహత్య కాపుమీదుగా కొట్టుకపోయినట్లు.
కొల్లేటిలో పండే పంటలేగాని, చచ్చే దున్నపోతులకు లెక్క లేదు అన్నట్లు.
కొల్లేటివ్యవసాయం గొడ్లవినాశనం.
కొసరినకూరలోగాని పస లేదు.
కో అంటే కోటిమంది.
కోకిల పోయి కొమ్మ ఎక్కినట్లు.
కోట గోడల ఇల్లు, తాటాకులపందిరి.
కోటచక్కదనము గమిడి చెప్పినట్లు.
కోటలో కొల్లవంకదారిలో పోయినట్లు.
కోటలో పాగా వేసినట్లు.
కోటవఱకు, నీటివఱకు (సాగనంపవలెను).
కోటికి గోవు, నూటికి నూలుపోగు.
కోటికి పడగెత్తువాణ్ణి పదివేల కాపైనై బ్రతుకు మన్నట్లు.
కోటిపల్లిగుళ్ళు ఎవరు కట్టించారో తెలియదుకాని, అంతర్వేదిగుళ్ళు నేను కట్టించలేదు అన్నాడట !
కోటివిద్యలకంటె కోరుకు పొలం దున్నడం మేలు.
కోటివిద్యలు కూటికొరకే.
కోటివిద్యలు కొండ్రకు లోకువ.
కోటివిద్యలు నేర్చినా కొల అచ్చితే కొలవలె కాదు.
కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందట !
కోడలిదానిమొగడు కొట్టం పట్టుకొని వచ్చినాడట !
కోడలికి బుద్ధి చెప్పి అత్త ఱంకుకు పోయిందట !
కోడలిని కొలుచుకొమ్మంటాను, అత్త నమ్ముకొమ్మంటాను !
కోడలు కొడుకు కంటాను అంటే వద్దనే అత్తగా రున్నారా ?

కోడలు గృహప్రవేశం, అత్త గంగాప్రవేశం.

కోడలు నలుపైతే కులమంతా నలుపు.

కోడలు వచ్చిన వేళ, కోడెలు వచ్చిన వేళ (మంచిది కావాలి).

కోడిఅడుగులో కోటివర్ణాల భూమి.

కోడికి ఉన్న కోర్కెలతో పిల్లి కేమి అక్కఱ?

కోడికి కులాసం లేదు, కోమటికి విశ్వాసం లేదు.

కోడికి గజ్జెలు కడితే కుప్ప కుళ్ళగించదా?

కోడి, కుంపటి లేకపోతే తెల్లవారదా?

కోడికూత, కాడిపూత.

కోడి కూయకున్న తెల్లవారకపోదు.

కోడి కొత్తఅప్పులు, పంది పాతఅప్పులు తీర్చును.

కోడిగుడ్డంత బంగారం లేనివాడున్నాడా?

కోడిగుడ్డంత సంసారంలో కోరిక లేల?

కోడిగుడ్డుకు ఈకలు తీసినట్లు (అంటుసప్పు పని).

కోడిగుడ్డు (పగుల) కొట్టి గుండ్రాయి కావాలా?

కోడిగుడ్డుకొండలు బద్దలు కొట్టగలమా?

కోడిగుడ్డుమీద వెంట్రుకలు లెక్కపెట్టినట్లు.

కోడి నలుపైనా గుడ్డు తెలుపే.

కోడిని అడిగి మసాలా నూరుతారా?

కోడిని కోసి గోత్రాని కంతా పగ ఐనట్లు.

కోడిని గద్ద తన్నుకొని పోయినట్లు.

కోడిని తిట్టిన తిట్టు కోడలి కెఱుక.

కోడిని పెంచితే కోడిగుడ్డంత బంగారం వస్తుంది.

కోడిని కోసే ఇంట్లో కొరకొర తప్పదు.

కోడిపిల్లపైనుండి గొఱ్ఱెపిల్లను బలాదూరు తీసినట్లు.

కోడిపిల్లమీద పందిపిల్ల బలాదూరు.

కోడిపెట్ట ఎక్కడున్నా ధ్యాసం (మనసు) గుడ్లమీదే.

కోడి పోయి కొమ్మెక్కినట్లు.

కోడి ముందా ? గుడ్డు ముందా ?

కోడి తొక్కారవేస్తే గొప్పవర్షం కురుస్తుంది.

కోడీ ! నీరెట్ట మంచు అంటే కొట్టెక్కి కూర్చుందట !

కోడు ఒకడు తీస్తే కొమ్ము ఒకడు తీస్తాడు.

కోతలకాలంలో ఎలుకల కేడుగురు భార్యలు.

కోతలనాడు (రోజులలో) కొడవలి పట్టినట్లు.

కోతలన్నాళ్ళు కోతి బతికింది, తరువాత బతికిందే బతుకు.

కోతల్లో కునికిపాట్లు పడి కొత్తఅమావాస్యకు కొంపగోడి అనుకున్నట్లు.

కోతల్లో కూడదీసుకుంటే కాటికి కొఱత రాదు.

కోతికి అద్దం చూపినట్లు.

కోతికి కల్లు త్రాగించినట్లు.

కోతికి కొబ్బరికాయ దొరికినట్లు.

కోతికి గురివింద దొరికినట్లు.

కోతికి జలతారుకుళ్ళాయి ఏటికి ?

కోతికి తేలు కుట్టినట్లు.

కోతికి పట్టుపుట్టం కట్టినట్లు.

కోతికి పుండైతే గోకా, నాకా.

కోతికి పెత్తన మిస్తే గోదావరి కడ్డంగా ఈదిందట !

కోతికి బెల్లం చూపరాదు, కోమటికి ధనం చూపరాదు.

కోతి గురువెంద సామ్యం.

కోతి గెంతడం, సాయబు సంపాదించడం.

కోతిచావు, కోమటిఱంకు.

కోతిచేతిపామువలె.

కోతిచేతిపూలదండ.

కోతిని చేయబోతే కొండముచ్చాయినట్లు.

కోతిపంచాయతీ కొంప లాగుస్తుంది.

కోతి పిల్లలకు రొట్టె పంచినట్లు.

కోతిపుండు బ్రహ్మరాక్షసి.

కోతి పులి గాదు, కోమటి దొర గాదు.

కోతిముండకైనా గీత బాగుండవలె.

కోనింగచెట్టుపై కొక్కెర, ఎక్కమన్న చెట్టు ఎక్కెర !

కోనేటిస్నానానికి కొండుభట్లాజ్ఞా ?

కోపము (౦) గొప్పకు ముప్పు, అల్లరికి హంగు ముప్పు.

కోపము (౦) తాపము చేటు, తాపము బ్రహ్మహత్య చేటు.

కోపము పాపకారణం.

కోపానికి పోయిన ముక్కు శాంతానికి రాదు.

కోమట్ల కొట్లాట, గోచీఊగులాట.

కోమటి ఇల్లు కాలినట్లు.

కోమటికి ఒక టీక పది గొన్నా పాపం లేదు.

కోమటికి, కోతికి ముల్లె చూపరాదు.

కోమటితో మాట, కోతితో సయ్యాట.

కోమటిని చూచి నక్క శాంతి అడిగిందట!

కోమటిపిటికి, కొడితే ఉటికి (నూతిలో ఉటికి).

కోమటి భక్తుడు కాడు, తగరం కత్తి కాదు.

కోమటిలేమి కంసాలికలిమి ఉండదు.

కోయిలపోయి కొమ్మెక్కినట్లు.

కోరికోరి బావను పోతే కుంటివాడు పుట్టాడట !

కోరినకొండల్లో వానలు కురిసినట్లు.
కోరి పిల్లను ఇస్తా మంటే కులం తక్కువ అన్నట్లు.
కోరి, పీగి కొడుకును కంటే, మూగ చెవుడు ముంచుక వచ్చిందట!
కోరుకొండతీర్థానికి కోడిగుడ్డంత (మామిడి).
కోరుకొన్న కోడలువస్తే కొప్పులో చెప్పు పెడుతుంది.
కోరుగింజలు, కొంగులోకే సరి.
కోర్టు ఎక్కిన వాడు, గాడిద ఎక్కినవాడు ఒక్కటే!
కోల ఆడితే కోతి ఆడును.
కోల లేని పెట్టు, తాడు లేని కట్టు.
కోళ్ళకు ఱెక్కలు, తాళ్ళకు పండ్లు, ఉన్నట్లు.
కోళ్ళను తింటారా అంటే కాళ్ళుపారేస్తాము అన్నట్లు.
కోళ్ళబేరాని కెళ్ళి, కోటలో కబుర్లడిగినట్లు.
కోళ్ళు కూయగా లేచినా కాళ్ళు కాలేవఱకే అవుతుంది.

—::—

## ఖ

ఖాజీని ఫాజీగాను, ఫాజీని ఖాజీగాను మార్చినట్లు.
ఖానాకు నహీ, ఎల్లికి బులావ్ అన్నట్లు.
ఖాజా (ఖాజ్జా) మొగుడు ఒడిలో ఉంటేనేమి, దడిలో ఉంటే ఏమి!

—::—

# గ

గంగ ఈత, గరిక మేత.

గంగకు, సాం (చాం) గకు పంగకు తప్పు లేదు.

గంగతో వెడ్రవతం సరా ?

గంగను పడ్డ కాపురం గట్టున పడుతుందా ?

గంగలో అస్థి, గయలో పిండం.

గంగలో మునిగినా కాకి హంస అవుతుందా ? (కాదు).

గంగాధరుడు చచ్చినాడమ్మా ?

గంగానమ్మ నెత్తిమీద తురకాడు కాలు పెడితే కాపువాణ్ణి తీయమంటుంది.

గంగాస్నానం, తుంగాపానం.

గంగాస్నానానికి కొండుభట్లాజ్ఞా ?

గంగిగోవుపాలు గంటెడే చాలు.

గంగిరెద్దును బండికి కడితే వాడవాడ, గంగిరావును బండికి కడితే ఇల్లిల్లు.

గంటెలు పండిన ఇంట, కణుజు పడిన ఇంట కలవు లేదు.

గంటైనా బలవాలి, గాదైనా తిరగాలి.

గంజాయితోటలో తులసి మొక్కవలె.

గంజాయిపీకకు, కల్లురేకకు అంటు లేదు.

గంజి తాగినా లంజ కావాలి.

గంజి తాగేవానికి మీసా లెగ బెట్టేవా డొకడు.

గంజిలోకి ఉప్పు లేదు, పాలలోకి పంచదార.

గండం గడచి పిండం బయట పడినట్లు.

గంతకు తగిన బొంత.

గంతలుకడితేనే గానుగ తిరుగుతుంది.

గంతలో బావ ఉన్నాడని సంతలో కాల్మడిచిందట!
గంతా తూలాలి, ఎద్దూ తూలాలి, అప్పుడు పడాలి.
గంతా పడాలని ఉంది, ఎద్దూ తూలాలని ఉంది.
గంధద్రవ్యాలు మోసినా గాడిద గాడిదే.
గంధపుపొడి మోసే గాడిదవలె.
గంధపుపొడిలో బూది ఊదినట్లు.
గంధపుపొడిలో బూడిద పెట్టినట్లు.
గంధం అమ్మిన చోట, కట్టె అమ్మినట్లు.
గంధంలో కసూసు కలిపినట్లు.
గంధం సమర్పయామి అంటే గొడ్డలి నూరారా అన్నాడట!
గంధం సమర్పయామి అంటే గొడ్డలి పుచ్చుకొని అడవికి వెళ్ళాడట!
గంధాన వేస్తే పుష్పాన వేసినట్లు.
గంపకింద పందికొక్కు గంపనే తవ్వుతుంది.
గంపదింపుడు ఘనమాయె, పూర్వపుబుద్ధులు పోవాయె.
గంపలాభం చిల్లి తీసినట్లు.
గంపసిడి (సిరి) కాదు, గాలిపుసిడి (సిరి).
గచ్చకాయల కుండవలె (లాగు).
గచ్చకాయల (కుక్కాన్న) గుజ్జుం కందకము దాటునా?
గచ్చపొద కదలించినట్లు.
గచ్చపొదమీద ఇసుక వేసి కయ్యానికి పిలిచినట్లు.
గజకచ్ఛపాలు పోరినట్లు.
గజమూ మిథ్య, పలాయనమూ మిథ్య.
గజశాస్త్రవేత్తలకు గజారోహణము వచ్చునా!
గజ్జిఉన్నవాడికి లజ్జతో పని లేదు.
గట్టిగ ఆయుష్యముంటే, గతికె నూరి పోసినా బతుకుతాడు.

గట్టిగా తిట్టిన గాలికి పోవును.

గట్టిది విడికి పొట్టుకు పోరాడినట్లు.

గట్టివాడేకాని కడుపుమాత్రం గుల్ల.

గట్టు చేరిన వెనుక పుట్టివానితో పోరాడినట్లు.

గట్టుమీద మేఘం మేస్తే కళ్ళముందరే వాన.

గ ట్టెక్కితి, పు ట్టెక్కితి, నేటి మె ట్టెక్కితి, అన్నట్లు.

గడంతసానికి ముంతంత కొప్పు.

గడ ఎక్క తిమ్మన్నా ! గంతులు వేయి తిమ్మన్నా !

గ (క) డచినదానికి వగచి లాభ మేమి ?

గ (క) డచి బ్రతికినామని గంతులు వేయరాదు.

గడ్డం కాలి ఏడుస్తుంటే, చుట్టకు నిప్పిమ్మని వెంట పడ్డాడట !

గడ్డం వపన మిచ్ఛతి.

గడ్డం వచ్చిబొడ్డుపై పడినదా ?

గడ్డగడ్డకు గుక్కెడు నీళ్ళు తాగినా రైతే వ్యవసాయం చేయాలి.

గడ్డగడ్డకు ముంతెడు (పుట్టెడు) నీళ్ళు తాగి రెడ్డే వ్యవసాయం చేయవలెను.

గడ్డ తిన్నా కంపే, పాయ తిన్నా కంపే.

గడ్డపలుగులు గాలికి పోతూంటే ఒగుడాకు నాపని ఏమి ? అన్నదట!

గడ్డపలుగులు గాలికి కొట్టుకొని పోతూంటే పుల్లాకు నాగతి ఏమి ? అన్నదట !

గడ్డపలుగులు మింగి శొంఠికషాయం తాగినట్లు.

గడ్డపారలకు కదలని బండలు చెట్లవేళ్ళకు చెప్పకుండా పగులుతాయి.

గడ్డపారలు గాలికి కొట్టుకపోతూంటే పుల్లిస్తరాకు నాపని ఏమని అడిగిందట ! (తుళ్ళిపడ్డదట !)

గడ్డమీదవానికి గప్పా లెక్కువ.

గడించేవాడొకడు, గుణించేవాడొకడు.

గడి ఎక్కా నేనే, గంతులు వేయా నేనే.

గడియ గడిసినా (గడచినా) గడిసిందే గంగీ! సిద్దెలో నిప్పెట్టు.

గడియ పుర్సత్తు లేదు, గవ్వ ఆదాయం లేదు (రాకడ లేదు).

గడియ మనది కాదు, క్షణం మనది కాదు.

గడియారం చూచి గడాలు (అరకలు) కట్టిస్తారా!

గడ్డింత లేక ముడ్డింత ఎండి వేంచేసెనే గుఱ్ఱం దేవలోకము.

గడ్డికుప్పలో సూది పారవేసుకొన్నట్లు.

గడ్డికోసం సేద్యమా?

గడుసువాడు మూడుదండాల చెడును.

గడెము కట్టిన గోడెము విడుస్తుంది.

గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్.

గతజలసేతుబంధనము.

గ (క) తికితే అతకదు.

గతి చెడినా మతి చెడరాదు.

గతిమాలినవానికి కుతి లావు.

గతిలేనమ్మకు గంజే పాయసము.

గతిలేనమ్మకు మతిలేని మొగుడు.

గతిలేని ఊరికి మతిలేని గంగానమ్మ.

గతిలేనినాడు గంగానమ్మా! నీవే గతి.

గతిలేనివాడు గాడిదకాళ్ళు పట్టుకొన్నట్లు.

గతిలేనివానికి వారణాశే గతి.

గతుకులకు పోతే బతుకులు పోయినవి.

గదరింటిలో పెండ్లి, గడియకింత తిండి.

గద్దకు సంక్రాంతిముందు సంకెళ్ళు.

గద్దించే అత్త, మర్దించే మామ (లేనట్లు).
గద్దెకు పోయిన సుద్దులు తక్కువా ?
గబ్బరీడు కార్తెవర్షాలకు దిబ్బలుకూడా కరుగుతాయి.
గబ్బిలము ఆకాశము పడకుండా పట్టుకొంటూ న్నట్లు.
గబ్బిలమువలె అటు పక్షీ కాదు, ఇటు జంతువూ కాదు.
గబ్బిలాయి మొగం నవ్వినా ఒకటే, ఏడ్చినా ఒకటే.
గబ్బుకు గంపె డీగలు.
గబ్బువాడు, గదుకువాడు నెయ్యమందితే మురికివాడు వచ్చి ముద్దాడినాడట !
గయాళు విడిచిన నేలలో విత్తుము.
గయ్యాళి రచ్చకెక్కితే, సంసారి దొంతులసందున దాగును.
గయ్యాళీ, గచ్చపొద (ఒకటి).
గర్భాధానంనాటి ముచ్చట్లు లంఖణాలలో తలచుకొన్నట్లు.
గఱికచేను గాడిదపాలు.
గఱిక మేసి గాడిద చెడుగాని (చస్తుందిగాని) గఱిక చెడదు (చావదు),
గరిసె విత్తనాలు పోసి గంపెడు విత్తనాలు తెచ్చుకొన్నట్లు.
గరుడాయ తెస్వా అంటే శేషాయ తెస్వా అన్నాడట !
గరుత్మంతుణ్ణి చూచిన పామువలె.
గవ్వన్నరకు గడ్డం గొరుగుతా నంటే వెంట్రుకన్నరకు ఎంత ? అన్నాడట !
గాండ్లవాని ఆశ గోతమున్నూ పట్టదు.
గాజుకుప్పెలో దీపంవలె.
గాజుపూసల గనిలో ఘనమైన మణి దొరకునా !
గాజులగుడికి (మలారానికి) రోకలి పూనినట్లు.
గాజులచెయ్యి గలగలలాడితే ఇల్లు కలకలలాడుతుంది.

గాజులబేరం భోజనానికే సరి.

గాజులరొయ్యలు, మేజాముద్దులు.

గాడి తప్పిన బండివలె.

గాడిదంత బిడ్డకు గారికళ్యాణమట!

గాడిదకు తనకూత కమ్మగానే ఉంటుంది.

గాడిదకు గడ్డి వేసి ఆవును పాలిమ్మంటే ఇస్తుందా?

గాడిదకు పులితోలు కప్పితే కఱవకబోదా?

గాడిదకు భోగినీళ్ళు పోస్తే బూడిదలో పొర్లాడిందట!

గాడిద కేమి తెలుసు (ఎఱుక) గంధపుపొడివాసన?

గాడిద గంపెడాకు తిన్నది అన్నట్లు.

గాడిద గాడిదే, గుఱ్ఱము గుఱ్ఱమే.

గాడిదగుడ్డు, కప్పతోలుకాసు.

గాడిదగుడ్డు, గరుడగంభం.

గాడిదచంటిలో కడవెడు పాలు.

గాడిద చచ్చినా గతికేక చావదు.

గాడిదతో స్నేహం కాలితాపులకే.

గాడిదపిల్ల కోమలము.

గాడిదపుండుకు బూడిదే మందు.

గాడిదముండా! ఏమిటా కంటా వేసనే? అంటే నాకు కోపమొస్తే
నడుంగలాంకాడా కంటాను అన్నదట!

గాడిద మోయదా గంధపుచెక్కలు?

గాడిద మోసింది బూడిదగంప (గంత).

గాడిదల మోత, గుఱ్ఱాల మేత.

గాడుపట్టిన గంగానమ్మ పూజారిని పోయినట్లు.

గాడుపుకు గడ్డపార కొట్టుకపోగా ఉల్లిపొట్టు నాగతి ఏమి? అన్నదట!

గాదెకింద (ఉన్న) ఎలుక గాదెకిందే బతకాలి.

గాదెకింది పందికొక్కువలె.

గాదెడు కొఱ్ఱలు తిన్నా కౌజు మూడే కానులు.

గాదెడు దోసకాయలలో చేటెడు కొజ్జులు పెట్టవా?

గాదెనిండా బియ్యముంటే కఱవునా, కాలానా నాభార్యను పిల్లలను
నేనే రక్షిస్తాను అన్నాడట!

గాదె, బోదె, గేదె.

గాదెలో గింజలు (ధాన్యము) గాదెలోనే ఉండాలి, బిడ్డలు (పిల్లలు)
గా (బీ) రకాయలలా ఉండాలి.

గానమువంటి విద్య నిక గానము.

గానుగఎద్దు ఒక్కసారిగా ముక్కెద్దు అవుతుందా?

గానుగరోట్లో చెయ్యి పెట్టి పెరుమాళ్ళకృప (దయ) అన్నట్లు.

గానుగరోలు పెద్దై కుడుపెడయింది.

గానుగలోనిదే గంటెడు (గరిటెడు).

గాను గాపే, గాను గాపే నీవు కూర్చున్న పనేగా నూనె పోయడం.

గాము సోకినట్లు.

గారాబం గంజి కేడిస్తే ముసలివాడు ముంత కేడ్చాడట!

గారాబం గజ్జెలకు (గారెలకు) ఏడిస్తే వీపు దెబ్బలకు ఏడ్చిందట!

గారాల బిడ్డ పుడితే గడ్డపారతో చెవులు కుట్టినట్లు.

గారాబాల బావకు మిరియాల చారు.

గారెలు వండాలే పెళ్ళామా అంటే వేలు చూపిందట!

గాలి ఉండగానే తూర్పార పట్టుకో (పొయ్యాలి).

గాలికి పుట్టి ధూళికి పెరిగినట్లు.

గాలికి పోయిన పేలపిండి భగవదర్పితము.

గాలికి పోయిన పేలాలు (పేలపిండి) కృష్ణార్పణము.

గాలికి పోయిన కంపను కాలికి తగిలించుకొన్నట్లు.

గాలికి పోయే కంప గోచికి కొట్టుకొన్నట్లు.

గాలికుంటు అయితే కురసు అంటాడు.

గాలికుంటుపశువును మందలో ఉంచకు.

గాలిని మూట కట్టినా గయ్యాళినోరు కట్టలేరు.

గాలిపాటు, కలిమి తేట.

గాలిపాటు చూచి ధాన్యము ఎగురబోయుము.

గాలిపాటు సరి లేకపోతే కలవృకు కారణం .

గాలిమేడలు గురించిన సామ్యం.

గాలి లేనిది దుమారం లేచునా ?

గాలిలో దీపం పెట్టి దేవుడా నీమహిమ అన్నట్లు.

గాలిలో పెట్టిన దీపాన్ని కాపాడు భగవంతుడా అన్నట్లు.

గాలిలో మేడలు కట్టినట్లు.

గాలి వచ్చినప్పుడే (వచ్చినప్పుడుకదా) తూర్పారపట్టవలె (పట్టుకోవలె).

గాలివానకు కావలసినంత విశ్రాంతి.

గాలివాన వస్తే కత్తే మూసును.

గ్రామంలో ఒకకోమటుంటే వెయ్యిరూపాయలు నష్టం ఒక్క ఆబోతుంటే వెయ్యిరూపాయలు లాభం.

గ్రామశాంతికి బోడితల.

గ్రాసం లేని కొలువు మీసం లేని బ్రతుకు.

గ్రాసం లేని కొలువు, రసం లేని కావ్యం.

గ్రాసం లేని బంటుకు రోసం ఎక్కువ.

గింజలు ముత్తెము, పిట్టలు పన్నిద్దుము.

గిరాకీ కొననివ్వదు, మందం అమ్మనివ్వదు.

గిరాకీ కోమట్లపాలు, మందం మాలల పాలు.

గుంటకపురాణం, గంపకళలకం.

గుంటకాకికి వింటిదెబ్బ ఎఱుగదు.

గుంటూరుపొగాకు గూట్లో ఉన్నా ఒకటే, నోట్లో ఉన్నా ఒకటే.

గుండ్రాయి దాస్తే కూతురుపెండ్లి ఆగునా ? (నిలుచునా ? )

గుండ్రాయి, పాత్రం లేకపోతే కూతురుపెండ్లి ఆగుతుందా ?

గుండ్లు తేలి బెండ్లు మునిగినట్లు.

గుంతకు వస్తే మరదలు, మిట్టకు వస్తే వదినె.

గుట్టకు మొరిగిన కుక్క గ్రుడ్లు వెళ్ళి వచ్చిందట !

గుట్టు రట్టు కారాదు.

గుడగుడ ఆలోచన గుడిసెకు చేటు.

గుడగుడశబ్దం కుండకు నష్టం.

గుడ్డకు జాడింపు, కూరకు తాలింపు కోడలికి సాధింపు లేకున్న ఇంపు లేదు.

గుడ్డ (బట్ట) లో మేలిముసుగు.

గుడ్లమీద పిట్టవలె.

గుడారంలో గూనిబతుకు.

గుడి కట్టేవాడొకడు గూట్లో దీపం పెట్టేవాడొకడు.

గుడి కట్టించేవాడొకడయితే పడగొట్టేవాడొకడు.

గుడిచుట్టూ తిరిగి బొడ్డులో వేలు పెట్టుకొన్నట్లు.

గుడినుండి గుడిరాళ్ళు తీసినట్లు.

గుడిపాము కఱచినట్లు, గంగిగోవు పొడిచినట్లు.

గుడి మింగేవానికి (మింగినవానికి) తలుపులు అప్పడములు.

గుడి మింగేవాడి (ని) కి నంది పిండి వడియము.

గుడి మింగేవాడి (ని) కి గుడిలో లింగం ఉట్రవడియం.

గుడి మింగేవాడి (ని) కి లింగ మొంత ?

గుడి మింగేవాడొకడయితే, గుడిలో (గుళ్ళో) లింగాన్ని మింగేవాడింకొకడు.

గుడిలో గంటపోతే పూజారి (నంబి) కేమి లోటు?

గుడిలో దేవునికి గుడ్డ లేదు, వాకిట్లో దేవునికి వన్నె చీర (వల్లె) కావలసి వచ్చింది.

గుడిలో (గుళ్ళో) దేవుడికి నైవేద్యం లేకుంటే పూజారి పులిహోర కేడ్చాడట!

గుడిలో (గుళ్ళో) పిత్తకపోతే గుగ్గిలం వేసినంత పుణ్యం.

గుడిలో (గుళ్ళో) లింగానికి అంగడిబెల్లం నైవేద్యం.

గుడిలో లింగం పోయినా, నంబికి భంగం లేదు.

గుడి వచ్చి పుట్టమీద పడ్డట్టు.

గుడి కనుక దండం పెట్టినట్లు.

గుడిసెవాటులకు ఇల్లాలు గుత్తలంజె.

గుడ్డిఎద్దు (జొన్న) చేలో పడ్డట్టు.

గుడ్డిఎద్దు పోగోను, గుల్లెద్దు రాగోను.

గుడ్డికంటికి అద్ద మెందుకు? గుడిసెకు చాందినీ ఎందుకు?

గుడ్డికంటికి కాటుక పెట్టినట్లు.

గుడ్డికంటికి కుంచెడు కాటుక.

గుడ్డికంటికి పగ లేమి? రాత్రేమి?

గుడ్డికంటికి రెండు గూటాలు, మెల్లకంటికి రెండు మేళాలు.

గుడ్డికన్న మెల్ల మేలు.

గుడ్డికన్ను మూసినా ఒకటే, తెరచినా ఒకటే.

గుడ్డి గుణ మెఱుగదు, వడ్డి మొద లెఱుగదు.

గుడ్డిగుఱ్ఱానికి ఒకటే త్రోవ.

గడ్డిగుఱ్ఱానికి గుగ్గిళ్ళు చేటు.

గుడ్డిగుఱ్ఱానికి పండ్లు తోమినట్లు.

గుడ్డిగేదెలలో గూనిగేదె శ్రీమహాలక్ష్మి.

గుడ్డిదాన్ని పోతే (పోవటం) గుడిసెదాకా సాగనంపాలి (సాగనంపటం)
గుడ్డిది నీళ్ళకు పోతే ముగ్గురికి చేటు.
గుడ్డిది రాగోరును, కుంటిది పోగోరును.
గుడ్డిది బెదిరిస్తే బిత్తరపోయి బావిలో పడినాడంట!
గుడ్డినక్క ఊరిన పడ్డట్లు.
గుడ్డిమామగారూ! నమస్కారమయ్యా! అంటే రంధికి మూలమా
అంకుకోడలా అన్నట్లు.
గుడ్డిలో మెల్ల.
గుడ్డివాడికన్ను రాగోరునా? పోగోరునా?
గుడ్డివాడికాలు కుంటివాడి కాధారమైనట్లు.
గుడ్డివాడికి గుడ్డివాడు దారి చూపితే ఇద్దరూ గోతిలో పడతారు.
గుడ్డివాడిచేతినూలు కదుట్లో పడుతుందో, దిండులో పడుతుందో!
గుడ్డివాడు అలావు తొక్కినట్లు.
గుడ్డివాడు ఏలు రువ్వినా గురే.
గుడ్డి ఎలుగునా కుందసపు చావు?
గుడ్డివాడు కోల కోల్పోయినట్లు.
గుడ్డివాడు వంకను త్రొక్కినట్లు.
గుడ్డివాడు వెళ్ళి గడ్డిలో పడ్డట్లు.
గుడ్డివాడి వైసం గుడ్డివాడిది, గూనివాడి వైసం గూనివాడిది.
గుడ్డివాళ్ళు ఏనుగును పట్టుకొన్నట్లు.
గుడ్డివ్రేటు గువ్వకు (గువ్వుకు) తగిలినట్లు.
గుడ్డీ! రావే, గడ్డికి పోదాము అన్నట్లు.
గుడ్డు పెట్టే కోడి కూసినట్లు.
గుడ్డు పెట్టే కోడికేగాని కూసే కోడి కేమి తెలుసు గుడ్డునొప్పి?
గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్లు.

గుణమేమి చేసిందే గునకకడ్డీ! అంటే ఎప్పటినాపేరు పంగలకడ్డీ! అందట!

గుణముకొఱకా? గునుగుకొఱకా వచ్చింది?

గుణము ప్రధానంకాని కులం ప్రధానం కాదు.

గుణము మానవే గూటాలు (సోదీ)! (బుట్టా!) అంటే నామనువైనా మానుతానుగాని నాగుణం మానన న్నదట!

గుణమేల మానవే గూటాలముఖ్ఖీ! అంటే నామనువైనా మానుతానుగాని నాగుణం మానన న్నదట!

గుణించేవా డొకడు, గణించేవా డొకడు.

గుణుపూరు జంగాలు అమ్మ కిల్లు కట్టినట్లు.

గుద్దలోకాలితే గుజ్జును ఆరికకసవు (వరిగడ్డి) తింటుంది.

గుద్దులాడిన ఇంట్లో గుప్పెడుగింజలు నిలువవు.

గుప్పిడి మూసిఉన్నంతవఱకే, తెరిస్తే అంతా హుళక్కి!

గుమ్మగట్టుజోగులు అమ్మ కిల్లు కట్టినట్లు.

గుమ్మడికాయ గుదగుదలు.

గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు తడుముకున్నట్లు.

గుమ్మడికాయలు పోయేదారి ఎఱుగరుకాని ఆవగింజలు పోయేదారి అట్టే పట్టిచూస్తారు.

గుమ్మడికాయలో ఆవగింజంత.

గుమ్మళ్ళు కుళ్ళినవి, ఆవాలు అల్లినవి.

గుమ్ములోగింజలు గుమ్ములోఉండాలి, పిల్లలు పిడుకల్లాగ ఉండాలి.

గురికాడు నక్కను కొడతాడా?

గురి కుదిరితే గుణం కుదురుతుంది.

గురితప్పిన ములికి, బరితెగిన కలికి.

గుఱిమాడితే గుఱ్ఱం వరిగడ్డి తింటుంది.

గురివిందగింజ గుద్దకింద నలుపెఱుగదు.

గురివిందగింజ తనఎఱుపేగాని గుద్ద కింద నలుపెఱుగదు.

గురువుకన్న గుడ్డు మించింది.

గురువుకు తగిన (తగ్గ) శిష్యుడు.

గురువుకు తిరుమంత్రం చెప్పినట్లు.

గురువు నిలుచుండి తాగితే శిష్యుడు పరుగెత్తుతూ త్రాగుతాడు.

గురువును మించిన శిష్యుడు.

గురువుమాట గురిమాట.

గురువుమాట మీరరాదు, గడ్డపార మింగరాదు.

గురువులేక విద్య గురుతుగా రాదు.

గురువులేని విద్య గుడ్డి విద్య.

గుఱ్ఱపుతోకకు కళ్ళెం పెట్టినట్లు.

గుఱ్ఱము (ం) ఎక్కిన తీరు కాదు, సద్ది తిన్న నోరు కాదు.

గుఱ్ఱము (ం) ఎక్కి మూట నెత్తిన పెట్టుకున్నట్లు.

గుఱ్ఱము (ం) ఎక్కేవాడే పడేవాడు.

గుఱ్ఱము (ం) కడుపులో గాడిదపిల్ల పుట్టునా ?

గుఱ్ఱము (ం) గుగ్గిళ్ళు తింటూంటే గాడిదకు కడుపునొప్పి.

గుఱ్ఱము గుడ్డిదైనా (గుడిచేటుదైనా) దాణాకు తక్కువ లేదు.

గుఱ్ఱము చచ్చింది గాక, గుంట తవ్వ నొకరూక.

గుఱ్ఱము చవలం, జీను ముచ్చవలం.

గుఱ్ఱముపరుగు, ఏనుగునడక ఒకటే.

గుఱ్ఱముపేరు గోడా అయితే జీనుపేరు మదురు, ఇక నా కంటా తెలుసు అన్నాడట !

గుఱ్ఱము పోతూ గూటము పీకుకొని పోయినట్లు.

గుఱ్ఱమువలె పక్కను పెంచి రెడ్డి తానే మొఱిగినట్లు.

గుఱ్ఱానికి కొమ్ములిస్తే మలనాడులో ఒకరినీ ఉంచదు.
గుఱ్ఱానికి గుగ్గిళ్ళు తిన నేర్పవలెనా ?
గుఱ్ఱానికి తోక ఉంటే గుఱ్ఱమే విసరుకొంటుంది.
గుఱ్ఱానికి తోక ఉంటే తానే విసరుకొంటుంది గాని చావడిలో గుఱ్ఱాల కన్నిటికీ విసరుతుందా ?
గుఱ్ఱానికి ముడ్డి ఎండితే ఆరికకసవు తింటుంది.
గుఱ్ఱాన్ని గుగ్గిళ్ళకు అమ్మినట్లు.
గుఱ్ఱాన్ని చూచి కుంట నారంభించినట్లు.
గుఱ్ఱాన్ని చూస్తే కాళ్ళునొప్పి.
గుఱ్ఱాన్ని తిన్న కుక్క అదేమి బ్రతుకును ?
గులకరాళ్ళమీద బండి నడచినట్లు.
గుల్లెద్దురా గోరును, గుడ్డెద్దు పో గోరును.
గువ్వ గూ డెక్కెను, అవ్వ మంచ మెక్కెను.
గువ్వా గూ డెక్కె, రాజూ నే డెక్కె.
గుసగుసలు వచ్చి గుడిసెకు దాడి తెచ్చె.
గుసగుసయోచనలు గుడిసెలు పీకటానికి (తీయటానికి) కారణం.
గూటిలో (గూట్లో) గూటంతో గుండె గుద్దుకొన్నట్లు.
గూటిలో (గూట్లో) దీపం, కుక్షిలో అన్నం.
గూటిలో (గూట్లో) దీపం, నోటిలో (నోట్లో) కబళం (బువ్వ) (ముక్క) (మెతుకు).
గూనికితోడు గుఱ్ఱపువాయువు.
గూటిలో (గూట్లో) మిరపకాయ చూసి అన్నం తిన మన్నట్లు.
గూనిదున్నకంటె గుడ్డిదున్న మంచి (మేలు).
గూనివాడు ఎట్లా పడుకుంటా డంటే వాడిష్టైనంకొద్దీ.
గూనివాడు పడుకునే వల్ల గూనివాడికే తెలుసు.

గూని గుగ్గిరిచ్చె, దండు దగ్గ రొచ్చె.

గూనివానిఒడుపు పడుకొన్నప్పుడు చూడాలి.

గూనువీపు కుదురు కాదు.

గృహప్రవేశానికి వెడుతూ గుడ్లగూబ తోఁడు తీసుకొని పోయినట్లు.

గేదె ఉండగా, దూడ ఉండగా గుంజకు వచ్చెరా గుఱకవాయువు అన్నట్లు.

గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు ఏరినట్లు (లెక్కపెట్టినట్లు).

గొంగట్లో గుద్దులాట.

గొంగట్లో రాళ్ళు వేసి కొట్టినట్లు.

గొంతుకలో పచ్చివెలక్కాయ పడ్డట్లు.

గొంతు కోసేవాడు కత్తి ఏమనునా?

గొంతు చిన్నది, గోలెము పెద్దది.

గొంతులో పుస్తెబొట్టు, గుంటనక్కంతి మొగుడు.

గొడ్డలి ఎక్కడ పెట్టినావురా అంటే కొట్టేచెట్టుదగ్గఱ, కొట్టేచెట్టెక్కడుందిరా అంటే గొడ్డలిదగ్గఱ.

గొడ్డలిలో దూరినకట్టె కులాన్నంతా కొట్టివేస్తుంది.

గొడ్లు కాచేవాణ్ణి కొట్టనివాడు, గొఱ్ఱెలు కాచేవాణ్ణి తిట్టనివాడు లేడు.

గోడను బెట్టి తడక తన్నాలిగాని తడక గట్టి గోడను తన్నరాదు.

గొడారిబేరం గొడ్డుకు లాభమా?

గొడారివానివద్ద తోలు కొన్నట్లు.

గొడ్రాలి కేమి తెలుసు బిడ్డనొప్పులు (పురిటినొప్పులు) (బిడ్డకుట్టు)?

గొడ్రాలిముండకు గొంతు పెద్ద.

గొడుగుపై గొడుగు, పిడుగుపై పిడుగు.

గొడ్డుకు ఒకదెబ్బ, మనిషికి ఒకమాట.

గొడ్డుకు తిన్నది పుష్టి, మనిషికి ఉన్నది పుష్టి.

గొడ్డు కొరికిన కొయ్యకాలు గొఱ్ఱెకు చాలు.

గొడ్డు గోతిన పడితే నలుగురూ నాలుగు బెడ్డలు వేస్తారు.

గొడ్డుటావును ఎన్నాళ్ళు గోకినా ఒకటే.

గొడ్డుటావును పిదికినట్లు.

గొడ్డుది ఏ మెఱుగును బిడ్డకుట్టు?

గొడ్డుపో తేమి ఎఱుగురా బిడ్డచవి?

గొడ్డుపోతు బిడ్డను కనమంటే కంటుందా?

గొడ్డు బలిస్తే పాటుకి, మనిషి బలిస్తే కాటికి.

గొడ్డు రైతుబిడ్డ.

గొడ్డులేనివాడు, బిడ్డలేనివాడు ఒకటి.

గొడ్డు వచ్చిన వేళ, కోడలు వచ్చిన వేళ (బిడ్డ వచ్చిన వేళ).

గొడ్డువాడు గొడ్డు కేడిస్తే, గొడారివాడు తోలు కేడ్చెను.

గొడెము తెగిన గ్రాసం పెట్టదు.

గొడ్డికి పెత్తన మిస్తే నీలాటిరేవు కాపింపట!

గొప్పగా పెలిసినాకే గోతిలో దిగుతారు.

గొరగగా మిగిలింది జుట్టు.

గొరగినదానిమీద కత్తెరించినట్లు.

గొఱ్ఱు గుచ్చిన నేల కొటారి ఉండదు.

గొఱ్ఱె పడిస్తే తోడేలుకు విచారమా?

గొఱ్ఱె కటికవాణ్ణే నమ్మినట్లు గొల్లవాణ్ణి నమ్మదు.

గొఱ్ఱె కటికవాణ్ణే (కసాయివాణ్ణే) నమ్ముతుంది.

గొఱ్ఱెకు బెత్తెడే తోక.

గొఱ్ఱె కొవ్వితే గొల్ల (వాని) కే లాభం.

గొఱ్ఱె కోసేవాణ్ణిగాని నమ్మదు.

**గొఱ్ఱె తొక్కినా చాలును.**

గొఱ్ఱెతోక ఎంత ఎదిగినా లాడితెడే.

గొఱ్ఱెను అడిగా గొంతు కోయడం?

గొఱ్ఱెను తినేవాడు పోతే బఱ్ఱెను తినేవాడు వచ్చినట్లు.

గొఱ్ఱె పడుకున్నచోట బొచ్చెంత రాలింది?

గొఱ్ఱె బలిసి చింత కొఱికినట్లు.

గొఱ్ఱె బలిస్తే గొల్లకు లాభం.

గొఱ్ఱెముడ్డిలో చోళ్ళు, నొల్లముడ్డిలో ధాన్యం.

గొఱ్ఱెలపెంట ఏడాది, ఆవులపెంట ఆరేండ్లు.

గొఱ్ఱెలపెంట మొక్కలకీ, నీలిఎరువు వరికి.

గొఱ్ఱెలమందకంటే లోతుదుక్కి మేలు.

గొఱ్ఱెలలో తోడేలు చొరబడ్డట్లు.

గొఱ్ఱె లాగినచోట చోళ్ళు, నొల్ల తిరిగినచోట ధాన్యం.

గొఱ్ఱెలు కాచినందుకు, లొడుగు తాగినందుకు సరి.

గొఱ్ఱెలు గుంపుకూడితే గొప్పవర్షం.

గొల్లకంపు గాలి కొట్టింది అత్తగారూ! అంటే అంటుకుండలో నీకు పారబోయి కోడలా! అన్నదట!

గొల్లమెండు ఇల్లు పట్టదు.

గొల్లలగోత్రాలు గొఱ్ఱెల కెఱుక, గొఱ్ఱెలగోత్రాలు గొల్లల కెఱుక.

గొల్లవాడా! గొల్లవాడా! ధాన్యం ఎక్కడుంది? అంటే నాగొఱ్ఱె ముడ్డిలో ఉంది అంటాడు.

గొల్లవాడిఇంటి పెండ్లి తెల్లవారింది.

గొల్లవాడికొమ్ము హెచ్చనూ హెచ్చదు, తగ్గనూ తగ్గదు.

గొల్లవాడుగొఱ్ఱెపిల్లను మెడను వేసుకొని అడవి అంతా వెతకినట్లు.

గొల్లవెఱ్ఱి మంచ మెక్కింది.

గొల్ల వేషమంత కథ.

గొల్లసుద్దులు, గోవిందరొట్టెలు.

గొల్లసుద్దులు, పిల్లముద్దులు.

గొళ్ళెంలేని తలుపు, కళ్ళెంలేని గుఱ్ఱము.

గోంగూరలో చింతకాయ వేసినట్లు.

గోకుడుకు గీకుడే మందు.

గోచికంటె గొప్ప దరిద్రం లేదు.

గోచికి పెద్ద, అంగవస్త్రానికి చిన్న.

గోచికి పెద్ద, గావంచాకు చిన్న.

గోచికి పెద్ద, గోణానికి చిన్న.

గోచిపాతలరాయడు, దొంగల మిండడు.

గోచిలో గొంగడి చించుతాడు.

గోచి విప్పేసి పాగా చుట్టినట్లు.

గోటితో పోయేదాన్ని గొడ్డలితో చీల్చినట్లు.

గోటితో పోయేపనికి గొడ్డలి ఎందుకు ?

గోడఅవతల గోల ఏమిటి అంటే కోమట్ల రహస్యాలు.

గోడ ఉంటే చిత్రం వ్రాయవచ్చును.

గోడకు పెట్టిన సున్నము, లంజకు పెట్టిన సొమ్ము.

గోడదెబ్బ, చెంపదెబ్బ.

గోడ పట్టుకో, కూలి అడిగి వస్తాను.

గోడపెట్టు, చెంపపెట్టు.

గోడమీది పిల్లి (వలె) (వాటము).

గోడమీది సున్నము విడెములోనికి వచ్చునా ?

గోడలకు చెవు లుంటాయి, నీడలకు నోళ్ళుంటాయి.

గోతికాడ నక్కవలె.

గోదావరిఈత, లంకమేత.

గోధుమలు వేస్తే బాదములు పండునా?

గోనెలకంటె గోతులు మెండు.

గోరంత ఉంటే కొండంత చేయడం.

గోరంత ఉదకమే గోతులు చేయును.

గోరుచుట్టుపై రోకలిపోటు.

గోరుతో తుంచేదానికి గొడ్డలి ఎందుకు?

గోరు వాచిన వేలంత, వేలు వాచిన కాలంత, కాలు వాచిన రోలంత, రోలు వాచిన ఎంత?

గోలీలాడిన ఇల్లు గోళ్ళూడిపోతుంది.

గోలుకొండ ఉద్యోగం గొఱ్ఱెతోక.

గోవింద అనుకుంటు కొబ్బెర తినుకుంటు, నారాయణ అనుకుంటు, సములుకుంటూ.

గోవును గోలెందగ్గఱికి తీసుకెళ్ళగలంగాని కుడితి తాగించగలమా?

గోవును చంపి గోరోజనం రోగుల కిచ్చినట్లు.

గోవులను కోసి చెప్పులను దానం చేసినట్లు.

గోవు లేని ఊళ్ళో గొడ్డుగేదే శ్రీమహాలక్ష్మి.

గోవే తల్లి, ఎద్దే తండ్రి.

— : : —

# ఘ

ఘంటాకర్ణునికి అష్టాక్షరి ఉపదేశం చేయబోయినట్లు.

ఘడియ పురుసత్తు లేదు, దమ్మిడీ సంపాదన లేదు.

ఘడియకు హాజీ, ఘడియకు ఫాజీ.

— : : —

చంకకు ఎక్కిన పిల్ల చచ్చినా దిగదు.

చంకజోలె చిల్లిపోలేదు, చందలూరు కాలిపోలేదు.

చంకజోలె చిల్లిపోలేదు, దన్నుందలూరు కాలిపోలేదు.

చంకదుడ్డుకు దండము అన్నట్లు.

చంకదుడ్డును, శరణార్థి.

చంకలోతు దిగినవాడికి చలేమిటి?

చంకలో పిల్ల నుంచుకొని సంతలో వెదకినట్లు.

చంకను పిల్ల నుంచుకొని సంతను వెదకినట్లు.

చంకలో పిల్లను పెట్టుకొని లంకలన్నీ వెదకినట్లు.

చంకలో మేకపిల్ల నుంచుకొని ఊరంతా వెతికినాడట!

చంటిపాప, కంటిపాప.

చంటిలో (చంట్లో) ఎముకలు ఏరినట్లు.

చండామార్కవిద్య, చేతులు కావు కాళ్ళు.

చందమామకు తోక వచ్చి ఇ(ఈ) కు ఇఅకట మైనట్లు.

చంద్రపరివేషము వర్షయోగము.

చంద్రుడు క్రుంకిన వెన్నెల నిలుచునా?

చంద్రునికి ఒకనూలుపోగు.

చంద్రుని చూచి కుక్కలు మొఱిగినట్లు.

చక్కగా కూకోరా చాకలినాయుడా! అంటే విన్నావటోయి! ఉడిగ నాయుడా! మంగలినాయుడి సరసం అన్నాడట!

చక్కదనానికి నేను, సంగీతానికి మా అప్ప.

చక్కదనానికి లొటిపిట, సంగీతానికి గాడిద.

చక్కనివాళ్ళు చిక్కినా బాగుంటారు, సన్నచీర మాసినా బాగుంటుంది.

చక్రవర్తి చేస్తే శృంగారం, చాకలి వెంకడు చేస్తే వ్యభిచారం.

చక్కిలాన్ని చూచి జంతిక నవ్విందట!

చక్కిలాలు తింటావా? చల్ది తింటావా? అంటే చక్కిలాలు తింటాను, చలిది తింటాను, అయ్యతోటి (డి) అవతల అన్నమూ తింటాను.

చక్కెర తిని చేదు అన్నట్లు.

చక్కెరపందిట్లో తేనెవాన కురిసినట్లు.

చక్కెరపూత (పూసిన) విషమువలె.

చక్కెర బొక్కిన నోటితో తవుడు బొక్కినట్లు.

చచ్చినఆవుమీద చెప్పులుంచినట్లు.

చచ్చినగేదెకు కడుపు వచ్చినట్లు.

చచ్చిన చారమేకపాలు, పోయిన బోసిముంతెడు.

చచ్చిన తరువాత తెలుస్తుంది సెట్టిగారి భండారం.

చచ్చిన దానిపిల్లలు వచ్చినదాని కాళ్ళకింద.

చచ్చిననాటి దుఃఖం మరునాడు ఉండదు.

చచ్చినపామును కొట్టడానికి (చంపుటకు) అంతా (అందఱు) బంట్లే.

చచ్చినపామును చావగొట్టినట్లు.

చచ్చినమొగుడు చనుబాలమీద, బతికినమొగుడు మంచంమీద.

చచ్చినవాని కండ్లు చా (చే) రెడేసి.

చచ్చినవాని తల తూర్పున నుంటే నేమి? పడమట నుంటే నేమి?

చచ్చినవాని పెండ్లికి వచ్చినంతే కట్నం.

చచ్చినా పైకం తప్పదు అచ్చమ్మా! ఇక తిట్టకు.

చచ్చిపోయిన బఱ్ఱె పగిలిపోయిన ముంతెడుపా లిచ్చేది.

చచ్చేకాలానికి సత్యభామవేషం వేసినట్లు.

చచ్చేటప్పుడు శంకరా! శంకరా! అన్నట్లు.

చచ్చేటప్పుడు సంధ్యామంత్రమా?

చచ్చేటప్పుడు సందిమంత్రమా ?

చచ్చేటప్పుడు సారెకావళ్ళు !

చచ్చేదాకా బతికితే (బతికిఉంటే) పెళ్ళి చేస్తా నన్నట్లు.

చచ్చేదాకా వైద్యుడు వదలడు, చచ్చినా పంచాంగబ్రాహ్మడు వదలడు.

చచ్చేపెళ్ళాన్ని అమ్మా ? అంటే బతుకుతుందా ?

చచ్చేరోగికి మందు వద్దు (పెట్టను).

చచ్చేవా(డి)ని చదువ వేసినట్లు.

చచ్చేవానికి సముద్రము మోకాలిబంటి.

చచ్చేవానికి సాగరం మొలబంటి.

చటాకితకి నార తీసినట్లు.

చట్రాతిలో నీరు, చండాలవాటికలో బ్రాహ్మణగృహం ఉంటుందా ?

చట్టుబొమ్మకు గిలిగింత పెట్టినట్లు.

చదివినకూత లుంటే ఉణ్ణీగాని సంచులుమాత్రం ముట్టనద్దు.

చదివినవాడికన్న చాకలివాడు నయం.

చదివేది రామాయణం, పడగొట్టేది దేవాలయం (దేవస్థలాలు).

చద్దిఅంత ఊరగాయ అవుతుంది.

చద్దికంటె ఊరగాయ ఘనము.

చద్దికూడు (అన్నము) తిన్నమ్మ మగని ఆకలి ఎఱుగదు.

చద్ది తెచ్చుకొన్న బ్రాహ్మణుడా ? భోజనం చెయ్యి.

చద్దిమూటలో సారం చాకలి ఎఱుగును.

చదువకముందు కాకరకాయ, చదివిన వెనుక కీకరకాయ.

చదువకముందు వరవర అంటే చదివిన వెనుక వడవడ అన్నాడట !

చదవకుండానే సత్పండితుడు కావాలి అన్నట్లు !

చదువనేర్చిన ఆడువారితోను, వండనేర్చిన మగవారితోను నోపలేము.

చదువనేర్తువా ? వ్రాయనేర్తువా ? అంటే చదువనేరను వ్రాయనేరను చించనేర్తును అన్నాడట !

చదువరి మతికన్న చాకలిమతి మేలు.

చదువవేస్తే ఉన్నమతి పోయినట్లు.

చదువా లేదు, మసువా లేదు.

చదువుకున్నవాడికి సేద్యగాడే అన్నం పెట్టవలె.

చదువుకు ముసుసు, నాసుకు లేదు.

చదువుకోనన్నాళ్ళు పసులు పసులు అని చదువుకున్నాక పచులు పచులు అన్నాడట !

చదువు చేరెడు, బలపాలు దోసెడు.

చదువు మాఇంట లేదు, సంధ్య మావంశాన లేదు.

చదువురాని మొద్దు, కదలలేని ఎద్దు.

చదువు సన్న మయ్యె, అయ్య లావయ్యె.

చదువూ లేదు, సంధ్యా లేదు, సంతానం మెండు.

చనవు చేసిన ఆలు చంక కెక్కు.

చన్నీళ్ళకు వేన్నీళ్ళు తోడు.

చన్నీళ్ళుఅయినా చల్లార్చుకొని తాగవలె.

చన్ను కుడిచి రొమ్ము గుద్దినట్లు.

చప్పగా తడిసినవాడికి చలేమిటి ?

చప్పుడు చేసే గుఱ్ఱపునాళానికి మరొక మేకు మందు.

చమురున్న పెంకు ఎప్పుడూ పేలదు.

చమురునష్టియేగాని పిల్ల బ్రతుకదు.

చమురు లేని దీపంవలె.

చలమున ముక్కు పొలియించుకొన్నట్లు.

చల్లముంతకు, చంటిబిడ్డకు చాటుండాలి.

చలాకి లేకపోయినా సలాకిలా ఉండాలి.

చల్లకు వచ్చి ముంత దాచ నేల ?

చల్లని మాటలు గట్లు తెగ కోస్తాయి.

చల్లా చెయ్యి గొల్లాభామ ! ముడ్డి తిప్పు ముసలిభామ !

చలికి జడిసి కుంప ట్లెత్తుకొన్నట్లు.

చలిజ్వరము ! అన్నములో చెయ్యి తీయ బుద్ధి కాదు.

చలిపందిరికుండలకు తూట్లు పొడిచినట్లు.

చలిపందిరికుండలలో రాళ్ళు వేసినట్లు.

చవి ఎఱిగిన కుక్క చావగొట్టినా పోదు.

చవితి చంక నాకినట్టే ఉంది, ఏకాదశి అన్నాడట !

చవి సారం లేని కూర చట్టెనిండా, ఆగంపాగం లేని మొగుడు మంచం నిండా.

చవీ సారం లేని కూర చట్టెడు.

చవుటభూమిలో విత్తు, సమరభూమిలో సిపాయి (ఒకటే).

చస్తానని చద్దన్నం తింటే చల్లగా నిద్ర వచ్చిందట !

చస్తూఉంటే సంధ్యమంత్రం చెప్పమన్నట్లు.

చస్తే చచ్చాడుగాని చలిజ్వరం చప్పగా వదిలింది.

చాకలి అత్త, మంగలి మామ.

చాకలి కట్టనిగుడ్డ, సైసు ఎక్కని గుఱ్ఱము ( లేదు).

చాకలి కొత్త మంగలిపాత.

చాకలిదానిచక్కదనానికి (కొఱకు) సన్యాసులు గుద్దుకొని చచ్చారట! (కొట్లాడినట్లు).

చాకలిదానితో సహవాసం చేస్తే గాడిద వచ్చి గర్వపడిందట !

చాకలిమంగలిపొత్తు, ఇంటికి రాదు విత్తు (ఇత్తు).

చాకలివాడిభార్యకు మంగలివాడు విడాకు లిచ్చినట్లు.

చాకలివాణ్ణి క్షవరం చేయమంటే చెక్క తీసి చేతిలో పెట్టినాడట !

చాకలిది సం దెఱుగదు, మాలది మంచ మెఱుగదు.

చాకి రేవు ఒకచోట, ఏలపాట ఒకచోట.

చాటెడు తిని చెడితి, వాకిలి దాటి పడితి.

చాదస్తం అంటే చెరసగం అన్నట్లు.

చాదస్తంమొగుడా ! నీ చా (చే) రెడు వేరే వండుకో (కాచుకతాగు) అన్నట్లు.

చాదస్తపు మొగుడు (అల్లుడు) చెప్పితే వినడు, కొడితే (గిచ్చితే) ఏడుస్తాడు.

చాదస్తపు మొగుడు (అల్లుడు) చెప్పితే వినడు, చెప్పకుంటే కరుస్తాడు.

చాపంత ఆకు, గుట్టంత చెట్టు, బుట్టంత పేడు, గంపంత పూత.

చాప(ఎంత చిరిగినా) (చెడి) చదరంత కాదా ?

చామచేలకు పరిగకు పోయినట్లు.

చామ పండినప్పుడు చక్కిలి (మాల) పడుచు సమర్తాడినపుడు గణ్యాతి.

చామలు చల్లిన చేలు విడిచిపెట్టు.

చాలమ్మా ! నీ ఇరుస రాగులగద్దె !

చాలని బట్ట కొంటే చినిగేవరకు దుఃఖము, చాలనిమగని చేసుకుంటే చచ్చేవరకు దుఃఖము.

చాలలేక బలాదూరు అన్నట్లు.

చాలీచాలనందుకు చాకింట గుడ్డలు చాలా ఉన్నవి.

చాలీచాలనిదానికి చాకలిసంతు అన్నట్లు.

చాలు పైచాలు దున్నితే చచ్చుచేనైనా పండును.

చాలులో చాలు దున్నితే చేను చేనికే అగును.

చాలు లోతైతే చాలా లాభము.

చావటి (డి) ముందటి కొంప కడసాపుల్లలకు సరి,

చావను (చానా) చావడు మంచము (చాపా)ఇవ్వడు (వదలడు).

చావుకబురు చల్లగా చెప్ప మన్నారు.

చావుకాలానికి సమర్తకట్నాలు.

చావుకు చావు కలదా ?

చావుకు పెడితేగాని లంఖణాలకు తేలదు (తెగదు) (దిగదు).

చావుకు పోయి చాలా దినా లుండరాదు.

చావుకు మళ్ళీ చావు వస్తుందా ?

చావుకు ముసుగు, తేత ఉందా ? (లేదు).

చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు.

చావుదలకు లావుదుఃఖం !

చింతకాయల కాష్టగాని, గుక్కిళ్ళ కాష్టా ? (లొట్టల కాష్టా ?)

చింతకాయలు అమ్మేదానికి సిరిమాసం వస్తే వంకిరి బింకిరి (వంకర టింకర) కాయలు ఏమి (ఏతర) కాయలు అన్నదట !

చింతకాయలు ఎరుగని రాణి (దొరసాని) చింతకాయలను చూచి కొడవళ్ళా అన్నదట !

చింతకాయలు బేరం చేస్తూ వంకరటింకర కాయ లేమి అన్నట్లు.

చింత చచ్చినా పులుపు (సు) చావదు.

చింత చస్తే చేవ చస్తుందా ?

చింతపండితే జీడి పండదు.

చింతపండు అంటే పొంతకుండ తెస్తాడు.

చింత లేదు, చింత లేకపోతే పులుసు లేదు.

చింత లేనమ్మ సంతలో నిద్రపోయిందట !

చింతాకంత బంగారం, మెడచుట్టూ తీగ.

చింతా, చిగిరింత ఏపు.

చింతపులుసుకన్న చిక్కగ, సచ్చిపులుసుకన్న పలుచగ.

చిక్కుముచేరులు తీసినట్లు.
చిక్క చికిలించేకన్న, పళ్ళి వెక్కిరించేది మేలు.
చిక్కితే దొంగ, చిక్కకుంటే దొర.
చిక్కిన తగువా? చిక్కని తగువా?
చిక్కినవాడు సిగ్గెఱుగడు, బలసినవాడు వాలి ఎఱుగడు.
చిక్కిన సింహాన్ని బక్కకుక్క కఱచును.
చిక్కుడుగింజకు తనపాదే తెలియదు.
చిక్కుడుపాదుకు (తీగకు) బీరకాయ కాచునా?
చిక్కుల గుత్తానికి కక్కుల కళ్ళెము.
చిగిలింత మొక్క చింతచెట్టుతో డీకొన్నదట!
చిచ్చాయ చిచ్చాయ అంటే సందాయ సందాయ అన్నట్లు.
చిచ్చు అంటుకొంటే చేటలతో ఆర్పగలమా?
చిచ్చు ఉఱుకంగ పోతూ, చీరకొంగు సవరించుకొన్న దానివలె(ట్లు).
చిచ్చుకుతోడు కురువలి (కరువలి).
చిచ్చును ఒడి గట్టి తెచ్చినట్లు.
చిటికినవేలు (శ్రీ)పతి.
చిటికెలపందిరి వేసినట్లు.
చిట్టెడు నూనె తెచ్చి చిన్నింటిలో దీపం! పెద్దింటిలో దీపం! వత్తికి వదిన నెత్తికి, మంగలివాడికత్తికి, మాబావజుత్తుకు.
చిత్తం చెప్పులమీద, దృష్టి దేవునిమీద.
చిత్తం (ము) మంచిదయితే చేదూ మంచి దవుతుంది.
చిత్తం (ము) శివునిమీద, భక్తి చెప్పులమీద.
చిత్తం (ము) శివునిమీద, భక్తి అంకుముండలమీద.
చిత్తమెంతకు పిట్టతల పగులును.
చిత్త కార్తెకు ఉల్లవచేను చిత్తు చిత్తుగా పండును.

చిత్తకు చిఱుపొట్ట.
చిత్త కురిస్తే చింతలు పండును.
చిత్త చిత్తగించి, స్వాతి చల్లచేసి, విశాఖ విసరకుంటే అనూరాధలో
అడిగినంత పండుతాను అన్నదట (వరి)!
చిత్త చిత్తగించి, స్వాతి చల్లగ చూచి, విశాఖ విసరకుంటే ఏసానికి
పుట్టెడు పండుతాను అన్నదట ! (జొన్న).
చిత్త చిత్తమువచ్చినచోట పడును.
చిత్తజల్లు, స్వాతివాన.
చిత్తలో చల్లితే చిట్టెడు కావు.
చిత్తలో చల్లితే చిత్తుగా పండును (ఉలవ).
చిత్తలో జొన్నకు కాటుక తెగులు.
చిత్త, స్వాతి వర్షించకపోతే చిగురుటాకులు మాడిపోతాయి.
చిత్త, స్వాతి సందు చినుకులు చాలినంత వర్షమిచ్చును.
చిత్తస్వాతులు కురవకపోతే చీమకుకూడా నాంబ్రం.
చిత్తస్వాతులు చిత్తగించి, విశాఖ ఒక్కవిసురు విసిరితే మొదలు తంతే
ఏడుగింజలు రాలుతాయి.
చిత్తరమయిన మొగుడు ఉత్తరం వేస్తే చింతలతోపులోకి వెళ్ళి చది
వించుకుంటే ఇంకా చిత్తరముగ ఉందట !
చిత్తరువునకు జీవం పుట్టినట్లు.
చితి చచ్చినవానిని, చింత బ్రతికినవానిని కాలుస్తుంది.
చింత బ్రతికినవానిని, చచ్చినవానిని కాలుస్తుంది.
చిత్రం చూడండి, చీమ గుడ్డు పెట్టింది, బూటకం చూడండి, బురక
(గుడ్లు) పెట్టింది.
చిత్తి నెలలో దుక్కి పుటముపెట్టిన పుత్తడి.
చిదికి చిదికి చిన్నవానిపెండ్లి చేసేవఱకు పెద్దవాని పెండ్లాము పెద్దల
లోకి పోయిందట !

చినపేరితాడు తెగితే, పెదపేరితాడు అప్పుడే తెగుతుంది.

చిన్న అక్కను పెద్దక్కను, పెద్దక్కను చిన్నక్కను చేసినట్లు.

చిన్నన్నగుజ్జం చిట్లికి పోయె, పెద్దన్నగుజ్జం పెండ్లికి పోయె.

చిన్నప్పుడు కాకరకాయ, పెద్దయ్యాక కీకరకాయ.

చిన్న (ఇంట్లో) ఇల్లు కట్టుకొని పెద్దకాపురం చేయవలెను.

చిన్నచేపను పెద్దచేప మింగితే, పెద్దచేపను బెస్తవాడు మింగుతాడు.

చిన్ననాడూ లేవు, పెద్దనాడూ లేవు, చంద్రశేఖరుడినాడు చెవుల పోగులా ?

చిన్న నోటికి పెద్దమాట (కూత).

చిన్నపామైనా పెద్ద కఱ్ఱతో (కట్టెతో) కొట్టవలెను.

చిన్నపునర్వసుకార్తెలో చిట్టిడు విత్తితే గరిసె డగును.

చిన్నపుల్లయినా పల్లు గుచ్చ పనికివస్తుంది.

చిన్నమంట, పెద్దసెప్పు.

చిన్నమ్మ సింహద్వారాన వస్తే, పెద్దమ్మ పెరటి ద్వారాన పోతుంది.

చిన్నమూ కావలె, చిదరా కావలె, మేలిమీ కావలె, మెడా తిరగవలె.

చిన్నవాడితండ్రి విద్వాంసుడు, చిన్నవాడు చదువుకుంటే అక్కరలోకి వస్తాడు.

చిన్నవాళ్ళు తింటే చిఱుతిండి, పెద్దవాళ్ళు తింటే ఫలహారం.

చినికి చినికి గాలివాన.

చినిగినవానిదే చిరుగుతుందిగాని చాకలివానికొడుకు చంపమాను (చక్కని చుక్క).

చిన్నినాపొట్టకు శ్రీరామరక్ష.

చినుకులకు చెఱువు (లు) నిండునా ?

చిప్ప తెచ్చుకోరా తిమ్మా అంటే అట్లు చెప్పు మాయమ్మా అన్నాడట !

చిమ్మటకు చీ రేమి చేసింది ? చీడపురుగుకు చే నేమి చేసింది ?
చిమ్మట సింగమా ? గాజు రత్నమా ?
చియ్యబువ్వ చీకులాట, గొల్లాడు వస్తే గోగులాట.
చిరుదిండి లేక చిన్న బోయినను, మాఅమ్మ నన్న చింతగుగ్గిళ్ళు పంపించమను అంటే ఏమారక నాబిడ్డ నిన్న ఎసట్లో బియ్యం తినమను అన్నదట !
చిల్లర శ్రీమహాలక్ష్మి !
చిల్లిపేరే తూటు.
చిల్లి బాగా లేదని బెజ్జం వేశాడట !
చిలుకకు చక్కెర, చీమకు పంచదార.
చిలుక తినముద్దేకాని ఎదుటి ముద్దు కోరదు.
చిలుకను పెంచి బావురుగానికి అప్పచెప్పినట్లు.
చిలుక పోతే పంజరా మెందుకు ?
చిలుకముక్కున దొండపండు ఉన్నట్లు.
చిలుము (౦) వదిలితే గాని ఫలం దక్కదు.
చిలుము (౧) వదిలితే ఛిద్రం (చిద్రం) ఎదురుతుంది.
చివురు పోవ చేవ దొరికినట్లు.
చీకటింటికి పోతే సిగ్గయితది, అట్లయితే సంసారమెట్లైతది ?
చీకటిఇంట్లో (సింగి) సివా లాడినట్లు.
చీకటి కొన్నాళ్ళు, వెన్నెల కొన్నాళ్ళు.
చీకటిచేత జ్యోతి మెరుస్తుంది.
చీకటిలో జీవరత్నంవలె.
చీకటిలేని దీప మేమిటికి ?
చీకితే లేనిది, నాకితే వస్తుందా ?
చీకు లావుకం త్రొక్కినట్లు.

చీటికి ప్రాణంబు వ్రాలు.

చీడ అంటుతుందేగాని సిరి అంటదు.

చీడ సిగ్గెఱుగదు.

చీద్రానికి చీరపేలు, దరిద్రానికి తలపేలు.

చీదితే ఊడే ముక్కు ఎన్నాళ్ళు నిలుస్తుంది? (తుమ్మితే నిలుస్తుందా) ?

చీపిరి కళ్ళు, వాపిరికళ్ళు.

చీపురుకట్టకు పట్టుకుచ్చు కట్టినట్లు.

చీపురుకట్టకు సిరి వస్తే కోడిఈక గొడుగు పట్టినట !

చీమబళ్ళు చీమకు బరువు, ఏనుగుబళ్ళు ఏనుగుకు బరువు.

చీమగంగాయాత్రవలె.

చీమలు చెట్టెక్కితే భూములు పండును.

చీమలు పాకిన రాళ్ళరుగునా ?

చీమలు పెట్టిన పుట్టలు పాములకే.

చీరకట్టినమ్మ శృంగారం చూడు, గుడ్డకట్టినమ్మ కులుకు చూడు.

చీరకు కండె మొదలు, చిన్నవాడికి ఉపనయనం మొదలు.

చీర చిత్తారు, రవిక జల్తారు.

చీర చిరుగును, పెయ్యి పెరుగును.

చీరపిట్టకు దొమ్మతెగులు.

చీరపేల బొంత ఎప్పుడైనా కాలవేసేదే.

చీర పోగా నా కో మొగుడు !

చీరపోతు లేరివేయటంకన్నా బొంత కాలవేయటం నిమ్మళం !

చీర సింగారించేసరికి ఊరు మాఱుమణిగింది.

చీర సింగారించేటప్పటికి పట్నమంతా చూర (కొల్ల) పోయిందట !

చీర సింగారించే టప్పటికి పట్నము పాడైపోయిందట !

చుక్కలూళ్ళో చక్కిలాలు తేబోయినట్లు.

చుట్టం (ము) ఆకలి మంచాని కెఱుక.

చుట్టం (ము) మీాద ప్రీతి, బియ్యంమీాద ప్రీతి.

చుట్టం (ము) వచ్చాడంటే చెప్పులు ఎక్కడ వదిలాడో చూచిరా అన్నట్లు.

చుట్ట తాగి చూరులో పెడితే ఇల్లు కాలి వెళ్ళవలసివచ్చిందట !

చుట్టమై (మని) చూడ వస్తే దయ్యమై (దొబ్బ) పట్టుకున్నాడట !

చుట్టఱికం, పేరంటం కలిసివచ్చినట్లు.

చుట్టాలకు పెట్టినిల్లు చూఱపోయింది వేల్పులకు పెట్టినిల్లు హెచ్చిపోయింది.

చుట్టుఅయినా మెట్టదారి మేలు.

చుట్టుఅయినా సుఖంగా పోయేది మేలు.

చుట్టుకుపోయే చాప, మూసుకుపోయే తలుపు, అలిగిపోయే పెండ్లాము.

చుట్టుడుచాప, విసుకుడుతలుపు, పెడసరపు పెండ్లాము.

చుట్టూ చూరు (సుడి) (సురీ) మంగళం, నడు (డ) మ జయమంగళం.

చుట్టూరా శ్రీవైష్ణవులే, చూస్తే కల్లుకుండ లేదు.

చూచింది పాము, కఱచింది మామిడిటెంక (దోమ).

చూచిందెల్లా సుంకము, పాసిందెల్లా పంకము.

చూచినమ్మకళ్ళు శూలాలు, మాఅమ్మకళ్ళు పేలాలు.

చూచి ముసుసుకొని, చెప్పి ఏడ్చుకొని.

చూచి రమ్మంటే కాల్చి వచ్చినట్లు.

చూచి రమ్మంటే పెండ్లాడి వచ్చినట్లు.

చూసేవాడుంటే సొమ్ము పెట్టాలి, చేసేవాడుంటే పిల్లలు గనాలి.

చూచేవారుంటే సొమ్ములు పెట్టాలి, చేసేవారుంటే పిల్లలు కనాలి.

చూడగాచూడగా గుఱ్ఱం గాడి దయిందట !

చూడగా చుంచెలుక, గోడలు త్రవ్వ పందికొక్కు.

చూడగా చుట్టము లేదు, మ్రొక్క దైవము లేదు.

చూడబోతే చుట్టాలు, రమ్మంటే కోపాలు.

చూడబోతే వెండిగిన్నె, తాగబోతే నలితిగిన్నె.

చూడవచ్చినవారికి శుక్రవారమేమి ?

చూడవమ్మా సుతారం ! ఇంటిఆవిడ అవతారం !

చూపితే మానం పోయె, చూపకపోతే ప్రాణం పోయె.

చూపులకు చుంచు, పనికి పర్వతం.

చూపులకు బడుగు, పనికి పిడుగు.

చూపులకు మగడే కాని సుఖానికి మగడా ?

చూపులగుఱ్ఱమే కాని చుఱుకుతనం లేదు.

చూపులపసేగాని మేపులపసే లేదు.

చూరులో నిప్పు పెట్టి, కొప్పులో పెట్టినా అన్నట్లు.

చూస్తూ ఊరకుంటే మేస్తూ పోయిందట !

చూస్తే చుక్క, లేస్తే కుక్క.

చూస్తే నీది, చూడకుంటే నాది.

చూస్తే సుంకం, చూడకుంటే (చూడకపోతే) బింకం.

చూస్తే సూదిమాదిరి ఉంది, లే (వే) స్తే గాలిమాదిరి ఉంది.

చెంపదెబ్బ, పక్కదెబ్బ.

చెంపపెట్టు, గోడపెట్టు.

చెంపలు నెరసినవెనుక చామ పతివ్రత.

చెంబు అమ్మి తప్పేలా. తప్పేలా అమ్మి చెంబు.

చెంబు కంచం పోతే ముఖంమీద కొట్టినట్లు, ముంతా మూకుడూ [illegible] తెచ్చుకోలేనా ?

చెట్లకు చావ నలుపు, మనిషికి చావ తెలుపు.

చెట్లకు విస్తళ్ళు కుట్టినట్లు.

చెట్టుఅయి వంగనిది ద్రమ్మానై వంగునా?
చెట్టు ఊగుతుందా అంటే ఊగుతుంది అన్నట్లు.
చెట్టు ఎక్కించి నిచ్చెన తీసినట్లు.
చెట్టెక్కి చేతులు విడచినట్లు.
చెట్టు ఎక్కేవాణ్ణి ఎందాకా తొయ్య (వచ్చు) గలం?
చెట్టు కొట్టి పైకి తెచ్చుకొన్నట్లు.
చెట్టు చెడేకాలానికి కుక్కమూతిపిందెలు పుట్టును.
చెట్టు నాటిన (పెట్టిన) వాడు నీళ్ళు పోయడా?
చెట్టు నాటే దొకడు, ఫల మనుభవించే దొకడు.
చెట్టునీడకు పోతే కొమ్మ విఱిగి పడ్డట్లు.
చెట్టును తేరా అంటే గుట్టను తెచ్చినట్లు.
చెట్టునుబట్టి (బట్టే) కాయ.
చెట్టు పెరగడం మొదలు నరుకుడికే.
చెట్టుపేరు చెప్పుకొని కాయ లమ్ముకొన్నట్లు (పండ్లమ్ముకొన్నట్లు).
చెట్టుమీదనుండి పడ్డవానికి గాయాలెన్నమిటి?
చెట్టుమీదివాడు జుట్టుమీద కెక్కె.
చెట్టుమీదని చేతికి వచ్చినట్లేగాని ఇక తొమ్మిదయితే పదవుతాయి.
చెట్టు ముందా? విత్తు ముందా?
చెట్టులేని చేను, చుట్టములేని ఊరు.
చెట్టు లేనిచోట ఆముదపు చెట్టే కల్పవృక్షము (మహావృక్షము).
చెట్టు వేసే దొకడు, ఫలము కోసే దొకడు.
చెట్టు మొండి అయితే చేరికలో వాన.
చెడగొట్టి సెనగ, ఆముదాలు.
చెడ దున్ని సెనగలు చల్ల మన్నారు.
చెడ్డా పడ్డా చేర్బోలే గతి.

చెడ్డాపడ్డా శ్రీకాకుళమే గతి.

చెడిందిరా పిల్ల అంటే, చేరిందిరా తెనాలి అన్నట్లు.

చెడి చెన్నాపట్నం చేరు.

చెడిన (చెడ్డ) కాపురానికి ముప్పేమిటి? చంద్రకాంతలు వండే (వండవే) పెండ్లామా! అంటే అయిన అప్పుకి అంతేమిటి? అవే వండుతాను మగడా! అన్నదట!

చెడిన (చెడ్డ) కాపురానికి ముప్పేమిటి? మొండికాలికి చెప్పేమిటి?

చెడిన (చెడ్డ) చేనయినా చేరువగా ఉండాలి.

చెడిన (చెడ్డ) చేనుకు ఇంటివన్ను పొంగలా?

చెడిన (చెడ్డ) చేనుకు ముప్పేమిటి? మొండికాలికి చెప్పేమిటి?

చెడిన (చెడ్డ) చేనుకు మూడు (రెండు) మంచెలా?

చెడిన (చెడ్డ) చేనుకు చెఱకు (చెఱకులు) (రాజనాలు) పండునా?

చెడిన (చెడ్డ) మడికి చెన్నంగివడ్లు.

చెడిన (చెడ్డ) ముండకు చంద్రతారాబల మేమి?

చెడిన (చెడ్డ) వారిపిల్ల చెప్పుదెబ్బలు తినవచ్చునుకాని మంచివారి పిల్ల మాట కాయటం కష్టం.

చెడిన (చెడ్డ) శ్రాద్ధం చెడ్డ (చెడనే చెడ్డది) పిత్రా పీట పగలు.

చెడిన (చెడ్డ) సొమ్ము చెరిసగం.

చెడినా పడినా చేసుకున్న మొగుడు తప్పడు.

చెడినా సెట్టి సెట్టే, చిఱిగినా పట్టు పట్టే.

చెడిపో కాని చెడ్డపేరు మోయకు.

చెడిపోయిన బ్రాహ్మడికి చచ్చిపోయిన ఆవు దానం.

చెడి బ్రతికినవానికి శౌర్యమెక్కువ, బ్రతికి చెడినవాని బడవలు ఎక్కువ.

చెడి బ్రతికినవాని చెంపలు చూడు, బ్రతికి చెడినవాని బట్టలు చూడు.

చెడి (స్నేహితునింటికి పోవచ్చునుగాని) చెల్లెలింటికి పోరాదు.

చెడు కాలానికి చెడ్డబుద్ధులు.

చెడు చెడు అనేవారేగాని చెడేవారు లేరు.

చెడు చెడు మనేవారేగాని చేతిలో పెట్టేవారు లేరు.

చెడేవాడు చెన్నుగాడు చెడుతాడు ఇంకా చారెడు ఎగయ్యమ్మా!

చెడేరోజుకు చెడ్డబుద్ధులు.

చెడేవాడు అబ్బ దున్నాడు మరి పిడికెడు తేరా దానం చేస్తాం.

చెడేవాడు ఉన్నాడు వేయరా మరోరాయి అన్నట్లు.

చెత్తతిన్న పొలం చెప్పకుండా పండుతుంది (పండును).

చెప్పంతి పొలమున్న చెప్పినట్లు వినాలి.

చెప్పకపోయినా చప్పికొమ్ముల ఎద్దునే కొను.

చెప్పనేర్చినమాట సెబాసు మాట!

చెప్పవచ్చునుగాని చొప్పరాదు.

చెప్పింది చేయబోకురా నాసామిరంగా! చేసేది చెప్పబోకురా!

చెప్పి చెప్పి చెప్పుతో తన్నించుకో, మళ్ళి వచ్చి మాతో తన్నించుకో.

చెప్పితే పాపంగాని, తింగరేసి పొడిస్తే చస్తుంది.

చెప్పితే సిగ్గు, దాస్తే దుఃఖం.

చెప్పినంత చేసేవారు శివునికన్న వేరు లేరు.

చెప్పినకొద్దీ చెవుడు పడిపోతారు.

చెప్పినబుద్ధీ, కట్టినసద్దీ నిలువవు.

చెప్పు అంత వ్యవసాయం చేస్తే చెప్పినట్లు వినాలి.

చెప్పుకింద తేలువలె.

చెప్పుకుంటే (చెప్పితే) మానం పోతుంది, చెప్పకుంటే (చెప్పకపోతే)
ప్రాణం పోతుంది.

చెప్పుకొరికినామని సిద్ధి కొరుకుతామా ?

చెప్పుటకంటె చేయుట మేలు.

చెప్పుడుమాటలకన్నా, తప్పుడు మాటలు నయం.

చెప్పుడుమాటలు విన్న చెడిపోతారు.

చెప్పుడు మాటలు (చేటు) వింటే చెడిపోతారు.

చెప్పు తినే కుక్క చెఱకుతీపి ఎఱుగునా ?

చెప్పుతో కొట్టి, శఠగోపురం (శఠగోపం) పెట్టినట్లు.

చెప్పులవానికి చేనంతా తోలుతో కప్పబడ్డట్టుంటుంది.

చెప్పులున్నవాడితోను, అప్పులున్నవాడితోను పోరాదు.

చెప్పులున్న చిన్నవాడికాళ్ళు తెగకోసుకుంటామా ?

చెప్పులున్న చెప్పులు తెగినా చుట్టఱికం తప్పదు.

చెప్పులు తొడుగుకొన్నవానికి లోకమంతా తోలుతో కప్పబడ్డట్టు తోస్తుంది.

చెప్పులోని రాయివలె.

చెప్పేది చెవిదగ్గఱ, వినేది రోటిదగ్గఱ.

చెప్పేవానికి చేదస్తమయితే వినేవానికి వివేకం వద్దా ? (లేదా?)

చెప్పేవానికి సిగ్గు లేకపోతే వినేవానికి వివేకమైనా వద్దా ?

చెప్పేవి నీతులు, చేసేవి గోతులు.

చెప్పేవి (శ్రీ)రంగనీతులు, దూరేవి దొమ్మరిగుడిసెలు.

చెఱుకు కంచెకు, చేనికి రేవడి (రేగడి ?) మంచివి.

చెమ్మచెక్కాయలు, చేరెడేసి బుక్కాయలు.

చెయ్యగాననివారికి మాటలు లావు, చెల్లనిరూపాయకు గీతలు మెండు (లావు).

చెయ్యి (చేయి) కాలినప్పుడల్లా కుండ వదలిపెడతామా ?

చెయ్యి (చేయి) చూపి అవలక్షణ మనిపించుకొన్నట్లు.

చెయ్యి (చేయి) దాచుకుంటాముగాని కులం దాచుకుంటామా ?

చెయ్యి (చేయి) పుచ్చుకొని లాగితే రాలేనుగాని ఇంటికి చీటి వ్రాశాడట !

చెరం చేటెడు, చెప్పాలు మూటెడు.

చెఱ (ఱు) కా ! బెల్లం పెట్టు అంటే పెడుతుందా ?

చెఱ (ఱు) కు అని చెప్పి వేళ్ళతో పెరకకూడదు.

చెఱ (ఱు) కు ఉండేచోటికి చీమలు తామే వస్తవి.

చెఱ (ఱు) కుకు చెఱుపు సగాలంగి.

చెఱ (ఱు) కు చెఱకే, వంటచెఱకు చెఱకే.

చెఱ (ఱు) కు తినడానికి కూలి ఇవ్వావలెనా ?

చెఱ (ఱు) కు తియ్యనని వేళ్ళుకానా తిన్నట్లు.

చెఱ (ఱు) కు తీపని వేళ్ళతో కెరలింపదగునె (నమలవచ్చునా) ?

చెఱ (ఱు) కు తోటలో ఏనుగు దూరినట్లు.

చెఱ (ఱు) కున పండు పుట్టినట్లు.

చెఱ (ఱు) కు నమలడానికి కూలి అడిగినట్లు.

చెఱ (ఱు) కు పండితే కొఱత లేదు.

చెఱ (ఱు) కుపిప్పికి ఈగలు మూగినట్లు.

చెఱ (ఱు) కు వంకరబోతే తీపి చెడునా ?

చెఱపకురా చెడేవు, ఉరకకురా పడేవు.

చెఱపటానికి చేటపెయ్య చాలును (చెఱపను చేటపెయ్య చాలు).

చెఱపడానికి చేతులు వస్తాయిగాని, నిలపడానికి నీతులు రావు.

చెఱువు ఎండితే కప్పలు బయట పడతాయి.

చెఱువు ఎండితే చేపలు బయట పడతాయి.

చెఱువు ఎండిపోయి చేను బీడైతే, కరణంపెండ్లానికి కాసులదండ.

చెఱువు ఓడు, ఊరు పాడు.

చెఱువుకు చేరువగాను, చుట్టాలకు దూరముగాను ఉండవలెను.

చెఱువుకు నీటి ఆశ, నీటికి చెఱువు ఆశ.

చెఱువు నిండితే కప్పలకు కఱవా ?

చెఱువు నిండితే కప్పలు చేరవా?

చెఱువుమీద అలిగి (ముడ్డి) కాళ్ళు కడుక్కోకుండా పోయినట్లు.

చెఱువుమీద కొంగ అలిగినట్లు.

చెఱువులో గేదెను పెట్టి బేరా లాడినట్లు.

చెఱువులో బత్తె నుంచి కొమ్ములను బేరం చేస్తారా?

చెఱువుముందు చల్లసందిరా? (చలివేంద్రమా?)

చెఱువులు తెంచి, చేపలు పంచినట్లు (బందాణాములు కట్టినట్లు).

చెఱువు విడిచి కాలువను పొగిడినట్లు.

చెలమకు పిట్టలు చేరినట్లు.

చెల్లనికాసుకు గీతలు మెండు.

చెల్లనికాసు, వ (ఒ) ల్లని మొగుడు.

చెలిమాట చెఱకుతోట.

చెలిమిని వేప తినిపించవచ్చునుగాని, బలిమిని పాలు త్రాగించలేము.

చెల్లీ చెల్లడములకు సెట్టిగా నున్నాడు.

చెల్లెలిమగని చూచుకొని చేయి విఱుగబడ్డదట!

చెల్లెలివలన చెడి చేసుకోవాలి, తల్లివలన తప్పి చేసుకోవాలి.

చెవ్వాకుపోయినమ్మ కెంత వ్యసనమో దొరికినమ్మ కంత సంతోషం.

చెవిటి చెన్నారమా! అంటే చెనిగెలు పదకొండు అందిట!

చెవిటి చెన్నప్పా! అంటే సెనగల మల్లప్పా! అన్నాడట!

చెవిటిపెద్దమ్మా! చేంతాడు తేవే అంటే చెవులపోగులు నాజన్మలో ఎఱుగ నన్నదట!

చెవిటిపెద్దమ్మా! చేంతాడు తేవే అంటే మాఅమ్మపుట్టిల్లు బెజవాడ అన్నదట!

చెవిటివానిఎదుట శంఖ మూదితే అది కొఱకడానికి నీతండ్రితాతల తరము కా దన్నాడట!

చెవిటివానికి వినిపించాలంటే శంఖచక్రాలవాడు దిగి రావాలి.

చెవిటివానిముందు శంఖ మూదినట్లు (శంఖం ఊదినట్లు).

చెవిదగ్గర కందిరీగవలె (జోరీగవలె).

చెవుడు చెవుడూ అంటే తవుడు తవుడూ అన్నట్లు.

చెవులపిల్లి ఎదురైతే చేటు వస్తుంది.

చెవులు కోసుకపోతూంటే కుట్టుకాడలకు ఏడ్చినట్లు.

చెవులు పట్టి లాగినా రాకుంటే పైకి కొమ్ములు పట్టి లాగడమే.

చెవులోగుమిలికి ఏపుల్ల ఐతే నేమి కెలుక్కోను ?

చేటను కొట్టి పిల్లిని బెదిరించినట్లు.

చేటలో తవుడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టు.

చేటలో తుమ్మితే ఉండ్రాళ్ళు పోయ్యాని.

చేటలో నలగకాయలవలె.

చేటు ఎఱుగని చేడె మొగుడికి పెళ్ళి చేసిందట !

చేటుకాలానికి చెడుబుద్ధులు పుట్టును.

చేటూపాటూ ఎఱుగనమ్మ ఇల్లెక్కి పింఛి కొట్టిందట !

చేటూపాటూ ఎఱుగనమ్మ మగని పెళ్ళి కెళ్ళిందట !

చేటెడు తిని చెడితి, వాకిలి దాటి పడితి.

చేతకానమ్మకు చేష్టలు మెండు, చెల్లనిరూకకు గీతలు మెండు.

చేతకానమ్మకు శౌర్య మెక్కువ.

చేతకాని మొగుడు ఇంట్లో ఉన్నా ఒకటే, యీ (వీ) ధిలో ఉన్నా ఒకటే.

చేతనైన మగోడు (మగవాడు) చాలా పొద్దున లేచి ఊడ్చుకొని చల్లుకొని, ఇంకొకచోట పండుకొన్నాడట !

చేతబట్టినట్టి బిడ్డ లెక్కకు రాదు.

చేతికలుపు వైద్యునిచేత తళుకు.

చేతికి అందినది వాతి కందదు.

చేతికి దొరకిన రత్నం నాచుకపోయినట్లు.

చేతిచమురుభాగవతం చెప్పుకొన్నట్లు.

చేతిలో ఉంటే అర్థం, చేరువలో ఉంటే పెళ్ళాం.

చేతిలో కఱ్ఱకంటే చేలోకఱ్ఱ ముదురు.

చేతిలోకఱ్ఱ చేదోడు వాదోడు.

చేతిలోది లేత, చేలోది ముదురు.

చేతిలోలేనిది చేలోకి ఎలా వస్తుంది?

చేతిలో వెన్న పెట్టుకొని నేతికోసం ఊరంతా వెతకినట్లు.

చేతివేళ్ళు అయిదు ఒకరీతిగా ఉంటాయా?

చేతిసొమ్ము ఇచ్చి చెప్పుతో కొట్టించుకొన్నట్లు.

చేతులు కాలినతరువాత ఆకులు పట్టుకొన్నట్లు.

చేతులు చేయవు, నోరు తినదు.

చేతులు పొడుగని మాతులు పొడుస్తారా?

చేదతాడు లేకపోతే నుయ్యి పూడ్చమన్నట్లు.

చేదు తింటారా? చెట్టు కొడతారా?

చేనికి ఎరువు, మడికి మంచ.

చేనికుదురు, ఆలికుదురు ఉండవలెను.

చేనికి గట్టు, ఊరికి కట్టు ఉండాలి.

చేనిపంట కొయ్యగానే చెప్పుతుంది.

చేనిపంట చెయ్యగానే తెలుస్తుంది.

చేనిపంట చేరడైనా చాలు.

చేనిలో చేను కలిసినా, స్థలంలో స్థలం కలిసినా పోనియ్యరాదు.

చే (ని) లో పుట్టిన బీడు ఎక్కడికి పోను?

చే (ని) లో పుట్టిన మొక్క చే (ని) లో చచ్చినట్లు.

చే (ని) లో పొత్తు కళ్ళంతో సరి.
చేను ఇద్దుము, పిట్టలు నల్తుము.
చేను చేసిన చెడలేదు, చెడ్డ చేసి బ్రత (తు) కలేదు.
చేను (లు) పండాలి, ఇల్లు నిండాలి.
చేను పండినా చేట అప్పే, మొగు డుండినా మొండి మెడే.
చేను బొందు పోయినా కూలి బొందు పోదు.
చేనూ, కొడవలీ నీచేత ఇచ్చినాను.
చేపపిల్లకు ఈత నేర్పాలా?
చేయని రెక్కలు, కుడువని నోరు.
చేయని రెక్కలు చెదలు పడతాయి, చేసిన రెక్కలు సేగలు వాసుతాయి.
చేయని శృంగారం, మాయని మడత.
చేయమనేదానికి చేతులు రావుగాని, వద్దనేదాన్ని వదల మంటారు.
చేయలేనమ్మకు చేతినిండా పని.
చేయలేనమ్మకు చేష్టలు మెండు, వండలేనమ్మకు వగపులు మెండు.
చేయి చేసుకొనా, చేతులు దులుపుకొనా.
చేరువ పగ, దూరము మైత్రి.
చేరెడు విత్తులు గోనె డయినట్లు.
చేలపంట కొయ్యకాలె తెలుపు.
చేలు బొందైనా కూలి బొందు కాదు.
చేలో గుత్తాన్ని. ఇంట్లో పెళ్ళాన్ని నమ్మరాదు.
చేలో చెంచిలాకు లేదు, ఇంటి కొస్తే ఇరుసెడు అనుము లిస్తానన్నట్టు.
చేలో పత్తి చేలో ఉండగానే పోలికి మూడుమూరలు, నాకు నాలుగు మూరలు.
చేలో మానెడు, ఇంట్లో పుట్టెడు.

చేలో లేనిది చేతిలో కెలా వస్తుంది?

చేవదూలంలో వెదురుమోత పుట్టునా?

చేవలేని చేను, లేవలేని ఆవు.

చేసినంతా అనుభవించాలి.

చేసిన చేష్టలు ఎవరూ చూడరు కాని, కోసినముక్కు అందరూ చూచినారట!

చేసినది జపము, వేసినది గాలము.

చేసినపాపం గోసి (చి) లో పెట్టుకొని కాశికి పోయినా కర్మం తప్పదు.

చేసినపాపం చెబితే పోతుంది (తీరుతుంది).

చేసినపాపం చెఱుగున కట్టుకొని కాశికి పోతే కడతేరునా?

చేసిన పాపాలకు, పెట్టిన దీపాలకు సరి.

చేసినమ్మ చేవ, చేయనమ్మ చెదలు.

చేసినవారికి చేసినంత మహాదేవ!

చేసుకున్న కర్మమోయి శంభులింగమా! అంటే అనుభవించక తీరదోయి అబ్బులింగమా! అన్నాడట!

చేసుకున్న తరువాత వండిపెట్టక తప్పునా?

చేసుకున్నదానికి మూసుకోను లేదు, ఉంచుకున్నదానికి ఉభయ రాగాల చీర!

చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ!

చేసేది బీదకాపురం, వచ్చేవి రాజరోగాలు (రాచ పుండ్లు).

చేసేది శివపూజ, కుడిచేది మాలకూడు.

చేసేపని వదలి నేసేవానివెంట పోయినట్లు.

చేసేవి నాయకాలు, అడిగేవి తిరిపాలు, పెట్టకుంటే కోపాలు.

చేసేవి మాఘస్నానాలు, దూరేవి దొమ్మరి గుడిసెలు.

చేసేవి లోపాలు, చెప్పితే కోపాలు.

చేసేవి శివపూజలు, చెప్పేవి అబద్ధాలు.
చేసేవి శివపూజలు, దూరేవి దొమ్మరిగుడిసెలు.
చేసేవి సూర్యనమస్కారాలు! దూరేవి దొమ్మరిగుడిసెలు.
చొప్పవామిలో నిప్పు దాచుకొన్నట్లు.
చొల్లంగి తీర్థానికి చోడిగింజలంతేసి (మామిడి పిందెలు).
చోటే లేదంటే మూలాల ఎక్కడ పడుకుందును అన్నాడట!
చోద్యం సొరకాయ గుడ్లు పెట్టిందట!
చోద్యాల సోమిదేవమ్మకు వాద్యాల మొగుడు.
చొళ్ళు చల్లితే జొన్నలు పండునా?
చొళ్ళు విసరగ తౌడుగలి, జొన్నలు విసరునా?
చౌక (చవుక) అయితే అంగడికి బజారుకు వస్తుంది.
చౌక (చవుక) దూబరతిండికి కారణం.
చౌదంతి నెక్కగానే చక్రవర్తి అగునా?

—::—

## ఛ

ఛిద్రమునకు చీరపేలు, దరిద్రానికి తలపేలు.
ఛీ కుక్కా! అంటే ఏ మక్కా! అన్నదట!
ఛీ! ఛీ! అనేది ఈనోరే, శివ శివా! అనేది ఈనోరే!

—::—

# జ

జంగంవాడిమెళ్ళో లింగకాయవలె.

జంగానికి పిల్లలు పుడితే ఊరివారిగోడు పోసుకున్నాడట!

జంగానికి పిల్లలు (బిడ్డలు) ఊరికి ఉపాధి.

జంగాలా? దాసర్లా? ముందూరునుబట్టి.

జగడ మెట్లా వస్తాది జంగందేవరా! (లింగమయ్యా!) అంటే బిచ్చం పెట్టే (పెట్టవే) బొచ్చుముండా! అన్నాడట!

జగబిరుదు, ముండమొఱ్ఱ.

జగ మెఱిగిన బ్రాహ్మడికి జందె మెందుకు? (మేల?)

జడ్డిగములో మిడుతపోటు.

జననిని, ధరణిని నమ్మి చెడరు.

జనమర్లు, జాతరమర్లు.

జనవాక్యం జరగక మానదు.

జన్మానికంతా శివరాత్రి అన్నట్లు.

జనుములో పాము పోతే పాతిక నష్టం.

జపం వదలి లొట్టల్లో పడ్డట్లు.

జబ్బబలిమిమీద బలాత్కారగానవినోద మన్నట్లు.

జయ ముండేవలకు భయము లేదు.

జరిగితే జల్లెడతో నీళ్ళు మోస్తారు.

జరిగితే (జరుగుబాటుంటే) జ్వరమంత సుఖం లేదు.

జరిగేమట్టుకు జయభేరి, జరక్కపోతే రణభేరి.

జరుగుబాటు తక్కువ, అదరిపాటు ఎక్కువ.

జవ్వాది పూసుకొని చంక లెత్తినట్లు (లెత్త నేల?).

జ్వరజిహ్వకు పంచదార చేదు.

జాగా ఎఱిగి బైఠో.

జాణకు మూడు తావు లంటును.

జాతికొద్దీ బుద్ధి, కులంకొద్దీ ఆచారము.

జాతినాగుల చంపుతూ ప్రతిమనాగులకు పాలు పోసినట్లు.

జిల సిగ్గెఱుగదు.

జిల్లేడుచెట్టులో పారిజాతము పుట్టునా?

జిల్లేడుపూలకు తుమ్మెద లాశించినట్లు.

జిల్లేళ్ళకు మల్లెలు పూయునా?

జివ తక్కువ (?) జీత మెక్కువ.

జిహ్వ కొకరుచి, పుఱ్ఱె కొకబుద్ధి.

జీతంబత్తెం లేకుండా తోడేలు గొఱ్ఱెలను (మేకలను) కాస్తానన్నదట!

జీతంలేని నౌకరు, కోపంలేని దొర.

జీతగాడు అతగా డైనట్లు.

జీతగాణ్ణి తెచ్చుకుంటే ఇంటికి ఖామందు అయినాడట!

జీతగాణ్ణి తెచ్చుకుంటే ఇంటికి మగడైనట్లు.

జీతగాడికి, నేతగాడికి చావు లేదు.

జీర్ణశక్తి ఎక్కువ, జ్ఞాపకశక్తి తక్కువ.

జీలకఱ్ఱ సింగినాదం!

జీలుగు పెఱిగిన మ్రానుకు కంబము కాదు.

జీలుగుబెండ్లు చెవులు పెంచుతాయిగాని కుండలాలిస్తాయా?

జీవరత్నం ఇత్తడిని పొదిగితే రత్నానికేమి లోటు?

జీవహింస చేయరాదు.

జుట్టుంటే ఎన్నిజడలైనా వేయవచ్చును.

జుట్టు చేతి కిచ్చి, ముడ్డి గంతు లేసినట్లు.

జున్నుతిన్న యొట్టియపోలెన్.

జెముడు కంచెకు శ్రేష్ఠం, చేనికి రేవడి శ్రేష్ఠం.

జెముడు కాయ లున్నవా? నీడ ఉన్నదా?

జేనెడు ఇంట్లో మూరెడు కట్టె.

జేనెడు దొరకు మూరెడు బంటు.

జేనెడు పిట్టకు మూరెడు తోక.

జేనెడు దుక్కి మూరెడు ఎరువు (ఒక టే).

జ్యేష్ఠ చెడ కురియును, మూల ముసుగ కురియును.

జైనవానిచేతి పేనువలె.

జొన్న పెరిగితే జాడు, వరి పెరిగితే వడ్లు.

జోగీ, జోగీ రాసుకుంటే బూడిద రాలిందట!

జోడులేని బ్రతుకు, త్రాడులేని బొంగరము.

జోరీగల గొడ్డుకు గోరోజనం మెండు.

జోలిపక్కలు తీసేలోగా భిక్షపువేళ తీరిపోయిందట!

—::—

## ట

టంకం పెట్టిన గుడిసె, దెబ్బ కొడితే వడిసె.

టంకపుపాడి తగిలితేగాని అతకదు.

టంగుటూరు పెద్దమాలను తగవు తీర్చమంటే తనకూ ఇద్ద రున్నా రన్నాడట!

టాటోటుగాడికి దధ్యన్నం, విశ్వాసపాత్రుడికి వేన్నీళ్ళ అన్నం.

టెంకాయ పిచ్చికొంతవలె.

—::—

# డ

డంబాలు కొట్టి బోర్లపడ్డట్టు.

డబ్బు ఇచ్చి తేలు కుట్టించుకొన్నట్లు.

డబ్బు ఇవ్వనివాడు పడవ ముందర ఎక్కును.

డబ్బు ఉంటే కొండమీది కోతి దిగి వస్తుంది.

డబ్బుకు, ప్రాణానికి లంకె.

డబ్బుకు వచ్చిన చేయ్యే వరహాకు వస్తుంది.

డబ్బు పాపిష్టిది.

డబ్బుముడ్డిలో దేవు డున్నాడు.

డబ్బు దస్కం లేదుగాని డవాలు బంట్రోతు.

డబ్బు లేనివాడికి బోగముది తల్లివరుస.

డబ్బు లేనివాడు డుబ్బుకు కొరగాడు.

డబ్బు సభ కట్టును, ముద్ద నోరు కట్టును.

డుబ్బు బుట్టు డాలు కత్తి, చూరులోన చూరకత్తి.

డాబుసరి బావా! అంటే డబ్బు లేని మరదలా! అన్నాడట.

డూడూ వెంకన్నా (బసవన్నా) అంటే తలూపడమా? (తలూపినట్లు).

డొంకలో దాగితే పిడుగుపోటు తప్పునా?

డొంకలో పరా బున్నాడు, నా సొమ్ము చూపుకోవచ్చును.

డోలుకు అంతవాడు లేడు, పీనుగానికి ఇంతవాడు లేడు.

డోలు దస్తు, పెండ్లాము పస్తు.

— : : —

# ఢ

ఢిల్లీకి ఢిల్లీ, పల్లెకు పల్లీ.
ఢిల్లీకి ఢిల్లే, పల్లెకు పల్లే.
ఢిల్లీకి రాజైనా (పాదుషా అయినా) తల్లికి కొడుకే.
ఢిల్లీకి పోయి ఉల్లిగడ్డ తెచ్చినట్లు.

— : : —

# త

తంగేటిజుంటికి దాప ఎందుకు ?
తంగేడు పూచినట్లు.
తంటాలమారి గుఱ్ఱానికి తాటిపట్ట గొఱపము.
తండ్రి ఓర్వని బిడ్డ తల్లి ఓరుస్తుంది.
తండ్రిగదా అని తలాటి కీడ్చినట్లు.
తండ్రి చస్తే పెత్తనం తెలుస్తుంది, తల్లి చస్తే కాపురం తెలుస్తుంది.
తండ్రి చేసిన అప్పుకు కొడుకు బందెరాకు మోశాడట.
తండ్రి తవ్విన నుయ్యి అని దానిలో దూకవచ్చునా ?
తండ్రిని చంపబోయిన పాపం అత్తవారింటికి పోయి అంబటికట్ట తెగే వఱకు ఉంటే పోవును.
తండ్రిసేద్యం, కొడుకువైద్యం, కూడు మధ్యం.
తంతే (తన్నిన) దూదిపరుపుమీద పడ్డట్లు.
తంతే (తన్నిన) పూలపాన్పుమీద పడ్డట్లు.

తంతే (తన్నిన) బూర్లగంపమీద పడ్డట్లు.

తంబల (ళ) అక్కయ్య మోదుమూడి వెళ్ళాడు, వచ్చాడు.

తంబళ్ళవాని తలతిక్క తీరింది.

తంబళిఅనుమానం తలతిక్కతో సరి.

తంబళి తన లోటులో టుగాని ఎదుటిలోటులోటు ఎఱుగడు.

తక్కువనోములు నోచి ఎక్కువ ఫలము రమ్మంటే వస్తుందా ?

తక్కువవాడికి నిక్కెక్కువ, తెవ్వడుబియ్యానికి పొంగెక్కువ.

తక్కువవానికి నిక్కులు లావు.

తగ పండిన పండు తానే పడును.

తగవరి కూలికి విషము తాగడు.

తగవు చెప్పు ధర్మరాజా ! అంటే దూడా, బఱ్ఱె నాదే అన్నాడట !

తగవున ఓడినా, ముదిమిని చచ్చినా బంది లేదు.

తగినట్లు కూర్చెరా తాకట్లమారి బ్రహ్మ.

తగిలికాని ఎత్తు చేయదు, తడిసికాని గుడిసె వేయదు.

తగిలిన కాలే తగులును, నొగిలిన కొంపే నొగులును.

తగుదాసరికీ, మెడపూసలకీ అమ్మ కన్న కాన్పుకూ, అయ్య ఇచ్చిన మనువు (ము) కూ.

తగునే కఱకుట్లును జంకపాత్రమున్ ?

తట్టలో కాపురం బుట్టలోకి వచ్చె, బుట్టలో కాపురం బూడిదలో కలిసె.

తట్టెడు గుల్లల కొక దుడ్డుపెట్టు.

తడక గట్టి గోడను తన్నరాదు.

తడక తీసినవాడిది తప్పు.

తడ (డి) క కొంపలో దీపాలు వెలుగవా ?

తడ (డి) క దొబ్బింది ఎవ రంటే అలిలేనివాడు అన్నట్లు.

తడ (డి) క లేని ఇంట్లో కుక్క దూరినట్లు .

తడిగుడ్డలతో గొంతు కోసినట్లు.
తడిగుడ్డలో పేలాలు వేయించినట్లు.
తడిసిగాని గుడిసె కట్టడు, తాగిగాని మొగ్గడు.
తడిసికాని గుడిసె వేయడు, తగిలికాని ఎత్తు చేయడు.
తడిసిన కుక్క బిగిసినట్లు.
తడిసిన తక్కెడ, ఎండిన ధడా.
తడిసి ముప్పందుము మోసినట్లు.
తడిసి ముప్పందుము మోసేకంటే తడవక పందుం మోసేది మేలు.
తణుకు పోయి మాచారం వెళ్ళినట్లు.
తద్దినం కొని తెచ్చుకొన్నట్లు.
తద్దినంనాటి జందెంవలె.
తద్దినం పెట్టేవాని తమ్మునివలె (మాదిరి).
తద్దినానికి తక్కువ, మాసికానికి ఎక్కువ.
తద్దినానికి భోజనానికి పిలిస్తే రోజూ మీఇంట ఇల్లాగే జరగాలని దీవించాడట!
తనఅన్నం తాను తింటూ ఊరికి భయపడవలెనా?
తనకంట్లో దూలా లెట్టుకొని పరులకంట్లో నెరసు లెంచినట్లు.
తనకంపు తన కింపు, ఒకరికంపు ఓకరింపు.
తనకలిమి ఇంద్రభోగం, తనలేమి లోకదారిద్ర్యం.
తనకాళ్ళకు బందాలు తానే తెచ్చుకొన్నట్లు.
తనకు అని తవ్వెడు ఉంటే ఆకటివేళకు ఆరగించవచ్చు.
తనకు కానిది గూడు (గూన) లంజ.
తనకుకాని రాజ్యం పండితే నేమి? పడట గలిస్తే నేమి?
తనకు చెప్ప తెడికల చాలు, ఒకరికి చెప్ప ఒప్పులకుప్ప.
తనకు తోచకున్న మోకాలుతో ఆలోచించాలి.

తనకు పాసిన కొ్రటుకలు ఏరేవులో పోతే నేమి?

తనకు మనశ్శుద్ధి ఉంటే సానివాకిట కాపుర ముండవచ్చు.

తనకుమాలిన ధర్మం మొదలుచెడ్డ బేరం.

తనకుమాలిన ధర్మం లేదు.

తనకు రొట్టె, ఒకరికి ముక్క.

తనకు లేక తంటాలు పడుతుంటే, తొంటికాళ్ళ పిల్లి వెంట పడ్డట్లు.

తనకు లేదని ఏడిస్తే ఒకకన్ను, ఇతరుల కున్నదని ఏడిస్తే ఇంకొకకన్ను పోయినదట!

తనకు లేదని ఏడిస్తే ఒకకన్ను పోయింది, ఒకరికిఉందని ఏడిస్తే రెండవ కన్ను పోయింది.

తన కొంగున కట్టినరూక, తన కడుపున పుట్టిన బిడ్డ (అక్కరకువచ్చును) (ఏనాటికీ ఒదుగే).

తన కోపమే తన శత్రువు.

తన గుణము మంచిదయితే సానివాడ కాపురం చేయవచ్చును.

తనచల్ల పుల్లనిదని తా జెప్పుకొనునా?

తన చేయికాలుతుందని సవతిబిడ్డ చేతితో కలిపిందట (కలియబెట్టిందట)!

తనతప్పు తప్పుకాదు, తన బిడ్డదుడుకు దుడుకుకాదు (అంకు అంకు కాదు).

తన తలుపు తీసి పొరుగింటికి పెట్టి, రాత్రంతా కుక్కలను తోలుతూ కూర్చున్నట్లు.

తనదాకా వస్తేకాని తలనొప్పి బాధ తెలియదు.

తనదాకా వస్తే తగవే లేదు.

తనది తాటాకు, ఇవతలివాళ్ళది ఈతాకు.

తననీడ తనతోనే (టే) ఉంటుంది.

తననీడ తప్పితే తరుగు నాక వన్నె.

తననీడ తానే తొక్కుకున్నట్లు.
తననీడే పిశాచము.
తనను (తన్ను) కట్టే తాళ్ళు తానే తెచ్చుకొన్నట్లు.
తన నోటికి తవుడు లేదు, లంజ నోటికి పంచదార.
తనను (తన్ను) పొడిచిన గంగిగోవునైనా పొడిస్తే పాపం లేదు.
తనపాపం తన్నే కాలుస్తుంది.
తనపిల్ల తవిటి (తవుడుకు) కేడిస్తే, లంజపిల్ల రావిరేక కేడ్చింది.
తనపుట్టి పిచ్చిగా ఉంటే, పొరుగు పందెం (తో) పరాలు కొలిచినాడట!
తనబలిమి కన్న స్థానబలిమి మిన్న.
తనబుద్ధి మంచిదయితే లంజగేరిలో ఇల్లు కడితేనేమి ?
తనమతి, తనగతి.
తనముడ్డి కాకపోతే గంగదాక (కాశిదాక) దేకమన్నట్లు.
తనముడ్డి కాకపోతే తాటిపట్టకు ఎదురు దేకమన్నట్లు.
తనముడ్డి కాకపోతే ధవళేశ్వరముదాక దేకుమను.
తనయుని పుట్టుక తల్లి యెఱుగును.
తనలో తప్పు లేకపోతే గురువుతో గుద్దులాడవచ్చును.
తనవారికి తరగకుండా ఉంటుంది, పెసరు (తాగటానికి చిప్పఉండదు.
తనవారిని ఎఱుగని మొట్టితెడ్డున్నదా ?
తనవారు లోతుకు తీతురు, కానివారు కడకు తీతురు.
తనవాసి తప్పితే తనవన్నె తరుగును.
తనసొమ్ము అయినా దాపుగా తినవలెను.
తనవి పెరగాలి మందివి తరగాలి.
తనసొమ్ము అల్లం ఒకరిసొమ్ము బెల్లం.
తనసొమ్ము సోమవారం, మందిసొమ్ము మంగళవారం.
తనసొమ్ము తను దిని, తనబట్ట తను కట్టి, సావట్లోవానితో చావుదెబ్బలు తిందట !

తనుకాక తనుకొక పిల్లి!

తనువులు నిత్యం కాదు, మావారిని ఓలిపైకం ఖర్చులు పెట్టవద్దు అన్నట్లు.

తనువు వెళ్ళినా దినము వెళ్ళదు.

తన్ను తప్పించి ఆకాశమంత పిడుగు పడమన్నట్లు.

తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డబేరం.

తన్నే కాలికి రో లడ్డమైనట్లు.

తన్నే కాలు ఎండక పోదు.

తన్నితే తలబగులుతుం దంటే కొడితే కొప్పెర పగలాలి అంటాడు.

తన్ని తల్లే గుంజుకు పోతే చెప్పున కొట్టి చిప్ప తెచ్చుకోవాలి.

తపము పండిన మీాద జడలు తాల్చడ మెందుకు?

తప్పతాగి కులము మఱచినట్లు.

తప్పులు వెదకేవాడు, తండ్రి ఒప్పులు వెదకేవాడు, ఓర్వలేనివాడు.

తప్పులు ఎన్నువారు తండోపతండాలు.

తప్పు లెన్నువారు తమతప్పు లెరుగరు.

తప్పు చేసినవానికి, అప్పు చేసినవానికి సుఖం చెల్లదు.

తప్పుడుదండుగకు తలో యింత.

తప్పట్లు, తాళాలు, తంగేడుచెట్టు బాజాలు.

తప్పులేనివానిని ఉప్పులో వేయ మన్నట్లు.

తప్పులేనివారు ధరణిలో లేరు.

తప్పూ ఒప్పూ దైవ మెఱుగును, పప్పూ కూడూ బాప డెఱుగును.

తప్పెట కొట్టినవాడు దాసరి, శంఖ మూదినవాడు జంగము.

తప్పెట కొట్టినా పెండ్లే, చప్పెట కొట్టినా పెండ్లే.

తములపాకుతో తా నిట్లంటే తలుపుచెక్కతో నే నిట్లంటి.

తమలము వేయని నోరు, కమలము పూయని నీరు.

తమాము లేకుంటే తన్నైనా అన్నట్లు.

తమాము లేకున్నది తల్లిపిల్లలే పరిహాస మాడుకుంటారు.

తమ్ముడు తనవాడైనా తగుధర్మంగా చెప్పాలి.

తమ్ముడు తనవాడైనా తగుధర్మం చెప్పాలి.

తమ్ముడు తనవాడైనా ధర్మం సరిగా చెప్పవలెను.

తరవాణి తల్లి.

తరి అంటే వరి అంటారు, తరి గొంతుకు ఉరి.

తరిపట్టిన కట్టు, చెరపట్టిన కుట్టు.

తటేమి చల్లితే తవ్వేడే.

తరి మెడకు ఉరి, మిట్ట లొట్ట.

తలంత బలగమే గాని తలలో పెట్టువారు లేరు.

తల ఊపినందుకు తంబూర బుఱ్ఱా?

తలకట్టు అంటూ ఉంటే ఎటువంటి కొప్పయినా పెట్టవచ్చు.

తలకాయ పోతూంటే, పోగులెక్కడ పెట్టేది అన్నట్లు.

తలకాయ లోపలికి దూర్చిన తాబేలు వలె.

తలకింది (క్రింది) కొఱవి వలె!

తలకంతా ఒకటే మంత్రం!

తలకు దారి లేదు బుడ్డకు అటకలి!

తలకు మించిన ఆజ్ఞ లేదు.

తలకోసి ముందఱ పెట్టినా గారడీవిద్యే అన్నట్లు.

తల కోసుకపోగా తమ్మపోగుల కేడ్చినట్లు.

తల గట్టి, కడుపు గుల్ల.

తలగడకింద పామువలె.

తలగడ తిరుగవేస్తే తలనొప్పి తీరునా?

తల గొట్టే వానికైనా మూడు మనువు లుంటాయి.

తల గోకుకొన్న తలపులు వస్తవి.
తలచినప్పుడే తాతపెళ్ళి.
తలచుకొన్నపుడే తలంబ్రాలు కావా లంటే ఎలాగు?
తల చుట్టం, తోక పగ.
తల తడవి బాస చేసినా నెలయాలిని నమ్మరాదు.
తల తడిపినమట్టుకు గొరిగితీరవలెను.
తల తిరిగైనా కబళము నోటికి రావలెను.
తల దన్నేవాడు పోతే తాడి దన్నేవాడు వస్తాడు.
తల దాచుకొన నిచ్చినవానికే తావు లేకుండా చేసినట్లు.
తల నరుకువానికి తలవా రిచ్చినట్లు.
తల నరకడంలో, మొల నరకడంలో తారతమ్య మేమిటి?
తల పడేచోటికి కాళ్ళు పడుస్తాయి.
తలపాగా చుట్టులేక తలవంకర అన్నట్లు.
తలప్రాణం తోకకు వచ్చినట్లు.
తలంబ్రాలకు తద్దినాలకు ఒకేమంత్రమా?
తలంబ్రాలనాటి ప్రారబ్ధం తాను పోయిననాడే పోతుంది.
తల మాసినవా డెవ డంటే ఆలి చచ్చినవాడు అన్నట్లు.
తలమువ్వాట్లు నోటిదయ లేకున్న బుక్క లోనికి పోదు.
తలలు బోడులైన తలపులు బోడులా?
తలలోపల నాలుక, పూసలలో దారమువలె.
తల వంచుకొంటే పదుగోడల చాటు.
తల విడిచి మోకాలికి బాచి (?) పెట్టినట్లు.
తలా తోకా లేని కథ, ముక్కూ మొగము లేని పిల్ల.
తలారిదుప్పటి రెడ్డి బహుమానం.
తలారి పగ తలతో తీరును.

తలారిరుమాలు రెడ్డి చదివించినట్లు.
తల్లి అయినా ఏడవందే పాలివ్వదు.
తల్లి ఓర్చనిది దాది ఓర్చునా ?
తల్లి కడుపు చూచును, పెళ్ళాం వీపు చూచును.
తల్లికొద్ది బొల్లికోడె.
తల్లికడుపులో చొరకముందు దయ్యాలదేవత, భూమిలో పుట్టినతరు
వాత యమదేవత.
తల్లికి అన్నం పెట్టనివాడు పినతల్లికి చీర పెట్టినట్లు.
తల్లికి కాకపోతే తిల్లికకు దణ్ణంపెట్టు మన్నారు.
తల్లికి కానివాడు దాది కవునా ?
తల్లికి కూడు పెట్టనివాడు, తగుమనని తగవుతీర్ప వచ్చాడట !
తల్లికి కూడు పెట్టనివాడు, తగవు చెప్పేడు, పెళ్ళానికి చాలనివాడు
పెత్తనం చేసేడు.
తల్లికి కూడు పెట్టనివాడు, పినతల్లికి చీర పెట్టేడట !
తల్లికి కొట్టరా వసంతం అన్నట్లు.
తల్లికి తగిన బిడ్డ, ఇంటికి తగిన పందిరి.
తల్లికి బొల్లిఉంటే పిల్లకు చుక్కయినా ఉంటుంది.
తల్లికి వంచగలిగిన పిల్లకు బొక్క కలుగుతుంది.
తల్లికి లేని ముద్దు దాదికి కలదా ? (స. ని. 254 పుట.)
తల్లిగండం కాదు, పిల్లగండం కాదు, మధ్యన మంత్రసాని గండం
అన్నట్లు !
తల్లిగండము పిల్లగండ మున్నది కాని, మధ్యన మంత్రసాని గండ
మున్నదా ?
తల్లిచనిపోతే తండ్రి పినతండ్రితో సమానము.
తల్లిచస్తే కడుపుపెద్ద, తలలు మాస్తే కొప్పుపెద్ద.

తల్లి చస్తే తరంబాసె, తండ్రి జడిస్తే ఋణం బాసె.

తల్లి చస్తే జిహ్వ చచ్చినట్లు, తండ్రి చస్తే కళ్ళు పోయినట్లు.

తల్లిచాలు పిల్లకు తప్పుతుందా ?

తల్లిచాలు బల్లిపిల్ల.

తల్లి చెవుల మద్దికాయలు దండుగలకు, భార్య మెడలో పూసలు అందు
గులకు (భోగాలవారికి).

తల్లి చెవులు తెంపినవానికి, పినతల్లి చెవులు బీరపువ్వులు.

తల్లి చేను మేస్తే పిల్ల మేర మేస్తుంది.

తల్లి చేసినది తనయు (డు) లకు !

తల్లిదే వలపక్షము, ధరణిదే వలపక్షము.

తల్లి దైవము, తండ్రి ధనము.

తల్లిని చూచి పిల్లను, పల్లును చూచి పశువును కొనవలె.

తల్లిని చూచి పిల్లను, పాడిని చూచి బర్రెను.

తల్లిని నమ్మినవాడు, ధరణిని నమ్మినవాడు చెడడు.

తల్లినిబట్టి పిల్ల, విత్తునుబట్టి పంట.

తల్లిపాలు దూడ చెప్పును.

తల్లిపిల్ల వన్నెకాదు, వండిపెట్ట దిక్కులేదు.

తల్లి పుట్టిల్లు మేనమామవద్దనా ? (మేనమామ కెరుక).

తల్లి పుట్టిల్లు మేనమామవద్ద పొగడినట్లు.

తల్లి పెంచవలయు, ధరణి పెంచవలయు, పెరవారు ఏరీతి పెంచగలరు ?

తల్లిముఖం చూడని బిడ్డ వానముఖం చూడని పైరు (ఒకటే).

తల్లిమీది కోపం పిల్లమీద పోతుంది.

తల్లి రోసిన దాది రోయదా ?

తల్లిలేని పిల్ల, ఉల్లిలేని కూర.

తల్లిలేని పుట్టిల్లు, ఉల్లిలేని కూర.

తల్లి విషం, పెండ్లాం బెల్లం.

తల్లి వెనుక మేనమామ అన్నారు.

తల్లిసారము పిల్ల, దాకసారము సక్కు.

తల్లీ, బిడ్డా ఒకటయినా నోరు వాయి (కడుపు) వేరు.

తల్లిలేని పిల్ల దయ్యాలపాలు.

తల్లె కొట్టినా పెండ్లియే, తప్పెట కొట్టినా పెండ్లియే.

తలుగు దొరికిందని ఎనుమును కొన్నట్లు.

తలుగు త్రెంచుకొన్న బఱ్ఱె, త్రాడు తెంచుకున్న గుఱ్ఱం.

తలుగు పెట్టి తంతూ ఉంటే కొలువు పెట్టి కొలిచినట్లు.

తలుపులు మింగేవానికి అప్పడాలు లొటలొట.

తలుపు పెట్టి చెబుతుంటె కొలుపుపెట్టి అడుగుతాను.

తలు పేల చాపగుడిసెకు ?

తవిటికి వచ్చిన చెయ్యే ధనానికి వస్తుంది.

తవుడా తాతా! అంటే నూకలా ముసలమ్మా! అన్నట్లు.

తవుడు తింటూ ఒయ్యారమా ?

తవుడు తిని చచ్చువానికి విషము పెట్టువాడు వెఱ్ఱివాడు.

తడితే పాప నిదురపోతుంది, తప్పెట కొడితే గంతు లేస్తుంది.

తవుడు బొక్క తమాసీల్దారుడు, మీసా లెగబట్ట మాసూలుదారుడు.

తవుడు తినేవాడికి మీసా లెగబెట్టేవా డొకడు.

తవుడు నోము పట్టిన అమ్మకు తరగని ఐదువతనము.

తవ్వగా తవ్వగా (త్రవ్వగా త్రవ్వగా) తథ్యం తేలుతుంది.

తవ్వి (త్రవ్వి) మీద తోసుకున్నట్లు.

తాకట్లమొగుడా! తంటాలమొగుడా! నీ తనువుండగానే నన్ను మను
విచ్చిపోర !

తాకిన వ్రేలుకే కట్టు తగులుతుంది.

తాకిన కాడికే బుడుసు (?) తెగిన కాడికే ముడి (ముడుసు).

తాకుడుకాళ్ళకు టంకం చెప్పాలు.

తాకినేలుకు తడిబట్ట కానదు, వంగినేలుకు ఇంగువ కానదు.

తాకితే తగరు, ఈనితే గొఱ్ఱె.

తాకిమొగ్గిన తినువంత ఒకటి, దీపము నులిపిన దినుసంత ఒకటి.

తాకి మొగ్గి తడిసి గుడిసె కప్పు.

తా క్రుంగుట జగ క్రుంగుట !

తాగటానికి దప్పిక్కి (గంజి) లేదుగాని గుంటడికి గుండుజోడు.

తాగనేరని పిల్లి (లేని పిల్లి) బోర్లపోసుకున్నట్లు (తోసుకున్నట్లు).

తాగపోతే దప్పికకు లేదు, తలకు అటకలి.

తాగపోతే మజ్జిగ లేదంటే పెరుగుకు చీటీ వ్రాయు మన్నాడట.

తాగితేగాని మొగ్గదు, తడిస్తేగాని కప్పదు.

తాగినదుక్కి తప్పక పండును.

తాగినవానిదే పాట, సాగినవానిదే ఆట.

తాగినవానిమాట మాట గాదు, సాగినవాని మాట దబ్బర గాదు (దబ్బున) ?

తాగుటకు ముందు, వ్రాతకు వెనుక చూడవలె.

తాగుబోతు తోడు కోరును.

తాగేది దమ్మిడీ గంజాయి, ఇల్లంతా చెడు ఉమ్ములు.

తాగేవాడే కడతాడు (ఇచ్చుకుంటాడు) తాళ్ళ (తాటి) పన్ను.

తా జెడిన కోతి వనమెల్ల చెరిచె.

తా జెడ్డకోతి వనమెల్ల చెఱచె.

తా జెడు ధర్మము, మొదలు చెడు బేరమా ?

తాటాకుచప్పుళ్ళకు కుందేళ్ళు బెదరునా ?

తాటాకు చప్పుళ్ళకు దయ్యములు వెఱచునా ?

తాటికాయ తింటావా తలకొట్లు పడతావా ?

తాటికాయ వన్నె తప్పుడిది.

తాటి (డి) చెట్లకు గంధం పూసినట్లు.

తాటి (డి) (తాళ్ళల్లో) చెట్లలో పొద్దుకూకినట్లు.

తాటి (డి) చెట్టు ఎందుకెక్కావురా అంటే దూడగడ్డికోసం అన్నాడట !

తాటి (డి) చెట్టుకింద పాలు తాగినా కల్లే అంటారు.

తాటి (డి) చెట్టు నీడ, తగులుకొన్న ముండ.

తాటి (డి) చెట్టు నీడ నీడకాదు, తగులుకున్న మొగుడు మొగుడుకాదు.

తాటిచె ట్టెక్కుతావా ? తలగొట్లు తింటావా ?

తాటిపట్టకు ఎదురు దేకినట్లు.

తాటోటుగాడికి దధ్యన్నం, విశ్వాసపాత్రుడికి వేన్నీళ్ళ అన్నం.

తాడికి తలబంటి అయితే ఎంపలికి ఎంతబంటి ?

తాటి (డి) ఫలంబు గొనుట.

తాడి ఎక్కేవానిని ఎందాక ఎగసన దోయగలం ?

తాడిఎత్తు ఎగిరినానంటే, తారాజువ్వెత్తు ఎగురు.

తాడి తన్నేవానిని తలతన్నేవా డుండును.

తాడు అని ఎత్తిపారేయ కూడదు, పాము అని దాటనూ కూడదు.

తాడుకు పట్టలే (దు) తలుగుకు పట్టలే (దు) గుంజ కెందుకమ్మా గుంజులాట ?

తాడు చాలకపోతే నుయ్యి (బావి) పూడ్చ మన్నట్లు.

తాడు తెంచను ముహూర్త మెందుకు ?

తాడుతో దబ్బనము.

తాడూ లేదు బొంగరమూ లేదు.

తాతకు దగ్గులు నేర్పాలా ? (నేర్పినట్లు).

తాత తాత తంగెడు పుల్ల, ధుసినీయక్క కుందేలుపిల్ల.

తాతను చూపుతావా? తద్దినం పెడతావా?

తాతలనాటి బొచ్చె తరతరాలకు.

తాతలనాడు నేతులు తాగాం, మూతులు వాసన చూడు.

తా త్రవ్విన గోతిలో తానే పడును.

తాతాచార్లు తద్దినానికి, పీర్ల పండుగకు ఉన్న సంబంధం అన్నట్లు.

తాతాచార్యులవారి ముద్ర భుజం తప్పినా వీపు తప్పదు.

తాతా! పెండ్లాడుతావా అంటే, నా కెవ రిస్తారురా అబ్బాయి! అన్నాడట!

తాతా! పెండ్లాడుతావా అంటే, మన కెవ రిస్తారురా మనుమడా! అన్నట్లు.

తాతా! సంక్రాంతి పట్టు పట్టు.

తాతా! సంధ్య వచ్చునా? అంటె ఇప్పుడు చదువుకొన్న నీకే రాకపోతే అరవై ఏళ్ళకింద చదువుకొన్న నాకు వచ్చునా? అన్నాడట!

తా దిన తవుడు లేదు, వారాంగనకు వడియాలు.

తా దిన తవుడు లేదు, వారానికో పందిపిల్ల.

తా దూర (సందు) క్రంత లేదు, మెడకో డోలు! అన్నట్లు.

తా దూర దారి (కంత, దోవ) లేదుగాని డోలొకటి మెడకు!

తా ననుభవించని అర్థం ధరణిపాలు.

తాను ఆడుదై నాసబ్రాలు కేడ్వవలెనా?

తాను ఉండేది దాలిగుంటపట్టు, తలచేవి మేడమాళిగలు (మేడ మిద్దెలు).

తాను ఎక్కినకొమ్మ నరుక్కుంటాడా?

తాను ఎఱుగని కల్ల లేదు, తల్లి ఎఱుగని కులము లేదు.

తాను ఒకటి తలిస్తే, దైవ మొకటి తలచినట్లు.

తానుగాక పిల్లికూడానా?

తాను చేసిన పాపం తనువుతో, తల్లి చేసిన పాపం ధరణితో.

తాను చొక్క మైనట్లు, తడక భద్ర మైనట్లు.

తాను దొంగై ఇంటిపై అనుమానము.

తాను దొంగైతే పరులను నమ్మడు.

తాను పెంచిన పొట్టేలు తఱిమిపొడుచు తెన్న యను సామ్యము.

తాను బట్టిన కుందేటికి మూడే కాళ్ళు.

తాను బట్టిన కోడికి నాలుగు కాళ్ళు.

తాను పతివ్రత అయితే సానిఇంట కాపుర ముండేనేమి ?

తాను పతివ్రత అయితే సానివాకిట మంచం వేయవచ్చును.

తాను పెంచిన పొట్టేలు తనచేతనే చచ్చినట్లు.

తాను పెంచిన పొట్టేలు తఱిమి పొడుచు తెన్న అను సామ్యము.

తాను మింగేది తన్ను మింగేది చూచుకోవలెను.

తాను మెచ్చి తినాలి, ఒకరు మెచ్చ నడవాలి.

తాను వలచింది రంభ, తాను మునిగింది గంగ.

తానూ ఒక మనిషేనా ? తవుడూ ఒక రొట్టేనా ?

తానే తుమ్మి తానే శతాయుస్సు అనుకొన్నట్లు !

తానే మాగనికాయ తంతే మాగునా ?

తానే సెట్టి అంటే మూడే గిద్ద లంటాడు.

తానే సెట్టి అంటే మూడే సోలలు అమ్మినాడట !

తా నొకటి తలచిన దైవ మొకటి తలచుతాడు.

తాపుల గొడ్డుకు రో లడ్డము !

తా బెట్టిన గుమిణి మొక్క అయినా చేపట్టవలెను.

తా బెట్టుకోనిది, భిక్షమా ?

తాబోతూ బొల్లిఎద్దుకు కుశితి అన్నట్లు.

తా బోతే తోడు దొరకదు కాని రాయరా సన్నాలకు చీటి అన్నాడట!

తా బోతే మజ్జిగ లేదంటే పెఱుగుకు చీటి వ్రాశాడట!

తామరాకుపై నీటిబొట్టువలె.

తామరాకుపై నీళ్ళు తల్లడించినట్లు.

తామసి తామసే!

తాలిమి తన్నూ కాచును, ఎదిరినీ కాచును.

తాలుకంకులోయి దాసరీ! అంటే రాలినవఱకే గోవిందా! అన్నాడట.

తాలువడ్లకు నీళ్ళకల్లుకు.

తాళము నీవద్ద, చెవి నావద్ద.

తాళ్ళకు తలను చుట్లు, మేకలకు మెడను చుట్లు.

తాళ్ళపన్ను తాగేవారే ఇచ్చుకుంటారు.

తాళ్ళపాకవారి కవిత్వం కొంత, పసపైత్యం కొంత.

తా వలచింది రంభ, తా మునిగింది గంగ.

తాయితులకే పిల్లలు పుడితే తా నెందుకు ?

త్రాటం బెబ్బులి గట్టినట్లు.

తిక్కపిల్ల తీర్థంపోతూ అక్క మొగుణ్ణి వెంటబెట్టుకు పోయిందట!

తింటే ఆయాసం, తినకుంటే నీరసం.

తింటే కదలలేను, తినకపోతే మెదలలేను.

తింటేగాని రుచి తెలియదు, దిగితేగాని లోతు తెలియదు.

తింటే గారెలు తినవలె, వింటే భారతము వినవలె (కంటే కొడుకును కనవలె).

తింటే నారసం, తినకపోతే నీరసం.

తిండికి చేటు, నేలకు బరువు.

తిండికి ఠికాణా లేదు, ముండకు బులాకీ.

తిండికి తిమ్మరాజు, పనికి పోతురాజు.

తిండికి తీటకు మేర లేదు.

తిండికి ముందరెత్తు (ముందెత్తు) పనికి (వె) ఎనకెత్తు.

తిండికి లేకపోయినా తిక్క కేమిలోటు? (తిక్కకు తక్కువలేదు).

తిండిలేనమ్మ తిరునాళ్ళకు పోతే ఎక్కాడిగా సరిపోయింది.

తిండికి వచ్చినట్టా? తీర్థానికి వచ్చినట్టా?

తిండి చింత, దండి చింత.

తింతలు తూతినవే, తూతే తాతే తాలంతత్తే తూతక తాతక తోనా దొందూ దొందే!

తింతావు బసవన్నా అంటే తింతా, పంతావు బసవన్నా అంటే పంతా.

తిక్కపిల్లా! తిక్కపిల్లా! మా అక్కపిల్లను చూస్తివా అంటే, చూస్తి శుక్రవారమని కావలించుకుంటి మాటలాడుదా మంటె మఱచి పోతి అందిట!

తిక్కలవాడు తిరునాళ్ళకు పోతే ఎక్కాడిగా ఏడురోజులు పట్టిందట!

తిక్కలవాడు తిరునాళ్ళకు పోతే కొంచెం ఎక్కాడిగా సరిపోయింది.

తిట్టను పోరా గొల్లిగా!

తిట్టబోకురా కూసుకొడుకా (గాడిదకొడుకా)!

తిట్టబోతే అక్కబిడ్డ, కొట్టబోతే వేకటి మనిషి.

తిట్టి చచ్చినవాడు లేడు, దీవించి బ్రతికినవాడు లేడు.

తిట్టితే కోపం, కొట్టితే నొప్పి!

తిట్టితే గాలికి పోతవి, తింటే లోనికి పోతవి.

తిట్టు కాదురా (కూసు) తొత్తుకొడుకా!

తిట్టే నోరు కొట్టినా ఊరకుండదు.

తిట్టే నోరు, తిరిగే కాలు ఊరకుండవు.

తినకుండ రుచులు, దిగకుండ లోతులు తెలియవు.

తిన కూటికి దారి లేదు, తసవారికి తద్దినాలు.

తినగతినగ వేము తియ్యనుండు.

తినమరగిన కోడి అలమరగినదట !

తినగలఅమ్మతిండి తీర్థాలలో బయట పడుతుంది.

తినగా తినగా గారెలు కసరు (చేదు).

తిన నేర్చినమ్మ పెట్ట నేరుస్తుంది.

తినబెట్టమంటే వినబెట్ట మన్నట్లు.

తినబోతూ రుచు లడిగినట్లు.

తినమరిగిన కుక్క రేవు కాసినదట !

తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసింది.

తినమరిగిన ప్రాణము అల్లాడి చచ్చినది.

తినమరిగినమ్మ నరిమడి దోవ (దానం) పట్టినట్లు.

తిని ఉండలేను, తీసి బొందనట్టు.

తినమంటే పులి వల్లదు.

తిన్న ఇంటివాసాలు (లెక్కపెట్టు) ఎంచుతా వేమిరా అంటే పొరుగింటికి
పోతే ఊరకుంటారా అన్నట్లు.

తిన్నఇల్లు గుద్దలించా వేమిరా అంటే తినని ఇల్లు నేనేమి ఎఱుగుదును ?
అన్నాడట !

తిన్నాళ్ళ తిప్పలు పట్టినట్లు.

తిన్నకుక్క తినిపోతే కన్నకుక్కను కట్టేసి కొట్టినట్లు.

తిన్నకుక్క తినిపోతే కన్నకుక్కను కాలు విరుగ కొట్టినట్లు.

తిన్నవాడే మన్నవాడు, మన్నవాడే మహారాజు.

తిన్నవిశ్వాసము ఊరకనే పోదు.

తినా కుడువా తీర్థం పోవాలి, తిండికి మాడ పెండ్లికి పోవాలి.

తిని ఉండలేక తాగి బొందను పడినట్లు.

తిని కుడువవలె, ఋణాలు పోవాలి, పని జేయ పెండ్లికి పోవాలి.

తినేవరకు తిండికష్టం, తిన్నతర్వాత దండికష్టం.

తినేకూటిలో మన్ను పోసుకొన్నట్లు.

**తినేది కుడిచేది** తిమ్మక్క, మోసుకు తిరిగేది ముజ్జక్క.

**తినేది కుడిచేది** (పెట్టేది) రెడ్డిసాని, కనేది కట్టేది గుడ్డిపోలి.

**తినేది** గొడ్డుమాంసం, చేసేది దేవతార్చన.

**తినేది** తిట్లు, చెప్పేవి శ్రీరంగనీతులు.

**తినేవి** తిప్పకాయలు, వెళ్ళగ్రక్కేవి వెలగకాయలు.

**తిప్పలాడీ**! మాఅన్నను చూచినావా? తీర్థంలో మా బావను చూచినావా?

తిమ్మన్న బంతికి తియ్యని చారు అన్నము.

తిమ్మన్న బంతికి రమ్మంటారు కాబోలు.

తిమ్మన్నా! తిమ్మన్నా! నమస్కారము. నాపేరు నీ కెలా తెలిసింది? అంటే నీముఖం చూడగానే తెలిసింది అన్నాడట!

**తిమ్మిని** బ్రహ్మి, బ్రహ్మిని తిమ్మి.

**తియ్య** (తీయ) నీటికి చేప లెదురెక్కినట్లు.

**తిరిగి ఆడది**, తిరుగక మగాడు చెడుదురు.

**తిరిగితే** వరిపొలం, తిరుగకపోతే అడవిపొలం.

**తిరిగి రైతు**, తిరుగక బైరాగి చెడుతారు.

**తిరిగివచ్చిన** భార్య, తిరుగబోత (మోత) వేసిన కూర బహు రుచి.

**తిరిపం** పెట్టినమ్మ మగనితో పాలు పెరుతుందా?

**తిరిపపు** కూడు బర్కతు లేదు, తిన్నవఱకు నమ్మిక లేదు.

**తిరిపపు** మజ్జిగకు వచ్చి పాడిఎనుమును (గేదెను) బేర మాడినట్లు.

**తిరిప** మెత్తేవానికి పెఱుగన్నం కరవా?

**తిరుగ** మరగిన కాలు, తిట్ట మరగిన నోరు ఊరకుండవు (ఊరకోవు).

**తిరునాళ్ళకు** పోతావా? తిండికి పోతావా?

**తిరునాళ్ళకు** పోతూ తీసిపొమ్మన్నారు, పెండ్లికి పోతూ పెట్టుకొని పొమ్మన్నారు.

తిరుపతికి పోగానే తురకదాసరి కాడు.

తిరుమణి పెట్ట నేరిస్తే తీర్థాలు గడచినట్లు.

తిరుమలయ్యాసలహో, తిరుపతి వెంకన్న మొక్కు.

తిలాపాపం తలో పిడికెడు.

త్రిదోషహారం తిప్పతీగ.

తీగంటి (తీగవంటి) బిడ్డంటే తేగ తెమ్మని ఏడ్చినదట!

తీగ్గె వంగనిది మానై వంగునా?

తీగ కదిపితే డొంకంతా కదులుతుంది.

తీగ కదిలిస్తే పొదంతా కదులుతుంది.

తీగకు కాయ బరువా?

తీగ తీస్తే (పట్టుకుంటే) పొదంతా కదలినట్లు.

తీగ పెట్టినమ్మమాట తీయగా, కమ్మ పెట్టినమ్మమాట కమ్మగా విచ్చుటాకులున్నమ్మా! నీమాట విన సహించదు అన్నదట! (పరమయోగివిలాసం 268 పేజి)

తీట ఉన్నవాడు (బట్టినవాడే) గోక్కుంటాడు.

తీటమ్మా! తీటమ్మా! నీనోస లేమయ్యింది అంటే తిరుమణి పెడితే పోక్కింది అందిట!

తీన్ తేరా, నౌ అఠారా.

తీటగలవానికి, తోటగలవానికి తీరిక ఉండదు.

తీతువపిట్ట కాళ్ళు పలక్రిందులుగ పెట్టి ఆకాశం పడకుండా చూస్తున్నానందట!

తీతువపిట్టరాయబారము.

తీపి ఏ దంటే ప్రాణము.

తీపులమాటలు కీపులు గుంజుతవి.

తీయగా తీయగా రాగము, మూల్గగా మూల్గగా రోగము.

తీయడం పెట్టడం తీపులచేటు, కనటం కూచోవటం నొప్పులచేటు.

తీయనినోర చేదు మేసినట్లు.

తీయని రోగాలు, కమ్మని మందులు.

తీర్థం, స్వార్థం కలిసివచ్చినట్లు.

తీసినవారు బాగానే ఉంటారు, తీయించుకున్నవారు బాగానే ఉంటారు,
ఎదురైనవారికి తగులుతుంది ఎమసుమిత్తి.

తుంటిమీద కొడితే పళ్ళు రాలాయట!

తుంపురుల పసేగాని మంత్రాలపస లేదు.

తుడుము తుడుము అంటే దురాయి దురాయి అన్నట్లు.

తుడుముకాడి (దగ్గఱ) నుంచి దేవతార్చనదాకా (వఱకు) ఒక టేమాట.

తుద కబ్బెరా తురకభాష.

తుపాకి కడుపున ఫిరంగి పుట్టినట్లు.

తుమ్మతో పుల్లో కొత్తకోలాట.

తుమ్మదుడ్డువలె, కాపుకదురువలె.

తుమ్మి తుమ్మలేదన్నట్లు.

తుమ్మితే ఊడిపోయే తమ్మయ్యముక్కు.

తుమ్మితే ఊడే ముక్కు ఎన్నాళ్ళుంటుంది? (దగ్గితే నిలుస్తుందా?)

తుమ్ముకు తమ్ముడు, ఆవులింతకు అన్న.

తుమ్ము తమ్ముడై చెప్పును.

తురకదయ్యము మంత్రించినట్లు.

తురకదాసరికి ఈతమజ్జిగ.

తురకలసేద్యం (పె) పరికెలపాలు.

తురకరొట్టెకు తిరుగు లేదు.

తురకలు కొట్టగా చుక్కెదురా?

తురకలు తప్పిన ఈదులలో, మేకలు తప్పిన తుమ్మలలో.

తురకలేని ఊళ్ళో దూదేకే ముల్లా.

తురకలేని ఊళ్ళో దూదేకే సయద్ మియా.

తురకవీధిని సన్యాసిభిక్షవలె.

తురకాదూదేకుల పొత్తులో మురిగీ మర్దార్.

తురాయి పెట్టినవాడి కొలువు, పరాయివాడిపాన్పు.

తులము నాలుకకు తొంభై రుచులు.

తులసి కోటలో (వేదికలో) ఉచ్చపోసినావేమిరా! అంటే యజ్ఞవేదిక అనుకున్నాను అన్నాడట!

తులసి వనములో గంజాయి మొక్క వలె.

తులువనోటి కులవపస్సు.

తుళ్ళే ఎద్దే గంత (గోనె) మోసేది.

తువ్వాన వేసిన ఎరువు, బాపనికి పోసిన నెయ్యి.

తూగి ముందుకు పడదు, తాగి వెనుకకు పడడు.

తూట్లు మూసి తూములు తెరచినట్లు.

తూనీగ లాడితే తూమెడు నష్టం.

తూమెడు వడ్లు తూర్పారబట్టేటప్పటికి పసుము వడ్లు ఎలుకలు తిని పోయినవి.

తూర సందు లేదు, తోడ నోకడోలు.

తూరుపు తొమ్మిది, పడమట పది.

తూర్పున ఇంద్రధనుస్సు, దూరాన వర్షం (పోతే).

తూర్పున ఇంద్రధనుస్సు వేస్తే తుంగమడిలోను, పడమర ఇంద్రధనుస్సు వేస్తే బండమీదను పశువులను కట్టాలి.

తూర్పున కొఱ్ఱు వేస్తే పుక్కిటెద్దు అంకె వేయును.

తూర్పున తెర వేసింది, తుంగభద్రలో దొడ్డి కట్టరా గొల్లాడాఅన్నట్లు,

తూర్పున వఱదగూడు వేస్తే తుంగపోచయినా తడువదు.

తృణము మేరువు, మేరువు తృణము.

తెంపుల తాళ్ళు, చిల్లుల కడవ.

తెగించి దానం చేస్తాను తేరా పిడికె డాళ్ళు అన్నట్లు.

తెగించినదానికి సగుడు మోకాలిబంటు.

తెగించినవాడికి తెడ్డే ఆయుధము.

తెగించినవాడికి తెడ్డే లింగం.

తెగించినవెనుక పోయినంత తెలివితక్కువ లేదు.

తెగితే లింగడు తాయి.

తెగిన గాలిపటంవలె.

తెగినచేను తేమ నోర్చును.

తెగువదారికి తేలు కుట్టితే తెల్లవార్లు కోడి కూసిందట !

తెగువ దేవేంద్రపదవి.

తెగేదాకా బిగించకూడదు.

తెచ్చుకుంటే భోంచెయ్యి జగన్నాయకా ! లేకుంటే ఊరకుండు జగన్నాయకా !

తెడ్డుండగా చేయి కాల్చుకున్నట్లు.

తెడ్డుండగా చే యెందుకు కాల్చుకోవాలి ?

తెడ్డు ఏదీ అంటే కొయ్య ఏదీ అన్నట్లు.

తెడ్డు కేమి తెలుసు కూరలరుచి (పాకంగుణం).

తెడ్డు నాకి ఉపవాసం మానినట్లు.

తెడ్డు నాకి వ్రతము చెఱచినట్లు.

తెల్లు వదలిన జీడలు వదలుతాయి.

తెల్లని వన్నీ పాలా ? నల్లని వన్నీ నీళ్ళా ?

తెల్లబియ్యం ఖరాసోల.

తెల్లబియ్యము, పాటి పానిక.

తెల్లవారి లేచినందుకు దోవ తప్పినందుకు సరి.

తెల్లవారితే ఎల్లవారమ్మల బ్రతుకు ఒకటే.

తెల్లవాళ్లు సరసాలాడినా, గొల్లవాడే పుట్టె.

తెల్లారితే చూడు ఎల్లాయి బతుకు.

తెలికవానికి నువ్వు పండినట్లు.

తెలియని దయ్యముకన్న తెలిసిన దయ్యము మేలు.

తెలివి ఒకరిఅబ్బసొమ్మా తోటపుసుబ్బమ్మా!

తెలివి ఒకరిసొమ్మా గొల్లగురవమ్మా!

తెలివి ఒకరి సొమ్మా బెస్తగురమ్మా!

తెలివి ఒకరిసొమ్మా సాలె బోసనమ్మా!

తెలివికి తల లేకపోయినా భోజనానికి పొట్ట ఉన్నది.

తెలివికి మూలం, తెచ్చెర ఘోరం.

తెలివి తక్కువ, ఆకలి ఎక్కువ.

తెలిసి తెలిసి బొందను పడ్డట్టు.

తెలిసినవానికి తెలకపిండి, తెలియని (కానని) వానికి గానుగపిండి.

తెలిసినవారికి ముందరనే ఉన్నది మోక్షం.

తెలిసేవఱకు బ్రహ్మవిద్య, తెలిస్తే కూసువిద్య.

తెలిస్తే తెలకపిండి, తెలియకపోతే గానుగపిండి.

తెలుగుపిల్లకు, తేలుపిల్లకు చావు లేదు.

తేనె అంతా ఒకచోట, తెట్టె అంతా ఒకచోట.

తేనె ఉన్నచోట ఈగ లుంటాయి.

తేనెటీగలకు తీసుబడి లేదు (లేనిపని).

తేనెటీగ తేనె తెరవరి పాలు.

తేనెతుట్ట పున్నానికి పూత, అమావాస్యకు ఆరగింపు.

తేనె పోసి నూరితే వేపనార తీయగా ఉండునా ?

తేభ్య మెక్కడ తెత్తునయ్యా ! తెల్లవారింది.

తేమాసం తెగబారెడు.

తేరగాడి కేమిరా తెల్లజొన్నకూడు (నూక)?

తేరగా వచ్చినది తినితిని మాతమ్ముడూ ఒక డున్నాడు అన్నట్లు.

తేరగుఱ్ఱం, తంగెడు బఱికె.

తేరసొమ్ము బీరపీచు.

తే రుండేదాకా తిరునాళ్ళు.

తేరుతీసిననాటి తీర్థంవలె.

తేలుకు ఎవరు అపకారం చేసినారు ?

తేలు కుట్టిన దొంగవలె.

తేలు పుట్టి చలిపురు గయినట్లు.

తేలుకు పెత్తనం ఇస్తే తెల్లవార్లు అంట పొడిచిందట ! (తెగకుట్టిందట !)

తేలుమంత్రం రాకున్నా పాముపడగపై చేయి పెట్టినట్లు.

తేలు వచ్చిందంటే తీసుకరావో (వే) మగవారిని అన్నాడట !

తే లేనయ్యకు తిండి మెండు, వండలేనమ్మకు వగపులు మెండు.

తేళ్ళలో కొండి, పాములలో పడగ.

తొంగున్న సుంకరీ ! తలమూటు దింపుమన్నట్లు.

తొండకు తోట సాక్షి.

తొండకు వెలుగు సాక్షి.

తొండికి లేచిన మొండికుక్క దాని కింత రొట్టెతునక.

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు.

తొందరకు ఆలస్యం మొగుడు.

తొందరగా రమ్మంటే తిరుగమోత వేసి వస్తా నన్నట్లు.

తొంభైతొమ్మండుగురు పోగై తోలు చితకపొడిచారట !

తొక్కలేనమ్మ తొక్కులో నీళ్ళు పోసిందట !

తొక్కినా కదవపోకతే బురదతొక్కురా అన్నట్లు.

తొడ గిల్లి తొట్ల నూచినట్లు.
తొడబలం ఉంటే తొంభైమంది.
తొత్తుకింద తొత్తు, దొప్పకింద దొప్ప.
తొతుక్క బొల్లి మేక.
తొత్తుకింద బడితొత్తు.
తొత్తుకు సివ మెత్తిన మ్రొక్కక తీరునా ?
తొత్తుపురాత, కత్తికొత్త.
తొత్తువలె పాటుపడి, దొరవలె తిరుగవలె.
తొట్టె మెచ్చింది ఉప్పుపిండి.
తొలకరిని చెరువు నిండినా, తొలిచూలు కొడుకు పుట్టినా లాభం.
తొలకరివానలు మొలకలకు తల్లి.
తొలిఏకాదశికి తొలితాటిపండు.
తొలిగండం తప్పితే తొంభైఏళ్ళ ఆయుస్సు.
తొలిపెండ్లాం తోటకూర, మలిపెండ్లాం మామిడిపండు, మూడవ పెండ్లాం ముంతమామిడిపప్పు.
తొలిసమర్తకే గూద దిగింది.
తొలుతపిల్లకు తొంబది అంగీలు, మల్తపిల్లకు మాకు దొడగలేదు.
తోకకు తొంభై, నాకు సలభై.
తోక తెగిన నక్కవలె.
తోక త్రొక్కిన త్రాచువలె.
తోక మెదులుతూందే పిరికిలంజా !
తోక లేదుగాని హనుమంతునంత బంటు.
తోకలేని గాలిపటంవలె.
తోకవద్దు పంట, నెన్నుకోత నేస్తం.
తోకవెంట పెరుమాళ్ళు అన్నట్లు.

తోక వెంబడి నారాయణా అన్నట్లు.

తోచీతోచనమ్మ తోడికోడలు చెల్లెలి పెండ్లికి పోయిందట !

తోచీతోచనమ్మ తోడికోడలుపుట్టినింటి కెడితే అదీ తోచనమ్మ ఆడ బిడ్డ అత్తగారింటికి వెళ్ళిందట !

తోచీతోచనమ్మ తోడికోడలుపుట్టినింటికి వెడితే చూచీచూడనట్లు చూశారట !

తోట కావర్షం, దూడ కాగడ్డి.

తోటకూరకు కడిగిపెట్టిన ఎసరే చాలును.

తోటకూరనాడైనా చెప్పవైతివిరా కొడుకా ! అన్నట్లు.

తోట మూడు మూరలు, కాయ ఆరు బారలు.

తోటలమీదివారికి, పేటలమీదివారికి మొగమాట ముండదు.

తోటిపిల్లను తోడేలు వేసుకపోతే అమడపిల్ల కచ్చివచ్చినదట !

తోటివాడు తొడ గోసుకుంటె నేను మెడ గోసుకుంటాను.

తోడంగ తోడంగ తోడెంగ దొరికె.

తోడున్న తోంబది తడవలు.

తోడు లేక వెళ్ళనిది రాచపీనుగ.

తోడేలును గొఱ్ఱెలను కాయ బెట్టినట్లు.

తోరణములేని పెండ్లి, పేరణములేని బాజాలు.

తోలు తీయకుండానే తొనలు మింగినట్లు.

తోళ్ళు కొరికేవాడు పోతే బొమికలు నమిలేవాడు వస్తాడు.

త్రోవ దొరతన మెఱుగదు.

త్రోవ దొరతన మెఱుగదు, నిద్ర సుఖ మెఱుగదు.

త్రోవను పోయే దోకడు, దొబ్బులు దినే దోకడు.

త్రోవలో పెట్టి తొక్కేవురా జాణా అన్నట్లు.

తౌడు తింటూ ఒయ్యారమా ?

తౌడు తిన్నా మూతి తుడుచుకున్న ట్లుండాలి.
తౌడు తినే తాసీల్దారుకు మీసా ల్లేబట్టే మాసూల్దారు.
తౌడు తినేవానికి మీసా లెగబట్టేవా డొకడు.

—::—

## ద

దంచలేనమ్మ ఊదూన మూచిందట !
దంచే దొకరు, చక్క లెగరేసే దొకరు.
దండమయ్యా బాపనయ్యా ! అంటే మీతండ్రినాటి పాతబాకీ (అప్పు) ఇచ్చి పొమ్మన్నాడట !
దండమయ్యా అయ్యవారూ ! అంటే తంబూరా అక్కడ పెట్టమన్నాడట !
దండించే దాత లేకుంటే తమ్ముడు దండప్రచండుడు.
దండిపైరు పంటకు రాదు.
దండీ అమావాస్యకు వాన తాడు తెంపుకొని పోతుంది.
దండుకు మంచం వాల్చగలమా ?
దండుకు పోయినవాడిపెళ్ళాం ఎక్కడ ఉన్నా ముండే.
దండుగకు రూపాయలూ, శద్దినానికి కూరలూ పోగుకాకుండాపోవు.
దండుగకు ఒప్పుదురుగాని పండుగ కొప్పరు.
దండుగలో పండుగ.
దండులో గుండు పడితే ఎవనిఆలి ముండయినా మోయనీ.

దండులో గుండు పడితే ఎవనాలి ముండమోస్తుందో !
దండులోనికి పోతే రెంటిలో ఒకటి.
దండు పెడదాము అంటే వండుకతిని పెడదాము అన్నట్లు!
దంపినమ్మకు బొక్కిందే కూలి.
దంపుళ్ళపాటకు దండుగ లేదు.
దంపుళ్ళపాటకు దరిద్రం లేదు (దరిద్రమా ?).
దగ్గఱకు పిలిచి దాసరీ! నీకన్ను లొట్ట అన్నట్లు.
దగ్గఱకు వస్తే ఎగ్గు లెంచినట్లు.
దగ్గఱున్నవారు దొగ్గలికూరకు కొఱ గారు.
దగ్గఱకు పోతే దొగ్గలకూరకైనా కొఱ కారు.
దగ్గఱవాళ్ళకే దగ్గు లెక్కువ.
దగ్గితే నిలువని ముక్కు తుమ్మితే ఏపాటి గాను ?
దగ్గితే నిలువని ముక్కు తుమ్మితే నిలుస్తుందా ?
దగ్గుతూ పోతే శాంతి ప్రియము.
దగ్గు, సిగ్గు దాచినా దాగవు.
దత్తతమీఁదా ప్రేమ, దాయాదిమీఁద ప్రేమ.
దత్తుడికి ధనము నిలువదు.
దప్పిగొని బావి త్రివ్వినట్లు.
దబ్బరపాటకు తలత్రిప్పటలు మెండు.
దమ్మన్న దాడి, పొమ్మన్న పోదు.
దమ్మిడీ ఆదా లేదు, క్షణం తీరిక లేదు.
దమ్మిడీకల్లు తాగి ఊరంతా ఉమ్మినట్లు (గంతులు).
దమ్మిడీ పెళ్ళికి ఏగాని బోగము మేళము (౦).
దమ్మిడీ పెళ్ళికి రూపాయి బాణసంచా.
దమ్మిడీ ముండకు ఏగానీ క్షవరము (౦).

దయగల దేవరా ! నామగని పెదకి వానిని పట్టు, నన్ను పట్టకు.
దయగల మొగుడు దండుకు పోతూ రోలు తీసి రొమ్మున వేలవేసి పోయాడట !
దయ తలచి దాహ మిస్తే ఊళ్లో కెళ్ళి ఉడుకు అన్నట్లు.
దయ తుట్టు మంటే నెత్తి చుట్టు మంటుంది.
దయతో దండాలు పెడితే పడవేసి బందాలు పెట్టినట్లు.
దయ దండిది, గుణం మొండిది.
దయ లేని అత్తకు దండం పెట్టినా తప్పే.
దయ్యపు కంటికి పెలగింజ పెద్ద (వేంగెము).
దయ్యము కొట్టనూ, బిడ్డ బ్రతికనూ.
దయ్యము పట్టినప్పుడే చెప్పుతో కొట్టాలి.
దయ్యానికి బిడ్డలు బ్రతుకునా ?
దయ్యాలతో నెయ్యాలు చేసినట్లు.
దరిద్రానికి దైవకొండాటకము.
దరిద్రుడికి పిల్ల లెక్కువ.
దరిద్రుడికి ఏ రేవు వెళ్ళినా ముళ్ళపరిగే.
దరిద్రుడు చేను పెడితే వడగండ్లవాన.
దరిద్రుడు తలగడిగితే వడగండ్లవాన వచ్చిందట !
దరిద్రునికి దైవమే తోడు.
దరిద్రుని చేనికి వడగండ్లవాన.
దరిద్రుని పెళ్ళికి వడగండ్లవాన.
దరిద్రుని సంగీతానికి భూమ్యాకాశాలే తాళపుచిప్పలు.
దరిలేని బావి, దాపులేని కొంప.
దరిలేని బావి, వితరణలేని కీవి.
దర్జీవానిని చూచిన సాలెవానికి కోపము.

దలారికి దండుగభయం, మశీదుకు దొంగభయం లేదు.
దవాలు కోరువాడు కందూరు చేస్తే తిన్నవరకు నమ్మిక వుండదు.
దశకొద్దీ దొరికాడు దిసమొలమొగుడు.
దశకొద్దీ దొరికాడు పుసికళ్ళ మొగుడు.
దశదానాలకు తోటకూరకట్ట.
దశా దశా రావే అంటే దరిద్రాన్ని పిలువ మన్నదట!
దక్షిణపుకొమ్ము హెచ్చు, ధాన్యపుధర హెచ్చు, ఉత్తరపు కొమ్ము హెచ్చు, ఉప్పుధర హెచ్చు.
ద్రవ్యం దాచినవాడికే తెలుసు, లెక్క వ్రాసినవాడికే తెలుసు.
దాగబోయి తలారిఇంట్లో దూరినట్లు.
దాగబోయి తలారిఎదుట దాగినట్లు.
దాగబోయినచోట దయ్యాలు పట్టుకొన్నట్లు.
దాచినాను మగడా! వేరుండ మన్నట్లు.
దాత లిచ్చిన పాలుకంటె ధరణి ఇచ్చిన పాలు మేలు.
దాదితొమ్మున, దూదిపాన్పున.
దానమయితే ఇవ్వలేనుగాని దండుగయితే పెట్టగలను అన్నట్లు.
దానము చేసిన ఆవుకు దవడపళ్ళు ఎంచబోకు.
దానము చేసే చేయి దాగబోదు.
దానం చేయకున్నా దక్షిణం తలజేసి పండాలి.
దానాలలో కెల్ల నిదానం మంచిది (మేలు).
దాన్ని నమ్ముకొని ధర్మవరం పోతే అది పోయి బుక్కపట్టణం చేరిందట!
దాగా దండుగేకాని దమ్మిడీపని కాదు.
దాపున గుడి కట్టితే దూరాన వర్షం (ము).
దాయకట్టనిఆవు తన్నకమానదు.
దారికి సుంకం చెల్లించ మన్నట్లు.

దార్రిద్ర్యానికి సానువుపంట.
దారిని పోయే తద్దినమా! మాయింటికి రా అన్నట్లు.
దారిని పోయే తగులాటాన్ని దాపుకు కొని తెచ్చుకొన్నట్లు.
దారిని పోయే మారెమ్మా! మాయింటిదాకా వచ్చిపో అన్నట్లు.
దారిలో దొరికింది, ధర్మానికి పోయింది.
దాలిగుంటవారు తామరగుంటకు, తామరగుంటవారు దాలిగుంటకు వచ్చినట్లు.
దాసర్లా? జంగాలా? ముందూయనుబట్టి.
దాసరితిప్పు దండంతో సరి.
దాసరితిప్పలు దైవాని కెఱుక.
దాసరిపాటకు ముష్టి ముజరా.
దాసరిపాట్లు దైవాని కెఱుక.
దాసికొడుకైనా కాసు కలవాడు రాజు.
దాసునిపాట్లు పెరుమాళ్ళ కెఱుక.
దాష్టీకానికి ధర్మం లేదు, గుడ్డికంటికి చూపు లేదు.
ద్వారపూడి వచ్చేపువాడువలె.
దిక్కు లేని ఇంట్లో దయ్యాలు కాపురం చేస్తాయి.
దిక్కు లేనివారికి దేవుడే దిక్కు.
దిగంబరసన్యాసికి చాకలితో అవసర మేమి?
దిగితేగాని లోతు తెలియదు, తింటేగాని రుచి తెలియదు.
దిగుదిగు మనే నాసవితేగాని, దిగే నాసవితి లేదు.
దిగులుపడితే వెతలు తీరునా?
దినదినగండం నూరేం డ్లాయుస్సు.
దినము మంచిదని తెల్లవాఱ్లు దొంగిలబోయినట్లు.
దిబ్బాలమ్మకి దీపం పెడితే, పందిమగడు వచ్చి పడదోసిపోయె.

దిమాకిఎక్కినవాడు దిక్కులు చూస్తే పలాకిఎక్కినవాడు ప్రక్కలు చూచినాడట!

దివాలుకు దిక్కులేదు, అంబటిలోని కుప్పు లేదు.

దివిటీముందు (క్రింద) దీపంవలె దీపం (పెట్టినట్లు).

దివ్వెతీసిన గూడువలె.

దిసమొలవాడా! కాళ్ళకట్టువాని కప్పు మన్నట్లు.

దిసమొలవానిని దిగంబరుడు బట్ట అడిగినట్లు.

దిష్టికి దిగదుడుపు.

ద్విపదకావ్యము, ముదిలంజె, దిడ్డికంత (ఒకటి).

దీపము ఆరినతరువాత దినుసంతా ఒకటే.

దీప ముండగా (నే) ఇల్లు చక్కబెట్టుకోవాలి (వలెను).

దీప ముండగా నిప్పుకు దేవులాట.

దీపము (ం) పేరు చెబితే చీకటి పోతుందా?

దీపము (ం) ముడ్డికింద చీకటి.

దీపాన వెలిగించిన దివిటీ.

దీపావళికి దీపమంత చలి.

దీవాలుకోరువానికి సద్ది గడితే బ్రోడాయికాడనే భోజనం చేసినాడట!

దీవించువారు ఏం డ్లేల ఇస్తారు?

ద్వీపావళివర్షాలు ద్వీపాంతరాలు దాటుతాయి.

దుంగ దించి బండ నెత్తుకొన్నట్లు.

దుక్కి ఉంటే దిక్కు ఉన్నది.

దుక్కికొద్దీ పంట, బుద్ధికొద్దీ సుఖం.

దుక్కిగల భూమి, దిక్కుగల మనుజుడు చెడడు.

దుక్కిచలువే చలువ, తల్లిపాలే పాలు.

దుక్కిటెద్దుచావు పక్కలో పెళ్ళాంచావు.

దుక్కిటెద్దు దేశాంతరం వెళ్ళినట్లు.
దుక్కిటెద్దు పోట్లాడి దూడకాలు విరిచినవట!
దుడ్డు అనగానే బుఱ్ఱ బద్ద లగునా?
దుడ్డుకు ఒక్కడైనా దూదేకులవాణ్ణి జీత ముంచుకోడు.
దున్న ఈనినదన్న దూడను కట్ట మన్నట్లు.
దున్నక చల్లితే కొయ్యక పండును.
దున్ననివానికి గుడ్డ ఎందుకు? ఏలనివానికి పెళ్ళి మెందుకు?
దున్నక వేసిన ఆముదాలు, ఆసాది కిచ్చిన అప్పు తిరిగి రావు.
దున్నగలిగితే మన్ను ముట్టవలెను.
దున్నంగ పోయి దులుపంగ వచ్చు.
దున్నదగ్గఱ వీణ వాయించినట్లు.
దున్నపోతు ఈనిందంటే చెంబు తేరా పాలు పితుకుదా మన్నట్లు.
దున్నపోతు ఈనిందంటే దూడను కట్టివేయండి అన్నట్లు.
దున్నపోతు ఈనిందంటే దూడను కుడిపితిరా అన్నట్లు.
దున్నపోతు ఈనిందంటే దూడను కొట్టానికి కట్టండి అన్నట్లు.
దున్నపోతుమీద వాన కురిసినట్లు.
దున్నపోతులా గున్నావు, తేలుమంత్రం తెలియదా?
దున్నబోతే దూడలలోను, అమ్మబోతే ఆవులలోను.
దున్నబోతే దూడలలోను, మేయబోతే ఆవులలోను.
దున్నబోతే దూడలలోను, ఎన్నబోతే ఎద్దులలో.
దున్నలా కష్టపడి దొరలాగున తినవలె.
దున్నిన పొలానికి, తాగిన గంజికి సరి.
దున్నుతూఉంటే నాగళ్ళు, పారుతూఉంటే నీళ్ళు.
దున్నే ఎద్దునే పొడిచేది (కొట్టేది).
దున్నేరోజులలో దూరదేశం పోయి కోతరోజులలో కొడవలి పట్టి వచ్చినాడట!

దున్నేవాళ్ళకు వేళ్ళు చూపించినట్లు.

దున్నేవాడు లెక్క చూస్తే నాగలికూడా మిగులదు.

దుబ్బు కాగెడు, వెన్ను మూరెడు, దూసితే దోసెడు, ఊదితే ఏమీ లేదు.

దుమ్ము పోసి అంబలి కాచినట్లు.

దురాశ దుఃఖంచేటు.

దుర్మార్గానికి తండ్రి బద్ధకము (ం).

దువ్వాను చూచి నక్క యొడలు కాల్చికొన్నట్లు.

దుష్టుని చూచి దూరంగా ఉండమన్నారు.

దుర్యోధనుని మర్మాస్త్రం ఉండబట్టి, ధర్మరాజు ధర్మం వన్నెకు వచ్చింది.

దూకు దూకు అనే నావాళ్ళేగాని దూకే నావాళ్ళు ఒకటీ లేదు.

దూడంత దుఃఖము, పాడి అంత సుఖము లేదు.

దూడ ఉంటేనే పాడి పశువు పనికి వస్తుంది.

దూడ కుడిచినట్టా? దుత్తలో పడ్డట్టా? (దుత్త నిండినట్టా)?

దూడ కుడిస్తేగాని ఆవు చేపదు.

దూడ కుడుచుకుంటేగాని దుత్త నానదు.

దూడకు తెంపమా దంటు కొరకను?

దూడ చస్తే కర్మలం, గేదె చస్తే నిర్మలం.

దూడ పాలు దుత్తకే ఆయె.

దూడ, బత్తె ఉండగా గుంజ అరచిన దన్నట్లు.

దూడ మేసి గంటసేపైనా దురిసెండ్ల నడకమాత్రం పోలేదు.

దూడలేని పాడి దుఃఖపుపాడి.

దూదేకులవాడికి తుంబతెగులు.

ధూంబర తిండికి తూమెడు, మానవతికి మూనెడు.

దూబరతిండికి దూండ్లు బతకవు, ఆణిముద్దకు ఆండ్లు బతకవు.

దూరపుకొండలు నునుపు.

దూరాన గుడి కడితే దగ్గఱవాన, దాపున గుడికడితే దూరాన వాన.

దూరదండం కోటిలాభం!

దూరేవి దొమ్మరిగుడిసెలు, చేసేవి గంగాస్నానాలు (మాఘస్నానాలు).

దూరేవి దొమ్మరిగుడిసెలు, చేసేవి శివపూజలు.

దూలం పెట్టేచోట నుద్దుకోలు పెట్టినట్లు.

దూస్తే దోసెడు, ఊదితే హుళక్కి.

దెప్పె ఎక్కినట్లు, దేవుడికి మొక్కినట్లు.

దెబ్బకు దయ్యం జడుస్తుంది.

దెబ్బకు దేవేంద్రలోకం కనపడుతుంది.

దెసబత్తెలవానికి బరిబత్తలవాడు బావమరది.

దేవతలకు దుమ్ము, రాక్షసులకు సున్న.

దేవరచిత్తం, దీనుడి భాగ్యం.

దేవు డిచ్చునేగాని తినిపించునా?

దేవుడిపెళ్ళి కందలు పెద్దలే (పెత్తందార్లే).

దేవు డిస్తాడుగాని, వండి, వార్చి, వాత కొడుతాడా?

దేవుడు చెఱుపని ఇల్లు దేవాంగి చెరిపాడు.

దేవుడు తెలిస్తే దెబ్బలకు కొడువా?

దేవుడులేని ఊళ్ళో మంచపుకోడే పోతరాజు.

దేవుడులేని జాతర సాగుతుందా?

దేవుడు వర మిచ్చినా పూజారి తలుపు తీయడు.

దేవుడు వర మిచ్చినా పూజారి వర మీయడు.

దేవునికి చూపులు, మనకు మేపులు.

దేవునికి ముడుపు, దెయ్యానికి మంత్రం.

దేశభాషలందు తెలుగు లెస్స.

దేశము ఎవరు ఏలుతున్నా, ధాన్యం దంచితేనే బియ్యమవుతాయి.

దేహము నీటిబుగ్గవంటిది.

దేహీ అంటే నాస్తి అనరాదు.

దొంగలండీ అంటే ముక్కు కరుస్తాడే అన్నట్టు.

దొంగ కందరిమీద అనుమానము.

దొంగకు చేనుపచ్చి లేదు.

దొంగకు తలుపు తీసి దొరను లేపెవాడు.

దొంగకు తేలు కుట్టినట్లు.

దొంగకు దొంగబుద్ధి, దొరకు దొరబుద్ధి.

దొంగకు దొంగ తోడు.

దొంగకు దొరికిందే చాలు.

దొంగకు దొరబుద్ధి, దొరకు దొంగబుద్ధి.

దొంగకూడా మనిషివంటివాడే.

దొంగగొడ్లకు గుదికఱ్ఱలు కట్టినట్లు.

దొంగగొఱ్ఱెకు గుండెనే లేదంటారు.

దొంగ చిక్కెనోయి అంటే గట్టిగా కట్టివేయమన్నట్లు.

దొంగచేతికే తాళంచెవి ఇవ్వాలి.

దొంగచేయి దోపన బెడితే, అమావాస్యనాడు అల్లలలాడినట్లు.

దొంగతల్లికి ఏడువ భయము (ం).

దొంగతోకూడ దయ్యం వెంబడే వచ్చును.

దొంగదాడికన్న లింగదాడి ఎక్కువ.

దొంగ దొరికెనోయి అంటే చేయి కఱచెనోయి అన్నాడట!

దొంగను దొంగ ఎఱుగును.

దొంగను దొంగ దోస్తే దావు లేదు, ఫిర్యాదు లేదు.
దొంగను దొంగ దోచుకున్న ధాత (దావు) లేదు, ఫిర్యాదు లేదు.
దొంగను పుట్టించినవాడు మతిభ్రష్టును పుట్టించకమానడు.
దొంగముఖము నలుపు.
దొంగలసొమ్ము దొరలపాలు.
దొంగలు తోలినగొడ్లు ఏ రేవున నాటినా ఒకటే.
దొంగలు దూరిన (కొట్టిన) (పోయిన) ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు.
దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినవట!
దొంగలూ దొంగలూ కలసి ఊళ్ళు పంచుకొన్నట్లు.
దొంగ వస్తాడని ముందు చెప్పిఉంటే సాక్షులను సంపాదించిఉందును.
దొంగవాకిట మంచం వేసినట్లు.
దొంగవాడిదృష్టి మూటమీదనే.
దొంగవాడి పెళ్ళాం ఎప్పుడూ ముండమోపే.
దొంగా మనిషీ.
దొంగాడా! కఱవకురా అన్నట్టు.
దొంగా! ముక్కు కోతికేవు?
దొంగిలబోతే మంగలం దొరికిందట.
దొంగిలించేటంత దొరతన ముండగా, అడిగేటంత అన్యాయానికి లోబడతానా?
దొడ్డిపోయేవానికో అక్కై ఒడ్డుకు పడవ పట్టించినట్లు.
దొడ్డినిండా గొడ్లు, ఇంటినిండా బిడ్లు (బిడ్డలు) ఇంకేమి కావల్ల (కావలె) ఇరకటానికి?
దొడ్డిలో సురధేను వుంటే గొడ్డును పితుకను కుండ గొంపోయినట్లు!
దొడ్డివాకిట దయ్యాన్ని తోలిపారేస్తే తలవాకిలి తెరుచుకొని తయ్యారయిందట!

దొడ్డెడుగొడ్లను దొంగలు తోలుకపోతే గొడ్డుగేదే శ్రీమహాలక్ష్మి
దొమ్మరోగానికి కొఱ్ఱిగంజి.
దొమ్మలన్నిటిలో మిడిదొమ్మ మిండడు.
దొరకనిపూలు దేవుని కర్పణ (దేవునికే పూజ).
దొరకినసొమ్ముకు దొంగవుతాడా ?
దొరకు తొంగోను మంచం లేదు, బంటుకు పట్టుపరుపు.
దొరను పేద అనరాదు, ఎద్దును సాధువు అనరాదు.
దొరల చిత్తం, తరుల నీడ.
దొరబిడ్డ యైనా ఒకనికి ఆలే.
దొరలు ఇచ్చిన పాలుకన్నా, ఘణి ఇచ్చిన పాలు మేలు.
దొరసానికి దుప్పటి లేదు, తొత్తుకు తోగరుచీర.
దొళ్ళతిండి దుడ్డెల తిండి కనరాదు.
దొఱికితే దొంగ, దొఱుకకపోతే దొర.
దోచుకున్నవాడు దొర, దొరకినవాడు దొంగ.
దోత్రం పెద్దదయితే గోత్రం పెద్దదా ?
దోమలు తగ్గితే (పడితే ?) చేనులు పండును.
దోనె చేయబోయి సోల చేశాడట !
దోరకజ్జం, రామానుజం పొడి.
దోవను పోయే దొకడు, దొబ్బులు తినే దొకడు.
దోవను పోయేపోయే దెవరయ్యా? అంటే దొబ్బులు తినే నేనయ్యా !
అన్నట్లు.
దోవలో కూర్చుండి దొబ్బులు తిన్నట్లు.
దోసకాతియలు తిన్నకడుపు, దొంగలుపడ్డ ఇల్లు ఒకటే.

— : : —

# ధ

ధ్వంసనారాయణుడితో కమతం చేస్తే పాలికి పందుం పల్లేరుగాయలు వచ్చాయట!

ధ్వంసపారాయణం, దంటుసుంట!

ధనము దాచినవానికే తెలియును, లెక్క వ్రాసినవానికే తెలియును.

ధనమునకు దాపరికము, సేద్యమునకు వెల్లడి.

ధనికునికి చెఱకుపంట, దరిద్రునికి నువ్వుపంట.

ధరకు దొర ఎవడు?

ధరతక్కువబంగారము దాటి ఎక్కువ.

ధర్మపురి దొంగిలబోతూ, ధార్వాడనుండి వంగుని పోయాడట!

ధర్మము తల కాచును.

ధర్మమే జయము, దైవమే బలము.

ధర్మానికి దండుగ లేదు, ట్టకి పైనా లేదు.

ధర్మానికి పట్టే ఇస్తే ఇంటి పసకలకు పోయి మూర వేసిందట!

ధరించిందే శాటి, వరించిందే బోటి.

ధార లేని తిండి దయ్యపు తిండి.

ధారోష్ణం, అమృతోత్తమం, దాచినాను మగడా! వేరుండ మన్నట్లు.

ధాష్టీకానికి ధర్మం లేదు, గుడ్డికంటికి చూపు లేదు.

ధీమడయినా కావాలి, దీనుడయినా కావాలి.

ధూపం వేస్తే పాపం పోతుంది.

ధైర్యం తల కాచును.

ధైర్యలక్ష్మి ధనలక్ష్మి.

ధైర్యంలేని రాజు, యోజ (చ) న లేని మంత్రి.

— : : —

# న

నంగతుంగ నీళ్ళకు పోతే నీళ్ళన్నీ ఒక రేవుకు వచ్చాయట!

నంగనాచిచీర నడివీధిలో ఊడిందట! (ఊడినట్లు).

నంగనాచి తంగబుజ్జి.

నంగనాచి వంగముల్లు.

నంగి పుట్టిన నాల్గవరోజు పుట్టినట్లు.

నంగీ! నమలక మింగవే అంటే ఉడికినచేపలు కరుస్తవి అన్నదట!

నందనవనములో కుందుగడ్డి పెరుగవచ్చును.

నందరాయనిభాగ్యము నక్కలకూ, కుక్కలకూ.

నందానమ్మలు బాగా పడితే నారాయణుని చూచినట్లే.

నంద్యాలవారికవిత్వం కొంత, నాపైత్యం కొంత.

నంది అంటే నంది, పంది అంటే పంది.

నందిని చెయ్యబోయి పందిని చేశాట్ట!

నందిని పంది, పందిని నంది చేసినట్లు.

నందిమొఖం, స్థాలీపాకం (హడావుడి).

నంది వంగలు మేస్తే నారికేళాలు పూడలు మేయునా?

నంబికవిత్వం, తంబళజోస్యం.

నంబి పెట్టినదే ప్రసాదము.

నంబివాడు ఎదురైనా, నాగుబాము ఎదురైనా కలిసిరాదు (చేటు వస్తుంది).

నంబివారికి, తంబళివారికి ఒకటే కుంచకోల అన్నట్లు.

నంబీ! నంబీ! నాపెండ్లి కేమి సహాయం చేస్తావంటే, నీపెండ్లికి నేను ఎదురు రాకపోవడమే అన్నాడట!

నంబి లింగయ్య, జంగం రంగయ్య.

నక్క ఒకచోట ఊళవేసి, ఒకచోట గౌరీకల్యాణము పాడునా?

నక్క ఎక్కడ ? నాక (గ) (దేవ) లోక మెక్కడ ?
నక్కకడుపున సింగము పుట్టునా ?
నక్కకు నవ్వు, ఎండ్రకాయకు గండం.
నక్కకూత నాకలోకం ముట్టునా ?
నక్క కూసి నాశనం తెచ్చు.
నక్క కూసి పిల్లలకు దోవ తెచ్చును.
నక్కకొమ్మున్నా నరులకు భయపడవలెను.
నక్కజిత్తు లన్నీ నావద్ద ఉండగా, తప్పించుకపోయెనే (రా) తాబేటి బుఱ్ఱ అన్నట్లు.
నక్కజిత్తులు నారాయణు డెఱుగు.
నక్కతోక పట్టుకొని నాకలోక మెక్కినట్లు.
నక్క నారాయణునికైనా నామము పెట్టును.
నక్కను చంపినవారు లేరు, కుక్కను తిన్నవారు లేరు.
నక్కను చూచినవాడెల్లా వేటకాడే.
నక్క పుట్టి నాలుగువారాలు కాలేదు, ఇంత గాలివాన (ఉప్పెన) ఎన్నడూ ఎఱుగను (ఎప్పుడు చూడలేదు) అందిట !
నక్క బోయిన వెనుక బొక్క కొట్టుకొన్నట్లు.
నక్క ముదిరితే వఱడు, మనిషి ముదిరితే పిశాచి.
నక్క ముదిరి వఱ డయినట్లు.
నక్క రేలకాయసామ్యం (రేలకాయ తినినట్లు).
నక్కలతో నక్కగా నటించవలెను.
నక్కలు మరవలు పాఱితే, కుక్కలు కూటి కొల్లవు.
నక్కలు ఎఱుగని బొక్కలు, నాగులు ఎఱుగని పుట్ట లున్నవా ?
నక్క వచ్చి కుక్కతోక సవరించినట్లు.
నక్కా ! నక్కా ! నానామం చూడు, తిరిగి చూస్తే తిరుమణి చూడు.

నగుబాట్లపెండ్లికి నాడే నాగవల్లి.

నగులు ముదిరితే తెగులు అవుతుంది.

నట్టింట ఉండి నాభాగ్య మంటే ఉట్టిమీదనుంచి ఊడిపడుతుందా ?

నట్టింటిలో విష్ణుమాయవలె.

నట్టేట గొనిపోయి పుట్టి ముంచినట్లు.

నట్టేటిలో చేయి విడిచినట్లు.

నట్టేటిలో పడ్డ సొమ్ము నట్టింటికి వచ్చినట్లు.

నడక నేర్చి, పరుగెత్తవలె.

నడచేకొద్దీ డొంక, పెట్టేకొద్దీ కుదురు.

నడచేదారిలో గడ్డి మొలవదు.

నడచేవాడే పడేది.

నడవడికలు చక్కబెట్టేది నాటకము.

నడవలేనమ్మకు నాలుగుపక్కలా సవారి.

నడుమంత్రపు దాసరి పొద్దుమాన మేలుకొడు.

నడుమంత్రపు వైష్ణవానికి (వైష్ణవునికి) నామాలు మెండు.

నడుమంత్రపు నరముమీద కురుపు (పుండు).

నడుమధ్య జేగీగి (?) కడాన పండుకొన్నట్లు.

నడుము ములిగేదాకా చలి, నలుగురు వినేదాకా సిగ్గు.

నత్తగుల్లలన్నీ ఒకరేవున, ముత్యపు చిప్పలన్నీ ఒకరేవున.

నత్తగుల్లలు ముత్యాలగునా ?

నత్తి నాలిగింటి కర్థం.

నత్తి నాలుగుదేశాలకు కత్తి.

నది నాల్గామడ ఉండగా, చీర విప్పి చేత పట్టుకున్నట్లు.

నన కూడి నార తల కెక్కినట్లు.

నన్ను ఎఱిగినవాడు లేకపోతే నాబడాయి ఘూడ మన్నట్లు.

నన్ను కొడితే కొట్టావుగాని మా బావను కొట్టు చూదాం అన్నట్లు.
నన్ను చూస్తే నిన్ను చూస్తా (కాస్తా).
నన్ను నేనే ఎఱుగను, నిన్ను నే నేమి ఎఱుగుదును ?
నన్ను పెంచితే నిన్ను ముంచుతా.
నన్ను ముట్టుకోకు (ముట్టబోకు) నామాలకాకి.
నపుంసకునిచెంతనా నవలాసరసత్వం !
నపుంసకునిచేతికి రంభ దొరకినట్లు.
నంబి, సాతాని, నాగుబా మెదురైన పోయినపని గాదు.
నములక, మింగక నాస వేసినట్లు.
నమాజు చేయబోతే మసీదు మీద పడ్డట్లు.
నమిలేవాడికన్న మింగేవాడు ఘనుడు.
నమ్మితి రామన్నా ! అంటే నట్టేటిలో ముంచుతాను లక్ష్మన్నా ! అన్నట్లు.
నమ్మితి రామన్నా ! అంటే నాఅంతవాణ్ణి చేస్తా నన్నట్లు.
నమ్మిన ఇమ్ము, నమ్మకున్న అమ్ము.
నమ్మిన ఎనుము పోతు అయ్యేను.
నమ్మి నడివీధిలో వేసినవా రెవరు ?
నమ్మి నానబోస్తే పులిసి బూరటిల్లింది (బూరటలాడింది).
నయ తెంతో బర్కు తంత.
నయ ముంటే భయ మేమి ?
నయము నష్టకారి, భయము భాగ్యకారి.
నయమున సూది దూరి, నా గేటినుండి దూరినట్లు.
నరకమునకు నవద్వారములు, నాకమునకు ఒక టే !
నరకములో కరుణ లేదు, నాకంలో మరణం లేదు.
నరకములో నారాయణు డుండునా ?

నరంవంటివాడికి జ్వరం వస్తే చేయి జూచినవాడు బ్రతకడు.
నరము కనిపెట్టి వాత.
నరములేని నాలుక నాలుగు విధాలు.
నర్మదలో మునిగినా కర్మము తప్పదు.
నరాలమీద పుండు, నడుమంత్రపుసిరి మాలావు తీపి.
నరుకలేనిబంటు కత్తి చులుకు లే దన్నట్లు.
నరునకు నరుడు, తరువుకు వేరు సహాయం.
నరునికంట (కండ్ల) నల్లరాయి బద్ద లగును.
నరునికి నాలుగంశలు.
నరునికి బద్దం లేదు, గుంజు గుంజు నడేటిలోనికి అందిట ! మొసలి.
నలసారము సంసారము.
నల్లకోడికైనా తెల్లగుడ్డే పుట్టును.
నల్లచీర కట్టినవాళ్ళంతా నాపెళ్ళాలే అన్నట్లు.
నల్లనివన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు.
నల్లనేలకు నువ్వులు, గట్టినేలకు కందులు.
నల్లపూసకు తెల్లపూసా, తెల్లపూసకు నల్లపూసా లేదు.
నల్లబాపడు నాభికంటె విషము.
నల్ల బాపనయ్యను, తెల్లమాదిగాణ్ణి నమ్మరాదు.
నల్లనిరాళ్ళు తెల్లవి కావు.
నల్లనివాడికి నాభిలో విషం.
నలిగిఉండినప్పుడు తొలిగిఉండ మన్నారు.
నల్లికాటు, నారిపోటు.
నల్లి నలిగిపోయిన చెత్తకాసము.
నల్లినిగూర్చి మంచానికి పెట్లు (బడితెబాజా).
నలుగురితో చావు పెండ్లితో సమానము.

నలుగురితోపాటు నారాయణా! కులముతోపాటు గోవిందా!
నలుగురు చేతులు వేస్తే గొడ్రాలికికూడా బిడ్డలు పుడుతారు.
నలుగురు నడిచిందే బాట, నలుగురు పలికిందే మాట.
నలుగురు నవ్వినట్లే ఉంది, నారుమాలు కుదిరినట్లే ఉంది.
నలు పుంటే తెలుపు మరీ తెలుపు.
నలుపు నాలుగు వంకరలు తీస్తుంది, ఎఱుపు ఏడువంకరలు దాస్తుంది.
నల్లులకు వెఱచి ఇల్లు విడిచినట్లు.
నల్లేరుమీద బండి నడచినట్లు.
నవరత్నము లున్నా నరరత్న ముండవలె.
నవాబంత దరిద్రుడు, పులిఅంత సాధువు.
నవాబుతల బోడి, నాతల బోడి అని విత్తంతు విఱ్ఱవీగినదట!
నవాబుపొట్టా, తమలపాకులకట్టా తడుపుతూ ఉండవలెను.
నవాబుసాతుల్లాఖాన్ అవ్వనాటిది అన్నట్లు.
నవ్వ చెప్పేవాడు చెడ చెప్పును, ఏడువ చెప్పేవాడు బ్రతుక చెప్పును.
నవ్వ లేనివారిని నమ్మరాదు.
నవ్వితే ఊడే ముత్తెము, తుమ్మితే ఉంటుందా ?
నవ్విన ఊళ్ళే నగరా లౌతాయి.
నవ్విన నాపచేను పండును.
నవ్వినవారిముందు జారిపడ్డట్లు.
నవ్వుకు నానార్థాలు.
నవ్వుతూ కోసినముక్కు ఏడ్చినా రాదు.
నవ్వుతూ చెయ్యడం, ఏడుస్తూ అనుభవించడం.
నవ్వుతూ తిట్టితివో నరకాన పడితివో!
నవ్వు నాలుగందాల నష్టం (చెరుపు).

నవ్వులతోటలో నాగులు తిరుగును.
నవ్వే ఆడుదాన్ని, ఏడ్చే మగవాణ్ణి నమ్మరాదు.
నష్టపడినా భ్రష్టు కారాదు.
నాంచారమ్మవంటు, నక్షత్రదర్శనము ఒక్కమారే.
నాఇంటికి నేను పెద్దను, పిల్లికి పెట్టరా పంగనామాలు అన్నట్టు.
నాకినమ్మకు నాలుక లేదు.
నా కిన్ని గంజిమెతుకులు పోయి, నీ కాకలికి మందిస్తాను.
నాకు ఆయుష్యమస్తు, నాకు ఆరోగ్య మస్తు.
నాకు కాదు, నాతలలో పేనుకు చెప్పు మన్నట్లు.
నాకు పరీక్షా, నారాగిచెంబుకు పరీక్షా.
నాకులకు లోకభయ మేల ?
నాకు సాగ సెందుకు ? బాగుం టే సరి.
నాకూ, పిల్లకూ నూరేం డ్లాయుస్సు, నాపెనిమిటికి లోకంతోపాటు.
నాకూ బెబ్బెబ్బేనా ? అంటే నీకు బెబ్బెబ్బే, నీఅబ్బకు బెబ్బెబ్బే అన్నాడట !
నాకూ లేదు, నీకూ లేదు ఊరుకో దేవరా !
నాకూ సిగ్గు లేదు, రేపు వచ్చే అమావాస్యకూ సిగ్గు లేదు.
నా కేకుక్కకు లింగ మేమి ? పాటవట్ట మేమి ? (పానవట్టము).
నాకోడి కుంపటీ లేకపోతే ఎట్లా తెల్లవారుతుందో చూస్తాను అందిట !
నాగరికంలేని మాట, నాలుకపై తీట.
నాగలి మంచిది కాకపోతే ఎ ద్దేమి చేస్తాయి ?
నాగలి వదలితే నాగరికం ముదురుతుంది.
నాగసముద్రంపిల్ల, నగారుమీంది పుల్ల.
నాగుబాము చిన్న దనవద్దు, పాలివాడు సన్న మనవద్దు.
నాచెయ్యి నొస్తుంది, నీచేతితో మొత్తుకో అన్నట్లు.

నాచెవులూ కంసాలే కుట్టాడు.
నాచేతిమాత్ర వైకుంఠయాత్ర అన్నట్లు.
నాజూకునక్కలు దేకితే నెరసినగడ్డం కుక్కలు పీకినవి.
నాటకం త్రొక్కిన కాలు రోసి రోటిక్రింద వేసినా ఊరకోదట!
నాటినపైరుకు నష్టం లేదు.
నాడినిదానం తెలియని మందు కీడు.
నాడు ఉంటే నవాబుసాహెబు, అన్నముంటే అమీరుసాహేబు.
నాడు బీదపడితే ఫకీరుసాహేబు, చస్తే పీరుసాహేబు.
నాడు కట్టా లేదు, నేడు చించా లేదు.
నాడు నిలువబడా లేదు, నేడు (ఎత్తుబడా) కూలబడా లేదు?
నాడు పోయి నే డొస్తే మగడా! నాతె ప్పేమి? చెప్పు.
నాడు లెంచేవా రేగాని గోడు చూచేవారు లేరు.
నాడు వ్రాసినవాడు నేడు చెరిపి మళ్ళీ వ్రాస్తాడా?
నాతిబలము నాలుకపైన.
నాథుడులేని రాజ్యము నానాదారులు.
నాద ముంటే గంట, వాద ముంటే తంట.
నాదయలో నీగంజి త్రాగు అన్నట్లు.
నాది కాదు, నాఅత్తసొమ్ము అన్నట్లు.
నా దెంత గడ్డం? ఉమ్మి వేసి గొరగ మన్నాడట!
నానబాలు పట్టమ్మా అంటే ఏచేనిసజ్జలు? అన్నదట!
నానాటికి తీసికట్టు నాగంభొట్లు.
నానారుచులు పారి నాలుకమీద కొరివి పెట్టుకొన్నట్లు.
నానినభూమి నవధాన్యాలు పండును.
నాన్చి నాన్చి వేస్తివో, నాకొంప తీస్తివో.
నాన్నుడుగాడు నాపెండ్లికి నేనూ వెళ్ళాలా అన్నట్లు.

నానోట్లో (నీవు) వేలు పెట్టు, నీకంట్లో (నేను) వేలు పెడతా నన్నట్లు.

నాపప్పు కలిసిం దంతా నేను (నేనే) తింటాను.

నాపాతివ్రత్యం నా మొదటిపెనిమిటికి తెలుసు.

నాభిలో పుట్టిన పురుగు నాభిలోనే పెరుగు.

నామం నాకొంప తీసింది.

నామము నియమముచేటు.

నామము హెచ్చిన కామము తగ్గునా ?

నామాట నమ్ముకోకు, నాలుగె డ్లమ్ముకోకు.

నామాట నమ్మింది నల్లకుక్క, ఏమాఱిపోయింది ఎ (వె) ఱ్ఱి కుక్క !

నాముందఱ నీ వేమి బ్రతకగలవు ? అన్నట్లు.

నాముందఱ బానెడు గంజా !

నా మొగుడికి నే రెండో పెళ్ళాం అన్నట్లు.

నా మొగనికి నాపైని ప్రాణం, నాకు తెచ్చెర మెడకోసం.

నాయనకు పెండ్లిసంబరము, అమ్మకు సవతిసంకటము.

నాయనమ్మ ఏం జేస్తుంది అంటే ఒలుకబోసి, ఎత్తుకొంటోంది అన్నట్లు.

నాయరాలంటే ఏకు లోడికి పోషిస్తాను.

నారతడుపని పారవేస్తే నాగుబామై కఱచిందట !

నారికి రెం డెల్లలు, తల్లికి రెండు పిల్లలు.

నారి తెగినా, నారి తెగినా అతకడం కష్టం.

నారు, నీరు, నోరు ఉంటే ఏరాజ్యంలో ఉన్నా ఒకటే.

నారుపోసిన దేవుడు (వాడు) నీరు పోయక మానడు (పోయడా) !

నాలిముచ్చువాణ్ణి, నీళ్ళు నమిలేవాణ్ణి నమ్మరాదు.

నాలుక ఉక్కుది కాకున్నా కత్తెరవలె కత్తిరించును.

నాలుక ఉన్నవాడు నాలుగు దిక్కులు తిరుగగలడు.

నాలుకకు ఎముక లేదు.

నాలుక తీపి, లోన విషము.

నాలుక తేనె, మనస్సు విషము.

నాలుక దాటితే నరకము.

నాలుకలో నారాయణా! చంకలో చురకత్తి.

నాలుకా! నాలుకా! వీపుకు దెబ్బలు తేకే.

నాలుగుఊళలు ఊనేసరికి నక్క నాంచారి అయింది.

నాలుగుఊళల పీశ పాతాళగంగ అయింది.

నాలుగు ఏర్లు, కుక్కకు తడుపు తడుపే!

నాలుగుకాళ్ళ జీవాలలో మేక మెత్తన, రెండుకాళ్ళ జీవాలలో కోమటి మెత్తన.

నాలుగు వర్షాలు కురిస్తే నత్తకాయ నాయరాలు.

నాలుగు వైపుల కదుళ్ళు, నలభైరోజులకు కోత.

నాలుగేళ్ళు నంజుకొని, నడిమేలు కొరుక్కొని.

నాళ్ళలోకెల్లా చిన్ననాడే మేలు.

నాసద్ది తెచ్చి నీఇడుపున పెట్టుకొని తినట మెందుకు?

నాసిరికన్న అక్కసిరి ఘనం, అక్కసిరికన్న నాసిరిఘనం.

న్యాయ మన్నువాడు, దోనలు దోచువాడు.

న్యాయము చెప్ప నాగిరెడ్డి! అంటే నాకూ ఇద్దరు పెళ్ళాలే అన్నాడట!

న్యాయము తప్పనివానికి ఆచార్యకటాక్ష మెందుకు?

నిగాదాసుని పెళ్ళం నీళ్ళ కొస్తుంది, సావిట్లోవాళ్ళు చాటుకు జరగండి అన్నదట!

నింగి సాయంత్రం మెఱ్ఱనయితే వచ్చేవానలుకూడ రావు.

నిట్టలు ద్రొక్కకు పిల్లా! అంటే నా మొగనికి నేను రెండో సంబంధం అన్నదట!

నిండా మునిగినవానికి చ లేమి? గా లేమి?

నిండినకడుపుకు అన్నం, బట్టతలకు నూనె.

నిండినకడుపు నిక్కి మాట్లాడును.

నిండినకడుపు నీతి వినదు.

నిండుకుండ తొణకదు.

నిండునది నిలిచి పాఱును.

నిండుబండికి చేట బరువు.

నింద లేనిదే బొంద (ది) పోదు.

నిక్కు నీలపల్లి, బ్రతుకు మాలపల్లి.

నిజ మాడితే నిష్ఠూరము.

నిజము కూలును, బొంకు పొసవు.

నిజము దేవు డెఱుగు, నీరు పల్ల మెఱుగు.

నిజమునకు నింద వచ్చునుగాని, అవమానము రాదు.

నిజము నిలుకడమీదగాని తెలియదు.

నిజము నీటిలో మునుగదు, నీటిలో కరగదు.

నిజ (మైన) జంకులానికి నిష్ఠలు బహుమెండు.

నిడుపులేక చిత్రము వ్రాసినట్లు.

నిత్యకల్యాణం, పచ్చతోరణ మన్నట్లు.

నిత్యదరిద్రుడు నిశ్చింతపురుషుడు.

నిత్యదుఃఖకి నిమిత్తము లుండవు.

నిత్యము లేనిమగడు నిత్యము బాస చేశాడట?

నిత్యమూ చచ్చేవాడికి ఏడ్చేవా డెవడు?

నిద్రపోయినవాడిగోచి మేలుకున్నవాడు పెట్టుకొన్నట్లు.

నిద్రపోయినవానికాళ్ళకు మొక్కినట్లు.

నిద్రపోయినవానిని లేపవచ్చునుగాని మేలుకొన్నవానిని ఎవడు లేప గలడు?

నిద్రరానివాడు క్షుద్రములు పన్నును.

నిద్ర సుఖ మెఱుగదు, ఆకలి రుచి ఎఱుగదు.

నిద్రించుతోడేలును లేపకు.

నిన్న ఉన్నవాడు నేడు లేడు.

నిన్న కుప్పా, నేడు ఆళ్ళు.

నిన్న చస్తే రేపటికి మూడు, నేడు చస్తే రేపటికి రెండు.

నిన్న పురుగు, నేడు పాము.

నిన్నా మొన్నా వచ్చిన అల్లునితల పగిలినందుకు కాక, పూర్వకాలపు రోకలి విరిగినందుకు ఏడుస్తున్నాను.

నిన్ను నమ్మి చచ్చినవారుకద్దా మహారాజా!

నిప్పుకు చెద లంటునా?

నిప్పు కొడితే రెండగునుకాని నీరు కొడితే రెండగునా?

నిప్పు త్రొక్కిన కోతివలె.

నిప్పుతో మండే బొగ్గు నల్లగా ఉండదు.

నిప్పున కాలదు, నీళ్ళను తడవదు.

నిప్పుపై నీరు చల్లి పొయి రాజవేయు.

నిప్పుకూ, నీళ్ళకూ ఉన్నంత స్నేహం.

నిప్పు ముట్టనిది చేయి కాలదు.

నిప్పు రాజినా, మొగుడు రాజినా ముండకే మూలుగు.

నిప్పులబుట్టకు నీళ్ళబుజ్జి.

నిప్పు లేనిదే పొగ రాదు.

నిప్పులో ఉప్పులాగ.

నిప్పులో నెయ్యి పోసినట్లు.

నిప్పులో మొలచినది ఎండకు చావదు.

నిమ్మకాయంత బంగారం లేనివారు కలరు.

నిమ్మకు నీరెత్తినట్లు.

నియోగజాతి నిమ్మకాయజాతి.

నియోగపుముష్టికి బనారసుసంచి.

నిరక్షరకుక్షి విరూపాక్షదీక్షితులవారికి ఇరువదియొక్క భక్ష్య మొక లక్ష్యమా?

నిర్ధనుడు మనుపీనుగ.

నిర్భాగ్యునకు నిద్ర, అభాగ్యునకు ఆకలి ఎక్కువ.

నిర్వ్యాహకమునకు నిమిషాలు చాలవుగాని, చెర్వ్యాకమునకు క్షణం పట్టదు.

నిలుకడ లేకుండా పని చేస్తే నిత్యదారిద్ర్యము.

నిలుకడలేనివానిమాట నీళ్ళమూట.

నిలుకడలేని లింగారెడ్డిపెళ్ళాం, కొప్పులో నిప్పెట్టుకొని కొరివిపెల్లి అంగడి వెళ్ళిందట!

నిలుచుండడానికి జాగా దొరికితే, కూర్చుండడానికి అప్పుడే దొరుకుతుంది.

నిలువ నీడ లేదు, పట్ట కొమ్మ లేదు.

నివాళిపళ్లెములు పట్టేవాళ్ళంతా నిషేకముహూర్తానికి వస్తారా?

నివురు కప్పిన నిప్పువలె.

నిశ్చితార్థమునాడే నీల్గవలసింది, నాగవల్లిదాకా ఉండడం నాఅదృష్టం కాదా?

నిశీథినిమాట నిద్రతో సరి.

నిష్ఠ నీళ్ళపాలు, మంత్రం మాలలపాలు.

నీఎడమ చెయ్యి తియ్యి, నాపుర్రచెయ్యి పెడతాను అన్నట్లు.

నీకంట్లో వేలెడుతా, నానోట్లో వేలెట్టు.

నీకు ఆయన ఏమి కావలెను? త్రోవలో పోతే వారు కావలెను.

నీకు ఎక్కడ సంశయమో, నాకూ అక్కడే సందేహం.

నీకు ఒకదండం, నీబువ్వ కొకదండం.

నీకు రానిది, నేను విననిది, లోకములో లేనిది చెప్పు మన్నట్లు.

నీకూ, నాకూ కాదంటే రోలెక్కి తల(బ్రాలు పోయు మన్నట్లు.

నీచుకాడ చూడరా పాచుగాడిగుణం.

నీటికి కలువ, మాటకు చలువ.

నీటికి నాచు తెవులు, మాటకు మాట తెవులు.

నీటికొలది తామర.

నీటిముంపున్నా పల్లమే చేయాలి.

నీటిలో కప్ప నీరు తాగిందీ, లేనిదీ ఎవరు చూస్తారు ?

నీటిలో గేదెను పెట్టి బేర మాడినట్లు.

నీటిలో జాడలు తీసినట్లు.

నీడ బాగున్నదిగాని ఎఱ్ఱచీమలు నిలువ (బతక) నీయవు.

నీతలమీద తే లున్నదంటే నీచేతితోనే తీసివేయు మన్నట్టు.

నీతిలేనివాడు కోతికన్నా పాడు.

నీతే లోకానికి జ్యోతి.

నీదయా, నీదయా, నిర్దయా.

నీదున్నడంలో ఏ ముంది ? ఉండేదంతా నాచల్లడంలో ఉంది.

నీపత్తుపణం పాడుగాను, నాఒకు (వరి ?) పణం కుప్పలు పెట్టు.

నీపప్పూ, నాపొట్టూ ఊదుక తిందాం అన్నట్లు.

నీపెండ్లాం ముండమోస్తే నీకు ఎవరు అన్నం వండిపెడతారు? అన్నట్లు.

నీపెండ్లి నాగుడ్డులా వుంది, నా పెండ్లికి వచ్చి కాగడా (మషాల్జీ) వెయ్యి అన్నట్లు.

నీపెండ్లి పాడు, నాపెండ్లి తాంబూలానికి రమ్మన్నాడట !

నీపెండ్లి పాసుగూల (గాల) నాతద్దినం చూడ మన్నట్టు.

నీపై ఎస లేదు, నాపై ఎస లేదు, ఏడుసేర్ల తప్పేల కెసరు పెట్టమను.

నీపేరంటమే అక్కఱలే దంటే కరకంచుచీర కట్టుకొని వస్తా నందట !

నీబత్తెగొడ్డును ఎవరు కాస్తారు ? చూస్తాము అంటే నాతిత్తిలోని డబ్బే కాస్తుంది అన్నాడట !

నీబిచ్చానికి ఒకదండముకాని నీబేపిని కట్టెయ్యి.

నీమం (నియమము ?) కోసం నాసుం పెడితే నామం నాయిల్లు (నా కొంప) తీసింది.

నీమగనికి రాగిపోగులే అంటే నీమగనికి అవీ లేవే అందట !

నీముక్కున చీమిడేమమ్మా అమ్మా అంటే, ఆచేతితోనే అటు తుడిచి పొమ్మన్నదట !

నీముష్టికి దండంగాని నీకుక్కను కట్టెయ్యి.

నీరధికి నీరు మోసినట్లు.

నీరు ఉంటే ఊరు లేదు, ఊరు ఉంటే నీరు లేదు.

నీరు ఉంటే నారు ఉండవలె.

నీరు ఉంటే పల్లె, నారి ఉంటే ఇల్లు.

నీరు ఉన్నచోటనే బురద.

నీరు కట్టువాడు తనమడి ఎండబెట్టుకోడు.

నీరు కట్టువాడు బావిలో పడ్డట్టు.

నీవగలమాటలకు నామగని చంపుకుంటి.

నీఱు గప్పినయట్టి నిప్పుకమాడ్కి.

నీ రుండేదాకా మీను మిట్టిపడుతుంది.

నీరు నీరువంకనే పాఱును.

నీరు, నూనె కలుస్తాయా ?

నీరు పల్ల మెఱుగు, నిజము దేవు డెఱుగు.

నీరుల్లి నీటిలో కడిగితే కం పేమ పోవును ?

నీరులేనిచోట ఊరేల ?

నీరులేనితావున మెట్ట అని ఇల్లు కట్టుకున్నట్లు.

నీరులేని పైరు, నూనెలేని జుత్తు.

నీలి నీళ్ళకు పోతే, నీరు లోతుకు పోయింది.

నీలిమాటలు, గాలిమాటలు.

నీళ్ళలో నిప్పు పెట్టి కాలకుంటే కడుపు కొట్టుకొన్నట్టు.

నీళ్ళలో నిమ్మలు బ్రతికినవి, అడవిలో తుమ్మలు బ్రతికినవి.

నీళ్ళలో మునిగినవానికి నిప్పుభయం లేదు.

నీళ్ళానిచేతికి నిధానము లాటవు.

నీవు ఒకందుకు పోస్తే, నేను ఒకందుకు తాగుతున్నాను.

నీవు చచ్చినరోజూ లేదు, నేను ఏడ్చినరోజూ లేదు.

నీవు వస్తే లోకమంతా బొమికలా ? (ఎముకలా ?)

నీవు దంచు, నేను పక్క తెగిరవేస్తాను.

నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష !

నీవు పెట్టకపోయినా పెట్టే ఇల్లు చూపెట్టు అన్నట్లు.

నీవు వెడితే బూతులు తిట్టి వస్తావు, నేను వెడితే అమ్మని ఆలిని తిట్టి వస్తాను.

నీ వెక్క నీ వెక్క లోనే బండి వెళ్ళిపోయింది.

నీసాకు చట్టుబండలు కాను, నాలుగు జేనులు బేక వున్నాడట !

నీపోకే సొత్తాకు, నీముఖమే బీరాకు, నాసంత చూడబోకు, నా కసలే చిరాకు.

నుదుట వ్రాయనిదే నోట పలుకదు.

నుదురు బత్తుడు, నోరు తోడేలు.

నుయ్యి తియ్యబోతే దయ్యము వెలువడింది.

నుయ్యి దాటేవానికి చింతాకంత కడమైనా కడమైనట్లే.

నువ్వుకు నూరురోగాలు (తెగుళ్ళు).

నువ్వు చస్తే బొబ్బర్లు.

నువ్వులకు ఏడు దుక్కులు, ఉలవకు ఒక దుక్కి.

నువ్వులకు తగ్గ నూనె.

నువ్వులు నూనె ఒకటి, గాండ్ల (గానుగ) వాడు వేఱు.

నువ్వులు వేసి ఆవాలు వెదకినట్లు.

నూకల కేడ్చి యేడ్చి, తవుడు కేడ్చినాడట!

నూకలకు మేకలు కాచినట్లు.

నూకల సంకటికి నూనెధార!

నూకలు చల్లిన కాకులకు కొదువా?

నూటికి ఒక్కటి చెల్లుమాట.

నూటికి నూలుపోగు, కోటికి గోవుతోక.

నూటికి నూలుపోగు, కోటికి గోదానము.

నూటికి పెట్టి కోటికి గొరిగించినట్లు (కోరినట్లు).

నూటికి పొడిచి సెలగె అనినట్లు.

నూటివఱకు నన్ను కాపాడితే తరువాత నిన్ను కాపాడుతా.

నూతి పడెదవా? పాతర పడెదవా?

నూతికప్పకు సముద్రము చేరువా?

నూతిదరి చేరి నోట గొణిగితే ఊట వస్తుందా?

నూతిలో నీ రుంటే తోడుకోవాలిగాని తనంతట తానే పైకి వస్తుందా?

నూతిలో పడబోయి తాప వెదకినట్లు.

నూతు లుండి చేదలు లేకపోయినా, చేద లుండి నూతులు లేక పోయినా బతుకలేము.

నూనె అన్నము తిని నూతికి కాళ్ళు జాపిందట!

నూనెకుండ మరి దేనికీ రాదు.

నూనె కొలిచిన గిద్ద జిడ్డు కాదా ?

నూనెతో మండే దీపం నువ్వులతో మండునా ?

నూనెపోకడే కాని బిడ్డ బ్రతుకదు.

నూనెలేని వత్తి నిమిషంలో కాలును.

నూనె వచ్చేటప్పుడు గానుగ విరిగిందట !

నూరి భరించలేనమ్మ తాగి ఏమి భరించును ?

నూరుఅప్పడాలకు ఒకటే సొడ్డు.

నూరుఆవులలో ఒకఆవు ఈచుకపోతే ఆ క్షేమి ?

నూరు కల్లు లాడి (అబద్ధా లాడి) అయినా ఒకఇల్లు నిలుపవలెను.

నూరు కాకులలో ఒకకోకిల ఏమి చేయును ?

నూరుకొరడాదెబ్బలకు ఒక బొబ్బట్టు.

నూరు గుఱ్ఱాలకు అధికారి, ఇంటి భార్యకు ఎండుపూరి.

నూరుగుడ్లు తిన్న రాబందుకు ఒకటే గాలిపెట్టు.

నూరు గోవిందలు పెట్టవచ్చు, ఒకదాసరికి పెట్టడం కష్టం.

నూరుతిట్లయినా ఒకబొబ్బట్టుముక్క కాదు.

నూరు తిట్టినా ఒకగుమ్మడికాయ ఇస్తే సరి.

నూరునులకతాళ్ళు ఒకబండిమోకు కావు.

నూరునోములు ఒకఅంకుతో సరి.

నూరునోములు నోచి ఒకఅంకు పోయినట్లు.

నూరుపూసలకు ఒకకొలికి.

నూరుమంది గుడ్డివాళ్ళు నూతిన బడితే కన్నున్నవా డొకడు గడ్డకు ఎత్తును.

నూరుమంది మొండిచేతులవాళ్ళు (గుడ్డివాళ్ళు) పోగై గొడ్డుగేదెకు పాలు పితికినట్లు.

నూరుమందిలో నూనెబిడ్డ ముద్దు.

నూరుమాటలు (ఒక) వ్రాతకు ఈడు కావు.
నూరువరహాలకు నూలుపోగన్నట్లు.
నూలుబట్ట నూరేండ్లు కడతావూ ?
నెగడాశేగాని మొగుడాశ లేదు.
నెత్తికాలనిది బోలె (జోలె) నిండదు.
నెత్తిన తలగుడ్డ పెట్టుకొని ఇల్లంతా వెతకినట్లు.
నెత్తిన నోరుంటే పెత్తనం వస్తుంది.
నెత్తినమూటకు సుంకమూ ? (సుంక మడిగినట్లు).
నెమరువేసి నములవలె.
నెమలికంటినీరు వేటకానికి ముద్దా ?
నెమలి కూసినట్లు పికిలి కూయఃబోయి పిత్తుక చచ్చిందట!
నెమలిని చూచి నక్క నాట్య మాడినట్లు.
నెయ్యానికైనా, కయ్యానికైనా సాటి ఉండాలి.
నెయ్యి అని అరచును, నూనె అమ్మును.
నెయ్యి అని తాగకూడదు, నూనె అని తలకు పూసుకోకూడదు.
నెరజాణ నేర ననును, నేర్చు ననువాడు నిందపా లగును.
నెలకు మూడు వానలు, నిండారుపంటలు.
నెల తక్కువైనా రాజుఇంట పుట్ట మన్నట్లు.
నెల తక్కువైనా మగపిల్లవాడే మేలు.
నెలబాలుడికి నూలుపోగు.
నెలువుదొంగ ప్రాణంచుట్టు.
నెల్లూరి నెఱజాణలు, రావూరి రసికులు.
నేడు గంత వేసి రేపు ఎక్కినట్లు.
నేడు నవ్వు. రేపు ఏడ్పు.
నేడు నిప్పు, రేపు నీరు.

నేతగాడి కేలరా (నేసేవాని కేలరా) కోతిపిల్ల?

నేతికుండ నేలకు కొట్టి ఉత్త (వట్టి) కుండను ఉట్టిమీద పెట్టినట్లు.

నేతికుండపై ఎలుకవలె.

నేతిగూన (భాన) (గిన్నె) చేత బూని నిచ్చెన ఎక్కినట్లు.

నేతిబీరకాయ సామ్యము.

నే నాడేదే బండిసిడి ఆట, మాపెదబావ చూస్తాడంటే ఎలా?

నేను పట్టుకున్నానుకానా? నేను విసరుతున్నానుకానా?

నేను పుట్టకపోతే నీకు పెండ్లామే లేకపోవును అంటే నీవు పుట్టకపోతే నీతల్లినే పెళ్ళాడిఉందు నన్నాడట!

నేను మందు తింటూ, నీవు పథ్య ముండు అన్నట్లు.

నేను లేకపోతే ఎవణ్ణి పెళ్ళాడుదువు?

నేనూ ఒకపొద్దే, నామగడూ ఒకపొద్దే, పిండీబియ్యం లేక పిల్లలూ ఒకపొద్దే.

నేనూ బండెద్దునే అని గుద్దకు పేడ రాసుకొన్నట్లు.

నేములు కాచిన భూములు పండును.

నేరక నేరక నేరేళ్ళు తినబోతే నేరాలు ఒడిగట్టినట్లు.

నేర్చి చెప్పినమాట నెరవాదిమాట.

నేర్చిన బుద్ధి పర్చినా (కాల్చినా) పోదు.

నేర్చి బ్రతికినవాడు, నేరక చెడ్డవాడు లేడు.

నేర్పుగలమ్మ నేతితో అతిరసములు కాలిస్తే ఓర్పుగలమ్మ ఒడిలో గట్టుకొని పోయిందట!

నేరేళ్ళు నగ్గేది, మారేళ్ళు (మామిళ్ళు) మగ్గేది మంచికాలానికి లక్షణము.

నేరేళ్ళు పండితే నేలలు పండును.

నేలది తీసి నెత్తికి రుద్దుకొన్నట్లు.

నేల మెత్తనిదని మోచేత త్రివ్వినట్లు.
నేల విడచిన సాము, తాళ మిడిచిన పాట.
నేల విడిచి సాము, నీరు విడిచి ఈత.
నేసేవాణ్ణి నమ్ముకొని పాలిమేరజగడం ఒప్పుకోవద్దు.
నైజగుణానికి, గుడ్డికంటికి మందు లేదు.
నొచ్చినవాడా నువ్వులు చల్లు?
నొచ్చి నొసట పలుకదు, వచ్చినవాని విడువదు.
నొప్పు లెత్తుకున్నప్పుడే మంత్రసానికి చెప్ప సందు.
నొయ్యకుండా చేస్తే కొయ్యకుండా పండును.
నొసటను కళ్ళు లేవు, నోట్లో పళ్ళు లేవు.
నొసట నామాలు, నోట బండబూతులు.
నొసట వ్రాసినవ్రాలు (వ్రాత) చెరిపే దెవరు?
నొసటి వ్రాత నోట పలికిస్తుంది.
నొసలు బత్తుడు, నోరు తోడేలు.
నోచినవారి సొమ్ములు నోమనివారికి వస్తాయా?
నోట చక్కెర, కడుపులో కత్తెర.
నోటి ఆయి రొమ్ముకు దిగులుతుంది.
నోటికీ, చేతికీ ఎంగిలి లేదు.
నోటికి తీపు, ముడ్డికి చేటు.
నోటికి తీపి, పొట్టకు చేటు.
నోటికి మీరిన కడి మింగరాదు.
నోటిజిగటేగాని, చేతిజిగట లేదు.
నోటితో లే దనేది చేతితో లే దంటే సరి.
నోటి వట్టం, (కం) గంజి పెడపూట.
నోరంతా పళ్ళు, ఊరంతా అప్పు.

నోరా! వీపుకు దెబ్బలు తేకే.

నోరు అంబాలపు (అప్పాలపు) పండు, చెయ్యి బలుసుముల్లు.

నోరు ఉంటే ఊరు ఉంటుంది.

నోరు ఉంటే పోరు గెలుచును.

నోరు ఉంటే రాజ్య ముంది.

నోరు ఉండిన కొడుకు బ్రతుకును.

నోరు ఉన్న తల గాచును.

నోరు ఉన్నవాడిదే రాజ్యము.

నోరు చేసే అఘాయిత్యానికి ముడ్డి ఉందిగనుక భరిస్తోంది.

నోరు కల్లలపుట్ట, పేరు హరిశ్చంద్రుడు.

నోరు చక్కెర, హృదయం కత్తెర.

నోరు నవ్వడం, నొసలు వెక్కిరించడం.

నోరు పెట్టుకొని (నో రెట్టుకుని) గెలవవే ఊరగంగానమ్మా!

నోరు పొగడడం, నొసలు వెక్కిరించడం.

నోరు మంచిదయితే, ఊరు మంచి దవుతుంది.

నోరు మాడ్లాడుతుంటే, నొసలు వెక్కిరించినట్లు.

నోరు మూస్తే మూగ, నోరు తెఱిస్తే ఱాగ.

— : : —

# ప

పంగనామాలు నాకొంప తీశాయి.

పంచపాండవు లంటే మంచపుకోళ్ళవలె ముగ్గురు కాదా అని రెండు వ్రేళ్ళు చూపించాడట!

పంచశుభం, పంచాశుభం.

పంచాంగాలు పోతే నక్షత్రాలు పోతాయా?

పంచాగ్నిమధ్యమం దున్నట్లు.

పంచినవాళ్ళకు పళ్ళు నోవు.

పంచె (పంజ) కేలరా పత్తిధర?

పంటకు పెంట, వంటకు మంట.

పంటపాచి పోయిన యింటిహీనం పోతుంది.

పంట పెంటలో ఉన్నది, పాడి పూరిలో ఉన్నది.

పండనిఏడు పాటు ఎక్కువ.

పండనినేల పందుంకంటే పండేనేల కుంచెడే చాలు.

పండనినేల పుట్టెడుకంటే పండేనేల పందుం చాలు.

పండ్ల చెట్టుకింద ముండ్లకంప ఉన్నట్టు.

పండా? కాయా?

పండించేవాడు పస్తుంటే పరమాత్మకూ పస్తే.

పండితపుత్రుడు శుంఠ.

పండితమ్మన్యునకు పాదుకాపట్టాభిషేకము (ం).

పండినా, ఎండినా పన్ను తప్పదు.

పండుకోసం పోతే చెట్టు మీద విరిగిపడ్డట్టు.

పండుగగడచిన పాచివలె.

పండుగతొలినాడు గుడ్డలకఱవు, పండుగనాడు అన్నముకఱవు, పండుగ మఱునాడు మజ్జిగ కఱవు.

పండుగనాడుకూడ పాతపెళ్ళామేనా ?
పండుగనాడు బువ్వ కరువు, పండుగ రేపనగా బట్ట కరువు.
పండుగనాడుకూడ పాత మొగుడేనా ?
పండుగపైన దండుగ.
పండు జారి పాలలో పడ్డట్లు.
పండుటాకును చూచి పసరాకు నవ్వినట్లు.
పండ్లు ఉన్నవానికి పప్పులు లేవు, పప్పులున్నివానికి పండ్లు లేవు.
పండ్లు పోయిన తల్లి చచ్చినట్లు, కండ్లు పోయిన తను చచ్చినట్లు.
పండ్లు చెట్లకు భారమా ?
పండేపంట పైరులోనే తెలుస్తుంది. (తెలియును).
పంతులకు కట్నాలు, మాకు పట్నాలు.
పంది ఎంత బలిసినా నంది కాదు.
పంది కేమి తెలుసురా పన్నీరువాసన ?
పంది కేలరా పన్నీరుబుడ్డి (గిండి) ?
పందికి పాడు లేదు, తవిదకు తప్పు లేదు.
పందికొక్కును పాతన బెడితే ఉంటుందా ?
పందిగా పదేండ్లు బతికేకన్నా నందిగా నాలుగేండ్లు బతికితే చాలు (మేలు).
పందిని నంది, నందిని పంది చేసినట్లు.
పందిని పొడిచినవాడే బంటు, కందం చెప్పినవాడే కవి.
పందిలాగ కని పరగళ్ళమ్మట (పరగళ్ళవెంట) వదలినట్లు.
పందిపాతఅప్పులు తీరుస్తుంది, కోడి కొత్తఅప్పులు తీరుస్తుంది.
పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా ?
పంది రాజుగారూ! పందిరాజుగారూ! ఏం చేసి వస్తున్నా రంటే వారిదీ వారిదీ తినిపించి వస్తున్నా నన్నట్లు.

పందిరి ఇల్లు కాదు, పరదేశి మొగుడు కాదు.
పందిరి పడి చచ్చినవారు, ఇల్లు పడి బతికినవారు లేరు.
పందిరే పర్వతము, ఇల్లే ఇంద్రలోకము.
పండుము తిన్నవాడే పదిముక్కలు దున్నగలడు.
పండును తిన్నా పరగడుపే, ఏదుం తిన్నా ఏకాదశే.
పండులు తినేవానిపక్కనే ఏనుగులు గుటకేసేవాడుంటాడు.
పకపక నవ్వేవాడు, గబగబ అరచేవాడు కపట మెఱుగరు.
పక్కఇంటిపోరు పండుగంత వేడుక.
పకీర్లను కొట్టి పఠానులకు పెట్టు.
పక్షికి పాశుపతము తొడిగినట్లు.
పగగలిగి బ్రతకటం, పాముున్నఇంట్లో బ్రతకడం ఒకటే.
పగటి మాషాల్చీకి (దీపం పట్టేవాడికి) అనుమతి ఎవ్వరిచ్చారురా?
అంటే నాఅమ్ముదఫుచేను ఇచ్చిందన్నాడట!
పగటిమాటలు పనికి చేటు, రాత్రిమాటలు నిద్రకు చేటు.
పగడము లేని ఇల్లు, జగడము లేని యిల్లు ఉండవు.
పగబట్టిన త్రాచు కాటు వేయకమానునా?
పగలు కొంగు లాగితే ఛీ అంటట! రాత్రి చీకటిలో కన్ను గీటాడట!
పగలు చస్తే వాతికి లేదు, రాత్రి చస్తే దీపానికి లేదు.
పగలు చూస్తే రాత్రి కలలో వస్తుంది అన్నట్లు.
పగలు పప్పేసిన పయ్యెంకుకు పగులు పెండ్లామా? నిత్యబూరెలు
చేస్తే నిన్నెందుకు కొడుదు? పెండ్లామా!
పగలు తల్లి, రాత్రి భార్య అన్నట్లు.
పగలు దానిగుణం చూచి రాత్రి దానివెంట వెళ్ళాలి.
పగలునిద్ర పనిచేటు, మాపుజాగరణ పైచేటు.
పగలు పక్క చూచి మాట్లాడు, రాత్రి అదీ మాట్లాడవద్దు.

పగలు పట్టుకుంటే దిక్కు లేదు, రాత్రి కనుకుంజ్జ.
పగలు పాతర లుండవు.
పగలు రేచీకటి, రాత్రి హుటూహుటి.
పగలెల్లా బారెడు నేసినాను, దివ్వె తేవే దిగ నేస్తాను అన్నట్లు.
పగవానింట పడి బిచ్చాలు పోయినా పోయిసవేను.
పచ్చగా ఉంటే పదిమంది బంధువులు.
పగవాణ్ణి పంచాంగ మడిగితే మధ్యాహ్నానికి మరణ మన్నాడట !
పగలు బట్టలే కన్పించకున్న మాపు గొత్తెలు కన్పిస్తాయా ?
పచ్చగా ఉంటే పారాడేది, వెచ్చగా ఉంటే వెళ్ళిపోయేది.
పచ్చగా ఉన్నదగ్గఱ మేసి వెచ్చగా ఉన్నదగ్గఱ పండు.
పచ్చజొన్నపైరు, గోంగూర.
పచ్చడము నెడల్పున పదికట్టి లున్నా పైరు చెఱుపకు.
పచ్చడ మున్నంత కాళ్ళు చాచు.
పచ్చనివరహాకంటే పుచ్చినగింజ మేలు.
పచ్చనిపందిట్లో పట్టుకున్న పిశాచి ఎక్కడికీ పోదు.
పచ్చనిపైకము గుఱ్ఱము చచ్చినదాకానే.
పచ్చిఆకు వరికి అచ్చివచ్చే ఎరువు.
పచ్చికంకులు దాసరీ! అంటే రాలినకాడికి గోవిందా! అన్నాట్ట !
పచ్చికాయ తుంచిన పం డవుతుందా ?
పచ్చికాయను పండవేస్తే ఫల మవుతుందా ?
పచ్చివెలగకాయ గొంతులో పడ్డట్లు.
పట్టణానికి పోయిన గాడిద పల్లెకు పోయిన గాడిదను కఱచిందట !
పట్టపగలు కన్నం వేస్తా వేమిరా (దొంగతనం ఏమిరా) అంటే నా కడుపుకక్కుర్తి నీ కేమి తెలుసును ? అన్నాడట !
పట్టపగలు చుక్కలు పొడిపించినట్లు.

పట్టినది చింతకొమ్మ కాని ములగకొమ్మ కాదు.

పట్టినదెల్లా బంగారం, ముట్టినదెల్లా ముత్యం.

పట్టినవాడు పరిగపిల్ల అంటే పట్టనివాడు మట్టపిల్ల అన్నాడట!

పట్టిపట్టి పంగనామం పెడితే గోడచాటు కెళ్ళి గోకేసుకున్నాడట!

పట్టి విడిచిన మండ, పాతర బెట్టిన బండ.

పట్టి విడిచిన మండ, మబ్బు విడిచిన ఎండ, మగడు విడిచిన ముండ.

పట్టి విడుచుటకంటె ప్రాణం విడుచుట మేలు.

పట్టిసం తీర్థానికి పత్తిగింజలంత మామిడికాయలు.

పట్టుకొన్నవాడు తాబేలు అంటే గట్టునున్నవాడు కుందేలు అన్నట్లు.

పట్టుకొన్నవాడు పరిగ అంటే పైనున్నవాడు జెల్ల అన్నాడట!

పట్టుకొన్నవాడు మట్టగిడస అంటే పైనున్నవాడు జెల్లకొంక అన్నాడట!

పట్టుకొమ్మను నరుకుకొన్నట్లు.

పట్టుచీర (బట్ట) ఎర విచ్చి, పీటలు పట్టుక తిరిగినట్లు.

పట్టు వట్టరాదు, పట్టి విడువరాదు.

పట్టుపీతాంబరం కట్టుకొన్న పలకపీట చంక బెట్టుకోవాలి.

పటేలువారి వడ్లపుణ్యాన, మాయత్త ముష్టిపుణ్యాన తింటినమ్మా! పుంటి కూర మెతుకులు.

పట్టెడుబొట్టుంటే పదిలక్షలు.

పట్నం పోయి పుట్నంగింజ తెచ్చాడు.

పఠానులకు నేను బాకీ, పక్కీరులు నాకు బాకీ.

పడగ చుట్టం, పాము పగ.

పడగ పగ, తోక చుట్టం.

పడతులబుద్ధి పెడతల ఉంటుంది.

పడమట కొఱడు వేస్తే పాడుగుంటలన్నీ నిండును.

పడమట కొఱ్ఱు ఒడ్డితే (వేస్తే) పందిళ్ళమీద రాజనాలు పండును.
పడమట కొఱ్ఱు వేస్తే పాడిఆవు ఈంకె వేయును.
పడమట పావురాపిట్టంత (పూరేడుపిట్టంత) మేఘం నడిస్తే పాతాళం
బద్దలగునంత వర్షం.
పడమట పూరేడుపిట్టంత మొయిలు మేస్తే బండలు దొర్లించేటంత
వాన.
పడమట ప్రొద్దు కుంకితే తూర్పున లేవదా ?
పడమట మెరిసిన పదిగడియలకు వర్షం.
పడమట మెరిస్తే పందిఅయినా నీళ్ళకు దిగదు.
పడమటివీధిఅమ్మ సరిగ పెట్టకుంటే ఉత్తరవీధిఅమ్మ ఉరి పెట్టుకుందట !
పడవ ఒడ్డు చేరితే పడవవానిమీద ఒకసొడ్డు.
పడ్డచోటే వెతుకుకోవాలి.
పడ్డవారు చెడ్డవారు కారు.
పడిన గోడలు పడ్డట్టుండవు.
పడిశము పదిరోగాలపెట్టు.
పడి లేస్తే పాతరలోతు తెలుస్తుంది.
పడుకున్నవాడిపుట్టగోచి నేలుకున్నవాడు పెట్టుకొన్నట్లు.
పడుకోవడం పాతగోడలలో, కలవరింతలు మిద్దెటిండ్లలో.
పడుచుకున్న ఇల్లు తుడుచుకపోతాది.
పడుచుగుంట, కడుపుమంట.
పడుచుపొందు ఫలం లేదు.
పడుచుల కాపురం, చిదుగుల మంట.
పడుచునేద్యం పాకానికి రాదు.
పడుచుతో సయ్యాట, పాముతో చెలగాట.
పంతులు, గింతులు, పావుశేరు మెంతులు, ఎగరేసి కొడితే ఏడు
గంతులు.

పంతులుకు కట్నాలు, మాకు పుట్నాలు.
పడుచుతో పశువులు ఉంచేనే వ్యవసాయం.
పడు పడుమనే సవతేగాని పడే నాసవతి లేదు.
పండాకు రాలుతుంటే పసరాకు నల్లబడుతుంది.
పణ్యారం పట్టు దాసప్పా! అంటే ఏచేనిసజ్జలు అన్నాడట!
పతిభక్తి చూపిస్తాను పాడుగట్టా! (మగడా) చెప్పులు తే, నిప్పులు తొక్కుతాను.
పత్తికి పదిచాళ్ళు, ఆముదాలకు ఆరుచాళ్ళు.
పత్తికి పదిచాళ్ళు, జొన్నకు ఏడు.
పత్తిగింజలు తింటావా? బసవన్నా! అంటే ఆహా అన్నాడట!
పత్తిగింజల గంత కట్టనా? బసవన్నా! అంటే ఊహూ అన్నాడట!
పత్రి దేవునిమీద, భక్తి చెప్పులమీద.
పత్రిలేని పూజ, పత్రంలేని అప్పు.
పథ్యం చెడరాదు, సత్యం తప్పరాదు.
పథ్యంలేని మందు పాడుమందు.
పదము తప్పినా ప్రాస తప్పరాదు.
పద మొకబానిస, రాగ మొకరంభ.
పదలంనూలుపాగా లేనిది పంతులు కాడు.
పద్మరాగాలగనిలో గాజుపెంకు లుంటాయా?
పద్మాసనం వేసి కూచుంటే పరమాన్నం వడ్డిస్తారా?
పదిఆమడలవర్షంతో పరగడగుజ్జం పరుగెత్తలేదు.
పదికాకులలో కోకిల.
పది పణములకన్న పదిఎకరములు మేలు.
పదిభక్ష్యాలు తినే లక్ష్మయ్యకు ఒకభక్ష్యము లక్ష్యమా?
పదిమంది కలవాడు కొండయినా పండిస్తాడు.

పదిమందికలవాడు పందఅయినా సేద్యం చేస్తాడు.

పదిమంది కలవానిదే పాటు.

పదిమంది చేరిన పని పాడు.

పదిమందితో చావు పెండ్లితో సమానము.

పదిమంది నడచింది బాట, పదిమంది పలికింది మాట.

పదిమందిలో పడ్డ పాము చావదు.

పదియవనాటి ముత్తైదువవలె.

పదిరాళ్ళు వేస్తే ఒకరాయైనా తగులదా?

పది వేస్తే పచ్చిపులుసు, లేకపోతే ముండపులుసు.

పదిసార్లు చోటు ఫిరాయించిన చెట్టు కాయదు.

పదుగు రాడు మాట పాటియై ధర చెల్లు.

పదను తప్పినా, అదను తప్పినా పన్ను దండుగే.

పందుము తిన్నా పరగడుపే, ఇద్దుము తిన్నా ఏకాశే.

పనసపండులో మామిడిపండ్ల రస ముండునా?

పనసకాయ దొరికినప్పుడే తద్దినం పెట్టాలి.

పనసపండు తెచ్చి పళ్ళెంలో పెడితే తినలేని బ్రాహ్మణుడు దిక్కు-దిక్కులు చూశాడట!

పని అంటే నాబళ్లు భారంగిస్తుంది, బువ్వంటే నాబళ్లు పొంగివస్తుంది.

పనికి పరాకు, తిండికి బహుపరాకు.

పనిగలవాడు పందిరి వేస్తే కుక్కతోక తగిలి కూలిపోయిందట! (కూలబడెనట!)

పనిగలవారింట్లో పైసా (స) ల పట్లాట, పనిలేనివారింట్లో పాపోసుల పట్లాట.

పని చేయనివాడు ఇంటికి దొంగ, పన్నివ్వనివాడు దివాణానికి దొంగ, పని చేయనివానికి ప్రగల్భా లెక్కువ.

పని తక్కువ, ప్రాకులాట ఎక్కువ.

పని పాతర బెట్టి జాతరకు పోయినట్టు.

పని ముద్దా ? పాటు (భాగ్యం) ముద్దా ?

పనియా ? పాటయా ? పందుకో మొగడా !

పని లేక పశేలుఇంటికి పోతే పాతగోడకు పూత పెట్ట మన్నాడట !

పనిలేని పాపరాజు ఏం చేస్తున్నా డంటే కుంచేటికొమ్ముకు ఈకలు తీస్తున్నాడు అన్నట్లు.

పనిలేని మంగలి పిల్లితల గొరిగినాడట !

పనిలేని మాచకమ్మ పిల్లిపాలు పితికిందట !

పనీ లేదు, పాటూ లేదు, పట్టత్తా ! నీకాళ్ళకైనా మొక్కుతాను అన్నట్లు.

పనివాడు పందిరి వేస్తే పిచ్చుకలు వచ్చి పడతోసినవట !

పనివానికడుపున తినువాడు పుట్టినట్లు.

పనివాడిపెళ్ళాం పాతచేట.

పనిలేనివాడా ! పల్లె వెళ్ళి రారా.

పన్నులు లేక బెన్నులు పెట్టినాను, పన్ను లుంటే పందుం తిననా అన్నట్లు.

పన్నెండు ఆమడలమధ్య బ్రాహ్మణుడు లేకపోతే యజ్ఞం చేయిస్తా నన్నాడట !

పప్పుకూటికి పదిఆమడలు వెళ్ళ మన్నారు.

పప్పు పైత్యము, చారు శైత్యము.

పప్పుచారు అడుగడుగుని, పరమాన్నం పైపైది రుచి.

పప్పులో ఉప్పు వేసేటప్పుడు చెప్పేదేమంటే చెప్పు వేసి తీసి అత్తకు అంచుకు పెట్టిందట !

పప్పుదప్పళానికి నీవు, పాపోసుదెబ్బలకు నేనా ?

పప్పుతో పదికబళాలు తింటే పులుసెందుకు బుగ్గిలోకా ?
పప్పులు పెట్టి పోరు మాన్పినట్లు.
పప్పులేని పులగం, ఉప్పులేని ధప్పళం.
పప్పులేని పెండ్లి, ఉప్పులేని కూర.
పప్పులో ఉప్పు వేసి భాగం కలిసినట్లు.
పరద్రవ్యాణి బెల్లవత్.
పరనింద గృహక్షయము, యతినింద కులక్షయము.
పరాయిపిల్ల గాజులు పెడితే పైకానికి చేటు.
పరాయిసొమ్ము పాపిష్టిసొమ్ము.
పఱిగ ఏరుకునేవాణ్ణి కుప్ప దూసేవాడు (నలుపుకొనేవాడు) బెదరించినట్లు.
పరిహాసం పైన వేసుకొని, జాణతనం జత చేసుకొన్నట్లు.
పరిహాసపుబ్రాహ్మణుడికి పాము కరిస్తే మందులేక మరణించాడట !
పరువు చెడ్డా సుఖం దక్కాలి.
పరుగెత్తి పసులు (పశువులు) కాస్తే పొద్దు కునుకునా ?
పరుగెత్తి పాలు తాగేకన్న నిలబడి నీళ్ళు తాగేది మేలు.
పరుగెత్తేవాణ్ణి చూస్తే తరిమేవానికి లోకువ.
పరులసొమ్ము పాపిష్టి సొమ్ము.
పరులసొమ్ము పేలపిండి, తనసొమ్ము దేవుడిసొమ్ము.
పరు విచ్చి పరువు తెచ్చుకో.
పరువుకీ, కరువుకీ డబ్బు.
పలుకని వాళ్ళతో పదిఊళ్ళవాళ్ళు గెలువలేరు.
పలకమ్మపున్నానికి (మార్గశిరపూర్ణిమకు) పడమటికొమ్మ పూస్తుంది.
పలకమ్మపున్నానికి పడుగలు పడతాయి.
పల్లముండేచోట నీళ్ళు నిలుస్తవి.

పల్లము దున్నినవాడు, పల్లకి ఎక్కినవాడు.

పల్లమునకు ఏడు దుక్కులు, మెఱకకు నాలుగు దుక్కులు.

పల్నాటిలో పోకకు పుట్టెడు దొరికితే ఆపోకా దొరకక పొర్లిపొర్లి
ఏడ్చిందట !

పల్లికమ్మ (పలకమ్మ) గడిస్తే తల్లితో కలుస్తాను.

పలుకు తేనెపట్టు, పిడికిలి కోతిపట్టు.

పలుగాకులకు మేలు లేదు, పంజుగొడ్డుకు పాలు లేవు.

పలుచన పంటవేడుక, ఒత్తు చూపులవేడుక.

పలుచనిగొడ్డు పా లెక్కువ ఇస్తుంది.

పలుచనిపైరు పాతరలు నిండును.

పలుపు మంచిది చూచి పసరాన్ని కట్టు.

పల్లెగమాచు, పట్టణంతలారి.

పల్లె తిరిగినా ఏడే చీరలు, పట్నం తిరిగినా ఏడే చేరలు.

పల్లెటూరికి పదిదారులు.

పశువులఏరువే పల్లెలలక్ష్మి (పంటకు బాట).

పశువుల పాలు కసవునుబట్టే.

పశువులరొచ్చుగుంత, పంటకాపుగుచ్చుపాతర.

పశువులు కాచేవాడు పాటు కక్కఱకు రాడు.

పశువులు వచ్చిన వేళ, పడుచు వచ్చిన వేళ.

పసనిపం డుండగా కసుగాయ తెంచినట్లు.

పసరం ఒంటిపూట పడ్డా, బ్రాహ్మణుడు ఒంటిపూట పడ్డా మానడు.

పసరం లేత, పైరు ముదురు.

పసిపిల్ల, పాలకుండ (దృష్టి తగులకుండా చూడాల).

పసు (స) పు కొమ్ము ఇవ్వని కోమటి వసారమంతా కొల్లలిచ్చాడట !

పసు (స) పు కొమ్ము ఇవ్వని కోమటి బజారంతా ధారపోశాడట !

పసు (స) పుకొమ్ము పెట్టని కోమటి పట్టణమంతా చూరవదిలాడట!
పసుపు (పసపు) కుంకుమకోసం పదామడైనా పరుగెత్తాలి.
పసుపూ బొట్టూ పెట్టి పెళ్ళికి పిలిస్తే వెళ్ళక, పేకు పట్టుకొని పులుసుకు వెళ్ళిందట!
పసు పేమే అంటే పెండ్లి, మసు గేమే అంటే ముండమోసింది అన్నట్లు.
పక్షిమీద గురి పెట్టి మృగాన్ని ఏసినట్లు (కొట్టినట్లు).
ప్రజలమాటే ప్రభువుల కోట.
ప్రతిష్ఠకు పెద్దనాయుడు చస్తే ఈడవలేక ఇంటివారు చచ్చారట!
ప్రభువులచిత్తం మానులనీడ.
ప్రియాణాలవారి హడావుడికంటే పెట్టెమోసేవారి హడావుడి ఎక్కువ.
ప్రియాణాలు అబద్ధం, ప్రసాదాలు నిబద్ధం.
ప్రసాదానికి బలిష్ఠం, పనికి మీఅదృష్టం.
ప్రసాదానికి ముందు, పనికి వెనుక.
ప్రసూతివైరాగ్యం, పురాణవైరాగ్యం, శ్మశానవైరాగ్యం.
ప్రజ్ఞలకు (పెగ్గెలకు) పెద్దబావ చస్తే ఈడవలేక ఇంటిల్లిపాది చచ్చారు.
పాండవులవారి సంపాదన దుర్యోధనులవారి పిండాకూళ్ళకు సరి.
పాకనాటిపతివ్రతలాగ.
పాకలపాటివారి రణకొమ్మువలె.
పాఖాలచెరువును జూచి దున్నబోతే గుండె పగిలినదట!
పాగా, పంచకట్టు చూచి భద్రిరాజు వనుకున్నాను, వీరరాజువటోయి పేర్రాజు!
పాగావంటి బంధువు లేడు, అంగరఖావంటి హరాంకోరు లేడు.
పాచిపండ్లవాడు పేర్చిపెడితే, బంగారుపుపండ్లవాడు బరుక్కుతిన్నాడట!
పాచిముఖాన ఎప్పుడైతేనేం భూపాళాలు చదవటానికి?
పాటకు నేను, అందానికి మాఅప్ప.

పాటిమన్ను మేటిదన్ను.

పాటిమీాది గంగానమ్మకు కూటిమీాదే లోకం.

పాటిమీాది వ్యవసాయం కూటికైనా రాదు.

పాటు కలిగితే కూటికి కొదువా?

పాటుకు కోడెదూడ, కూటికి పాడిదూడ.

పాటు చేతకానివాడు మాటలకు మొనగాడు.

పాటుబడితే భాగ్యం లోటా?

పాడగా పాడగా పాట, మూలగగా మూలగగా రోగము.

పాడ్యమినాడు పాఠం సాగదు, మూాఢ్యంనాడు పని సాగదు.

పాడిందే పాడరా పాచిసండ్లదాసరీ!

పాడిఆవును దానం చేసి పాలుమాత్రం పితుకుకొన్నట్లు.

పాడికి పంట తమ్ముడు.

పాడి గుట్టు, పంట రట్టు.

పాడితో పంట ఓపదు.

పాడి దాచవలెను, పంట పొగడవలెను.

పాడిపసరము, పసిబిడ్డ ఒకటి.

పాడిలేని ఇంట పంట ఆగదు.

పాడిలేని ఇల్లు పాతాళలోకం.

పాడిలేని ఇల్లు, పేడలేని చేను.

పాడు ఊరికి నక్క తలారి.

పాడుఊరికి మంచపుకోడు పోతరాజు.

పాడుకూరిలో పొగడేవారు లేరు, నాకు నేనే పొగడుకుంటానని అను
కున్నట్లు.

పాడు గోడకైనా పూత చక్కన, కోతిముండకైనా రాత చక్కన.

పాడుబడ్డ ఇంటిలో పంజాలు ఎత్తినట్లు.

పాతకత్తి ఎన్నివంక లున్నా బాగానే కాలుతుంది.
పాతగుడ్డకుట్టు నూలుచేటు.
పాతగోడకు పూత చక్కన, కోతిముండకు రాత చక్కన.
పాతచింతకాయతొక్కు (పచ్చడి) పథ్యానికి పనికివస్తుంది.
పాతచుట్టం, పాతచింతకాయపచ్చడి.
పాతచేటకు పూత అందం.
పాతచేటకూడా పనికివస్తుంది.
పాతతంగేడుపూవు పండుగనాటికైనా పనికివస్తుంది.
పాతది పనికి రాదు, కొత్తది కొర గాదు.
పాతదొంగ పట్టుబడకపోడు.
పాతపని పట్టుకురా! పల్లెకు దొంగవు కాకురా!
పాతముండ కలవరిస్తే కొత్తముండకు దయ్యము పట్టినట్లు.
పాతముండలందఱూ పోగై కొత్తముండతాడు తెంపినట్లు.
పాతరలోపడ్డ కుక్క తీయబోతే కరవవస్తుంది.
పాత రోత, కొత్త వింత.
పాతలంజ వీరమాత.
పాత్ర మెఱిగి దానము, గోత్ర మెఱిగి బిడ్డను ఇవ్వవలె.
పాత్ర మెఱిగి దానము, క్షేత్ర మెఱిగి విత్తనము.
పాత్రలేనివా డపాత్రుడు.
పాతికకలఅమ్మకు పాతికపెట్ట, లేవదీయ.
పాతికవట్టం, పరకలాభం.
పాతూరు బుల్లివెంకమ్మమొగుడివలె.
పాదపముకంటే పండ్లు బరువు.
పానకంలో పుల్ల (పుడక) వలె (లాగు).
పానకంలో పుడక, పంచదారలో కట్టె.

పాసెం పాడైపోయినా ప్రాణం కుదుటబడదు.

పాన్పు చూచి పసరాన్ని కట్టు.

పాన్పు సెబ్బరైతే పసరానికీ సెబ్బరే.

పాపటకాయ కొఱక నెంత? యాక పెట్ట నెంత?

పాపటలో వెంట్రుక నెరిస్తే పత్తిత్తు.

పాపటం (నం) (డం) పదిసేద్యాలపెట్టు.

పాపదోషానికి పోతే పట్టిచూచినట్లు.

పాపము అని పక్కటెముక ఇస్తే పీకలేక ఫిర్యాదు చేసినట్లు.

పాప మని పట్టెడంబలి పోస్తే కారం లేదని కచ్చేరి కెక్కినట్లు.

పాప మని పాతచీర ఇస్తే, గోడచాటుకు (ఇంటివెనుకకు) పోయి మూర వేసిందట!

పాప మని పాలు పోస్తే, ఉడుకని ఉలుకులాడినాడట!

పాప మని పాలు పోసితే, వల్లనని కుక్కకు పోసినాడట!

పాప మని పాలు పోస్తే, వద్దని వ (ఒ) లకబోసినాడట!

పాపం లేకున్న శాపమే లేదు.

పాప ముంటే భయము, పల్ల ముంటే నీరు.

పాప మెక్క డుంటే భయ మక్క డుంటుంది.

పాపలేనిఇంటిలో తాత తడివెళ్ళాడినట్లు.

పాపా పసుపేమమ్మా! అంటే పెళ్ళయింది, ముసుగేమమ్మా! అంటే మొగుడు చచ్చాడు అన్నదట!

పాపికి పరమాయువు, లోభికి చిరాయువు.

పాపి సముద్రానికి పోతే అరికాలు తేమ కాలేదు.

పాపిసొమ్ము పరులపాలు, ద్రోహిసొమ్ము దొంగలపాలు.

పాముకాటు చీరతో తుడిస్తే పోతుందా?

పాముకాళ్ళు పాముకే ఎఱుక (పాముకే తెలియును).

పాముకు పాలు పోసి పెంచినట్లు.

పాముకు బదనిక చూపినట్లు.

పాముకు విషం పండ్లల్లో, జ్ఞాతికి విషం కండ్లల్లో.

పాము చుట్టము, పడగ పగ.

పాముతో చెలిమి, కత్తితో సాము.

పాముతో చెలిమి, రాజుతో చెలిమి ఒకటే.

పాము ముదిరి కడకు గా మైనట్లు.

పాములలో మెలగవచ్చునుగాని స్వాములలో మెలగరాదు.

పాములు లేనివాడు వానపామును పట్టుకొన్నట్లు.

పామువిషం పామే తీయాలి.

పామూ చావరాదు, బడితే (కఱ్ఱ) విరుగరాదు.

పాయసంలో నెయ్యి ఒలికినట్లు.

పారవేసుకొన్న చోటనే వెతకుకోవాలి.

పారిజాతముతో ప్రబ్బిళ్ళు సరితూగునా ?

పారెడుపిట్టకు బెసాకు.

పారేచీమచప్పుడు వినపడునా ?

పారేబండ్లకాళ్ళు చాచినట్లు.

పాలకోసం రాయి మోయు మన్నాడు.

పాలను చూడనా? భాండాన్ని చూడనా ?

పాలపొంగు, పడుచుపొంగు.

పాలపొంగు మీాలపొంగు.

పాలలో పంచదార ఒలికినట్లు.

పాలలో పడ్డ బల్లివలె.

పాలసముద్రంలోని హంస పడియనీటి కాసపడునా ?

పాలికి వచ్చినది (పడినది) పంచామృతము.

పాలవారిని చెఱచితివో పాడైతివో.

పాలివానికి చేసిన మేలు, పీనుగకు చేసిన శృంగారము.

పాలివాడు చస్తే పారెడు మన్నెక్కువ.

పాలివానితో, మాలదానితో సావాసం చేయరాదు.

పాలు అమ్మినచోట రాళ్ళు మోసినట్లు.

పాలు ఇచ్చే బఱ్ఱెను పోగొట్టుకొని పైనపెక్కేదున్నను తెచ్చుకొన్నట్లు.

పాలుబల్లని పిల్లి ఉన్నదా ?

పాలు కుడిచి ఱొమ్ము గ్రుద్దినట్లు.

పాలు చిక్కనైతే వెన్న వెక్కసము.

పాలు తాగి దొప్ప పారవేసినట్లు.

పాలు పాలే, నీళ్ళు నీళ్ళే.

పాలుపిండని బఱ్ఱె సలుమేత మేయును.

పాలు పోసి పెంచినా పాముకు విషము పోవునా ?

పాలు పోసి పెంచినా పాము కఱవక మానదు.

పాలు మాలితివో, ఆర్చుకొంటివో !

పాలేరు దున్నిననాడు అప్పులపాలు.

పాలేరు దున్నిననాడు పదిమందికీ అప్పే.

పాలేరువానికి గొడ్డు (పశువు) పోయినా, మారుతల్లికి (సవతితల్లికి) బిడ్డ పోయినా దిగులు (బెంగ) లేదు.

పాళ్ళు పన్నెండు, దెబ్బలు చెరిసగం.

పావలాకు పడుచుకుంటే పందుంబియ్యం జేపి దొబ్బింది.

పాసినకూడు పదనుకు వస్తుందా ?

పాసిన గుమ్మడికాయ బాపనయ్యకు దానం.

పాసుముండా ! అంటే పట్టు తల్లీ ! అన్నట్టు.

పాశ్రిణం తీపా ? బెల్లం తీపా ?

ప్రాణ ముంటే బలుసాకు తిని బ్రతుకవచ్చు.
ప్రాణ ముండేవఱకు భయము లేదు.
ప్రాణం పోయినా మానం దక్కించుకోవలెను.
ప్రాణం పోయేటప్పుడుకూడా పడగ దించదు త్రాచు.
ప్రాణావసానసమయంలో పంచాంగం చూచి మందు పోస్తారా ?
ప్రాయ మున్నప్పుడే పంతాలు నెఱవేఱు.
ప్రాయము వస్తే పందిపిల్లకూడా బాగుంటుంది.
ప్రారబ్ధం బాగా లేకపోతే పైబట్ట పామై కరుస్తుంది.
ప్రాయాన బెట్టిన పంటైనా ఉండాలి, వయస్సున గన్న కొడుకైనా ఉండాలి.
ప్రాసకోస మేడ్చానే కూసుముండా ! అన్నట్లు.
పింజారిమందు, లంజపొందు.
పింగిరి పింగిపుల్లన్న, రావిచెట్టు రంగన్న.
పింగు తెరచిన ఈగలదాడి.
పింజరి పీకులాట, కురువ గుద్దులాట.
పిండం ఆడవారి గర్భంలో ఏర్పడే మొదలు మొగవారిగర్భంలో మూడు నెల లుంటుందట !
పిండానికి గతి లేకపోయినా పెగ్గెలకు బోటు లేదు.
పిండి ఎంతో నిప్పటి అంతే.
పిండికితగ్గ పిడచ.
పిండికొద్దీ నిప్పట్టు.
పిండికొద్దీ రొట్టె, తిండికొద్దీ గొడ్డు (పసరం).
పిండి గొన్నవానివద్ద రొట్టె గొన్నట్టు.
పిండినిబట్టి రొట్టె.
పిండీ, బెల్లం (బంగారం) పోగా పిడుకల కుచ్చెల కేడ్చినట్లు.

పిండిబొమ్మను చేసి పీటమీద కూర్చుండ బెడితే ఆడబిడ్డతనాన అది రదిరిసడ్డదట !

పిండీ, ప్రోలు లేనిది పెం డ్లవునా ?

పిండేవాడు పిండితే పిటుకురాయైనా పా లిస్తుంది.

పిందెలో పండిన పండు.

పిచ్చి కుదిరింది, రోకలి తలకు చుట్టమన్నాడట !

పిచ్చి కుదిరితేగాని పెళ్ళి కాదు, పెళ్ళి అయితేగాని పిచ్చి కుదురదు.

పిచ్చిపుల్లయ్య వేమారం వెళ్ళినట్లు.

పిచ్చివాడికి లోకమంతా పిచ్చి.

పిచ్చివానిచేతిరాయి తగిలెనా తగులును తప్పెనా తప్పును.

పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం.

పిచ్చుగుంటులవాని పెండ్లి ఎంత ? వైభవ మెంత ?

పిచ్చుగుంటుమీద భాగీరథి వచ్చినట్లు.

పిట్టకు అలిగి పాశుపతము తొడుగనేల.

పిట్టకు పట్టే దెంత ?

పిట్టకొంచెము, కూతఘనము.

పిట్టపిడుగున మీయింటిలో విందుకు చస్తావు, బిల్లపిడుగున మా యింటిలో చావక.

పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చింది.

పిఠాపురం వెళ్ళి పిడతెడు నీళ్ళు తెచ్చినట్లు.

పిడకపొగకు సిగ మూగితే గుగ్గిలంపొగ కె ట్లాగవలెను ?

పిడకలు తీసుకరారా సివ్వా అంటే నాపిక్కలు నొస్తవి అవ్వా అన్నాడట !

పిడతలో నూనె పిడతలో ఉండాలి, బిడ్డలు బీరగింజల్లా ఉండాలి !

పిడికెడు పెడితే తీసికొని ఒక్కటొక్కటే తిను.

పిడుగుకు గొడు గడ్డమా ?

పిడుగుకు, బియ్యానికి ఒకటే మంత్రమా ?

పిడుగుకు వారశూలా ?

పిడుగుపడినవాని కొఱవిని చూడినట్లు.

పిడుగు బాటిన డొంకవలె.

పిడుగు మొత్తిన తాయివలె.

పిడుగు వ్రేసిన తలనొప్పి యాగునే ?

పితికేబఱ్ఱె నిచ్చి, పాడిచేదున్నను తెచ్చినట్లు.

పిత్త సత్తువ లేదు, పాస (చ) నాలకు మందు !

పిత్తపఱికిగ క్రొవ్వ నెంత ?

పిత్తి పిల్ల నెందుకు కొడతావమ్మా ! మళ్ళీ వచ్చి నానెత్తి కొట్టగలవు.

పిత్తి కంచం గోకినట్లు.

పిత్తిసముత్తయిదువవలె.

పిత్తు మింగిన దాసరిలాగ.

పినతండ్రి పెండ్లాము పినతల్లి కాదు, మేనమామ పెండ్లాము మేనత్త కాదు.

పినతల్లి పెట్టు, పిచ్చిదానిబట్టు.

పిల్లిమీద కొడితే ఫిర్యాదు లేదు.

పిల్లిలచప్పుడేగాని దారి జరుగ లేదు అన్నట్లు.

పిల్లిలు చూచి పీట వేసినట్లు.

పిరికి బంటుకు తుమ్మాస్థ.

పిరికిమగడు చెబితే వినడు, గిల్లితే ఏడుస్తాడు.

పిరికివానిబింకం పిసరులో ఇంకును.

పిరికివారికే పిడికెడంత మీసాలు.

పిలకపై నాట్య మాడవచ్చునుగాని పేనపై నాట్య మాడలేము.

పిలవకుండా పోయినప్పుడు గెంటకుండా పొమ్మనడమే కట్నం.

పిలవని పేరంటము, చెప్పని ఒక్కపొద్దు.

పిలవని పేరంటానికి పోయి అడగని ఒక్కప్రొద్దున్నట్లు.

పిల్ల ఉన్నదానికి పిత్త సందు.

పిల్లఉన్నమ్మకు పిడికెడు చోటెక్కువ.

పిల్లకాకేమి ఎఱుగును ఉండేలు (వింటి) దెబ్బ ?

పిల్లకాయలకూ, పీటకొయ్యలకూ చలి లేదు.

పిల్లకు సొమ్ము పెట్టిచూడు, గోడకు సున్నము కొట్టిచూడు.

పిల్లకోసరం గడ్డి తింటారు.

పిల్లగలవాడు పిల్ల కేడిస్తే, కాటివాడు కాసు కేడ్చాడట !

పిల్ల చచ్చినా పురుటికంపు వదలలేదు.

పిల్ల నిచ్చినచోటికీ, పీతిరిదొడ్డికీ పోక తప్పుతుందా ?

పిల్ల నిచ్చినవాడు ఈగ, పుచ్చుకున్నవాడు పులి.

పిల్ల పిడికెడు, కూని (ను) గంపెడు.

పిల్లపుట్టక మొదలే కుల్ల గుట్టిపెట్టు.

పిల్ల పుడితేనే పాలు పడతాయి.

పిల్లపెత్తనం, పల్లెటూరిసావాసం.

పిల్ల పోయినా పీతికంపు పోలేదు.

పిల్ల బావిలో పడ్డదిరా అంటే ఉడుకంబలి తాగి వస్తా నన్నట్టు.

పిల్లముడ్డి గిల్లి ఉయ్యాల ఊచినట్లు.

పిల్ల ముద్దుగాని పియ్య ముద్దా ?

పిల్ల లున్నవాడికి, పసు లున్నవాడికి సిగ్గుండరాదు.

పిల్లలు కనే కోడ లుంటే వద్దనే అత్త ఉందా ?

పిల్ల లెందరురా సిల్లోడా ! అంటే పెళ్ళే లేదురా పెద్దోడా ! అన్నా డట !

పిల్లలులేని ఇంట్లో తాత తడుములాడినట్లు.

పిల్లలు లేనిది ఇల్లు కాదు, పిట్టలు లేనిది తోట కాదు.

పిల్లవాడు మూలానక్షత్రంలో పుడితే మూల పీకివేసుకుపోతాడట!

పిల్లవానికి పీట వేసి పిల్లకు చేట వేయుము.

పిల్లాపిలగాడికి పెళ్ళి చేస్తే ఎలేసి ఎడం చేశాడట!

పిల్లా! పిల్లా! నువ్వులచెట్టుకు నూనె ఎక్కడిదంటే మాఅమ్మ తొలి సమర్తకీ, మలిసమర్తకీ ఎక్కడున్నావు? అందిట!

పిలిచి పిల్ల నిస్తామంటే కులం లేత (తక్కువ) అన్నట్లు.

పిలిచేవా రుంటే బిగిశేవారు శానామంది.

పిలిస్తే బిగిస్తే సరికాని వస్తే వాడిఅబ్బతరమా?

పిల్లి కండ్లు పోగోరును, కుక్క పిల్లలు రాగోరును.

పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగుతూ ఎవరు ఎఱుగరని ఎంచుకొన్నదట!

పిల్లికాలు ఎద్దు తొక్కితే ఎలుకమీద మీసాలు దువ్వినట్టు!

పిల్లికి ఎలుక సాక్షి.

పిల్లికి గంట కట్టే దెవరు?

పిల్లికి చెలగాటము, (చెర్లాటము) ఎలుకకు ప్రాణసంకటము.

పిల్లికి పెట్టినవాడు నాకు పెట్టడా?

పిల్లికి రొయ్యల మొలతాడు కట్టినట్లు.

పిల్లికి రొయ్యల మొలతాడు కడితే అసుంటా పోయి నోట్లో వేసుకున్నదట?

పిల్లి గుడ్డిది అని ఎలుక తోక (ముడ్డి) చూపినదట!

పిల్లితిన్న కోడి పిలిచినా పలుకదు.

పిల్లితోక ఎద్దు ముట్టితే ఎలుకదిక్కు ఎఱ్ఱగించి చూచిందట!

పిల్లితోక బల్లి తొక్కితే ఎలుకమీద మీసాలు దువ్వినదట!

పిల్లిని చంకలో పెట్టుకొని పెళ్ళికి వెళ్ళినట్లు.

పిల్లిని చంపిన పాపం నీది, బెల్లం తిన్న పాపం నాది.

పిల్లిని చంపిన పాపం గుడి కట్టినా తీరదు.

పిల్లిని చంపిన పాపం నీకు, బెల్ల మీయని పాపం నాకు.

పిల్లి కాలు బత్తె తొక్కితే ఎలుకపై మీసాలు దువ్వినదట !

పిల్లి పట్టిన ఊరువువలె.

పిల్లి బ్రహ్మహత్య.

పిల్లి బ్రాహ్మణహంత.

పిల్లి బ్రాహ్మణుడు, పీట ముత్తైదువ.

పిల్లి మెడలో గంట కట్టే దెవరు ?

పిల్లి ముడ్డిలో మల్లి పందిరి.

పిల్లి ముడ్డిలో మల్లి శాల.

పిల్లి లేని పిసిని, వానలేని వరద.

పిల్లి వలస త్రిప్పినట్లు.

పిల్లి శాపాలకు (శాపనార్థాలకు) ఉట్లు తెగుతాయా ?

పిలువని పేరంటమునకు వెళ్ళితే పీటకోళ్ళ దెబ్బ.

ప్రియం మహాలక్ష్మి, చౌక శనేశ్వరం.

పీక సన్నము, ఆకలి ఎక్కువ.

పీకుడుగానికి బియ్యపురొట్టె, మూతి కడుగ నేతిబొట్టు.

పీటకు, పిఱ్ఱకు వైరం (ము).

పీతాంబరము ఎర విచ్చి పీట పుచ్చుకొని వెంబడి తిరిగినట్లు.

పీతాంబరము కట్టినమ్మ పీట చంకనే పెట్టాలి.

పీనుగ ఎక్కడో గద్దలూ అక్కడే.

పీనుగకు చేసిన జాతరవలె.

పీనుగకు చేసిన శృంగారంవలె.

పీనుగను పొడిచి బల్లెము వాడు.

పీర్ల పండుగకు తిప్పాభట్లఆజ్ఞా ?

పీర్లు బిచ్చాని కేడిస్తే ముల్లా పంచదార కేడ్చినాడట !

ప్రీతితో పెట్టింది పిడికెడైనా చాలు.

ప్రీతిలేని కూడు పిండాకూడు.

పుంజం పెట్టింది బట్ట, లంచం పెట్టింది మాట.

పుంటికూర తిన్నా పుట్టిల్లు, పాయసం తిన్నా పరాయిగుడ్డ.

పుంటికూరలో పుడక రుచి, మాంసంలో బొమిక రుచి.

పుండు ఒకచోట, మం దొకచోట (ఒక్కోకచోట).

పుండుకు పుల్ల మొగుడు.

పుండు మానినా బెందు మానదు.

పుండు మానినా మచ్చ మానదు.

పుండుమీద కారం చల్లినట్లు.

పుండుమీద దెబ్బవలె.

పుండుమీద పుల్ల పొడిచినట్లు.

పుండుమీద పులుసు పడ్డట్లు.

పుండంత మానింది, చేటంత ఉంది.

పుండున్న వ్రేలికే పుల్ల తగులుతుంది.

పుంజుమీద్దికి నూనె లేదు, బూరె లొండవే (బూరెలు వండవే) పెళ్ళామా !

పుచ్చకాయలదొంగా ! అంటే బుజాలు తడుముకున్నాట్ట !

పుచ్చిన మిరియాలైనా జొన్నలకు సరి తూగకపోవు.

పుచ్చిన విత్తనాలు చచ్చినా మొలవవు.

పుచ్చుకున్నప్పుడు పుత్రుడు పుట్టినంత సంతోషం, ఇచ్చేటప్పుడు ఇంటాయన పోయినంత దుఃఖం.

పుచ్చువంకాయలు, బాపనిబయ్యాలు.
పుట్టకు ధ్వనెత్తితే పుట్టెడు, మొగుడికి ధ్యాసెత్తితే పుట్టెడు.
పుట్టంగ పురుడు, పెరగంగ పెళ్ళి.
పుట్టని బిడ్డకు (పిల్లకు) పూసలు కట్టినట్లు.
పుట్టని బిడ్డకు పేరు పెట్టినట్లు.
పుట్టపై బాదిన పాము చచ్చునా ?
పుట్టమన్ను ఎరువైతే పుట్లకొద్దీ పంట.
పుట్టమన్ను వేస్తే పుడమి పండును.
పుట్టమీద తేలు కుట్టినా నాగుమయ్యమాహాత్మ్యమే.
పుట్టమీదిది నాది, పురంమీదిది నాది.
పుట్టలున్నమడి, నట్టలున్న ఇల్లు చెడదు.
పుట్టలో చేయి పెట్టి బాబోయ్ ! అన్నట్లు.
పుట్టింటిఆశ, ఆముదపు జిడ్డు పోదట !
పుట్టి చచ్చినా పుత్రుడే మేలు.
పుట్టించినవాడు పూరి మేపునా ?
పుట్టిన ఇన్నాళ్ళకు పురుషుడు యజ్ఞం చేశాడు.
పుట్టినదానికి పెట్టిందే సాక్షి.
పుట్టిననాటిగుణము పులిఆకులలో వేసినా పోదు.
పుట్టిననాటినుంచి పుల్లిగాడే మొగుడా ?
పుట్టినపుడే గిట్టే వ్రాత వ్రాసినాడు.
పుట్టినపిల్లలు బువ్వ కేడిస్తే అవ్వ మొగుడి కేడ్చిందట !
పుట్టినవానికి తమ్ముడు, పుట్టేవానికి అన్న.
పుట్టినిల్లు పుణ్యాలోకం, అత్తగారిల్లు ఆరళ్ళలోకం !
పుట్టినిల్లు ఏకాదశి, మెట్టినిల్లు గోకులాష్టమి.
పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోగాని పోదు.
పుట్టుచాయేగాని పెట్టుచాయ వచ్చునా !

పుట్టుకకో గుణము, పుఱ్ఱెకో బుద్ధి.

పుట్టుక చూసిన గరుత్మంతుడు, గుణము చూసిన పీతిరిగద్ద.

పుట్టుట గిట్టుటకొఱకే, పెఱుగుట విఱుగుటకొఱకే.

పుట్టువాసనా? పెట్టువాసనా?

పుట్టుశోభ లేనిది పెట్టుశోభ ఏం ప్రయోజనం?

పుట్టుశాస్త్రిలా? పెట్టుశాస్త్రిలా?

పుట్టెడిచ్చి పు, కుండెడిచ్చి కు వ్రాసికొను.

పుట్టెడు అప్పు గడ్డపార మింగినది.

పుట్టెడు అప్పయినా కాయవచ్చుగాని పిప్పి (పుప్పి) మాటలు ఎవడు పడతాడు?

పుట్టెడు ఆముదము రాసుకొని (పట్టించుకొని) పొర్లాడినా అంటేదే అంటును, అంటనిది అంటదు.

పుట్టెడునువ్వుల్లో పడ్డా అతికేవే అతుకుతవి.

పుట్టెడువడ్లపై కుక్క పొర్లినట్లు.

పుట్టేవాళ్ళకు అన్న, పెఱిగేవాళ్ళకు తమ్ముడు.

పుడుతూ పుత్రులు, పెరుగుతూ శత్రులు.

పుడుతూ సోదరులు, పెరుగుతూ దాయాదులు.

పున్నమనాటి పురుషుడు, అమావాస్యనాటి ఆడబడుచు.

పున్నానికి పూర్తి, అమావాస్య కాఖరు.

పుణ్యం కలిగిన మొగని చేసికొంటే, పూసలలోని కొకరుబ్బురాయి.

పుణ్యంకొద్దీ పురుషుడు, దానంకొద్దీ బిడ్డలు.

పుణ్యంకొద్దీ పురుషుడు, విత్తంకొద్దీ వైభవము.

పుణ్యం పుట్టెడు, పురుగులు తట్టెడు.

పుణ్యాత్మునిచేనికి పుట్టెడు పిట్టలు.

పుణ్యాని కంటే మాచిన్నాయనను తోలుకొస్తాను అన్నట్లు.

పుణ్యానికి పుట్టి డిస్తే పిచ్చుకుంచమని పోట్లాడినాడట !

పుణ్యానికి పెట్టినమ్మా ! నీ మొగుడితో పాలు పెట్ట మన్నట్లు.

పుణ్యానికి పోతే పాపం వస్తుంది.

పుణ్యానికి పోతే పాప మెదురు వచ్చిందట !

పుణ్యానికి ఫలమే సాక్షి, బావికి జలమే సాక్షి.

పుతపుతలమారమ్మకు పాడికూడగాని, గడ్డకూడు రాదు.

పుత్రుడనై వేధింతునా? శత్రుడనై వేధింతునా? పేనులేని దయ్యమునై వేధింతునా?

పుత్రుడు లేకపోతే సత్రానికి పోకూడదా ?

పుత్రులు లేకున్న పున్నామనరకం.

పునర్వసుపుష్యాలకు పూరేడు అడుగైనా తడవదు.

పున్నమ్మపెళ్ళికి చంద్రు డుదయించినట్లు.

పున్నానికి పూత, అమావాస్యకు ఆరగింపు.

పునుగుచట్టము పిండినట్లు.

పున్నెపుచింతల పులుసు, పొగాకిత్తుల పొగుసు.

పుబ్బ ఉబ్బుబ్బి కురిసినా గుబ్బచిచ్చెట్టుకింద నానదు.

పుబ్బ కెరలితే భూతం కెరలినట్లు.

పుబ్బ రేగినా బూతు రేగినా నిలువదు.

పుబ్బలో చల్లేదానికంటే దిబ్బలో చల్లేది మేలు.

పుబ్బలో చల్లేవి, మబ్బులో మొక్కౌనేవి.

పుబ్బలో పుట్టి, మఖలో మాడినట్లు.

పుబ్బలో పుట్టెడు చల్లేకంటె, ఆశ్లేషలో అడ్డెడు చల్లేది మేలు.

పుబ్బలో పుట్టెడుకంటె, మఖలో మానెడు మేలు.

పురాణవైరాగ్యం, ప్రసూతివైరాగ్యం, శ్మశానవైరాగ్యం.

పురాణాలలోని వంకాయలు పులుసులోకి రావు.

పురాణం విన్నంతసేపే పరమార్థచింత.

పురాణం విన్నప్పుడు పుట్టెడు బుద్ధులు, అవతల పోతే అదవబుద్ధులు.

పురిటాలికి పుట్టెడైనా చాలదు.

పురిటిలోనే సంది కొట్టినట్లు.

పురిటిపిల్లకు చముదు లేదు, పూర్ణపుబూరెలు వండుకుందామా? అన్నట్లు.

పుల్లు కారుతూ ఉంటే పోతరాజు సివ మాడినట్లు.

పుర్రె కొకబుద్ధి, జిహ్వ కొకరుచి.

పుర్రె కొకబుద్ధి, తల కొకనాలుక.

పుర్రెనుబుద్ధి పుడకలతోగాని పోదు.

పులగము తిన్నవాడు పుణ్యాత్ముడు పాయసం తిన్నవాడు పాపాత్ముడు.

పులగముమీద పప్పు.

పుల్లయ్య వేమారం (వేమవరం) వెళ్ళి వచ్చినట్లు.

పుల్లయ్యపెండ్లాము పులుసు గాచె, మెంతులు లేక గంతులు వేసె.

పులికడుపున పుట్టి మేక అఱపు అఱచినట్లు.

పులికడుపున మేకపిల్ల పుట్టునా?

పులికన్న గిలి గొప్పది.

పులి కాకలయితే పూరి తింటుందా?

పులికి తనకాడూ, పరకాడూ లేదట!

పులికి పుట్టినకూన పూరి మేయునోటు!

పులికి మల బెదురు, మలకు పులిబెదరు.

పులిగాడికి గిలిగాడు.

పులిగొన్న మృగము పెట్టున పడునే?

పులి గోకటం, అయ్య బతకటం.

పులిచారలు వేశాయి అత్తయ్యా! అంటే పుసిసెదు వెనక్కు తీయవే కోడలా! అన్నట్లు.

పులి దాసర్లకు పెట్టదు.
పులి నాకి విడిచినట్లు.
పులిని కోల వేసినట్లు.
పులిని బట్టినవాడు పుణ్యాత్ముడు, పామును బట్టినవాడు పాపాత్ముడు.
పులి నల్లబడితే పులివాతలు నల్లబడుతాయా ?
పులిని చూచి నక్క వాత పెట్టుకొన్నట్లు.
పులిప్రక్కన జోరీగ ఉన్నట్లు.
పులి పేదవడిన పసులవాండ్రె యెక్కాడిరను కథ.
పులికడుపున పిల్లులు పుడతాయా ?
పులిపిల్ల పులిపిల్లే, మేకపిల్ల మేకపిల్లే.
పులి, మేక ఒక్క రేవున నీరు త్రాగు.
పులి బక్కబడితే చారికలు బక్కబడుతాయా ?
పులిమీద పుట్ర.
పులిమీసం పట్టుకొని ఉయ్యాల ఊగినట్లు.
పులిమీసాలు కుందేలు మేసినట్లు.
పులుసు వచ్చి మెతుకును కొట్టుకపోయినట్లు.
పువ్వులతో నార తల కెక్కినట్లు.
పువ్వు (పూవు) పుట్టగానే పరిమళిస్తుంది.
పువ్వులు వేడుకైన కడిపోయినవా ఝుమ్మడువంగవచ్చునే ?
పుశాల (పుష్యమి) పూరిపిట్ట తడువదు.
పుష్యమాసంలో పూసలు గ్రుచ్చ పొద్దుండదు.
పుష్యమాసానికి పూసంత వేసంగి.
పుష్యమి కురిస్తే పూరిపిట్టయినా తడువదు.
పుస్తె, పూసా పునిస్త్రీకి.
పూచింది ఒకఎత్తు, కాచింది ఒకఎత్తు.

పూచింది పుడమిఅంత, కాచింది గంత.

పూచిన తంగేడు వేసినా, కాచిన వెంపలి వేసినా నేను పండుదును.

పూచిన పూలెల్లా కాయలైతే భూమిమీద చోటేదీ ?

పూచినపూత చూచి పొంగి బోర్లపడతాడు.

పూచే పూతనుబట్టి కాచే కాపుండును.

పూజకన్నా బుద్ధి, మాటకన్నా మనసు ప్రధానం.

పూజకొద్దీ పురుషుడు, పుణ్యంకొద్దీ పుత్రులు.

పూజాపురస్కారాలు లేక బూజెక్కి ఉన్నానుగాని నైవేద్యం పెట్టు మరి నామహిమ చూపిస్తాను.

పూటకూళ్ళకు వచ్చినవాళ్ళకు పుట్లధర ఎందుకు ?

పూటకూళ్ళమ్మకు పుణ్యంతో పని లేదు.

పూటబత్తెము, పుల్లవెలుగు.

పూటలు మూడు, భోజనం ఒకటి.

పూడ్చలేనంత గొయ్యి, తీర్చలేనంత అప్పు.

పూతకుముందే పురుగు ముట్టింది.

పూరణంలేని బూరె లేదు, వీరణములేని పెండ్లి లేదు.

పూర్ణిమనాడు కొంగు పట్టుక పిలిస్తే రానిది అమావాస్యనాడు కన్నుగీటితే వస్తుందా ?

పూరా మునిగినవానికి చలేమి ? గాలేమి ?

పూర్వోత్తరమీమాంసలకు బాబూఅమ్మగారు వ్యాఖ్యానం వ్రాసినట్లు

పూర్వోత్తరాలెరిగి పొత్తు చేసుకోవలెను.

పూలచే కొట్టినట్లు.

పూవు (పువ్వు) లమ్మిన అంగడిలో (ఊళ్ళో) పుడకలు (కట్టెలు) అమ్మినట్లు.

పూవు పుట్టగానే పరిమళము.

పూస, పోగు ఉంటే బుజ మెక్కవలెనా?
పూసలలో దారమువలె.
పూసుకురావే బూరెముక్కా! అంటే నేనూ వస్తానే నేతిచుక్కా! అన్నట్లు.
పెంటకుప్ప పెరిగితే పేదరైతు పెద్దగును.
పెంట తినే బఱ్ఱె కొమ్ములు కోస్తే మానుతుందా?
పెంటమీద పంట, మంటమీద వంట.
పెంటమీది చెట్టు ప్రబలం, నీరు పోసిన చెట్టు నిర్మలం.
పెండ్లామే పెరుమాళ్ళు.
పెండ్లామా! నీకు దండము.
పెండ్లాము బెల్లము, తల్లి దయ్యము.
పెండ్లిఅయినఇంటిలో ఆరు నెలలు కఱవు.
పెండ్లికి చేసిన పప్పు పేరంటాండ్రు చవి చూడ (వాచవికి) సరిపోయింది
పెండ్లికి వచ్చినవాళ్ళంతా పెళ్ళాలే.
పెండ్లికి వచ్చినవాళ్ళంతా పెండ్లి చేసుకుంటారా?
పెండ్లికి వెడుతూ పిల్లిని చంకను పెట్టుక వెళ్ళినట్లు.
పెండ్లికి వెడదా మంటే వెళ్ళిపోదా మన్నట్లు.
పెండ్లి కొచ్చినమ్మ! పెదవు లెండినాయి అంటే నీ నెన్న డొచ్చినావమ్మ! నిలువుకండ్లు పడినాయి అందట!
పెండ్లి కొచ్చినవారు వారే చేస్తారు, పెండ్లామా! నీపై అలిపించుకోకు
పెండ్లినాటిసౌఖ్యం లంఖణాలనాడు తలచుకున్నట్లు.
పెండ్లిని చూస్తూ ఒక డుంటే పెండ్లాన్ని చూస్తూ ఒక డున్నాడు.
పెండ్లిమర్నాడు పెండ్లికొడుకుముఖాన పెద్దమ్మ వేళ్ళాడుతుంది.
పెండ్లివారికి పెండ్లిసందడి, అడుసుకాళ్ళవాడికి దోమలసందడి.
పెండ్లివారు వచ్చి పెరటిలో దిగినట్లు. (దిగినారా?)

పెండ్లిసందడిలో పుస్తె కట్ట మరచాడట!

పెగ్గెలకోసం పెళ్ళాడానుకాని కూడు పెట్టడం కులాన లేదు

పెట్టకపోయినా పెట్టేఇల్లు చూపాలి.

పెట్ట కూస్తే పుంజుకు ఈడు వస్తుంది.

పెట్ట కూస్తే పుంజు కేరుతుంది.

పెట్ట గతులు లేకున్న పుట్ట గతులు లేవు.

పెట్టగల బచ్చలిపాదు కొనగల గేదె మేసిపోయింది.

పెట్టదు పిన్నాం, పోయదు పిన్నాం, పిన్నానికి నాకు ప్రాణం ప్రాణం.

పెట్టనమ్మ పెట్టనేపెట్టదు, పెట్టేముండ కే మొచ్చింది పెద్దరోగం?

పెట్టనమ్మా! పెట్టేఇల్లయినా చూపెట్టు.

పెట్టితే తింటారుగాని, తిడితే పడతారా?

పెట్టితే పెండ్లి, పెట్టకుంటే శ్రాద్ధం

పెట్టి దెప్పితివో, పెద్దల తిడితివో.

పెట్టినదంతా పైరుకాదు, కన్నదంతా కాన్పు కాదు.

పెట్టినదంతా పైరు కాదు, పుట్టినదంతా బిడ్డ కాదు.

పెట్టినపైరంతా మట్టిపాలైతే రైతుబ్రతుకు కట్టతెగిన చెఱువు.

పెట్టినమ్మకు ప్రాణహాని, పెట్టనమ్మకు జన్మహాని.

పెట్టినమ్మ పుణ్యాన పోదు, పెట్టనమ్మ పాపాన పోదు.

పెట్టినవానికి తెలియును నిక్షేపము.

పెట్టినవారికి పుట్టిందే సాక్షి.

పెట్టిన పెళ్ళి గోరు, పెట్టకున్న చావు గోరు.

పెట్టిపొయ్యనమ్మ కొట్టవచ్చిందట!

పెట్టిపొయ్యనమ్మ కొట్టి పొమ్మన్నదట!

పెట్టిపోయని పెద్దమ్మా! కుట్టు బార గుద్దేవే.

పెట్టిపోయని మొగుడు కుట్లు వడల పొడిచినాడట

పెట్టుకు ఆయం లేదు, తిట్టుకు సింగారం లేదు.
పెట్టు చుట్టము, పొగడు భాగ్యము.
పెట్టుపోతలు లేని వట్టికూత లెందుకు?
పెట్టుపోతలు శాశ్వతములా?
పెట్టగదరా పోలా! అంటే, ఏడ్వక తీరదే అయ్యా! అన్నాడట!
పెట్టేఅమ్మ బుద్ధిలో ఉంటే ఏబంతినైనా పెడుతుంది.
పెడర్థానికి, పెద్దరోగానికి మందు లేదు.
పెడితే పెండ్లి, పెట్టకపోతే పెటాకులు.
పెడితే శాపం, ఇస్తే వరం.
పెత్తనం చేసేవాడు, పెంటిసంతానం కలవాడు అందరికీ లోకువే.
పెత్తనాలకు పోవందే పెండ్లి కుదురుతుందా?
పెత్తనానికి పోతే దుత్త చేతికి వస్తుంది.
పెత్తరమావాశ్యకు పెద్దరొట్టె యిస్తా నన్నాడు.
పెదబావగారు ఆడంగులతో సమము.
పెదవికి మించిన పల్లు, ప్రమిదకు మించిన వత్తి.
పెదవి దాటితే పృథివి దాటుతుంది.
పెదవి దాటితే పెన్న దాటుతుంది, పెన్న దాటితే పృథివి దాటుతుంది.
పెదవి మందహాసం, హృదయం చంద్రహాసం.
పెద్దఇంటి బొట్టెఅయినా కావాలి, పెద్దచెఱువునీరైనా కావాలి.
పెద్దఇంటిబొట్టె, ఎద్దులున్న వ్యవసాయం.
పెద్దఇంటిఅంకు, పెద్దచెఱువుకంపు కనపడవు.
పెద్దఇంటిఅంకు, పెద్దమనిషి బొంకు తెలియవు.
పెద్దక్కఓలి తెగితే, చిన్నక్కఓలి తెగుతుంది.
పెద్దకొడుకు పెండ్లి అసురభోజనం.
పెద్దచెట్టుకు సుడిగాలి పెనుభూతం.

పెద్దతల లేకపోతే గొర్రెతల తెచ్చుకొమ్మన్నాడట !

పెద్దపులిఎదుటయినా పడవచ్చునుగాని నగరివారిఎదుట పడరాదు.

పెద్దపులిచాటుకు పోయిన ఎలుకకు నమిలే గండుపిల్లి నల్లితో సమానము.

పెద్దపులి తరుముకువచ్చినా హజారంసుందరికి పోరాదు.

పెద్దపులి తరుముకువచ్చినా కంసాలివారిదుకాణంలోకి పోరాదు.

పెద్దపులి పేరంటం పెట్టినా ?

పెద్దపులిమీద స్వారి చేసేవాడు భూమిమీద నడవలేడు అన్నట్లు.

పెద్దమనిషిని పేరంటానికి పిలిస్తే, అడ్డేసెడుపసుపు ముడ్డికే సరి పోయిందట !

పెద్దముత్తైదువు సద్దు చేయదు, చిన్నపిల్ల చిందులు తొక్కును.

పెద్దరెడ్డికొంగు పట్టుకొన్నట్లు.

పెద్దలఉసురు పెనుబాముపై తగులును.

పెద్దలకు పెట్టరా పేచీలతలపాగ.

పెద్దలతో వాదు, పితరులతో పోరు.

పెద్దలమాట చద్దిమూట.

పెద్దలమాట పెఱుగుకూడుమూట.

పెద్దలులేని ఇల్లు ఎద్దుల కొటిక.

పెద్దలులేని ఇల్లు సిద్ధులులేని మఠము.

పెన మేమెఱుగును పెసరట్టు రుచి ?

పెన్న దాటితే పెరుమాళ్ళసేవ.

పెన్న రావడం వెన్న కరిగేలోపల.

పెన్నలో మాన్యం పెట్టినట్లు.

పెన్న వస్తే పెద్దలకు ముప్పు.

పెన్నిధికన్నట్టి పేదచందమున.

పెనుగొండకు పిల్ల నివ్వరాదు, కొండ్దానికి ఎద్దు నివ్వరాదు.

పెమ్మకట్లవారిమంత్రందెబ్బ అంటే కమ్మకట్లపాముకాటైనా పోతుంది.

పెయ్యను పెంచితే పేదరికం లేదు.

పెయ్యను కాచమని పెద్దపులి కిచ్చినట్లు.

పెరటికిపోయినవానిని తన్న లేక పెంటను తన్నినట్లు.

పెరటిచెట్టు మందుకు పనికిరాదు.

పెరవారిసొమ్ము బెల్లం.

పెరుగగా పెరుగగా పెదబావగారు కోతి అయినట్లు.

పెరుగుట విఱుగుటకొఱకే.

పెఱుగుకును, పులికడుగును పెనకువ అయినట్లు.

పెఱుగు పెత్తనం చెఱచును.

పెఱుగురాచుకొన్నవానికి బుగ్గిభయ మేమి ?

పెఱుగూ, వడ్లూ కలిపినట్లు.

పెరుమాళ్ళకు పూజ, పెండ్లికి బాజ.

పెరుమాళ్ళకైనా పెట్టువాడే చుట్టం.

పెరుమాళ్ళకోసం పెద్దకొలుపు పెడితే పిడుగు పడ్డట్టు పిందేవర వచ్చినదట !

పెళ్ళాం పోతే పెండ్లికొడుకు.

పెళ్ళాం బెల్లంముక్క, తల్లి మట్టిబెడ్డ.

పెళ్ళిరా బాబూ! అంటే వెళ్ళిరా బాబూ! అన్నట్లు.

పెళ్ళికెళ్ళిన యింటిన వలస వెళ్ళ బుద్ధయినదట !

పెళ్ళే బావుంది, పప్పు వండితే మరీ బావుంది.

పెసరకు పైరగాలి, పసరానికి నోటిగాలి ప్రమాదం.

పెసరగింజకు పెసరగింజ తక్కువా ?

పెసరచేలో పోగొట్టుకొని పప్పుటికలో దేవులాడు.

పేగుచుట్టమా ? పెట్టుచుట్టమా ?

పేచీకి పెదబాబు.

పేడకుప్పకు దృష్టిమంత్రమా ?

పేడలో పొదిగిన ఉల్లిగడ్డవలె.

పేడా, బెల్లం ఒకటే (ఒకటి చేసినట్లు).

పేడు ముదిరి పెండ్లికొడుకగు.

పేదకు పెన్నిధి దొరికినట్లు.

పేద (రాలి) (వాని) కోపం పెదవికి చేటు.

పేదలబిగువు, సాదులతెగవు.

పేదవాడా ! పెసలు చల్లుకో.

పేదవానిపెళ్ళాం వాడకెల్ల వదిన.

పేదవాణ్ణి చూస్తే పేలాలు త్రుళ్ళును.

పేదవానికి పెండ్లామే ఆస్తి.

పేదవానికి పెండ్లామే భార్య.

పేదకు తగిలె బ్రహ్మహత్య.

పేదవానికే పడెరా పెద్దపిడుగు.

పేదవానివెంట పడెనమ్మా జోరీగ.

పేను కుక్కినా కుక్కుతాడు, చెవి కరచినా కరుస్తాడు.

పేనుకు పెత్తన మిస్తే తలంతా తెగ కొరికిందట !

పేనుకు పెత్తన మిస్తే పెసరచేను నాదే అన్నదట !

పే నే మెఱుగును పెడతలకండూతి (దురద) ?

పేరంటానికి వచ్చి పెండ్లికొడుకువరస ఏ మన్నట్టు.

పేరు ఒకరిది, నోరు ఒకరిది.

పేరు నేతిబీరకాయ, చీరి చూస్తే నేతిచుక్క లేదు.

పేరు ఒకరిది, పెత్తనం ఒకరిది.

పేరు గంగానమ్మ (గంగాభవాని), తాగబోతే నీళ్ళు లేవు.

పేరు గొప్ప (పెద్ద), ఊరు దిబ్బ.
పేరు పెరుమాళ్ళది, నోరు తనది.
పేరు పల్లకీమీద, కాలు నేలమీద.
పేరు పెండ్లివాండ్లది, తిండి ఇంటివాండ్లది.
పేరు పెత్తనం చెఱచును.
పేరు పెన్న మోసినది, ఒళ్ళు (గుద్ద) నేల మోసినది.
పేరు పెనిమిటిది, అనుభవం మామగారిది.
పేరు పేరయ్యది, పిల్ల ఉమ్మడిది.
పేరులేని వ్యాధికి పెన్నేరుగడ్డ మందు.
పేలాలు చల్లి దయ్యాల లేపినట్లు.
పేలికైనా పిండి కట్ట మన్నారు.
పై ఆకు రాలితే కిందిఆకు నవ్వినట్లు.
పైకం భాగవతంవారికి, తిట్లు చాకలిమంగలివాళ్ళకు.
పైకం (పైసా) లేనివాడు పరస్త్రీవర్జితుడు.
పైచట్టంలో పరమాన్నం పాసరా! నన్ను లేపరా అన్నట్టు.
పైచాలులేని పైరు, పగలిఅంబలిలేని మనిషి.
పైత్యరోగికి పంచదార చేదు.
పైత్యం లేదు, శైత్యం లేదు, పచ్చడంబట్ట ఇటు పారవేయండి.
పైన పటారం, లోన లొటారం.
పైన పడ్డ మాట, మడిని పడ్డ నీరు.
పైన పారే పక్షి, కింద పారే చీమ.
పైన మంట, కింద మంట, కడుపులో మంట, కాలు నిలిపితే ఖామందు తంట.
పైర దోలితే పత్తి పండును.
పైరగాలికి పత్తిచెట్టు ఫలించును.

పైరగాలి తగిలితే పంట ఉరవు.

పైరుకు ముదురు, పసరానికి లేత.

పైరుకు రాగులు, భాగ్యానికి మేకలు.

పైరు మార్చిన పంటపెంపు.

పైసా! పైసా! ఏం జేస్తా వంటే ప్రాణంవంటి మిత్రుణ్ణి పగ చేస్తా నందిట!

పైసా పైసా ప్రాణం తీస్తుంది, వీసం వీసం ఇల్లారుస్తుంది.

పైసా ప్రాణఘాతికి.

పైసాలో పరమాత్ముడున్నాడు.

పొంకనాల పోతిరెడ్డికి ముప్ఫైమూడు దొడ్లు, మూడు ఎడ్లు.

పొంగినంతా పొయ్యిపాలే.

పొంగిన పాలు పొయిపాలు.

పొంగిన పుడిసెడు పోయె.

పొంగేకాలానికి బలుసు, క్రుగ్గేకాలానికి మామిడి.

పొంగేపాలమీద నీళ్ళు చల్లరాదు.

పొంగే పాలు, వెలిగే దీపం ఆర్చరాదు.

పొక్కటిరాళ్ళకు పోట్లాడినట్లు.

పొగతోటకు పాడినేల.

పొగాకు అడుక్కోవాలి, అందలం బయట పెట్టరా అన్నట్లు.

పొట్టకరుకు తిన్నవారికి ఊచబియ్యాలు లేవు. (ఎలా వస్తాయి ?)

పొట్ట కిచ్చినా, బట్ట కిచ్చినా భూదేవే.

పొట్టకు పుట్టెడు తిని అట్లకు ఆదివారము.

పొట్టతిప్పలకు జేరి పోతు లాడించాలి.

పొట్టనిండ చీరికలు, వట్టికాళ్ళ కురుపులు.

పొట్టపైరుకు పుట్టెడు నీరు.

పొట్లకాయకు రాయి కడితే సరిగాని కుక్కతోకకు గడితే ఫల మేమి ?

పొట్లచెట్టుకు (పాదుకు) పొరుగు గిట్టదు.

పొట్టి గట్టి, పొడుగు లొడుగు.

పొట్టితోకగల కోడె పొడిచినా నడవదు.

పొట్టిపోతరాజుకొలువువలె.

పొట్టివానికి పుట్టెడు బుద్ధులు.

పొట్టివానికి మితిలేని పొలతివాంఛ.

పొట్టివాని నెత్తి పొడుగువాడు కొట్టె, పొడుగువాని నెత్తి దేవుడు కొట్టె.

పొట్టు తిని పుట్టిల్లు చేయాలి.

పొట్టేళ్ళు పోట్లాడుతుంటే నడుమ నక్క వచ్చిందట !

పొడిచే ఎద్దు బెదరును.

పొడు మెక్కించే ముక్కు, పొగ పీల్చే నోరు శుభ్రంగా ఉండవు.

పొత్తుకు మళయాళం, సంబంధానికి సాంబారు.

పొత్తుమాట పొసగని మాట.

పొత్తులపనిలో పిత్తుక చచ్చినట్లు.

పొత్తులమగడు పుచ్చి చచ్చెను.

పొదుగు కోసి పాలు తాగినట్లు.

పొదుగు చింపిన పసరం పోతు నీనుతుంది.

పొదుగు లేని ఆవు పాలిస్తుంటే నాలికలేని పిల్లి నాకేస్తున్నది.

పొద్దుగాని పొద్దులో పెద్దిగానిపెళ్ళి.

పొద్దుటనుండీ పిత్తినపిత్తులు సోలెడు లేవు అన్నట్లు.

పొద్దుట లేవని కాపుకి పొలం ఇచ్చేది గడ్డే.

పొద్దుటవచ్చిన వాన, పొద్దుతిరిగి వచ్చినచుట్టం పోరు.

పొద్దుటేది పొట్టకు, మాపటేది బట్టకు.

పొద్దుతిరుగుడు, డొంకతిరుగుడు.

పొద్దునవచ్చినవాన, మధ్యాహ్నంవచ్చిన చుట్టం ఊరకే పోరు.

పొద్దున్నే వచ్చినవాన, ప్రొద్దెక్కివచ్చిన చుట్టం వదలరు.

పొద్దూ పోదు, నిద్రా రాదు, పద్మాక్షీ! ఒకపాటయినా పాడవే అన్నట్లు.

పొద్దుకలుగ లేచినందుకు, బాట తప్పినందుకు.

పొమ్మనక్కఱలేదు పొగ బెడితే చాలు.

పొమ్మనలేక పొగ బెట్టినట్లు.

పొయ్యలు చెడ్డదినంలో వేయాలి, పెండ్లిండ్లు మంచిదినంలో చేయాలి.

పొయ్యిఅరిస్తే, చుట్టాలు వస్తారు.

పొయ్యి అరిస్తే బంధువులు, కుక్కలు అరిస్తే కఱవు.

పొయ్యి ఊదమంటే కుండ బద్దలు కొట్టాడట!

పొయ్యి ఊదలేనమ్మ ఏడుమనువులు పోయిందట!

పొయ్యి ఊదినమ్మకు బొక్కెడయినా దక్కదా?

పొయ్యిప్రక్క వెన్నముద్దవలె.

పొయ్యి ఎక్కినమ్మకు గుడ్డ కాలును.

పొయ్యిలో ఉప్పు పోసినట్లు.

పొయ్యిసెగ పొంతకుండకు తగులకపోదు.

పొర్లించి, పొర్లించి కొట్టినా మీసాలకు మన్ను కాలేదు అన్నాడట!

పొరుగమ్మ సరి గెట్టుకుంటే, ఇరుగమ్మ ఉరి పెట్టుకుందట!

పొరుగింట చూడరా నాపెద్దచెయ్యి.

పొరుగింటిబానపాడికంటె, తనఇంట గిద్దపాడి మేలు.

పొరుగింటిఅట్లకు తిమ్మనం కాచుకుందట!

పొరుగింటిఅట్లకి నెయ్యి కాచినట్లు.

పొరుగింటికలహం వినవేడుక.

పొరుగింటి పుల్లగూర రుచి.

పొరుగింట్లో అట్లు పోస్తూఉంటే తనదాకా రాకపోతాయా?
పొరుగు పచ్చగా ఉంటే పొయిలో నీళ్ళు పోసుకున్నట్లు.
పొరుగున జగడమైన పోలెలు తిన్నంతవిలువ.
పొరుగుబిడ్డను దింపి లోతు చూచినట్లు.
పొరుగూరిచాకిరీ, పొరుగూరివ్యవసాయం తనను తినేవేకాని తాను తినేవి కావు!
పొరుగు దట్లు పోసితే, యింటిది పోరెలు పోస్తుంది.
పొరుగూరికి పోతే పోతుందా కీడు?
పొలములోని ఆబోతును పులి గొన్నట్లు.
పొల్లు దంచి బియ్యం చేసినట్లు.
పోకపోక పొరుగింటికిపోతే రాకరాక రెండుమాటలు వచ్చాయట!
పోకము డిప్పుతూ కోకవెల అడిగినట్లు.
పోకలకుండ చట్రాతిమీద పగులగొట్టినట్లు.
పోచమ్మకు, కందూరుపీర్లకు బోనాలు.
పోట్లాడేవాళ్ళు పొడిచినా పోవు.
పోటీకి సాటి లేదు.
పోతుగాడిదను ఎక్కి ఆముబ్బు విరిగినట్లు.
పోతున్నా నంటే నీయంత పోతుకు నే తేడ తెచ్చేది అన్నాడట!
పోతేపల్లివారికి పప్పే సంభావన.
పోయినకంటికి మందు వేయబోతే ఉన్నకన్ను ఊడిపోయిందట!
పోయినచోటల్లా పొగాకే అడిగితే.
పోయినది ఒర, ఉండేది కత్తి.
పోయిననీళ్ళకు కట్ట పెట్టినట్లు.
పోయినమగడు పోయినా పొన్నకాయలా గుండు కుదిరింది.
పోంగా పోరగా పైమీదబట్ట బరు వవుతుంది.

పోరానిచుట్టము వచ్చాడు, బొడ్డు వంచి తములపాకులు కోయ మన్నట్లు.

పోరానిచోట్లకు పోతే రారాని నిందలు రాకమానవు.

పోరినపొదుగు, రాచినకుండలు మనవు.

పోరు నష్టం, పొందు లాభం !

పోరు లేనిగంజి పుడిసెడైనా చాలు (పోసినంతేచాలు).

పోరుకు చాలక పొయ్యిదగ్గఱ సండితే, బొంత కాలి పోయె నారాయణా !

పోలనాటిలో పోకకు పుట్టెడు అమ్మితే ఆపోకా దొరకక పొల్లిపొల్లి ఏడ్చిందట !

పోలికి వచ్చిన భోగానికి, పొట్టేలుకు వచ్చిన రోగానికి తిరుగు లేదు.

పోలిగాడిచెయ్యి బొక్కలో పడ్డట్టు.

పోలీ ! పోలీ ! నీభోగ మెన్నాళ్ళే అంటే, మాఅత్త మాలపల్లినుంచి వచ్చేదాకా అన్నదట !

పోలేరమ్మ దిగి వచ్చినా పొలంకాపు కేమి భయం ?

పొరలులోనే లేకపోతే, పొడుగూనా ఉంటుందా ?

పౌరుషానికి పొత్రం మెడ కట్టుకొన్నట్లు.

—: : —

## ఫ

ఫకీరువాణ్ణి తెచ్చి పరుపులో కూర్చుండబెడితే లేచిలేచి మసీదులోనికి పోయాడట !

ఫరవాలేని చుట్టం వచ్చింది పాతచేట గొడుగు పట్ట మన్నట్లు.

ఫలానికి తగిన బీజము, నేలకు తగిన నీరు.

ఫాల్గునమాసపువాన పదిపనులకు చెఱుపు.

ఫిలాసఫీ గ్రూపు కాదు, పిండివంట కూర కాదు.

—::—

## బ

బంకచెక్కలు, జింకతోలు.

బగుళ్ళపనికి బరంతు లేదు.

బంగారపుకత్తా గొంతు కోసేందుకు ?

బంగారపుకత్తి అని గొంతు కోసుకుంటామా ?

బంగారపుపళ్ళెమునకైనా గోడచే ర్పుండవలెను.

బంగారమునకు పరిమళ మబ్బినట్లు.

బంగార ముంటే సింగారాని కేమి (కొదువ) తక్కువ ?

బంగారంకొద్దీ సింగారం.

బంగారం పోయినతర్వాత బట్ట చుట్టమా ?

బంగారుకత్తి యని మెడ కోసికొంటామా ?

బంగారుగాలానికి బంగారుచేపలు పడవు.

బంగారుచెప్పులైనా (ముచ్చెలైనా) కాళ్ళకే (నే) తొడగాలి.
బంగారు పాల్లున్నదిగాని మనిషి పోల్లు లేదు.
బంగారుమనిషి ఊరేగడానికి వెడితే ఇదే సందని భజంత్రీలు పారిపోయారట !
బంగు తిన్న కోతివలె.
బంగరుకే రంభ చిక్కుతుందా ?
బండకొయ్యకు బుద్ధి చెప్పినట్లు.
బచ్చనకోలలు, రిచ్చనగిల్లలు.
బడాయిబచ్చలికూరకు ధడా చింతపండు.
బండతలయు, మోకాలు ముడి పెట్టినట్లు.
బండ తీసి గుండు పెట్టినట్లు.
బండన్న పెండ్లికి బడితెబాజా.
బండవానికి పిండయోచన ఏమిటి ?
బండారము లేని కోమటి బాట్లు (బాటలు) బద్దిచ్చుకున్నాడట !
బండీ, ఎద్దు అమ్మినవాని బ్రతుకు బంది.
బండెక్కి సివా లాడుతూ బావగారు చూస్తారని భయపడ్డట్లు.
బండెడు ధన మిచ్చినా బావమరది లేని చుట్టరికం చేయరాదు.
బండి ఉన్నవానికి బండెడు త్రాళ్ళు.
బంతికి ముందు, స్నానానికి వెనుక (బావుకు వెనుక).
బంతిలో చిక్కింది భైరసబోకి.
బంతిలోనే వద్దంటే విస్తరాకు తెమ్మన్నట్లు.
బందరునాయుళ్ళ బడాయేగాని అడపసంచిలో ఆకూ, వక్కా లేదు.
బందరుబడాయి, గుంటూరులడాయి.
బందరుమూల మెరిస్తే బక్కఎద్దును (గొడ్డును) అమ్మిస్తుంది.
బందెలో ప్రాయసంకంటె స్వతంత్రంగా సజ్జరొట్టె మేలు.

బందేడు వచ్చి, కోడలు కొత్తా లేదు.
బంధువుడవు సరేగాని పైరులో చేయి పెట్టవద్దు.
బంధువులకు దూరము, బావికి చేరువ.
బంధువులంతా ఒకదిక్కు, బావమరది ఒకదిక్కు.
బంధువుతోనైనా పాలివ్యవసాయం కూడదు.
బంధువయితేమాత్రం బంధాలు తొలగిస్తాడా ?
బక్కవానికి బలసినవాడు బావ, బలసినవాడికి బక్కవాడు బావ.
బగబగమనువాని పంచన నుండవచ్చునుగాని నాలిముచ్చునట్టింట నుండరాదు.
బజారున పోయేవాడిని అబ్బా! అంటే ఎవరికి పుట్టావురా కొడుకా! అన్నట్లు.
బజారుబత్తెం, బావినీళ్ళు.
బజారులో కొట్లాడాలి, బంతిలో భుజించాలి.
బట్ట కాలితే సెట్టి విడుస్తాడా ?
బట్ట చాకలికి, జుట్టు మంగలికి.
బట్టచాటుపుండు, బావగారినైవేద్యం.
బట్టతలకు పేలు పట్టినట్లు.
బట్టతలకు, మోకాళ్ళకు ముడి వేసి (పెట్టి) నట్లు.
బట్టతలమ్మ పాపట తీయ మన్నట్లు.
బట్టప్పు, పొట్టప్పు నిలువదు.
బట్టలో పేలాలు వేయించినట్లు.
బట్ట విప్పి నీళ్ళు పోసుకుంటూ బావగారు వచ్చారని నిటారున నిల్చుందట!
బట్టాబాతా డొలేకాని నాబట్టదగ్గఱ బొట్టుకూడా లేదన్నట్టు.
బడాయి ఏమిర అన్నయ్యా! అంటే పైసా లేదుర తమ్ముయ్యా! అన్నాడట!

బడాయికి (పెద్ద) బావగారు చస్తే ఈడ్వలేక ఇంటివారందరు (ఇంటిల్లి
పాది) చచ్చారు.
బడాయికి బచ్చలికూర తినకపోతే తోటకూర.
బడాయికి బయటబడకుంటే బక్కనరాలు యిక్కలాక్కవచ్చాయంట
బడాయికి మీసాలు త్రిప్పితే సట్టుకొని వేలబడినట్లు.
బడాయికోరు బచ్చు, కూటికి లేక చచ్చె.
బడాయి గాలికి పోతే గుడ్డు నేలకు ఆనిందట!
బడాయి బండెడు, బట్టలు సందెడు.
బడాయి బండెడు, భత్తెం గిద్దెడు.
బడాయి బారెడు, పొగచుట్ట మూరెడు.
బడాయిబావగారా! అంటే ఏమే గుడ్డికంటిమరదలా! అన్నాడట!
బడికి బెత్తం, మడికి గెత్తం.
బడితె కలవానిదే బఱ్ఱె.
బడిపిల్లల బాట, పసులపిల్లల బాట అడుగరాదు.
బండికుండలం తేసి బట్టతలకాయలకు తెగని చిక్కు, బావిగిలకంత తల
నిండా పిలకున్నవారికి తెగుతుందా?
బడిలేని చదువు, నెంబడిలేని సేద్యం కూడదు.
బడివారపునక్క కుక్కలపాలానికి పోయిందట!
బడేసాయబుగడ్డం బారెడైతేనేమి, మూరెడైతేనేమి?
బడేసాయబును జోస్యులూ! తొలిఏకాదశి ఎన్నడని అడిగినట్లు.
బంతిభోజనానికి ముందు, వేన్నీళ్ళకు వెనుక.
బతుకంత (బ్రతుకంత) భాగ్యం లేదు.
బతుకనిబిడ్డ తెగబారెడు.
బతుక (బ్రతుక) నేరని బిడ్డ బారెడంత.
బతుకలేకపోతే భాగోతం (భాగవతం).

**బతుకలేక బడిపంతులు.**

బతుకలేనమ్మ బావిలో పడి చచ్చిందట!

బతుకలేనివాడు బావిలో పడితే తియ్యబోయినవాడు కయ్యలో పడ్డాడట!

**బతికి** (బ్రతికి) ఉంటే గరిటెడు **పాలు** లేవుగాని చస్తే సమాధిపై ఆవును కట్టేస్తా అన్నట్లు.

బతికి (బ్రతికి) ఉంటే బలుసాకు తినవచ్చు.

బతికి (బ్రతికి) ఉండగా పాలు లేవుగాని చచ్చినవెనుక గంగిగోవును దానం చేస్తా నన్నట్లు.

బతికి (బ్రతికి) చెడినవారితో బంధుత్వం చేయవచ్చునుగాని చెడి బ్రతికినవానితో చేయరాదు.

బతికితే బలిజోడు, లేకపోతే బోగమోడు.

**బతికితే** (బ్రతికితే) భూదానం, చస్తే గోదానం.

**బతికితే** (బ్రతికితే) వైద్యుడు బ్రతుకుతాడు, చస్తే బ్రాహ్మణుడు బ్రతుకుతాడు.

బతికిన (బ్రతికిన) పామును చంపుతారు, రాతిపాముకు మొక్కుతారు.

బతికిన (బ్రతికిన) బతుక్కి భగవద్గీతాపారాయణమా?

బతికి (బ్రతికి) పట్నం చూడాలి, చచ్చి స్వర్గం చూడాలి.

బతికి (బ్రతికి) బాలేబిడ్డయితే పాసుకంపు కొడుతుందా?

బతికే (బ్రతికే) బిడ్డయితే పాసుకంపు కొట్టునా?

బతుకు (బ్రతుకు) తక్కువైనా బడాయి ఎక్కువ.

బతుకు (బ్రతుకు) లెన్నాళ్ళు? భాగ్య మెన్నాళ్ళు?

బత్తె మెక్కడో సత్య మక్కడ.

బదులుమనిషి ఉంటే పగలు తలనొప్పి.

బందిపోటు తరిమినా బత్తులమందలోనికి పోరాదు.

బనగానపల్లి ఉరుసు, నావెంట రావే నరసు.
బయట తన్ని ఇంట్లో కాళ్ళు పట్టుకున్నట్లు.
బయట పులి, ఇంట పిల్లి.
బయటికి ఇంపు, లోపల కంపు.
బయిలున్నంత చదివి బయ్యన్న.
బయలులో ఉన్నంత బయన్న గీకె.
బఱకసేద్యం, తునకనేస్తం.
బరిగపంట, కడుపు మంట.
బఱ్ఱె అమేధ్యం తింటే (పాలు) చెడునా ?
బఱ్ఱెకొమ్ము అంటే ఇఱ్ఱికొమ్మన్నట్లు.
బఱ్ఱె చస్తే పాడి బయట పడుతుంది.
బఱ్ఱె, దూడ ఉండగా గుఱక గుంజకు వస్తుందా ?
బఱ్ఱెదూడవద్ద, పాతఅప్పులవాడివద్ద ఉండరాదు.
బఱ్ఱె నిచ్చి పోతును కొంటారా ?
బఱ్ఱె కొంబాంబే, గుఱ్ఱాని కొస్సెసు.
బఱ్ఱెపాడి ఎన్నాళ్ళు ? భాగ్య మెన్నాళ్ళు ?
బఱ్ఱె పాతిక, బండె ముప్పాతిక.
బఱ్ఱె పిల్లికాలు తొక్కితే పిల్లి ఎలుకపై మీసాలు దువ్వినదట !
బఱ్ఱెపిఱ్ఱలకు బవానీసుచీర.
బలము (౦) ఉడిగినా పంతె ముడుగదు.
బలము (౦) తక్కువైతే పైబట్ట బరువవుతుంది.
బలవంతాన పిల్ల నిస్తా మంటే కుల మేమి ? గోత్ర మేమి ? అని అడిగినాడట !
బలవంతుడి సొమ్ముకాని బాపడిసొమ్ము కాదు.
బలవంతునిచేయి పడితే బావిఅయినా చూచుకోవాలి, చంకఅయినా చేరాలి.

బలిజపుట్టుక పుట్టవలె, బత్తాయిబుద్ధి కొట్టవలె.

బలిజవారిపెండ్లికి జుట్టుతోసహా ఎరువు.

బలిమి లేనివేళ పంతంబు చెల్లదు.

బలిస్తే గోకి చంపుతారు, చిక్కితే నాకి చంపుతారు.

బల్లి పలికిందని బావపక్కలో చేరిందట !

బలుసు పండితే వడ్లు పండును (సజ్జలు పండును).

బలుసు పండితే గోలుసుల్లా కంకులు.

బలుసులేని తద్దినమున్ను, బులుసులేని యజ్ఞమున్ను లేదు.

బసవదేవునికి బడితెపూజ.

బసవన్నా ! బసవన్నా ! పాలు తాగుతావా ? ఊఁ, తాగవా ? ఊఁ.

బస్తీలో బజారు నయం, పల్లెల్లో గల్లీలు నయం.

బహుతిండి బహునాశనం అన్నారు.

బహునాయకము, బాలనాయకము, స్త్రీనాయకము.

బహువిద్య, బాత్ నహీ.

బద్దలైన (బ్రద్దలైన) గంట బాగా మోగదు.

బ్రతికి బాగారిని, చెడి స్నేహితుని చేరాలి.

బ్రతుకు లెన్నాళ్ళు ? భాగ్య మెన్నాళ్ళు ?

బ్రతుకలేనివాడా ! బడి పెట్టుకోరా.

బ్రతకలేక బడిపంతులు.

బ్రమిసి బాపనయ్యను పోతే శుక్రవారం చూపరా దన్నాడట !

బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా పనికిరాదు.

బ్రహ్మజ్ఞానులవారు వచ్చారు, బట్టగుడ్డలు (పట్టుగుడ్డలు) భద్రం.

బ్రహ్మ తలిస్తే ఆయుస్సుకు కొదువా ? మొగుడు తలిస్తే దెబ్బలకు కొదువా ?

బ్రహ్మ వ్రాసిన వ్రాత చెఱిచేవాడు లేడు. (తప్పునా ?)

బ్రహ్మ వ్రాసిన వ్రాలుకు ఏడువనా ? రాగులసంకటికి ఏడువనా ?
బ్రహ్మాస్త్రానికి తిరుగు లేదు.
బాంబెమ్మను వెంకటమ్మనాలి కాలం తప్పినప్పుడు.
బాజాలసందడిలో మంగళసూత్రాన్ని మరిచారట !
బాట బాగుండకపోతే పరుగెత్తబోకు.
బాడిగగుఱ్ఱానికి సుడులు పట్టి చూచు.
బాదేపల్లి సేట్లు, కాశీవాడుబూట్లు, లెక్కలు చూస్తే తూట్లు.
బాతాకానీవానికి బారనా ? నాకూ బారనా ?
బాధ కొకకాలము, భాగ్యాని కొకకాలము.
బాపడికి పప్పాశ, అల్లుడికి అత్తాశ.
బాపడు ఒంటిపూట పడ్డా, బత్తె ఒంటిపూట సడ్డా మానడు.
బాపనకూడు, భాడ్కావుచాకిరి.
బాపనవరుస బండవరుస.
బాపనవాడికొలువు, తెల్లగుఱ్ఱముకొలువు కూడదు.
బాపనవావి బండవావి.
బాపనసేద్యం, కాపులచదువు.
బాపనసేద్యం బడుగుల (బక్కల) నష్టం, కాపులచదువులు కాసుల నష్టం.
బాపనసేద్యం బత్తెం (భత్యం) చేటు, కాపుల చదువులు కాసులచేటు.
బాపనసేద్యం బతకటానికీ కాదు, బతికించటానికీ కాదు.
బాపనసేద్యం, బాలవైద్యం.
బాపనోళ్ళకోపం, వరిగడ్డిశాఖం.
బాపలలో చిన్న, బెస్తలలో పెద్ద.
బాపల వ్యవసాయం కాపులసమారాధన.
బావలు తప్పినా యే (వే) పలు తప్పవు, యే (వే) పలు తప్పినా ఏర్వాకపున్నం తప్పదు.

బాబుకు లేక బత్తైతో ఏడుస్తుంటే కొడుకు వచ్చి పెళ్ళో అన్నాడట!
బారకల్లమీద బట్ట పడ్డట్టు.
బారకావడివలె పడ్డావు, నీ వెవడవురా, మాఇంటిదేవరకు మ్రొక్కను
బారుబంగాళా, కొంప దివాళా.
బారెడు చుట్టుఅయినా బాటను పోమ్మన్నారు.
బాలనాయకం, బహునాయకం.
బాలలతుమ్ము, బాలెంతతుమ్ము మంచిది.
బాలపొంగు పాలపొంగు.
బాలలజలుబు నీళ్ళతో పోవును.
బాలలేని ఇంట్లో వృద్ధుడు బాడెనట!
బాలవాక్యం బ్రహ్మవాక్యం.
బాలురకు కోరలు వచ్చేప్పుడు కొంకులు తెగ భేదు లవుతవి.
బావకు మరదలుపిల్లపై ఆశ.
బాస బిస తప్పిన పట్టరా తంగెళ్ళు.
బావమరదికంటే బంధువు లేడు.
బావమరది బ్రతుకగోరును, దాయాది చావగోరును.
బావ లేనికోడలు బహుభాగ్యశాలి, మరది లేనికోడలు మరీమంచిది.
బావా! అని చూడబోతే రావా? అని కొంగు పట్టుకున్నాడట!
బావా! నీభార్య ముండమోసినదంటే మొఱ్ఱో అని ఏడ్చాడట!
బావికింద దున్ని బ్రతికినవాడు, చెఱువుకింద దున్ని చెడినవాడు లేడు.
బావి త్రవ్వబోగా భూతము బయటపడెనట! (పడె నన్నట్లు.)
బావిలోతు చూడవచ్చునుగాని మనసులోతు చూడలేము.
బావిలోని కప్ప రాచకార్యాలు మాట్లాడినట్లు.
బావి తప్పినవాడు, బడిందిరిగినవాడు ఒకటే.
బావిబిస తప్పితే పట్టతంగేళ్లు.

బ్రాహ్మడా! బ్రాహ్మడా! నీఆచార మెంత అంటే నీటికొద్దీ అన్నాడట!

బాహ్మడికీ, బత్తెగాడ్డుకీ చ లేమిటి?

బాహ్మణపాలేరుతనం చేస్తావా? పల్లకీ ఎక్కుతావా అంటే పల్లకీ ఎక్కితే ఒళ్లు కదులుతుంది, బ్రాహ్మణపాలేరుతనమే చేస్తాను అన్నాడట!

బ్రాహ్మణింటిలో పుట్టితి, భట్టింటిలో పెరిగితి, కోమటింటిలో చస్తి.

బ్రాహ్మణుడు ఒంటిపూట పడ్డా, పసరము ఒంటిపూట పడ్డా మానేడు.

బ్రాహ్మణునిచేయి, ఏనుగుతొండము ఊరుకోవు.

బ్రాహ్మణునిమీద సంధ్యా, కోమటిమీద అప్పూ నిలువదు.

బ్రాహ్మణులలో నల్లవాణ్ణి, మాలల్లో ఎఱ్ఱవాణ్ణి నమ్మరాదు.

బిందెకు మూత ఉందికాని, చెంబువుకు మూత లేదు.

బింకచెక్కలు జింకతోలు.

బిగువులేని కచ్చ, బీగములేని ఇల్లు.

బిగువైనప్పుడే బిగువైన సేద్యం.

బిచ్చం బిడబిడ, కుండలు లొడలొడ.

బిచ్చగాణ్ణి చూస్తే బీదవానికి కోపం.

బిచ్చగాణ్ణి పొమ్మన్నా అత్త చెప్పాలి, కోడలు పంపాలి.

బిచ్చగానిగుడిసె, మాఅక్క చూచి మురిసె.

బిచ్చపుకూటికి పేదరికమా?

బిచ్చపుకూటికి శనేశ్వరము అడ్డం పడ్డట్లు.

బిచ్చము వేయకున్నమానెగాని కుక్కను విడువకు మన్నట్లు.

బిచ్చానకు పోయినా బిగువు తప్పలేదు, దుప్పటి పోయినా వల్లెవాటు తప్పలేదు.

బిచ్చానికి వచ్చినవాడు, అచ్చంగా కాకపోయినా ఆపూటకు చుట్టమే.

బిడ్డఅయినా, బెడ్డఅయినా పుట్టాక విడచిపెడతామా ?

బిడ్డ ఎదిగితే కుండ ఎదుగును.

బిడ్డ చక్కిలంవలె ఎండిపోయా డంటే చక్కిలాలు ఇమ్మని ఏడ్చినాడట!

బిడ్డ చచ్చినా తొట్లమన్ను ఉడుగలేదు.

బిడ్డ చచ్చినా బారసాల బాగా జరిగింది.

బిడ్డచాటున పిత్తు దాగె, మొగుడిచాటున అంకు దాగె.

బిడ్డను గిల్లి ఊయల ఊచినట్లు.

బిడ్డను వేసి లోతు చూచినట్లు.

బిడ్డలను కన్నమ్మా, భిక్షము పెట్టినమ్మా చెడరు.

బిడ్డలు కన్నవారు, భిక్ష మెత్తినవారు చెడిపోరు.

బిడ్డలేని ఇంటికి ఆవుదూడ ముద్దు, ఏమీలేని ఇంటికి ఎనుపదూడ ముద్దు.

బిడ్డలేని ముద్దు, వానలేని వరద.

బిడ్డ వచ్చినవేళ, గొడ్డు వచ్చినవేళ.

బిడుగుచెడ్డముండ చీటికి ముగ్గు పెట్టిందట !

బిడ్డెత్తరి బిడ్డను కంటే ఎలుక ఎత్తుకపోయి ఎన్నుకుప్పలో పెట్టిందట !

బియ్యపుబస్తాలు పోతూంటే లేమగాని తవిటిచేటలకు వచ్చింది.

బిక్షానికి వచ్చినా బిగుమానం చావలేదు.

బిక్షానికి వచ్చినా బెట్టు తప్పలేదు.

బీడున కురిసిన వాన, అడవిని కాచిన వెన్నెల.

బీద బలిసి బందికా డయినట్లు.

బీదముఖంవాడా ! నీబిడ్డపెళ్ళి ఎప్పు డంటే మొద్దుముఖంవాడా !
మొన్ననే అయింది అన్నాడట !

బీదవాడిపెళ్ళాం అందరికీ వదినె.

బీదవాడు బిచ్చపువాడికి లోకువ.

బీదవానికి మాట ఈరాదు, కలిగినవానికి చోటు ఈరాదు.

బుక్కెడుతిన్నమ్మ బూరుగుమ్రానూ, చేరెడుతిన్నమ్మ చెక్కపేడు.
బుగతోరింట్లో పెళ్ళి, బుగ్గలు తిప్పకు మల్లి !
బుచ్చిరెడ్డి అనే భూతానికి రామిరెడ్డి అనే రక్షరేకు.
బుట్టలో పామువలె.
బుడబుక్కలవాని పెళ్ళికి జుట్టుతో సహా ఎరువు.
బుడ్డకు పెడితే భూతానికి, భూతానికి పెడితే బుడ్డకు.
బుడ్డగోచికన్న ఎక్కువ దారిద్ర్యం లేదు, చావుకన్న ఎక్కువ కష్టం లేదు.
బుడ్డది చిక్కినా, బలిసినా కష్టమే.
బుడ్డను నమ్మి ఏటిలో దిగినట్లు.
బుధవారంపుట్టిన దున్న భూమిని దున్నినా, తొక్కినా పొంగిపొంగి పండుతుంది.
బుద్ధి భూము లేలాలంటే, కర్మ గాడిదలను కాస్తా నంటుంది.
బుద్ధిమంతుడని సద్ది కడితే, బొంద్రాయిదగ్గఅనే భోంచేసినాడట !
బుద్ధిమంతులజడలు భుజాలు దిగవు.
బుద్ధి రాజ్యా లేలుతూంటే గ్రహచారం గాడిదలు కాస్తోంది.
బురదగుంటలో పందివలె.
బురదనీరు పారినాక మంచినీరు పారదా ?
బురదలో దిగబడ్డ ఏనుగును బొంతకాకయినా పొడుస్తుంది !
బుఱ్ఱ కొకగుణము, జిహ్వ కొక రుచి.
బులుపు తీరినగాని వలపు తీరదు.
బూకటికి బుద్ధి లేదు, వేకటికి సిగ్గు లేదు.
బూచీలకు బెదరునా బుగుడూరు సంత ?
బూటకానికి బుడ్డ దిగితే, ఆవిలిస్తే అవిసిపోయిందట !
బూటకాలకంద్దాసరికి బుఱ్ఱనిండా నామాలే.

బూడిదగుంటలో కుక్క సామ్యము.
బూడిదగుమ్మడికాయలదొంగ అంటే బుజాలు తడుముకున్నట్లు.
బూడిదలో చేసిన హోమంవలె.
బూడిదలో పోసిన పన్నీరు బుడబుడ.
బూతు లేకున్న నీతి లేదు.
బూనాచిమాటలు బూడిదకుకూడా రావు.
బూరుగపంటికి చిలుక కాచినట్లు.
బూరెలలో పురుగు లెంచినట్లు.
బెడిసి ముందుకు పడదు, జడిసి వెనక్కు పడదు.
బెండకాయ ముదిరినా, బ్రహ్మచారి ముదిరినా పనికి రాదు.
బెండ్లు మునిగి గుండ్లు తేలినట్లు.
బెత్తులకు బ్యాళ్ళబారు, మాయింటిలో చింతగుగ్గిళ్ళు.
బెదరించి బెండకాయపులుసు పోసినట్లు.
బెదరించి బెదరించి బెల్లపుకుండకు తూటు పొడిచిందట!
బెల్లపుపిళ్ళారికి ముడ్డి గిల్లి నైవేద్యం.
బెల్లపుపొయ్యికి ఈగలే నిదర్శనము.
బెల్లపువిఘ్నేశ్వరుడికి ముడ్డి గిల్లి నైవేద్యం.
బెల్లము ఉన్నంతసేపే ఈగలు ముసురుతాయి.
బెల్లము ఉందని మోచేతిదాకా నాకినట్లు.
బెల్లము ఉందా అంటే, అల్లము ఉంది అన్నట్లు.
బెల్లముఉన్న చోటే ఈగలు ముసురుతాయి.
బెల్లము కొట్టిన గుండ్రాయివలె.
బెల్లము పారవేసి ఆకు నాకినట్లు.
బెల్లము వండిన పొయ్యి, ఇంగువ కట్టిన గుడ్డ.
బెస్త పెద్దరికం, బాపని చిన్నరికం,

బొంకరా, బొంకరా పోలిగా అంటే! ఎద్దు గిట్టలో ఏడుచావిడాలు అన్నాడట!

బొంకరా బొంకరా పోలిగా! అంటే టంగుటూరి మిరియాలు తాటి కాయలంతేసి అన్నాడట!

బొంగు లొట్టయినా కణుపు గట్టి.

బొండుమల్లెలు బోడిముండ కెందుకు?

బొంత కుట్టుకున్నవాడు కప్పుకోలేడా?

బొందలకుంటకు నల్లేరు మోసినట్లు.

బొక్కలో పిల్ల, డొక్కలో పిల్ల.

బొక్కెసలో కొఱకంచువలె.

బొంగలుతిన్న నోరు, ఆడిపోసుకున్న నోరు రెండూ ఒకటే.

బొగ్గులకై కల్పతరువు పొడిచినట్లు.

బొగ్గులలో మాణిక్యంవలె.

బొగ్గులలో రామచిలుకవలె.

బొచ్చు కాలిస్తే బొగ్గగునా?

బొజ్జను నమ్మి ఏట పడ్డట్టు.

బొటనవేలికి సున్నము కాగానే బోర్లపడరాదు.

బొట్టు కట్టితేకాని ముండమొయ్యదు.

బొట్లబొట్లాకొండ బోనీలకొండ, నెమిలమ్మ గుడ్లయితే నే నెరుగనమ్మ.

బొట్టు పసే, బోనంపస లేదు.

బొమ్మకు మొక్కినా నమ్మక ముండవలె.

బోగముదాని నీతిని నమ్మే దెవరు?

బోగముదానివలపు, బొగ్గు తెలుపు లేదు.

బోటికి నీటు, కూటికి చాటు.

బ్రోడ్డితలకు, బొటనవ్రేలికి ముడి పెట్టినట్లు.

బోడితలకు బొండు (బొడ్డు) మల్లెలు ముడిచినట్లు.

బోడితలకు, మోకాళ్ళకు ముడి వేసినట్లు (లంకె వేసినట్లు).

బోడి నెత్తిన టెంకాయ కొట్టినట్లు.

బోడిపెత్తనం, కోడికునుకు.

బోడిపెత్తనం, తంబళ్ళదొరతనం.

బోడిమాను గాలికి ఖిండదు.

బోడెద్దుకు కొమ్ములు వచ్చినట్లు.

బోడెద్దుకు పోట్లు మప్పినట్లు.

బోదనం కొట్టితే రాజనం పండును.

బోనులో పడ్డ సింహమువలె.

బోయవాడి కొకడే ప్రభువా? బోగందానికి ఒకడే మగడా?

బోలెడు తిట్లయినా బొక్కెడుకొజ్జీలు కావు.

బోసినోటివానికి పేలపిండి ప్రీతి.

బోసిపంటికి దోకెడు నూనె ఎట్లా తెత్తును పగాని?

—: :—

# భ

భగవంతా! నాకేం చింత అంటే ప్రొద్దున లేస్తే పొట్టదే చింత.

భగభగ మండే అగ్నిహోత్రాన్ని పైగుడ్డతో మూట కట్టుకొన్నట్లు.

భగ్నజీవికే నగ్నసత్యం తెలుసు.

భంగు తాగేవానికి హంగుగాళ్ళు పదివుంది.

భక్తిలేని పూజ పత్రిచేటు (బత్తిలేని పూజ పత్తిరిచేటు).

భక్తి వచ్చినా పట్టలేరు, పగ వచ్చినా పట్టలేరు.

భట్రాజుకు పైస, బ్రాహ్మడికి పావలా.

భయంగల బల్లి బావచాటుకు పోయి బట్టుమంది.

భయంగల మరదలు బావముందు బట్టుమందట!

భయమెంతో అంతకోట కట్టుకోవలెను.

భరణిఎండలకు బండలు పగులును, రోహిణికార్తెలో రోళ్ళు పగులును.

భరణికార్తెలో చల్లినకాయకు చిప్పెడు పంట.

భరణికార్తెలో చల్లిన నువ్వుచేనుకాయకు బరిగెడు గింజలు.

భరణి కురిస్తే ధరణి పండును.

భరతుడి పట్నం, రాముడిరాజ్యం.

భర్తబడాయి భార్యమీద.

భర్తలోకం తనలోకం, కొడుకులోకం పరలోకం.

భత్యాలమజాలో పెళ్ళాన్ని అమ్మా! అన్నాడట!

భాగ్యముంటే బంగారం తింటారా?

భాగీరథి పిచ్చుగుంటుమీద పారినట్లు (ప్రవహించినట్లు).

భారములేని బావ చస్తే దూలము పడ్డ దుఃఖం లేదు.

భార్యచేతి పంచభక్ష్యపరమాన్నములకన్న తల్లిచేతి తవిటిరొట్టెనయం.

భార్యమాట బ్రతుకుబాట.

భారీముద్ర భారీముద్రే, కరకు కరకే.

భార్యాపున్నమకు పరగల్లు పచ్చబడతాయి.

భాషకు తగిన వేష ముండాలి.

భిక్షాధికారిఅయినా కావాలి, లక్షాధికారిఅయినా కావాలి.

భిక్షానికి వచ్చినా బిగువు (బిగుమానం) చావలేదు.

భిక్షానికి వచ్చినా బెట్టు తప్పలేదు.

భిక్షుపతి, లక్షపతి.

భిక్షం బిడబిడా అంటే దొంతులు లొడలొడా అన్నాయట!

భూతదయకలిగి ఉండవలెను.

భూతాలకు బుద్ధి లేదు, నసునకు బద్ధం లేదు.

భూమికి మించిన ఆస్తి లేదు.

భూమికి రాజు న్యాయము తప్పితే (ప్రజలు) గ్రామమువారందఱు
 ఏమి చేయగలరు ?

భూమికి వాన మేలా? అంటే మేలే అన్నట్లు.

భూమి కొత్తఅయితే భుక్తులు కొత్తా?

భూమిని చూర్ణం చేస్తే ఒట్టి డెసువే పుట్టెడు పండుతుంది.

భూమినీ, రాజునీ కాచుకున్నవాడికి లాభం.

భూమి మెత్తనయితే మోచేత తవ్వుతారు.

భూము లిచ్చినట్లు భూపతు లీయగలరా?

భేదం లేకుంటే గుమ్మతో గుద్దు లాడవచ్చును.

భోగాపురం బొల్లి మేఘాలూ! అక్షయపాత్ర కనుగ్రహామా!

భోజనం చేసినవానికి అన్నం పెట్ట వేడుక, బోడితలవానికి తలంటు
 వేడుక.

భోజనానికి నేనూ, మాబొప్పడు, లెక్క చెప్ప నే నొక్కడనే అన్నా
 డట!

భోజనానికి ముందు, స్నానానికి వెనుక.

భోజనానికి వచ్చి పొయ్యి త్రవ్వినట్లు.
భోజనానికి వద్దంటే పట్టుచీర కట్టుకొని వస్తానన్నట్లు.
భోజునివంటి రాజుంటే కాళిదాసువంటి కవి ఉంటాడు.

— : : —

## మ

మగాళ్ళమెరుగులు ముఖంపైనే కన్పిస్తవి.
మంగలములోని పేలాలభంగి.
మంగలికత్తికి మానులు తెగుతాయా ?
మంగలికత్తివాయిని నాలుకతో తాకినట్లు.
మంగలిని చూచి ఎద్దు (పిల్లి) కాలు కుంటింది.
మంగలి పాత, చాకలి కొత్త.
మంగలివానికత్తికి తనచేతిలోనూ విశ్రాంతి ఉండదు, మందిచేతిలోనూ
విశ్రాంతి ఉండదు.
మంగలిపని అనుకున్నావా తడిపి దిగగొరగడానికి !
మంగలికత్తులు దొమ్మరవారు.
మంగలివానిగుంట కుళ్ళగిస్తే బొచ్చే.
మంగలివానిదిబ్బ తవ్వేకొద్దీ బొచ్చే.
మంగలివానిపెంట పెళ్ళగిస్తే బొచ్చే.
మంగలివాళ్ళపెళ్ళికి మఱొకదెబ్బ.
మంగలోళ్ళ ఇంటెనక బొచ్చుదిబ్బ కాక మరేముంటుంది ?
మంగళగిరిమూల మాడంత మబ్బు పడితే ఈమనిజంపనల్లో ఈతలు
మోతలు.

మంగళవారంనాడు మండెలు వేయకూడదు.

మంచము అల్లరాని మగవాడు, మజ్జిగ చేయరాని ఆడది.

మంచ మున్నంతవఱకు కాళ్లు చాచు.

మంచ మున్నప్పుడే నీళ్ళాడు.

మంచ మున్నదగ్గతే నీళ్ళాడదా మంటాను.

మంచము ఎక్కి వరుస లాడినట్లు.

మంచముకోళ్ళకు, మాతామహులకు ముడి వేసినట్లు.

మంచముమీద ఉన్నంతసేపు మగడు, కిందికి దిగితే యముడు.

మంచికాలానికి మామిళ్లు, చెడుకాలానికి చింతలు.

మంచికి పోతే చెడ్డ ఎదు రయినట్లు (ఎదు రయిందట).

మంచికి పోతే మంచినీళ్లు పుట్టవు.

మంచిగొడ్డు కొకదెబ్బ, మంచిమనిషి కొకమాట.

మంచి చేసిన ముంగికి మరణం వచ్చినట్లు.

మంచిదున్నపోతయినా మందఎద్దుకు సమం కాదు.

మంచినోరు చేదు మింగినట్లు.

మంచిప్రాణానికి మండలంవఱకు భయం లేదు.

మంచిమంచి ముహూర్తాలు మీఇంట్లోనూనా? మాచకమ్మసమర్తలు మాఇంట్లోనూనా ?

మంచిబ్రాహ్మడని దండం పెడితే శీఘ్రమే మేవ హారిజనపుత్రప్రాప్తి రస్తు అన్నాడట !

మంచిగా ఉంటే నేను చేశా ననుకో, మంచిగా లేకుంటే మావాడు చేశా డనుకో.

మంచి ఉల్లిగడ్డకు మంచిబొడ్డు.

మంచి కొంచెమైనా చాలు.

మంచిదున్నపోతయినా మందఎద్దుకు సమం కాదు.

మంచిమంచివారంతా మడుగులో మునిగితే కోణంగిదాసరి కోనేటిలో మునిగెనట!

మంచిమాటకు మందిఅంతా మనవాళ్ళే.

మంచిమామిళ్లు తెలుపు, న్యాయం నేరేళ్లు తెలుపు.

మంచివాడు, మంచివాడంటే మంచ మెక్కి గెంతులు వేశాడట!

మంచివాడు మంచివాడంటే మడు రెక్కి ఉచ్చ పోశాడట!

మంచివాని కొకమాట, మచిగొడ్డు కొకదెబ్బ.

మంచివాని కొకమాట, మూర్ఖుని కొకచేట.

మంచివానికి మరణమే సాక్షి.

మంచివానికి మాట్లాడనిదే మందు.

మంచివానిగుణం మాంసందగ్గఱ, సత్యవంతుడిగుణం చావుదగ్గఱ (తెలుస్తుంది).

మంచివానికి మాటే మందు.

మంచు కుంచాల కొలిచినట్లు.

మంటిఎద్దయినా మాఎద్దే గెలవాలి.

మంటిదేవునికి మజ్జనమే సాక్షి.

మంటిపనికైనా ఇంటివాడు వెళ్ళాలి.

మంటిలో మానెడు, ఇంటిలో పుట్టెడు.

మడి మళ్లేసి, బందాణం పీకేసి, సరువ గోకేసి.

మడిచారుమీద మన్ను పోయ, అటికెడు చారు బోర.

మంత్రం (ము) చెప్ప మల్లుభట్లు, తినడానికి ఎల్లుభట్లు.

మంత్రం (ము) లేని తీర్థం మరిబుక్కెడు.

మంత్రం (ము) లేని సంధ్యకు మరిచెంబెడు నీళ్లు.

మంత్రసానితనానికి ఒప్పుకున్నతర్వాత ఏదివచ్చినా పట్టాలి.

మంత్రసానితనము ఒప్పుకున్నతర్వాత బిడ్డ వచ్చినా పట్టవలె, గొడ్డి వచ్చినా పట్టవలె.

మంత్రసానిదెప్పులు, అత్తగారి సాధింపులు.

మంత్రసానిముందట (ర) మర్మం దాచినట్లు.

మంత్రాలకు చింతకాయలు రాలునా?

మంత్రాలకు మామిడిపళ్లు రాలునా?

మంత్రాలు తక్కువ, తుంపురు లెక్కువ.

మందగు దెప్పెద్దునలె.

మందమే అందం.

మందికి చెప్పానుకానీ మనకు చెప్పానా?

మందిని ముంచి మసీదు కట్టినట్లు.

మంది పలుచనైతే గంజి చిక్కపడుతుంది.

మందిమాట విని మనువు పోతే మళ్ళీ వచ్చేసరికి ఇల్లు గుల్లయింది.

మంది యెక్కువయితే (మోపయితే) మజ్జిగ పలుచన.

మంది యెక్కువయితే (లావైతే) మఠానికి చేటు.

మందు ఎప్పుడు తేనెతోనే సేవించాలి.

మందుకు పోయినవాడు మాసికానికి వచ్చినట్లు.

మందూ లేదు, గుండూ లేదు తుపాకి పట్టుక కాల్చు మన్నట్లు.

మంద్దైనా కావాలి, ముంద్దైనా కావాలి.

మక్కాకు పోయి కుక్కమలం తెచ్చినట్లు.

మక్కాకు పోయినా టక్కరితనం మానలేదు.

మక్కీకి మక్కీ.

మక్కువపడి ముక్కాలిపీట చేయించుకుంటే ఢోరియాకోక కత్తిరించు
కుపోయిందట!

మఖ ఉరిమితే మదురుమీద కఱ్ఱయినా పండును.

మఖకు మానికంత చెట్టయితే కార్తికానికి కడవంత గుమ్మడికాయ.

మఖపుబ్బలు వఱపయితే మహాత్తరక్షామం.

మఖపుబ్బలు వఱపయితే మాఅన్నసేద్యం, నాసేద్యం మన్నే.
మఖలో చల్లిన విత్తనాలు మచ్చలు కనబడతాయి.
మఖలో పుట్టి పుబ్బలో మాడినట్లు.
మఖలో మానెడు, పుబ్బలో పుట్టెడు.
మఖలో మానెడు చల్లుటకంటె ఆశ్లేషలో అడ్డెడు చల్లుట మేలు.
మఖ వానల ఋతువు.
మఖాపంచకము సదా వంచకము.
మగడు ఒల్లనమ్మను మారీ ఒల్లదు.
మగనిసొమ్ము తిని మిండనిపాట పాడినట్లు.
మగవానిపెండ్లా? ఆడదానిపెండ్లా? అంటే అదేమో నాకు తెలియదు, గాడిపొయ్యిదగ్గరకు వెళ్ళినాను, గతికి వచ్చినాను అన్నాడట!
మగవాడుతిరుగక చెడును, ఆడది తిరిగి చెడును.
మగవానిబ్రతుకు చిప్పనిండ మెతుకు, ఆడదానిబ్రతుకు గంజిలోని మెతుకు.
మగ్గంగుంతలో పాముంది, మగోళ్లుంటే పిలవ్వే!
మగ్గంలో కండెవలె.
మగ్గాని కోకరాయి మరవకుండా పట్టండి.
మజ్జిగలో తౌళకా?
మట్టిఎద్దయినా మాఎద్దే గెలవాలి.
మట్టికుండలో ఉంటే మనోవ్యాధి, తోలుపొట్టలో ఉంటే తోచి ఉంటుంది.
మట్టికైనా ఇంటివాడే పోవాలి.
మట్టిగడ్డలో కప్ప కూస్తే ఒకజాములో వర్షం.
మట్టిగుఱ్ఱాన్ని నమ్మి ఏట్లో దిగినట్లు.
మట్టుమీరు మాటకు మారు లేదు.

మడతకుడుములు, శేషపాన్పులు.

మడికి గట్టు, ఇంటికి గుట్టు.

మడికి గట్టు, మాటకు గుట్టు.

మడికి మంద, చేనుకు ఎరువు.

మడి దున్ని మహారాజయినవాడూ, చేను దున్ని చెడ్డవాడూ లేడు.

మడిన పడ్డ నీరు, మైన పడ్డ దెబ్బ పోదు.

మడి బీద, రైతు పేద.

మడ్డిముండకు మల్లెపూ లిస్తే మడిచి ముడ్డికింద పెట్టుకున్నదట!

మడుగుచీరకు మసి తాకినట్లు.

మణిని మణితో కోయవలెను.

మణుం (గు?) గొట్టగా మాసం చిక్కినాడు.

మణుగు సగము, మైలయు సగమే.

మణులు చెక్కిన వంకెళ్ళవలె.

మతికొద్దీ (ఎంతో) గతి (అంత).

మతిమీద మన్ను పోతు, ఉప్పుకు పోయి నిప్పు తెత్తు.

మతిమరుపులవానికి మల్లిమరుపులవాడు.

మతిలేనమ్మకు గతిలేని మగడు.

మతిలేని మాట, శ్రుతిలేని పాట.

మతు లెన్ని చెప్పినా మామసక్కనే గాని తొంగో నన్నదట!

మతు లెన్ని చెప్పినా మంకుబుద్ధి మానదు.

మంత్రసానిన్మైయె వచ్చినపుడు పిల్ల వచ్చినా పట్టాలి, పిశున మొచ్చినా పట్టాలి.

మంత్రాల బువ్వ కడుపులోనికి పోతే యంత్రాలు చేయిస్తుంది, యంత్రాలబువ్వ కడుపులోనికి పోతే తంత్రాలు చేయిస్తుంది.

మదిలోన నొక్కటి, మాటాడు టొకటి (మదిరాత్ములకు).

మందబలం చూచి కుక్క మొరుగుతుంది.
మందిమాటలు పట్టుకొని మనుం బోతే మళ్ళొచ్చేవఱకి ల్లాగ మైం దట!
మందుకు పథ్యం, మాటకు సత్యం.
మద్దికాయలు మాబిడ్డమాడ్కి.
మద్దిమానుచేలో ఎద్దులు మేస్తే మాముద్దలు మానునా?
మద్దులు మునిగి పాఱ నతల్లో తమ కెంతబంటి అన్నట్లు.
మదుగు (ర) వార మడియైనా కావలెను, మాటకారిమగడై కావలెను
మదుగుమీదిపిల్లివలె.
మద్దెలలోని ఎలుకవలె.
మధురమీనాక్షి, కంచికామాక్షి.
మధ్యాహ్నం వచ్చిన చుట్టం, మాపటిజామున వచ్చిన వాన పోదు.
మనకు పులిభయం, పులికి మనభయం.
మనగుమ్మడికాయలు మంచివైతే బజార్లో ఎందుకు దొర్లుతాయి?
మనచల్ల మనమే పలుచన చేసుకుంటామా?
మనదికాని పట్నం మహాపట్నం.
మననువ్వుల్లో నూనె లేకపోతే గానుగవాణ్ణి అంటే ఏం లాభం?
మనబంగారం మంచిదయితే కంసాలి ఏమి చేయగలడు?
మన మొఱుగని చెవులకు మద్దికాయలా?
మన సుంటే మార్గ ముంటుంది.
మనసు కుదిరితే మల్లి, మనసు కుదరకున్న ఎల్లి.
మన సెఱుగని కల్లా? ఒ ళ్ళెఱుగని సివమా?
మనసు మండిగెలు చేసుకుంటే గోధుమ లెవ రిస్తాడు?
మనసు మహామేరువు దాటును, కాలు కందకం దాటదు.
మనసులేని మనువువలె.

మనస్సుకు మనస్సే సాక్షి.

మనస్సులో ఎంత ఉంటే సోదెలో అంత వస్తుంది.

మనసో, మామగారి తద్దినమో అన్నారు.

మన్మథుడే పురుషుడైనా మాయలాడి తనమంకుబుద్ధి మానదు.

మనిషి ఉన్ననాడు మజ్జిగ లేదు, ఒలికిలోకి పాడిఆవు.

మనిషి ఉన్ననాడు మజ్జిగ లేదు, కాష్ఠంమీదికి గంధపుచెక్కలు.

మనిషికాటుకు మందు లేదు.

మనిషి ఉండగా మంచినీళ్లు పోయరుగాని చచ్చినాక సమాధిలో ఆవు దూడను కట్టివేస్తారు.

మనిషికి ఉన్నది పుష్టి, పసరానికి తిన్నది పుష్టి.

మనిషికి ఒకమాట, పండు కొకరుచి.

మనిషికి మాటే అలంకారము.

మనిషికి రాక (మ్రాకుకు) మానికి వస్తుందా ?

మనిషిగబ్బు మారు మారు, నాగబ్బు తీరు తీరు.

మనిషి చస్తే మాట మిగులుతాది, ఎద్దు చస్తే ఎముక మిగుల్తాది.

మనిషి పేదయినా మాట పేద కారాదు.

మనిషి పోచికోలు కాడు.

మనువు చెడి ముండ బుద్ధిమంతురా లయింది.

మనిషి మంచిదేకాని గుణం గుడిసేటుది.

మనిషిమీదిపీడ మహిషిమీద పోయింది.

మనుగుడుపు పెండ్లికొడుకువలె.

మనుగుడుపునాటిమాటలు మనివినవా డుండవు.

మనువు నిత్యం కాలేదు, ఏకులరాట్నం అమ్మబోకు అన్నట్లు.

మనుమడు నేర్చుకున్నట్లు, అవ్వకు దురద తీరినట్లు.

మనువును నమ్ముకొని బొంత బోర్లవేసుకున్నట్లు (కున్నదట !)

మనువు లెన్ని చెప్పినా మామపక్కనే.

మనుష్యు లుండరుగాని మాట లుంటాయి.

మనుష్యులు పోయినా మాటలు నిలుచును.

మన్ను తిన్న పామువలె.

మన్ను తిని మంచినీళ్ళు త్రాగు.

మన్నును నమ్మి దున్నినవాడే మన్నీడు.

మన్ను పట్టితే బంగారం, బంగారం పట్టితే మన్ను.

మన్ను మగ్గితే మాలకైనా పండును.

మన్ను, మిన్ను మెత్తనయితే మనుష్యులకు బ్రతుకు.

మన్ను వెళ్ళకుండా దున్నితే వెన్ను వెళ్ళకుండా పండును.

మనోవ్యాధికి మందు లేదు.

మబ్బులు చెదరిపోయినా వాననీరు నిలిచే ఉంటుంది.

మబ్బులో పొద్దు మగడాలిని చెఱచును.

మబ్బు విడచిన ఎండ, మగడు విడచిన ముండ (పట్టి విడచిన మండ).

మఱచిపోయి చచ్చినాను, ప్రాణమా! రమ్మంటే వస్తుందా?

మఱచిపోయి మజ్జిగలో చల్ల పోశాను అన్నట్టు.

మఱచిపోయి మాకుబొట్టులో మజ్జిగ పోసింది.

మఱచి మామపెళ్ళాన్ని మరదలా అన్నట్టు.

మరుగుభాషపై మన్ను పొయ్యి, గంజిలో యింత ఉప్పెయ్యి.

మరువముతోనే పరిమళము.

మర్యాదకు పోతే మానం దక్కదు.

మర్యాదరామన్న మాట తప్పినా నావేటు తప్పదు.

మలపగేదె మానెడు పాలు ఇచ్చును.

మలపసన్యాసికి, మాచకమ్మకు జత.

మల్ల తెచ్చుకో అయ్యా! అంటే మఱింత బు న్వోట్టు అన్నట్టు.

మల్లీ! మల్లీ! మంచానికి కాళ్ళెన్ని? అంటే మూడున్నొకటి.

మలుగులు క్రుంగితే (గుంజితే) మూపటికి ఈనును.

మల్లెపూవులా గుతికి మొగలిరేకులా గిస్తిరి చేయుము.

మల్లెవట్టిన చేనువలె.

మళయాళంలో చెవులు కుడుతారని మాయవరంనుంచి చెవులు మూసికొని పోయినట్లు.

మసిపాతలో మాణిక్యమట్లు.

మసి పూసి మారేడుకాయ చేసినట్లు (అమ్ముతారా?).

మసిమొగమువాడు, చమురుకాళ్ళవాడు పోగయినట్లు.

మసీదు కాలె మదార్‌సాబ్ అంటే సందెడుబొంతలు చంక నున్నాయి అన్నాడట!

మహాంతమైన లొల్లి మానెడు వడ్లు అలుకదు.

మహామహావాళ్ళు మడుగులో పడుతూంటే కోణంగిదాసరి కోనేటిలో పడెనంట!

మహామహావాళ్లు మదుళ్ళకింద ఉంటే గోడచాటువారికి శరణు శరణు.

మహామహావాళ్లు మదుళ్ళకింద ఉంటే పుల్లాకు నాగ తేమి అన్నట్లు!

మహామహావాళ్లు మన్ను మూకుళ్లు అయితే నీ వొకజిల్లిమూకుడివి.

మహారాజావారని మనవి చేసుకుంటే మరిరెండు వడ్డించ (తన్న) మన్నాడట!

మహారాజుకైనా మన్ను నమ్మినవాడే అన్నం పెట్టాలి.

మహారాజు తింటే మందు తిన్నట్లు, పేదవాడు తింటే పేడ తిన్నట్లు.

మహారాజులమే కాని పొయ్యి రాజదు.

మహాలక్ష్మి పండుగకు మాడెత్తు చలి.

మహావృక్షంకింద మొక్కలు పెరుగవు.

మాంసం తింటామని ఎముకలు (దుమ్ములు, బొమికలు) మెడకు కట్టుకుంటామా?

మాంసం మాంసాన్ని పెంచుతుంది.
మా ఇంటాయనకు మగతనముంటే, పొరుగింటాయనతో పోయేదెందుకు ?
మా ఇంటికొస్తే మా కేం తెస్తావు? మీ ఇంటికొస్తే మా కేమి ఇస్తావు?
మా కాయుష్యము (మస్తు), మా కారోగ్యము (మస్తు).
మాకు కుడుము, మీకు చక్క.
మాగిపొద్దు మాటాడ దీరదు.
మాగి (న) చెడ్డగొడ్డు మాదిగింటికైనా తగదు (పనికిరాదు).
మాగిలి దున్నితే మరింత పండును (పంట).
మాగిలి దున్నితే మాలవానికైనా పైరగును (పండును).
మాఘమాసంలో మదురుమీది గడ్డి ఎండును.
మాఘమాసంలో మ్రాకులు సైతం వణకును.
మాఘమాసపు చలి మంటలో పడ్డా తీరదు.
మాఘమాసపు వాన, మగడు లేని చాన.
మాచకమ్మ సమర్త మఖయితేనేమి ? పుబ్బయితేనేమి ?
మాచక్కెరతో మీపొంగ లెందుకు వండాలి ?
మాచెర్ల దొరలకు మీసాలు లేవు, పల్నాటిదొరలకు వాసాలు లేవు.
మాటంటే మహారాజు నిలబడతాడు.
మాటకారి నీటుకాడు.
మాటకు పడి చస్తాముకాని మూటకు పడి చస్తామా ?
మాటకు పేదరికం లేదు.
మాటకు మాట తెగులు, నీటికి నాచు తెగులు.
మాటకు మాట శృంగారం, పేటకు కోట శృంగారం.
మాటకు ముందే ఏడ్చే మగవాణ్ణి, నవ్వే ఆడదాన్ని నమ్మరాదు.
మాటకు సొంపు, పాటకు ఇంపు.

మాటగొప్ప చెప్ప మాటలు చాలవు.

మాట ఘనము (గొప్ప), మానిక పిచ్చ.

మాటచుట్టమే కాని పూటచుట్టము కాదు. (చుట్టమా ?)

మాట చూడనిది మన సీయరాదు (మను వీయరాదు).

మాట తప్పినవాడు మాలవాడు.

మాటమాటకు తప్పు, బోడినెత్తికి ముప్పు.

మాటలకు మల్లి, పనికి ఎల్లి.

మాటలచేత మహాకాళిని నవ్వించవచ్చు.

మాటలచేత మహారాజుబిడ్డను మనువు తెచ్చుకోవచ్చు.

మాటలచేత మాన్యాలు సంపాదింపవచ్చును.

మాటల తేటలు (తీపి) మాయింటికాడ, మాపటిభోజనాలు మీయింటి కాడ.

మాటలతోనే మనుబోలువారు పేడూరు దాటినట్లు.

మాటలతో మూటలు కొనవచ్చును.

మాటలలో పడి మగనిని మఱచినట్లు.

మాటలసత్రానికి నా దోసిల్లా.

మాటలు ఆకులు, చేతలు పండ్లు.

మాటలు ఎన్ని చెప్పినా మామపొత్తు వదల నన్నదట !

మాటలు కోటలు దాటును, (గో) కాలు గడప దాటదు.

మాట పెదవి దాటిన పృథివి దాటును.

మాటలు కోటలు దాటునుగాని, కాళ్ళు కందకాలు దాటవు.

మాటలు నేర్చిన మొ (మ) నగాండ్లేగాని, పూటభత్యా మిచ్చే పుణ్యాత్ములు లేరు.

మాటలు తల్లిమాటలు, పెట్టు సవతితల్లిపెట్టు.

మాటలు నేర్వకపోతే పూటలు గడువవు.

మాటలు నేర్చిన కుక్కను వేటకు పంపితే ఉసుకో అంటే (ఉజ్జో అంటే) ఉసుకో (ఉజ్జో) అందట !

మాటలు పోయినాక మూటలు పనికిరావు.

మాటలు మంచి, చేతలు చెడ్డ.

మాటలు లేక మనుగడ లేదు.

మాటలే మంత్రాలు, చేష్టలే క్రియలు.

మాటలే మంత్రాలు, మ్రాకులే మందులు.

మాటలో నీ టుంది, మాటలో పో టుంది, మాటలో సూటి ఉంది.

మాట్లాడ నేరిస్తే పోట్లాట రాదు.

మాట్లాడితే మరామేకు.

మాట్లాడితే మల్లెలు, కాట్లాడితే కందిరీగలు.

మాట్లాడుతుంటే వచ్చేవి మాటలు, గోరుగుతుంటే వచ్చేవి వెంట్రుకలు.

మాటే లేకుంటే చోటే లేదు.

మాణిక్యం పోయినాక మసిబట్ట చుట్టమా ?

మాణిక్యానికి మసి పూసినట్లు.

మాత్రకు వెళ్ళినవాడు మాసికాసికి వచ్చినాడట !

మాదలన్నిటిలో కొమ్ముమాద ప్రమాదం.

మాది కాదు, మాఅత్తగారి సొమ్ము.

మాదిగమంచానికి కాళ్ళవైపు ఒకటే, తలవైపు ఒకటే.

మాదిగ మల్లి, కంసాలి ఎల్లి.

మాదిగవాని ఆలయినా మాడే (మంటే) కాలికి చెప్ప లేదు.

మాదేవునిసత్యం మాకు తెలియదా ?

మాదొబ్బే రెడ్డి వచ్చాడు, కోళ్ళకూటిలోపల మంచం వేయి అన్నట్లు

మాధవభట్లకు పడిశము ఏటా రెండుమాట్లు రావడము, వచ్చినపుడల్లా ఆరేసిమాసము లుండడము.

మాధుకరంవానింటికి ఉపాదానంవాడు పోయినట్లు.
మాధ్వుల భుక్తి, వైష్ణవుల భక్తి, అద్వైతుల యుక్తి.
మానం పోయినవెనుక ప్రాణ మెందుకు ?
మానంలో పుండు, మామగారి వైద్యం.
మానిందే మందు, బతికిందే ఊరు.
మానికకు కరవు లేదు, కోమటికి పరువు లేదు.
మానినపుండు మళ్ళీ రేపినట్లు
మానినరోగానికి మందు వద్దు, ఈనినకుక్క ఇంట ఉన్నది, వైద్యుడా! అన్నాడట !
మానిపండ్లు మానికిందనే పడును (రాలును).
మానుకొద్దీ చెక్క తీయాలి.
మానును చూచేవా ? మానును పట్టిన దయ్యాన్ని చూచేవా ?
మానుపిల్లి అయినా, మట్టిపిల్లి అయినా ఎలుకను పట్టేందే పిల్లి.
మానుపేరు చెప్పుకొని పండ్లమ్ముకొన్నట్లు.
మానెడు మంటిలో పోసుకుంటే యిద్దుము యింటిలో పోసుకుంటారు.
మానెడు పిండవచ్చునుగాని చిట్టెడు ఎక్కించలేము.
మానేదానికి మందేలా ? మననిదానికి మందేలా ?
మాపిల్లవానికి ముప్పైరెండు గుణా లున్నవిగాని రెండు మాత్రం తక్కువ.
మామబంతికి కూర్చున్నా, అత్తబంతికి లేస్తాడు.
మామతోకూడా మంచ మల్లి, తాతతోకూడా తడక కట్టడానికి వచ్చిందట !
మామా ఒకఇంటిఅల్లుడే, అత్తా ఒకఇంటికోడలే.
మామిడిచెట్టుకు మడిగుడ్డ కట్టినట్లు.
మామిడి మగ్గితే సజ్జలు పండును.

మామిళ్ళకాజ్ఞగాని గ్రుక్కిళ్ళకూ ఆజ్ఞా?

మామిళ్ళకు మంచు చెఱుపు, కొబ్బరికి కుడితి చెఱుపు.

మామిళ్ళు కాస్తే మసూచికాలు మెండు.

మామిళ్ళు మగ్గినా, నేరేళ్ళు నెగ్గినా ఘలము పెద్ద (మంచికాలానికి).

మాయసంసారం, మంటిదొంతులు.

మారకము మొన్నటిమాదిరే, తిండి ఎప్పటిమాదిరే.

మార్గశిరములో మాట్లాడడానికి పొద్దుండదు.

మార్గశిరాన మామిడిపూత.

మారికి వారశూలా?

మారుచీర లేక మేలుచీర కట్టుకొన్నట్లు.

మారుమనువు చేసుకుంటే మొదటిమగని సుద్దులు చెప్పినట్లు.

మారులేనితిండి మాదిగతిండి, దొరలేని తిండి దయ్యపుతిండి.

మారులోకానికి వెళ్ళినా మారుతల్లి వద్దు.

మారేడు మసి పూసి నేరేడు అన్నట్లు.

మాలకు మాంసం, గొడారికి తోలు.

మాలకూటికి పోయినా నీళ్ళపప్పే అన్నట్లు.

మాలకూటికి లోబడ్డా పప్పుబద్ద దొరకదు.

మాలదాన్ని ఎంకటమ్మా అంటే మఱింత బిగుస్తుంది.

మాలపల్లెలో మంగళాష్టకాలు.

మాలపున్నమముందర మాదిగవాడైనా చల్లడు.

మాలముండకు మంగళాష్టకాలు.

మాలలకు మంత్రాలు, బ్రాహ్మణులకు పీటలు.

మాలవాడకుక్క మఱి అన్న మెఱుగునా?

మాలవాడిపెళ్ళి మహాసూల్‌తో సరి!

మాలాయగారికి కోలాయగారు గురువు.

మాలీషు చేసినట్లూ ఉండవలె, కాపు చెడ్డట్లూ ఉండవలె.

మావాడు దెబ్బల కోరుస్తాడు అంటే విడిపించే దిక్కు లేక అన్నట్లు.

మావాళ్ళు వద్దన్నందుకు, మంగళగిరితిరునాళ్ళకు వెళ్ళినందుకు నావని
ఇలాగే కావాలి.

మావిళ్ళకు హద్దయిన గుటికిళ్ళకు హద్దా ?

మావి (మాసామ్ము) మా కిస్తే మడిమాన్యా లిచ్చినట్లు.

మాసికలేసిన గుడ్డ, దాసీదానిబిడ్డ.

మాసిమీద మాసి ఎక్కి కూకుంటే మోసిమోసి చచ్చా నన్నాడట !

మాసికానికి ఎక్కువ, తద్దినానికి తక్కువ.

మాసమెత్తు బంగారంతో గాడిదను చేయుము.

మాసె నభోమణి, నక్కలు కూసెన్.

మాంస మంటే పైసుయ్, పైస లంటె కైకుయ్.

మాంసం తింటామని బొమికెలు బుజాన పెట్టుకు ఊరేగుతామా ?
(మెడలో గుచ్చుకొని తిరుగుతామా ?)

మాంసం తినేవాడు పోతే, బొక్కలు తినేవాడు వస్తాడు.

మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగనూనె.

మింగినకడికి రుచి ఎందుకు ?

మించినదానికి మంచి లేదు.

మింటికన్నా పొడుగు, నగరికన్నా ధార్షికం లేదు.

మిండగాని జూచి గుండములో పడతాను.

మిండడిఈవి ఎంతో లంజమక్కువ అంత.

మిండని నమ్ముకొని జాతర పోయినట్లు.

మిండలను మరగినమ్మా, మీగడ తిన్నమ్మా ఊరకుండదు.

మిడిమేలపు మిండని ఉంచుకొన్న గట్టుకు మంచం మోయాలి.

మిగిలితే మిండ డౌతాడు అన్నట్లు.

మిగిలిన సన్నాసిన్నీ, మిగిలిన రాజును వదలరాదు.
మిగులుమనిషి ఉంటే పగులు తలనొప్పి.
మింటికన్న పొడుగు, నగరికన్న ధాష్టీకం లేదు.
మిట్టానువారికైతాను మిద్దెక్కి అదలించినా పోదు.
మిడికి చచ్చేదానిముందు కులికి చావాలి.
మిడుతంభట్లజోస్యంవలె.
మిడుతంభట్లు రైతులమిత్తి.
మిడుతదండు వచ్చిందంటే మిన్ను విరిగినట్లే.
మితం తప్పితే అమృతమైనా విషమే.
మితం తప్పితే హితం తప్పుతుంది.
మితం మీరి మెక్కరాదు.
మిద్దెఉన్నవాడు బ్రతుకడు, గుడిసెఉన్నవాడు చావడు.
మిద్దెమీదికోలాటంవలె.
మిద్దెమీదిపఱుగు, మీసాలమీది మెఱుగు.
మిథునంలో పుట్టిన మొక్క, మీసకట్టులో పుట్టిన కొడుకు అక్కరకు వస్తారు.
మినుములు తింటూ అనుములు చేతిలో పెట్టినట్లు.
మిన్ను ఎఱ్ఱనయినా, కన్ను ఎఱ్ఱనయినా కారక మానదు.
మిన్ను విఱిగి మీద పడిన అరచేతితో అడ్డగలమా?
మిన్ను విఱిగి మీద పడ్డట్లు.
మిరపకాయ చిన్నదని మేలమాడరాదు (కూడదు).
మీఇంట భోజనం చేసి మాఇంట చెయ్యి కడుక్కో అన్నట్లు.
మీఇంటి కొస్తే ఏమిస్తావు? మాఇంటి కొస్తే ఏం తెస్తావు?
మీఇంటిగేదె, మాఇంటిదూడ, తీసుకురా తిమ్మక్కా! పీసెదు నెయ్యి.
మీఊరేదయ్యా! అంటే ఏటిఅవతల తాటాకులపాలెం అన్నట్లు.

మీాకు మాట, మాకు మూట.
మీాగడ మింగేవానికి వెన్న ఎట్లా వస్తుంది?
మీాగాలిమీాద మెతుకు పడితే మిట్టిమిట్టిపడ్డట్లు.
మీాగాళ్ళువాచినమ్మా! మీాఇంట్లో పెండ్లి ఎప్పుడు? అంటే మోకాళ్లు వాచినమ్మా! మొన్ననే అయిపోయింది అన్నదట!
మీాగురువులు మాశిష్యులవద్దే చదువుకున్నారు.
మీాబిడ్డ కింత లవు డంటే మీాబిడ్డ కిన్ని పాలు అన్నట్లు.
మీాద మిలమిల, లోన లొటలొట.
మీాద మెరుగులు, లోన పురుగులు.
మీాదయలో మాగంజి.
మీాదిఆకులు రాలితే కిందిఆకులు నవ్వినవట!
మీారలేని చుట్టం వస్తే మిడకక తెల్లారదు.
మీాసాలపసేగాని కోసనాబట్ట.
మీాసాలు ఎందుకురా! అంటే మీామేన త్తచాలు అన్నాట్ట!
మీాసాలు వచ్చేటప్పుడు దేశాలు కానరావు.
ముగ్గు రెక్కిన బండి పొలిమేర దాటదు.
ముఖాలు చూచి బొట్టు పెడతారు, పిఱ్ఱలు చూచి పీట వేస్తారు.
ముంజలు తిన్నవానికంటే మోకులు తిన్నవానికే తంటా.
ముంజేతికంకణానికి అద్ద మెందుకు?
ముంజేతిలో సత్తువ ఉంటే మణికట్టులతో వడ్లు మెదుగుతాయి.
ముంజేయి ఆడితే మోచేయి ఆడుతుంది.
ముంజేయి మళ్ళితేనే మోచేయి మళ్ళును.
ముండకొడుకే కొడుకు, రాజుకొడుకే కొడుకు.
ముండ పెంచిన కొడుకు, ముకుదారంలేని కోడె.
ముండ పెంచిన బిడ్డ, ముకుతాడు లేని ఎద్దు.
ముండ ముప్పావుకు చెడ్డది, నరకడు పావుకు చెడ్డాడు.

ముండ మొయ్యవచ్చునుగాని నింద మొయ్యరాదు.

ముండమోపికాళ్ళకు మ్రొక్కితే, నీవు నాలెక్కనే వర్ధిల్లమని దీవించిందట!

ముండమోపి కేల ముత్యాలపాపట?

ముండమోపి బలుపు, పాండురోగి తెలుపు.

ముండ్లచెట్టుబంకకే పరిశ్రమం.

ముండ్లమీద బట్ట మెల్లిగా తీసుకోవలెను.

ముండా కాదు, ముత్తైదువా కాదు.

ముండాకొడుకు మాటకి జెడితే, ముండ నూటికి జెడ్డది.

ముంత మూతికట్టు, గంచి సభకట్టు.

ముంతలోనుంచి పెను గొంతక బోసినట్లు.

ముంతలో మూతి పెట్టి పాలు తాగు పిల్లి తన్ను ఎవరూ చూడలేదనుకున్నట్లు.

ముంతెడునీళ్ళకు ఉలిక్కిపడితే, బానెడునీళ్ళు నీ బావ పోసుకుంటాడా?

ముంతెడుపాలకు ముత్యమంత చేమిరి.

ముంతెడుపాలకు ముత్యమంత వెన్న.

ముందటివానికి ముంతంబలి, వెనుకటివానికి తెడ్డంబలి.

ముందర పల్లం, వెనుక మిట్ట.

ముందర శిర ముండగా మోకాలికి సేసలు పెట్టినట్లు.

ముందరికాళ్ళకు బందాలు వేసి, ముండలతాళ్ళు తెంపినట్లు,

ముందరికి వచ్చి కాలు విరుగపడ్డట్లు.

ముందుఅరకకు మొనగాళ్ళను కట్టవలెను.

ముందు ఆకు వేయించుకుంటే తరువాత ఎప్పుడైనా తినవచ్చు.

ముందున్నది ముసళ్ళపండుగ.

ముందు (కుపోతే) గొయ్యి, వెనుకకు పోతే నుయ్యి.

ముందు (కుపోతే) పోటు, వెనుకకు పోతే తన్ను.
ముందు (కుపోతే) మురికిముండ, వెనుకకు పోతే వెఱ్ఱిముండ.
ముందు చచ్చింది ముత్తైదువ, వెనుక చచ్చింది విధవ.
ముందు చూస్తే అయ్యవారిగుఱ్ఱంగా ఉంది, వెనుక చూస్తే సాహేబు గుఱ్ఱంగా ఉంది.
ముందు చేసిన తప్పు మూలను ఉంటే వెనుక చేసిన తప్పుమంచంకాడికి వచ్చినట్లు.
ముందు నడచే ముతరాచువాణ్ణి, వె(ఎ)నుక నడచే ఏనాదివాణ్ణి నమ్మరాదు.
ముందు నడిపించి కొంకులు కొట్టుట.
ముందు పెళ్ళాం బిడ్డలు ముంత ఎత్తుక తిరుగుతూఉంటే లంజకు బిడ్డలు లేరని రామేశ్వరం పోయినాడట !
ముందు పోయే ముతరాచువాణ్ణి, ప్రక్క వచ్చే ప్రట్రాతివాణ్ణి నమ్మరాదు.
ముందు పోయేది ముండ్ల కంప, వెనక పోయేది వెన్నముక్క.
ముందువారికి ముందోపులు, వెనుకవారికి దొప్పదోపులు.
ముందు ముచ్చట్లు, వెనుక తప్పట్లు (చప్పట్లు).
ముందు ముత్తైదువ, వెనుక విధవ.
ముందుకు పోయిన పొడుచు, వెనక్కి వచ్చిన తన్ను.
ముందు మునగ, వెనుక వెలగ (కూడదు).
ముందు మురిసినమ్మ పండుగ గుర్తెరుగదు.
ముందు ముల్లు త్రొక్కి వెనుక భద్రం అన్నట్లు.
ముందువాళ్ళకు మూకిళ్ళు, వెనుకవాళ్ళకు నాకిళ్ళు.
ముందు వచ్చినందుకు మున్నూరుఫరహాలు దండగ, మళ్ళీ ఏల వస్తివే? ఖాయదారితొత్తా !

ముందు వచ్చిన చెవులకంటె వెనుక వచ్చిన కొమ్ములు వాడి.
ముందు సంతకి అరువు ఏడ్చింది.
ముక్కిడికితోడు పడిశము.
ముక్కు ఉండేవఱకు పడిశ ముంటుంది.
ముక్కుఏదిరా అంటే తల తిప్పి చూపినాడట!
ముక్కు కోసినా ముందు మొగుడే మేలు.
ముక్కు కోసుకుంటే దేవుడు కనబడతాడు.
ముక్కు చిన్నది, ముత్యం పెద్దది.
ముక్కు చొచ్చి కంట్లో ప్రవేశించినట్లు.
ముక్కు డుస్సిన పసరంలాగు.
ముక్కు దాటితే ముక్తికి, నాలుక దాటితే నరకం.
ముక్కు నలిపి దీపం పెట్ట మంటే మొగుడి (మామ) ముక్కు నలిపిందట!
ముక్కు పట్టని ముత్యం, చెవు పట్టని కమ్మ.
ముక్కుపట్టినవానితో చీదించినట్లు.
ముక్కు పట్టుకుంటే ప్రాణం పోదా?
ముక్కు పోతే మూన్నాళ్ళకు వస్తుంది, కొప్పు కొయ్యరా కుమ్మర మొగుడా?
ముక్కు మూరెడు, సిగ బారెడు.
ముక్కు మూసుకుంటే మూడుగడియలు.
ముక్కులో ఏవేలు పెట్టినా వాటమేను.
ముక్కులోని వెంట్రుక కొప్పులోనికి వచ్చి, మూగవాడు అమ్మా! అన్ననాటికి చూతాం.
ముక్కోటిదేవతలకు మ్రొక్కినా, అక్క బ్రతకకనే పోయె.
ముఖంఅందం ముడ్డికి చేటు.

ముఖ ముంది, అద్ద ముంది.

ముఖము చూస్తే కనబడదా మీాగాళ్ళవాపు ?

ముఖము తేట, ముడ్డి తీట.

ముఖము తేట, మొల గజ్జి.

ముఖము బాగులేదని అద్దం పగులగొట్టినట్లు.

ముఖముమాడుపుదీప మింటికి కొర గాదు, అంకుబోతుభార్య మొగుడికి కొర గాదు, ఏడ్పుగొట్టుబిడ్డ చంకకు కొర గాదు.

ముఖములో సుఖం లేదు, మోకాళ్ళలో బిగువు లేదు.

ముగ్గురికి తెలిస్తే మూడులోకాలకు తెలుస్తుంది.

ముగ్గురిని కూర్చోరా ముండదైవం.

ముగ్గురిమధ్య ముంత దాగింది.

ముగ్గురు ఆడవాళ్లు కూడితే పట్టపగలే చుక్కలు పొడుస్తాయి.

ముగ్గురు ఎక్కిన బండి పొలిమేర దాటదు.

ముగ్గురు బిడ్డలను కంటే ముసలివానికైనా కొర గాదు.

ముగ్గురు మూడులోకాలయితే ముసలిది యమలోకం.

ముగ్గు వేయరానివారిని యముడు జాంబవంతుని నెంట్రుకలు పెరకబెడతాడట !

ముట్టుకుంటే ముత్యం, పట్టుకుంటే బంగారం.

ముట్టుకున్న మూడు దండుగలు.

ముట్లుడిగినతరువాత సమర్తసారె.

ముట్లుడిగినా మురిపె ముడుగలేదు.

ముడిబియ్యం తింటే ముప్పూ గడుస్తుందా !

ముడి మూరెడు సాగదు.

ముడివాటుసవాలుకు బ్రహ్మావాటుజవాబు.

ముడి వేశాక ముండయినా ముతకయినా తప్పదు,

ముడ్డి కాల్చి మూతికి వెన్న రాచినట్లు.
ముడ్డిని తన్నిన మూతిపళ్ళు రాలు.
ముడ్డి కిందికి నీళ్ళు వస్తే లేవకమానరు.
ముడ్డికి పేడ ఉన్నదెల్ల బండియెద్దేనా ?
ముడ్డి గిల్లి జోల పాడినట్లు.
ముడ్డిమీాద కొడితే మూతిపండ్లు రాలినట్లు. (రాలాయట !)
ముడ్డిలో కారం చల్లి విసనకఱ్ఱతో విసరినట్లు.
ముడ్డి మొఖం లేని బిడ్డ, మొదలు తుది లేని పాట.
ముతకో సతకో మూడుబట్టలు, కుంటో, గుడ్డో ముగ్గురుపిల్లలు.
ముత్యమంత పదనుంటే మూలకార్తెలో చల్లిన ఉలవచేను కాయును.
ముంతెడునీళ్ళకే ముద్దుల గునిస్తే వత్తెడు నీళ్ళెట్లా పోసుకుంటారు !
ముత్యాలు పగడాలు, ముట్టుకున్న జగడాలు.
ముత్యాలన్నీ ఒకచోట, నత్తగుల్లలన్నీ ఒకచోట.
ముత్తిని విడిచి సత్తిని తగిలించుకున్నట్లు.
ముదలియారిజంభం ఆముదానికి చేటు.
ముద్దముద్దకీ బిస్మిల్లా.
ముద్దవేసిన తట్టు, మూతినాకుడు మాటలు.
ముద్ర ముద్రపాళంగానే ఉండగా ముగ్గురుబిడ్డలతల్లి అయినట్లు.
ముదికొమ్మ వంగదు.
ముది మది తప్పిన మూడుగుణాలు.
ముదిమాను చేవ.
ముదిమాను వంగదు.
ముదిమికి ముచ్చట్లు లావు.
ముదిమిని కొఱ యానె ముంజె లంజయును (ప. వి. పు. 248).
ముదిముప్పున అంగటిముల్లు.

ముదిముప్పున మూడుగుణాలు.

ముదియగా ముదియగా మోహము లావు.

ముదిరి చచ్చినా, ఎండి ఇడిసినా వగపు లేదు.

ముదురున వేసిన పైరు, ముదిమిని పుట్టిన కొడుకు.

ముద్దు గుడవరా ముని పెండ్లికొడుకా! అంటే పెళ్ళికి వచ్చినవాళ్ళంతా నా పెళ్ళాలే అన్నాడట!

ముద్దు చేసిన కుక్క మూతి కరచింది, చనవు చేసిన భార్య చంక కెక్కింది.

ముద్దున పేరు చెడె, మురిపాన నడక చెడె.

ముద్దుముఖం గరుడసేవ.

ముద్దుల్ల గునియకు మునిపెండ్లికొడుకా! అంటే పెండ్లి కొచ్చిన వారంతా నాపెండ్లా లన్నాడట!

ముద్దులయ్య పోయి, మొద్దులయ్య అయినాడు.

ముద్దులాడితే ముక్కు నొక్కినట్లు.

మునగచెట్టుకు మున్నూరురోగాలు.

మునిగేవానికి తెలుసు నీటిలోతు.

మునిమాపటి మాటలు ముందుకురావు.

మునుపే ముక్కిడి, పైన పడిశం.

మునుముందు మీసాలొస్తున్న యందలి దేశాలు కానరావు.

మున్నూటఅరవైనాలుగు శిగనము లున్నా ఒకటే, ముప్పైఆరు గుల్లి కొప్పు లున్నా ఒకటే.

మున్నూటరువదిరోగాలకు మూడుగుప్పిళ్ళు కరకాయపొడి.

మున్నూటికులానికి ముప్పు లేదు, మొండికాలికి చెప్పు లేదు.

మున్నూరురూపాయ లిచ్చియైనా ముసలిదానిని కొనాలి.

మున్నూరురూపాయలైనా పెట్టి ముసలిదాన్ని కొనాలి.

మున్నూరువరహాలు పోయె, మూతిమీసాలు పోయె నంబిసోమయాజులు అన్నమాట నాకు తప్పదాయె.

మున్నూరుశిఖలైనా కూడవచ్చునుగాని మూడుకొప్పులు కూడరాదు.

మున్నూరత్తకు ముష్టికోడలు.

ముప్పదిపండ్లఆడదీ, మూడేండ్లమగవాడూ ఒకటి.

ముప్పదియామడజట్లు కూడుతాయిగాని, మూడుజుట్లు కూడవు.

ముప్పదిమూడుకోట్ల దేవతలు ముక్కు పట్టించగలరుగాని నారాయణా! అనిపించగలరా?

ముప్పదిమూడుమన్నపోతులు కడిగేవాడికి మూడు సాలగ్రామాలు కడుగుట కష్టమా?

ముప్పదిమూడుసిగ లిముడునుగాని మూడుకొప్పు లిముడవు.

ముప్పూట తిన్నమ్మ మూర్ఛపోయిందట!

ముప్పొద్దు తిన్నమ్మ మొగుడిఆకలి ఎఱుగదు.

ముప్పైతట్టలపేడ మోసే పోలికి మూడుపుంజాల దండ బరువా?

మురగన్నసందేహం నిస్సందేహం.

మురికిముండముచ్చట వేలపిండిచేటు.

మురికిమురికి ముత్తైదువుకంటె నెల్లడియైన విధవ మేలు.

మురిపెము తిరిపెముచేటు, ముసలిమొగుడు ప్రాణంచేటు.

మురిపెమునకు మూడునల్లపూసలు, కొలికికి ఒక తిరగలిరాయి.

మురిసి ముండమోపిని చేసుకుంటే మొదటిమొగుడిముచ్చట్లే.

ములగకాయకు తగిన ముండ్లెప్పుడున్నవో, కాకరకాయకు తగిన కరకులప్పుడున్నవి.

ములగకాయకు ముండ్లెన్ని? అంటే కాకరకాయకు గండ్లెన్ని? అన్నట్లు.

ములగచెట్టుమీద కాకిగూటివలె.

ములాయజాకు పోతే ముండగర్భ మైనట్లు.
ముల్లాలు తిండికి లేక మొత్తుకుంటూంటే పీర్లకు పంచదార!
ముల్లు తీసి కొఱ్ఱడచినట్లు.
ముల్లు తీసి గూటము కొట్టు.
ముల్లును ముల్లే తీయాలి, దొంగను దొంగే పట్టాలి.
ముల్లు పుచ్చి కొఱ్ఱడచినట్లు (అడచినచందము).
ముల్లు పెఱికి కొఱ్ఱు కొట్టుకొన్నట్లు.
ముల్లు వచ్చి అరటాకుమీద పడ్డా, అరటాకు వచ్చి ముల్లుమీద పడ్డా ఆకుకే మోసం.
ముషిణిచెట్టుఅయినా పచ్చనిచెట్టు కొట్టరాదు.
ముష్టికి నష్టిఏమి?
ముష్టికి మూడుసంచులా?
ముష్టిలో ముష్టి ధర్మముష్టి.
ముసలమ్మా! బుఱ్ఱ వణికిస్తావేమి? అంటే ఊరకుండి నే నేమి చేస్తా నన్నదట!
ముసలికాలానికి కుసుమరోగం.
ముసలికాలానికి ముప్పతిప్పలు.
ముసలికి ముఱ్ఱాట, బేపికి తొంగురాట.
ముసలిదానికి పెట్టినది, ముండకు పెట్టినది ఒకటే.
ముసలిముప్పున తొలిసమర్త.
ముసలివాడికి దసరాపండుగ.
ముసలివానికి ముండముద్దు.
ముసలివానికి ముద్దాశ.
ముసలివానిమాట, ముల్లులేనిబాట.
ముసలివాడయినా (ముసలోడయినా) బసిరెడ్డే మేలు.

ముహూర్తం మంచిదయితే ముండ ఎట్లా మోసెరా?
మూగవానిముందర ముక్కు గోకుకొన్నట్లు.
మూటికీ ముడి వేస్తే, ఏమీ లేదు.
మూడుకాసులదా(ప)నికి ముప్పావలా బాడుగ.
మూడుజన్మాలసంగతి చెప్పగలను, పూర్వజన్మలో ఇచ్చి పెట్టుకోలేదు, గనుక ఈ జన్మలో దేవుడు నా కీయలేదు, ఈ జన్మాన ఒకరి కియ్యలేదు, గనుక ముందుజన్మానకు నా కేమీ లేదు.
మూడుతరాలదరిద్రుడు ముష్టికి వచ్చినట్లు.
మూడుదుగ్గానులకు మూతిమీసం గొరుగుకొన్నట్లు.
మూడుదుగ్గానులకోతి ఆరుదుగ్గానుల బెల్లం తిన్నట్లు.
మూడునాళ్ళ (మూన్నాళ్ళ) ముచ్చటకు ఆరుజోళ్ళ చెప్పులు.
మూడునాళ్ళ (మూన్నాళ్ళ) ముచ్చటకు మూతిమీసాలు గొరిగించుకొన్నట్లు.
మూడునాళ్ళ (మూన్నాళ్ళ) ముత్తైదువతనానికి ఆరుజోళ్ళ లక్కాకులు.
మూడు (నెలలు) (ఏళ్లు) సాము చేసి మూలనున్న ముసలిదాని కొట్టెనట !
మూడుపావలాల గుడ్డ, ముప్పైరూపాయలు కుట్టు.
మూడుపుట్ల చెవిటివానికి ఆరుపుట్ల చెవిటివాడు ఆలోచన చెప్పినట్లు.
మూడుబోనాలు సిద్ధమయినవి, దివ్వెకట్ట ముడికి వచ్చినదిదొరగారూ! సువారానకు రావచ్చును.
మూడుమనువులు వెళ్ళినా పొయ్యి ఊద మన్నారట !
మూడు మాటలు, ఆరు తప్పులు.
మూడుమూరా ఒకచుట్టు, ముప్పైమూరా ఒకచుట్టు.
మూడు మూసి ఆరు అతకమన్నారు.
మూడుమ్మూరులు తప్పిన ఏడు దూరాలు.

మూడుదినాలకు మురికిచుట్టం.

మూడురోజు లుంటే మురికిచుట్టం.

మూడువందలు పెట్టి గేదెను కొని మూడణాలు పెట్టి తాడు కొనలేనట్లు.

మూడు వేలు పోయె, మూతిమీసాలు పోయె, నంబిసోమయాజులు అను పేరుమాత్రం తప్పదాయె.

మూడుసంధులు ముళ్ళు పడ్డాక ముసలమ్మ సమర్తాడిందట!

మూడుసార్లకు ముడిపడుతుంది.

మూతి పెట్టినవాడు మేత పెట్టడా?

మూతి ముద్దుల కేడిస్తే వీపు గుద్దుల కేడ్చిందట!

మూతులు నాకేవాడికి మీసా లెత్తేవా డొకడు.

మూర్తి కొంచెమైనా కీర్తి దొడ్డది.

మూరెడుఇంట్లో బారెడు కట్టె, ఎట్లా కొడతావు కొట్టర మొగడా!

మూరె డెక్కే దెందుకు? బారెడు కుంగే దెందుకు?

మూరెడు ముందుకు పోనేల? బారెడు వెనక్కు కుంగనేల?

మూలకార్తెకు వరి మూల చేరుతుంది.

మూల కురిస్తే ముంగారు పాడు.

మూల ముంచును, జ్యేష్ఠ తేల్చును.

మూల మురుగ కురియు, జ్యేష్ఠ చెడ కురియు.

మూలలో చల్లినడులవలు మూడుపువ్వులు, ఆరుకాయలు.

మూలవాన ముంచకతీరదు.

మూలవిగ్రహాలు ముష్టి ఎత్తుకుంటూఉంటే ఉత్సవ విగ్రహాలకు దధ్యోదనము.

మూలవిరాట్టు మొత్తుకుంటూఉంటే ఉత్సవవిగ్రహాలకు తెప్ప తిరునాళ్ళు.

మూలిగేనక్కమీద తాటికాయ (పండు) పడ్డట్లు.

మూలిగిన మూతికేసి రాస్తారు.

మూలుగులు మునుపటిలాగే, భోజనాలు ఎప్పటిలాగే.

మూసిచూడను కాసులేదు, ముండను చూస్తే ముద్దొస్తుంది.

మూసినముత్యం, మాయని పగడం.

మూసినవాయనం ముత్తైదువవలె.

మూసిపెట్టితే పాచి పోయిందట !

మృగశిరకార్తెలో ముంగిళ్ళు చల్లబడును.

మృగశిర బిందిస్తే ఇరుకార్తెలు ఎల్గించు.

మృగశిర బిందిస్తే (కురిస్తే) ముసలిఎద్దు ఱంకెవేయును.

మృగశిర బిందిస్తే మిగిలినకార్తెలు కురియును.

మృగశిర వాన కురిస్తే ముంగాలి పండును.

మెచ్చి మేకతోలు, కోరి గొఱ్ఱెతోలు కప్పుతారు.

మెట్ట దున్నినవాడు, లొట్టె త్రాగినవాడు ఒకటే.

మెట్ట నున్నా ఏనుగే, పల్లాన ఉన్నా ఏనుగే.

మెట్టను మాత, పల్లాన భార్య.

మెట్ట రైతు లొట్టిపిట్ట.

మెట్లచప్పుడేగాని దోవ జరుగదు.

మెడకు పడ్డ పాము కఱవకతీరదు.

మెడ తడవడం పూసలకొఱకే.

మెడ నూతులవారింట్లో పిడిగుద్దుల సమారాధన.

మెడపూసలకు సమ్మసరిపోయిన బొమ్మలాట ఆడినట్లు.

మెడలో రుద్రాక్షలు, మదిలో మదిరాక్షులు.

మెత్తగా ఉన్న మోచేతితో త్రవ్వినట్లు.

మెత్త నాళ్ళు పోయినవి, చెత్తనాళ్ళు వచ్చినవి.

మెత్తనిచోటనే గుద్దలివాడి.

మెత్తనిమాట లాడరా అంటే, దూది, దున్నపోతు, గద్ద అన్నాడట!

మెత్తనివాణ్ణి చూస్తే మొట్ట బుద్ధి అయినట్లు.

మెత్తలు ఎండకు వేస్తే మెడలు నొప్పులు పోతాయట!

మెతుకు పోతే బ్రతుకు పోతుంది.

మెతుకులు చల్లితే కాకులకు కొదువా?

మెయ్య (మేయ) బోయి మెడకు తగిలించుకొన్నట్లు.

మెఱుగు వేయనిదే మృదువు కాదు.

మెఱుపుకొద్దీ వర్షము.

మెఱుపు దీపం కాదు, మేఘం గొడుగు కాదు.

మేకకు జ్ఞాపకముండేది మేతప్రసంగమే.

మేకకు మెడచన్నులు, తాళ్ళకు తలచన్నులు.

మేక పిల్లను ఒడిలో పెట్టుకొని మేడలంతా వెదకినట్లు.

మేక పులిని కఱచునా?

మేకపెంటిక ఎక్కడున్నా ఒకటే.

మేక మెడచన్ను కుడిస్తే ఆకలి తీరునా?

మేకలు తప్పితే తుమ్మలు, మూలలు తప్పితే ఈదులు.

మేకలే మడకలు దున్నితే ఎద్దుల నెవడు కోరును?

మేకవన్నె పులివలె.

మేకశిరం మెత్తగా ఉన్నదని మఱికాస్త లాగాడట!

మేకును పీకిన (పెఱికిన) కోతివలె.

మేఘాలు కురిస్తేనే మేడలు మిద్దెలూనా?

మేఘాలు నలుపయిన వాన తెలుపే.

మేడలు గుడిసెలు కావడంకన్నా గుడిసెలు మేడ లవడం మేలు.

మేడికాయపై మిసిమివలె.

మేడిసిరి కీడు చేయదు.

మేతకన్న మసలితేనే బలం.

మేతలన్నిటలోకి బీటిమేత మేలు.

మేదరసాలదుర్గం మీాద మేకకాలంత మొయిలు మేస్తే, తుల్లూరు దొండపాడు కాయ దూడకట్టుఅయినా కాదు.

మేనత్తపోలికలు, మేనమామకళలు.

మేనత్తమూాతికి మీాసాలు తగిలించి పిన్నాయనా! అని పిలిచినట్లు.

మేనమామ కైతే ఇవ్వడు, పోలుబొందలలో పెడతాడు.

మేనమామపోలిక, మేనత్తచాలిక.

మేపే రూపు.

మేమే అంటే మెడలెక్క కూర్చున్నాడట!

మేలిమిా కావలె, మెడా తిరుగవలె.

మేలు నే లంటే మెడ విరుగబడ్డట్టు.

మేస్త్రీలు మేడ కడితే కుక్కకాలు తగిలి కూలిపోయిందట!

మేసేగాడిదను కూసేగాడిద వచ్చి చెరిచిందట!

మేసేజన్మలు మేతలు మానినవి పలుకులు మానండక్కా పంజరాల చిలుకల్లారా! అన్నట్లు.

మేహజాడ్యం, తోటసేద్యం.

మైనపుగోడలనుగురించి కంచుగోడలు కాలిపోయినవట!

మైలసంతలో గంతలు సాగవు.

మొండిఈతకు మోపెడు జూక లన్నట్లు.

మొండికి తగ్గ మిండడు.

మొండికి సిగ్గు లేదు, మొరడుకు గాలి లేదు.

మొండికీ బండకూ, నూరేండ్రాయుస్సు.

మొండికెక్కినదాన్ని మొగు డేమి చేయు? రచ్చ కెక్కినదాన్ని రాజేమి చేయు?

మొండి కెత్తితే మొగు డేమి చేస్తాడు? బండ కెత్తితే బావేమి చేయు?

మొండిగురువు, బండశిష్యుడు.

మొండిచెట్టు గాలికి మిండడు, మొలకులేనివాడు దొంగలకు మిండడు.

మొండిచేతితో మొత్తుకున్నట్లు.

మొండిచేతితో మూర వేసినట్లు.

మొండిచేతివానికి నువ్వులు తిన నేర్పినట్లు.

మొండితోకగొడ్డు రాగోరును, గుడ్డిగొడ్డు పోగోరును.

మొండిదానా! నీ మొగు డేమి చేసినా డంటే, అటు కొట్టి, ఇటు కొట్టి ఆడే (వాడే) పోయాడు అన్నదట!

మొండిది మొగుడిపెళ్ళి కెళ్ళి, అర్ధరాత్రివేళ అడ్డగోడచాటునుండి అర్ధరూపాయికట్నం చదివించిందట!

మొండిముక్కున ముక్కెర ఉంటే మూతి తిప్పడమే ముచ్చట అనుకొన్నదట!

మొండిముక్కున ముక్కెర ఉన్నట్లు.

మొండివాడు రాజుకన్నా బలవంతుడు.

మొక్కజొన్నకండె మొదలు, పొగాకు చివర.

మొక్కబోయిన గుడి (దేవళం) ముక్కలై మీద పడ్డట్లు.

మొక్కబోయిన దేవర (దేవుడు) ఎదురుగా వచ్చినట్లు.

మ్రొక్కగా చేతులు కోయు.

మ్రొక్కిన మ్రొక్కు చక్కనై మొగనికండ్లు రెండుపోతే ఆరుగాళ్ళ జీవాన్ని దేవునకు అర్పితం జేతు.

మొక్కుబడే లేదంటే ఒక్కదాసరికైనా పెట్ట మన్నట్లు.

మొక్కేవానికి వెఱవనా? మొట్టేవానికి వెఱవనా?

మొక్కై వంగనిది మ్రానై వంగునా?

మొగ (ముఖ) దాక్షిణ్యానికి పోయి ముండకు కడు పయిందట!

మొగపిల్ల బంగారు పుల్ల.

మొగపిల్లలున్న ఇల్లు మోదుగులున్న నీడ.

మొగపిల్లలున్న యిల్లు, మోదుగులున్న వనం చెడవు.

మొగబుద్ధి మోటుబుద్ధి, ఆడుబుద్ధి అపరబుద్ధి.

మొగవానిమూతిపై నున్న, నాకు ముంజేతిపై నుంది.

మొగము చూచి బొట్టు పెట్టినట్లు.

మొగము చూచి మాట, పిఱ్ఱ (ముడ్డి) చూచి పీట.

మొగముమాప్పని మొగుడికి చేటు, ఈప్పుకాళ్ళని ఇంటికి చేటు.

మొగమోటమునకు, మోక్షమునకు దూరము.

మొగమోటానికి పోతే ముండ గర్భిణి అయిందట !

మొగవారికాలు సేయి తాకితే ఆడువారు పెకల్లుతారట !

మొగిలునీసు నమ్మి చెఱువుకట్ట తెంచుకున్నట్లు.

మొగిళ్ళు చూచి మోట చాలించినట్లు.

మొగుడికే మొగతనం ఉంటే అగసాలాయనతో అనపర మేమి ? (అగసాలెవాని అక్కఱ ఏమి ?)

మొగుడికే మొగతనం ఉంటే తంబళ్ళవారి తగులాటమేమి? (తంటా ఏమి ?)

మొగుడిమీద కోపం పొద్దు మునిగేవఱకే.

మొగుడు అంటే ఘోష, డబ్బు అంటే ఆశ.

మొగుడు ఈయని గౌరవము, తల్లి చేయని గారాబము.

మొగుడు ఒగ్గినా మామ ఒగ్గడు.

మొగుడు కొట్టినా కొట్టె, ముక్కుచీమిడి బాగా వదలింది.

మొగుడు కొట్టినందుకు కాదు కాని తోడికోడలు తొంగిచూచినందుకు (దెప్పినందుకు).

మొగుడు కొట్టినాడని మొల్లవానిదగ్గఱకు పోతే మొల్లవాడు తెల్లవార్లూ కొట్టినాడట !

మొగుడు కొద్దీ వన్నెలు, సిరికొద్దీ చిన్నెలు.

మొగుడు చచ్చినవెనుక ముండకు బుద్ధి వచ్చిందట!

మొగుడు చచ్చినా చచ్చేగాని, బోడితల బొంగరంలా అమరింది అన్నట్లు.

మొగుడు చచ్చి మొత్తుకొంటూంటే మిండగాడు రాళ్ళు మీద విసరినాడట!

మొగుడు చచ్చి మొత్తుకొంటూంటే అంకుమగడు వచ్చి రాళ్ళు రువ్వాడట!

మొగుడు చచ్చి మొత్తుకొంటూంటే మిండగాడు వచ్చిమీద పడ్డాడట!

మొగుడు పోయి మొత్తుకుంటూంటే అంకుమొగుడు వచ్చి రెక్కట్టుకున్నాడట!

మొగుడు ముండా! అంటే ముష్టివాడు ముండా! అంటాడు.

మొగుడు లేకపోతే అప్పమొగుడు, కూర లేకపోతే సప్పికూర.

మొగనిమీది కోపంచేత మాదిగవాని వెంట పోయినట్లు.

మొగుడు కొట్టినకొట్లు ఊరెల్ల రట్లు, మిండడు కొట్టినకొట్లు ముత్యాల కట్లు.

మొగుడు లేనిదానికి మంత్రసాని ఎందుకు?

మొగుడు విడిచినా మామ విడువడు, మామ విడిచినా దేవతార్చన బ్రాహ్మడు విడువడు.

మొగుడు విడిచిన మగువకు బుద్ధి వస్తుంది.

మొగనిని చూచిన దండుగ, మిండని చూచిన పండుగ.

మొగుడు పెళ్ళాం పోట్లాడి యాయవారం బ్రాహ్మణ్ణి చావ కొట్టినట్లు.

మొగనిపెత్తనం, మొండిమేనత్త.

మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కి ఏడ్చిందట!

మొగుణ్ణి కొట్టి మొగసాలకు మొఱ పెట్టుకొన్నట్లు (ఏడ్చినదట!)

మొగుణ్ణి కొట్టి మోసాని కేడ్చిందట!
మొగుళ్ళపొద్దు మోసపుచ్చె, కోడలిప్రాణం కొలుకులలోనికి వచ్చె.
మొగునితో పెళ్ళికి, పిల్లలతో తీర్థానికి వెళ్ళరాదు.
మొత్తుకోళ్ళోయి ముత్తముసెట్టి.
మొత్తేవానికే మోటనును పాలిస్తుంది.
మొగటి మానెడు, దూడ చస్తే దుత్తెడు.
మొదటికి మోసం, లాభానికి గుద్దులాట.
మొదటికి మోసమయితే వడ్డీ ముట్టలే దన్నాడట!
మొదటికి మోక్షమే లేదు, కొడుకుపేరు గోవిందు.
మొదటి దానికి మొగుడు లేడు, కడదానికి కల్యాణం.
మొదలు మోదుగ పూస్తే కొనను సంపెగ పూయునా?
మొదలు లేదు శ్రీరామా! అంటే మొలతాడు లేని గోచి అన్నాడట!
మొదలు లేదు సబ్బక్కా! అంటే ఒక్క దేవరకు మొక్కక్కా! అందిట!
మొదలు లేదు సబ్బక్కా! అంటే ముంతెడీ పెద్దక్కా అన్నదట!
మొదలే కోతి, పైగా కల్లు తాగినట్లు.
మొదలే దుర్బలం, అందులో గర్భిణి.
మొదలే మన్ను, కఱవు వస్తే గడ్డలు.
మొప్పెకు మూరెడు నోరు.
మొయిలును నమ్మి చెఱువును తెగకొట్టినట్లు.
మొయిలు విడిచిన ఎండ, మొగుడు విడిచిన ముండ, పట్టె విడిచినమండ, ఎత్తి విడిచిన కుండ.
మొఱకునకు సివ మెత్తిన మ్రొక్కక తప్పదు.
మొల్లలో మొల్లి మొండిచెయ్యి చూపించెయ్యి.
మొఱిగే కుక్క కఱవదు.

మొఱ్ఱో! మొఱ్ఱో! వద్దనగా లింగం కట్టేరుగాను మొక్క చేతులు తేగలరా?

మొలది విప్పి తలకు చుట్టినట్టు.

మొలబంటిదుఃఖం, మోకాలిబంటి సంతోషం.

మొలిచే చెట్టు మొలకలోనే తెలియును.

మొసలిబావా! కడియము వేటాయెగాని కాలైనా ఇంతేకదా?

మ్రొక్కబోయిన దేవళం ప్రక్కలై మీద పడ్డట్టు.

మోకాటిలో మెడనరం పట్టినట్లు.

మోకాళ్ళకు బట్టతలకు ముడివేసినట్లు.

మోకాళ్ళు ముందుకు, మోచేతులు వెనక్కు.

మోకాలు మునిగింది అని ముక్కుకుంటారా?

మోకాలెత్తు విగ్రహం ముంతేడు మొలలోతు కుండు.

మోచేయి ఆడితే ముంజేయి అడును.

మోచేతిదెబ్బ చూడక తాచిప్పకు అతుకు పెట్టబోయినట్లు.

మోచేతిదెబ్బ మొగుడింటికాపురం.

మోచేయి పోయి మొకరానికి తగిలినట్లు.

మోటకు పొమ్మంటే ఆటకు పెట్టినాడు.

మోటువాడి కేమి తెలుసు మొగలిపూపువాసన?

మోటువాడికి ముక్కుమీద కోపం.

మోటువాడికి మొదటిచోట కంపు, వన్నెగాడికి ఒళ్ళంత కంపు.

మోటువానిచేతికి మొగలిపు వ్విస్తే, మూడిచి ముడ్డిలో పెట్టుకున్నాడట!

మోట్లు కొట్టగా మొగనితోటిగా లేస్తే గుడ్డబట్టలు దులిపేవఱకే కూటికి వేళాయె.

మోదుగలున్న చేను, మొగబిడ్డ ఉన్న కొంప చెడదు.

మోసేవానికి తెలుసు కావడిబరువు.
మోసేవానికి తెలుసు కోమటిబరువు.
మోహము లేకపోతే మోదము లేదు.
మోహానికి కళ్లు లేవు.
మోక్షానికి పోతే మొసలి ఎత్తుకపోయిందట!
మౌన మర్ధాంగీకారం.
మౌల్వీలు మదుసు మేస్తూంటే పీర్లకు నాకంజా?

— : : —

## య

యజమాని చూడని చేను ఎంత పెరిగినా నష్టమే.
యజ్ఞానికి ఏమి యత్నమంటే కత్తులూ, కటార్లూ అన్నట్లు.
యజ్ఞం పెట్టి రంకు తెలుపుకొను.
యతి అంటే ప్రతి అన్నట్లు.
యతికోటకు పోతే మతి పోయింది.
యథాయథలందఱు ఏటిలో (నల్లువలో) పోతే పుల్లాకు నావ నేమి అన్నదట!
యథార్థవాది లోకవిరోధి (బంధువిరోధి).
యథార్థానికి ఏడు చాళ్లు (తెరలు) అక్కఱ లేదు.
యముడు ఒక్కణ్ణి చంపితే ఏతాము ముగ్గురిని చంపుతుంది.
యాదవకులంలో ముసలం పుట్టినట్లు.
యుగాలనాటి యుధిష్ఠిరుడువలె.
యోగికీ, రోగికీ, భోగికీ నిద్ర లేదు.

— : : —

# ర

రంకాడ నేర్చినమ్మ బొంకాడ నేర్వదా?

రంకుటాలికి క్రొత్తడిసుద్దులు మెచ్చు.

రంకు నేర్చినమ్మ బొంకు నేర్వకపోతే కొంకనక్కలపాలవుతుంది.

రంకు నేర్చినమ్మ బొంకు నేర్వాలి.

రంకుమగడు కడుపునొప్పి ఎఱుగడు.

రంకుమగడు వీపుమన్ను దులుపునా?

రంకులసాని రాగం తీస్తే రల్లిబండ రాతిలింగకడకు నడుస్తుంది.

రంకు సాగితే పెళ్ళెందుకు?

రంపాన కోసి రాచినకొలది గంధానికి కంపెక్కువ.

రాతనార తీసినట్లు.

రాతికంటె గట్టి రాయలసీమకోడి.

రాతికుండకు ఇనుప తెడ్డు.

రాతినుయ్యి, ఇనుపబొక్కెన.

రాతిప్రతిమకు చక్కిలిగింతలా? (గిలిగింతలా?)

రాయి గుద్దనేల? చేయి నొవ్వ నేల?

రాయి టెంకాయవలె.

రాయి తిని, రాయి అరిగించుకొని.

రాయివోలె ఉంటె రాసికొందము, పూవువోలె ఉంటె పూసికొందము

రాల రువ్వినవానిని పూల రువ్వినట్లు.

రెక్క ఆడితేగాని డొక్క ఆడదు.

రెక్కలకష్టం, బొక్కలపులుసు.

రెక్కలు విఱిగిన పక్షివలె.

రెప్పలతో దీపాలు ఆర్పినట్లు.

# ర

రంగడికి, లింగడికి స్నేహం, రొట్టెకాడ గిజగిజలు.

రంగముసొమ్ము, అంకుసొమ్ము నిలువదు.

రండ తుపాకి వేస్తే గుండు గాలికి పోయింది.

రండ వ్రా (రాతకు) పెండసిరా.

రజకచక్రవర్తీ! అంటే అంత పెద్దపేరు మాకెందుకు దొరా! మీకే ఉండనీ అన్నాడట!

రథసప్తమి కోడళ్ళను పెట్టినత్తను కొంచబోతుంది.

రథసప్తమినాడు రథాలు తిరుగుతాయట సూర్యునివి.

రంభచెక్కిలి గొట్టి రాట్నం తెచ్చినట్లు.

రట్టా, రవ్వా రావిపాటివారిది, పుస్తె, పూసా పూసపాటివారిది.

రత్నాన్ని బంగారంలో పొదిగితే రాణింపు.

రత్నాన్ని మువ్వి గాజును కోరినట్లు.

రత్నాలన్నీ ఒకచోట, నత్తగుల్లలన్నీ ఒకచోట.

రత్నాలన్నీ ఒకచోటికి, రాళ్ళన్నీ ఒకచోటికి.

రత్నాలు తినే పక్షికి రత్నాలు, రాళ్లు తినే పక్షికి రాళ్లు.

ర మ్మన్నారు తిమ్మన్న బంతికి.

రమాపతే, సీతాపతే, పొద్దున లేస్తే పొట్టఆపతే (దే).

రవికలోనే చీర మిగిలించాలంటే ఎలాగు?

రవి గాననిచో కవి గాంచునేగదా.

రవ్వ రవ్వతో తెగుతుందికాని రాతితో తెగుతుందా?

రసం ముదిరితే రాగం, పాకం ముదిరితే పాట.

రసీదు తప్పిన మసీదు.

రక్షించినవాణ్ణే భక్షించినట్లు.

రా అమ్మేగాని పో అమ్మ లేదు.

రాకు, పోకు బంగారుచిలక.

రాకుండా చూచి పోకుండా కొట్టినట్లు.

రాగం లేని భోగం, త్యాగం లేని ఈవి.

రాగం లేనివాడు, రోగం రానివాడు లేడు.

రాగల శని రామేశ్వరము వెళ్ళినా తప్పదు.

రా గాడిద, పో గాడిద.

రాగానికి నేను, అందానికి మాఅప్ప.

రాగిపైసా చెల్లకుంటే రాజుబిడ్డ దిగి వస్తుంది.

రాగిపోగులు తగిలించుకున్నా వేమిరా అంటే నీకు అవైనా లేవుకదా అన్నాడట !

రాగి రాగోరును.

రాచతనానికి జందెపుపోచా గుర్తు ?

రాగులరాయి తిరుగుతూఉంటే రాజ్యమంతా చుట్టాలే.

రాఘవా! స్వస్తి, రావణా ! స్వస్తి.

రాచపగ త్రాచుపగ.

రాచపీనుగ తోడు లేనిదే చావదు.

రాచవారి భోగం రైతుల త్యాగం,

రాజరాజులకు రాజదండం, కాపుకు కరుకోల.

రాజరాజుకు రాజదండం, రైతుకు నాగలి.

రాజాంకాయ పిచ్చికొండ, యామున్నగారికి భసాపంకం.

రాజాజ్ఞకు మించిన శాసనము లేదు.

రాజ్యము వీరభోజ్యము.

రాజ్యాలు ఊడిగినా (చెడ్డా పోయినా) లక్షణాలు ఉడుగలేదు (చెడ లేదు) (పోవు).

రాజు అన్నా రెడ్డి అన్నా ఒకటే.

రాజు ఎంతో ధర్మము అంతే.
రాజు ఎవరైనా రాగులు విసరేది తప్పదు.
రాజు ఏదారైతే ప్రజ లాదారి.
రాజుకంటె మొండివాడు బలవంతుడు.
రాజుకన్నా చిన్న, మంత్రికన్నా పెద్ద.
రాజుకత్తికి రెండువైపులా పదునే (వాలే).
రాజుకూతురైనా ఒకనిఆలే.
రాజుగారి కిద్దరు మంత్రులు, ఒకనిపేరు లంచాలు, రెండవవాడిపేరు మంచాలు.
రాజుగారికొడుకైనా కావాలి, సానిదానితమ్ముడైనా కావాలి.
రాజుగారికోటలో ఘన ముంది.
రాజుగారి (పెద్ద) మొదటిభార్య పతివ్రత.
రాజుగారిపెళ్ళాం మేడ ఎక్కితే కుమ్మరివాడిపెళ్ళాం గూ డెక్కిందట!
రాజుగారి పెళ్ళాం మేడ ఎక్కితే కుమ్మరివాడికోడలు గుడి సెక్కిందట!
రాజుచేతి నిమ్మపండువలె.
రాజు చేసిన కార్యాలకు, రాముడు చేసిన కార్యాలకు ఎన్నిక లేదు.
రాజు తలిస్తే గాజుకంబాల కేమి కొదువ!
రాజు తలిస్తే దెబ్బలకు కొదువా?
రాజుదృష్టికి రాయి పగులును.
రాజునకు కంటను, పామునకు పంటను విషము.
రాజును చూచిన కంటితో మొగుణ్ణి చూస్తే మొట్ట బుద్ధయింది (మొత్తుకో బుద్ధయింది).
రాజుపాపం పురోహితుని కొట్టుకపోవును.
రాజు పాలన తప్పితే నేల సారం తప్పుతుంది.
రాజు పోతులాగే ఉన్నాడు, రాజుపెళ్ళాం రంభలాగే ఉంది.

రాజు మెచ్చినది మాట, మొగుడు మెచ్చినది రంభ.
రాజు రాకడ లేదు, త్రోవ నూకుడు లేదు.
రాజు రాజే, బంటు బంటే.
రాజులతోటి చెలిమి, పాములతోటి చెలిమి.
రాజు వలచిన రంభ, రాజు విడిచిన తుంబ.
రాజులసొమ్ము రాళ్ళపాలు.
రాజులసొమ్ము లంజలపాలు.
రాజులేని ఊళ్లు, పూజలేని గుళ్ళు.
రాజులేని రాజ్యం, కాపులేని గ్రామం.
రాట్నం వస్తున్నది, బండి తీ దారిలో అన్నట్లు.
రాట్నానికి రెండు చెవులు, నాకూ రెండు చెవులు.
రాతిపశువును పూజిస్తారు, చేతిపశువును బాదుతారు.
రాత్రిఅంతా రభసే అయితే రక్తి ఎప్పుడు ?
రాత్రిఅంతా రామాయణం విని తెల్లారి రాముడికి సీత ఏమవుతుంది! అన్నాడట !
రాత్రి చీకటి, పగలు వెలుగు.
రాత్రి పడ్డ గోతిలో పగలు పడనా ?
రాదన్నపని రాజుపని, వస్తుందన్న పని తొత్తుపని.
రానిపాట పాడ వేడుక, బోడితల అంట వేడుక.
రానివాడిమీద రాయి.
రానివానిని పిలువ వేడుక.
రాను రాను రాజుగుఱ్ఱం గాడి దయిందట !
రానూ వచ్చె, పోనూ పోయె, రాగులు విసరి సంకటి చేయుము అన్నాడట !
రాబందుకు, రాజుకు తేడా లేదు.

రామక్క కేమి పోయె? రామన్న కేమి పోయె? రాసిలోనిదే దోసెడు పోయె.

రామాయణ మంతా విని రామునికి సీత ఏం కావాలని అడిగాడట!

రామాయణ మంటే సామాన్యం గాదు, గాడిదమోతంత ఉంది.

రామాయణం అంకు, భారతం బొంకు.

రామాయణంలో పిడుకల (వేట్లాట) వేట.

రామాయణం అంటే ఏమో అనుకున్నానుగాని మాశిబరు వుంది అన్నాడట!

రాముడినాడు లేదు, భరతుడినాడు లేదు, శత్రుఘ్నునినాడు చెవుల వాదులు అన్నట్లు.

రాముడులేని రాజ్యంలాగ.

రామునిపాదాలు తగిలితే రాళ్ళు రమణు లౌతవి.

రామునివంటి దేవుడు, రావణునివంటి రాక్షసులు లేరు.

రామునిరాజ్యం, భరతుని పట్నం.

రామునివంటి రాజుంటే హనుమంతునివంటి బంటూ ఉంటాడు.

రామేశ్వరం పోయినా శనేశ్వరం పోదు (తప్పదు).

రామేశ్వరం వెళ్ళినా అంకుమగడు తప్పలేదట!

రాయడి తలది చాకలి మొలది.

రాయంగ రాయంగ కరణం, దగ్గంగ దగ్గంగ మరణం.

రాలిన పూవు రెమ్మ కెగియదు.

రాళ్ళచేనికి గుంటక తోలినట్టు.

రాళ్ళచేను రత్నాలు పండుతుంది.

రాళ్ళుచెలుక రండబిడ్డ కాపువారికి అచ్చివస్తాయట!

రాళ్ళు తినే పక్షి రాళ్ళు తింటుంది, రత్నాలు తినే పక్షి రత్నాలు తింటుంది.

రావణాసురుడి కాష్ఠంవలె.

రావేమయ్యా తిండివేమయ్యా! అంటే వెనక్కే పోయా నన్నాడట!

రాష్ట్రం దాగినా ఱంకు దాగదు.

రీతికి వస్తేకదా రంగానికి వచ్చేది?

రుచి మరిగిన పిల్లి ఉట్టిమీదినుంచి ఉట్టిమీది కెగిరినట్లు.

రుచీ పచీలేని కూర కంచానికి చేటు, అందం చందం లేని పెళ్ళాం (మొగుడు) మంచానికి చేటు.

రూక లేనివాడు పోక చేయడు.

రూపాయిబిళ్ళ చంద్రబింబంలాగ చెయ్యి జారినట్లు.

రెంటికి చెడ్డ రేవడువలె.

రెండ తుపాకి వేస్తే గుండు గాలికి పోయిందట!

రెండుఆవులపాలు తాగిన దూడ.

రెండుఊళ్ళ వ్యవసాయం, ఇద్దరుభార్యల సంసారం.

రెండుఏండ్ల ఎండు, మూడేండ్ల మురుగు ఉండదు.

రెండు కండ్లు పోయెను, నోట్లో మన్ను పడెను.

రెండు చక్రా లుంటేనే బండి పాఱును.

రెండుచేతు లాడితేనే చప్పుడు.

రెండు చేతులు కొట్టితేనే చప్పు డవుతుంది.

రెండు నలుపులు కలిసి ఒక తెలుపు కానేరదు.

రెండూ రెండే, కొండప్పా!

రెండూ రెండే, చెవులూ రెండే.

రెండవ్రాతకు పెండసిరా.

రెండువ్రేళ్ళతో నాటవచ్చుకాని అయిదువ్రేళ్ళతో పెరకరాదు.

రొండూ రెండే, ఒంటికి పుండ్లే.

రెడ్లలో తెగలకు వడ్లలో తెగలకు లెక్క లేదు.

రెడ్డీ, కరణం లేని ఊళ్ళో చాకలివాడు పిన్నపెద్ద.
రెడ్డి వచ్చాడు, మొదలాడు (మొదలుపెట్టు).
రెడ్లున్న ఊరిలో, రేచులున్న కొండలో ఏమీ బతకవు.
రెడ్డివారిపోతు (రెడ్డోళ్ళపోతు) ఎక్కడు, ఎక్కించదు.
రేగడిభూమినీ, రెడ్డినీ చెవిడువకు.
రేగుచెట్టుకింద గుడ్డివానిసామ్యము.
రేగుచెట్టుకింద ము: లామె.
రేగుబండ్లకు ముత్యా లమ్ముకొన్నట్లు.
రేచీకటిపశువును చీకటిలో ఉంచు.
రేపటిదానికి రూపం లేదు.
రేపల్లెవాడచందమున.
రేపు అనే రో జున్నదా ?
రేవులోని తాడి అడ్డుచేటు.
రైతు దున్నితే రాజులకు అన్నం.
రైతు పాడు, చేను బీడు.
రైతు పెరిగితే రాజూ పెరుగును.
రైతు లెక్క చూస్తే నాగలికూడా మిగులదు.
రైతుక్షేమం రాజులకు భాగ్యం.
రొక్క మిచ్చినవాడే రోవెలదిమన్మథుడు.
రొట్టకట్టే దేశంలో పుట్టగోచివాడే భాగ్యవంతుడు.
రొట్టె తిని రోసినావుకాని నానివంక చూడదు నాతమాషా.
రొట్టెకు రే వేమి ? (రేవు లేదు.)
రొట్టెతగవు కోతి తీర్చినట్లు.
రొట్టెలవాడిపనికన్న రుసరువాని పనే నయం.
రొట్టెలవాడికంటె ముక్కలవాడు (తుంపులవాడు) (తునకలవాడు) ఘనుడు.

రొట్టె లేకపోయెరా పెరుగుంటే అద్దుకు తిందును అన్నట్లు.

రొట్టె లేదుగాని నెయ్యి ఉంటే అద్దుకు తిందును.

రొట్టె విఱిగి నేతిలో పడ్డట్లు.

రొయ్యకు లేదా బారెడు మీసం?

రోకట చిగుళులు కోసినట్లు.

రోకటికి చిగురు పట్టినట్లు.

రోకలి తూలితే చుట్టాలు వస్తారు.

రోకలిపోటు, దాసరిపాట.

రోకలి మూడుమూడలు.

రోగమంటే వచ్చిందిగాని పాలు ఎక్కడినుండి వస్తవి?

రోగము ఒకటి, మందు ఒకటి.

రోగము రట్టు, సంసారము గుట్టు.

రోగానికి కర్తలుగాని ఆయుర్దాయానికి కర్తలా?

రోగానికి మందుగాని ఆయుర్దాయానికి మందులా?

రోగాలలో గురక ప్రమాదం.

రోగాలు మనుషులకు రాక మాకులకు వస్తవా?

రోగికి కోప మెక్కువ.

రోగి కోరిందీ పాలే, వైద్యుడు చెప్పిందీ పాలే.

రోగిష్టికి పాపిష్టి కావాలి.

రోజులు మంచివని పగలే దొంగతనానికి బయలుదేరినట్లు.

రోజూ చచ్చేవాడికి ఏడ్చేవా డెవడు?

రోటిని చూచి పాట పాడాలి.

రోటిలో తల (బుఱ్ఱ) దూర్చి (పెట్టి) రోకటిపోటుకు వెఱచినట్లు (జడిసినట్లు).

రోలు కఱ వెఱుగదు.

రోలుకు ఒకవైపు మద్దెల కిరువైపులా దెబ్బలే.

రోలు పగిలినా లిద్దె బాగుపడినది అన్నట్లు.

రోలు వెళ్ళి (పోయి) మద్దెలతో మొర పెట్టుకున్నట్లు.

రోళ్ళా, రోకళ్ళా పాడినట్లు.

రోసంలేని బంటుకు మోసం లేదు.

రోసాన సాయబు రొట్టెన్నర తిన్నాడట!

రోస ముంటేనే మీాస ముండాలి.

రోసివేసినది రాశికి వచ్చినది.

రోషానికి పోయిన రొం డ్లెగుసవు.

రోషానికి రోలు మెడను కట్టుకున్నట్లు.

రోహిణిఎండకు రోళ్ళు పగులును.

రోహిణికార్తెలో విత్తుట రోటిలో విత్తుటే.

రోహిణికార్తెలో విత్తులుకోయక వేస్తారు, మృగశిరలో ముంచిపోస్తారు.

రోహిణితో జొన్నలు, సాహిణితో గుఱ్ఱాలు.

రోహిణిలో విత్తిన రోళ్ళకైనా పండదు.

రోహిణిలో విత్తనం, రోళ్ళు నిండని పంట.

రోహిణిమృగశిరలు వఱపయితే రోళ్ళు పగిలే ఎండ.

రౌతుకొద్దీ గుఱ్ఱము (ం).

రౌతు మెత్తనయితే గుఱ్ఱం మూడుకాళ్ళతో నడుస్తుంది.

— : : —

# ల

లంక కాల్చినవాడు రాముడిలెంక (హనుమంతుడు).

లంక మేతకు, ఏటిఈతకు సరి.

లంక మేత, గోదావరిఈత.

లంకలో పుట్టినవాళ్ళంతా రాక్షసులే.

లంఖణానికి పెడితే పథ్యానికి దిగుతుంది.

లంఖణాలలో మనుగుడుపులు.

లంఖణాలలో శోభనాల ముచ్చట్లు.

లంచము (ం) పెట్టినది మాట, పుంజం పెట్టినది బట్ట.

లంచము (ం) లేనిది మంచ మెక్కదు (మెక్క నన్నట్లు).

లంజకు ఒకడే మొగుడా ?

లంజకు కొప్పాశ, పాపడికి పప్పాశ,

లంజకు నిగ్గు, సంసారికి సిగ్గు (ఉండాలి).

లంజకు పిల్ల తగులాటము.

లంజకు పిల్ల తెగులు, దూదేకులవాడికి దూది తెగులు.

లంజకు మొగమోటమి లేదు, సంజకు ధైర్యం లేదు.

లంజకొడుకు తండ్రికి తద్దినం పెట్టినట్లు.

లంజకొడుకే కొడుకు, రాజుకొడుకే కొడుకు.

లంజ చెడి ఇల్లా లయినట్లు.

లంజను లంజా అంటే రచ్చ కెక్కింది, ఇల్లాలిని లంజ అంటే ఇంట్లో దూరింది.

లంజ పితాళ్ళకు పెట్టి ఆకాశం చూసిందట !

లంజబిడ్డకు తండ్రెవరు ?

లంజమంచానికి తలతట్టేమి ? కాళ్ళతట్టేమి ?

లంజమంచానికి తలాపి ఏమిటి ?

లంజా! అంటే లక్ష్మీదేవి! అంటారా?

లక్కవంటి తల్లి, ఊయివంటి బిడ్డ

లక్క జొచ్చిన నగ, కుక్క జొచ్చిన యిల్లు.

లక్కలేని నగ, బొక్కలేని మాంసం.

లగ్గపగ్గంపెట్టు చిక్కింది.

లగ్గ మంటే పగ్గ మన్నట్లు.

లగ్నంలో తుమ్మినట్లు.

లచ్చి ఉంటే కోటిలక్షణాలు.

లంకలో పుట్టినవన్నీ రాక్షసులే.

లంఖణాలకు పడితేగాని పైత్యం వదలదు.

లంచానికి మంచం వేయి.

లంజెకు పిల్ల తెగులు.

లంజెదానిమాటలు పట్టుకుని సుందలివాగులో పండితే వాగొచ్చి వాడు కొట్టుకుపోయినాడట!

లంజె పుంజాయె, మిండడు లుట్టాయె.

లంజె అనిన లక్ష్మీదేవి అనేవా రుంటారా?

లడాయి వచ్చినప్పుడా కత్తులు చేసుకోవడం?

లక్షణం పలుకరా పెళ్ళికొడుకా! అంటే అయిరేనికుండ పదహారు వక్కలు అన్నట్లు.

లక్షణాలుగల బావగారికి రాగిమీసాలు, అవలక్షణాలుగల బావగారికి అవీ లేవు.

లక్షనక్షత్రాలయినా ఒకచంద్రుడు కాడు.

లక్ష బుద్ధులు చెప్పినా, లంజ బుద్ధి మానదు.

లక్షభక్ష్యాలు తినేవాడి కొకభక్ష్యం లక్ష్యమా?

లాకు పత్యము దాకు కొమ్ము.

లాభం గూబలలోనికి వచ్చింది.

లాభం లేనిదే సెట్టి వరద బడి పోడు (ఏటివెంబడి పోడు).

లావుమీద వంపు తెలియదు.

లావులేని చేను, లేగలేని ఆవు.

లింగనికి, రంగనికి పొత్తేగాని రొట్టెదగ్గతే గిజగిజ.

లింగంమీది ఎలుకవలె.

లింగధారులతో సంబంధం గంగలో దూకినట్లే.

లింగం కట్టగానే పిడుగు అన్నట్లు.

లింగిపెళ్ళి మంగిచావుకు వచ్చింది.

లెక్కలు చూచిననాడు తిక్కలు తిరుగుతాయి.

లెగలేకపోయినా లెక్క లెక్కువ.

లెగలేనమ్మ పగలే రమ్మన్నట్లు.

లెగలేని మొగుడా బుగళ్ళు చేయించు అంటే బతకనీయే పెళ్ళామా! బావిలీలు చేయిస్తాను అన్నాడట!

లేకలేక లోకాయిపుడితే లోకాయికన్ను లొట్టపోయింది.

లేకుండా చూచి, పోకుండా పట్టు.

లేచిపోతూ అత్తా! నీ కొడుకు ఆకలితో ఉన్నాడు అన్నదట!

లేచెరా మగధీరుడు అంటే అందుకు కాదు అల్పాచమనానికి.

లేచేవటకు ఉన్నావంటే వాచిపోతుంది గూబ.

లేడికి లేచినదే ప్రయాణము.

లేదంటే పోతుందా పేదల మునుక ?

లేనిఉదారికంటె కలిగినమొండి మేలు.

లేనిదాతకంటె ఉన్నలోభి నయము.

లేనిదానికి పోగా ఉన్నది ఊడిపోయిందట !

లేనిపోని పీకులాట, చావడిదాకా గుంజులాట.

లేని బావకంటె, గుడ్డిబావ (అయినా) మేలు.

లేనివాడు పుడమి లేనివాడు.

లేనివాడు లేక ఏడిస్తే ఉన్నవాడు తినలేక ఏడ్చాడట!

లేబరమా గాదె బిడ్డలులేని బ్రతుకు ?

లేవదీయరా తంతాను అన్నాడట!

లేవ లేని అత్తకు వంగ లేని కోడలు.

లేస్తే మనిషి కాను (అన్నాడు కొంగలమల్లాయ).

లేస్తే లేడిపిల్ల, కూర్చుంటే కుందేలు.

లొటిపిటకూర కోళ్ళతోగాని పోదు (చక్కబడదు).

లొల్లిలో మల్లిగాని పెండ్లి.

లోకమో! పాడో! అన్నారు.

లోకులు కాకులు.

లోగుట్టు పెరుమాళ్ళ కెరుక.

లోన లొటారం, పైన పటారం.

లోపల లొటలొట, మీద మిటమిట.

లోపల కంపు, వెలుపల సొంపు.

లోభికి ఖర్చెక్కువ, ప్రవాసికి పనెక్కువ.

లోభికి నాలుగండాల నష్టం.

లోభికి మూట నష్టి.

లోభిసొమ్ము లోకులపాలు.

లోలోపల లొట్టి, నా మొగుడు విన్న కొట్టి.

లోవి మూయవచ్చునుగాని లోకమునోరు మూయవచ్చునా ?

— : : —

# వ

వక్కలింత తప్పిన వగిరింత, వగిరింత తప్పిన వగిరింత.

వక్కపే డిత్తునా వనము దాటింతునా, చెక్కపే డిత్తునా చేను దాటింతునా?

వంకరటింకరకాయలేమిటి? అంటే చిన్నవాడు అమ్మిన చింతకాయలు అన్నట్టు.

వంకరో టింకరో వయసే చక్కన.

వంకరకట్టె కింగలనే మందు.

వంకలేనమ్మ డొంక పట్టుకొని ఏడ్చిందట!

వంకాయతమ్ముడు వాకుడుకాయ.

వంకాయరుచి తోటవాడెఱుగును, అరటికాయరుచి రాజెఱుగును.

వంకాయలేనమ్మ డొంక పట్టుక వేళ్ళాడిందట!

వంకాయవంటి కూరలేదు, శంకరునివంటి దైవం లేడు.

వగలాడి! నీకు మొగలెందరే అంటే, తోలుమొగునితో తొంభైమంది అందిట!

వగలవంకాయ సెగలేక ఉడికినదట!

వంగకు ముదురునాటు, అరటికి లేతనాటు.

వంగతోటకాడమాత్రం వదినా! అనవద్దు.

వంగతోటలో గ్రుడ్డివాని భాగవతమువలె.

వంగతోటవానికి కనిగ్రుడ్డి, ఆకుతోటవానికి వినిచెవుడు.

వంగ ముదురు, వరి లేత (కోరగాదు).

వంగలేని అత్తకు ఓపలేని కోడలు.

వంగసములో పుట్టినది, పొంగలి పెట్టితే పోతుందా?

వంగితే తెలుస్తుందమ్మా వరిమడికలుపు, నిలబడినవానికి నీళ్ళు కారుతాయా?

వంగినవానికింద వంగినట్లు.

వంగుని (వంగుకొని) వంకాయ, తొంగుని దోసకాయ తిన్నాడు అన్నట్లు.

వంచనికాలిధర్మం నాఒడిలో ఉన్న దత్తా! కానక నాకాళ్లు తగిలి నీకళ్ళు పోయినవి.

వంటంతా అయినదికాని వడ్లు ఒకపాలుపు ఎండవలెను (వలసిఉన్నది).

వంటఇంటికుందేలు ఎక్కడికి పోగలదు?

వంటఇంటిలో చిలుకకొయ్య మినహాయింపు.

వంటఇంటిలో దూరిన కుందేలులాగ.

వంటలక్కను వయ్యాలుబండిమీద తెచ్చి, తోటకూరకు ఎసరెంత అంటే చంకచేరెడు పెట్టమన్నదట!

వడ్లపేర్లు, రెడ్లగోత్రాలు చెప్పలేము.

వండనికూడు, వడకని బట్ట.

వండమని అక్కకాళ్లు మొక్కవలె, వినుమని బావకాళ్ళు మొక్కవలె.

వండలేనమ్మకు వగపులు మెండు, చేతలేనయ్యకు తీపులు (తిండి) మెండు.

వండవే పెండ్లికూతురా! అంటే కుండ తీసుకొని నీళ్ళకు వెళ్ళుతాను అన్నదట!

వండవే పేరక్కా! అంటే మందిని చూస్తూ మంచినీళ్ళు తెస్తా నన్నదట!

వండాలేదు, వార్చాలేదు ముక్కున మసెక్కడిదే అన్నట్లు.

వండినకుండలో ఒక్క (వక్క) మెతుకే పట్టి చూచేది.

వండిందే అడ్డెడు, ఓ గెంగా తిను అల్లుడా! అంటే అన్నంపై గర్వ మెందుకు? ఇంత ఊడ్చి పెట్టత్తా! అన్నాడట!

వండినమ్మకంటె దండుకున్నమ్మ మేలు.

వండుకొన్నమ్మకు ఒ (వ) కటే కూర, అడుక్కుతినేఅమ్మకు (అడుక్కున్నమ్మకు అన్నీ) అరవైఆరు కూరలు.

వండుతూఉండగా వాంతి వస్తున్నది అంటే, ఉండి భోజనం చేసి పొమ్మన్నదట !

వండేదాకా ఓర్చేరుకాని, వార్చేదాకా ఓర్చలేరు.

వంతి (తు) పెట్టుకొన్నా వాత వేసుకొనేదాని కిచ్చి పెట్టుకోవాలి.

వంతుకు మావక్కవాడు, పాలికి మాబక్కవాడు.

వంతుకు గంతేసిన, వరిబీజం దిగుతుంది.

వందమాటలు మాటలాడవచ్చు (ఒ) వక్కనికి పెట్టేది కష్టం.

వదినెకు ఒకసరి, గుంజకు బికుసరి.

వంశ మెఱిగి బిడ్డను, వర్ణ మెఱిగి గొడ్డును కొనవలెను.

వంశ మెఱిగి వనితను, వన్నె నెఱిగి పశువును కొనవలెను.

వంశమో ! వాడిఆలితోకో !

వక్క కొఱికి ఒక్కప్రొద్దు చెడుపుకొన్నట్లు.

వగచినట్టే, వాడిఆలితాడు తెగినట్టే.

వగచినట్టూ ఉండవలె వాత పెట్టినట్టూ ఉండవలె.

వగలమారివంకాయ సెగ లేకనే ఉడికింది.

వగలమారివంకాయ సెగ లేకనే సగ మయింది.

వగలు ఎందు కంటే పొగాకుకోసం అన్నట్లు.

వగలేనమ్మ పగ లెందుకు వచ్చావంటే అందుకు కాదు అగ్గికి వచ్చాను అన్నదట !

వగలేనివాడు లంజరిక మాడితే ఇంటికి దుగ్గాని పంపకం.

వగ్గుకోతికి సివ మెత్తినట్లు.

వచ్చినకర్మము వద్దంటే పోతుందా ?

వచ్చిననాడు వరాచుట్టము, మరునాడు మాడచుట్టము, మూడవనాడు ముఱికిచుట్టము.

వచ్చినమ్మకు వ (ఒ) య్యారము, రానమ్మకు రాగాలు,

వచ్చినవాడికి వయ్యార మెక్కువ, రానివాడికి రాగా లెక్కువ.
వచ్చినవాడు చచ్చినా పోడు.
వచ్చినవారికి వర మిస్తాను, రానివారికి రాయి వేస్తాను.
వచ్చింది క్రొత్త వదిగిఉండు పత్త.
వచ్చిపోతూఉంటే బాంధవ్యము, ఇచ్చిపుచ్చుకుంటూంటే వ్యవహారము.
వచ్చీ రాని మాటలు, ఊరీఊరని ఊరగాయ రుచి.
వచ్చీరానిమాట వరహాలమాట.
వచ్చుకీడు వాక్కే చెప్పును.
వచ్చేకాలంకంటే వచ్చినకాలం మేలు.
వచ్చేటప్పుడు ఉలవ, పోయేటప్పుడు నువ్వు.
వచ్చేటప్పుడు తీసుకురారు, చచ్చేటప్పుడు మోసుకపోరు.
వచ్చేవారికి స్వాగతం, వెళ్ళేవారికి ఆసీమాంతం.
వజ్రానికి సాన పెడితే మెఱు గెక్కుతుంది.
వజ్రాన్ని వజ్రమే కోయవలె.
వంట ముగిసినతర్వాత పొయ్యి మండుతుంది.
వట్టింటికి పోచిళ్ళు చల్లినట్లు.
వట్టిఅమ్మ కెందుకురా నిట్టూర్పులు?
వట్టిగొడ్డుకు అరుపు లెక్కువ (మెండు) (వఱపు లేటికి?) (మెఱపు లెక్కువ).
వట్టిగొడ్డుకు (గేదెకు) అరపు లెక్కువ, వానలేని మబ్బుకు ఉఱుము లెక్కువ.
వట్టిగొడ్డుకు అఱ్ఱు జాస్తి.
వట్టిగొడ్డును తాకట్టు పెట్టినట్లు.
వట్టిచేయి మూరవేసి ఏమిలాభం?

వట్టినిందలు చెప్పితే గట్టినిందలు వచ్చును.
వట్టినేలలో కప్ప అఱచినా, నల్లచీమ గుడ్లు మోసినా వాన తప్పదు.
వట్టిముట్టి అయితేనేమి ఉట్టినే వస్తుందా ?
వట్టిమాటలవల్ల పొట్టలు పూడునా ?
వడగండ్లు పడితే వఱపు.
వడావిడి ఒడిలో ఒకరాయి.
వడ్లగాదిలో పందికొక్కును పెట్టి (దాచి) నట్లు.
వడ్లగింజలో బియ్యపుగింజ.
వడ్లవాండ్లపి ల్లేమి జేస్తుం దంటే, వలకబోసి ఎత్తుకుంటుంది.
వడ్లతోకూడ (తట్ట) దాగర ఎండినట్లు.
వడ్లరాశి వరదకు పోయినా, వానకు కఱవు రాదు.
వడ్లరాశి వరదకు పోయినా, వానసేగి లేదు.
వండినంతలోనే కుండకు దొర యగు.
వండమని అక్కకాళ్ళు పట్టుకోవాలి, తినమని బావకాళ్ళు పట్టుకోవాలి
వండనింటికి అగ్గి బాధ.
వండిందే తినెనో, గంజిలోనే పోయెనో ?
వడికినదంతా పత్తి.
వడ్డించేవాడు (వాడు) మనవాడై తే, కడపంక్తిని కూర్చుండ మన్నారు (కూర్చున్నా ఒకటే).
వడ్డించి సద్ది తీసికొను.
వడ్డిఆశ మొదలు చెఱచును, గుడ్డిది ఆలిఅయితే కుండలు చెఱచును.
వడ్డికి చేటు, అసలుకు వట్టము.
వడ్డిముందఱ వడిగుఱ్ఱాలు పాఱవు.
వడ్లు, గొడ్లుఉన్నవానిదే వ్యవసాయం.
వడ్లు ముత్తెం, పిచ్చిక లొద్దం.

వడ్లు వాగున పోతేనేమి ? గడ్డి గాలికి పోతేనేమి ?
వత్తి మిత్తి కాచును, కడి గండం కాచును.
వత్తుపాయిలో పెట్టి తనే పాయిలో తీయు.
వత్తులు చేయా లంటే ప్రత్తి కావాలి.
వంతుకు గం తేస్తారు.
వద్దన్నపని వాలాయించి చేస్తారు (పిల్లలు).
వదినాలు పాడకుంటే పరిబువ్వ (కూడు) ఎవరు పెడతారు ?
వనం విడిచిన పక్షి, జనం విడిచిన మనిషి.
వనవాసం చేయాలేను, వంగివంగి తిరుగాలేను.
వన్నె కాని గంజి ఈగలపాలు.
వనికెలపట్టి విత్తితే వజ్రాలపంట కంట చూస్తాము.
వనితగాని, కవితగాని వలచి రావాలి.
వన్నెగానిగంజి ఈగలపాలు.
వన్నెబట్టలమ్మేవలపుడుకన్న గుడ్డబట్టలమ్మేకులుకుడే లావు.
వన్నెలమ్మను నండబెట్టిన, ఇంటిరాజులను సండబెట్టిందట !
వన్నెకు సున్నం పెడితే వమ్మెక పుం డయిందట !
వన్నెచీర కట్టుకొన్న సంబరమేకాని నెత్తికుక్క కఱచిన దెఱుగదు.
వన్నెమానిగే వన్నె పుడుతుంది.
వంపున్న చోటికే వాగులు పోతాయి.
వయసు కుంకుర, బాతు కురకుర.
వయసు తప్పినా వ (ఒ) య్యారము తప్పలేదు.
వయసు ముదిరినకొద్ది మనస్సు గిలకబారిపోతుంది.
వయస్సు ముసలెద్దు, మనస్సు కోడెదూడ.
వరదలు వస్తాయని వర్షా లాగవు.
వఱపుకు మెఱపులు, వట్టిగొడ్డు కఱపులు మెండు.

వఱవుడు ఇల్లాలు కాదు, వాపు బలం కాదు.
వరహాకన్నా వడ్డీ ముద్దు, కొమరునికన్న మనుమడు ముద్దు.
వర్లివర్లి వాడు పోయె, వండుకుతిని వీడు పోయె.
వరికి పాలచవుటినేల.
వరిమొలకా, మగమొలకా ఒకటి.
వరికి ఒకవాన, ఊదరకు ఒకవాన ఉంటుందా ?
వరికి వాక, దొరకు మూక.
వరిపట్టు కడితే వర్షం గొప్ప.
వరిపొట్టకి పుట్టెడు నీరు.
వరి వడ్డు కేసి తుంగ నాటు పెట్టు.
వరుగుతో డాగరయు నెండవలసినట్లు.
వరుసను దున్నితే వజ్రా లిస్తా నంటుంది భూమి.
వత్తేట ఓడ ఉండగా వద రూదినట్లు.
వరుసలెల్ల వల్లకాటిలో పెట్టి, వదినెపిన్నమ్మా! గం పెత్తు.
వంశంబో ట్లంటమ్మా! కడిపెడుక ల్లెట్లమ్మా! వడబోసి అక్కడ పెట్టమ్మా! వడవకున్న ఒట్టు బెట్టమ్మా! అందిట.
వలకంటె ముందు రాళ్ళు వేసినట్లు.
వలచి వస్తే మేనమామకూతురు వావి కాదన్నట్లు.
వలపుకు పలుపుదెబ్బలు, వ (ఒ) య్యారికి చెప్పుదెబ్బలు.
వల్లకాటి వైరాగ్యం, పురిటాలివైరాగ్యం.
వస్తానన్నదాన్ని, ఇస్తానన్నవాణ్ణి నమ్మరాదు.
వశిష్ఠునివాక్కున విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అనిపించుకోవలె.
వస్త్రహీనమైనా కావచ్చుగాని వరహీనం కారాదు.
వసుకు వేయబోయిన వాతప్పులవాడు తగిలినాడు.
వస్తాన (వ) య్యా, బాపనయ్యా! అంటే వద్దే! ముండా! వర్జ ముంది అన్నాడట!

వస్తావు వస్తావు నాకొఱకు, వచ్చి కూర్చున్నాడు నీ కొఱకు.
వసుదేవుడు వెళ్ళి గాడిదకాళ్ళు పట్టుకొన్నట్లు.
వ్యవసాయం వెట్టివానిచేసి (తి) రాయి.
వ్యవసాయ మేలినాటిశని, భార్య జన్మశని.
వ్యవసాయానికి మేకలు పనికివస్తే ఎడ్లు కొనడ మెందుకు ?
వస్తుగుణం తెలియనివాడు వైద్యంలో మొనగాడే.
వస్తూ ఇల్లు నింపుతుంది, పోతూ పెరళ్ళు నింపుతుంది (అరికె).
వాంతి వస్తే పెదవు లడ్డమా ?
వ్రతం చెడ్డా ఫలం (సుఖం) దక్కవలె.
వాకిలి దాటి వారణాసి ఎంతదూర మన్నట్లు.
వాగులో పోతున్నావు సెట్టీ అంటే లాభం లేందే పోతానా అన్నట్టు.
వాగునీళ్ళు, వనంపత్రి.
వాచినమ్మకు పాచి (సి) న కూడు పెడితే, మాఅత్త పరమాన్నం
పెట్టిందని ఇరుగింట, పొరుగింట చెప్పుకొన్నదట !
వాడవదినె కేల వావివరుసలు? (వావివర్తనములు)
వాడి కేడట్టాలే గ్రంథ మయిందిగాని మనకి పై అట్టాలుకూడా వచ్చు.
వాడితండ్రి, మాతండ్రి సయాం మగవాళ్ళు.
వాడు చెడ్డోడు, తాగుబోతు నా కొక ముంతెడు కల్లు పోయించు
అన్నట్లు.
వాతాపి జీర్ణం, వజ్రశరీరం.
వాదభ్రష్టుడు వైద్యశ్రేష్ఠుడు.
వాదినాశనము, ప్రతివాదిమృద (త) నష్టము, ప్లీడర్ల అదృష్టం, కోర్టు
వారి ఇష్టం.
వాదు లేక ప్రాణం, దాది లేక రాణి (పోదు).
వాదు లేక నల్లూరికి పోతున్నాను, ఇరుగుపొరుగు నాసవతి ఇల్లు
భద్రం అన్నదట !

వాదుసుమీ అప్పిచ్చుట.
వాన ఉంటే వఱపు (కఱవు), పెనిమిటి ఉంటే పేదతనం లేదు.
వానకన్న ముందే వరదనా ?
వానకు ముందు ఉఱిమినా, మాటకు ముందు ఏడ్చినా తుద ముట్టదు.
వానతో సేగి, మొగునితో పేదరికము లేదు.
వాననాటివరద, పెళ్ళినాటి పప్పుకూడు.
వానపాటుకుకంటె ప్రమానుపాటుకు మెండు (ఎక్కువ).
వానబడాయి చవిటిమీద, మాలబడాయి పాటిమీద, భర్తబడాయి
భార్యమీద.
వానరాకట, ప్రాణంపోకడ ఎవరెఱుగుదురు ?
వానలకు మఖ (కార్తె), శ్వానములకు చిత్త (కార్తె).
వాన లుంటే పంటలు, లేకుంటే మంటలు.
వానలు కురిస్తేనే వసుంధర.
వానలు కురిస్తే వాతలు మానునా ? బిడ్డలు పుడితే అంకులు
మానునా ?
వానలు కుసుస్తుంటవి, కప్ప లఱుస్తుంటవి.
వాన లెక్కడా ? అంటే దానధర్మా లున్న ధరణిలో అన్నట్లు.
వానలేని వట్టి (పిట్ట) పిడుగువలె.
వాన వచ్చినందుకు వంక పారిందే (దొర్లిందే) గుర్తు.
వాముపోచ దూరేంత సందుంటే నరముక్క దూర్చనా అన్నాడట!
వాముపోచ దూరేంత చోటుంటే వరభక్ష్యమే పట్టిస్తును.
వాములను మింగే స్వాములకు పచ్చిగడ్డి ఫలహారము.
వాయ పట్టే సందే ఉన్న, ఒకభక్ష్యమే తినేవాడిని.
వారకాంతలకు వావి ఏమిటి ?
వాలుపై నడచినట్లు.

వాసానికి తగ్గ కూసం!

వాసి తరిగితే వన్నె తరుగును.

వాసిరెడ్డి వెంకటాద్రినాయడు తులాభారం తూగితే కరెడ్ల కామక్క వంకాయలభారం తూగిందట!

వాస్తుగలవారికోడలు వరహా ఇచ్చి క్షవరం చేయించుకుందట!

వ్యాధికి మందుగాని విధికి మందా?

వ్యాపారం జోరుగా పోతున్నది, రెండో బట్టె నమ్మి డబ్బు పంపమన్నట్లు

వ్యాసప్రోక్తమా? పరాశరప్రోక్తమా?

వ్రాతకరణమా? మేతకరణమా?

వ్రాతగదే కూతురా! అంటే కోతిమొగుడే అమ్మా! అన్నట్లు.

వ్రాత బలి గోరును.

వ్రాత రాజ్య మేల మని ఉంటే గ్రహచారం (కర్మం) గాడిదల నేల మని ఉన్నదట!

వ్రాత రానివాడు కోతకరణం, వ్రాతా, కోతా రానివాడు మేతకరణం.

వ్రాయగా వ్రాయగా కరణం, దగ్గగా దగ్గగా మరణం.

వ్రాసేవాణ్ణి, కోసేవాణ్ణి, గీసేవాణ్ణి నమ్మరాదు.

వింజరానికి తగవూ లేదు, కోలంకికి మాకువీధీ లేదు.

వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి, కంటే కొడుకునే కనాలి.

విడిపించబోయిన పాముకు పగ, విడిపించకున్న కప్పకు పగ.

విడిపించుకోబోయి తగిలించుకునె ఊడిగనాసవతి.

వింతలమారికి చండ్లు వస్తే మేనమామకు కండ్లు పోయినవి.

వింత లేనిదే ఆవులింత పుట్టదు.

విందుఅయినా మూన్నాళ్లు, మందుఅయినా మూన్నాళ్లు.

విందుమర్నాడు మందు.

విక్రమార్కునివంటి రాజు ఉంటే భట్టివంటి మంత్రి అప్పుడే ఉంటాడు.

వికారంవాడు దుకాణం పెడితే వచ్చే గిరాకీ అట్టే మరలిపోయిందట !

వికిరాలలో లేదు, పిండాలలో లేదు.

విగ్రహపుష్టి, నైవేద్యనష్టి.

విఘ్నేశ్వరుని (డి) పెళ్ళికి వేయి విఘ్నాలు.

విచిత్రం, విన బూటకం, ఆలు గొట్టా, మగ డేడువ.

విచిత్రం పచ్చిపులుసు ఈగల గొట్టి, తాలింపు పెట్టి ఇద్దరిని రమ్మంటే ముగ్గురు వచ్చారట !

విడిచినఎద్దు కొట్టందారి చూచును.

విడిచిపెట్టిన ఇంటిలో మఱచిన మంగలు.

విడిచినది వీధికి పెద్ద, బరి తెగించినది బజారుకు పెద్ద.

విడివడితే గుఱ్ఱము గాడిదతో సమానము.

విడువు మంటే పాముకు కోపం, కఱువు మంటే కప్పకు కోపం.

విత్తకుండానే కోద్దా మన్నట్లు.

విత్తనము ఒక టేస్తే మొక్కొకటి (చెట్టొకటి) మొలచునా ?

విత్తనముకొద్దీ మొక్క.

విత్తనము మళ్ళితే విడువకుండా వ్యవసాయం చెయ్యి.

విత్తనములో లేనిది విశ్వములో లేదు.

విత్తనము వేసి పొత్తు కలిపినట్లు.

విత్తనముసంచులు మంచివయితే విత్తుపుసంచులు నిండును.

విత్తనాలకు పోయిన రెడ్డి ఓద లెత్తగా వచ్చినాడట !

విత్తనా లుంటేనే పెత్తనాలు.

విత్తంకొద్దీ విభవము (ం), విద్యకొద్దీ వినయము.

విత్తు ఒకటి వేస్తే చెట్టు ఒకటి మొలచునా ?

విత్తుకన్నా క్షేత్రం మెఱుగు.

విత్తుకు వేయి విత్తులు.

విత్తు మంచిదయితే రైతు మంచె దిగడు.

విత్తు ముందా? చెట్టు ముందా?

విత్తులకు శుక్రవారం, కోయుటకు గురువారం.

విత్తే చెట్టయ్యేది.

విదియనాడు కనబడని చంద్రుడు తదియనాడు తానే కనబడును.

విఘ్నం చెడి ఈడిగవానితో వెళ్ళితే చచ్చేవరకు చాపలు మోయించాడట!

విధవకు తలసుళ్ళు వెదకినట్లు.

విధి చెడి ఈడిగవానితో లేచిపోతే చచ్చేవరకు డోలు వాయించమన్నాడట!

విధి వస్తే పొద లడ్డమా?

విననిబంటుకు వెన్నపూసకూడానా?

వినటానికి, కనటానికి బెత్తెడే దూరం.

వినయం లోకవశ్యం, విద్య రాజవశ్యం.

విన్నమ్మవీపు కాలినది, కన్నమ్మకడుపు కాలినది.

విన్నమాటకంటె చెప్పుడుమాటలు చెడ్డవి.

విన్నవన్నీ విశ్వసించవద్దు, విశ్వసించినవి వెలిబుచ్చవద్దు.

వినాయకుడిమీది భక్తా? ఉండ్రాళ్ళమీది భక్తా?

వినాయకునిపెండ్లికి వేయి విఘ్నాలు.

విని రమ్మంటే తిని వచ్చినట్టు.

విప్రహస్తము, ఏనుగుతొండము ఊరుకోవు.

వియ్యంకునికి వీపుదెబ్బలు, వియ్యపురాలికి వీపుదెబ్బలు.

వియ్యపురాలిపేరు విసరమ్మ, నాపేరు దంచమ్మ.

వియ్యపురాలికి వీపుదెబ్బ, నాకు తోపుదెబ్బ.

వియ్యపువారింటిజాడ్యా లిగిలించినా పోవు.
వియ్యానికి కయ్యం తోబుట్టువు.
వియ్యానికయినా, కయ్యానికయినా సాటి ఉండాలి.
వియ్యా లందితే కయ్యా లందుతవి.
విరచుకొని, విరచుకొని వియ్యపురాలింటికి పోతే, పలుగురాళ్ళతో నలుగు పెట్టిందట !
విరామంలేని పశువుకు ఊరట లావు.
విరాటపురాణం మాఆయన కొచ్చు, అందులోని దోనుడుగు నా కొచ్చు, భారతభాగవతం మాబావ కొచ్చు, అందులోని దోచరణం నాకు నచ్చు.
విరి దాచ తావి దాగునె ?
విరుగుబాటుపైని నూనెబొట్టు, విరిచికట్లపైని పెరుగుబొట్టు.
విల్లమ్ములు కలవారికి చల్లకడవలవారు తోడా ?
విలుచుటకుముందే విక్రయించేసులువు చూడాలి.
విల్లూరిమట్టికింద విధన ఉన్నది.
విశాఖ కురిసిన విషము పెట్టినట్లు.
విశాఖ చూచి విడువర కొంప.
విశాఖ పట్టితే పిశాచి పట్టినట్లే.
విశాఖలో వర్షం వ్యాధులకు హర్షం.
విశాఖవరదలు, సంక్రాంతిమబ్బులు.
విశ్వాసంతప్పిన పీనుగు మోసినవాడిని పట్టిందట !
విశేషము లేనిది విం తెలా పుడుతుంది ?
విషపాళపువిత్తు, నేపాళపుగింజ.
విషములో పుట్టిన పురుగుకు విషమే ఆహారం.
విసరగా విసరగా ఒకరాయి, తిట్టగా తిట్టగా ఒక తిట్టు తగులును.

విసరురాయి గాలికి పోయినట్లు.
విస్తరికొాదవా, సంసారపుకొాదవా తీర్చేవా రెవరు ?
విస్తరాకుభోజనం, పెంటభోజనం.
విస్తరి చిన్నది, వీరమ్మచెయ్యి పెద్దది.
విస్తళ్ళు ఎత్త మంటే భోంచేసినవా రెందరు ? అన్నట్లు.
విస్సన్న చెప్పినది వేదం.
విసిరినమ్మకు బొక్కిందే కూలి.
వీపుమీాద కొట్టవచ్చునుగాని కడుపుమీాద కొట్టరాదు.
వీపున తన్నుతున్న యింటివెనక ఉప్పు డంటారు.
వీపు విమానంమోత, పిట్టలు పింగాణిమోత.
వీరభద్రపళ్ళెమునకు హనుమత్పళ్ళెము.
వీ లెఱిగి మాట, కీ లెఱిగి వాత.
వీసం ఇచ్చి వాసానికి ఒడ్డినట్లు.
వీసంఖర్చు కాకుండా నోము నోముతాను ఆశపడకండి అడవనాబిడ్డ ల్లారా !
వీసంగల అమ్మి విడువా ముడువా, కాసుగల అమ్మి కట్టా పెట్టా.
వీసంగలరెడ్డికి విడువా ముడువా సరి.
వీసానికి వాసన్నర అయితే దూాలన్నర ఎంత ?
వీసెడుచింతపండు పాసంగానికే సరిపోయింది.
వృద్ధవైద్యం, బాలజోస్యం.
వృష్టికి ప్రమాణం ఉత్తరహస్తలు.
వెంకటరెడ్డి కంకి కొరికితే వెంటవచ్చినవాం డ్లూరకుంటారా ?
వెంట పోయినా, వెనుక పోరాదు.
వెంట రావద్దంటే, ఎత్తుకొమ్మని ఏడ్చాడట !
వెంట రావద్దంటే వేగ న న్నెత్తుకొ మ్మన్నట్లు.

వెంట పోయైనా చూడాలి, యింట ఉండైనా చూడాలి.

వెంట్రుక పట్టుకొని ప్రాకులాడినట్లు.

వెంట్రుకలున్నమ్మ ఏకొప్పయినా పెట్టవచ్చు.

వెంట్రుకలున్నమ్మ ఏకొప్పు పెట్టినా సరిపోతుంది.

వెంట్రుకలు తీసిన పీనుగు తేలిక నౌతుందా ?

వెంట్రుకకన్న ఏడుపాళ్ళు సన్నం, రోకలికన్న రెండుపాళ్ళు లావు.

వెండి బేరమాడుతూ బంగారు కొసరినట్లు.

వెంపలిచెట్టుకు నిచ్చెన వేసినట్లు.

వెక్కిరించబోయి వెల్లకిలా (విల్లకిత్తలా) (బోర్లా) పడ్డట్లు.

వెట్టికి కని, వెలుగులో పారవేసినట్లు.

వెట్టికి పుట్టిన బిడ్డ నెత్తికి లేక ఏడ్చిందట !

వెట్టికిగదరా పోలా ! అంటే ఏడవక తప్పదే అయ్యా ! అన్నట్లు.

వెట్టిగుఱ్ఱం తగెడుబజ్జ.

వెట్టిమూటకీ, పంక్తిభోజనానికీ ముందుగా వెళ్ళాలి.

వెడల్పుచాలుకన్న లోతుచాలు మేలు.

వెతకి వెతకి వెయ్యి బళ్ళమీద వంటలక్కను తెస్తే, తగిలేని మిగిలేని తోటకూరకి తొడలోతు ఎసరు పెట్టమందట !

వెత చెప్పబోతే కథ చెప్పినట్లు.

వెదఅదనున వెలుగులో చల్లినా మంచిదే.

వెదుకబోయిన తీగ కాలికి తగిలినట్లు.

వెదుకబోయిన తీర్థ మెదురైనట్లు.

వెధవకు దణ్ణం పెడితే నన్నుబోలి నూరేండ్లు బ్రతుకమందట !

వెధవముండకు అలంకారం చేసినట్లు.

వెధవముండకైనా వేవిళ్ళు తప్పవు (మానవు),

వెధవముండా ! వే రుండ మన్నట్లు.

వెన్నకు పండిచ్చి దూలాలు కంకినవాడు.

వెన్నతో (వెన్నుచ్చుకొని) కొట్టినవానిని, రాయితో (రాయుచ్చుక) కొట్టినట్లు. (వేతురా ?)

వెన్నకు పళ్ళు వచ్చి, ఏకులు కమికినవారికిగద !

వెన్న దగ్గఱ ఉంచుకొని నేతికి ఏడుసుకొన్నట్లు.

వెన్న పెట్టితే (పెడితే) మింగలేడు, వేలు పెడితే కఱువలేడు (కొఱుక లేడు).

వెన్నలా దున్నితే వెన్నుల కేమి కొదువ? (వెన్నులు కొండలాది)

వెన్నలో వెంట్రుక తీసినట్లు.

వెనకయ్యమీద భక్తి గాదు, ఉండ్రాళ్ళపై భక్తి.

వెనుకకు పోతే (పడితే) తన్ను, ముందుకు వస్తే పోటు.

వెనుకకు పోతే నుయ్యి, ముందుకు పోతే గొయ్యి.

వెనుక తన్నూ, ముందు పోటూ.

వెన్నుమీద గువ్వ.

వెన్ను ముదిరి పొర్లినగొడ్డు ఎక్కువ పాలిస్తుంది.

వెన్ను మూరెడు, దంటు బారెడు.

వెన్నెలదినములలోనే అల్లోనేరెడిపళ్ళు.

వెయ్యిఆవులు కలవానికి ఒకటి తన్నుకపోతేనేం ?

వెయ్యిఆవు లున్నవానికి ఒకటి ఎగజేపితే నేమి ?

వెయ్యిఇండ్లపూజారి వెతకినా దొరకడు.

వెయ్యిఎకరా లున్నా వెఱ్ఱివాడు వెఱ్ఱివాడే.

వెయ్యికన్నులు రేయి కుంటే పగటికేమో ఒకటే.

వెయ్యికాకుల కొకరాయి.

వెయ్యిపుట్లవడ్లకు ఒకచిలుకపురుగు చాలును.

వెయ్యిమోపులు వేకువజాముకట్టకు లోకువే.

వెయ్యిరూపాయలు కావలెనా, వెధవతోడబుట్టువు కావలెనా?

వెయ్యిరూపాయలు పెట్టి ఎద్దును కొన్నా ముల్లుకఱ్ఱ ఉండాలి.

వెయ్యిరూపాయలు పెట్టి ఏనుగును కొని అరవీసం అంకుశానికి పాలు మాలినట్లు.

వెఱపింపగా పోయి వెఱచినకరణి.

వెఱ్ఱికి వేయి విధాలు.

వెఱ్ఱి కుదిరింది రోకలి తలకు చుట్ట మన్నాడట!

వెఱ్ఱిది వెంకటమ్మ మనువు పోయి మళ్ళీ వచ్చింది.

వెఱ్ఱిపెయ్యకు తోఱ్ఱిపెయ్య తోడు.

వెఱ్ఱిముండ వేడుక చూడబోతే వెతక నిద్దుర, ఏడవ నిద్దుర.

వెఱ్ఱిమొద్దు కేల వేదశాస్త్రాలు?

వెఱ్ఱివాడిపెళ్ళాం వాడవదిన.

వెఱ్ఱివాడు ఏతం తొక్కినట్లు.

వెఱ్ఱివాడు వెఱ్ఱివాడు అంటే వెక్కి వెక్కి ఏడ్చినాడట!

వెఱ్ఱివానిచేతిరాయి తగిలెనా తగులును, తప్పెనా తప్పును.

వెఱ్ఱి వేయివిధాలు, పైత్యం పదివేలవిధాలు.

వెలమనీలు, బఱపటగంజి, తెడ్డు తేరా దేవుక తిందాం.

వెలమలున్న ఊరు, కొంగలున్న మఱ్ఱి.

వెలమవారిపెండ్లికొడుకు మారడుగనేరడు, ఉన్నదంతా ఊడ్చిపెట్టు.

వెలయాలిమాట, కలలోనిమాట.

వెల సులభం, ఫల మధికం.

వెల్లకిత్తలా పడుకుని, ఉమ్మివేస్తే ముఖంమీద పడుతుంది.

వెల్లకిలా వేసి పొడిస్తే ఒకదెబ్బకే చస్తున్నదని సన్యాసులమయిన మే మెందుకు చెప్పవలెను?

వెల్లటూరిలో ఎద్దును, పరుచూరిలో పడుచును ఇవ్వకూడదు.

వెలిపొలమును, వెధవపిల్లను వదలకూడదు.

వెలివాడలో వేదఘోష ఉంటుందా ?

వెలుగు చేను మేసిన కాచేవా రెవరు ?

వెలుగునీడ, గ్రామంతోడు.

వెలుగు పంటను గాచు.

వెలుగు లేకున్న చీకటి లేదు, చీకటి లేకున్న వెలుగు లేదు.

వెలుపల వేడుక, లోపల కసవు.

వెళ్ళిపొమ్మంటే చూరుపట్టుకొని వేళ్ళాడినట్లు.

వెళ్ళిపొమ్మంటే పెళ్ళికి వెళ్ళుదా మన్నట్లు.

వేగీవేగనమ్మ వేకువఝామున ముట్టయిందట !

వేగీవేగని పెసరపప్పు, వెనుకవచ్చిన పెండ్లాం రుచి.

వేటకానిఇల్లు వెతుకక కుందేలు సొచ్చినట్లు.

వేటుకు వేటు, మాటకు మాట.

వేడి కోర్వలేనమ్మ సహగమనం చేస్తా నన్నదట !

వేడినీళ్ళకు (వేన్నీళ్ళకు) ఇళ్ళు కాలునా ?

వేడినీళ్ళకు (వేన్నీళ్ళకు) కొంప లంటుకుంటాయా ?

వేడినీళ్ళకు (వేన్నీళ్ళకు) చన్నీళ్ళు, చన్నీళ్ళకు వేన్నీళ్ళు తోడయినట్లు.

వేడినీళ్ళకు (వేన్నీళ్ళకు) ముందు, వెట్టిమాటకు వెనుక పోకూడదు.

వేడినీళ్ళకు (వేన్నీళ్ళకు) వేసంగికీ ఎంత చలువో నీకూ, నాకూ అంత చలువ.

వేడుకకు వెల లేదు.

వేడుక వెంకటేశ్వరుడిది, గోల గోవిందుడిది.

వేపపిండి ఎరువుతో సమానం.

వేపకాయంత తీపి, వేసంగంత చలువ.

వేమనమాట వెట్టిమాట కాదు.

వేమనూరు వేమన్న వలె.

వేములదగ్గఱ సమారాధనట ! ఏడుమూళ్ళ విస్తరి, మూడుమూళ్ళ దొప్ప కుట్టుకుని నిన్నెత్తుకుని నన్నుర మ్మన్నారట !

వేములు కాస్తే భూములు పండును.

వేయిఉన్నమ్మకన్నా వేయించే మంగలంతో పని బడుతుంది.

వేర్లతో వెంపలి, కాయలతో కానుగ (మంచి ఎరువు).

వేరు తవ్వి వేన్నీళ్ళు పోసినట్లు.

వేరులో పురుగు పుడితే వృక్షానికి చేటు.

వేలంత చోటిస్తే రోలంత నష్టం.

వేలుకు వేలు ఎడము.

వేలు చూపి అవలక్షణ మనిపించుకొన్నట్లు.

వేలు చూపి ఉత్తది అనిపించుకొన్నట్లు.

వేలు చూపితే మండ మింగుతారు, మండ చూపితే మనిషినే మింగుతారు.

వేలు చూపితే మురిగేది గుమ్మడికాయ, తంతే పెరిగేది పుచ్చకాయ.

వేలు పెట్టేందుకు చోటిస్తే కాలు దూర్చినట్లు.

వేలు పెడితే కొఱకనేరదు, వెన్న పెడితే మింగనేరదు.

వేలు పెడితే చీకదు, వెన్న పెడితే నాకదు.

వేలు వంక పెడితేనేగాని వెన్న రాదు.

వేసుమీద గోరు మొలిచింది, వేసు పోదాం రారా పట్టిమొగుడా !

వేలు వంగబెట్టంది వెన్నపూసయినా రాదు.

వేలు వాచి రోలంతయితే రోలు వాచి మరెంత కావాలి ?

వేలు విఱిగింది, ఉచ్చ పోయుమంటే ఇలాయి కట్టుకొని ఆరునెల లయింది అన్నాడట !

వేష్ట పెడితే పిల్లలు పుడతారా ?

వేళంగి రైతులు, వేల్పూరి రైతులు.
వేషగాని అడుగులు వేటకు వచ్చునా?
వేషాలకోసము దేశాలపాలు.
వేషాల (వేసాల) మారికి వేవిళ్ళు వస్తే ఉన్నచోటు కదలను అందట!
వేసాలన్నీ గ్రాసాలకే.
వేసిందల్లా తగిలితే జట్టీవాడే గెలిచాడట!
వేసంగిపంట ఒకనాటివంట.
వేసినట్టే వేస్తే జట్టీవాడైనా గెలుచును.
వేసినదే ఒకగంతు, విరిగినదే ఒక కాలు.
వేసినదే ఒకగంతు, దిగినదే ఒకబుడ్డ.
వేసిన వత్తికి, పోసిన చమురుకు సరిపోయింది.
వేసిన పెదుళ్ళారా! కాలిన ఇండ్లకు పోండి.
వేస్తివిరా కన్నం అంటే చేస్తినిలే కాపురం అన్నట్లు.
వేసేనాడు లేనిది కోసేనాడు వస్తుందా?
వేసేవి పులిగురకలు, మేసేవి గడ్డిపరకలు.
వేస్తే మునగకొయ్య, తీస్తే చంద్రకొయ్య.
వైద్యం నేర్వనివాడు, వానకు తడియనివాడు లేడు.
వైదీకి వైద్యం చచ్చినా ఒకటే, బ్రతికినా ఒకటే.
వైద్యుడా! నీసంచిలో వేడినీళ్ళు ఉన్నవా? అన్నట్లు.
వైద్యునిపేరు చెప్పిన వ్యాధి పోవునా?
వైద్యునిభార్యకే భగందరరోగము.
వైరాగ్యం ముదిరితే వారవనితకూడా తల్లితో సమానం.
వైరాగ్య మబ్బితే వైకుంఠం దక్కుతుంది.
వైరికిగాని వడ్లు మెదగవు.
వైదికపు పిల్లి! ప్రత్తి పలుకవే అంటే మ్యాప్, మ్యావ్ అన్నదట!

# శ

శంకరాచార్యునకు, పీర్ల పండుగకు సంబంధ మన్నట్లు.

శంఖములో పోస్తే గాని తీర్థం కాదు.

శంఖులో పోస్తే తీర్థం, పెంకులో పోస్తే నీళ్ళు.

శఠకోపం లేకుంటే నాశంఠం పోయె, ఇంటికి పోయి గంటె బోర్లించు కుంటాను.

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.

శతకోటిలింగాలలో బోడిలింగ మన్నట్లు.

శతడబ్బు, సహస్రడబ్బు.

శతబిజినకు సహస్రబిజిన.

శత్రుశేషం, ఋణశేషం, అగ్నిశేషం, రోగశేషం మిగల్చరాదు.

శనగలు తిని చేయి కడుగుకొన్నట్లు.

శని పడితే ఏడేళ్ళు, నేను పడితే పద్నాలుగేళ్ళు.

శని పడితే ఏడేళ్ళు, ఆశ పడితే పద్నాలుగేళ్ళు.

శనిపీనుగ తనిగా పోదు.

శనివారమువాన శనివారమే విడుచును.

శని విఱుగడ, పని ఒబ్బిడి.

శనేశ్వరునికి నిద్ర ఎక్కువ, దరిద్రునికి ఆకలెక్కువ.

శయనైకాదశి తెలిసినవాడే శాస్త్రకారుడు.

శరము చాలెడు, చెప్పాలు మూలెడు.

శరము తప్పిన చెవులు వినరావు, గుణము తప్పిన కళ్ళు గానరావు.

శరణార్థిని లింగప్పా! అంటే కందులు మూడు మాడలు అన్నాడట! చిన్నా, పెద్దా బాగున్నారా? అంటే పస్పు లక్కవలె ఉడుకు తుందన్నాడట!

శవానికి చేసిన అలంకారమువలె.

శ్మశానానికి పోయిన శవం తిరిగి రాదు(తిరుగదు).

శాగరోకలి యిగురు పెట్టినట్లు.

శాస్త్రం తప్పు, చచ్చేది నిజం.

శాస్త్రప్రకారం విషయించిన కుక్కపిల్లలు పుట్టు.

శాస్త్రిబపిట్ట శాస్త్రం చెబుతూంటే గుడ్డిపిట్ట గూట్లో చోటు చేసుకుందట !

శాస్త్రుల్ళవారింట జన్మించి, సోమయాజులవారింట చొచ్చి, లవణమంటే దూడరేణ మని ఎఱుగనా ?

శ్యామలకోరలపున్నానికి కోటాక్కపుత్తి బెట్టి నోముతుంగట !

శ్రావణంలో సెనగల జోరు, భాద్రపదములో బాధలపోరు.

శ్వాస ఉండేవఱకు ఆశ ఉంటుంది.

శింగిడి వేస్తే పదిహేనుకోజుల వర్షం.

శిఖశిఖలమీఁద మిడుతెలు చెనసినట్లు.

శిర సుండగా మోకాలికి సేసలు పెట్టినట్లు.

శిలాభోగం, స్థలాభోగం కానరావు.

శిలాశాసనం ఫలాపాదకం.

శివరాత్రికి చలి శివ శివా అని పోతుంది.

శివరాత్రికి చంక లెత్తనీయదు.

శివరాత్రికి చింతగింజంత (చలి).

శివరాత్రికి చింతాకంత నెట్టి.

శివరాత్రికి జీడికాయ, ఉగాదికి ఊరగాయ.

శివరాత్రికి శివలింగాలంత (మామిడికాయలు).

శివు డిష్యకున్న సిద్ధలింగ మిచ్చునా ?

శివునిఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు.

శిశువుకు దక్కని స్తన్యంవలె.

శిష్యా! శిష్యా! నాకాళ్ళకు చెప్పు లున్నవా? అంటే నక్షత్రమండ లంమధ్య కనపడలేదు అన్నాడట!
శిష్యున కెక్కడ సందేహమో గురుపు కక్కడ అనుమానం.
(శ్రీ)రంగం పోయి కొంగరెట్ట తెచ్చినట్లు.
(శ్రీ)రంగంరోకలి చేతులమీద నిలువదు.
(శ్రీ)రంగంలో పుట్టిన బిడ్డకు తిరువాయిమురి నేర్పాలా?
(శ్రీ)రంగనీతులు చెప్పేవారేగాని చేసేవారు లేరు.
(శ్రీ)రామరక్ష, నూరేండ్లాయుస్సు.
(శ్రీ)రాముడు మనవాడైతే చీడపురుగు లేమి చేస్తవి?
(శ్రీ)రామలంకలో బోడకోతి.
(శ్రీ)వైష్ణవుడు ముడ్డి చెరువులో కడిగితే ఆచారమా?
శుభం పలకరా పెండ్లికొడుకా! అంటే చప్పరంనిండా బోడిముండలే అన్నాడట!
శుభం పలకరా పెండ్లికొడుకా! అంటే పందిటినిండా ముండమోపులే అన్నాడట!
శుభం పలకరా పెండ్లికొడుకా! అంటే పెళ్ళికూతురుముండ ఎక్కడున్న దన్నాడట!
శుభం పలకరా మంకెన్నా! అంటే ఎవడాలితాడు తెగితే నాకేమి? నా కేసే పిండాకూడు నా కేస్తే అయిరేనికుండలకాడ చచ్చి నట్టే తొంగుంటా నన్నాడట!
శుభం పలకరా మంకెన్నా! అంటే చెల్లిముండకు పెళ్ళెప్పుడు అన్నాడట?
శుభం పలకరా మంకెన్నా! అంటే పెళ్ళికి వచ్చే పేరంటాళ్ళంతా నా పెద్దపెళ్ళాలే అన్నాడట!
శుభం పలకరా మంకెన్నా! అంటే మీరాస పోయే చేరకా అన్నాడట

శుభాలు ముంచి దీపాలు ఆర్పినట్లు.
శుష్కప్రియాలు, శూన్యహస్తాలు.
శ్రుతి మించి రాగాన పడినట్లు.
శేఖుభాయికి గోకులాష్టమా ?
శేషాయ లెస్స అంటే గరుడాయ లెస్స అన్నట్లు.
శైవులా ? వైష్ణవులా ? ముందూరునుబట్టి.
శొంఠిలేని కషాయిం లేదు.
శొంఠి శోధిస్తుంది.
శోభనంనాటిముచ్చట్లు లంఖణంనాడు తలచినట్లు.
శ్యామలాకారుడమ్మా ! ఈబిడ్డ శానాళ్లు బతకడమ్మా !

— : : —

## ష

షండున కబ్బిన చానవలె.
షండునికి రంభ దొరికినట్లు.

— : : —

# స

సంకటాలవిత్తు, సానిదాని పొత్తు.

సంకటాలు తగిలించుకొని మీసాలు పీక్కుంటే ఏ మవుతుంది ?

సంక్రాంతికి చంక తెత్తకుండా చలి.

సంకున పోస్తేగాని తీర్థం గాదు.

సంకులో పోస్తే తీర్థం, పెంకులో పోస్తే నీళ్ళు.

సంక్రాంతిపండుగకు సంకెళ్ళలోనివాళ్ళూ వస్తారు.

సంకురాత్రిమబ్బులు, మాలవాళ్ళఉబ్బులు.

సంగాంకొమ్మ చక్కగా ఎత్తినట్లు.

సంగీతవిద్యకు చాకలెల్లి.

సంగీతానికి గాడిద, చక్కదనానికి, సౌందర్యానికి లొటిపిట.

సంగీతానికి గంధర్వకన్య, స్వరూపానికి రంభ.

సంగీతానికి చింతకాయలు (మామిడికాయలు) రాలునా ?

సంగీతానికి నేను, చక్కదనానికి మాఅప్ప.

సంచిలాభం చిల్లి కూడతీసినది.

సంచి విప్పేవఱకు చల్లబడితే, మూట విప్పేవఱకు మాటలు పోవి.

సంతకు దొంగయితే చీర లమ్మే దెక్కడ ? (చీర లెక్కడమ్ముకోను ?).

సంతకు దొంగయితే చో ళ్ళెక్కడ అమ్ముకోను ?

సంతపాతతొత్తు సన్యాసి నెఱుగునా ?

సంతమెఱుగు సాని ఎఱుగును.

సంతలో కొడితే సాక్షు లెవరు ?

సంతలో బేరము లచ్చికి గాజులు.

సంతానానికని సప్తసాగరయాత్ర వెడితే ఉప్పునీరు తగిలి ఉన్నది
మూసుకపోయిందట !

సంతులేని ఇల్లు చావడి కొట్టం.

సంతోషం సగం బలం.

సంతోషానికి సాటి లేదు, ఆలోచనకంతు లేదు.

సందకాడ వచ్చిన వాన, సగపొద్దున వచ్చిన చుట్టం (పోరు).

సందడిలో సడేమియా (నీకు నాకు లడేమియా).

సందడిలో సమారాధన!

సందాయ సందాయ అంటే చిచ్చాయ చిచ్చాయ అన్నదట!

సందు దొరికితే చావడికొట్టం ఒంక బెట్టినట్లు.

సంధ్యావందనం చేస్తే పుణ్యం లేదుగాని చెయ్యకపోతే పాపం.

సంపతి గలిగిన తల్లికి వేకటిగా నుదరదు.

సంపదగలవాని సన్నిపాతంవలె.

సంపదలలో మరపులు, ఆపదలలో అఱపులు.

సంపాదన ఒకరిది, అనుభవము ఒకరిది.

సంబరపు చలిగాలికి ఎదురువాకిలివలె.

సంబూరాసిసోకిపోసికుంటె కుక్క జమిడీకె ఏసుకపోయిందట!

సంభావనలో వచ్చిన పావలాలోటు నేతిలో తీస్తా నన్నట్టు.

సంభోగానికే చనిపోతే, పిల్లల నేమి కంటుంది?

సంసారం గట్టి, మెడబట్టి.

సంసారం గుట్టు, వ్యాధి రట్టు.

సంసారం జేనెడు, ఖర్చు బారెడు.

సంసారం బాగా లేదని సన్న్యాసం పుచ్చుకుంటే, బూడిద, బుఱ్ఱకాయ గాడిదబరువైనాయట!

సంసారం సాగనిది ఆడదాని వ్రాత, పిల్లలు బ్రతకనిది మొగవాడి వ్రాత.

సంసారి తిరిగి చెడును, సన్న్యాసి తిరుగక చెడును.

సంసారి దుఃఖి, సన్న్యాసి సుఖి.

సంసారి బీద, సాగు బీద.

సంసారికి సాగుబాటు, సన్యాసికి జోగుబాటు.
సకలశాస్త్రాలూ, నిలబడిమూత్రాలూ.
సక్కలు పలికేవానికి సేలు, మొద్దు గొట్టేవానికి దుడ్డు.
సగంఈడుకు సమర్తకట్నాలు.
సగంచచ్చి పురాణం, అంతా చచ్చి సంగీతం.
సగం చచ్చి సంగీతము, అంతా చచ్చి హాస్యము.
సగందినాలకు సమర్తకట్నాలు.
సగం పెట్టి మేనత్తరా అన్నట్లు.
సగం సాలెనేత, సగం మాలనేత.
సజ్జకు కాలివాసి దుక్కి చాలు.
సతిపతులు చక్కగా ఉంటే, సంతలో పిల్ల చింత లేదు.
సత్యము అంటే సరియైన మాట.
సత్యము నావద్ద చాలా ఉన్నది, చెప్పులు తేరా మగడా! నిప్పులో దూకుతాను.
సత్యములు పొత్తు కుడుచునా? బాసలు కలసివచ్చునా?
సత్యమే జయము.
సత్యహరిశ్చంద్రుడు పుట్టిన మరుసట్టిపుట్టినా డన్నట్లు.
సత్రము (0) కూటికి తిప్పాభొట్లసిఫారసా?
సత్రము (0) కూటికి సర్కారుసెల వెందుకు?
సత్రము (0) భోజనము, మఠం నిద్ర.
సత్రము (0) భోజనానికి హుకూసేనప్పసిఫారసు.
సద్దలు (సజ్జలు) పండితే సుద్దు లెక్కువ.
సద్దిబువ్వతిన్నమ్మ మొగనాక లెరుగదట!
సద్దిబువ్వపై వెన్నపూస బెట్టినట్లు.
సన్నసన్నంగా కాపుతనం వచ్చింది సన్నబియ్యం వండవే అన్నాడట!

సన్నపామునైనా పెద్దకట్టె (కఱ్ఱ) తో కొట్టవలె.
సన్నబియ్యం, చాయపప్పు.
సన్నబువ్వ, చిన్నచేపలు, కొఱ్ఱబువ్వ కోడిచారు.
సన్నమూ, ముతకా, సంతలో తేలిపోతుంది.
సన్యాసం చివఱ కష్టం, సంసారం మధ్య కష్టం.
సన్యాసం పుచ్చుకొన్నా కావడిబరువు తప్పదు.
సన్యాసికి దొంగలభయ మేమి?
సన్యాసిపెళ్ళాం విధవా కాదు, పునిస్త్రీ కాదు.
సన్యాసిపెళ్ళికి జుట్టుదగ్గఱనుంచి ఎరవే.
సన్యాసీ సన్యాసీ రాసుకుంటే బూడిద రాలిందట!
సన్నికల్లు దాస్తే పెండ్లి కాదా?
సన్నికల్లు దాస్తే పెండ్లి ఆగుతుందా?
సప్పంబుపడగనీడను కప్ప వసించిన విధంబు.
సభా అంటే ఆరునెలలు.
సభమధ్య సాలె చాకలి, పండితుల మధ్య పాగదాసరి.
సభాపిరికిదానా! యింటిలో లేడని చెప్పవే.
సమయం తప్పితే కాళ్లు, సమయం వస్తే రాళ్లు.
సమయానికి లేనిది చంక నాకనా?
సమయానికి లేనిపాక చచ్చినాకా?
సమయానికి లేని విద్య చంక నాకనా?
సమర్తకీడు చాకలిదాన్ని కొట్టింది.
సమ్ముఖానికి వచ్చి రాయబారాలు.
సముద్రమయినా ఈదవచ్చు, సంసార మీదలేము.
సముద్ర ముఱిమితే వాన తప్పదు (గాలివాన?)
సముద్రము చంకలో పెట్టుకొని చెలమకు (చెఱగు) చేయి చాచినట్లు.

సముద్రములో అలలు నిలిచే దెప్పుడు ? స్నానం చేసే దెప్పుడు ?
సముద్రములో కాకిరెట్టవలె.
సముద్రములో కెరటాలు పోయినతరువాత స్నానం చేదా మను కున్నాడట !
సముద్రములో కొాజవి అద్దినట్లు.
సముద్రంలో కొారకంచు అద్దినట్లు.
సముద్రంలో వాన పడినట్లు.
సముద్రానికి ఏతాము ఎత్తినట్లు (వేసినట్లు).
సముద్రానికి లవణదర్శన మన్నట్లు
సముద్రాన్ని పొగుడుతామేగాని నేల విడువము.
సరదాకి సమర్తాడితే చాకలిది కోక దొబ్బింది.
సరసము విరసముకొాఱకే.
సరసానికైనా సమయ ముండాలి.
సరిపడనివారు చచ్చినవారితో సమానం.
సరిపీ, పిల్లలూ లేస్తే సహస్రంమంది లేచినట్లు.
సరువతప్పేల పోయె, బరు వలక నాయె.
సర్కస్సులో పిడుగు, చదువులో బడుగు,
సర్కారుకు చాటుగా ఉండాలి, సావుకారి కెదురుగా ఉండాలి.
సర్వ (స్వ) కార్యభురంధరుడు, స్వామికార్యవంచకుడు.
సర్వరోగాలకు సారాయి మందు.
సర్రాజు పెళ్ళిలో గుర్రాజు కోపోచ.
సవతాలికుండనైనా ఉడుకుతా నన్నదిగాని తోడికోడలికుండను ఉడుక నన్నదట !
సవతితల్లికి బిడ్డలు పోతేనేమి ? సొమ్ముల కాపాడికి (కాపువానికి) బక్కలు పోతేనేమి ?

సవతి సాగనీయదు, ఏరా లెచ్చనీయదు.
సవతికి సంకెళ్ళు, నాకు పిల్లెండ్లు.
సవరణ సంతకు పోతే ఏకులబుట్ట ఎదురుగా పోయిందట!
సవరతీసినకొద్దీ నిక్కినట్లు.
సవాకోటి జంగాలలో బోడిజంగం.
సవాకోటిదరిద్రాలకు అనంతకోటిఉపాయాలు.
సవాకోటిలింగాలలో బోడిలింగం.
సవాసేరులో బోడిపరాచికమా?
సంసారం లేనివారికి సరసా లెక్కువ.
సంసారి చల్లగుడిగి, శౌయన్న పెండ్లాము.
సంసారి తిరిగి చెడె, సన్యాసి తిరగక చెడె.
సస్యాధిపతివా? సామ్రాజ్యాధిపతివా?
స్తంభంచాటున ఏంది? అంటే కుంభ మన్నారట! నాకేనా మూడు మెతుకులు?
స్థలా (ల) భోగము, శిలా (ల) భోగము.
స్వంతకాళ్ళకు అద్దేమిటి?
స్వతంత్రము స్వర్గలోకము, పరతంత్రం ప్రాణసంకటం.
స్వయం రాజా, స్వయం మంత్రీ, స్వయం చాకలి, మంగలిః.
స్వర్గానికి పోతూ చంకన ఏకులరాట్నమెందుకు?
స్వర్గానికి పోయినా విడాకులు తప్పవు.
స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పింది కాదు అన్నట్లు.
సాకులు చెప్పినవానికి కాసు, ఇల్లు కప్పినవానికి దుగ్గాని.
సాగింది నిజము, సాగనిది దబ్బఱ.
సాగితే ఇడవలె, జారితే పడవలె.
సాగితే చాపకిందికి ఆరు కుంపట్లు, తొమ్మిది నెగళ్లు.

సాగితే నియోగం, సాగకున్న చచ్చే యోగం.

సాగితే పాకనాటివారు, సాగకున్న మోటాటివారు.

సాగితే బండి, సాగకపోతే మొండి.

సాగినప్పుడు పడుదునా? త్రాగినప్పుడు పడుదునా?

సాగితే సాగించుకో మన్నారు, జారితే పడ మన్నారు.

సాగినమ్మ చాకలితో సరసా లాడితే తప్పు లేదు, సాగనమ్మ చౌదరితో మాట్లాడినా తప్పే.

సాగినమ్మ చాకలివాడితో పోతే నోమో, వ్రతమో అనుకున్నారట!

సాగివస్తూంటే రోగమంత సుఖం లేదు.

సాగువాటు చాలనాళ్ళాయె, గోగుకూర తెండమ్మా! గోక్కు తిందామందట!

సాటిఅమ్మ సరిగ (సరకు) (సొమ్ము) పెట్టుకుంటే ఊరిఅమ్మ ఉరి పెట్టుకొన్నదట!

సాటివారితో సరిగంగస్నానాలు.

సాటివారితో సరిగంగ స్నానాలు చేస్తుంటే ముసలిమొగుణ్ణికాస్తా మొసలెత్తుకపోయిందట!

సాతానికీ, జంగానికీ సంధి కుదురుతుందా?

సాతానిజుట్టుకు, సన్యాసిజంధ్యానికి ముడి వేసినట్లు.

సాతుముడికి సత్తువేటు పడితే సచ్చిన తాతయినా లేచి వస్తాడు అన్నట్లు.

సాదు రేగిన తల పొలానగాని నిలువదు.

సాదు రేగినా, బూతు రేగినా సవసవగా పోదు.

సాదెద్దు సీదుకు రేగిన కంచెంత పాడు.

సాదెద్దు సీదుకు రేగిన తలపొలాన్నే నిలుస్తుంది.

సానక్రింద దీపమువలె.

సానక్రింద వెన్నెలవలె.

సానపై నిరవై, సంచికట్నం ముప్పై, ఇంటికి ఏభై పంపించండి, కరకర ప్రొద్దెక్కేవఱకు కాటిలో పాగ లేపుతాను.

సాని కిచ్చిన సొమ్ము, గోడకు పూసిన సున్నం చూడటానికేగాని రావు.

సానికి అంకులు నేర్పాలా ?

సానిది నిజము చెప్పినా అబద్ధమే.

సానినీతి, సన్యాసిజాతి.

సానులలో సంసారి, సంసారులలో సాని.

సామజము చెఱుకు మేస్తే దోమలు పదివేలు చేరి తోలంగలవా ?

సాము నేర్చినవారికే చావుగండం.

సామెతలేని మాట, ఆమెతలేని ఇల్లు.

సాయంకాలం భూపాలరాగం అన్నట్లు.

సాయబుకి ఎంత దౌలత్తు వచ్చినా బీబీకి కుట్టుపోగులే.

సాయబుసంపాదన బీబీకి కుట్టుపోగులకు సరి.

సాయబూ ! చిక్కిపోయినా వేమంటే ఇంకా చిక్కుతాం మరీ చిక్కుతాం, మనసూ వస్తే చచ్చిపోతాం మీ కేమి ? అన్నాడట !

సాయబూ ! సాయబూ ! గోకులాష్టమి ఎప్పుడు ? అన్నట్లు.

సార మెఱిగినవాడె సర్వజ్ఞుడు.

సాలగ్రామఖనిన్ జనించు నెకదా జాత్యల్పపాషాణముల్.

సాలెకు, జంగానికీ సంధి కుదురుతుందా !

సాలె తప్పు నేసి ఇదో నమూనా అన్నట్లు.

సాలెలసభలో సాతాని పండితుడు (పెద్ద).

సాలె ముదిరిన సాతాని, ఉప్పరి ముదిరిన నంబి.

సాలెవాడిభార్య సరిమీాద పడ్డది.

సాలెవానికి కోతిపిల్ల తగులాటము.
సాలెవానిఎంగిలి ముప్పదిమూడుకోట్ల దేవతలు మెచ్చారట!
సాహసం లేనివాడికి కత్తి సరిగా తెగదు.
సాహేబుకు సవారాజ్యం వచ్చినా బీబీకి కుట్టుకాడలే.
సాహేబులూ సెదాములు సలాము లేవయ్యా అంటే దొరలు, దాతలు
పట్టించుకోవటు లిచ్చిన ఇనాము లేవయ్యా అన్నాడట!
సాహేబ్‌కు సాడే తీన్, నాకు మూడున్నర.
సాక్షి కాళ్లు పట్టుకోవడంకన్న వాదికాళ్లు పట్టుకోవచ్చు.
స్థానబలిమికాని తనిబలిమి కాదురా.
స్నానానికి ముందు, సంభావనకు వెనుక కూడదు.
స్వాతి కురిస్తే చట్రాయి పండును.
స్వాతి కురిస్తే చల్లపిడతలోకి రావు జొన్నలు.
స్వాతి కురిస్తే భీతి కలుగును.
స్వాతి కురిస్తే మూడుకార్తెలు కురుస్తాయి.
స్వాతి కురిస్తే మోతీపంట.
స్వాతి కురిస్తే సకిలీకం పండుతాయి.
స్వాతికొంగలమీాదికి సాళువం పోయినట్లు.
స్వాతివర్షం చేమకు హర్షం.
స్వాతివానకు ముత్యపుచిప్పలవలె.
స్వాతివానకు సముద్రాలు నిండును.
స్వాతిలో వాన కురిస్తే రైతులు ముత్యాలగద్దె లెక్కుతారు.
స్వాతివిత్తనం, స్వాతికోపులు.
స్వాతీ! నేను జముకుకొస్తాను, విశాఖా! నీవు విసురుకురా.
స్వాతి సముద్రాన్ని చంకన బెట్టుకొస్తుంది.
సింగన్న అద్దంకి పోయి వచ్చినట్లు.

సింగన్నా! అద్దంకి పోయినావా? అంటే పోనూ పోయా, రానూ వచ్చా, అన్నాడట!
సింగారం జూడరా బంగారు మొగడా!
సింగి కంటే సింగడు పథ్యం చేసినట్లు (కారం తిన్నట్లు).
సింగినాదం, జీలకఱ్ఱ.
సింహంకడుపులో మేకపిల్ల పుట్టునా?
సింహంలో చీరి ఊడ్చెడమున్నా, కన్యలో కంగాపింగా ఊడ్చెడ మున్నా.
సిగినం కొడితే చిక్కదు, లంజను కొడితే దక్కదు.
సిగ్గంత పాయె చిన్నపెండ్లామా! పెండ్లికన్న పోదాం పెద్దపెండ్లామా! అన్నాడట!
సిగ్గు అనగా తోటకూరవంటిది.
సిగ్గు చెడ్డా బొజ్జ పెడితే చాలును.
సిగ్గు పెండ్లినాడే పోయింది, కాస్త ఉంటే కార్యంతో సరి.
సిగ్గుమాలినదాన్ని చిటికేస్తే ఆరామడనుంచి ఆలకించిందట!
సిగ్గులేని అత్తకు మోరతోపు అల్లుడు.
సిగ్గులేని ముఖానికి నవ్వే అలంకారము.
సిగ్గులేని శివరాత్రికి ఏటా జాగరణమే.
సిగ్గు విడిస్తే రాయలకూడదు, తిరుపతి పోతే బోడితల.
సిగ్గు చిన్ననాడే పోయింది, ఇంతో అంతో ఉంటే యింటిలోని కెళ్ళిన నాడాయింతా పోయింది.
సిగ్గు పడితే సిద్దె కట్టువడుతుంది.
సిగ్గుదప్పిన చుట్టం వన్నెచీర కేడ్చినదట!
సిగ్గు సిబ్బిన కొడితే శరము చేటన కొడుతుంది.
సిగ్గూ, శరమూ లేనమ్మ మొగుడిపెళ్ళికి పేరంటానికి వెళ్ళి అడ్డుగోడ దాటునుండి అర్ధరూపాయి కట్నం ఇచ్చిందట!

సిగ్గెందుకు లేదురా జగ్గా! అంటే నల్లనివానికి నాకేమి సిగ్గన్నాడట!

సిగ్గే స్త్రీకి సింగారము.

సిడి పడితే మూన్నెల్ల వలుపు.

సిద్దన్న (ప్ప) (అద్దంకి) కొలూరు వెళ్ళనూ వెళ్ళాడు, రానూ వచ్చాడు.

సిద్దప్పవంటి శిష్యుడు లేడు, బ్రహ్మంగారివంటి గురువు లేడు, వేమన వంటి యోగి లేడు.

సిర సుండగ మోకాటికి సేసలు పెట్టుట.

సిరి అంటదుగాని చీడ (చిడుము) అంటును.

సిరి అబ్బదుగాని చీడ అబ్బుతుంది.

సిరికొద్ది చిన్నెలు, మగనికొద్ది వన్నెలు.

సిరి పోయినా చిన్నెలు పోలేదు.

సిరి రా మోకా లొడ్డినట్లు.

సిలార్! పిల్లలు, నేను తయార్.

సివమెత్తిన గంగిరెద్దులాగు.

సింహాసనంపై దున్నపోతు, లంజలలో పతివ్రత, ముత్తైదువలలో ముండమోపి.

సీతకు వ్రాసినది సీమకు వ్రాయవలెనా?

సీతపుట్టుక లంకచేటుకే.

సీతాపతి, రామాపతి, ప్రొద్దున్న లేస్తే పొట్టే గతి.

సీతారామాభ్యాం నమః అంటే మాఇంటాయన ఎదురు కాలేదా అన్నదట!

సీదుకు రేగిన చిచ్చుబుడ్డి, కోప మొస్తే కొరివి.

సీలమండ లాన చీర కడితిగాని సాలెమిండని కెక్కడ తెచ్చియిచ్చేది!

సుంకరివద్ద సుఖదుఃఖాలు చెప్పుకొన్నట్లు.

సుఖము మరగినమ్మ మొగుణ్ణి అమ్ముకొని తినిందట !
సుఖము మరగిన దాసరి పదము మరచినాడు.
సుఖవాసి దేహానికి మెత్తని చెప్పు.
సుఖప్రాణమే పెండ్లామా ! మెత్తని చెప్పుతో కొట్టు.
సుండు సూడనీయదు, మండి మాననీయదు.
సుతారం, సూదిలోని దారం.
సుతి లేని పాట, సమ్మతి లేని మాట.
సుతులు లేనివారికి గతులు లేవు.
సుత్తె ముండా ? కాను ముండా ?
సున్నకు సున్న, హళ్ళికి హళ్ళి.
సున్నము పుట్టని ఊళ్ళో అన్నము పుట్టునా ?
సున్నలో ఉన్నది సూక్ష్మం, సూక్ష్మంలో ఉన్నది మోక్షం.
సుపుత్రా ! కొంప తీయకు (పీకకు) రా అన్నట్లు.
సుబ్బడిది చుట్టాలరంధి, రాముడిది తామరకంధి.
సుబ్బిపెళ్ళిలో సూరిసమర్త.
సుబ్బిపెళ్ళి ఎంకిచావుకు వచ్చింది.
సువ్వి అంటే తెలియదా రోకలిపోటు.
సువ్వీ అంటే రోకలిపోటు వెనకాలే ఉంటుంది.
సూటిగల జంట రోటివద్ద మాటు పెట్టెనట !
సూతికావాతం వస్తే చూడగానే మందు (గొడ్డుకు).
సూదికి రెండు మొనలు గలవా ?
సూదికోసం దూలం మోసినట్లు.
సూదికోసం సోదెకు పోతే పాతఱంకులు బయట పడ్డాయి.
సూదికోసం సోదెకు వెడితే కుంచెడు బియ్యం కుక్క ముట్టుకుందట !
సూదికుతికె, దయ్యపాకలి.
సూదిగొంతు, బానకడుపు.

సూది తిప్పితే దారం సూటిగ పడుతుందా ?
సూదిని మూట కట్టినట్లు.
సూదిబెజ్జంలో ఒంటె దూరినట్లు.
సూదిలా వచ్చి నాగలికఱ్ఱులా మారుకొన్నట్లు.
సూదివలె వచ్చి దబ్బనంలా తేలినట్లు.
సూదేటువాణ్ణి, సుత్తేటువాణ్ణి, కండేటువాణ్ణి నమ్మరాదు.
సూరన్న సుఖవాసి (చిన్నవాడు), పేరన్న పెద్దవాడు, అయ్య కెత్తరా కోళ్ళగంప.
సూర్యుడు మనదిక్కు కుంటే చుక్కలన్నీ కుక్కలాయెనట !
సూర్యునిమొగాన దుమ్ము చల్లితే ఎవరికంట బడును ?
సూర్యోదయానకు కూర్చుండి శుక్రోదయానకు లేచినట్లు.
సూర్యోదయానకు మాంగల్యధారణం, శుక్రోదయానకు మాంగల్య విసర్జనం.
సూక్ష్మములో మోక్షం.
స్థూలం కనుగుడ్డు, సూక్ష్మం కనుపాప.
సెంటుభూమి లేనివాని కెలా సెంటువాసన లన్నట్లు.
సెగ లేనిదే కూ డుడుకదు.
సెట్టిబతుకు గిట్టినగాని తెలియదు.
సెట్టి సింగారించేలోగా పట్నం పాడయి (కొల్ల) పోయిందట !
సెట్టి సేరు, లింగం పదిసేర్లు.
సెనగలగాదెమీద కుక్క పండుకొన్నట్లు.
సెనగలు తిని చెయ్యి కడుగుకొన్నట్లు.
సెబాస్ మద్దెలగాడా ! అంటే ఐదువ్రేళ్ళు పగులగొట్టుకున్నాడట !
సేరుశాయె, సీటాయె, ఉల్లెంగడ్డ మోటాయె.
సేరుకు సవాసేరు అన్నట్లు.

సేరుదోరకు మణుగు జంటు.

సేవకునిలాగ చెయ్యాలి, రాజులాగ అనుభవించాలి.

సైంధవుడు అడ్డుపడినట్లు.

సైపలేనివాడు చెయ్యి నాకినట్లు.

సైసారము లేనివాడు సేంచకారికి పోతే ముసలినక్కలన్నీ గుసగుస లాడినవట !

సొగసు సోమవారం పోతే మొగుడు యాయవారం పోయాడట !

సొత్తు (సొమ్ము) పాపిష్టిది.

సొమ్ము ఒకచోట, అపనమ్మిక ఒకచోట.

సొమ్ము పోయేటప్పుడు, లెట్టు తెగిలేటప్పుడు మతి ఉండదు.

సొమ్ము సొమ్ములలోనె ఉండె, సోమయ్య మందిలోనే ఉండె.

సొమ్ము పోయె, దిమ్ము పట్టె నన్నట్లు.

సొమ్మేమి లక్ష్యము ? మనిషేమి పావనము ?

సొరకాయదొంగ అంటే బుజాలు పట్టుక చూచుకొన్నట్లు.

సోదెకు పోతే సుద్దులు తక్కువా ?

సోమార్లకు స్వయంపాకం చేసిపెట్టి పందలకు పక్క వేసినట్లు.

సోమారికి షోకు లెక్కువ.

సోయిదప్పినవాడా ! సొంగ ఎక్కడ పెట్టినావురా ? అంటే (తాగి తమ్మళ్ళబాలమ్మగుడిసెకు చెక్కినా నన్నాడట !

సోలెడు బియ్యానికి సోదెకు పోతే కుంచెడు బియ్యం కుక్క ముట్టుక పోయింది.

సౌందర్యానికి ఒంటె, సంగీతానికి గాడిద.

# హ

హంసనడకలు రాకపోయె, కాకినడకలు మఱచిపోయె.

హక్కు హనుమంతరాయనిది, అనుభవం చెన్నరాయనిది (చెన్నురాయనిది).

హద్దులో ఉంటే ఆడుది, హద్దు దాటితే గాడిది.

హనుమంతునిముందు కుప్పిగంతులా ?

హనుమంతుని జేయబోతే కోతి అయింది.

హరిశ్చంద్రునినోట అబద్ధం రాదు, నానోట నిజం రాదు.

హరిదాసున కందరూ తనవారే.

హర్షుణ్ణి నమ్ముకొని పురుషుణ్ణి పోగొట్టుకొన్నట్లు.

హస్త, ఆదివారము చస్తిమోయి గొల్లల్లారా! రోజు కొకదాన్ని పట్టి ఈడ్వండి (అన్నవట గొఱ్ఱెలు).

హస్త, ఆదివారము వచ్చింది చచ్చితిమయ్యా గొల్లల్లారా! చల్ల పిడతల కాసులు తీసి కాలలు వేయించండి.

హస్త, ఆదివారం వస్తే చచ్చినంత వర్షం.

హస్తకార్తెలో చల్లితే అక్షింతలకైనా కావు.

హస్తకు అనకు (అణగు) పొట్ట, చిత్తకు చిఱపొట్ట.

హస్తకు ఆదిపంటా, చిత్తకు చివఱిపంటా.

హస్తకు ఆరుపాళ్ళు, చిత్తకు మూడుపాళ్ళు.

హస్తచిత్తలు వఱపయితే అందఱిసేద్యం ఒకటే.

హస్త చూచి అందఱము పోదాము.

హస్త పోయిన ఆరుదినాలకు అడక్కుండా విత్తు.

హస్తలో అడ్డెడు చల్లేకంటే చిత్తలో చిట్టెడు చల్లేది మేలు.

హస్తలో ఆకు అల్లాడితే చిత్తలో చినుకు లేదు.

హస్తలో చల్లితే హస్తంలోకి రావు.

హాళ్ళికి హాళ్ళి, సున్నకు సున్న.

హాస్యగానికి తేలు కుట్టినట్లు.
హాస్యగాడు బావిలో పడినతంతు.
హాస్యానికైనా అనగూడని మాట లున్నాయి.
హితభుక్ మితభుక్.
హీనజాతి ఇల్లు చొచ్చినా, ఈగ కడుపు చొచ్చినా నిలువదు.
హీనస్వరం పెళ్ళాం ఇంటికి చేటు.
హుసేనప్ప తాడిమట్టకి పోయివచ్చినట్లు (పొయ్యొచ్చినట్లు).
హెచ్చుగా పే లున్నవాళ్ళకు, హెచ్చుగా అప్పులున్నవాళ్ళకు దురద లేదు.
హెచ్చు పేర్చు పిల్ల స్రగ్గుటకే.
హేమాహేమీలు ఏటివెంట కొట్టుకపోతూంటే నక్క పాటిరేవు అడిగిందట!
హోరుగాలికి దీపం పెట్టి ఓరి దేవుడా! నీమాహాత్మ్య మన్నట్లు.

— : : —

## క్ష

క్షేత్ర మెఱిగి విత్తనము, పాత్ర మెఱిగి దానము.

— : : —